# కాదంబరి

## (సంస్కృత గద్యప్రబంధం)

సంస్కృతమూలం

**బాణభట్టు, భూషణభట్టు**

తెలుగు అనువాదం

**వి.వి. హనుమంతాచార్యులు**

ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2018**

# KADAMBARI

*Sanskrit Original*
**Banabhattu, Bhushanabhattu**

*by*

**V.V. HANUMANTHACHARYULU**

T.T.D. Religious Publications Series No. 1279
© All Rights Reserved

*First Print :* 2018

*Copies : 500*

*Published by*
**SRI ANIL KUMAR SINGHAL,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

***D.T.P:***
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

## ముందుమాట

సంస్కృత కవులలో బాణునికి ఒక ప్రత్యేకస్థానం ఉంది. ఈయన ఉత్తరప్రదేశ్‌లోని గయ జిల్లాలో ‘పృథుకూట’ గ్రామానికి చెందినవాడు.

బాణునితల్లి రాజదేవి, తండ్రి చిత్రభానుడు. చిన్నతనంలో తండ్రివద్ద నేర్చిన విద్యను అనేక పండితుల వద్ద పదనుపెట్టుకొని వృద్ధి చేసుకొన్నాడు.

బాణుని పాండిత్య ప్రతిభను గూర్చి వినిన చక్రవర్తి శ్రీహర్షుడు, తన ఆస్థానంలో పండిత పదవి ఇచ్చాడు. అందుకు అంగీకరించి ఆతని కొలువులో ప్రవేశించాడు భట్టబాణ మహాకవి.

కొంతకాలం తర్వాత “హర్ష చరిత్ర’ వ్రాశాడు. పిదప ‘కాదంబరి’ అనే కావ్యం రచించాడు. ఈ కావ్యరచన సాగుతుండగా అర్ధాంతరంగా బాణుడు కాలధర్మం చెందాడు. తండ్రి బాణభట్టు కోరిక మేరకు ఆతని కుమారుడైన భూషణభట్టు మిగిలిన కథను వ్రాసి గ్రంథాన్ని పూర్తి చేశాడు. అతని కథారచన కూడా తండ్రిగారి రచనావిధానానికి దగ్గరగా రసవత్తరంగానే సాగిందని పండితులంటారు.

బాణుడు హర్షవర్ధనుని ఆస్థాన పండితుడు కావున ఆయన క్రీ.శ. 7వ శతాబ్ది వాడని పరిశోధకులు నిర్ణయించారు.

కాదంబరి ఇతివృత్తం అద్భుతంగా, మధురంగా ఉంటుంది.

**“కాదంబరీ రసజ్ఞానాం ఆహారోఽపి న రోచతే”**

‘కాదంబరి’ “కావ్యాన్ని చదివే వారికి అన్నం తినాలనిపించదట! అన్నం సహించదట!” అనే సాహిత్యనుడికారం చాటుతోంది.

ఇంతటి రసవత్తరమైన వచన కథాకావ్యాన్ని శ్రీమాన్ వి.వి.హనుమంతాచార్యులు సరళంగా తెలుగు వచనంలో అనువదించారు. ఈ సంస్కృత వచనకావ్యాన్ని తెలుగువారికి అందించాలన్న ధ్యేయంతో తిరుమల తిరుపతి దేవస్థానం స్వీయ ప్రచురణగా అందిస్తున్నది. తెలుగు పాఠకలోకం రసవత్తరమైన ఈ గ్రంథాన్ని సొంతం చేసుకొని, సద్వినియోగం చేసుకోగలరని ఆశిస్తున్నాను.

*సదా శ్రీవారి సేవలో....*



**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.



# ఆముఖం

గద్యకవులలోనే కాక, సంస్కృతకవులలోనే బాణునికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఈయన 'వత్స' గోత్రంలో జన్మించాడు. ఉత్తరప్రదేశ్‌లోని గయ జిల్లాలో 'పృథుకూట' గ్రామంలో ఈ కవి జన్మించాడు. ఆ గ్రామం సోన్‌నదీ తీరాన ఉంది.

ఈయన వత్సునకు మునిమనుమని మనుమడు బాణునితల్లి రాజదేవి, తండ్రి చిత్రభానుడు.

బాణుడు బాల్యమందే తల్లిదండ్రుల్ని కోల్పోయాడు. చిన్నతనంలో తండ్రివద్ద నేర్చిన విద్యను దేశపర్యటనలో అనేక పండితుల వద్ద చదివి వృద్ధి పొందించుకున్నాడు.

ఆనాటి హర్షవర్ధన చక్రవర్తి బాణుని పాండిత్య ప్రతిభను గూర్చి విని ఆయనను తన ఆస్థానమున పండిత పదవి నలంకరింపుమని కోరెను. బాణుడు కూడా సమ్మతించి స్థాణ్వీశ్వరం (స్థానేశ్వరం) చేరుకొని ఆతని కొలువులో ప్రవేశించాడు.

హర్షవర్ధనుడు బాణుని అనేకరీతుల సమ్మానించాడు. కొంతకాలమైన తర్వాత స్వగ్రామం చేరుకొని గ్రంథపఠనం చేసి, బంధుమిత్రుల ప్రోత్సాహంతో హర్ష చరిత్ర' వ్రాశాడు. అటుతర్వాత 'కాదంబరి' అనే కావ్యం రచించాడు. కావ్యం మధ్యలో ఉండగా బాణుడు కాలధర్మం చెందాడు. ఆతని కుమారుడైన భూషణభట్టు మిగిలిన కథను వ్రాసి గ్రంథాన్ని పూర్తి చేశాడు. బాణుని కోరిక ప్రకారం ఈయన మిగిలిన కథను పూర్తిచేశాడు. అతని కథారచన కూడా తండ్రిగారి రచనావిధానానికి కొంచెం ఇంచుమించుగా రసవత్తరంగానే సాగిందని పండితులంటారు.

బాణుడు హర్షవర్ధనుని ఆస్థాన పండితుడు కావున ఆయన క్రీ.శ. 7వ శతాబ్ది వాడనవచ్చు.

కాదంబరి ఇతివృత్తం మిక్కిలి అద్భుతమై, రసవత్తరమై ప్రశంసింపబడుతోంది.

**"కాదంబరీ రసజ్ఞానాం**
**ఆహారోపి న రోచతే"**

అనే శ్లోక భాగం ఈ కాదంబరి రచన ఎంత రసవత్తరమైందో తెలియజేస్తోంది. తరువాతి కవులకే కావ్యం మార్గదర్శకమైంది.

'కాదంబరి' అంటే కల్లు అని కూడా అర్థం ఉంది. "ఈ కావ్యాన్ని చదివే వారికి అన్నం తినాలనిపించదు. కల్లు తాగినవానికి కూడా అన్నం సహించదు" అనే చమత్కృతి ఇమిడి ఉంది.

ఇంత రసవత్తరమైన కథాకావ్యాన్ని దైవానుగ్రహంతో ఆంధ్రీకరించ గలిగాను. నా బుద్ధికి మించిన ఈ మహాకావ్య ఆంధ్రీకరణలో ఎన్నో దోషాలుండవచ్చును. గుణగ్రహణపారీణులైన బుధజనులు గుణాన్ని గ్రహించి దోషాలను లెక్కింపక నన్నాదరింతురని నమ్ముతున్నాను.

ఇట్లు
బుధజన విధేయుడు

**(వి.వి. హనుమంతాచార్యులు)**



**శ్రీరస్తు**

# కథాసంగ్రహం

పూర్వం విదిశానగరాన్ని రాజధానిగా చేసుకొని శూద్రకుడనేరాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఆ రాజు సమస్తమంగళగుణములతో విలసిల్లుతూ సత్పరిపాలకుడన్న కీర్తిని సంపాదించాడు. సామంతరాజులందరూ అతనికి విధేయులు. రూపయౌవనసంపన్నుడైనా భోగవిలాసమునం దాసక్తి లేనివాడై యుండెను.

ఒకరోజున శూద్రకుడు సభలో కొలువుతీరియుండగా ద్వారపాలకులు రాజానుమతినిపొంది దక్షిణదేశమునుండి పంజరములోని చిలుకతో వచ్చి రాజదర్శనం, కోరుతున్న ఒక చాండాల కన్యకను కొలువులో ప్రవేశపెట్టింది. ఆమె చేతిలోని చిలుక తనకుడి కాలును పైకెత్తి సంస్కృతశ్లోకము పఠించి రాజునాశీర్వదించింది. రాజు పరమాశ్చర్యపడ్డాడు. వీలుచూచుకొని రాజు చిలుకను తన వద్దకుపిలుచుకొని, అతని వివరములడిగెను. బోయవారికి ఎట్లుచిక్కితివి? నీ జన్మవృత్తాంత మేమిటి అని కుతూహలముతో ప్రశ్నించాడు. చిలుక కూడా రాజుతో తన చరిత్రను ఇట్లు చెప్పింది.

"రాజా! నేను వింధ్యారణ్యమున నివసించుచున్న చిలుకదంపతులకు జన్మించితిని. తల్లి నన్ను కనగానే మరణించింది. తండ్రి ముదుసలి. ఇతర పక్షుల నోళ్ళనుండి జారిపడిన పండ్లముక్కలు, గింజలు ఏరి నాకాహారముగా ఇచ్చేవాడు".

'ఒకనాడు శబరసైన్యము వేటకు వచ్చి ఆ ప్రాంతము నల్లకల్లోలము చేసి పోయినది. మాంసం లభించని ఒక ముసలి బోయవాడు మేము నివాసమున్న బూరుగుచెట్టెక్కి తొర్రలలో ఉన్న పక్షులనన్నింటిని చంపి క్రిందపడ వేయసాగాడు. నన్ను ఱెక్కలమధ్యలో దాచుకొన్న నా తండ్రిని కూడా చంపి క్రిందపడవేశాడు. నేను స్వార్థబుద్ధితో తండ్రిని వదలిపెట్టి ఒక సరస్తీరానికి

దేకుతూ పడుతూ లేస్తూ చేరుకున్నాను. ఎంతో దాహంగా ఉండింది. ఇంతలో సమీప ఆశ్రమాన్నుంచి స్నానంకోసం వచ్చిన హారీతుడనే మునిబాలకుడు తోటివారి సహాయంతో నన్ను నీడకు చేర్చి, దాహము తీర్చి స్నానంచేసి నన్ను తన తండ్రివద్దకు తీసుకొని వెళ్ళాడు. ఆతని తండ్రి జాబాలి. గొప్ప తపస్వి. ఆ ఆశ్రమానికి ఆయన కులపతి, త్రికాలవేత్త. హారీతుడు చిలుకదొరికిన విధానం చెబుతూ నన్ను ఆతని ముందుంచాడు".

"ఆయన నన్ను చూస్తూనే – వీడు అవినయపరుడు. కావుననే చిలుకజన్మ మెత్తి దుఃఖించుచున్నాడు. అచట నన్ను చూడమూగిన మునిపుంగవులు, జాబాలిని నా అవినయమును గూర్చి ప్రశ్నించుచూ, నా చరిత్రమును చెప్పుమని కోరిరి. ఈ రోజు ప్రొద్దు చాలదని స్నాన భోజనాదులైన తర్వాత సాయంకాలమున చంద్రోదయమైన తర్వాత వారందరిని కూర్చుండ బెట్టుకొని నా జన్మవృత్తాంతమును గూర్చి ఇట్లు చెప్పసాగాడు. అంతా శ్రద్ధగా వినసాగారు.

"మునులారా ! ఉజ్జయినీ అనే నగరం అవంతీ దేశరాజధానిగా ఉండేది. ఆ నగరం సకల సంపదలతో తులతూగుతూ ఉండేది. దానిని తారాపీడుడు అనే రాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఆయన సద్గుణ సంపన్నుడు. అతని భార్య విలాసవతి. మిగుల గుణవంతురాలు. ఆయనకు బృహస్పతి సమానుడైన శుకనాసుడనే మంత్రి ఉండేవాడు. అతడు రాజభక్తి కలవాడు. రాజనీతి విశారదుడు. ఆతని భార్య మనోరమ. ఉత్తమగృహిణి. వారికి ఉన్న లోటంతా సంతానహీనతే. విలాసవతి సంతానంకోసం చేసిన వ్రతాలు, దానాలు విఫలమయ్యాయి. 'అపుత్రస్యగతిర్నాస్తి' అన్న పౌరాణికుని పలుకులు విని దుఃఖితురాలైంది. తారాపీడుడు దేవిని ఓదార్చాడు. కొంత కాలానికి రాణి గర్భవతి అయింది. జన్మించిన బాలునకు చంద్రాపీడుడని పేరు పెట్టారు. శుకనాసునకు కూడా వైశంపాయనుడనే బాలుడు జన్మించాడు. ఇద్దరు సమవయస్కులై సమవిద్యావ్యాసంగులై సుశిక్షితులై, సర్వశాస్త్రపారంగతులై ఆశ్రమమున గురువుల అనుమతితో రాజధానికి వచ్చినారు. తారాపీడుడు



యువరాజుకు ఇంద్రాయుధమనే గుఱ్ఱాన్ని కానుకగా యిచ్చాడు. అది లోకోత్తర రూపంగల అశ్వశ్రేష్ఠము.

చంద్రాపీడ వైశంపాయనులు నగరప్రజలకే కాక తమ తల్లిదండ్రులకు, బంధు మిత్రులకు ఆనందాన్ని కలిగించారు. యువరాజు మంత్రి శుకనాసుని ఆశీస్సులు కూడా పొందాడు. తల్లి విలాసవతి పత్రలేఖను కుమారునకు రక్షకురాలిగా, మిత్రురాలిగా చేసింది.

తారాపీడుడు కుమారునకు యౌవరాజ్యపట్టము కట్టినాడు. మంత్రిశుకనాసుడు తన అనుభవము నంతయు జోడించి పెక్కు రాజనీతి విషయాలను చంద్రాపీడునకు ఉపదేశించినాడు. శుకనాసుని ఉపదేశవాక్యాలకు యువరాజు సంతుష్ట హృదయుడయ్యాడు.

పట్టాభిషేకానంతరం చంద్రాపీడుడు మహాసైన్య సమేతుడై దిగ్విజయ యాత్రకు వెడలినాడు. సర్వరాజులు అతని పాదాక్రాంతులయ్యారు. చివరకు కైలాసప్రాంతాల వారిని జయించి, సైన్యమునకు విశ్రాంతి కాదేశించి విడిది చేశాడు.

రాజకుమారుడొకనాడు వేటాడుచు కిన్నర మిథునమును చూచి, వారిని వెంటతరిమెను. సైన్యమునకు మిక్కిలి దూరముగా వెళ్ళాడు. కిన్నర మిథునము అదృశ్యమైనది. తన ప్రయత్నాన్ని విరమించుకొన్నాడు. మధ్యాహ్న సమయమైనది. నీటికై వెదుకుతూ అచ్ఛోదమనే మహా సరస్సుమీపానికి వచ్చి, నీరు త్రాగి, గుఱ్ఱము, తానును విశ్రాంతి తీసికొనుచుండగా మధురగానాలాపన వినబడినది ఆ సంగీత ధ్వనిని అన్వేషించుచు శివాలయమున నున్న 'మహాశ్వేత'ను చూచి, ఆమెచే సత్కృతుడై ఆమెను గూర్చి వివరము లడిగినాడు. ఆమె చంద్రాపీడునితో ఇట్లన్నది.

"రాజపుత్రా! నేను గంధర్వదంపతులైన గౌరీహంసుల కుమార్తెను. యౌవనవతినైన నేను నాతల్లి గౌరితో స్నానానికి ఈ అచ్ఛోదసరస్తీరమునకు

వచ్చి, అపూర్వ పుష్పగంధం ఆఘ్రాణించాను. పుండరీకుడనే మునికుమారుడు కపింజలుడనే స్నేహితునితో కన్పడగా, నేను అతనితో పరిచయము సంపాదించాను. నా ఆసక్తి గ్రహించి ఆ పుష్పాన్ని నా చెవిలో పెట్టాడు పుండరీకుడు. పరవశుడైన అతని చేతినుండి అక్షమాల జారగా దానిని నేను గ్రహించితిని. కపింజలుని హెచ్చరికతో నేను అక్షమాలకు బదులు ముత్యాల హారమిచ్చినా అది గ్రహింపలేకపోయాడు. స్నానానంతరం నేను ఇంటికి వెళ్ళాను. సాయంత్రానికి నా దగ్గరకు కపింజలుడు వచ్చి పుండరీకుని పరిస్థితి చేయి జారుతున్నదని నన్ను వచ్చి అతనిని కాపాడుకోమని ప్రార్థించాడు. ఆ రాత్రి నేను తరళికతో కలసి సరస్సు వద్దకు రాగా పుండరీకుడు మరణింపగా కపింజలుని రోదన ధ్వని వినిపించింది. నేను దుఃఖంతో విలపించాను. నేను విరక్తనై ఆత్మాహుతికి ప్రయత్నించగా ఆకాశమునుండి ఒక దివ్యపురుషుడు వచ్చి హఠాత్తుగా పుండరీకుని ఎత్తుకొని వెళ్ళుతూ నన్ను మరణింపవద్దని, ఇతడు పునర్జీవితు డౌతాడని పలికి ఆకాశమున కెగిరి పోయినాడు. కపింజలుడు దిక్కుతోచక తన తపశ్శక్తితో తానును ఆకాశమున కెగిరి అతని ననుసరించాడు.

నేను జీవితమున విరక్తి చెంది తపోదీక్ష స్వీకరించి శివారాధన చేస్తూ, ఈ గుహలో నివసిస్తున్నాను. నా గొంతు వినిన నా తల్లిదండ్రులు ఇంటికి రమ్మని ప్రార్థించినా నేను నా పట్టుదల వీడక ఇక్కడనే ఉంటూ, నా పతికోసం ఎదురు చూస్తున్నాను" అంటూ ముగించింది.

చంద్రాపీడుడు ఆమెను ఓదార్చాడు. మహాశ్వేత తన స్నేహితురాలు గంధర్వస్త్రీ కాదంబరి నా దీనపరిస్థితి చక్కబడేంత వరకు తాను పెండ్లియాడనని ప్రతిజ్ఞ పట్టిందని, ఆమెను సమాధానపరచటానికి తాను హేమకూటానికి వెళ్తున్నానని, నీవు కూడా చూదరమ్మని అతనిని అంగీకరింపజేసి, కాదంబరి వద్దకు తీదుకొనివెళ్ళింది. చంద్రాపీడుడు గంధర్వలోకంలో వింతలు చూస్తూ కాదంబరిని దర్శించాడు. ప్రథమ దర్శనంలోనే వారిలో ప్రేమ అంకురించింది.



చంద్రాపీడుడు ఆమెను గాఢంగా ప్రేమించాడు. ఆతిథ్యము గ్రహించి చంద్రాపీడుడు మరునాడు కాదంబరి వద్ద సెలవు తీసికొని వెళ్ళునపుడు కాదంబరి అతనికి అమూల్యమైన శేషహారమును బహూకరించింది. చంద్రాపీడుడు హేమకూటము నుండి బయలుదేరి సరస్సమీపమునకు రాగా అచ్చటికి అతని సైన్యము చేరుకొన్నది. వైశంపాయనుని కలసి గంధర్వలోకమును గురించి యువరాజు వివరించాడు. మరునాడు కేయూరకుడు చంద్రాపీడుని వద్దకు వచ్చి 'మహాశ్వేత, కాదంబరిని చూచుటకు రమ్మన్నదని పలికెను.

చంద్రాపీడుడు మరల హేమకూటానికి వెళ్ళాడు. చెలికత్తెలు శిశిరోపచారాలు చేస్తుండగా చంద్రాపీడుడు కాదంబరి వద్దకు వస్తాడు. ఆమె సంతోషించింది. కొంతసేపచట ఉండి తిరిగి సైన్యాన్ని చేరాడతడు. ఇంతలో వార్తాహరుడు తారాపీడుడు కుమారుని ఉజ్జయినికి రమ్మనే వార్తనందింపగా చంద్రాపీడుడు, వైశంపాయనుని సైన్య శిబిరములోనే ఉంచి, తండ్రి వద్దకు ప్రయాణమయ్యాడు. సాయంత్రానికి కాళీదేవాలయంలో విడిది చేసి, ఆ తర్వాత ఇంటికి చేరాడు. కొద్దిరోజులకు కాదంబరివద్దనుండి పత్రలేఖ వచ్చి కాదంబరి విరహబాధను వర్ణిస్తుంది. పత్రలేఖ యువరాజుతో నిన్ను కాదంబరి వద్దకు తీసికొని పోవుటకే వచ్చానని పలికి అతనిని ప్రయాణానికి పురికొల్పుతుంది.

*(ఇక్కడకు పూర్వభాగం సమాప్తం)*

## ఇకనుండి ఉత్తరభాగం ప్రారంభం

కాదంబరి విరహవ్యథను గూర్చి పత్రలేఖ చెప్పగా విన్న చంద్రాపీడుడు కాదంబరిని చూడాలనుకొంటాడు. అతనికి కూడా ప్రేమవ్యాధిపట్టుకొన్నది. ఇంతలో సైన్యం దూరంగా వచ్చుచున్నదను వార్తవచ్చింది. ఈలోగా కేయూరకుడు గంధర్వలోకం నుండి వచ్చాడు. కాదంబరి స్నానభోజనాదులు మాని వేసినదని, ఎవ్వరితో పలుకక ఏకాంతములో బాధపడుతున్నదని

వివరించాడు అది విని చంద్రాపీడుడు వీలైనంత తొందరలో ఆమెవద్దకు వెళ్ళాలని నిర్ణయించుకుంటాడు. దీనికంతా కిన్నర మిధున దర్శనమే మూలమని భావిస్తాడు. కేయూరకుడు కాదంబరీ దర్శనంకోసం సిద్ధం కమ్మంటాడు. కాని తండ్రికి చెప్పకుండా తాను వెళ్ళదలచలేదు. ఈ పరిస్థితులలో వైశంపాయనుడు దగ్గర లేనందుకు యువరాజు చింతించాడు. ఇంతలో సైన్యం నగరమునకు సమీపానికి వచ్చిందని తెలిసి చంద్రాపీడుడు వారికి ఎదురు వెళ్ళాలనుకొంటాడు. పత్రలేఖను, కేయూరకుని తోడుగా కాదంబరి వద్దకు పంపుతాడు. తండ్రి కుమారుడు యుక్తవయస్కుడై వివాహయోగ్యుడైనాడని గుర్తిస్తాడు. కోడల్ని తేవాలనుకొంటాడు.

చంద్రాపీడుడు భోజనానంతరం తండ్రి అనుమతితో కొద్ది పరివారముతో సిప్రానదిని దాటి బయలుదేరి సైన్యం దూరంగా కనుపడగా వైశంపాయనుని తొందరగా చూడాలని సైన్యశిబిరంలోకి ప్రవేశించి వెదికాడు. వైశంపాయను డెక్కడున్నాడని ప్రశ్నింపగా ఎవ్వరును బదులీయలేదు. చంద్రాపీడున కనుమానం కలిగింది. గట్టిగా అడుగగా సేనానులు మేమెంత చెప్పినను సరస్తీరము వదలి రాలేదని, తాను రానని, నన్ను రమ్మని బలవంతపెట్టవద్దని వైశంపాయనుడు మొండికేసి తమను తిరస్కరించి పంపాడని చెప్పారు. సైన్యం ప్రయాణం ఆపుకొని అట్లే నిలచిపోయినది. అచ్ఛోద సరస్సులో స్నానమాడి, ఆ ప్రాంతమందే ఏదో వెదకుచున్నవానివలె, ఉన్మత్తునివలె ప్రవర్తించు చుండినాడని, చేయునదిలేక కొద్దిమందిని ఆతని రక్షణకై ఉంచి మేము బయలుదేరితిమి.

చంద్రాపీడుని వృత్తాంతము తెలియనిదే నేను ఇక్కడ నుండి కదలనని భీష్మించుకొనియుండుటచేత మేము చేయునదిలేక తిరుగు ప్రయాణమైతిమి. వైశంపాయనుడు ఎందుకట్లు ప్రవర్తించినాడో అతనికి అర్ధము కాలేదు. చివరకు సేనతో బయలుదేరి కొన్ని రోజులకు ఉజ్జయినీ నగరము చేరినాడు.



తన తల్లిదండ్రులు ఇరువురును శుకనాసుని ఇంటికి వెళ్ళినారని తెలిసి తానును అచటికే చెళ్ళెను. అందరును వైశంపాయనుని కొఱకు దుఃఖించిరి. రాజానుమతి పొంది చంద్రాపీడుడు వైశంపాయనుని తెచ్చుటకు మరల ప్రయాణమైనాడు. కొద్ది రోజులలోనే అచ్ఛోద సరస్తీరమునకు చేరినాడు. సేనానివేశమున వైశంపాయనుని గూర్చి విచారింపగా ఫలితము లేకపోయెను. వైశంపాయనుడు లేకుండా నేను ఇంటికి వెళ్ళనని నిశ్చయించుకొని సరస్తీరము చేరి మహాశ్వేతను దర్శించెను.

ఇతనిని చూడగానే దుఃఖింపసాగినది మహాశ్వేత. "వైశంపాయనుడు తనపై ప్రేమను వెల్లడించుచు తనను ప్రేమింపమని బలవంతపెట్టసాగాడు. నేను తిరస్కరించితిని. కాని అతడు నామాట చెవిని పెట్టక ఒక వెన్నెలరాత్రి నావద్దకు వచ్చి ప్రేమ ప్రేలాపనలు పలుకుచు నన్ను మిక్కిలి బాధించినాడు. నేను మిగుల కోపించి అతనిని చిలుకవై పొమ్మని శపించినాను" అని పలికింది. ఆ మాటలు విన్న చంద్రాపీడుని హృదయము బ్రద్దలై నేలకొరిగినాడు. అంతా శోకసముద్రంలో మునిగినారు.

ఇంతలో చంద్రాపీడుని రాకను విన్న కాదంబరి, మదలేఖ, పత్రలేఖలతో బయల్దేరి అచ్చటకు వచ్చి చంద్రాపీడుడు మృతిచెందుట చూచి, దుఃఖించి ఎందరు వాదించినా వినక పతితో అగ్నిప్రవేశం చేయదలచింది. ఇంతలోగా దివ్యవాణి అగ్నిప్రవేశం మానుకొనుమని, ఆతని శరీరాన్ని కాపాడితే కొంతకాలానికి పునర్జీవితుడు కాగలడని పలికింది. పత్రలేఖ హఠాత్తుగా ఇంద్రాయుధంతో పాటు అచ్ఛోదసరస్సులో దూకింది. జలాల్లో నుండి కపింజలుడు బయటకు వచ్చాడు. మహాశ్వేత పుండరీకుని గూర్చి ప్రశ్నించింది. చంద్రుడు పుండరీకుని శరీరాన్ని తన లోకానికి తీసుకొని వెళ్ళాడని, నిన్ను ఓదార్చి, ఈ వృత్తాంతాన్ని శ్వేతకేతునకు చెప్పుమని పంపాడని చెప్పాడు. తొందరలో ఆకాశములో వస్తూ ఒక వైమానికుని ఢీకొనగా, అతడు వారించి నన్ను గుఱ్ఱముగా జన్మింపుమని చెప్పాడు. ఆతని దయతో నేనును పుండరీకుని

సమీపంగా ఉండేటట్లు గుట్టింగా పుట్టేందుకు వీలు కల్పించుకొన్నాను. చంద్రుడే చంద్రాపీడుడు, పుండరీకుడే వైశంపాయనుడు అని వివరించెను. కాదంబరి మిగుల దుఃఖించింది. పత్రలేఖ గూర్చి కపింజలుని అడుగగా ఆ విషయం తనకు తెలియదన్నాడు. కపింజలుడు చంద్రుని ఆదేశానుసారం ఆకాశమార్గాన శ్వేతకేతువు వద్దకేగినాడు.

కాదంబరి అశరీరవాణి ఆదేశానుసారం చంద్రాపీడుని శరీరాన్ని సంరక్షింప బూనుకొంది. ఆతని శరీరము రోజులు గడచుచున్నను ఏమాత్రం చెడలేదు. కాదంబరి మదలేఖను తల్లిదండ్రుల వద్దకు పంపగా వారును కాదంబరిని ఓదారుస్తూ వార్త పంపారు.

చంద్రాపీడుని మరణవార్త తెల్పటానికి త్వరితకుడు వెళ్ళాడు. మరణించినా జీవకళ తగ్గలేదని వారికి తెల్పాడు. విలాసవతిని గూర్చి అడగగా త్వరితకుడు చంద్రాపీడుని మరణం, జీవకళతగ్గక పోవటంగూర్చి తెల్పాడు. మరణానికి సిద్ధపడ్డ తల్లిదండ్రులు అది విని సంతసించారు. శుకనాసునితో మిగిలిన వారితో కలిసి కుమారుడున్న ప్రాంతానికి వస్తాడు. కాదంబరిని మెచ్చుకుంటారు. తాముకూడా అరణ్యవస్తువులతో జీవిస్తారు" అని కథ ముగించాడు.

చిలుకరూపంలో ఉన్న వైశంపాయనుడు కపింజలునకు చంద్రాపీడునకేమి జరిగినదని ప్రశ్నిస్తాడు. కపింజలుడు రెక్కలు వచ్చేవరకు ఆశ్రమంలోనే ఉండమంటాడు. ఇంతలో కపింజలుడు వచ్చాడని హారీతుడు చిలుకను అతనివద్దకు తీసుకొని వెళ్ళాడు. పరస్పరం చూసుకొని దుఃఖించారు. తండ్రి శ్వేతకేతులు, నిన్ను ఇక్కడనే ఉండమన్నాడని పలికి కపింజలుడు వెళ్ళిపోయాడు.

కాని కాదంబరిని చూడాలనే తలంపుతో త్వరపడి ఎవరిమాట లెక్కచేయక రెక్కలు పూర్తిగా రాకపోయినా ఎగిరిపోయి, ఒక బోయవానికి చిక్కి చాండాల కన్యకు దొరుకుతాడు. ఆమె అతన్ని శూద్రకుని వద్దకు తెచ్చి, విషయం చెప్పి మాయమౌతుంది. ఇది విన్న శూద్రకుడు సంక్షోభచిత్తముతో వ్యధనొంది శరీరము విడిచాడు.



కాదంబరి చంద్రాపీడునకు స్నానాదులొనరింపజేసి తమకముతో కౌగిలించుకొనగా చంద్రాపీడుడు పునర్జీవితుడైనాడు. శూద్రకుడు చంద్రాపీడుడైనాడు. అందరూ సంతసించారు. ఇంతలో కపింజలునితో కూడి పుండరీకుడు అచ్చటకు ఆకాశమార్గమున వచ్చినాడు. పత్రలేఖ ఎవ్వరో కాదు నా భార్య రోహిణియేనని పలికాడు.

కథ సుఖాంతమైనది. చంద్రాపీడపుండరీకులు రెండు జన్మలెత్తి వారు కోరుకున్న కన్యలను పరిగ్రహించి సుఖంగా కాలం గడిపారు.

# "కాదంబరి" పాత్రల పరిచయం

1. (ఎ) **శూద్రకుడు :** విదిశానగరాధిపతి, చంద్రుని అవతారం, చంద్రాపీడుడుగా నున్నది ఇతడే. చిలుక కథను సొంతము విన్నవాడు.

   (బి) **చంద్రాపీడుడు :** యువరాజు. ఇతడే చంద్రుడు. ఇతడే శూద్రకుడు. ఇతని తండ్రి తారాపీడుడు. తల్లి విలాసవతి.

2. (ఎ) **పుండరీకుడు :** శ్వేతకేతువు కుమారుడు మునిబాలకుడు. ఇతడే శుకనాసుని కుమారుడు వైశంపాయనుడు. చిలుకగా శపింపబడినాడు. చంద్రలోకమున రక్షింపబడినాడు. మహాశ్వేతను ప్రేమించి మృతి చెందినాడు. చంద్రాపీడుని మిత్రుడు,

   (బి) **వైశంపాయనుడు :** శుకనాసుని పుత్రుడు పూర్వజన్మలో పుండరీకుడు, చిలుకరూపమెత్తినాడు, శూద్రకుని వద్దకు పంజరములో తేబడినాడు.

3. **చాండాల దారిక :** శ్రీ మహాలక్ష్మి, పుండరీకుని తల్లి. చిలుకగానున్న పుత్రుని శూద్రకుని కిచ్చింది.

4. **శుకము :** వైశంపాయనుడు, ఇతడే పుండరీకుడు శుకనాసుని పుత్రుడు.

5. **హారీతుడు :** జాబాలికుమారుడు ముని బాలకుడు దయా శాలి, చిలుకను కాపాడి ఆశ్రమమునకు తెచ్చి పోషించినాడు.

6. **హారీతుడు :** త్రికాలజ్ఞుడు, చిలుక కథను మునులకు చెప్పినవాడు. హారీతుని తండ్రి దివ్యజ్ఞాని.

7. **కుమారపాలితుడు :** శూద్రకుని మంత్రి.

8. **మాతంగుడు :** శబరసేనాపతి (రాజు) వింధ్యారణ్యంలో వేటాడాడు.

9. **తారాపీడుడు :** చంద్రాపీడుని తండ్రి. ఉజ్జయినీ నగరాధిపతి. విలాసవతి భర్త.



10. **విలాసవతి :** తారాపీడుని భార్య, చంద్రాపీడుని తల్లి, మహారాణి,

11. **మకరిక :** అంతఃపుర ప్రధాన పరిచారిక.

12. **శుకనాసుడు :** తారా పీడుని మంత్రి, రాజ నీతిజ్ఞుడు, వైశంపాయనుని తండ్రి చంద్రాపీడునకు రాజనీతి బోధకుడు.

13. **కపింజలుడు :** పుండరీకుని మిత్రుడు. ఇతడు శాపవశాన 'ఇంద్రాయుధం' అనే గుఱ్ఱంగా మారి చంద్రాపీడునకు వాహనమైనాడు. శాపంతీరటానికి అచ్ఛోదసరస్సులోకి దూకి కపింజలుడుగా మారాడు. పుండరీకుని శరీరాన్ని ఆకాశానికి ఎత్తుకుపోతున్న చంద్రుని అనుసరించాడు. చిలుకరూపంలో ఉన్న వైశంపాయనుని ఓదార్చాడు. ముగింపులో పుండరీకుని వెంటపెట్టుకొని చంద్రలోకమునుండి భూలోకానికి తెచ్చాడు. పుండరీకుని కాపాడటానికి ఎన్నో పాట్లు పడ్డాడు.

15. **బలాహకుడు :** రాజకీయాధికారి, చంద్రాపీడ వైశంపాయనులను విద్యాపీఠంనుండి రాజధానికి తెచ్చాడు.

16. **కైలాసుడు :** అంతఃపుర వృద్ధ పరిచారకుడు. కంచుకి, పత్రలేఖను తెచ్చి చంద్రాపీడునకు పరిచయంచేసినవాడు.

17. **పత్రలేఖ :** కులూతదేశంలో అంతఃపురంలో దొరికిన యువతి. చంద్రాపీడుని అంగరక్షకురాలు. పూర్వజన్మలో రోహిణీశీరదేవి (చంద్రుని భార్య). అచ్ఛోదసరస్సులో దూకి అవతారం చాలించింది.

18. **చిత్రరథుడు :** గంధర్వ రాజు, హేమకూటనివాసి, 'చైత్రరథం' అనే ఉద్యానవనాన్ని, 'అచ్ఛోదం' అనే సరస్సును, 'సిద్ధాయత'నాన్ని నిర్మించాడు. ఇతని తల్లి 'ముని'. భార్య మదిర. కాదంబరి తండ్రి.

19. **ముని :** దక్షప్రజాపతి కూతుళ్ళలో పెద్దది. చిత్రరథుని తల్లి. కాదంబరిని నాయనమ్మ ఈమెకు చిత్రరథుడు 16వ సంతానము.

**20. అరిష్టా :** మునియొక్క చెల్లెలు. దక్షుని చిన్న కూతురు హంసుని తల్లి మహాశ్వేతకు నాయనమ్మ.

**21. హంసుడు :** అరిష్టాకుమారుడు, గౌరికిభర్త, మహాశ్వేతకు తండ్రి.

**22. గౌరి :** సోమ(చంద్ర) కిరణములనుండి పుట్టిన వంశములోనిది, హంసుని భార్య. మహాశ్వేతకు తల్లి.

**23. మంగళకుడు :** వార్తాహరుడు, శుకనాస పుత్రోదయమును రాజునకు తారాపీడునకు వినిపించాడు.

**24. శ్వేతకేతువు :** పుండరీకుని తండ్రి త్రికాలవేది, దేవర్షి, పుండరీకుని శాపనివృత్తికోసం యజ్ఞం చేశాడు.

**25. మదిర :** అప్సరస. చిత్రరథుని భార్య. కాదంబరికి తల్లి.

**26. కేయూరకుడు :** కాదంబరియొక్క వీణమోయువాడు. గంధర్వ బాలుడు. చంద్రాపీడుని ఆంతరంగిక మిత్రుడు. కాదంబరీ చంద్రాపీడులను కలుపుటకు ప్రయాసపడినాడు.

**27. మదలేఖ :** కాదంబరికి ఆంతరంగిక పరిచారిక. ప్రియసఖి.

**28. మేఘనాథుడు :** బలాహకుని పుత్రుడు. వైశంపాయనుని గూర్చి చంద్రాపీడునితో చెప్పినవాడు.

**29. పృథువర్మ :** విలాసవతి (చంద్రాపీడుని తల్లి) మేనమామ. ఆశ్వికులలో ప్రముఖుడు.

**30. అశ్వసేనుడు :** విలాసవతికి మామగారు.

**31. భరతసేనుడు :** విలాసవతికి సోదరుడు.

**32. భద్రసేనుడు :** ఉజ్జయినీ సేనాపతి.



**33. త్వరితకుడు :** చంద్రాపీడుని మరణవార్తను తల్లిదండ్రులైన విలాసవతీ తారాపీడులకు, వైశంపాయనుని తల్లి దండ్రులకు చెప్పిన పిన్నవయస్కుడైన వార్తాహరుడు.

**34. ద్రవిడ ధార్మికుడు :** హేమకూటమునకు ఉజ్జయినికి మధ్యగల ఒక అడవిలోని కాళికాలయ నివాసి. సన్న్యాసి, భిక్షుకుడు. ద్రవిడ దేశమునుండి వలసవచ్చినవాడు. ఆందోళితుడైన చంద్రాపీడునకు తన వికృతచేష్టలతో, వింతమాటలతో ఉల్లాసము కల్గించి అతనిచే బహుమతులు గ్రహించిన వృద్ధుడు.

# 1. శూద్రకుడు - దినచర్య

## కాదంబరి - పూర్వభాగం

పూర్వం విదిశానగరాన్ని రాజధానిగా చేసుకొని శూద్రకుడనే రాజు ఈ భూమండలాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. అతడు దేవేంద్ర సమానుడు. సామంత రాజులంతా అతనివశంలో ఉండేవారు. సర్వ శుభలక్షణాలు కలవాడు. శ్రీమహావిష్ణువుకున్నట్లే ఈతని చేతులలో శంఖచక్ర చిహ్నాలున్నై. శివునిలాగా మన్మథుని వశంకానివాడు. కుమారస్వామివలె శక్తిమంతుడు. పాలసముద్రంలాగా లక్ష్మీనిలయుడు. సూర్యభగవానునిలాగ నిత్యం నూతన శోభలతో వెలుగొందేవాడు. అనేక యజ్ఞములు చేసి దేవతలకు ప్రీతి కల్గించినవాడు. ఆయన 64 కళలకు కాణాచి. సర్వశాస్త్ర విశారదుడు. సర్వసద్గుణాలకు ఆలవాలం. కావ్యాలంకార రసాస్వాది. మిత్రులకు ఆరాధ్యుడు శత్రుసమూహానికి చుక్కెదురు. నిత్యము పండితగోష్ఠులు నిర్వహించేవాడు. ధనుష్మంతులలో సాటిలేనివాడు. సాహసికులలో మేటి. వినతకు ఆనందం కలిగించిన గరుడునివలె శూద్రకుడు వినయశీలురకు సంతోషాన్ని కలిగించేవాడు.

శూద్రకుడు శత్రువుల గుండెలు చీల్చుటలో నరసింహునివంటివాడు. ఒక్క అడుగుతోనే సకల భూమండలం ఆక్రమించిన ఆ రాజు వామనావతారంలోని విష్ణువు మూడడుగులు ఎందుకు వేశాడో అని ఆశ్చర్యపడతాడు. రాజ్యలక్ష్మి తన దేహమునకు అంటున్న దుష్టరాజుల రక్తపు ధారలను ఆ రాజు ఖడ్గజలధారలతో శుభ్రపరచుకోవటానికా అన్నట్లు అతని యందే నివాసమున్నది.

ఆ రాజు ధర్మనిర్వహణలో యమధర్మరాజుతో సమానుడు, దయచూపుటలో కుబేరునితో తుల్యుడు. ప్రతాపంలో అగ్నిదేవునితో సమానుడు. వాక్కులలో సరస్వతీసముడు. అందంలో నిండు చందమామవంటివాడు.

బలంలో వాయుసమానుడు. బుద్ధిబలములో బృహస్పతికి సాటియైనవాడు. రూపంలో మన్మథుడు. కాంతిలో సూర్యభగవానుడు. ఈ విధంగా సర్వదేవతలను తనయందుంచుకొన్న ఆ రాజు శ్రీమన్నారాయణుణ్ణి తలపిస్తాడు.

శూద్రకుడు శత్రురాజుల ఏనుగుల కుంభస్థలములు పగులగొట్టి, శత్రువీరుల కవచములను పగుల చీల్చి, వారిని జయింపగా వారి రాజ్యలక్ష్మి శత్రురాజులను వదలివేసి శూద్రకుని వద్దకు అభిసారికవలెవచ్చి ఆశ్రయించినది. శత్రురాజ కాంతల భర్తలు మరణించినప్పటికి, వారి హృదయాలలో ఉన్న కారణంగా శూద్రకుని ప్రతాపాగ్ని వారిని కూడా దహించెను.

అట్టి సమర్థుడయిన ఆ పరిపాలకుని పాలనలో చిత్రములయందే వర్ణసంకరముండెను. ప్రేమికుల కలయికలలో తప్ప జుట్లు పట్టుకొనుటలు లేవు. అతని పరిపాలనలో తప్పు పనులు చేసి ఖైదు చేయబడువారులేరు. కుటుంబ సమస్యలతో చింతాగ్రస్తులైనవారు కనబడరు. ఎడబాటువల్ల దుఃఖించువారు కానరారు. అపరాధమొనర్చి దండింపబడువారు లేరు. చెడుపనులు చేసి భీతితో వణుకువారు కానరారు. రాగద్వేషాలతో పరుల హింసించువారు లేరు. పొగరుతో స్వేచ్ఛగా తిరుగువారు లేరు. గుణహీనులై జీవించువారు కనపడరు. వక్రమార్గ సంచారులు లేరు. పాపకృత్యాల వల్ల కళంకితులు లేరు. ఆ నగరంలో పాడుబడిన కొంపలు మచ్చుకైన కానరావు.

ఆతని రాజ్యమున ప్రజలు పరలోకమునకు భయపడేవారే కాని, శత్రువులకు భయపడువారు కాదు. పనిమొదలు పెట్టి విఫలులైన వారు లేరు. కాలి అందెల శబ్దములు వినబడునే కాని వాగుడుకాయల ప్రలాపాలు వినబడవు. వివాహముల యందు చేతులు పట్టుకొందురే గాని దోషుల చేతులు పట్టుకొనుటలు లేవు. కండ్లనుండి నీరు కారుట యజ్ఞమందలి పొగచేతనే కాని, దుఃఖించుట చేతకాదు. గుఱ్ఱాలను కొరడాలతో బెదిరింతురే కాని దోషులను కాదు.



అట్టి శూద్రకమహారాజునకు రాజధానియైన విదిశా పట్టణమునకు చుట్టును వేత్రవతీనది ప్రవహించుచుండును. ఆ నగరము రాబోవు కలికాలమువలన భీతిచెందిన కృతయుగమా అన్నట్లు మేడలు, మిద్దెలతో కిక్కిరిసియుండెను. ముల్లోకములను తానే కన్నదా అన్నట్లు ఆ నగరము మిక్కిలి విశాలమై కనపడును. వేత్రవతీ నదిలో మాళవయువతులు స్నానమాడుచు తమ స్తనముల కాఠిన్యతతో అలలను చిందరవందర చేయుదురు. ఆ వేత్రవతీ నదిలో స్నానమాడుటకు దిగిన పట్టపుటేనుగుల కుంభస్థలముల యందు పూయబడిన సిందూరము ఆ నీటిలో కరిగి కలసి ఎఱ్ఱబారుచుండును.

శూద్రకమహారాజు సమస్త శత్రురాజులను జయించినాడు కావున అతనికి శత్రురాజుల గూర్చి చింతలేదు. ద్వీపాంతరాల నుంచి వచ్చిన సామంతరాజుల కిరీటములలోనున్న రత్నముల కాంతులతో తన పాదములు కాంతులీనుచుండగా వారి నమస్కారాలను గ్రహిస్తూ ఉంటాడు. అతడు ఒక్కచేతితోనే భూమండలమును అవలీలగా భరించి పాలించాడు. అతని వద్ద వంశక్రమంగా మంత్రులుగా పనిచేసేవారు నీతిశాస్త్ర విశారదులై, ఆశలకు లొంగనివారై, బుద్ధిలో బృహస్పతిని మించిన వారై, రాజభక్తిపరాయణులై ఉండేవారు, ఆ రాజు చుట్టూ ఎల్లప్పుడు సమవయస్కులు, రూపవంతులు విద్యావంతులు ఉత్తమక్షత్రియ కులంలో జన్మించినట్టి రాజకుమారులుండేవారు. వారంతా సమస్త విద్యలు నేర్చినవారు. స్థిరమైన బుద్ధి కలవారు. సర్వకళలయందు ప్రవీణులు. ఎవ్వరిని పరిహసించి అవమానపరచరు. ఎదుటివారి హృదయభావాలను కనిపెట్టగల నిపుణులు. కావ్య నాటకాదులయందు విద్వాంసులు, తమ బాహుబలముచే సింహములు లాగా శత్రుసైన్యములోని ఏనుగుల కుంభస్థలములను పగులగొట్టు పరాక్రమవంతులు. పరాక్రమముతోపాటు వినయము కలవారు. వారంతా శూద్రకునికి ప్రతిరూపాలా అన్నట్లుగా ఉండేవారు.

శూద్రకుడు రూపవంతుడైనా, అమాత్యులు ఇతడు సంతానవంతుడై వంశం నిలపాలని కోరుకుంటున్నప్పటికి, అంతఃపురంలో రతీదేవితో సమానమైన రూపలావణ్యాదులు, వినయము కల్గియున్న కాంతలున్నప్పటికినీ, స్త్రీలను కోరుకొనక, వారికి దూరముగానే ఉండేవాడు.

శూద్రక మహారాజు తాను నేర్చిన కళలను వృథా పోనీయలేదు. ఒకప్పుడు తన కర్ణకుండలములు సుందరంగా కదులాడునట్లుగా మృదంగము వాయించుచు, వేరొకప్పుడు తనబాణ పరంపరలతో అడవి జంతువులను వేటాడుతూ, ఇంకొక సారి రసవత్తర కావ్యరచన చేయుచు, వేరొకసారి శాస్త్ర చర్చలు చేస్తూ, కొండొకసారి కావ్యనాటక పురాణములను వింటూ, చిత్రలేఖనంతోనూ, రోజులను గడుపుతూ ఉండేవాడు.

ఇట్లుండ ఒకనాడు ప్రాతఃకాలాన శూద్రకుడు నిండు కొలువుండ, ఎడమభుజమునకు వ్రేలాడుచున్న కాలసర్పము వంటి ఖడ్గముతో భయంకరమైన, మనోహరమైన చందనలతవంటి ద్వారపాలకురాలు రాజసమీపమునకు వచ్చినది. ఆమె హృదయమునకు నిరంతరము చందనము రాసుకొనుటచే తెల్లబడిన స్తనములు కలదియై, తెల్లని ఐరావతము మునిగి స్నానము చేయుచున్న గంగానది లాగా ఉన్నది. ఆ ప్రాంతముందున్న సామంతరాజుల చూడామణులయందు ఈమె యొక్క ప్రతిబింబము కనపడుచుండుటచే ఆ రాజాజ్ఞవలె తోచినది. తెల్లని వస్త్రము ధరించుటచేత కలహంసలతో కూడిన శరత్కాలమందలి ఆకాశమువలె ఉన్నది. ఇట్లు ఆమెరాజు వద్దకు వచ్చి రాజునకు నమస్కరించి, "రాజా! దేవేంద్రుని కోపముచేత క్రిందపడ వేయబడిన త్రిశంకు మహారాజుయొక్క రాజ్యలక్ష్మివలెనున్న ఒక చాండాల కన్యక చేతియందున్న బంగారు పంజరమందున్న చిలుకతో కూడి దక్షిణదేశము నుండివచ్చి, తమ దర్శనమునకై వేచియున్నది. ఆమె ఇట్లు విన్నవించుచున్నది. "ప్రభువు సర్వరత్నములకు నిలయుడైన సముద్రుని వంటివాడు. ఈ పక్షి మిగుల ఆశ్చర్యకరమైనది, సర్వలోకోత్తరమైన రత్నమువంటిదని భావించి, ప్రభువుల సన్నిధికి వచ్చితిని, ప్రభుదర్శనము కోరుచున్నాను "అని అటుపై ప్రభువుల చిత్తము" అని పలికి ఊరకుంది.



రాజు ప్రతీహారి మాటలువిని కుతూహలంతో దగ్గరలో ఉన్న రాజుల వంకచూచి, "ఇందుతప్పేమున్నది, ఆమెను ప్రవేశపెట్టు" అన్నాడు.

## 2. చిలుక రాజు నెదుటకు వచ్చుట

రాజట్లు పలుకగనే ప్రతీహారిణి వెళ్ళి ఆ మాతంగకన్యకను కొలువులో ప్రవేశపెట్టింది. ఆమె వజ్రాయుధపు దెబ్బకు భయపడి కులపర్వతముల మధ్యనున్న మేరు పర్వతమువలె అసంఖ్యాకులైన రాజులమధ్యలో ఉన్న శూద్రకుని చూసింది. అతడు అనేకరత్నాభరణాలు ధరించి పెక్కు ఇంద్రధనుస్సులతో కప్పబడిన మేఘములతో కూడిన వర్షాకాలపురోజు వలె అందగించుతూ ఉన్నాడు. ఆ రాజు కూర్చున్న సింహాసనం చంద్రకాంతమణులు పొదిగినది. నాల్గువైపులా మణులతో కూర్చిన స్తంభాలున్నై. వాటిని బంగారు గొలుసులతో బిగించికట్టారు. ఆకాశ గంగయొక్క తెల్లని నురుగులా ప్రకాశిస్తున్న వస్త్రాన్ని ఆ మండపం పైభాగాన ఆచ్ఛాదనగా అమర్చారు. బంగారు పిడులయందమర్చిన చామరాలతో దాసీలు చల్లని గాలిని వీస్తున్నారు. ఆ రాజుయొక్క ముఖకాంతిని జయింపలేక ఓడి పోయిన చంద్రబింబంలాగా ఉన్న తెల్లని స్ఫటికంతో నిర్మితమైన పాద పీఠంపైన తన ఎడమకాలుంచాడు. అచ్చటి భూమి ఇంద్రనీల మణులు పొదిగినది కావటంచేత ఆతని తెల్లని కాలిగోళ్ళపై నీలమణికాంతులు ప్రతిఫలించినై. అందుచేత కాలిగోళ్ళు నల్లగా కనిపిస్తున్నై. అయితే ఇక్కడ వేరే కారణం ఉంది. శూద్రకుని పాదాలకు నమస్కరిస్తున్న సామంత శత్రురాజుల వేడినిట్టూర్పుల వలన ఆ గోళ్ళు నల్లబడ్డాయని అనిపిస్తోంది. సింహాసనానికి అమర్చినపద్మరాగ మణులకాంతుల వల్ల ఆ రాజుతొడలు ఎఱ్ఱనిరంగుతో ప్రకాశిస్తుండగా, అప్పుడే చంపబడిన

మధుకైటభరాక్షసుల నెత్తురుచేత ఎఱ్ఱనితొడలు గలిగిన విష్ణువులాగా ఆ రాజు కన్పడుతున్నాడు.

ఆ రాజు గోరోచన వర్ణంతో నున్న అంచులుకల, అమృతపు నురుగులా ఉన్న తెల్లని పట్టు వస్త్రాలు ధరించి ఉన్నాడు. అవి చామరపు గాలికి కదులుతున్నై. తెల్లని చందనాన్ని హృదయానికి అలంకరించుకొన్నాడు. ఆ చందనంపైన ఎఱ్ఱని కుంకుమ పూయటంచేత లేత ఎండకు ఎఱ్ఱగా మెరుస్తున్న హిమవత్పర్వతంలా ఉన్నాడు. నక్షత్రమాలను మెడలో వేసికొన్న ఆ రాజుముఖం నక్షత్రాలతో కూడిన చంద్రబింబంలాగా ప్రకాశిస్తోంది. ఆ రాజు ధరించిన ఇంద్రనీలమణుల అంగదములు నల్లగా మెరుస్తున్నై. తెల్లని చందనాన్ని హృదయానికి అలంకరించుకొన్నాడు. ఆ చందనంపైన ఎఱ్ఱనికుంకుమ పూయటంచేత లేత ఎండకు ఎఱ్ఱగా మెరుస్తున్న హిమవత్పర్వతంలా ఉన్నాడు. నక్షత్రమాలను మెడలో వేసికొన్న ఆ రాజు ముఖం నక్షత్రాలతో కూడిన చంద్రబింబంలాగా ప్రకాశిస్తోంది. ఆ రాజు ధరించిన ఇంద్రనీలమణుల అంగదములు నల్లగా మెరుస్తున్నై. ఆయన శరీరానికి పూసుకొన్న చందనపు వాసనకు ఆకర్షింపబడి బారులు కట్టిన తుమ్మెదలు చంచలయైన రాజలక్ష్మి నిబంధించడానికి ఉపయోగించిన ఇనుపగొలుసులవలె ప్రకాశిస్తున్నై ఉన్నతమైన నాసికతో, వికసించిన తామరరేకులవంటి విశాలనేత్రములతో, అష్టమి నాటి చంద్రరేఖను బోలిన కనుబొమల మధ్యదేశంతో శోభిస్తున్న లలాటంతో, దిక్కులనే స్త్రీలవలె ప్రకాశించు వారవనితలు చేయు సేవలతో శూద్రకుడు అందాలు ఒలకబోస్తూ సింహాసనంపై ఉన్నాడు.

కొలువుకూటం ప్రవేశించిన ఆ మాతంగకన్య చేతిరత్న కంకణాలు కదులుతుండగా, ఎఱ్ఱ తామర రేకులవలె కోమలమైన చేతితో నలగగొట్టబడిన వెదురు బెత్తంతో రాజు నాకర్షించటంకోసం సభామందిరప్రదేశాన్ని ఒకసారి కొట్టింది. ఆ శబ్దమును విన్న సభలోని రాజులు అడవిలో వేటాడువారు



మ్రోగించిన తప్పెటల శబ్దానికి బెదరిన ఏనుగుల గుంపులాగా ఒక్కసారిగా రాజు ముఖం చూసేవారల్లా మాతంగకన్యవంక చూశారు.

ప్రతీహారిణి ఆ మాతంగకన్యను 'రాజువద్దకు పోకు, అక్కడనుండే రాజును చూడుమని హెచ్చరించింది. ఆమెతోపాటు ఒక ముదుసలిబోయ కూడా ఉన్నాడు. అతడు వయస్సుతో పండిన కేశములు కలిగి ఉన్నాడు. అతని నేత్రాలు ఎఱ్ఱతామరల్లా ఉన్నాయి. వ్యాయామం చేసిన వాడవటంచేత వృద్ధత్వంలోనూ దృఢశరీరం కలిగి ఉన్నాడు. ఎంత ఆటవికుడైననాని తెల్లని వస్త్రము ధరించి ఉండటం చేత గౌరవార్హుడల్లేనే ఉన్నాడు. వారితో పాటు ఒక ఆటవిక బాలుడు కూడా పంజరాన్ని పట్టుకొని వచ్చాడు. అతని పిల్లజుట్టు గాలికి అల్లల్లాడుతోంది. చాండాలకన్యక, దానవుల పహరించిన అమృతభాండాన్ని తిరిగి సంపాదించటానికి విష్ణువు దరించిన మోహినీరూపమా అన్నట్లున్నది. ఇంద్రనీలమణులతో నిర్మించిన స్త్రీమూర్తి కదులాడుతున్నట్లుగా ఉంది. చీలమండల వఱకు వ్రేలాడుతున్న నల్లని వస్త్రము ధరించి ఉంది. ఆమె శిరస్సున ఎఱ్ఱని వస్త్రము ముసుగుగా కప్పుకొన్నది. నీరెండతాకుతున్న దంతపత్రం చేత తెల్లబారిన చెక్కిలి కల్గి ఉంది. ఉదయిస్తున్న చంద్రకిరణములచే వెలుగొందుతున్న ముఖం కలిగిన రాత్రిలాగా ఉంది. పసుపు ఎరుపు కలిసిన గోరోచన తిలకము చేత శివుడు ఆమె మూడవకంటిని దాచిపెట్టగా శివునితోపాటు, కిరాత స్త్రీవేషధారిణియైన పార్వతీదేవిలాగా ఉంది.

సర్వదా నారాయణుని హృదయనివాసం చేయటం చేత ఆతని దేహకాంతి ప్రభావం చేత నల్లని దేహంకలిగిన లక్ష్మీదేవిలాగా ఉంది. తనతపస్సునకు భంగం కలిగించటంచేత కోపగించిన శివుడు తనమూడవకంటి మంటతో మన్మథుణ్ణి దహించి వేయగా, ఆ పొగలు తగిలి నల్లబడిన (ప్రొగచూరిన) రతీదేవిలాగా ఉంది. కోపించిన బలరాముడు తన నాగలితో తనను చీలుస్తాడేమో అనే భయంతో పరుగులు దీసిన కాళిందీనదిలా ఉంది. అప్పుడే మహిషాసురుని మర్దించి, ఆ రక్తధారలతో ఎఱ్ఱబారిన పాదములుగల దుర్గాదేవిలాగా ఉంది.

ఎఱ్ఱని చేతివ్రేళ్ళ కాంతులతో రక్తవర్ణంతో ప్రకాశించే గోళ్ళకాంతి కలిగి ఉంది. చిగురుటాకుల్లాగా మృదువుగా ఉన్న ఆమె యొక్క అరికాళ్ళు అక్కడి మణులు పొదిగిన నేల కఠినతకు తట్టుకోలేక పోతున్నాయి. ఆమె నడుస్తుంటే ఎఱ్ఱని చిగురుటాకుల గుత్తులు పరచినట్టుగా ఉంది. బ్రహ్మదేవుడు ఆమెను అంటరాని చాండాల జాతిలో పుట్టించినప్పటికీ, దాన్ని లెక్కచేయక, అగ్నిదేవుడు రూపానికీ ప్రాధాన్యత నిచ్చి, ఆమెను పవిత్రురాలిని చేయటానికి కౌగలించుకొన్నాడేమో అనిపిస్తోంది. ఆమె నడుమున ధరించిన మణులు పొదిగిన మొలత్రాడు మన్మథుడనే మదపుటేనుగు తలపై అలంకారంగా పెట్టిన నక్షత్రమాలలాగా ఉంది. పెద్ద పెద్ద ముత్యాలతో కూర్చిన మాలను కంఠానికి అలంకరించుకుంది. గంగానది ఆ కన్యను కాళిందీనది అని భ్రమపడి కౌగలించుకొన్నట్టుగా ఉంది. వికసించిన తెల్లతామర రేకుల వంటి కళ్ళు కలదియై శరత్కాలంలాగా ఉంది. ఆమె నల్లనిజుట్టు మేఘసమూహంలాగా ఉంది. చేతిలో విలాసపద్మాన్ని పట్టుకొని లక్ష్మీదేవిలాగా ఉంది. నిమ్నకులంలో జన్మించిన దేవకాంతలాగా ఉంది. ఏనుగులచే పెకలింపబడిన అరణ్య కమలినిలా ఉంది, ఆమెనడుము పిడికిలిలో ఇమిడేటట్లుగా ఉంది. అందువల్లనే ఆమె మన్మథుని విల్లులాగా ఉంది. చక్కని ముంగురులతో కుబేరుని రాజ్యలక్ష్మిలాగా ఉంది. ఈ మధ్యనే యౌవనం వచ్చిన దామెకు. ఆమె యొక్క అందచందాలను శూద్రకమహారాజు కన్నార్పకుండా చూశాడు.

ఆమె విలాస విభ్రమాలు చూసి విస్మితుడైన ఆశూద్రకుడు ఇలా మనస్సున భావించాడు.

"ఆహా! బ్రహ్మదేవుడు చోటుగాని చోటు, బోయకులంలో ఇంతటి సౌందర్యరాశిని పుట్టించాడేమిటి? ఈమే కనుక ఉత్తమకులంలో జన్మించి ఉంటే ఆమె సౌందర్యం ఈ పాటికి పాడయ్యేదేమో! ఈమెను అట్టి నీచజాతిలో పుట్టించిన బ్రహ్మను నిందింపవలసిందే!"



## 3. చిలుకను పరిచయం చేయటం

ఇంతలో మాతంగ కన్య వినయంతో వంగి రాజుకు నమస్కారం చేసి, మణులతో నిర్మించిన వేదికపై కూర్చుంది. బోయవాడు పంజరంలోని చిలుకను రాజసమీపానికి తెచ్చిచూపుతూ, "ఓదేవా! ఈ చిలుక మామూలు చిలుకకాదు. ఇది అన్ని శాస్త్రాలు నేర్చింది. రాజనీతి చాతుర్యం కలది. పురాణేతిహాసాలను పుక్కిట పట్టింది. సంగీతం నేర్చింది. కావ్యనాటకాదులన్నీ నేర్వటమే కాదు స్వయంగా రచన చేయగలదు, హాస్యచతురత కలది. నాట్యం, చిత్రలేఖనం, జూదం, గజ, తురగ, పురుష, స్త్రీలక్షణాలు తెలిసినది,

ఈ చిలుక పేరు వైశంపాయనుడు. ఇది సకల లోకములలోనూ దుర్లభమైన రత్నం. సర్వరత్నాలకు సముద్రంవలె మీరు ఇటువంటి ఆశ్చర్యకరమైన విలువైన వస్తువులు పొందదగిన వారని తలంచి మా స్వామి కుమార్తె, మీవద్దకు దీనిని తీసికొనివచ్చింది. దీనిని మీదానినిగా చేసుకోండి' అని చిలుకను రాజుకు ఎదురుగా పెట్టి ప్రక్కకు తప్పుకొని నిలిచాడు.

అప్పుడా విహంగరాజు రాజుకు ఎదురుగా నిలిచి తన దక్షిణపాదాన్ని పైకెత్తి చక్కని సంస్కారవంతమైన వాక్కుతో జయశబ్దమును పలికి రాజునుద్దేశించి ఈ ఆర్యావృత్తమును పఠించింది.

**శ్లో॥ స్తనయుగ మశ్రుస్నాతం సమీప తరవర్తిహృదయశోకాగ్నేః ।**
**చరతి విముక్తాహారం వ్రతమివ భవతో రిపుస్త్రీణామ్ ॥**

(**భావం :** ఓ రాజా! నీచేత ఓడింపబడిన శత్రురాజుల స్త్రీలయొక్క స్తనయుగళం కన్నీటితో స్నానమాడి, హృదయమందున్న దుఃఖమనే అగ్నికి సమీపంగా ఉంటూ విముక్తాహారలై (మెడలోని హారములులేనివై, ఆహారమును స్వీకరింపనివై) వ్రతనియమము పాటించుచున్నట్లున్నది)

ద్వంద్వార్థముతో కూడిన ఆ శ్లోకమును విని మిక్కిలి ఆశ్చర్యపడ్డాడు రాజు. తన ప్రక్కనే కూర్చున్న కుమారపాలితుడనే మంత్రితో, "వింటిరా

మహాత్మా! ఈ పక్షి ఎంత స్పష్టముగా ఉచ్చరిస్తోందో, స్వరమెంత మధురంగా ఉందో! ఇట్టి వింతగా చిలుక మాట్లాడుట, నేను వినుట ఇదే మొదటి సారి. దీని వాక్కు సంస్కారవంతుడైన మానవుని వాక్కువలెనే ఉన్నది. కుడికాలు పైకెత్తి జయ శబ్దమును పలకటం, ఆర్యాఛందస్సుతో ప్రస్ఫుటముగా గానం చేయటం వింతలలోనో వింత" అని పలుకగా మంత్రి ఇది ఏమంత మరీ ఆశ్చర్యకరము కాదన్నాడు. పురాణాదులలో పశుపక్ష్యాదులు మానవులవలె మాట్లాడినట్లు నిదర్శనలున్నాయన్నాడు. ముఖ్యంగా చిలుకలు, గోరువంకల వంటివి స్పష్టముగా పలికెడివి. అగ్ని శాపముచేత వాటి నాలుకలు మడతపడుట చేత వాక్కులలో స్పష్టత లోపించినది అని అన్నాడు.

అప్పటికి సూర్యుడు ఆకాశము మధ్యకు వచ్చినాడు. మధ్యాహ్నకాలాన్ని సూచించే ఘంటమ్రోగింది. శూద్రకుడు సభ్యులకు సెలవిచ్చి తానును సింహాసనం నుంచి లేచాడు, మంత్రి సామంత దండనాథులు తదితరోద్యోగులు బిలబిలలాడుతూ లేచి ఒకరినొకరు ఒరుసుకొంటూ, పోటీలు పడుతూ తాముకూడా స్నానపానభోజనాదుల కోసం గృహాలకు బయలుదేరారు.

శూద్రకుడు అంతఃపురంలో ప్రవేశించి, ఒంటిపైనున్న ఆభరణాలను తొలగించి, వ్యాయామశాల లోపలికి వెళ్ళి, తన స్నేహితులతో కలసి సముచిత వ్యాయామం చేశాడు. తర్వాత స్నానశాలకు వెళ్ళాడు. అక్కడ మంగళకరమైన కలశాలలో గంధోదకములు సువాసనలు వెదజల్లుతున్నై. వారవనితలు మహారాజు దేహానికి సుందరమైన చేతులతో సుగంధ పూరితమైన ఆమలకతైలాన్ని మర్దన చేశారు. తలకుకూడా కలియరాచారు. ఆ వనితల మధ్యలోనున్న రాజు విశాలమైన జలద్రోణి (తొట్టి)లో, అడవిలో ఆడు ఏనుగుల మధ్య జలప్రవేశం చేసిన మగ ఏనుగువలె ప్రవేశించి ప్రకాశించాడు. ఆ అభిషేక సమయంలో అనేక మంగళవాద్యాల హోరు అంతటా వ్యాపించింది. వందిమాగధులు సుందరంగా గానాలాపనలు చేశారు.



ఆ మహారాజు స్నానం ముగించుకొని, తెల్లని నురుగులాంటి పలుచని వస్త్రాలు ధరించాడు. తెల్లని శరత్కాల మేఘంలాగా నిర్మల శరీరంతో ఆయన ప్రకాశించాడు. తెల్లని మబ్బులాంటి పట్టువస్త్రంతో ఆకాశ గంగాప్రవాహంతో హిమవంతుడులాగా తలపాగా పెట్టుకున్నాడు. పితృదేవతలకు భక్తితో జలతర్పణం చేశాడు. మంత్రపూర్వకంగా సూర్యభగవానునికి అర్ఘ్యం సమర్పించాడు. అనంతరం దేవార్చనకై దేవతామందిరంలోకి ప్రవేశించాడు. శివపూజ పూర్తి చేసుకొని, యజ్ఞశాలకు వెళ్ళి అగ్ని ప్రీతికరంగా లఘుహోమం చేశాడు. దేహానికి సువాసనలు వెదజల్లే కస్తూరి, కర్పూరం, కుంకుమ పువ్వులతో మిళితమైన చందనాన్ని పూసుకొన్నాడు. తలపై పరిమళించే మాలతీ పుష్పమాలికలు అలంకరించుకొన్నాడు, స్వల్పమైన అలంకారాలతో భోజనశాలకు బంధుమిత్రాదులతో వెళ్ళి తమ యిష్టానుసారముగా రుచిమంతములైన రసభరితమైన ఆహారపదార్థాలను స్వీకరించాడు. తదుపరి తాంబూలాన్ని సేవించాడు. కొద్దిసేపైన తర్వాత ఆయన ఆ వేదికపై నుండి లేచాడు. వెంటనే ప్రతీహారి (ద్వారపాలకురాలు) తన చేతిని రాజునకందించింది రాజు ఆమె చేతిని ఆసరాగా తీసుకొని, యోగ్యులైన కొద్దిమంది పరిజనులతో కూడినవాడై కదలివచ్చి శయనమందిరం చేరాడు తెల్లని వస్త్రములతో కట్టబడిన శయనమందిరపు గోడలు తెల్లని స్ఫటికములతో నిర్మించినట్లు కన్పడినై. కస్తూరి కలిపిన చందనజలాన్ని ఆ ప్రాంతం అంతా చల్లటంచేత చల్లని, సురభిళముగా మందిరం శోభించింది. స్తంభాలపై చెక్కబడిన సుందరీమణుల ప్రతిమలు ఒకచోట కూడిన గృహదేవతలలాగా ప్రకాశించాయి. అగరుధూప పరిమళం ఆ ప్రాంతమంతా వ్యాపించింది.

## 4. శూద్రకుడు చిలుకను రప్పించుట

శూద్రక మహారాజు మంచుపలకలాగా సుందరంగా చేసిన ఏర్పాటు చేసిన శయ్యమీద సుగంధపుష్పములు చల్లబడిన దుప్పటిపై కొంతసేపు విశ్రమించాడు. శయన సమీపంలో రత్నములు పొదిగిన పాదపీఠం ఉన్నది.

రాజు పాదాలను తన ఒడిలో ఉంచుకొని అతని అంగ రక్షకురాలు ఖడ్గాన్ని తన తొడపైన ఉంచుకొని, శ్రమ తీరునట్టుగా పాదసేవ చేసింది. అట్లు కొంతసేపు విశ్రాంతి పొందిన శూద్రకుడు అంతపురము నుండి వైశంపాయనుని తీసికొని రమ్మని ఆజ్ఞాపించినాడు, ఆమె కొద్ది సేపటిలోనే పంజరమును తెచ్చి రాజుసమీపాన ఉంచింది. బంగారు బెత్తాన్ని చేతపట్టుకొన్న ఒక కంచుకి ఆమెను అనుసరించి అంతఃపురం నుంచి వచ్చాడు. తెల్లని నెరిసిన వెంట్రుకలతో, తెల్లని అంగరఖా ధరించి ఉన్న అతడు రాజహంసలా ఆ చిలుక వెనుక వచ్చాడు. రాజునకు నమస్కరించి, "రాజా! మీ ఆజ్ఞానుసారం వైశంపాయనుడు స్నానం చేశాడు. ఆహారం తీసుకొన్నాడు. ప్రతీహారితో మీ వద్దకు వచ్చాడు" అని రాణులు తమకు తెలుపమన్నారు అని పలికాడు. రాజానుమతితో అతడు అక్కడినుండి వెళ్ళిపోయాడు.

రాజు కుతూహలుడై వెంశంపాయనుని ఏమైనా తింటివా? అని ప్రశ్నించాడు వైశంపాయనుడు, 'దేవా! తినకపోవుట ఏమి? మదించిన కోయిలల కన్నులవలె ముదురు ఎరుపురంగుగల, తీపి, వగరు రుచులుగల నేరేడుపండ్ల రసము దండిగా త్రాగాను. సింహపుగోళ్ళచే చీల్చబడిన మదగజ కుంభస్థలమునుండి జారిపడిన, రక్తముతో ఎర్రబడిన మంచిముత్యములవంటి దానిమ్మగింజలను తిన్నాను. నల్ల కలువరేకుల వంటివి, ద్రాక్షపండ్లవలె మధురమైనవి నలగగొట్టబడిన ఉసిరిక పండ్ల చూర్ణమును భుజించాను. అవి ఇవి అని ఇన్ని చెప్పుట ఎందుకు? రాణులు తమ చేతులతో స్వయముగా తినిపించిన అన్నింటిని తృప్తిగా తిన్నాను" అని పలికెను, అప్పుడు రాజు అతని మాటల కడ్డుపడుచు", సరే ఆ సంగతి అట్లుండనిమ్ము. ప్రస్తుతం నీ వివరములు తెలియజెప్పి నా కుతూహలమును పోగొట్టు. అసలు నీవు ఏ దేశాన జన్మించావో, ఎట్లు జన్మించావో, నీ పేరేమిటో, నీతల్లి దండ్రులెవరో, నీవు వేదవిద్య నెట్లునేర్చితివో, శాస్త్రాలు, కళలు ఎలా అభ్యసించావో, నీకు పూర్వజన్మ జ్ఞానం ఎలా కలిగిందో వివరించు, ఇట్లు చిలుకగా ఎట్లైతివి?



లేక చిలుక రూపములోనున్న వేరే వ్యక్తివా? నీ వెక్కడ నివసించావు? పంజరంలో ఎలా బంధింపబడ్డావు? ఈ చాండాలకన్యక చేతికెట్లు చిక్కావు? ఇక్కడకు ఎలా వచ్చావు? చెప్పు" అని ప్రశ్నించాడు

## 5. వైశంపాయనుడు తనకథను రాజుకు చెప్పట

రాజు ఇట్లు ప్రశ్నింపగా వైశంపాయనుడు కూడా చెప్పాలనే కుతూహలంతో కాసేపు కనులు మూసుకొని ధ్యానించి, ఆదరంతో ఇలా అన్నాడు – "రాజా! ఇది చాలా పెద్దకథ. వినాలనే కుతూహలం ఉంటే చెబుతాను విను".

"తూర్పు పశ్చిమసముద్రతీర అరణ్యముదాకా వ్యాపించిందీ, సహ్యపర్వతానికి, హిమాలయా పర్వతానికి మధ్యనున్న భూమికి, అలంకారం వంటిదీ అయిన వింధ్యారణ్యం అనే మహారణ్యం ఉండేది. అది భూమి దేవతకు మొలనూలులాంటిది. ఆ అరణ్యంలో అడవి ఏనుగుల మదజలంచేత తడిసి ఏపుగా ఎత్తుగా పెరిగిన వృక్షాలున్నై. అవి తమ తలలపై నక్షత్రాలను కలిగి ఉన్నాయనిపిస్తుంది. అక్కడి మదగజములు చీకటిచెట్ల యొక్క చిగురుటాకులను తమ తొండాలతో ఆరగిస్తూ ఉంటాయి. మద్యము త్రాగిన కేరళస్త్రీల ఎఱ్ఱబడిన చెక్కిళ్ళవలె ఉన్న చిగురుటాకుల గుత్తులు భూమిపై పడగా, అవి వనదేవత సంచరింపగా ఏర్పడిన పారాణి గుర్తులవలె ప్రకాశిస్తాయి. అచ్చటి చెట్లపైనున్న చిలుకలు తింటున్న దానిమ్మపండ్లనుండి స్రవించిన రసముచేత చెట్లు కొమ్మలు ఆకులు తడిసిపోతాయి. చెట్లపైనున్న కోతులు కక్కోల వృక్షశాఖల్ని పట్టి గట్టిగా ఊపగా దాని పళ్ళు చిగుళ్ళు నేలపై దట్టంగా పడి ఉంటాయి. పుష్పాలనుంచి నిరంతరం రాలిపడుతున్న పుప్పొడి చేత ఆ ప్రాంతం సుందరంగా ఉంటుంది. దారినపోయే బాటసారులు విశ్రాంతికోసం లవంగ వృక్షముల చిగురుటాకులతో ఏర్పరచుకొన్న పక్కలు కనిపిస్తాయి. కొబ్బరిచెట్లకు, మొగలిచెట్లకు, పోగడ చెట్లకు లెక్కే లేదు. అక్కడ తమల పాకులతీగలు ఉన్నై, వక్క చెట్లూ ఉన్నై. ఆ

ప్రాంతం వనలక్ష్మి నివాసప్రాంతాలవలె ఉన్న లతామంటపాలతో శోభిస్తూ ఉంది. మదపుటేనుగుల చెక్కిళ్ళ నుండి స్రవించిన మదజలములచేత తడిసిన ఏలకు తీగలనుండి నిరంతరం పరిమళం గుబాళిస్తూ ఉంటుంది. ఏలకులవనాలు అధికంగా ఉండటం చేత ఆప్రాంతం చీకటిగా ఉంటుంది. అక్కడి సింహాలు ఏనుగుల కుంభస్థలాలు బ్రద్దలుకొడితే సింగాల గోళ్ళమధ్యలో ఇరికిన ముత్యాలకు ఆశపడి శబరవీరులు ఆ సింహాలను వేటాడి చంపుతారు. భయంకరమైన ఆ అడవి యమలోకాన్ని తలపిస్తుంది. ఆ ప్రాంతాల్లో యముని వాహనాన్ని గుర్తుతెచ్చే అడవిదున్నలు సంచరిస్తూ ఉంటై. ఆ అడవిలో ఖడ్గమృగాల సంచారం విస్తారంగా ఉంది. నెమళ్ళు పురివిప్పి నాట్యమాడుతుంటాయి. స్వచ్ఛజలాలతో నిండిన వందలకొలది సరస్సులతో నిండి ఉంది. చమరీమృగాలు రాజులకొలువులలోని చామరాలు గుర్తుకు తెస్తూ సంచరిస్తుంటాయి. మదపుటేనుగులు, సింహాలు స్వేచ్ఛగా తిరుగుతూ ఉంటై. మునులకు పనికివచ్చే దర్భగడ్డిపొదలు విస్తరించి ఉన్నై. అక్కడ అడవిపందులు భూమిని ముట్టె కోరలతో సొరంగాలు చేసి వాటిలో నివసిస్తూ ఉంటై. అచ్చటి బలిష్ఠమైన వానరాలు మద్ది చెట్లను కూడా విరగదీసి పడవేస్తూ ఉంటై, యజ్ఞాలకు పనికి వచ్చే దర్భలు, సమిధలు, వివిధరకాల పుష్పాలు, జమ్మి, పలాశవృక్షాలు సమృద్ధిగా ఉన్నై. రెల్లుపొదలు దట్టంగా వ్యాపించి ఉన్నై. వెదురు పొదలతో దుర్గమంగా ఉంటుంది. ఆ అరణ్యం క్రూరమైన జంతువులకు నిలయం. సాత్త్వికులైన మునిజనులకు నివాసం.

ఆ అరణ్యంలో అఖిలమునిజనసేవ్యమానుడు అగస్త్యుడు గోదావరీ తీరంలో ఒక ఆశ్రమం నిర్మించుకొని భార్య లోపాముద్రతో తపోనిష్ఠాగరిష్ఠుడై నివసించినాడట. అగస్త్యుడు వింధ్యుని విధేయునిగా చేసి, అతనిని దాటి దక్షిణాపథానికి వచ్చాడు. ఆయన వాతాపిని, ఇల్వలుని చంపి మునిజనులకు పీడనుండి విముక్తి కలిగించాడు. గర్వితుడైన ఇంద్రస్థానమందున్న నహుషుని ఒక్క హుంకారంతో స్వర్గలోకమునుండి భూలోకానికి పంపాడు. సముద్రాన్ని



ఒక్క గుటకలో త్రాగిన మహాత్ముడు. ఆయన కుటీరానికి సమీపంలోనే అరణ్యవాసానికి సీతాలక్ష్మణులతో వచ్చిన శ్రీరాముడు పంచవటిలో కుటీరం నిర్మించుకొని కాంతకాలం నివసించినాడట.

ఆ పంచవటిలో ప్రస్తుతము యజ్ఞములు జరగకపోయినా, ఆవృక్షములపై నున్న కొమ్మల మధ్యలో దాగిన పావురాలు యజ్ఞధూమాలవలె కనపడతాయి. సీతాదేవి దేవతార్చనకు పూలు కోస్తున్నప్పుడు ఆమె అరచేతి ఎరుపుతనము లతల చిగురులయందు గోచరిస్తుంది. పూర్వం రామలక్ష్మణుల బాణములకు గాయపడ్డ రాక్షసుల నుండి స్రవించిన రక్తపు మరకలవలె అక్కడి మోదుగ వృక్షములు ఎర్రదనముతో ప్రకాశిస్తున్నై. సీతాదేవిచేత పెంచబడిన లేళ్ళు ఆకసాన కొత్త మేఘములు చేయుగర్జన విని ఆనాటి రాముని ధనువు యొక్క ప్రళయకాలధ్వని గుర్తుకు తెచ్చుకొని తమ గడ్డి తినుటలు ఆపి ముదుసలి కొమ్ములు అటునిటు ఊపుతూ దిక్కులు చూస్తూ ఉన్నై. ఆ ప్రాంతంలోనే సూర్య చంద్రులలాంటి రామలక్ష్మణులు సీతాన్వేషణ చేస్తూ కబంధుని చేతులకు చిక్కి బాధపడ్డారు. రామలక్ష్మణుల కత్తి దెబ్బలకు తెగిపడిన ఆతని చేయి అగస్త్యమహర్షిని ప్రసన్నుని చేసుకోవటానికి వచ్చిన సర్పరూపియైన నహుషుడిలాగ ఉన్నది. సీతాపహరణబాధను నివారించటానికి రాముడు పర్ణశాల నేలపై వ్రాసిన సీతాదేవి చిత్రమును ఇప్పటికీ శబరులు చూస్తూ ఉంటారు.

అగస్త్యాశ్రమానికి దగ్గరలో పంపా అనే పద్మ సరస్సుంది. మునుపు సముద్రజలాలను త్రాగి వేశాడని అగస్త్యునిపై కోపించిన వరుణుడు ప్రోత్సహించగా బ్రహ్మదేవుడు మరల సముద్రమంత సరస్సు నిర్మించినట్టుగా అనిపిస్తుంది ఆ సరోవరం ప్రళయకాలంలో ఒత్తిడికిలోనై సంధిఖంధాలు ఊడిపోగా భూమిపై పడిన విశాల ఆకాశంలాగా కన్పిస్తుంది ఆ పంపా సరోవరం. ఆదివరాహస్వామిచే కోరపై లేపబడిన నీటితో నిండిన భూమండలమా అన్నట్టుగా ఉంది అది. ఆ సరస్సులో మంచి యౌవన మదంతో

ఉన్న కిరాత స్త్రీల స్తనముల తాకిడి చేత ఆ నీరు చిందగొట్టబడుతూ ఉంటుంది. వికసించిన కుముదము (నల్లకలువ)లతో, పద్మములతో, సౌగంధిక పుష్పాలతో కళకళలాడుతూ ఉంటుంది, తామరతూండ్లు తిన్న హంసలు మదంతో మధురధ్వనులు చేస్తుంటాయి. బెగ్గురు పక్షులు కోలా హలంచేస్తుంటాయి. ఆ సరస్సు మొసళ్ళు, పక్షులు నిత్యం సంచరిస్తూ ఉండటంచేత దానిలోని అలలు శబ్దం చేస్తూ ఉవ్వెత్తున లేస్తూ ఉంటై తరంగాలు పరస్పరం ఢీ కొనటంచేత అసంఖ్యాకంగా నీటి తుంపురులు లేచి ఆకాశంలో వ్యాపించి అది వర్షపు రోజేమో అనిపిస్తుంది. స్నానసమయంలో జల క్రీడలాడాలనే ఉత్సాహంతో నిస్సంకోచంగా వనదేవతలు సరస్సులో స్నానాలాడటానికి దిగగా వారి కేశపాశాలలోనున్న పరిమళ పుష్పాలతో ఆ నీరు సుగంధములు వెదజల్లుతూ ఉంటుంది. మునులు గుంపులుగా కూడి అందులో స్నానములు చేసి తమ కమండలాలతో నీరు ముంచుకొనేటప్పుడు అవి చేసే శబ్దాలు మనోహరంగా వినిపిస్తే, వికసించిన తెల్లని పద్మాలమధ్య సంచరించే హంసలు తాము చేసే ధ్వనులవల్ల హంసలుగా గుర్తింపబడతాయి. కిరాతరాజ కాంతలు ఆ సరస్సులోకి స్నానం చేద్దామని దిగగా, వారి స్తనాలకు పూసుకొన్న చందనం కరిగి ఆ నీళ్ళు తెల్లగా మారుతై. ఆ సరస్సుకు సమీపంగా ఉన్న మొగలి రేకుల పుప్పొడి తీరాన ఉన్న ఇసుకతో కలసిపోతోంది. దగ్గరలోనున్న ఆశ్రమం నుంచి వచ్చిన మునీశ్వరులు తమ కాషాయవల్కలాలను (నారచీరలను) ఉదకటంచేత ఆ ప్రాంతంలోని నీళ్ళు ఎఱ్ఱబారతాయి. ఆ సరస్తీరాన ఉన్న చెట్లవల్ల పగలే చీకటిగా ఉంటుంది. వాలిచేత వెళ్ళ గొట్టబడిన సుగ్రీవుడు ఆప్రాంతాల సంచరిస్తూ ఫలాలను కోసుకొని తినటం చేత ఖాళీగా ఉన్న తీగలు కనిపిస్తూ ఉంటై. ఆ సరస్సులో సంచరించే జలపక్షుల రెక్కల గాలిచేత చెదరిపడిన నీటి తుంపురుల చేత తడిసిన చెట్ల చిగురుటాకులు ప్రకాశిస్తై. అచ్చటి లతామండపాలలో నెమళ్ళు పురివిప్పి నాట్యమాడుతూ ఉంటై. బురదగుంటలలో పొర్లాడి వచ్చిన ఏనుగులు ఆ సరస్సులో దిగి నీరుతాగుతూ



ఉంటే నల్లనిమేఘాలు ఆ సరస్సును సముద్రమనుకొని నీరు త్రాగుతున్నాయేమో అనిపిస్తుంది. ఆ సరస్సు వైశాల్యానికి అంతు లేదు. అది మిక్కిలి లోతైనది. ఆ సరస్సుతో ఏదీ సాటిరాదు. ఆ సరస్సులో వికసించిన నల్ల కలువల కాంతి ప్రతిఫలించగా నల్లగానున్న రెక్కలుగల చక్రవాక మిథునాలు రాముని శాపంతో ఇప్పటికీ అలాగే సంచరిస్తున్నాయనిపిస్తుంది.

ఆ పంపాసరస్సుకు పశ్చిమ దిశలో ఒక పెద్ద బూరుగు చెట్టుంది. అది ఎన్నో యోజనాల దూరం వ్యాపించిన కొమ్మలు కలది. ఆ కొమ్మలు ప్రళయ కాలంలో తాండవించే శివుని యొక్క పరచుకొన్న జడలవలె ఉన్నాయి. దాని శిఖర మేఘాలకు కూడా చూడ వీలు లేనంత ఉన్నతం. స్వర్గంలోని నందనవన సౌందర్యాన్ని చూడటానికి తల పైకెత్తి చూస్తున్నదనిపిస్తుంది. దాని శిరస్సు దానిపై కొమ్మలపై పడిన బూరుగ దూదితునకలు తమపైన ఆకాశంలో సంచరించే సూర్యరథంలాగే అశ్వాల నోటిప్రక్కలనుండి రాలి పడిన నురుగులాగా శోభిస్తుంది. ఆ చెట్టు మొదలుపైన మదపుటేనుగులు తమ చెక్కిలి దురదను తీర్చుకొనటానికి రుద్దుకోగా అంటుకొన్న మదమును ఆ స్వాదించటానికి తుమ్మెదలు బారులు తీరి ఉన్నాయి. ఆనల్లని తుమ్మెదల వరుసలు ఆ ముసలి వృక్షం యుగాంతందాకా పడిపోకుండా ఉండేందుకు బిగించికట్టబడిన పెద్ద ఇనుప గొలుసులాగా ఉంది. ఆ వృక్షం దండకారణ్యానికి అధిపతిలాగా ఉంది. ఆ పరిసర వృక్షాలన్నింటికి నాయకునిలా ఉంది. వింధ్య పర్వతానికి మిత్రుడిలాగా ఉంది.

ఆ బూరుగు చెట్టు కొమ్మల మధ్యలోనూ తొఱ్ఱలలోనూ యోగ్యంగా ఉండటం చేత పక్షులు గూళ్ళు కట్టుకొని అందులో నిశ్చింతగా నివసిస్తున్నై. ఆ బూరుగు చెట్టు పెద్దదై ఉన్నతంగా ఉండటంచేత ఎవ్వరు దీనిపైకి ఎక్కలేరనే నమ్మకంతో నిశ్చింతగా అనేక వేలపక్షులు నివసిస్తున్నై. అందులో చిలుకల సంఖ్యే అధికం. అది ముసలి వృక్షం అవటం చేత ఆకులు అంత ఎక్కువగా లేకపోయినా చిలుకల గుంపులవల్ల ఆ చెట్టు నిత్యం పచ్చని ఆకులతో ఉన్నట్టే

ఉంటుంది. ఆ పక్షులు తమ గూళ్ళలో రాత్రంతా నిద్రపోయి, తెల్లవారుతూనే ఆహార సంపాదనకై ఎటో వెళ్ళి పోతుంటాయి.

ప్రొద్దున్నే వరుసలు కట్టి ఆకాశంలో ఎగిరే ఆ చిలుకలు కోపించిన బలరాముని చేతి నాగలికొనతో చీల్చబడిన యమునాననది పాయలు ఆకాశంలో ప్రవహిస్తున్నట్టుగా ఉంటాయి. ఐరావతం చేత పెకలింపబడి క్రింద పారవేయబడిన ఆకాశగంగానదిలోని కలువపువ్వుల్లాగా ఉన్నాయి ఆ పక్షులు. ఆ చిలుకలు సూర్యుని రథానికి కట్టిన గుఱ్ఱాల ముదురాకుపచ్చకాంతి ఆకాశం అంతా అలుముకున్నట్లు ఆకాశంలో ఎగురుతూ పోతాయి. ఇంద్రనీల మణులు తాపడంచేసిన భూమి ఆకాశంలో సంచరిస్తున్నట్లుంటుంది. ఆకాశమనే సరస్సులో నాచుపిలకలవలె చిలుకలు కన్పిస్తాయి. ఆ చిలుకలు ఱెక్కలు టపటప కొట్టుకొంటూ ఆకాశంలో పోతూ ఉంటే, సూర్యునివేడి కిరణాలకు బడలిక చెందిన దిక్కులనే స్త్రీలకు అరటి ఆకులతో విసరినట్లుగా ఉంది. గడ్డిపరకలతో నిండిన భూ ప్రదేశం ఆకాశంలో సంచరిస్తున్నదేమో అనే అనుమానం కలుగుతుంది. రకరకాల రంగుల చిలకలు ఆకసంలో ఎగురుతూ ఉంటే ఆకాశంలో ఏర్పడిన ఇంద్రచాపంలాగా కనుపడతాయి.

ఆ చిలుకలు అలా ఎగురుకుంటూ పోయి పగలల్లా ఆహారం సేకరించుకొని, సాయంకాలానికల్లా గూళ్ళకు చేరుకొని, వివిధ ఫలరసాలను, ధాన్యపు కంకులను తెచ్చి, వేడిని చంపిన పెద్దపులి గోళ్ళలాగా ఎఱ్ఱగా ఉన్న తమ ముక్కులతో ఎంతో ప్రేమాదరాలితో తమ బిడ్డలకు తినిపించి, రాత్రి నిద్రకు పక్రమిస్తాయి. తమ కూనలను పొట్టలో దాచుకొని నిద్రిస్తాయి.

అటువంటి చిలుక కుటుంబాలలో మా కుటుంబం ఒకటి ఆ వృక్షం తొఱ్ఱలో భార్యతో నివసిస్తున్న, వృద్ధత్వంలో ఉన్న మా తండ్రికి నేనొక్కడనే కుమారునిగా జన్మించాను. నన్ను కన్న నా తల్లి ప్రసవవేదన అధికమై పరలోకం చేరుకొంది. అత్యంత ప్రియురాలైన భార్య పోయిన శోకంతో బాధ చెందుతూ కూడ దాన్ని గుండెలలోనే దాచుకొని, బలహీనమైన ముక్కుతో ఇతర పక్షుల



గూళ్ళ నుండి జారి కిందపడిన ధాన్యపుగింజలను బియ్యపు గింజలుగా మార్చి, వాటిని నాచే తినిపించేవాడు. చెట్టుక్రింద చిలుక ముక్కుల నుండి (నోళ్ళనుండి) రాలిపడిన పండ్ల ముక్కలను ఏరి తెచ్చి బయటకు వెళ్ళే శక్తిలేక నాకుతెచ్చి పెట్టి తాను మిగిలితే తినేవాడు లేకుంటే ఉపవాసం చేసేవాడు.

## 6. శబరుల వేట

ఒకనాడు వేకువ వేళ చంద్రుడు పశ్చిమ సముద్రంలోకి జారుతుండగా, ఉదయ సంధ్యాకాంతులు ఆకాశాన అలుముకొంటూ ఉండగా, సప్తర్షి మండలం ఉత్తరదిక్కున నున్న మానస సరస్తీరమున దిగుచుండగా, తెల్లవారుతూ ఉండగానే కలువలు మూసుకొనిపోగా అందులో చిక్కుకున్న తుమ్మెదలు చేసే రొదతో ఆ ప్రాంతం మారుమోగుతుండగా, వనచరులు అటు ఇటు తిరుగుతూ ఉండగా, అప్పుడే మేల్కాంచిన పంపాసరస్సు నందలి హంసను మనోహరశబ్దాలు చేస్తూ ఉండగా, నెమళ్ళు పురి విప్పి నాట్యమాడుచుండగా, అడవి ఏనుగులు చెవులూగిస్తూ శబ్దాలు చేస్తుండగా సూర్యోదయం జరిగింది. సూర్యభగవానుడు ఉదయించగానే నింగిలోని తారకలు అదృశ్యమయ్యాయి. చిలుకలు తమ జీవనయాత్రకై తమ యిష్టం వచ్చిన దిక్కుల కెగిరి పోయినై. గూళ్ళల్లో పక్షి పిల్లలున్నప్పటికి ఆ వృక్షం నిశ్శబ్దంగా నిలబడి ఉంది. నేను మాతండ్రి సమీపంలో ఒదిగి ఉన్నాను. నాకింకా రెక్కలు రాలేదు. ఇంతలో అకస్మాత్తుగా అడవిలో గందరగోళం చెలరేగింది. మృగాలన్నీ భయపడినై. పక్షులు భీతి చెంది ఱెక్కలాడిస్తూ ఎగిరిపో సాగినై. ఏనుగు గున్నలు తొండాలతో ఛీత్కారం చేస్తూ భయాన్ని ప్రకటిస్తున్నై. లతల మధ్యలోనున్న మదించిన తుమ్మెదలు ఝుంకారం చేయసాగినై. అడవిపందులు ముట్టెలు పైకెత్తి ఘుక్ఘుక్ మని శబ్దాలు చేస్తున్నై. భయంతో భీతిల్లిన గుహలలోని సింహాలు గర్జింపసాగాయి. అడవిలో చెట్లు ఆ భయంకర ధ్వనికి కంపిస్తున్నై. భగీరథుడు గంగను భూమిపైకి దించేటప్పుడు గంగాప్రవాహకలశబ్దాలు వినిపించినై ఆ గందర గోళానికి మూలకారణం

అడవి బోయలు వేట ప్రారంభించడమే. అటువంటి భీకరశబ్దాన్ని నేనెప్పుడూ వినలేదు. నా శరీరం భీతిచేత వణకుతోంది. నేను బాలుణ్ణవటం చేత ఆ శబ్దానికి నా చెవులు తట్టుకోలేకపోయినై. నేను ఏమి చెయ్యాలో తెలియక ప్రాణాలు కాపాడుకొందామని బలహీనంగా ఉన్న నా తండ్రిరెక్కలలోకి దూరి దాక్కొన్నాను.

బోయల వేట ప్రారంభమైంది. "ఇదిగో ఇక్కడ ఏనుగులచేత పెకలింపబడ్డ పద్మాల సుగంధ వ్యాపించి ఉంది. ఆ ఏనుగుల్ని బంధించండి, ఇక్కడ అడవిపందులు సంచరించాయి. అవి ముట్టెలతో కుళ్ళగించిన తుంగముస్తెల సువాసలను అనుసరించి వాటిని పరిమార్చండి. ఈ ప్రక్క గున్న ఏనుగులు తిరిగినై. అవి అందుగు వృక్షాలను విరవగా అందుండి వగరు వాసనలు వస్తున్నై. వాటిని వలలతో బంధించండి. ఇక్కడ అడవిదున్నలు కొమ్ములతో పుట్టల మట్టిని చిమ్మిన జాడలు కనబడుతున్నై. ఈ వైపున లేళ్ళ గుంపులు పోయిన గుర్తులున్నై. ఇది అడవి ఏనుగుల గుంపు పోయిన దారి. ఇటు వైపు అడవి పందులు గుంపు వెళ్ళిన చిహ్నాలు కనబడుతున్నై, ఈ ప్రక్క నెమళ్ళకూతలు వినవస్తున్నై. ఈ చోట తిత్తిరిపక్షుల మనోహరధ్వని వినబడుతోంది. ఈ వైపు లకుముకిపిట్టల కూతలు వినబడుతున్నై. ఈ ప్రాంతంలో సింహాలు తమ కుంభస్థలాన్ని చీలుస్తుంటే మదపుటేనుగులు ఘీంకరిస్తున్నై. ఇక్కడ ఇంతకుమునుపే వెళ్ళిన అడవిపందుల తడి బురదకాలి గుర్తులు కానవస్తున్నై. ఇదిగో, ఇక్కడ వాడని గడ్డి పరకలు నమలిన ముద్దలు నెమరు వేయటం చేత నురుగులతో కూడా కనిపిస్తున్నై. లేడిగుంపులు ఇంతకుముందే ఇక్కడ గడ్డి మేసిన గుర్తులున్నై. ఇక్కడ మదపుటేనుగులు తమ చెక్కిళ్ళ దురద తీర్చుకోటానికి చెట్లకు రుద్దుకోగా ఆ సువాసనకు మూగిన తుమ్మెదలు ఝుంకారం శబ్దం చేస్తున్నాయి. ఇక్కడ అడవి ఏనుగుల కాలి త్రొక్కిళ్ళతో నలిగిపోయిన చెట్ల ఆకులున్నై. ఈ ప్రాంతంలో ఏనుగు కుంభస్థలాన్ని బ్రద్దలు కొట్టిన సింహం సంచరించింది. దాని కాళ్ళకంటుకున్న రక్తపుజాడలు, ఏనుగు కుంభస్థలంలోని



ముత్యాలు కాళ్ళ గోళ్ళనుండి జారిపడ్డాయి. ఏ మృగాలు ఎక్కడున్నాయో కనిపెట్టి వాటిని వేటాడండి. పక్షుల్ని వలలు వేసి పట్టండి. చెట్లెక్కండి, అదిగో అటువైపు చూడండి, ఇదిగో ఈ శబ్దాలు వినండి, ధనుస్సులు ఎక్కుపెట్టి సంసిద్ధులు కండి, జాగరూకులై ఉండండి, వేట కుక్కలను వదలిపెట్టండి." అంటూ వారిలో వారు ఎచ్చరించుకుంటూ, జాగ్రత్తలు చెపుతూ నానా గందరగోళం చేయసాగారు. వారు చేసే కోలాహలానికి అడవి దద్దరిల్లిపోయింది.

బాణాలు తగిలిన సింహాల గర్జనలతో, మందలో నుండి తప్పిపోయి విడి పోయిన ఏనుగులు చేసే భీకర ఘీంకారాలతో, లేళ్ళను అడవి కుక్కలు పట్టి పీకగా అవయవాలు ఊడిపోయిన లేళ్ళు చేసే ఛీత్కారాలతో, కొద్దిరోజుల క్రితం కనిన బాలఖడ్గమృగములు కనపడక దుఃఖంతో ఆరాటపడే ఆడఖడ్గమృగాల ధ్వనులతోనూ ఆ అరణ్యం కంపించింది. వేటగాళ్ళు తమ ధనస్సులను చెవుల దాకా లాగి బాణాలు విసురుతున్నారు. ఆ బాణాలు విసిరే ధనుస్సుల అల్లెత్రాటి శబ్దాలు లకుముకిపిట్టల కూతల్లాగా వినబడుతున్నై వేట కుక్కలు అడవి జంతువుల్ని భయపెట్టటానికి గుర్‌గుర్‌మని శబ్దం చేస్తున్నై. ఇలా కొంతసేపు సాగిన వేట చివరికి ముగిసింది. ఇందాకటి ధ్వనులేవీ వినిపించటం లేదు. ఆ అరణ్య ప్రాంతమంతా చాలా నిశ్శబ్దంగా ఉంది. మందర పర్వతంతో చిలకటం అయిపోయిన తర్వాత పాలసముద్రంలాగా ప్రశాంతంగా ఉంది ఆ అరణ్యం.

కొంతసేపటికి నాలో భయం పోయి కుతూహలం చోటుచేసుకొంది. నా తండ్రి ఒడిలో నుండి కొంచెం బయటకు వచ్చాను. నేను మాత్రం తొఱ్ఱలోనే ఉండినా చిన్నమెడను చాపి, భయంతో కనుగ్రుడ్లు కదలుతుండగా బాల్య బాపల్యంతో ఇప్పుడిక్కడ ఏంజరుగుతోంది? అని చూడాలనే కోరికతో అడవివైపు దృష్టి సాదించాను. నాకెదురుగా వేటపూర్తి చేసుకొని సర్దుకొని ప్రయాణించి వస్తున్న శబరసైన్యాన్ని చూశాను. ఆ సైన్యం కార్తవీర్యార్జునుని

వేయి భుజములచే అడ్డగించడం చేత అటు తిరుగుతున్న నర్మదానదిలాగా ఉంది. గాలి ప్రకంపనలకు మిక్కిలి కదులుతున్న తమాల వృక్షాల అడవిలాగా ఉంది. కాళరాత్రులన్నీ ఒకచోట కుప్పపోసినట్లుంది. సూర్యకిరణములకు భయపడి ఒకచోట రాశిగా చేరిన చీకటిలాగా ఉంది. ఆ శబరులు అటు ఇటు తిరుగుతున్న యమకింకరుల్లాగా ఉన్నారు. పాతాళలోకాన్ని చీల్చుకొని పైకివచ్చిన దానవసమూహంలాగా ఉన్నారు. అశుభకర్మలన్నీ ఒకచోట సమావేశమైనట్లున్నారు. దండకారణ్యంలో నివసించే మునీశ్వరుల శాపఫలితాల్లాగా ఉన్నారు. లోగడ శూర్పణఖ నవమానించిన సందర్భంలో కోపించి రామునిపై దండెత్తి అతని బాణాలకు బలియై పోయిన ఖరదూషణాదులు మరల పిశాచరూపాలెత్తి వచ్చారేమో అనిపిస్తున్నారు. అప్పుడే బురదలో నుండి పైకి లేచివచ్చిన అడవి దున్నల్లాగా ఉన్నారు. పర్వత శిఖరములపైనున్న నల్లని మేఘాలను తమ వాడి గోళ్ళతో చీరగా నేలపైపడిన మేఘపు తునకల్లా ఉన్నారు. వారిదేహకాంతి ప్రసారం చేత ఆ అడవి ప్రాంతమంతా అంధకారమయమై పోయింది. వారు అసంఖ్యాకులై ఉన్నారు. అతిభయంకరులైన బేతాళుల సమూహంలాగా ఉన్నారు.

ఆ శబరసైన్యం మధ్యలో యౌవన ప్రారంభ దశలో ఉన్న మాతంగుడనే పేరుగల శబర సేనాపతిని నేను చూశాను. అతడు అతికఠినదేహం కలిగి ఇనుముతో చేయబడ్డ వానిలా ఉన్నాడు. భారతకాలంలో మహాధన్వి ఏకలవ్యుడులా ఉన్నాడు. అతనికింకా గట్టిగా గడ్డాలు మీసాలు మొలవలేదు. అందు వల్లనే ఆ మాతంగుడనే ఆ శబరసేనాపతి అప్పుడప్పుడే మదరేఖలు స్రవిస్తున్న ఏనుగుల రాజకుమారుడులా ఉన్నాడు. నల్లనిదేహకాంతితో వెలుగొందుతూ యమునానది నీటితో ఆ అరణ్యాన్ని నింపుతున్నవాడిలాగా ఉన్నాడు. కొద్దిగా వంకర తిరిగిన భుజాలపై పడుతున్న కేశపాశం కలవాడు. అతని నుదురు ఎత్తుగా ఉంది. బాగా ఎత్తైన బలమైనముక్కు కలవాడు. నిరంతర వ్యాయామం చేయటంచేత అతని నడుమ సన్నగా ఉంది.



ఆ మాతంగుని వద్ద భయంకరమైన వేటకుక్కలున్నై. వాటికి జూలులేదు కాని, సింహంపిల్లల్లాగా ఉన్నై, అవి అనేక ఆడులేళ్ళకు వైధవ్యం కలిగించాయి. అనేక రంగులు కలిగినవి ఆ వేటకుక్కలు.

వేట ముగించిన శబరసైనికుల వద్ద వివిధములైన అడవి వస్తువులు కానవస్తున్నై. కొందరి వద్ద చమరీమృగముల తోకలు, కొంతమందివద్ద ఏనుగు దంతములు, ఇంకొంత మంది వద్ద ఏనుగు కుంభపీఠాలనుండి సేకరించిన లావైన ముత్యాలున్నాయి. కొందరివద్ద వేటాడిన మృగాల మాంసం ఉంది. కొందరు సింహపు చర్మాలు మోస్తున్నారు. కొందరు నెమలి పింఛాల్ని సేకరించారు. ఏనుగు దంతాలు కొందరి వద్ద ఉన్నై. వారందరూ శబర సేనాపతితో కూడి ఉన్నారు. శబర సేనాపతి మాతంగుడు వింధ్య పర్వతానికి ముద్దుబిడ్డవలె ఉన్నాడు. పాపానికి తమ్మునిలాగా ఉన్నాడు. వాని పేరు మాతంగుడని తర్వాత తెలిసింది.

వారిని చూచి నాలో నేనిలా అనుకొన్నాను – “ఆహా! వీళ్ళ జీవితం ఎంతభ్రమతో కూడినది! వీరిచరిత్ర మిక్కిలి నీచమైనది. నరమాంసం కాళీ దేవికి నైవేద్యం పెట్టటం ఎంతో ధర్మం అనుకొంటున్నారు. మధుమాంసాలే వీరి ఆహారం. వేటాడమే వారికి కాయకష్టం. నక్కల కూతలే వారికి మంత్రోచ్చారణలు. గుడ్లగూబలే వీరికి మంచి చెడు శకునాలు చెప్పేవి. మంచి చెడుల గూర్చి శకునమే వారికి గల తెలివితేటలు. కుక్కలే వారికి మిత్రులు. శూన్యారణ్యాలే వారికి ఏలుబడిలోని రాజ్యాలు. పీకలదాకా మద్యం త్రాగటమే వారికి పండుగ. వేటకుపకరించే కఱకు ఖడ్గాల్లాంటివే వారినేస్త్రాలు. విషం పూయబడిన బాణాలే వారికి సహాయకారులు, బందీలుగా పట్టుకొన్న బాటసారుల భార్యలే ధర్మపత్నులు. పెద్దపులులతో చెలిమి, జంతురక్తాలతో దేవతార్చన, మాంసార్పణమే బలి సమర్పణ. చౌర్యం జీవితం. నాగమణులే అలంకారాలు. (మదించిన) వనగజముల మదమే చందనపు పూతలు.”

ఇంతలో ఎవరో శబరసేనాని మాతంగుడు విశ్రాంతిగా కూర్చునేందుకు పరిజనులు కోసుకొని వచ్చిన చిగురుటాకులతో ఆసనం ఏర్పాటు చేయగా సుఖంగా కాసేపు విశ్రాంతి తీసుకొన్నాడు. వేరొక యువకుడు అతనిదాహ శాంతికై సమీపమందున్న సరస్సునుండి శుభ్రమైన నీటిని తామర పత్రపుటాల (దొన్నెలు)తో నింపి ఆతనికిచ్చారు. సరస్సులోని తామరతూడులను బురద లేకుండా శుభ్రంగా కడిగి తెచ్చాడు. మాతంగుడు ఆ నీరు కడుపునిండా తాగాడు. ఆ తామర తూడులను చిన్నముక్కలుగా కొరికి తిన్నాడు. శ్రమతీరింది. సైనికులు కూడా ఆ సరోవర జలాలతో దాహం తీర్చుకొని బడలిక తీర్చుకొన్నారు. సేనాపతి వారందరితో కలిసి అడవిలో ఎటో వెళ్ళిపోయాడు.

## 7. వైశంపాయనుడికి పితృవియోగం

అంతా వెళ్ళిపోయారు కాని ఒక ముసలి బోయవాడు మాత్రం దిక్కులు చూస్తూ అక్కడే ఉండిపోయాడు. వాడికి మాత్రం ఏ కొంచెమూ లేడి మాంసం దొరకలేదు. ఆ బోయ వికృతాకారుడై రాక్షసుడిలా ఉన్నాడు. వాడిప్పుడు మాంసం లేకుండా ఇంటికి పోదలచలేదు. మాతంగుడు, అతని సైన్యం వెళ్ళి పోయి అంతా సద్దుమణిగే వఱకు ఆ చెట్టు క్రిందే నిలబడ్డాడు. వాడు మా ఆయుర్దాయాలను త్రాగదలచుకొన్నాడు. వాడి కళ్ళు రక్తం చుక్కల్లా ఎర్రగా కన్పడుతున్నె. వాడి కను బొమ్మలు పొగచూరినట్లుగా భయంకరమైన రంగులో ఉన్నై. వాడు తల పైకెత్తి మాగూళ్ళు ఎన్ని ఉన్నాయా అని లెక్క పెడుతున్నాడు. వాడు పక్షుల మాంసం రుచిమరిగిన డేగలాగా తోచాడు. ఆ చెట్టు పైకి ఎక్కటం ఎలాగా అని దాన్ని పరిశీలనగా చూశాడు. కరుణ వదిలిపెట్టినవాడు ఎంతటి దుష్కార్యమైనా చేస్తాడు. ఆ చెట్టు సామాన్యమైనదా? అది అనేక తాడి చెట్లు కలిపినంత మహోన్నతంగా ఉంది. దాని శిఖరం ఆకాశానికి తాకుతోందా అన్నట్లుంది. ఐనా కాని, ముసలి శబరుడు మాత్రం నిచ్చెన మెట్లపై ఎక్కినంత సునాయాసంగా చెట్టుపైకి వచ్చేశాడు. పెద్ద పక్షులన్నీ



ఉదయాన్నే ఆహారంకోసం వెళ్ళిపోగా ఇక గూళ్ళల్లో తొఱ్ఱల్లో ఱెక్కలు రాని పిల్ల పక్షులు మాత్రమే ఉన్నాయి. వాడి దృష్టి వాటిపై పడింది.

ఆ పిల్లలు కొన్ని ఱెక్కలు సరిగా రాక ఎగరలేనివిగా ఉన్నై, కొన్ని కొద్ది రోజుల క్రితమే పుట్టిన పసిగుడ్లు. అవి ఎర్రనికాంతితో ఉన్నై, ఆ పసిపిల్లలు బూరుగు చెట్టు యొక్క చిగురుటాకులా అన్నట్లున్నై. కొన్ని పిల్లలు అప్పుడప్పుడే వస్తున్న రెక్కలతో పద్మపు చిఱుఱేకుల్లా కోమలంగా ఉన్నై. కొన్ని మందార మొగ్గల్లాగా ఉన్నై. కొన్ని ఎఱ్ఱని ముక్కులు కలిగినవై కొద్దిగా వికసించిన తామర మొగ్గల్లాగా ఉన్నై. కొన్ని పిల్లలు తల నిలపలేక నన్ను చంపవద్దని తల అడ్డంగా ఊపుతున్నట్లున్నై. ఆ శబరుడు అటువంటి లేతపక్షి పిల్లలను నిర్దయుడై చెట్లనుండి ఒక్కొక్క పండూ కోసినట్లుగా గూళ్ళనుండి, తొఱ్ఱల్నించీ చేతితోలాగి పట్టుకోసాగాడు. వాటికి మెడనులిమి చంపి నేలపై పడవేయసాగాడు.

ఇటువంటి భయంకర పరిస్థితిలో నాతండ్రి హఠాత్తుగా సంభవించిన, ఎదిరింప వీలు లేని ప్రమాదాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియక, రెట్టింపైన వణుకుతో మృత్యుభయంతో కళ్ళు తేలవేసిన వాడై, దుఃఖంతో కళ్ళనుండి వేడి కన్నీరు కారుస్తూ, బేలగా దిక్కులు చూస్తూ ఉన్నాడు. భయంతో అతని నోరెండిపోయింది. పరిస్థితి నెదిరించే శక్తిలేక, బలహీనమైన తన రెక్కల మధ్యలో నన్ను దాచిపెట్టాడు. ఎలా ఎదిరించాలా అని ఆలోచిస్తున్నాడు. నాపై గల అమితప్రేమతో నన్నెలాగైనా కాపాడాలనుకొన్నాడు. కాని ఏం చెయ్యటానికి తోచటంలేదు. నన్ను కడపులో బలంగా పొదివి అలాగే ఉండిపోయాడు.

## 8. వైశంపాయనుడు ఒంటరివాడగుట

ఆ పాపిష్ఠి వృద్ధ శబరుడు కొమ్మలన్నీ కలియదిరుగుతూ మా గూటి వద్దకు వచ్చి నల్లని త్రాచుపాములాగా ఉన్న తన చేతిని తొఱ్ఱలో పెట్టాడు. ఆ

చేయి ఇంతకుముందు వేటలో అనేక అడవిపందుల్ని చంపి వాటి మాంసం బయటకు తోడేటప్పుడు అంటుకున్న దాని కొవ్వు వాసనతో జుగుప్సాకరంగా ఉంది. బాణాలు వేసేటప్పుడు అల్లెత్రాటి దెబ్బలు తగిలి కాయలు కాసిన ముంజేయి కలిగింది ఆ చేయి. యమధర్మరాజు చేతిలో ఉన్న దండంలాగా ఉందది. ఆ చేయి మా తండ్రివైపు చాపాడు. నాతండ్రి ఆ చేతిని అందినచోట్లల్లా ముక్కుతో పొడిచాడు. అయినా వాడు నాతండ్రిని పట్టుకొని మెడ నులిమి చంపి వేశాడు. నేను ఱెక్కలలోపల ఇమిడిపోవటం చేత, నాకు ఆయుర్దాయం ఇంకా మిగిలి ఉండటంచేత వాడు నన్ను గమనించలేదు. వాడు అట్లా నా తండ్రిని చంపివేసి మెడ వ్రేలాడబడి ఉన్న ఆ కళేబరాన్ని అంతెత్తు చెట్టుమీద నుండి నిర్దాక్షిణ్యంగా క్రిందపడ వేశాడు. నేనూ నాతండ్రితో పాటే క్రిందపడ్డాను. నా అదృష్టం బాగుందికనుక, గాలికి కొట్టుకొని వచ్చి ఒకచోట కుప్పగా ఉన్న ఎండుటాకుల మీదకు వచ్చిపడ్డాను నేను. అందువల్లనే నా శరీరము దెబ్బతినకుండా ఉంది. నాకు ప్రాణభయం పట్టుకుంది. ముసలి బోయవాడు చెట్టు దిగి వచ్చేలోపుగానే నేను ఎండుటాకుల రంగులో కలిసిపోయి గుర్తు పట్ట వీలులేకుండా ఉన్నాను. చనిపోయిన నా తండ్రిని వదిలిపెట్టి, అతి పాపాత్ముణ్ణై, నా తండ్రికోసం నేనూ ఆత్మార్పణ చేయవలసిన ఆ తరుణంలో భయంతో నా పిల్ల రెక్కలతో కొంచెంకొంచెం కదులుతూ, పడుతూ లేస్తూ, ముక్కుతో ముందుకు పడకుండా ఆపుకుంటూ, యముని నోటినుండి తప్పించుకొన్న వాడినై ఒక తమాలవృక్షం మొదటికి చేరుకొన్నాను. ఆ చెట్టు నేను నివాసమున్న చెట్టుకు దగ్గరలోనే ఉంది. ఆ చెట్టు శబర సుందరీమణులకు చెవి అలంకారాలుగా ఉపయోగించే చిగురుటాకుల్ని సమకూరుస్తుంది. బలరాముడు ధరించిన నల్లని బట్టలను హేళన చేస్తున్న విష్ణు శరీరచ్ఛాయ కలది.



## 9. వైశంపాయనుడు హారీతుని ద్వారా జాబాలి ఆశ్రమం చేరుట

ఆ తమాల (చీకటి చెట్టు) వృక్షం స్వచ్ఛమైన యమునానదియొక్క జలఖండాల్ని పోలి, నల్లని ఆకులతో కూడి ఉంది. వింధ్యారణ్యం జుట్టులాగా నల్లని ప్రకాశం కలది. ఆ చెట్టు పరిసరప్రాంతాలు పగటిపూట కూడా చీకట్లను వ్యాపింపజేస్తై అది ఎంత దట్టమైనదంటే – ఆ చెట్టును దాటి ఒక్క సూర్యకిరణంకూడా భూమిపై పడదు. ఆ చెట్టుక్రిందికి రాగానే నాకు నా తండ్రి ఒడి గుర్తుకు వచ్చింది.

ఇంతలో అన్ని పక్షి పిల్లల్ని చంపి, ఆ బోయముదుసలి కిందపడవేసిన వాటిని ఏరుకొని ఒక సన్నని తీగకు ముడివేసి బంధించి, వాటిని ఆకుల దొన్నెలో భద్రపరచి, సేనాపతి వెళ్ళినమార్గాన్ని అనుసరించి త్వరత్వరగా వెళ్ళిపోయాడు. తండ్రి మరణంతో కలిగిన దుఃఖంతో శుష్కించిన హృదయం కలవాణ్ణి. మిక్కిలి భయపడి, శరీరమంతా వ్యాపించిన తాపంతో బాధపడే నన్ను దాహం పీడింపసాగింది. నేను కొన్ని ఘడియలు వేచి ఉండి, ఆ పరమ కర్కోటకుడు బోయవాడు వెళ్ళి పోయాడని నిర్ణయించుకొని, కొంచెం తలను పెకెత్తి భయంగా చూడసాగాను. ఆ సమయంలో గాలికి గడ్డిపరక కదిలినప్పటికి ఆ క్రూరుడు మరల వస్తున్నాడేమోనని భావిస్తూ, ఆ చెట్టుమొదలు వదలి నీరున్న ప్రాంతానికి కదలటం ప్రారంభించాను.

ఱెక్కలు సరిగా రాకపోవటం చేత నానాపాట్లు పడుతూ, ముందుకు తూలుతూ, ముక్కుతో ఆపుకొంటూ, మాటిమాటికి అడ్డంగా పడిపోతూ, ఱెక్కలు నేలకానించి నిలదొక్కుకుంటూ, నేలమీద అంతకుముందు నడిచిన అలవాటు లేకపోవటాన అతికష్టంతో ఒక్కొక్క అడుగు వేస్తూ, బరువుగా నిట్టూరుస్తూ, ఒళ్ళంతా దుమ్ముతో నిండిపోగా నాలో నేనిట్లనుకొన్నాను.

"ఎంతటి కష్టపరిస్థితి వచ్చినా ప్రాణులు ఎలాగో ఒకలాగ బ్రతకాలనే అనుకొంటాయి. అన్ని ప్రాణులకి జీవితానికి మించిన ప్రియమైన కోరిక

వేరేదీ ఉండదు కదా! నా కిష్టుడైన నాతండ్రి మరణించినప్పటికి, నేనేమాత్రము చింతింపక బ్రతికే ఉన్నాను. ఛీ! నేనెంతనిర్దయుణ్ణి, ఎంత కఠినుణ్ణి, ఎంత కృతజ్ఞత లేనివాడిని. ఆ ప్రేమహృదయుడైన తండ్రి మరణించినా నేను మాత్రం జీవించే ఉన్నాను. నాతండ్రి నాకెంత మేలు చేశాడో – నేను మాత్రం అతనిని గూర్చి తలపటం లేదు. నా హృదయము మిక్కిలి దుర్మార్గమైనది కదా! నేను పుట్టగానే తల్లి మరణించింది. నా తండ్రి నా గూర్చి ఆ దుఃఖాన్ని దిగమ్రింగి పుట్టిన దగ్గర్నుండి నన్ను అనేక ప్రయత్నాలతో పెంచటానికి పాట్లు పడుతూ, అంత ముసలితనంలో కూడా బాధలు అనుభవిస్తూ, నాపైనున్న పుత్రవాత్సల్యంతో బాధల్ని లెక్క చేయకుండా నన్నింతవాణ్ణిగా చేసిన అతని మేలును ఒక్కసారిగా మరిచిపోయాను. ఈ నాప్రాణాలు ఎంత నీచములైనవి? తిరిగిరాని లోకాలకు ఎటో వెళ్ళిపోయిన తండ్రిని అనుసరించని ఈ ప్రాణాలెంత తుచ్ఛమైనవి? ఇంతటి దీనహీనస్థితిలో ఉన్నప్పటికి నాకీ నీళ్ళు తాగాలనే కోరిక, ప్రాణాలు కాపాడుకోవాలనే ఆశ ఎందుకు? నాలో దయాగుణం ఎంతమాత్రం లేదు కనుకనే నాకు తండ్రి మరణదుఃఖం కలగటం ల్లేదు. పైగా ప్రాణాలు కాపాడుకోవాలని ఆశ కలుగుతోంది. దాహం తీర్చుకోవాలని ఇంకా బ్రతకాలని కోరుకొంటున్నాను.

నేనప్పటికీ సరస్సుకు దూరంగానే ఉన్నాను. ఆ సరస్సులోని కలహంసల మధురధ్వనులు జలదేవత కాలి అందెల ధ్వనిలా వినబడుతోంది. బెగ్గురు పక్షుల (నీటికొంగలు) కూతలు అస్పష్టంగా వినవస్తున్నై, ఆ సరస్సులోని కమలాలనుండి వచ్చే వాసనలు కొద్దిగా మాత్రమే వస్తున్నై. ఈ రోజు పరిస్థితి నాకు దుర్భరంగా ఉంది. ఆకాశం మధ్యలో ఉన్న సూర్యుని తీవ్రమైన కిరణాలు నిప్పుసెగలాగ తగులుతూ దాహాన్ని అధికాధికం చేస్తున్నాయి. సూర్యకిరణాలకు వేడెక్కిన భూమి సలసల కాగుతున్న దుమ్ముతోనిండి కాలు పెట్ట వీలులేకుండా ఉంది. దాహబాధతో విలవిలలాడుతున్న నా శరీరావయవాలు నడవటానికి సహకరించటం లేదు. నా హృదయం పరితపిస్తోంది. కళ్ళు బైర్లు కమ్ముతున్నై నాకు చావాలని లేకపోయినా విధినాకు మరణం సంభవింపజేసేటట్లే ఉంది.



నేను ఇట్లా ఆలోచిస్తూ ఉండగా, ఆ సరస్సునకు దగ్గరలోనున్న జాబాలి అనే పేరుగల ఒక మునీంద్రుని ఆశ్రమంనుంచి, అతని కుమారుడు హారీతుడనే బాలుడు తనతోటి బాలకులతో ఆ సరస్సులో స్నానసంధ్యాదు లాచరించటానికి వచ్చాడు. అతడు సనత్కుమారునిలా సమస్త విద్యలు నేర్వటంచేత పరిశుద్ధమైన మనస్సు కలవాడు. ఆ బాలుడు రెండవ సూర్యుడిలా ప్రకాశిస్తూ తేరిపార చూడరానివాడుగా ఉన్నాడు. ఉదయ సూర్యబింబంనుంచి కొంతభాగం తీసి, మెరుపుతీగలతో కలిపి తయారు చేయబడిన అవయవాలు కలవానిలాగా ఉన్నాడు. ఆతని శరీరమంతా అగ్నిలో కాల్చబడిన స్వచ్ఛమైన బంగారు ద్రవం శరీరమంతా పూయబడిన వానిలా ఉన్నాడు. మరిగించిన ఇనుపద్రవంలాగా ఎఱ్ఱగా రాగిరంగులో ఉన్న భుజాలపై పడుతున్న కేశాలు కలిగి ఉన్నాడు. శిరస్సుపై నున్న శిఖలను పైకెత్తి ముడివేసుకొని ఖాండవవన దహన సమయంలో కపటబ్రాహ్మణ వటువు వేషంలో ఉన్న అగ్నిదేవునిలా ప్రకాశిస్తున్నాడు. తపోవన దేవతయొక్క కాలి అందెల్లాగా ఉన్న స్ఫటికాక్ష మాలికను దక్షిణ కర్ణానికి చుట్టుకొని ఉన్నాడు. సమస్త కోరికల యందు నిరాసక్తతను తెల్పుతున్నట్టుగా అతని నుదుటిమోద త్రికరణములకు గుర్తుగా భస్మత్రిపుండ్రములు ప్రకాశిస్తున్నై. ఆకాశవీధిలో ఎగురబోతున్న నీటికొంగల్లాగా, స్వర్గానికి పోయేదారిని సూచిస్తున్నట్టుగా తెల్లని పటికతో చేయబడిన కమండలం అతని ఎడమచేతిలో ఉంది. అతని ఎడమ భుజం మీదనుంచి కొత్త తామరతూడు దారాలతో పేనినట్లుగా తెల్లగా మెరుస్తున్న జందెం వేలాడుతోంది. ఆ జందెం కండపట్టని ఆతని ప్రక్కటెముకలను లెక్కపెడుతున్నట్టుగా ఉంది. అతడి కుడిచేతిలో ఆషాఢదండం ఉంది. దానికొసన దేవతార్చనకోసం కోసిన పువ్వులు ఆకు పొట్లంలో కట్టబడిన మూట ఉంది. హారీతుడు కోమలమైన నారచీర ఒంటిపై ధరించి ఉన్నాడు. నడుమువద్ద మొలత్రాడున్నది. అతని హృదయం ఎంతో దయతో నిండి ఉంది.

మహాత్ముల మనస్సులెల్లప్పుడూ ఏ కారణం లేకపోయినా మిత్రభావంతో, దయాభావంతో కూడి ఉంటాయి. అందుచేతనే హారీతుడు అట్టి దురవస్థలో ఉన్న నన్ను చూసి, తన ప్రక్కనే ఉన్న ఒక మునిబాలకునితో ఇలా అన్నాడు. "ఇది బహుశః చెట్టు మీదనుండైన జారి కిందపడి పడి ఉండవచ్చు, లేదా డేగనోటి నుండి జారి క్రింద పడిందేమో! ఇటు చూడు. బాగా ఎత్తు మీదనుండి పడటం చేతనేమో కొనప్రాణాలతో మిగిలిందై కనులు మూసుకొని, మాటిమాటికి ముందుకు పడిపోతోంది. అతికష్టం మీదగాలి పీలుస్తున్నది. మాట మాటకు తన చిన్న నోరు తెరుస్తున్నది. మెడను సరిగా నిలపలేక పోతోంది. ఇలా రా! ఇది మరణించే లోపే దీనిని చేతిలోకి తీసుకో, నీటిసమీపంలో దించు! హారీతుడు ఇట్లని నన్ను నీటిసమీపానికి తెప్పించాడు. తన చేతిలోని దండకమండలాలను ఒకచోట పెట్టినన్ను చేతిలోకి తీసుకొని, ప్రయత్నపూర్వకంగా నోరు తెరిపించి తనవ్రేలితో కొన్ని నీటిబొట్లు నాచేత త్రాగించాడు. చేతితో కాసిని నీళ్ళు తీసుకొని నా ఒంటిపై పోశాడు. నాకు మళ్ళీ కొత్తగా ప్రాణం వచ్చినట్లైంది. సరసు ఒడ్డున ఉన్న ఒక తామరాకుతో నాకు మెల్లగా గాలి వీచాడు. ఒక తామరాకు నీడలో నన్ను భద్రంగా కూర్చోబెట్టి, తాను లేచి స్నానసంధ్యాదులు తీర్చు కొన్నాడు. ప్రాణాయామం చేశాడు. పవిత్రమంత్రాలతో, ఎఱ్ఱ తామరలతో సూర్యునికి అర్ఘ్యప్రదానం చేసిలేచాడు. తడిసిన జుట్టును గట్టిగా దులుపుకొని ఆరబెట్టాడు. తెల్లగా ఉతికిన మడివస్త్రాలు తీసుకొన్నాడు. స్నానసంధ్యలు పూర్తి చేసుకొన్న మునిబాలకులతో కలసి, నన్ను చేతిలోనికి పదిలంగా తీసుకొని ఆశ్రమంవైపు నడవసాగాడు.

## 10. జాబాలి మహర్షి వద్దకు చిలుక చేరుట

ఈ విధంగా హారీతుడు నన్ను సమీపంలో ఉన్న తన తండ్రి జాబాలి ఆశ్రమానికి తీసుకొని వెళ్ళాడు. ఆ ఆశ్రమంలో అసంఖ్యాకంగా పూలచెట్లు పండ్ల చెట్లూ ఉన్నై. తాటి చెట్లు, తమాల చెట్లు, మద్దిచెట్లు, పొగడ, ఏలకులు, కొబ్బరి, లత్తుక (లద్దుగు) చెట్లు, లవంగతీగలు, మామిడి, మొ॥ పండ్ల చెట్లు



అనేకం ఉన్నాయి. ఆ వృక్షాల పువ్వులలోని మకరందాన్ని త్రాగటానికి వచ్చిన తుమ్మెదలు ఝుంకారం చేస్తున్నై. పుష్పలతలు పువ్వుల్ని వర్షిస్తున్నై. తపస్వుల కుటీరం ముందు ప్రదేశాలలో ఎండబెట్టబడిన ధాన్యపుగింజలున్నై. మునిబాలకులు ఉసిరికలు, అరటి, గజనిమ్మ, మామిడిపండ్లను పోగుచేసి భద్రపరచారు. మునిబాలకుల వేదమంత్రోచ్చారణలతో నిండి ఉందా ఆశ్రమ ప్రదేశం. ఎల్లప్పుడూ వినబడుతూ ఉండటంవలన చిలుకలు వేదమంత్రాలు వల్లిస్తున్నాయి. అక్కడి గోరువంకలు కూడా మంత్రాలు పలుకుతూ ఉన్నై. విశ్వేదేవతలకు నైవేద్యంగా పెట్టిన బలి అన్నాన్ని అక్కడున్న అడవి కోళ్ళు తింటున్నై. అక్కడ ఉన్న దిగుడు బావుల్లోని హంస పిల్లలు నివ్వరిధాన్యపు అన్నాన్ని తింటున్నై, వేళ్ళు సమీపంలో ఉన్న మునిబాలకుల శరీరాన్ని చిగురాకులాంటి నాలుకలతో నాకుతూ ఉన్నై, హోమాగ్నిలో ఆహుతిగా నీయబడుతున్న సమిధలు కాలుతూ మిసమిస అవి మోగుతున్నై, కొబ్బరికాయలు పగలకొట్టటంచేత అక్కడున్న బండలు తడిబారినై, అప్పుడే ఉతికి ఆరవేసిన నారచీరల నుండి నీళ్ళు కారి అక్కడి నేలంతా ఎఱ్ఱబారి ఉంది. సూర్యునికి మునులు అర్ఘ్యం ఇవ్వగా వదిలిన గన్నేరు పూలు అక్కడ నేలపై ఉన్నై. ఆ ఆశ్రమంలో చనువుగల కోతులు ముసలి అంధముని జనులను కర్రపట్టుకొని ఆశ్రమాన్నించి బయటకు, లోపలకు తిప్పుతున్నై మునిజనులకు కందమూల ఫలాలను నేల నుండి కొమ్ములతో త్రవ్వితీసి ఇస్తున్న దుప్పులు కనబడుతున్నై. మునిబాలకులు కొందరు అడవి పందులకోరలలో ఇరుక్కుపోయిన తామరదుంపలను వెలికిలాగుతున్నారు. అక్కడి అడవి ఏనుగులు తమతొండాలనిందా నీళ్ళు పీల్చుకొని, ఆ నీటిని అక్కడున్న మొక్కలపాదులలో పోస్తున్నై. మునులు చేసే హోమాలలో అగ్ని బాగా మండటం కోసం నెమళ్ళు తమ ఱెక్కలతో గాలిని వీస్తున్నై.

నిరంతరం నేయిపోయటంచేత భగ్గున మండే అగ్నిహోత్రాలు చేసే శబ్దాలు వినవస్తున్నై. మునులు అతిథి అభ్యాగతుల్ని ఆదరిస్తున్నారు. త్రిమూర్తుల్ని

భక్తితో ఆరాధిస్తున్నారు. ధర్మశాస్త్రాలగూర్చి ఆలోచనలు చేస్తున్నారు. విద్యాగోష్ఠులు నిర్వహిస్తున్నారు. వారు శాస్త్రచర్చలు చేస్తున్నారు. మునిభార్యలు ఆశ్రమాల ముంగిళ్ళు అలుకుతున్నారు. కొందరు యోగాభ్యాసం చేస్తున్నారు. కొందఱు తమ వస్త్రాలను ఉతుకుతున్నారు. కొందరు జపమాలలకోసం తామరగింజలను ఎండబెడుతున్నారు. మొత్తం మీద ఆ ఆశ్రమం రకరకాల కార్యకలాపాలతో నిండి సందడిగా ఉంది. అది అపర బ్రహ్మలోకమా అన్నట్లుగా ఉంది. అక్కడ చెడులక్షణాలు మచ్చుకైనా లేవు. అసత్యాలు, అక్రమాలకు తావులేదు. కోపతాపాలు, రాగద్వేషాలు వారికి చాలాదూరంలో ఉంటై.

ఆ ఆశ్రమానికి కులపతి హారీతుని తండ్రి జాబాలి మహర్షి. ఆయనవద్ద అనేకమంది యోగ తపస్సాధకులైన మునులున్నారు. చదువుకునే విద్యార్థులున్నారు. హారీతుడు వెళ్ళేసరికి ఆయన అశోకవృక్షపు తిన్నెమీద కూర్చొని ఉన్నాడు. ఆయన చుట్టూ చాలా మంది మునులు కూర్చున్నారు. అందుచే ఆయన కులపర్వతాల మధ్యలో ఉన్న మేరు పర్వతంలాగా ఉన్నాడు. త్రేతాగ్నులతో కూడిన యజ్ఞంలా ఉన్నాడు. ముదివగ్గు తెల్లబడ్డ కేశపాశాలు కలవాడు. ఆయన జరచేత (ముసలితనంచేత) పూర్తిగా ఆక్రమింపబడ్డ దేహం కలవాడు. ఆతని తలపై తెల్లబడిన జడలు కట్టుకుపోయిన కేశజాలం ఉంది. ఆ ముని ఫాలభాగాన (నుదుట) మూడు ప్రవాహాలై బయల్దేరిన గంగానదిలాగా ప్రకాశిస్తూ మూడు భస్మరేఖలున్నై. చంద్రశేఖలను తలక్రిందుగా పెట్టినట్లు, వంకరలుగా తిరిగిన కనుబొమ్మలమధ్య నిలిపిన దృష్టికలవాడైన ఉన్నాడు. ఆతని పెదవులు నిరంతరం మంత్రాక్షర జపంతో కుదులుతూ ఉన్నై. ఆతని దంతాలు తెల్లని కాంతిని వెదజల్లుతున్నై. స్వచ్ఛమైన నీటితో కూడిన గంగను బయటకు విడుస్తున్న జహ్ను మహర్షిలాగా ఉన్నాడాయన కపోలాలపై పెరిగిన జుట్టువలన ఆయన కర్ణరంధ్రాలు మూసుకొనిపోయాయి. ఆతని తెల్లని గడ్డము బాగుగా పెరిగిపోయి బొడ్డుకు తాకుతున్నది. అతని చేతిలో కదులాడుతున్న అక్షమాలిక తెల్లని స్ఫటిక ముక్కలతో కూర్చబడి సరస్వతీ చేతియందలి



అక్షమాలలాగా శోభిస్తోంది. ఆయన ధరించిన తెల్లని నారచీర పట్టువస్త్రంలా ఉంది. ఆ వస్త్రం అమృతకిరణాలతోనూ, నురుగుతోనూ కూడిన తపస్సు విద్య మొదలగు సుగుణాలు అనే దారపుపోగులతో నేశారేమో అనిపిస్తోంది. అది మానస సరోవర జలాలతో ఉతకబడినంత పవిత్రంగా, స్వచ్ఛంగా ఉంది. ఆయన సమీపంలోనే స్ఫటికాలతో తయారుచేసిన కమండలం ఉంది. అది స్వచ్ఛమైన మందాకినీజలాలతో నిండినది. రాజహంసతో కూడిన వికసించిన తెల్లకలువవలె ఉంది. ఆ జాబాలి మహర్షి స్థిరత్వంలో పర్వతం వంటివాడు. గాంభీర్యంలో సముద్రం లాంటివాడు. తేజస్సులో సూర్యునితో పోల్చదగినవాడు. శాంతత్వానికి చంద్రుడు. శరీరమంతటా భస్మపూరితమైనవాడై పరమేశ్వరునిలాగా ఉన్నాడు.

ఆ మహాముని దర్శనంచేతనే సకల పాపాలు వినాశన మొందుతాయి. ఇట్టి మహామునులు నామోచ్చారణ కూడా పాపనివారకమే. ఈయన అధిపతిగా ఉండటం చేత ఈ ఆశ్రమం ఎంతో ధన్యమైనది. ఆశ్రమమే కాదు, భూమి కవతరించిన ఈ బ్రహ్మస్వరూపుని వలన సమస్తలోకమే ధన్యమైనది. ఈ మహాత్ముని పై దృష్టినిలిపి, ఈతని దివ్య కథలను వింటూ నిత్యం కాలంగడిపే ఇక్కడి మునీశ్వరులు కూడా ఎంతో ధన్యులు, చతుర్వేదములు బ్రహ్మయందుండి ఎంత ధన్యత చెందినవో అట్లే ఈ మునీశ్వరుని నోటి యందుండి కూడా ధన్యత చెందినవి. శరత్కాలము రాగా నదులన్నీ కలుషత్వము పోయి నిర్మలత పొందినట్లే, కలికాలపాపకలుషితములైన విద్యలుకూడా ఈతని సంపర్కము చేతదోషములు లేనివై స్వచ్ఛములైనవి. భూదేవి ఇప్పటి వరకు సప్తర్షి మండల మాకాశమందే యున్నదే నాయందు లేదే అని భాధపడుచున్నది. ఈయన భూలోకమందుండుటచే భూదేవికా బాధపడవలసిన పనిలేదు. ఈ జాబాలి మహర్షి కాంతిమంతులలో అగ్రగణ్యుడు. ఈయన భూమిలో ఉండటం చేత లోకానికి ఇద్దరు సూర్యులున్నారని తోస్తుంది. ఈ మహర్షిలో కరుణరసం పొంగులెత్తుతోంది. సంసారసముద్రాన్ని దాటటానికి ఈతడు వంతెన వంటి

వాడు. సర్వవిద్యలకును ఇతడు తీర్థస్థానము లాంటివాడు. శాస్త్రాలనే రత్నాలను సానపట్టేయంత్రం లాంటివాడు. మోహమనే అంధకారాన్ని పోద్రోలే భాస్కరుని వంటివాడు. ఇట్లా నేను ఆయనను చూసి పరిపరి విధాలమనస్సులో తలంచుకొన్నాను.

నేనిలా అనుకొంటూ ఉండగానే హారీతుడు నన్ను ఆ అశోక వృక్షచ్ఛాయలో ఉంచి, తండ్రిగారి పాదాలకు అభివాదనం చేసి, తండ్రికి కొంచెం దూరంలో ఉన్న దర్భాసనంపై కూర్చున్నాడు. మునులందరూ నన్ను చూశారు. "ఈ చిలుక పిల్లను ఎక్కడి నుంచి తెచ్చావు" ? అంటూ కుతూహలంతో ప్రశ్నించారు. హారీతుడిలా అన్నాడు. "నేను స్నానానికి సరస్సువద్దకు వెళ్ళినప్పుడు ఈ చిలుక పిల్ల ఆ ప్రాంతంలో ఒక చెట్టునీడలోపడి ఉండి కనిపించింది. ఎండకు శ్రమచెందినదై వేడిగా ఉన్న దుమ్ములో పడి, చెట్టుపైనుండి పడటం చేతవ్యాకుల పడిందై, కొనప్రాణాలతో నాకు దొరికితే, నేను దాన్ని మరల చెట్టుతొఱ్ఱలో విడుద్దామనుకొన్నాను. కాని, ఆ చెట్టు మిక్కిలి ఎత్తై ఎక్క వీలులేని దవటంచేత, జాలిపడి దీనిని నేను ఇక్కడకు తెచ్చాను. దీనికి ఱెక్కలు కూడా పూర్తిగా రాలేదు. ఆకాశంలో ఎగిరిపోయే శక్తిలేనిది. అందువల్ల దీనిని కొన్ని రోజులపాటు మన ఆశ్రమవృక్షపు తొఱ్ఱలో భద్రపరచి, మనం ఏరితెచ్చిన ధాన్యపుగింజలలోనే కొన్ని దీనికి పెట్టి, పళ్ళరసాలు కొద్ది కొద్దిగా త్రాగించి, దీన్ని బ్రతికిద్దామని ఇక్కడకు తెచ్చాను. మనవంటివారికి అనాథలను కాపాడుటయే ధర్మం కదా! ఱెక్కలు పూర్తిగా వచ్చిన తర్వాత ఆకాశంలో ఎగిరే శక్తి వస్తే దాని యిచ్చ వచ్చినచోటికి అదే వెళ్ళిపోతుంది. లేదా దానికిష్టమైతే మన ఆశ్రమంలోనే మనతో పాటే ఉంటుంది". అతని వాక్యాలు విన్న జాబాలి మహర్షి కొంత కుతూహలంతో మెడతిప్పి నాపై పుణ్యజలం కురిపిస్తున్నట్లు దయతో నావంక పరీక్షగా కొంత సేపు చూశాడు.

ఆలా నావంక కాసేపు చూసిన జాబాలి మహర్షి, "వీడు తాను చేసిన అవినయానికి తగిన ఫలితం ఈవిధంగా అనుభవిస్తున్నాడు" అని పలికాడు.



ఆ మహాత్ముడు త్రికాలములు తెలిసినవాడు. దివ్యనేత్రముతో జరిగిన చరిత్ర నంతా దర్శింపగలడు. ఈయన గడచిపోయిన జన్మల వృత్తాంతాలు కూడా తెలిసినవాడు. ముందు జరగబోయే విషయాల గూర్చి కూడా చెప్పగలడు. కండ్ల ఎదుటనున్నవాని ఆయుర్దాయ సంవత్సరములు కూడ లెక్కవేసి చెప్పగలడు.

జాబాలి మాటలను విన్న మునులందరూ అతని మహిమ నెఱిగినవారే కనుక, అయ్యా! దయతో మాకు తెల్పండి. ఇత డే అవినయకార్య మొనరించాడు? ఎక్కడ చేశాడు? ఎందుకు చేశాడు? క్రిందటి జన్మలో ఇతడెవరు? ఎటువంటి అవినయ ఫలితాన్ని ఇతడిప్పుడనుభవిస్తున్నాడు? పక్షిజాతిలో ఎందుకు జన్మించాడు? ఇతని పేరేమిటి? మా కుతూహలాన్ని తొలగించండి. మీరు భగవత్స్వరూపులు. అని అడిగారు.

మునులంతా ఇలా ప్రార్థించగా జాబాలి, "ఇది చాలా పెద్దకథ. అంతేకాదు మిగుల ఆశ్చర్యకరమైనది. పగటిప్రొద్దు ఎంతోలేదు. మనకు స్నానసంధ్యాదులకు వేళౌతోంది. మీరు స్నానం, దేవతార్చనలు చెయ్యాలి కదా! ఇప్పుడు కథ చెప్పుకుంటూ ఉంటే, మన పనులకు ఆటంకం కలుగుతుంది. కాబట్టి ఇప్పుడు మీరంతా లేవండి. మీమీ పనులు పూర్తి చేసుకోండి. ప్రొద్దుతిరిగే వేళకు మీరు అల్పాహారాలు సేవించి విశ్రాంతిగా కూర్చోండి. వీడెవడో! క్రిందటి జన్మలో వీడేంచేశాడో! ఇలా చిలుకపిల్లలాగా ఎందుకు పుట్టాడో అన్నీ నేను మీకు మీకు సవిస్తరంగా చెబుతాను. మీరు దైనికకార్యాలు పూర్తి చేసుకొని, ఆహారం స్వీకరించి సేద తీర్చుకొనిరండి. ఇతని వృత్తాంతం మీకు చెబుతున్నప్పుడు ఇతడు కూడా తాను ఏదో కలలో చూచిన విధంగా తెలుసుకొంటాడు. అన్నీ గుర్తుకు వస్తాయి అంటూ లేచి తక్కిన మునులతో స్నానసంధ్యాది కార్యక్రమాలు చేశాడు. అప్పటికి పగటి కాలం అయిపోయింది.

ఇంతలోగా చంద్రోదయం అయింది. ప్రపంచమంతా తెల్లని వెన్నెల ఆహ్లాదకరంగా పరుచుకొంది. కలువలు వికసించినై ఆశ్రమమంతా చల్లగా, ప్రశాంతంగా, మనోహరంగా ఉంది. మునులంతా వారి పనులన్నీ ముగించుకొని, వచ్చి గురుపీఠం ఎదురుగా చల్లని గాలిలో, తెల్లని వెన్నెలలో కూర్చుని ఉన్నారు. హారీతుడు కూడా తయారై, నాకు ఆహారం తినిపించి, వారివద్దకు తెచ్చాడు. జాబాలిమహర్షి చల్లని వెన్నెల తగిలే ప్రదేశంలో వెదురుబెత్తాలతో అల్లినపీఠంపై ఆసీనుడై ఉన్నాడు. జాలపాదుడనే శిష్యుడు లేడి చర్మంతో తయారు చేయబడిన విసనికర్రతో నెమ్మదిగా జాబాలిమహర్షికి విసరుతున్నాడు హారీతుడతనితో ఇలా అన్నాడు – "ఓ తండ్రీ! ముని సమూహమంతా ఆశ్చర్యకరమైన ఆ కథను వినటానికి కుతూహలంతో ఎదురుచూస్తున్నారు, ఈ చిలుకపిల్లకూడా బడలిక తీర్చుకున్నది. కాన ఈతడు క్రిందటి జన్మలో ఏం చేశాడో, ముందు ముందు ఏం చేయబోతాడో అంతా వివరంగా చెప్పండి". ఆ మాటలు విన్న జాబాలి ఎదురుగా ఉన్న నావంక చూశాడు. మునులంతా ఏకాగ్రతతో ఎదురు చూస్తున్నారని గ్రహించి నెమ్మది నెమ్మదిగా ఇలా కథను వినిపించసాగాడు. ముని లందరితోపాటు నేను కూడా శ్రద్ధాసక్తులతో వినసాగాను.

## 12. జాబాలి వైశంపాయనుని పూర్వ జన్మవృత్తాంతం తెల్పుట

ఉజ్జయినీ అనే నగరం భూ, స్వర్గ, పాతాళలోకాలకు అలంకారంలాగా ఉండేది. శివుడు కైలాసంలో ఉంటూ కూడా తృప్తిలేక వేరొక నివాసం ఏర్పరచుకోవాలనే కోరికతో ఈ నగరంలో మహాకాళుడు అనే పేరుతో నివాసం ఏర్పరచుకొన్నాడనిపిస్తుంది. ఈ ఉజ్జయినీ నగరానికి చుట్టూ మిక్కిలి లోతైన అగడ్త నిర్మితమై ఉంది. దాన్ని ఆనుకొని నిర్మింపబడ్డ కైలాస శిఖరాన్ని పోలిన ప్రహరీగోడ ఉంది. ఆ నగరవీథులలో విలువైన శంఖాలు, ముత్యాలు, పగడాలు, మరకతమాణిక్యాలు రాసులుగా పోసి విక్రయిస్తూ ఉంటారు. ఆ



నగర సౌందర్యాన్ని కళ్ళారా చూద్దామనే కుతూహలంతో దేవతాగణాలు నిరంతరం తిరుగుతూ ఉంటై. ఆ నగరంలోని మేడల మిద్దెల సౌందర్యం చూసి తీరవలసిందే అష్టైశ్వర్యాలతో తులతూగే నగరమా ఉజ్జయిని అనేక పుష్పజాతులు, ఫలజాతులతో కూడిన వృక్షాలతో ఆ నగరంలోని ఉద్యానవనాలు కనుల పండుగ చేస్తే ఆ తోటలలోని అనేక పక్షిజాతుల కలకలధ్వనులతోనూ, తుమ్మెదల ఝుంకారంతోను మారు మోగుతూ ఉంటుందా నగరం. అచటి యంత్ర జలధారా గృహాలు చల్లదనాన్నిస్తుంటాయి. మదించిన నెమళ్ళు సంపూర్ణంగా పురులు విప్పి నాట్యాలాడుతూ ఉంటై. ఆ నగరంలోని సరస్సులు నిండుగా వికసించిన తామరపువ్వులతో విలసిల్లుతూ ఆ సౌందర్యాన్ని చూడాలని వచ్చిన దేవేంద్రుడా అన్నట్లు కనిపిస్తై. ఆ నగరంలో ఎల్లప్పుడూ యజ్ఞపు పొగలు వ్యాపిస్తూ ఉంటై. ఆ నగరం ఎల్లవేళలా వృద్ధి పొందుతూ ఉంటుంది. ఆ నగరంలో సమస్త భాషలు నేర్చినపండితులున్నారు.

ఆ ఉజ్జయినీ నగరంలో రాత్రివేళల్లో సుందరీమణుల ఆభరణాలలోని రత్నకాంతులు ప్రసరించటం చేత అంధకారం పటాపంచలై పోయింది. ఆ నగరంలోని మాలవకాంతల ముఖవర్చస్సుకు సిగ్గుపడుతున్న చంద్రునిలోని మచ్చలను తుడిచి బాగు చేయటానికా అన్నట్లు ధ్వజ పతాకలు రెపరెపలాడు తుంటాయి. ఆ నగర సౌధముల పైభాగాల పడుకొనిన పురసుందరీ మణులను చూచి, చంద్రుడు మదనపరవశుడై భూమిపై పడినట్లుగా అచ్చటి మణులు పొదిగిన భూములపై ప్రతిబింబిస్తూ ఉంటాడు.

## 13. తారాపీడుడు సంతానంలేక బాధచెందుట

అటువంటి సౌందర్యవంతం, సౌభాగ్యవంతం అయిన ఆనగరాన్ని తారాపీడుడనే మహారాజు పాలిస్తూ ఉన్నాడు. ఆయన ప్రజాపాలనలో నల, నహుష, యయాతి, భరత, భగీరథ చక్రవర్తులతో సమానుడు తనభుజబలంతో భూమండలమంతా ఆక్రమించుకొన్నాడు. ప్రభుశక్తి, మంత్రశక్తి, ఉత్సాహశక్తులు మూడున్నూ ఫలింపజేసుకొన్నాడు. బుద్ధిమంతుడు. రాజనీతితో మొక్కవోని

బుద్ధిచాతుర్యం కలవాడు. ధర్మశాస్త్రం నేర్చినవాడు, తేజస్సులో సూర్యుణ్ణి, కాంతిలో చంద్రుణ్ణి మించినవాడు. తన పరిపాలనలో ప్రజల కెట్టి అపాయాలూ రాకుండా కాపాడాడు. లక్ష్మీదేవి విష్ణువును వదలి అతణ్ణి ఆశ్రయించింది. సుమిత్రులతో కూడి కాలక్షేపం చేసేవాడు. అతని వద్ద అజేయమైన పెద్ద సైన్యం ఉంది. ఈయన ఆదిశేషునిలాగా సర్వభూమిని తేలికగా శిరమున మోయగలిగినవాడు. తారాపీడుడు ధర్మావతారుడు. మహావిష్ణువు లోకరక్షణకు తనకు బదులుగా పంపబడినట్లున్నాడు. (విష్ణు సమానుడు) తారాపీడుడు ప్రజల పీడలను సమూలంగా తొలగించాడు. ప్రజలను చక్కగా పరిపాలిస్తున్నాడు.

రావణుడు తన ఇరువది భుజాలతో కైలాసాన్ని పెకలించి, ఆర్భాటం చేస్తే పరమేశ్వరుడు వానిని అణచి, దాన్ని యథాస్థానంలో ఎలా ఉంచాడో, అలాగే తారాపీడుడు కలికాల పాపకర్ముల ఆగడాల చేత ధర్మం పూర్తిగా పెకలింపబడినప్పుడు తన ప్రతాపంచేత దుష్కర్ముల్ని అణచివేసి మరల లోకంలో ధర్మసంస్థాపనం చేసిన మహానుభావుడు. ఆ రాజు ఎంత సౌందర్యవంతుడంటే తనకు తపోభంగం కలిగించిన మన్మథుణ్ణి భస్మం చేసిన త్రిలోచనుడు శివుడు అతని భార్య శోకించగా జాలిపడి మన్మథసమానుడైన ఈ రాజును సృష్టి చేశాడేమోనని లోకం భావించింది. అతని పరాక్రమానికి సమస్త దిక్కుల యందున్న రాజులందరు వినయంతో అతనికి దాసులై నమస్కారాలర్పించారు.

ఆ రాజు తన భుజబలం చేత సమస్త దిక్కులు జయించాడు. చక్రవర్తిత్వాన్ని స్థిరం చేసుకొన్నాడు. అతడా చక్రవర్తి సింహాసనాన్ని దేవలోకంలోని కల్పవృక్షాన్ని దిగ్గజం ఆక్రమించుకొన్నట్లు తనవశం చేసుకొన్నాడు. సర్వదిక్కులు స్త్రీల రూపంలో వచ్చి ఆయనకు తుమ్మెదల భారం మోయలేక వణికే లతల్లాగా వినయంతో నమస్కరించారు. ఈ ఆక్రమణంతో తారాపీడునిలోనున్న శౌర్యపరాక్రమాలు కుమారస్వామి బాణాలకు క్రౌంచపర్వతం నుండి బయల్వెడలిన హంసల్లాగా ప్రకటితమైనై. మందర



పర్వతంవలన పాలసముద్రం నుండి వెలువడిన తెల్లనురుగులాగా ఉన్న ఆ రాజు కీర్తి దశదిశలా వ్యాపించి మారుమ్రోగింది.

తారాపీడుడు పక్షపాత బుద్ధిలేనివాడు. లోకులకు విశ్వసనీయుడు ఇంద్రియనిగ్రహ సంపన్నుడు. సర్వశాస్త్రపాండిత్యం కలవాడు. నీతిశాస్త్ర కోవిదుడు. పరిపాలన అనే నౌకను నడుపు నావికుడు. ఎంతటి క్లిష్ట పరిస్థితి వచ్చినా దిగులు చెందడు. ధైర్యానికి నిలయం, సత్యవాక్కులకు ఆధారం. ధర్మాచరణ కలవాడు. ధర్మం పాటించటంలో ధర్మరాజునకు సాటి సమస్త వేదధర్మాలు నేర్చినవాడు, దేవేంద్రునకు బృహస్పతిలాంటివాడు, వృషపర్వునకు శుక్రాచార్యునివంటి వాడు, దశరథునకు వసిష్ఠునివంటి వాడు, రామునకు విశ్వామిత్రునిలాంటివాడు, ధర్మరాజునకు ధౌమ్యమహర్షివంటివాడు, నలమహారాజునకు దమనకునిలాంటివాడు, మహాబ్రాహ్మణోత్తముడు 'శుకనాసుడు' అనే పేరుగల అమాత్యవరుడు అతనికి తోడునీడై మార్గదర్శకుడుగా ఉండేవాడు.

ఆ తారాపీడమహారాజు తన బాహుబలంతో సప్తద్వీపాలతో కూడిన భూమండలాన్ని జయించి శుకనాసమంత్రిపై నమ్మకముతో రాజ్యపాలన భారముంచి, ప్రజలందరిని సుఖవంతులు చేసి, సర్వకార్యములు నెరవేర్చినవాడయ్యెను, శత్రువులను గూర్చిన అనుమాన మెంతమాత్రము లేదుకావున పరిపాలనా వ్యాసంగమును వదలిపెట్టి యౌవనసుఖములనను భావించెను ఆతడు అవసరాన్ని బట్టి ప్రజలకు దర్శనమిచ్చేవాడు. అత్యవసర సమయాలలో సభాసింహాసనాసీనుడయ్యేవాడు. రాజు సుఖభోగాలలో మునిగియుండగా శుకనాసమంత్రి రాజ్యభారాన్ని అతిసులువుగా భరించేవాడు. ప్రజలుకాని, ఉద్యోగులు కాని, సామంతరాజులుగాని శూద్రకునకెంత గౌరవప్రపత్తులు చూపేవారో అట్లే శుకనాసునియందున్నూ చూపేవారు ఈ విధంగా రాజుమంత్రిపై రాజ్యభారమును మోపి తాను యౌవనసుఖాలు అనుభవిస్తున్నాడు. ఇక రుచి చూడవలసిన సుఖాలేవీ లేవు అన్నంత

హెచ్చుస్థాయిలో సుఖా లనుభవించాడు తారాపీడక మహారాజు, ఒక్క కుమారుని ముఖంచూసే అదృష్టానికి మాత్రం అతడు నోచుకోలేదు, అతడు వందల రాజుల మధ్యలో ఉన్నా ఒంటరిగా ఉన్నట్లుండేవాడు. కళ్ళున్నప్పటికీ అంధునిలా ఉన్నాడు. రాజ్యము ఉండికూడా నిరాధారునిలా ఉన్నాడు.

తారాపీడ మహారాజు పట్టపురాణి విలాసవతి. ఆమె సుగుణవతి. అన్నివిధాలా ఆయనకు ఈడు జోడుగా ఉండేది. సుందరమైన శివజటాజూటానికి చంద్రలేఖలాగా, మహావిష్ణు వక్షఃస్థలానికి కౌస్తుభమణిలాగా, బలరామునకు వనమాలాలంకారంలాగా, సముద్రానికి చెలియలికట్టలాగా, దిగ్గజానికి మదరేఖలాగా, వసంతమాసానికి పుష్ప సమృద్ధిలాగా, చెట్టుకు అల్లుకున్నలతలాగా, చంద్రునకు వెన్నెలలాగా, సరస్సునకు కమలంలాగా, ఆకాశవీధికి నక్షత్రసమూహంలాగా, మానససరస్సునకు హంసల సమూహంలాగా, మలయపర్వతానికి చందనవృక్షసముదాయం లాగా, ఆదిశేషునకు పడగలవరుసలాగా, విలాసవతి సకలాంతఃపుర స్త్రీలకు అలంకారంగా, త్రిభువనాశ్చర్యకర సౌందర్యంతో విలసిల్లుతూ ఉంది.

## 14. విలాసవతి సంతానంకోసం పరితపించుట

ఒకనాడు తారాపీడుడు ఆమెమందిరానికి వచ్చాడు. శోకంచేత మాటలురాని దాసీ జనంతో కూడుకొని, దిగులుగా కూర్చున్న విలాసవతి కనిపించింది. ఆమెకు దగ్గరలో ఉన్న అంతఃపుర వృద్ధస్త్రీలు ఆమెను ఓదారుస్తున్నారు. నిరంతరం కన్నీరు కారటంవల్ల ఆమె ధరించిన పట్టు చీర తడిసి ఉంది. ఆ స్త్రీ అలంకారాలు ధరింపలేదు. తన ముఖానికి ఎడమచేతిని ఆనించి ఏదో ఆలోచిస్తూ ఉంది. ఆమె శయనం మీద కూర్చొని ఏడుస్తూ ఉంది.

అటువంటి పరిస్థితిలో ఉన్న మహారాణిని చూని రాజు తల్లడిల్లిపోయాడు. రాజును చూడగానే విలాసవతి గౌరవార్థం లేచి నిల్చోబోయింది. కాని, రాజు



ఆమెను లేవనీయక ఆ శయ్యమీదనే కూర్చుండబెట్టాడు. తానుకూడా ఆమె ప్రక్కనే కూర్చొన్నాడు. అయితే, ఆమెకు అంత దుఃఖం ఎందుకు కలిగిందో ఏమో తెలియ లేదు. లోలోపల సంకోచపడుతూనే ఆమెకన్నీటిని తుడిచి, ఆమెతో ఇలా అన్నాడు – "దేవి? నీవెందుకు లోలోపలే మహాదుఃఖం అనుభవిస్తూ కుమిలిపోతున్నావు? నీవు అలంకారాలు ధరింపలేదేమిటి? కన్నీటి చారలతో నీ సుందరకపోలాలు మలినంగా ఉన్నాయి ఎందుకు? నీ నుదుట తిలకము దిద్దలేదేమి? కృష్ణపక్షాన చంద్రలేఖ లేని, చీకట్లు అలుముకున్న ఆకాశంలాగా నీ నీ కేశపాశం అలంకారహీనంగా ఉన్నదేమిటి? రాణీ! నాయందు దయచూపు. నీవు ఎందుకు దుఃఖిస్తున్నావో చెప్పు. నీ విషయంలోనే నేమైనా పొరపాటు చేశానా? లేక వేరే ఎవరైనా పరిజనులు అవమానించారా? ఎంత ఆలోచించినా నేను నీ విషయంలో ఏ పొరపాటు చేశానో తెలియటమే లేదు. నా ప్రాణాలు, ఈ రాజ్యం నీవి. దేవీ! ముందు నువ్వు ఎందుకు దుఃఖపడుతున్నావో చెప్పు" విలాసవతి మాత్రం రాజు ఎంత ప్రార్థించినా ఏమీ బదులు చెప్పలేదు. రాజు కారణమేమిటని దాసీల్ని అడిగాడు.

అప్పుడు రాణిని నిత్యం అంటి పెట్టుకొని ఉండే తాంబూలపు పెట్టెను మోసే దాసి, మకరిక అనే ఆమె రాజుతో ఇలా అన్నది. "రాజా! మీవలన ఏ పొరపాటు జరగలేదు. మీ రెదురుగా ఉండగా పరిజనులకు గాని వేరెవరికిగాని రాణి విషయంలో అపరాధం చెయ్యాలంటే ఎంతధైర్యం ఉండాలి? మీ అనుగ్రహంవల్ల పుత్రలాభం పొందలేకపోయాననే అని మహారాణిగారిబాధ. అంతబాధతోనే ఇంతకాలం గడిచిపోయింది. ఆ బాధతోనే ఈమె ప్రతిదినమూ చేయవలసిన స్నానభోజనాలంకారాల విషయంలో ఆసక్తిలేక దుఃఖపడుతోంది. మేమే బలవంతం చేసి ఆమె చేత ఆ పనులు చేయించవలసి వస్తోంది. మీ మనస్సు బాధపడుతుందేమోనని ఈమె తన మనోబాధను బయటకు చెప్పలేకపోతున్నది.

ఈ రోజు చతుర్దశి అవటంచేత మహాకాలదేవుని అర్చించటానికి ఆలయానికి వెళ్ళింది. అక్కడ ఒకపౌరాణికుడు మహాభారత ప్రవచనం చేస్తూ

పుత్రులు లేనివారికి పుణ్యలోకాలు ఉండవని, పున్నామనరకం నుండి తరింపజేసేవాడు పుత్రుడని వివరిస్తున్నాడు. రాణి ఆ పలుకులు విని గుడి నుండి ఇంటికి వచ్చిన దగ్గరనుండి లోలోన కుమిలిపోతోంది. మేమెంత ప్రార్థించిన ఒక్క మెతుకుకూడా ముట్టలేదు. అలంకారాలు ధరించటములేదు. బదులు పల్కటంలేదు. సంతతం కన్నీటిధారలు కారుస్తూ, వాడిపోయిన ముఖంతో దుఃఖిస్తూ ఉన్నది మహారాజా! ఉన్న విషయం చెప్పాను. ఆ తర్వాత దేవరవారి చిత్తం." ఆమె ఇలా మాట్లాడి మౌనం వహించింది. ఆ మాటలు విన్న తారాపీడ మహారాజు కాస్సేపు మౌనంగా ఉన్నాడు. దీర్ఘంగా నిట్టూర్పు వదిలి, "దేవి! దైవాధీనమైన విషయంలో మనం ఏం చేయగలం? ఇంక దుఃఖించవద్దు, బహుశా మనకు దైవానుగ్రహం లేదనుకొంటాను. కొడుకును మనసార కౌగిలించుకొని సుఖపడే యోగ్యత మనకు లేదేమో! ఏ జన్మలో ఏ పాపం చేశామో! ఏ జన్మలోనో చేసిన కర్మఫలం ఈ జన్మలో అనుభవించవలసి ఉంటుందంటారు కదా! ఎంత పండితుడైనా దైవ నిర్ణయానిక వ్యతిరేకంగా ఏమీ చేయ వీలుపడదు. మానవులుగా మనం చేయదగినదంతా చేద్దాం.

దేవీ! గురువులయందు ఇంకా అధికమైన భక్తి కలిగియుండు. దైవారాధన యందు శ్రద్ధను రెట్టింపు చెయ్యి. ఆదరభావంతో ఋషిజనన పరిచర్య గావించు, ప్రయత్నపూర్వకంగా శ్రద్ధా సక్తులతో ఆరాధిస్తే ఋషులు ఎంత దుర్లభమైన వరాలైనా ప్రసాదించి మనకోర్కె తీర్చగలరు. ఇందుకు నిదర్శనంగా పురాణ సంఘటనలు చాలా ఉన్నై. పూర్వం మగధాధిపతి బృహద్రథుడు చండకౌశికుని దయతో శ్రీకృష్ణుని కూడా జయింపగల బలం కలిగిన జరాసంధుని పుత్రుడుగా పొందినాడు. దశరథుడు వృద్ధాప్యంలో విభాండక మహర్షి కుమారుడైన ఋష్యశృంగుని దయతో నారాయణుని చతుర్భుజాలవంటి నల్గురు కుమారుల్ని పొందాడు. ఇలాగే ఇంకా చాలామంది తమ అభీష్టాలు నెరవేర్చుకొని సంతానవంతులయ్యారు. మహామునులకు చేసే సేవ ఎన్నటికి వృథాకాదు. దేవీ నాకు మాత్రం పుత్రునిపై అభిలాష లేదా? నిండుగర్భిణివై పౌర్ణమినాటి



రాత్రివలె నున్న నిన్నెప్పుడు చూస్తానా అని ఉవ్విళ్ళూరుతున్నాను. నా సేవకులు నాకు కుమారుడు జన్మించాడనే శుభవార్త వినిపించి, రాజునని కూడా చూడకుండా నావంటిపైనున్న అలంకారాలు బలవంతంగా ఎప్పుడు లాక్కుంటారో గదా! అని ఎదురుచూస్తున్నాను. నాదేవి పసుపుబట్టలతో కుమారుని బళ్ళోపెట్టుకొని ఉదయసూర్యునితో కూడిన ఆకాశంలాగా ఎప్పుడునన్ను సంతోషపెడతుందా అని నేను ప్రతీక్షిస్తున్నాను తెలుసా! బోసినవ్వులొలకపోసే కుమారుని నేనెప్పుడు చూస్తానా అని ఎంత ఉవ్విళ్ళూరుతున్నానో! మెడలో కట్టబడిన రక్షా యంత్రంతో అంతఃపుర స్త్రీల చేతులలో క్షణంక్షణం మారుతూ, అందరి నమస్కారాలు అందుకుంటూ, నా యింట మంగళదీపంలాగా నాకంటి చీకటిని ఎప్పుడు పోగొడతాడా అని ఎదురుచూస్తున్నాను. నా యింటా బయటా శరీరమంతా దుమ్ము నిండిన బాలుడు ఆటపాటలతో ఎప్పుడు తిరుగుతాడా అని ఆశతో చూస్తున్నాను. అంతఃపురంలో కాలి అందెలశబ్దాలను అనుసరించి నడుస్తున్న రాజహంసల్ని పట్టుకోవటానికి పరుగెడుతున్న నా కుమారుని మొలనూలి గంటల శబ్దాన్నిబట్టి పిల్లవానిని పట్టుకోలేక ఆయాసపడుతున్న దాదిని ఎప్పుడు చూస్తానా! అని ఎదురుచూస్తున్నాను.

దేవీ! ఇటువంటి కోరికలతో ఆలోచనలో మునిగి తపించుతూ ఎన్ని రాత్రులు గడిపానో తెలుసా! సంతానహీనత అనే అగ్ని నిన్నే కాదు నన్ను కూడా ప్రతిక్షణం దహిస్తూనే ఉంది. పసివాడు లేని ఈ లోకం అన్నీ ఉన్నా నాకు ఏమీ లేనిదానిలా గానే ఉంది. రాజ్యం ఉందికాని దానివల్ల ఏం లాభం? విధి నా కెదురు తిరుగుతూ ఉంటే నేనేం చేయగలను? కాబట్టి నీవిక ఈ దుఃఖాన్ని వదిలివేయి. మనస్సులో ధైర్యాన్ని నింపుకో ధర్మపరాయణుల సన్నిధిలో సంచరించేవారికి సమస్తమంగళాలు కలుగుతై" అని రాజు ఇట్లు పలికి, తానే చల్లని నీరు తెచ్చి, రాణిముఖాన్ని అలుముకున్న కన్నీటి చారలను తుడిచాడు. ఆమెను తియ్యని మాటలతో, శోకాన్ని పోగొట్టే ధర్మోపదేశాలతో అలరించి,

ఓదార్చి చాలాసేపక్కడే ఉండి తన భవనానికి వెళ్ళిపోయాడు. భర్త వెళ్ళిన తర్వాత దుఃఖం నుంచి తేరుకొన్న విలాసవతి నెమ్మదిగా లేచి వస్త్రాలంకారాలను ధరించి, మామూలుగా గడిపింది.

రాజు చెప్పిన ప్రకారంగా రాణి విలాసవతి దైవబ్రాహ్మణ మునిజన ఆరాధనల యందు మనస్సు లగ్నం చేసింది. గర్భం ధరించటానికి ఎవరేం చెప్పినా అది చేసింది. ఆ వ్రతదీక్షలవల్ల ఆమెకెంత శ్రమ కలిగినా ఆమె లెక్క చేయలేదు. వ్రతనియమము ధరించినదై చండికాలయాలలో గుప్పున పొగలు చిమ్ము గుగ్గిలపు ధూపముల చెంత తెల్లనివస్త్రాలు ధరించి శుచిస్నానమొనర్చి ఉపవసించినది. పచ్చని దర్భలపై పరచబడిన రోకళ్ళపై శయనించింది. పుణ్యజలములతో నింపబడిన సువర్ణకుంభాలలో వివిధములైన పూలు, పండ్లు కలిసినట్టి, క్షీరవృక్షపు చిగురుటాకులతో కలసినట్టి జలములతో గోమాతల క్రిందకూర్చొని స్నానములు చేసింది. ప్రతిరోజు ఉదయాన రత్నములతో కూడిన నువ్వుల పాత్రలను బ్రాహ్మణులకు దానమిచ్చినది. ప్రసిద్ధ సర్పరాజులకు నిలయములైన మహాసరస్సులలో స్నానమాడింది. పూజార్హమైన జమ్మి, రావిమొదలగు పుణ్యవృక్షములకు ప్రదక్షిణమాచరించింది. తన చేతి సువర్ణకంకణములు కదులాడుచుండగా తానే స్వయముగా వండి అన్నమును పెరుగుతో కలిపి, వెండి పాత్రలతో సిద్ధమొనరించి, పితృదేవతా స్వరూపులైన కాకులకు నివేదించింది. దుర్గాదేవికి అనంతమైన ఫలపుష్పములతో, అగరు ధూపాలతో, వివిధ భక్ష్యములతో, మాంసాహారములతో, పాయసముతో బలిని సమర్పిస్తూ ప్రతి నిత్యం దుర్గాదేవిని సేవించింది. సోది చెప్పు స్త్రీల వాక్యములు విని వారిని గౌరవించింది. శకునము లడిగింది. ఈవిధంగా ఎవరు ఏ ఉపాయం చెపితే అలా ఆచరించింది.

## 15. విలాసవతి గర్భవతి అగుట

ఇలా కొంతకాలంపాటు విలాసవతి సంతానంకోసం కఠోరనియమాలు పాటిస్తూ గడిపింది. ఒక రోజున తెల్లవారు జామున తారాపీడ మహారాజుకు



కలవచ్చింది. ఆ కలలో విలాసవతి నోటిలోనికి చంద్రబింబం ప్రవేశించినట్లు కనిపించింది. రాజు నిద్ర మేల్కొని మిక్కిలి సంతోషించి, అప్పటికప్పుడు మంత్రి శుకనాసుని రమ్మని కబురు చేశాడు. ఆయనతో ఈ స్వప్నవృత్తాంతం వివరించాడు. శుకనాసుడు అది విని సంతోషించి, రాజుతో, “ప్రభూ! ఇంతకాలానికి మీయొక్క, నాయొక్క, ప్రజలయొక్క కోరికలు తీరే సమయం వచ్చింది. మీకు అనుమానం అక్కరలేదు. తమరు కొద్దికాలంలోనే కుమారుని ముద్దు మొగాన్ని చూసిన ఆనందం అనుభవిస్తారు, రాజా! నాకు కూడా ఈ రోజు తెల్లవారు జామున కలవచ్చింది ఆ కలలో తెల్లని వస్త్రములు ధరించి, శాంతమూర్తియై, దివ్యాకారము కలిగిన ఒకబ్రాహ్మణుడు చంద్రకళలాగా వికసించిన తెల్లనిరేకులు కల, మధువు స్రవిస్తున్న వేయిరేకులు గల పుండరీకాన్ని (తెల్లతామరపువ్వు) తెచ్చి మనోరమాదేవి ఒడిలో వేసినట్లుగా కనిపించింది. ఇటువంటి స్వప్నాలు ముందు రాబోవునట్టి శుభాలకు సంకేతాలు. మనకింతకంటే సంతోషకరమైన విషయం వేరే ఏమున్నది? విలాసవతీ దేవి కొద్దికాలంలోనే సకలరాజర్షికులానికి అలంకారంవంటి కుమారుని కనబోతున్నది. శరత్కాల కమలంవల్ల మదగజం సంతోషించినట్లుగా ఆ కుమారుని చేత మీరు సంతోషిస్తారు. ఈ స్వప్నంవల్ల మహారాణి సంతానక్రమం ఆగని విధంగా, సమస్త భూభారాన్ని సులువుగా మోయగల సత్సంతానం కలుగుతుందని తెలుస్తున్నది” అని అతనితో పలికాడు.

కొన్ని రోజులకు రాణి గర్భనిర్ధారణ జరిగింది. పారిజాతవృక్షం వల్ల నందనవనంలాగా, కౌస్తుభమణిచేత విష్ణు వక్షఃస్థలంలాగా, గర్భధారణ చేత విలాసవతి మిక్కిలి ప్రకాశించింది. ఆమె గర్భం క్రమంగా వృద్ధి కాసాగింది. సముద్రజలాన్ని నిండిగా త్రాగిన మేఘమాలలాగా విలాసవతి నెమ్మది నెమ్మదిగా నడుస్తోంది. అంతఃపుర ప్రధాన సేవకురాలు, రాజకులంలో, పద్ధతులు బాగా తెలిసినది, రాజువద్ద చనువుగా మసలగలిగిన కులవర్ధన' అను ప్రధాన పరిచారిక ఈ శుభవార్తను రాజునకు తెలియజెప్పటానికి

మంచిముహూర్తాన రాజాస్థానానికి వచ్చింది. తారాపీడుడు అప్పుడు కొద్దిమంది సామంతరాజులతో సమావేశమై ఉన్నాడు. ఆ రాజు నక్షత్రాలమధ్య నిండు పున్నమజాబిల్లిలాగా ప్రకాశిస్తున్నాడు. ఆదిశేషుని రత్నకాంతులు విరజిమ్మే వేయిపడగల మధ్యనున్న నారాయణునిలాగా ఉన్నాడు. ఆయన సమీపంలో పరిజనులు నిలబడియున్నారు. ఆయన ప్రక్కనే శుకనాసమంత్రి ఆసీనుడై ఉన్నాడు. రాజు శుకనాసునితో ఏదో ప్రధాన విషయాలు చర్చించుతూ ఉన్నాడు. 'కులవర్ధన' వీలు చూసుకొని రాజును సమీపించి వినయంతో వంగి ఆయన చెవిలో విలాసవతి గర్భవతియైన విషయాన్ని చెప్పింది.

ఆ వార్త వినగానే తారాపీడుడు మిక్కిలి సంతోషించాడు. ఒళ్ళు గగుర్పొడిచింది. నవ్వుతో ముఖం పద్మంలా వికసించింది. ఆనందాశ్రువులు కన్నులనుండి జలజలా కారుతుండగా ఆయన శుకనాసుని వంక చూశాడు. శుకనాసుడు కూడా రాజు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బవటం, కులవర్ధన నవ్వుముఖంతో రావటం, ఆ విషయం గూర్చి నిరంతరం ఆలోచిస్తూ ఉండటం చేత, కులవర్ధన రాజుకు ఏం చెప్పిందో తనకు తెలియకపోయినా వెంటనే గుర్తించాడు. వెంటనే లేచి రాజువద్దకు వచ్చాడు. "రాజా! కలలోని వృత్తాంతం సత్యమే కదా! కులవర్ధన సంతోషం పట్టలేకపోతోంది. ఆమె మీ చెవిలో వినిపించిన వార్త వలన మీ కనులు వికసించిన నల్లకలువరేకుల్లా కళకళలాడటం చేత ఆ సంతోషవార్త ఏమిటో వినాలని నాకూ కుతూహలంగా ఉంది. ప్రభూ! ఆ వార్త ఏమో నాక్కూడా చెప్తుతారా?" అని అడగగా, రాజునవ్వి, "మీరు స్వప్నంగూర్చి చెప్పిన విషయం సత్యమే. మీరన్నట్లే జరిగింది. మనకంత అదృష్టమా! అని నేను మొదట నమ్మలేదు. ఇంత హితమైన విషయాలు వినేందుకు యోగ్యులం కాదనిపించింది. కులవర్ధన అసత్యం పలకదని నాకు తెలిసి ఉండికూడా నా దురదృష్టం తల్చుకొని ఆమె మాటలు నమ్మలేకపోతున్నాను. సరే పదండి. రాణివద్దకే పోయి గర్భవృత్తాంతం సత్యమా కాదా అని తేల్చుకుందాం" అని పలికి లేచాడు. రాజులకు సెలవిచ్చి, తన దేహాలంకారాలన్నీ తీసి కులవర్ధనకు బహుమతిగా యిచ్చి, ఆమె కృతజ్ఞతాభివందనాన్ని అంగీకరించి, శుకనాసుని వెంటపెట్టుకొని, సంతోషభరాన్ని సహింపలేక తొందరగా అడుగులు వేస్తూ, కుడి కన్ను శుభాన్ని సూచిస్తూ అదురుతుండగా, కొద్దిమంది పరివారంతో అనేకద్వారాలు దాటుకొంటూ రాణి విలాసవతి భవనం చేరుకొన్నాడు.



శుకనాసునితో కూడి తారాపీడుడు అంతఃపురంలోనున్న శయనం మీద ఉన్న విలాసవతిని చూశాడు. ఆ భవనం దుష్టగ్రహాలు దరిచేరరాని రక్షాసంవిధానంతోకూడి ఉన్నది. కొత్తగా పూయబడిన సున్నంతో తెల్లగా ఉన్నది. మంగళకర దీపాలు ప్రకాశిస్తున్నై. ద్వార సమీపంలో రక్షాకలశాలున్నై, గోడలపై మంగళకర చిత్రాలు కొత్తగా గీయబడి ఉన్నై. మణిదీపాలు చీకట్లను పారద్రోలుతున్నై. ఆమె కూర్చున్న శయనం తలవైపున సుఖనిద్ర పట్టటానికి మంగళ కలశాలు పెట్టారు. మంత్రాక్షరాలతో కూర్చబడిన యంత్రపు రేకులున్నై. ఆ భవనమంతటా తెల్లావాలు మంత్ర పూతమైనవి చల్లారు. సులభంగా పాన్పుమీదకు చేరటానికి వీలుగా కొంచెం ఎత్తైన పాదపీఠం పెట్టారు. తెల్లని చాందినీ మేల్కట్టుగా తెల్లని పట్టువస్త్రం శయనంపైన (పందిరిలాగా) కట్టారు, ఏ సమయంలోనూ సహాయంగా ఉండటానికి అనుభవం కలిగిన అంతఃపుర వృద్ధ స్త్రీలు ఆమెను కనిపెట్టుకొని ఉన్నారు. చుట్టూ దాసదాసీజనులు కూర్చొనియుండగా విలాసవతి ఆ శయ్యపై ఉంది. మంత్రితోకూడి వచ్చిన భర్తను చూడగానే గౌరవార్థం విలాసవతి లేవబోతుండగా రాజు ఆమెను నివారించాడు. తానున్నూ ఆదరంతో ఆ మంచంమీదనే ఆమెప్రక్కనే కూర్చొన్నాడు. మంత్రి శుకనాసుడు కూడా ఆ శయ్యకు సమీపంలో ఉన్న బంగారుకోళ్ళు కలిగిన పీఠంమీద ఆసీనుడయ్యాడు. విలాసవతి వంక పరీక్షగా చూసి తారాపీడుడు ఆమె గర్భవతియే అని నిశ్చయించుకొన్నాడు. ఆయన నవ్వుతూ, 'దేవీ! మన మంత్రి శుకనాసుడు, కులవర్ధన చెప్పిన మాట నిజమేనా?' అని అడుగుతున్నాడు. అది యథార్థమేనా! అని ప్రశ్నించాడు.

అందరి ముందు అట్లా రాజు ప్రశ్నించగా రాణి సిగ్గుతో తలవంచి ఏమీ పలుకలేకపోయింది. రాజు వదలకుండా మరలమరల అడగటంతో 'నన్నెందుకు ఇబ్బంది పెడుతున్నారు. నాకేమీ తెలియదు' అని రాజువంక ఓరగా చూస్తూ ఉండిపోయింది. దాంతో అసలు విషయం అర్థమైంది రాజుకు. ఆయన ముఖం నవ్వుల వెన్నెలతో వెలిగిపోతోంది. "సుందరీ! నీకేమీ తెలియదని అన్నా నీలో కనపడుతున్న గర్భచిహ్నాల్ని ఎలా దాచగలవు? నీపయోధరములు నలుపువర్ణం కలిగి ఉన్నాయి. నీ గర్భం కృశత్వాన్ని వదిలి గురుత్వాన్ని పొందుతోంది! అని పరిహాసంగా పల్కుతున్న రాజుతో, మంత్రి, "ప్రభూ! రాణిని మీరెందుకింత ఇబ్బంది పెడుతున్నారు? ఈ ప్రస్తావన ఆమెకు సిగ్గు కలిగిస్తోంది. ఆ కులవర్ధన చెప్పిన ఆ వృత్తాంతాన్ని ఇంతటితో వదలి వేయండి" అని సమాధానపరచాడు. ఇలాగే కాసేపు ఇష్టాగోష్ఠి సలిపి మంత్రి శుకనాసుడు తన యింటికి వెళ్ళాడు. రాజు ఆ రాత్రి అక్కడే ఆమెతోటే గడిపాడు.

## 16. మహారాణి చక్రవర్తి లక్షణాలు గల కుమారుని కనుట

ఈ విధంగా విలాసవతికి నవమాసాలు నిండిపోయినాయి. ప్రసవ సమయం దగ్గరపడింది. ఒక ప్రశస్తలగ్నంలో సకలలోకానందకరుడైన కుమారుని కన్నది. అంతఃపురమంతా సందడితో నిండిపోయింది. వివిధ పనులమీద పరిజనులు ఉరుకులు పరుగులు పెడుతూ తిరుగుతున్నారు. వారి ఆభరణాల ధ్వనులతో ఆ ప్రాంతం మారుమోగుతోంది. నగరంలోనూ, రాజభవనాల్లోనూ వారు వీరు అనే తేడాలేకుండా సమస్తజనులు ఆ వార్తవిని సంతోషంతో నృత్యాలు చేయసాగారు. వివిధ మంగళవాయిద్యాల ధ్వనితో ఆ నగరం దద్దరిల్లింది. చంద్రకిరణాలతోపాటుగా దినదినం వృద్ధి చెందే సముద్రంలాగా రాజకుమారుని జన్మవార్త వలన పౌరులుచేసే కోలాహలం వృద్ధి పొందసాగింది.



మహారాజు సంతోషానికి అవధులే లేవు. కుమారుని ముద్దుగారే ముఖాన్ని చూడాలనే మహా కుతూహలం కలవాడైనా తారాపీడుడు సమయంకోసం వేచి ఉన్నాడు. జ్యోతిశ్శాస్త్ర పండితులు నిర్ణయించిన శుభముహూర్తాన, పరిజనులను దూరంగా ఉంచి శుకనాసుని మాత్రం తోడు తీసికొని మణులతో కూడిన మంగళకలశములతో పురోహితులు స్వాగతం పలకగా అనేకద్వారాలు దాటి ప్రసూతిగృహం వద్దకు వచ్చాడు. ప్రసూతిగృహం ద్వారం వద్ద బంగారపు నాగలి, బంగారు రోకలి ఉంచారు. పుష్పమాలికలతో అంతటా అలంకరించారు. లేతగడ్డి పరకలు తోరణాలుగా వ్రేలాడదీశారు. పులి చర్మం వ్రేలాడదీశారు. నేతితో తడిపిన పాముకుబుసాలను అగ్నిలో నిరంతరం వ్రేల్చారు. బ్రాహ్మణులు వేదమంత్రాలు చదువుతూ, సూతికాగృహం అంతటా పవిత్ర శాంతిజలాలను చల్లారు. పురిటి సందర్భంలో పాడవలసిన మంగళగీతాలను వృద్ధస్త్రీలు ఆలపిస్తున్నారు. వేదపండితులు స్వస్తి వాక్యాలుచ్చరిస్తున్నారు. అసంఖ్యాకంగా మంకళకరమైన పుష్పమాలికలను వ్రేలాడదీశారు. కొంతమంది పండితులు నిరంతరంగా విష్ణు నామస్మరణ చేస్తున్నారు. మంగళకర దీపమాలికలు వెలిగించారు.

తారాపీడ మహారాజు మంత్రితో కూడి కరచరణాదులు కడిగికొని, నీటిని ఆచమించి, అగ్నిని తాకి, ప్రసూతిగృహంలోకి ప్రవేశించాడు. ప్రసవంచేత తెల్లబారిన దేహంతో, ఒడిలో పసిబాలుని పడుకొనబెట్టుకొన్న భార్యవంక చూచాడు. ఒడిలోని బాలుడు తన దేహకాంతిచేత గృహదీపికలను మించిన ప్రకాశంతో కూడి ఉన్నాడనిపిస్తోంది. గర్భగోళంనుండి అప్పుడే జన్మించిన ఆ బాలుడు ఎర్రని దేహకాంతి చేత అప్పుడే ఉదయిస్తున్న సూర్యబింబంలాగా ఉన్నాడు. పశ్చిమదిక్కున ఉదయింపబోయే చంద్రబింబంలాగా ఉన్నాడు. ఆతని ప్రతి అవయవమూ పద్మరాగ కాంతిలాగ, చిగురుటాకుల శోభలాగా, తామరపూవుల సమూహంలాగా ప్రకాశిస్తున్నది. ఆ బాలునిలో సర్వచక్రవర్తి లక్షణాలు గోచరిస్తున్నాయి. ఈ బాలుడు భవిష్యత్తులో తనను ఏలుకుంటాడని

సంతోషపడుతున్నది రాజ్యలక్ష్మి. తారాపీడుడు కుమారుని సుందరమైన ఆకారవిశేషాలను ఆనందబాష్పాలు కన్నులనుండి స్రవిస్తూ ఉండగా, రెప్పలార్పకుండా చూస్తూ ఉండిపోయాడు. ఆయన కుమారుని స్నిగ్ధమనోహర సౌందర్యరసాన్ని నేత్రాలతో త్రాగసాగాడు. అతనికి ఒక్కసారిగా వేయి కోర్కెలు నెరవేరినట్లుగా తోచింది. తనను తాను ధన్యుడైనట్లుగా భావించాడు. శుకనాస మహామాత్యుడు కూడా సంతృప్తి నిండిన ముఖంతో రాజుతో ఇలా అన్నాడు– "రాజా! ఈ బాలుడిప్పటి వఱకు తల్లి గర్భకుహరంలో ముడుచుకొని అవయాలు కలవాడైనప్పటికి, అతని చక్రవర్తి లక్షణాలు బయటపడుతూనే ఉన్నై చూశారా! సంధ్యారాగ కాంతులతో బాలచంద్రుని (పాడ్యమినాటి చంద్రుని)వంటి కనుబొమల మధ్య ప్రదేశంలో సన్నని వెంట్రుకల వరస కనపడుతున్నది. ఇతని తామరరేకుల వంటి విశాల నేత్రాలు ఈ భవనశోభను అధికం చేస్తున్నాయి. వికసిస్తున్న పద్మంయొక్క సువాసనను పీల్చటానికా అన్నట్లు బారుగా బంగారుతీగలాగా ఉన్నది ఈ నాసిక. ఎఱ్ఱ తామరపువ్వులవలెనున్న అరచేతులు కలిగి శంఖచక్ర చిహ్నములు గల మహేంద్రుని చేతులను పోలియున్నవి బాలుని కరములు. కొత్తగా పుట్టిన కల్పతురువుయొక్క చిగురుటాకులాగా కోమలములై, ధ్వజ, రథతురగ, ఛత్రకమలములయొక్క చిహ్నాలతో కూడిన వీతని పాదాలు. అవి సమస్త సామంతరాజుల శిరముల కలంకరించుకొన్న కిరీటములలోని రత్నకాంతులతో ముద్దులు పెట్టుకో తగినట్లున్నాయి. ఈ బాలుని రోదన ధ్వని దుందుభిధ్వనివలె కడు గంభీరంగా ఉంది. "శుకనాస మహామంత్రి ఇలా అంటూ ఉండగానే అక్కడ ద్వారప్రదేశంలో గుంపుగూడిన రాజులను ప్రక్కకు తొలగించుకొనుచు సంతోషంతో వికసించిన ముఖంతో 'మంగళకు'డనే వార్తాహరుడు రాజుపాదములపైబడి నమస్కరించి, "దేవా! మీరభివృద్ధి పొందెదరు గాక! మీ శత్రువులు నశించెదరు. దీర్ఘకాలము జీవింతురు గాక! తమ అనుగ్రహముతో శుకనాసుల వారికి ప్రథమభార్యకు మనోరమాదేవికి రేణుకాదేవి గర్భాన పరశురాముడు జన్మించినట్లు బాలుడు జన్మించాడు. ఇకపై మహాప్రభువుల దయ" అంటూ నివేదించాడు.



తారాపీడుడు ఆ మాటలను అమృతవర్షంతో సమానంగా భావించి, సంతోషంతో వికసించిన నేత్రాలతో, "ఆహా! ఏమి ఈ మంగళప్రద వార్తలు వరుసగా వినపడుతున్నవి. కష్టాలైనా సుఖాలైనా ఒకదానిపై ఒకటి వస్తుంటాయని పెద్దల వాక్యము సత్యమే! ఇప్పటిదాకా కష్టసుఖాలను సమంగా కలిసి అనుభవించినట్లుగానే ఇప్పుడు సంతానసుఖం కూడా ఇరువురం సమంగానే అనుభవిస్తున్నాం" అని పలుకుతూ బాలెంతరాలిని చూచేందుకు, బాలుని తొందరగా చూడాలనే తలంపుతో మంత్రితోపాటు మనోరమా మందిరానికి బయలుదేరాడు. ఈ శుభవార్త చెవిని వేసిన మంగళకుడనే వార్తాహరునికి సంతోషంతో బహుమతులిచ్చాడు. తారాపీడుడు మంత్రిగారి భుజంపైనున్న కండువాను స్వయంగా లాక్కొన్నాడు బహుమతిగా.

రాజు మంత్రితో కూడి నృత్యగీతాదులతో కోలాహలంగా ఉన్న మంత్రిభవనంలో మరింత మంగళోత్సవాలు జరిపించాడు. మంత్రి శుకనాసునకు కుమారుని ముఖం చూడాలని కుతూహలం ఎంత ఉన్నప్పటికి మంచి ముహూర్తం కొఱకు వేచి ఉన్నాడు. పదియవరోజున బ్రాహ్మణులకు వేలకొలది పాడి ఆవులను, బంగారాన్ని దానం చేశాడు.

తారాపీడుడు పదోరోజు రాగానే బ్రాహ్మణులకు ఘనంగా గోదాన, భూదాన, సువర్ణదానాలు చేసి, రాణిగారి నోటిలోనికి చంద్రుడు ప్రవేశించినట్లు కలగన్నాడు కనుక ఆ బాలునికి 'చంద్రాపీడుడు' అని పేరుంచాడు. మరునాడు మంత్రి శుకనాసుడు కూడా బ్రాహ్మణ సంప్రదాయాన్ననుసరించి సర్వమంగళకార్యాలు ముగించి, రాజానుమతితో తన కుమారునకు 'వైశంపాయనుడు' అను పేరుంచెను.

చంద్రాపీడుడు క్రమక్రమంగా చంద్రునిలాగానే పెరిగి బాల్యదశ దాటాడు. మహారాజు కుమారుని విద్యాభ్యాసంకోసం చక్కని విద్యామందిరం కట్టించాడు. అది నగరానికి దూరంగా సిప్రానది ఒడ్డున విశాలమైన భూమిలో నిర్మితమైంది.

ఇతరులు దానిలోనికి ప్రవేశింప వీల్లేని విధంగా దానిచుట్టూ హిమాలయ పర్వతాలంత ఎత్తుగా ప్రాకారం కట్టబడింది. ప్రాకారాన్ని ఆనుకొని లోతైన కందకం త్రవ్వించాడు. దానికి దృఢమైన చెక్కలతో నిర్మింపబడిన ఒకే ఒక ద్వారం ఉంది. అది దాదాపు ఎప్పుడూ మూసే ఉంటుంది. అదే ప్రాంతంలో వ్యాయామశాల నేర్పరచారు. ఆ విద్యాలయం దేవాలయంలాగా పవిత్రమైంది.

## 17. చంద్రాపీడ వైశంపాయనుల విద్యాభ్యాసం

వారికి విద్య నేర్పేందుకు మంచివైదుష్యం కలిగిన విద్యాధికుల్ని ఆ విద్యాలయంలో ఉపాధ్యాయులుగా నియమించాడు. గురుపుత్రుల వయస్సు కల బాలకుల్నే పరిజనులుగా చేర్చుకొన్నాడు. వారిద్దర్నీ బోనులో పెట్టిన సింహాలవలె రక్షణ వలయం ఏర్పరచి, ఎవరికీ లోపలికి వెళ్ళే అనుమతి లేకుండా చేశాడు. అక్కడ పిల్లలాడుకొనేందుకు ఏర్పాట్లు లేవు. విద్యతప్ప వేరే ఏ ధ్యాసా ఉండకుండ కట్టుదిట్టం చేశాడు. ఇట్టి విద్యాలయంలో గురువులకు తన పుత్రుణ్ణి, మంత్రిపుత్రుడు వైశంపాయనుణ్ణి అప్పగించాడు. ప్రతిదినము రాజు రాణితో కలసి విద్యాలయానికి తామే వెళ్ళి కుమారుల విద్యాపద్ధతిని గమనిస్తూ ఉండేవాడు. చంద్రాపీడుడు కూడా ఏకాగ్రచిత్తంతో తండ్రిచే కట్టడి చేయబడి కొద్దికాలంలోనే సర్వవిద్యలయందు పరిపూర్ణతను సాధించాడు. మణిదర్పణం మీద ప్రతిబింబం సంక్రమించినట్టుగా సర్వవిద్యలు అతనికి సంక్రమించినాయి.

చంద్రాపీడుడు వ్యాకరణమునందు, పూర్వోత్తర మీమాంసలయందు, ధర్మశాస్త్రములోనూ, కామందక చాణక్యాది రాజనీతి శాస్త్రములోనూ, శరీరవ్యాయామ విద్యయందు, చాపవిద్య (ధనుశ్శాస్త్రం) చక్రం, ఖడ్గం, శక్తి, బల్లెం, గండ్ర గొడ్డలి, గద మొదలగు సర్వ ఆయుధ ప్రయోగ విద్యల్లోనూ, రథ గజాశ్వ ఆరోహణల యందు, వీణ, వేణువు, మద్దెల మొదలగు వాద్యముల యందు, నృత్యరీతులయందు, ఏనుగు, గుఱ్ఱం మొదలైన జంతువులకు శిక్షణనివ్వటంలోనూ, చిత్రకళయందు, అక్షరలిపిజ్ఞానమునందు, జూదము,



శకునము, గ్రహజాతకాదులయందు, రత్నపరీక్ష, వడ్రంగము, వాస్తు విద్య, ఆయుర్వేద చికిత్స, విషనివారణ పద్ధతులు, నదులు దాటుట, ఎగురుట, దుముకుట, ఇంద్రజాలము, కథోపన్యాసం, నాటకములాడుట, కావ్య నిర్మాణమునందు, మహాభారతాది పురాణేతిహాస విషయపాండిత్యంలోనూ, సమస్త దేశభాషలయందు, శిల్పము, ఛందఃశాస్త్రము ఇంకా అనేక విద్యలయందు మంచి నైపుణ్యమును సంపాదించెను.

చంద్రాపీడునకు బాల్యమునుండియే అమిత శారీరక దారుఢ్యము ఏర్పడింది. ఏనుగు గున్నలను కూడా చెవులు పట్టి తనబల పరాక్రమములతో ఆపగలిగెడివాడు. ఒక్క కత్తిదెబ్బతో చేవగలిగిన తాటిచెట్లను కూడా తామరకాడలను ఖండించినట్లు పడవేసేవాడు. సకల రాజకులానికి వినాశకుడైన పరశురాముని బాణాలవలె అతని దీర్ఘమైన బాణాలు కఠినశిలలను సైతం పగలగొట్టేవి. పదిమంది మనుషులు మోయదగిన ఇనుప దండాలను ఒక్కడే చేతబట్టి శరీరవ్యాయామం చేసేవాడు. చంద్రాపీడుడు అన్ని విద్యలయందు వైదుష్యాన్ని సాధించినట్లుగానే వైశంపాయనుడు కూడా ఒక్క వీసంకూడా తేడా లేకుండా విద్యావైదుష్యాన్ని సాధించాడు. చంద్రాపీడునకు వైశంపాయనుడు బాల్యక్రీడలనుంచి, సర్వవిద్యాపారంగతత్వం దాకా రెండవ ప్రాణంలాగా అతనికి జత కుదిరాడు. శరీరాలు వేరేగాని, ప్రాణం మాత్రం ఒకటే, ఒకరిని విడచి వేరొకరు క్షణకాలంకూడా జీవింపలేరు, వైశంపాయనుడు కూడా సూర్యుణ్ణి పగలు వదలనట్లు చంద్రాపీడుని వదలి క్షణంకూడా నిలవలేకపోయేవాడు.

సర్వ విద్యా పరిపూర్ణుడైన చంద్రాపీడునకు మూడులోకాలకు కోరదగిన సౌందర్యంతో కూడిన యౌవనం అంకురించింది. సహజంగానే సుందరుడైన ఆతడు యౌవనం రాగానే మరింత సౌందర్యంతో వికసించాడు. సంధ్యా సమయాన చంద్రోదయమైనట్టుగా వర్షసమయంలో మేఘమాలయందు ఇంద్రధనుస్సువలె, కల్పవృక్షానికి పూతపట్టినట్టు, తామరకొలనుకు

సూర్యోదయం లాగా, నెమళ్ళకు సుందరమైన పింఛం వచ్చినట్లుగా ఆతనికి యౌవనం అంకురించింది. ఆతని సౌందర్యం రెట్టింపయింది. పనియందు నియుక్తుడై సమీపమందుండే సేవకునివంటివాడయ్యాడు మన్మథుడు. లక్ష్మీదేవితో పాటే ఆతని వక్షఃస్థలం విశాలమైంది. శత్రువులతో పాటే ఆతని నడుము సన్నబడింది. కీర్తితోపాటే కనులజంట తెల్లదనాన్ని పొందింది.

## 18. చంద్రాపీడునకు ఇంద్రాయుధం లభించుట

ఈ విధంగా సర్వవిద్యావిశారదుడై యువరాజు విలసిల్లుతున్నాడు. తారాపీడుడు కుమారుని విద్య సమాప్తి అయిన వెంటనే గురువుల అనుమతితో అతనిని రాజధానికి తీసికొనిరమ్మని బలాహకుడనే అధికారిని పంపాడు. ఆశ్వికసైన్యం, పదాతిదళంతో ఆ అధికారి గురుసన్నిధికి వచ్చాడు. చంద్రాపీడుని అనుమతి పొంది లోనికి వచ్చి, యువరాజుకు భక్తిపూర్వకంగా నమస్కరించి, "యువరాజా! మహారాజు మీకీవిషయం వినిపించమని నన్ను పంపారు. విద్యలన్నీ నేర్చిన మీరు మీ గురువుల అనుమతితో రాజధానికి రమ్మని మహారాజాజ్ఞ. విద్యావంతుడవైన నిన్ను ఎప్పుడు చూస్తామా? అని ప్రజలు ఉత్సాహపడుతున్నారు. వారికండ్లకు నీ దర్శనంతో పండుగ చెయ్యి. అంతః పురజనులుకూడా నిన్ను చూడాలని ఉత్సుకతో ఉన్నారు. నీవు పది సంవత్సరాలపుడు గురుకులంలో ప్రవేశించావు. నీవిప్పుడు పదహారు సంవత్సరాల వయస్సు కలవాడవు. నీవిప్పుడు ఇంటికివచ్చి తల్లులందరికీ సంతోషాన్ని కలిగించాలి. రాజ్యభోగాలన్నీ అనుభవించాలి. రాజుల్ని గౌరవించాలి. బ్రాహ్మణోత్తములను పూజించు. ప్రజలను పరిపాలించు. బంధువర్గానికి ఆనందం కలిగించు. ఇదిగో ఈ అశ్వం నీకు తగినదిగా భావించి నీకు పంపుతున్నాను. ఇది త్రిభువనాలకు రత్నంలాంటిది, ఇది వాయువుతో, గరుడునితో సమానమైన గమనవేగం కలిగినది. దీనిపేరు 'ఇంద్రాయుధం' పారశీకప్రభువు దీనిని కానుకగా పంపాడు. ఇది ముల్లోకాల్లోను ప్రసిద్ధి చెందిన అశ్వం. పాలసముద్రంలోనుండి పుట్టినదిగా



భావింపబడుతున్న ఈ అశ్వం మహారాజు లధిరోహింపదగినదని నీకు పంపుతున్నాను" అని ప్రభువు సందేశాన్ని వివరించాడు. ఆ అశ్వం ద్వారదేశం వద్ద ఉన్నదని పలికాడు.

బలాహకుడు ఇంకా ఇలా అన్నాడు. "దేవ, క్షీరసాగరం నుండి జన్మించిన ఉచ్చైఃశ్రవానికి ఏ శుభలక్షణాలున్నాయో అన్నీ దీనికీ ఉన్నాయి. ఇటువంటి గుఱ్ఱము లోగడ లేదు, ఇక ముందుండబోదు" అని అతని మాటలు విన్న యువరాజు సంతోషించాడు. బలాహకుడు యువరాజును దాన్ని అధిరోహించమని కోరాడు. అది ద్వారంవద్దనున్నదని పలికాడు. చంద్రాపీడుడు తండ్రి ఆజ్ఞను పాటించి దాన్ని ప్రవేశపెట్టమని ఆజ్ఞాపించాడు. కొద్దిసేపట్లోనే అశ్వం అక్కడకు వచ్చింది. దానిని ఇద్దరు పురుషులు కళ్ళాల్ని రెండువైపులా బిగించిపట్టి లాగుతూ దానిని నడిపించి తెచ్చారు. ఆ అశ్వం ఉన్నత ప్రమాణం కలది. ఎత్తైన మనిషి చెయ్యెత్తినా అందుకోలేనంత ఎత్తుగా ఉంది దాని వీపు. అది ముఖం పైకెత్తి ఆకాశాన్ని మింగుదామన్నట్లు చూస్తోంది. అది మాటి మాటికి గర్భకుహరంనుండి వెలువడుతున్న హేషారవంతో దిక్కుల్ని పిక్కటిల్లేట్టు చేస్తూ, నేనే వేగగమనం కలవాడనని గర్వించే గరుత్మంతుణ్ణి తిరస్కరిస్తున్నట్లుంది. ఇంద్రాయుధం తన వేగాన్ని అడ్డగించటం చేత కోపంతో చెలరేగి ఘుర్‌ఘుర్ శబ్దంచేస్తూ ముట్టెను బారుగా చాపి, ఒక్క దుముకులోనే ముల్లోకాల్నీ దాటిపోవాలని చూస్తున్నట్టుంది. దాని శరీరం మీద అనేక రంగుల చారలున్నై. అందువలన అది ఇంద్రధనుస్సులాగా రంగురంగులుగా మెరుస్తోంది. అనేక రంగులతో కూడిన తివాచీని కప్పుకొన్న ఏనుగుగున్న లాగా ఉంది. అది హిమాలయ సానువుల్ని కొమ్ములతో కుమ్మటంచేత అనేకరంగులు గల మట్టితో ప్రకాశించే నందీశ్వరుడులాగా ఉంది. దుష్టరాక్షసుల వధ సమయంలో రక్తం అంటుకున్న జూలుతో ఎఱ్ఱగా ప్రకాశించే దుర్గాదేవి సింహంలాగా ఉంది. వేగాలన్నీ కలిపి ఒకే రూపంలో వచ్చినట్లుగా ఉంది ఆ అశ్వం. అనేక ఆభరణాలతో అలంకరింపబడి ఉంది. బంగారు గొలుసులతో నడుము పట్టీ

బిగింపబడి ఉంది. దాని మెడమీది జూలు లక్కరంగులో శోభిస్తోంది. సముద్రంలో తిరుగాడేటప్పుడు అక్కడి పగడపు చిగురుటాకులు అంటుకున్నట్లుగా దాని మెడ ఎర్రగా ప్రకాశిస్తోంది. ఆ మెడలో బంగారు తీగలు ఆకులతో నిర్మించిన ఆభరణం ఉంది. రత్నాలు పొదిగిన మాల ఉంది. లావైన మంచిముత్యాలతో కూర్చిన దండ వ్రేలాడుతోంది. ఆ గుఱ్ఱం ఇంద్రనీలమణులతో కూర్చిన అలంకారాలతో నల్లగా మెరుస్తూ, సూర్యుని రథానికి కట్టిన ఏడు గుఱ్ఱాలలో ఒక గుఱ్ఱం పొరపాటున రథం నుంచి జారి నేలపైన పడిందా అనిపించేట్లుగా ఉంది ఆ ఇంద్రాయుధం. అమితవేగంతో పరుగులు పెట్టే ఆ అశ్వాన్ని నిరోధించటం వలన రోషం కలిగి ప్రతిరోమ కూపంనుంచి స్వేదకణాలు వెలువడుతున్నై. అవి సముద్రంలో నుంచి బయటకు వచ్చేటప్పుడు అందులోని ముత్యాలు ఒంటికి అంటుకున్నట్లుగా ఉన్నై.

## 19. చంద్రాపీడుడు ఇంద్రాయుధ మెక్కి నగరానికి వచ్చుట

ఆ ఇంద్రాయుధం ఇంద్రనీలమణులతో కూర్చిన పాదపీఠాల్లాగా ఉన్నటువంటి దాని గిట్టలను భూమిపై గట్టిగా ఎత్తి కొట్టడంచేత అది మృదంగ వాద్యం నేర్చుకొంటున్నదేమో అన్నట్లు శబ్దం చేస్తోంది. ఆ గుఱ్ఱం ఎదుఱు ఱొమ్ము విశాలంగా ఉంది. ముఖం సన్నగా ఉంది. మెడ బాగా బారుగా చాపుతోంది. దాని డొక్కలు చెక్కినట్లున్నై. పిఱుదుల వద్ద రెట్టింపు విశాలంగా ఉంది. ఆ గుఱ్ఱం వేగంలో గరుత్మంతునితో పోటీపడుతోంది. త్రిలోక సంచారియైన వాయుదేవునకు సహాయపడునట్లుగా ఉంది. ఉచ్చైఃశ్రవానికి తమ్ముడా అన్నట్లుంది. వేగంలో మనస్సుకు చేదోడు వాదోడుగా కనిపిస్తోంది. భూమండలాన్ని ఆక్రమించే విషయంలో వామనుని (విష్ణువు యొక్క) పాదంలాగా ఉంది. మానస సంచారంలో వరుణుని హంసతో సమానంగా ఉంది. దానిమెడలో శంఖమాలలున్నై, చెవులు ఱిక్కించి ఉన్నై, ఈ సకల



శుభలక్షణాలతో సుందరంగా ఉన్న ఇంద్రాయుధాన్ని చంద్రాపీడుడు చూచి దానిని సమీపించాడు.

ఇంద్రాయుధం సర్వాంగసుందరంగా, ఆశ్చర్యకరంగా, అజ్ఞాత దివ్యపురుషునిలాగా ఉందని చంద్రాపీడుడు మనస్సున భావించాడు. దేవతలు పాల సముద్రాన్ని మథించినప్పుడు ఏవో శ్రేష్ఠవస్తువులను సేకరించారే కాని ఈ అశ్వరత్నాన్ని తీసుకోలేకపోయారు. వారు వ్యర్థ ప్రయత్నులయ్యారు. మేరుపర్వతశిలాతలంలాగా విశాలమైన దీని వీపుపై కూర్చొనలేని దేవేంద్రుని త్రైలోక్యరాజ్యఫలం ఎంతటిది ? దేవేంద్రుడు ఉచ్చైః శ్రవాన్ని చూడగానే ఇదే అశ్వరత్నమని భావించి దాంతో తృప్తి పడ్డాడేకాని, దీనిని తనకు చూపక సముద్రుడు చేసిన మోసమును గ్రహింపలేకపోయినాడు. ఈ గుఱ్ఱం ఇప్పుడీరూపంలో ఉన్నా పూర్వం ఏదేవతా స్వరూపుడో అయి ఉంటాడని అనిపిస్తోంది. దీనిపై అధిరోహించాలంటే నాకు అనుమానంగా, కొంచెం భయంగా ఉంది. మామూలు గుఱ్ఱానికి ఇంతటి తేజస్సు, మహానుభావత్వం ఎక్కడిది? ఇది తప్పక దేవతాశ్వమై ఉండాలి. ఒక్కొక్క ప్పుడు దేవతలుకూడా ముని శాపవశాన తమరూపములు వదలి వేరు రూపాలను ధరిస్తారట కదా! పూర్వం 'స్థూలశిరు'డనే మునీంద్రుడు త్రిలోక సుందరి రంభను శపిస్తే, ఆమె అశ్వజాతిలో 'అశ్వహృదయ' అనే పేరున జన్మించి శతధన్వునికి వాహనమై అతని సేవ చేస్తూ మానవలోకంలో చాలా కాలం నివసించిందట. ఇలాగే చాలా మంది మహాత్ములు మునుల శాపంచేత తమ మహిమలు కోల్పోయి మానవలోకంలో సంచరించారని పురాణ కథలు తెలుపుతున్నాయి. ఈ అశ్వరాజం కూడా అలాంటిదే అయి ఉంటుంది. ఈతని దేవతాతత్త్వం నా గుండెలకు తాకుతోంది. అని అనుకొంటూ దానిని స్పృశించి, "ఓ మహానుభావా! అశ్వరత్నమా! నీ వెవరివైనా కావచ్చు. నీకు నా నమస్కారాలు. నేను నీపై అధిరోహిస్తున్నందుకు నన్ను మన్నించు. తెలియనప్పుడు దేవతా పురుషులు కూడా కొన్ని సమయాల్లో అవమానపడవలసి వస్తుంది." అని మనస్సులోనే తలచుకొన్నాడు.

ఇంద్రాయుధం కూడా చంద్రాపీడుని మనస్సులోని భావాన్ని గ్రహించినదనిలాగా తలను అటు ఇటు వేగంగా తిప్పుతూ, జూలు విదిలిస్తూ, కనుగుడ్లు ప్రక్కకు వంకరగా తిప్పుతూ, వాలుచూపులు చూస్తూ, గిట్టలతో భూమిని తన్నుతూ, కుడికాలు పైకెత్తి తనను అధిరోహించమని పిలుస్తున్నట్లుగా ముక్కుతో ఘుర్‌ఘుర్ అనే శబ్దం చేస్తూ, మృదువుగా వినసొంపైన హేషారవం (సకిలింపు) చేస్తూ ఆహ్వానించింది. చంద్రాపీడుడు ఆ మధురహేషా శబ్దాన్ని విని తనను అధిరోహణకు అనుమతించిందని భావించి ఆ గుఱ్ఱంపై ఎక్కాడు.

రాజకుమారుడు ఎక్కిన వెంటనే మూడులోకాలు నాకొక లెక్కకాదు మూడు జానలతో సమానం అన్నట్లు వాయువేగంతో దౌడుతీసింది ఇంద్రాయుధం. చంద్రాపీడుడు విద్యాలయానికి అల్లంత దూరంలో అశ్వసైన్యం నిలువబడి తనరాక కోసం ఎదురుచూస్తూ కనబడింది. ఆ సైన్యం చంద్రాపీడుని చూడగానే చంద్రోదయానికి సముద్రంలాగా సంతోషంతో ఉప్పొంగిపోయింది. వారంతా సంతోషిస్తూ రాజకుమారుని చుట్టూ చేరారు. బలాహకుడు అక్కడి ఆశ్వికవీరులందర్నీ పేరుపేరున ప్రత్యేకించి పిలిచి రాజకుమారునకు పరిచయం చేశాడు. చంద్రాపీడుడు వారందర్నీ సాదరంగా చూస్తూ పరామర్శించాడు. వారంతా ఉన్నత రాజవంశాలలో జన్మించినవారే. వారంతా యువరాజుకు తలలు వంచి నమస్కరించారు. వారి దోసిళ్ళు తామరమొగ్గల్లాగా కనపడిన్నై. తర్వాత రాజకుమారుడు మంత్రికుమారుడు వైశంపాయనునితో కూడి గుఱ్ఱములెక్కి నగరానికి బయల్దేరారు. ఆ రాజసమూహం ఉన్నతమైన ధ్వజం రెపరెపలాడుతున్న పతాకంతో ప్రకాశిస్తుండగా రాజకుమారుని అనుసరించింది. ఆ జెండాపై ఉజ్జయినీ రాజచిహ్నమైన 'సింహం' గుర్తున్నది. రాజకుమారునకు ఎండ తగలకుండా నెమలిపింఛపు గొడుగును పట్టారు. ముందుగా ఒక గుఱ్ఱపుదండు దౌడుతీస్తూ రాజకుమారునకు జయశబ్దాలు పలుకుతోంది. పెద్దలు చిరంజీవ అంటూ ఆశీర్వాదాలు చేస్తున్నారు. వందిమాగధులు వంశ కీర్తిప్రతిష్ఠలను స్తోత్రం చేస్తూ ఉన్నారు. వారంతా పట్నం చేరారు.



చంద్రాపీడుని రాక విని పట్టణం అంతా కోలాహలంతో నిండిపోయింది. అందరి ధ్యాసా అతనిమీదే. అతణ్ణి చూడాలనే, నగరంలో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయిన్నై. చంద్రోదయం వల్ల కలువలు వికసించినట్లు జనులంతా కళకళలాడే ముఖాలతో అతణ్ణి చూడాలని ఉవ్విళ్ళూరారు. కుమారుడంటే మా చంద్రాపీడుడే కాని ఆరు ముఖాలు కలిగిన పార్వతీ తనయుడా ఏమిటి! అని ప్రజలు అనుకొనసాగారు. ఆహా! ఈ రాజకుమారుని మానవ దుర్లభమైన సౌందర్యమును కుతూహలముతో కూడిన నేత్రములతో చూడగలుగుచున్న మనమెంతటి అదృష్టవంతులమో కదా! నేటికి మన జన్మ సఫలమైనది, చంద్రాపీడుని రూపము ధరించిన శ్రీమహావిష్ణువునకు నమస్కారము అని వివిధ రీతులలో నగరపౌరులు ఆతని సౌందర్యాన్ని ప్రశంసించసాగారు. నాగరికులందరూ శిరములు వంచి వినయముతో నమస్కరింప సాగారు. చంద్రాపీడుని చూడటానికి గృహాలద్వారాలు, కిటికీలు అన్నీ తెరచి ఉంచటం చేత నగరమే నేత్రములు తెరిచి ఆతని అందాన్ని చూస్తున్నదా అన్నట్లుంది. "మన రాజతనయుడు చంద్రాపీడుడు సకల విద్యలు పూర్తి చేసుకొని విద్యాగృహం నుంచి రాజగృహానికి వస్తున్నాడట" అని విన్న నగరయువతులు శరీరాలంకారాలు మధ్యలో ఆపి వేసి ఆయనను చూడటానికి బయల్దేరారు.

కొందరు యువతులు ఎడమచేతులలో మణి దర్పణాలు పట్టుకొని సంపూర్ణ చంద్రబింబాల్లాగా కనపడ్డారు. కొందరు యువతులు త్వరగా అడుగులు వేయటం చేత మొలత్రాళ్ళు క్రిందికి జారి వారి నడకకు అడ్డపడగా తొట్రుపడసాగారు. అప్పుడు వారు కాళ్ల సంకెళ్ళతో నెమ్మదిగా నడచే ఆడు ఏనుగుల్లాగా ఉన్నారు. కొందరు రంగురంగులతో కూడిన పట్టుచీరలు ధరించి ఇంద్రధనుస్సుల్లాగా కనిపించారు. కొంతమంది తెల్లని గోళ్ళ కాంతులు కల పాదాలు కలిగి, కాలి అందెల శబ్దానికి ఆకర్షింపబడిన కలహంసల్లాగా ఉన్నారు. కొందరు శివుని నేత్రాగ్నికి మాడి మసైపోయిన మన్మథుని గూర్చిన శోకంతో చేత స్ఫటికమాల ధరించిన రతీదేవిలాగా చేతుల్లో తెల్లని పెద్ద

ముత్యాలహారం ధరించి కనబడుతూ ఉన్నారు. ఇలా వివిధరీతుల్లో లలనామణులు మేడలమీద, మిద్దెలమీద ఎక్కి కూడా చూస్తున్నారు. ఆ మేడలన్నీ స్త్రీలతో నిండిపోయినాయి. చంద్రాపీడుని యొక్క మహాసౌందర్యవంతమైన రూపము వారి హృదయాలలో చెరగని ముద్రవేసింది. వారిలో వారే పోటీపడసాగారు. ఈర్ష్యపడుతున్నారు. తొట్రుపాటు చెందుతున్నారు.

చంద్రాపీడుని దర్శనంకోసం యువతీజనం పోటీలు పడుతూ, వారిలో వారే రకరకాల పరిహాస వాక్యాలాడటం మొదలు పెట్టారు.

## 20. పౌరకాంతల రాజకుమార సందర్శనాభిలాష

“ఏమమ్మా! అంత తొందరేమిటి నీకు. నన్ను కూడా కొంచెం చూసి నడు”

“నీకెందుకు అతన్ని చూడాలని పిచ్చి. ముందు నీ ఉత్తరీయాన్ని సరిచేసుకో”.

“ఓసి మూఢురాలా! నీ మొగంమీద ముసురుతున్న ముంగురులుపైకి తోసుకో”. “మత్తెక్కినదానా! జుట్టు ఊడిపోతోంది. ముడివేసుకో”.

“నీ రాజకుమార సౌందర్య దర్శనాసక్తి బాగానే ఉంది. ముందు జారిపోతున్న మొలత్రాడు పైకిలాక్కో”.

“ఏమే! పాపిష్ఠిదానా! బుగ్గలమీదికి జారిపోయిన కర్ణపల్లవాన్ని సరి చేసుకో”.

“నీ యౌవనమదం పాడుగానూ – అందరూ నిన్నే చూస్తున్నారు. కొంచెం గుండెల మీదికి ఉత్తరీయాన్ని లాక్కోవయ్యా !”

“ఒసే! సిగ్గులేనిదానా! చీర నడుంమీంచి జారిపోతోంది. తొందరగా బిగించుకో”.

“నీ పిచ్చిపాడుగానూ! తొందరగా రావే అతను వెళ్ళిపోతున్నాడు”



“నీ కుతూహలం బాగానే ఉంది గానీ, కొంచెం నన్ను కూడా చూడనిస్తావా? లేదా?

“ఓసీ! తృప్తి లేనిదానా! ఇంకా ఎంతసేపు చూస్తావే రాజకుమారుణ్ణి?

“ఏమే పిశాచీ! నీ పైట జారిపోయింది. నిన్ను చూసి అందరూ నవ్వుతున్నారు తెలుసా!

“ఓసి రాగాంధురాలా! నీ కళ్ళకు స్నేహితురాళ్ళు కనపడటం లేదా? మమ్మల్ని కూడా కొంచెం చూడనివ్వు”.

“ఓసి! నీ దొంగ వినయాలు కట్టిపెట్టు, సూటిగా చూడక అలా దొంగచూపులు చూస్తావెందుకు?

“ఓ యౌవనవంతురాలా! పయోధర భారంచేత బాధగా ఉందా ఏమిటి!”

“ఎందుకే అంతకోపం మామీద? సరే, నీవే ముందుకు వెళ్ళి చూడు”.

“నీ చుప్పనాతితనం పాడుగానూ! కిటికీ మొత్తం నువ్వే ఆక్రమిస్తే ఎట్లాగే!”

“ఓ మన్మథపరవశురాలా! నా ఉత్తరీయాన్ని లాక్కుని నువ్వు కప్పుకుంటున్నావు ఇదెక్కడి న్యాయమే”.

“ఏమమ్మా! ప్రేమమద్యం పుచ్చుకొన్నావా? కొంచె ప్రక్కకు జరుగు మేమూ చూస్తాం”.

“ఓ శూన్యహృదయురాలా! ఇంట్లోనించి బయటికి వచ్చావని నీకు తెలుస్తోందా”.

“నీ కుతూహలం మండా! మరీ ఊపిరిపీల్చుకోవటం కూడా మర్చిపోతే ఎలాగ?”

“ఏమమ్మో! రాజకుమారునితో కలిసినట్లు కలగంటున్నావా ఏంటి? కొంచెం కళ్ళుతెరిచి చూడుమరి!” అతడు వెళ్ళిపోతున్నాడు.

"ఓసి నీ పాతివ్రత్యంమండ! చూడవలసిన సౌందర్యం చూడకుండా చేసికొని, నీకళ్ళను నీవే మోసగించుకోవద్దు. అని.

ఆ రాజకుమారుడు ప్రక్కనున్న వైశంపాయనునితో నవ్వుతూ ఏదో మాట్లాడుతున్నాడు. బలాహకుడు చంద్రాపీడుని ముంగురులు గుఱ్ఱపుడెక్కల తొక్కిడివల్ల లేచిన దుమ్ము కణాలు కమ్మియుండటం చూచి, చిలుక ఱెక్కల వలె ముదురాకు పచ్చగా ఉన్న ఉత్తరీయపుటంచుతో మృదువుగా దులుపుతున్నాడు. అతడు రాజభక్తి పరాయణుడు. ప్రభుసేవాపరాయణుడు. ఇలా నగర వీథులలో వారు ప్రయాణిస్తున్నారు. రాజకుమారుని సర్వాంగ సౌందర్యాన్ని కనులార గాంచిన పురప్రజలు చంద్రాపీడుని గర్భాన మోసికన్న విలాసవతి అదృష్టాన్ని పొగడసాగారు. యువతులు ఆతనిపై మంగళకరములైన పేలాలు, పుష్పాలు, గంధాక్షతలు చల్లి స్వాగతం పలికారు. ఇంతలో వారందరితో కూడి చంద్రాపీడుడు రాజమందిరద్వారం దగ్గరకు వచ్చాడు.

చంద్రాపీడుడు ఇంద్రాయుధం నుంచి క్రిందికి దిగాడు. వైశంపాయనుణ్ణి తన చేతితో పట్టుకొని, వినయంతో బలాహకుడు దారి చూపుతుండగా రాజకుమారుడు రాజభవనంవైపు నడుస్తున్నాడు. అక్కడివారంతా తెల్లని తలపాగాలు, తెల్లని వస్త్రాలు, తెల్లని పుష్పమాలికలు ధరించి ద్వారపాలకులతో ఆ ప్రాంతం శ్వేతద్వీపంలాగా శోభిల్లింది. ఆ ద్వారపాలకులు విధినిర్వహణలో పేరుపొందినవారు. అక్కడి భవనాలు హిమగిరి శిఖరాల్లాగా తెల్లగా, ఎత్తుగా ఉన్నై. రకరకాల ఆయుధాలతో నిండిన ఆయుధశాలలున్నై. నెమళ్ళ మనోహర క్రేంకారవాలతో సందడిస్తున్న క్రీడాపర్వతాలున్నై. సంగీత నృత్య శాలలున్నై, వింధ్య పర్వతంతో పోటీ పడదగిన ఏనుగులు కట్టివేయబడి ఉన్నై. ఉత్తమజాతికి చెందిన అశ్వరాజాలున్నై. తమ ఏలుబడిలో ఉన్న గ్రామాలు, నగరాల పేర్లన్నీ బాగా తెలిసిన గ్రామాధికారులున్నారు. రాజ్యంలోని వింతలు, విశేషాలన్నీ ఏకబిగిన ఏకరువు పెట్టగల నిపుణులున్నారు. ఆంధ్ర, ద్రవిడ, సింహళాది ఇతర రాజ్యాలనుంచి ప్రభుదర్శనార్థం వచ్చిన సామంతరాజులున్నారు.



కాలక్షేపానికి కొందరు గుమిగూడి జూదము, అష్టాచెమ్మలాంటి వినోద క్రీడలాడుతున్నారు. కొందరు మధురస్వరంతో వీణలు మ్రోగిస్తున్నారు. కొందరు తమ చిత్రలేఖనా నైపుణ్యంతో రాజుల చిత్రాలను గీస్తున్నారు. నుడికట్ల ద్వారా శబ్దరహస్యాలు ప్రకటిస్తున్నారు కొందరు. కొందరు రాజులు వ్రాసిన కావ్యాల్లోని సుందరఘట్టాలను కొంతమంది చదివి వినిపిస్తున్నారు. ఆ రాజమందిర సమీప ప్రదేశం ఈ విధంగా సందడిగా ఉంది.

## 21. రాజమందిర వర్ణన

ఆ ప్రాంతంలో ఒకచోట బంగారు గొలుసులతో కట్టివేయబడిన వేటకుక్కల సమూహం ఉంది. అక్కడ కస్తూరీ పరిమళం అంతటా వ్యాపించి ఉంది. జనులను నవ్వించటానికి కొందరు వామనులు, నపుంసకులు, కుంటివారు, చెవిటివారు అక్కడ గుమిగూడి ఉన్నారు. ఒకచోట ఒక అడవిమనిషి వింత గొల్పుతున్నాడు. కొన్నిచోట్ల గొఱ్ఱెలు, కోళ్ళు, లావుకపక్షుల మధ్యలో పందేలు నిర్వహిస్తున్నారు. అక్కడ చిలుకలు, గోరువంకలు మనుజ సంభాషణలు చేస్తున్నై, రాజకుమారుడు వైశంపాయనునితో కలసి అక్కడి వింతలు విశేషాలు గమనిస్తూ రాజద్వారం వద్దకు చేరుకొన్నాడు.

ప్రతీహారులు నమస్కరించి, మార్గం చూపుతూ ఉండగా, రాజలోకం తలలు వంచి నమస్కారాలు చేస్తుండగా, రాజాంతఃపుర వృద్ధస్త్రీలు వీరిరువురకు దిష్టితీసి, మంగళహారతులివ్వగా ఏడు అంతర్ద్వారాలు దాటి లోపలి మందిరానికి వచ్చాడు వైశంపాయన సహితుడైన చంద్రాపీడుడు. మందిరంలో అల్లంత దూరంలో మహారాజు కనపడుతున్నాడు. అతనిచుట్టూ అంగరక్షకులు చేరి ఉన్నారు. వారి చేతులు ఎప్పుడూ ఆయుధాలు ధరించే ఉండటం చేత కాయలు కాసి ఉన్నై. చేతులు, కాళ్ళు, కళ్ళు తప్ప మిగిలిన శరీరమంతా ఇనుప కవచంతో కప్పబడిన అంగరక్షకులు ఆతనికి రక్షణవలయంగా ఉన్నారు. వారు ఏనుగులను కట్టివేసే ఇనుపస్తంభాల్లాగా ఉన్నారు. వంశక్రమంగా వారు రాజకులంలో

అంగరక్షకులుగా పని చేస్తున్నారు. ఆకారంచేత వారు రాక్షసుల్లా ఉన్నారు. తారాపీడుని కిరువైపులా ఇరువురు వారవిలాసినులు తెల్లని చామరాలు మెల్లగా వీస్తున్నారు. ఆ మహారాజు స్వచ్ఛమైన మందాకినీ నదియొక్క ఇసుకతిన్నెల మీద శయనించిన ఐరావతంలాగా తెల్లని హంసతూలికాతల్పంమీద విలాసంగా కూర్చున్నాడు.

చంద్రాపీడుడు దూరాన్నుంచే తలవంచి నమస్కరిస్తూ రాగా అతనిని చూచి తండ్రి ఆనందబాష్పాలు కనులనుండి రాలుతుండగా శయనం నుండి కొంచెం పైకి లేచి దీర్ఘమైన బాహువులను చాచి కుమారుని రారమ్మని ఆహ్వానిస్తూ తనకు నమస్కరించిన కుమారుని గాఢంగా కౌగలించుకొన్నాడు. కొంతసేపటికి కొడుకును విడిచాడు. రాజకుమారుడు తండ్రికి పాదాభివందనం చేసి, తాంబూలకరండవాహిని తన ఉత్తరీయాన్ని చుట్టచుట్టి తనకు ఆసనంగా ఇవ్వబోగా, దానిని కాలితో ప్రక్కకు త్రోసి వేసి నేలపైన కూర్చొన్నాడు. తదనంతరం వైశంపాయనుడు తన కుమారునికి సమానునిగా భావించురాజు అతనిని కూడా కౌగిలించుకొని ఆదరించాడు. వైశంపాయనుడు చంద్రాపీడుని ఆసనంపై కూర్చున్నాడు. కొంతసేపటికి రాజు, "నాయనా! మీ తల్లి నిన్ను చూడకోరుతోంది. ఆమెకు నమస్కరించి, అట్లే నిన్ను చూడగోరిన పినతల్లు లందరికి కనిపించిరా" అని పంపాడు.

చంద్రాపీడుడు తండ్రి ఆజ్ఞప్రకారం లేచి, మాతృమందిరానికి వెళ్ళి పరిజనులను బయటనే వదలి వైశంపాయనుని తోడుపెట్టుకొని, పరిజనులు దారి చూపుచుండగా తల్లి చెంతకు వెళ్ళాడు. తల్లిచుట్టూ తెల్లని వస్త్రములు ధరించిన కంచుకి లున్నారు. కాషాయవస్త్రాలు ధరించిన, గౌరవనీయురాండ్రైన, అనేక పుణ్యకథలు నేర్చిన, ఇతిహాసాలుపన్యసింపగల, ధర్మోపదేశాలు చేయగల ముదుసలి సన్యాసినులు కూడా ఆమెతో మాట్లాడుతున్నారు. నపుంసకులు స్త్రీ వేషాలు వేసి ఆమెను నవ్విస్తున్నారు. ఇంతలో చంద్రాపీడుడు ఆమె చరణాలకు ప్రణమిల్లాడు. తల్లి విలాసవతి కుమారుని వెంటనే పైకి లేపి,



తానే స్వయంగా దిష్టి తీసి, హారతినిచ్చి, అతని తలను వాసన చూచి, అతని శిరస్సును, ముఖాన్ని, భుజాలను చేతులతో నిమిరి, "నాయనా! ఇంత సుందరాకృతి గల నిన్ను ఇంతకాలం దూరం చేసి బాధ కలుగజేసిన నీ తండ్రి నిజంగా కఠినహృదయుడు సుమా! గురుకులంలోని కఠోర నియమాలకు నీవింతకాలం ఎలా తట్టుకొన్నావు రా తండ్రీ! నీ వెన్నలాంటి మనస్సు చదువు విషయంలో ఇంత కఠినంగా ఎట్లా మారింది? కుమారా! అసాధారణ గురుభక్తితో సర్వవిద్యల్నీ నేర్చి కన్నులపండువుగా కనపడే నీవు తొందరలోనే అతిలోకసౌందర్యవతులైన కోడళ్ళతో కనపడుదువుగానిలే అంటూ, అతడు సిగ్గుపడుతుండగా ఆమె మాట్లాడింది. అతని సున్నితమైన, సుందరమైన బుగ్గలపై ముద్దులుపెట్టింది. కుమారుడు అక్కడ కొంతసేపుండి, రాజాంతఃపురకాంతలకు, సవతి తల్లులకు కూడా కనపడి, వారిని సంతోషపెట్టి, అటునుండి కదలి బయటకు వచ్చి ఇంద్రాయుధం ఎక్కాడు. వైశంపాయనుడు అతనితో బయల్దేరాడు. పరివారంతో కలసి వారిరువురు శుకనాస మంత్రిగృహానికి చేరారు.

శుకనాసుడు వీరిని చూడగానే ప్రేమతో కౌగిలించుకొని ఆనందబాష్పాలు రాల్చాడు. చంద్రాపీడుడు, వైశంపాయనుడు తారాపీడునితో సమానుడైన ఆయనకు వినయంతో పాదాభివందనం చేసి, ఆశీర్వాదాలు పొందారు. ఆయన పరివారం వారికి రత్నాసనాలు వేసినా కూర్చొనక నేలపైననే ఆశీనులయ్యారు. రాజకుమారుడు క్రింద కూర్చోవటంచూసి, మిగిలిన రాజసమూహమంతా సింహాసనాలు వదలి తామున్నూ క్రిందే కూర్చొన్నారు. అప్పుడు శుకనాసుడు మిక్కిలి సంతోషంతో, ''నాయనా! విద్యలన్నీ పూర్తి చేసుకొని, యౌవనవంతుడివైన నిన్ను చూచి మీ నాన్న ఇంతకాలానికి తాను చక్రవర్తిత్వం పొందిన సంతోషాన్ని అనుభవించాడు. పెద్దల ఆశీస్సులన్నీ ఇప్పుడు ఫలించినై. జన్మజన్మాంతరాల సంపాదించిన పుణ్యకార్యఫలం నేటికి అందింది. నీ తండ్రి అదృష్టవంతుడు కనుకనే త్రిభువనాశ్చర్యకర సౌందర్యవంతుడవు పుత్రుడుగా

పొందగలిగాడు. నీవంటివాడు పరిపాలకుడగుట ఈ రాజ్యప్రజలు చేసికొన్న పూర్వజన్మ పుణ్యం నీవంటివానిని భర్తగా పొందుటకు భూదేవి ఎంత పుణ్యము చేసుకొన్నదో! ఇక నీవును నీ తండ్రివలెనే సర్వసర్వంసహాచక్రమును అవలీలగా త్రిప్పు" అని పలికి అతనికి వస్త్రాభరణచందనాంగరాగాలు కానుకలుగా ఇచ్చి ఇంటిలోనికి పంపెను. అతడును మిత్రునితో కలసి ఇంటిలోనికి వెళ్ళి, మాతృసమానురాలైన అమాత్యపత్ని మనోరమాదేవిని దర్శించి నమస్కరించెను. ఆమె ఆశీర్వాదాలను తీసికొని ఇంద్రాయుధ మెక్కి రాజకుమారులు వెంటరాగా వైశంపాయన సహితుడై శయనమందిరమున కొంత విశ్రమించి, తర్వాత స్నానభోజనాదులు నిర్వర్తించి, ఆ రోజు పనులను యథావిధిగా నిర్వహించెను. ఇంద్రాయుధాన్ని కూడా తనవద్దనే ఉంచి దానికి వసతులేర్పాటు చేసెను.

## 22. రాజకుమారుని వేట, చిత్రలేఖ పరిచయం

సాయంత్రమైంది. చంద్రాపీడుడు రోజువారి కార్యక్రమాలు పూర్తి చేసుకొని రాత్రి భుజించిన తర్వాత మరల ఒకసారి తల్లిదండ్రులను దర్శించి రాత్రి శయనించెను. తెల్లవారినది రాకుమారుడు వేటాడుటకు నిశ్చయించాడు. తండ్రి అనుమతిని పొంది, సూర్యోదయం అవుతూ ఉండగానే ఇంద్రాయుధం ఎక్కి, గజతురగపదాతిసైన్యంతో కోలాహలంగా బయల్దేరాడు. ఆ సైన్యంలో భయంకరమైన వేటకుక్కలున్నై. అవి ఒక్కొక్కటి గాడిదలంతున్నై. వాటి మెడలకు బంగారు గొలుసులు బిగించి పట్టుకొన్నారు. వాటిని పోషించేవారు. పెద్దపెద్ద ధనుస్సులు, బారైన వాడి బాణాలు, కత్తులు గండ్రగొడ్డళ్ళు, వలలు ధరించి అరణ్యంలో ప్రవేశించారు. వారు లేళ్ళను, అడవి పందులను, సింహాలను వేటాడారు. కొన్ని మృగాలను చంపారు. కొన్ని జంతువులను ప్రాణాలతో పట్టుకొన్నారు. మధ్యాహ్నానికల్లా వేటనుండి తిరిగి వచ్చి స్నానపానభోజనాలైన తర్వాత కొంత విశ్రాంతి తీసుకొన్నాడు. ఇంద్రాయుధానికి స్వయంగా మేత తినిపించాడు.



మరునాడు ఉదయాన అంతఃపురానికంతటికి ప్రధానాధికారి, మహారాజు తారాపీడునకు అత్యంత ప్రీతిపాత్రుడు, 'కైలాసు'డనే పేరుగల కంచుకి చంద్రాపీడుని మందిరానికి ఒక యువతిని వెంటపెట్టుకొని వచ్చాడు. ఆమె ఇంకా కౌమారదశ దాటలేదు. యౌవనంలో కాలూనబోతోంది. రాజకులాల్లో మెలగవలసిన రీతులు తెలిసినది. ఆమె శిరస్సుపై ఎఱ్ఱని ఆరుద్ర పురుగు రంగులో ఉన్న మేలిముసుగు ధరించి ఉంది. ఆ బాల ఉదయసూర్యకాంతి ప్రసరించగా ఎఱ్ఱబడిన తూర్పుదిక్కులాగా, మణిశిలావర్షంలో తడిసినట్లుగా తన శరీరము నుండి ఎఱ్ఱని కాంతులు ప్రసరించి ఆ భవనమంతా ప్రసరిస్తున్నై. రాహుగ్రహానికి భయపడి చంద్రమండలాన్ని వదిలిపెట్టి భూమికి దిగిన వెన్నెలలాగా ఉంది. ఆమె కాలియందెలు మనోహరంగా మ్రోగుతున్నై. ఆ స్త్రీ హృదయమండలం ఇంకా పూర్ణపరిపక్వత పొందలేదు. మెడలో ధరించిన మంచిముత్యముల హారాలకాంతితో మునిగినట్లుగా ఉన్న ఆ బాల పాలసముద్రంలోంచి వచ్చిన లక్ష్మీదేవిలాగా ఉంది. ఆమె ముక్కు సంపెంగ పూవును పోలి ఉన్నతంగా ఉంది. ఆమె కనులు వికసించిన తెల్లతామర రేకుల్లాగా ఉన్నాయి. ఆమె సౌందర్యం ఎవరికైనా చూపులు తిప్పుకోలేనంత ఆకర్షణీయంగా ఉంది.

కైలాసుడనే ఆ కంచుకి ఆమెను వెంటపెట్టుకొని చంద్రాపీడుని వద్దకు వచ్చి, నమస్కరించి, వినయముతో వంగి కుడిచేతిని నేలకు ఆనించి లేచి, కుమారా! తల్లిగారు విలాసవతి తమతో ఇట్లు ఆజ్ఞాపించుచున్నది.

"నాయనా! ఈమె నీ తండ్రిగారు లోగడ దండయాత్రలో కులూత దేశరాజధానిపై దండెత్తినప్పుడు, ఆయనను జయించి, 'పత్రలేఖ' అను పేరుగల ఆతని కుమార్తె కూడా బందీజనులితోపాటు ఇక్కడకు తేబడింది. యుద్ధంలో తల్లిదండ్రులను పోగొట్టుకొన్న అనాథ అని జాలిపడి నేను ఈమెను చేరదీసి నా కన్నకూతురువలె పెంచి పోషించాను. ముద్దు మురిపాలతో, గారాబముతో లాలించి పెంచాను. ఆమెను ఇప్పుడు నీకు నీ తాంబూలకరండ వాహిని

(తాంబూలపు సామగ్రి ఉంచే పెట్టెను మోసేది)గా ఉంటే బాగుంటుందని తలచి నీవద్దకు పంపుతున్నాను. ఈ చిన్నదానిని అందరి పరిజనులలాగా భావింపకు. ఈ బాలికను లాలించు. బాలికాసహజమైన చాపల్యాల నుండి దూరంగా ఉంచు. నీ శిష్యురాలిగా చూసుకో. స్నేహితురాలిగా భావించి నీ ఆంతరంగిక వ్యవహారాలలో పాలుపంచుకొనే దానినిగా చేసుకో. ఇంతకాలం పెంచిన ప్రేమతో నే నీమెను కన్నకూతురులాగానే భావిస్తున్నాను. ఈ బాలిక ఉన్నతకులంలో రాజవంశంలో జన్మించింది కనుకనే గౌరవనీయమైన ఈ పనియందు నియమించాను.

ఇంతకాలం ఈమెను పెంచిన నమ్మకంతో చెబుతున్నాను – ఈమె కొద్దిరోజుల్లోనే నీ సేవచేసి, నీకు నమ్మకస్తురాలవుతుందని నా విశ్వాసం. ఈ పత్రలేఖ గూర్చి నీకు తెలియదు కనుక ఇంతగా చెబుతున్నాను. ఈమె నీకు సర్వకాల సర్వావస్థలలో స్థిరంగా సేవ చేసేటట్లుగా నీవు చూసుకో".

ఈ విధంగా కైలాసుడు తల్లి సందేశాన్ని వినిపించాడు. పత్రలేఖ కూడా చంద్రాపీడునికి ప్రణమిల్లింది. అతడు ఆమెయొక్క సర్వాంగసౌందర్యాన్ని కన్నార్పకుండా చాలాసేపు చూసి, "సరే, అమ్మ చెప్పినట్లే చేస్తాను" అని పలికి కుమారపాలితుణ్ణి పంపివేశాడు. పత్రలేఖ కూడా ఆ క్షణంనుంచి చూపుల్నిబట్టే అతని అవసరాల్ని కనిపెట్టి మెలుగుతూ, రాత్రనక పగలనక, కూర్చున్నా, నిలబడినా, పడుకొన్నా, లేచినా, రాజకులంలో తిరుగుతున్నా అతనిని విడువకుండా నీడలా అతనిప్రక్కనే ఉండేది. రాజకుమారు డెక్కడుంటే పత్రలేఖకూడా అక్కడే అన్నట్లుండేది. చంద్రాపీడుడికి కూడా ఆమెను చూచిన క్షణంనుంచి ఆమెపై రోజురోజుకు ప్రీతి పెరగసాగింది. దినాలు గడచిన కొద్దీ ఆమెను దయతో ఆదరించేవాడు. ఎంత రహస్య విషయమైనా ఆత్మసమానురాలిగా భావించి ఆమెకు చెప్పేవాడు.

ఇలా కొంతకాలం గడిచింది. వార్ధక్యం పైన పడుతున్న తారాపీడుడు తన కుమారునకు యౌవరాజ్యాభిషేకం చేయాలని భావించాడు. ఆ



శుభకార్యానికి కావలసిన వస్తువులన్నీ సేకరింపవలసిందిగా ప్రతీహారుల్ని ఆజ్ఞాపించాడు. యౌవరాజ్యపట్టాభిషేకం చేసుకోబోతున్న చంద్రాపీడుని తన వద్దకు రప్పించుకొని మహామంత్రి శుకనాసుడు అతనికి ఇలా ప్రబోధింప సాగాడు. లోకసామాన్య విషయాల దగ్గఱనుంచి, అతిరహస్యములైన రాజనీతి విషయాల దాకా అతనికి ఎఱుకపరచాడు ఇలా –

## 23. శుకనాసుడు చంద్రాపీడునికి రాజనీతి బోధించుట

"నాయనా! చంద్రాపీడా! సమస్తవిద్యల రహస్యాల్ని వంటపట్టించుకొన్న నీకు ప్రత్యేకించి చెప్పవలసిన పనిలేదు. అయినా పెద్దలు పిన్నలకు హెచ్చరిక కోసం తెలిసిన విషయాలను చెప్పటం లోకాచారం. కుమారా! ఎంతటి సూర్యకాంతి చేతగాని నివారింప వీలుకానిది ఈ యౌవనం అనే గాఢాంధకారం. రత్నకాంతులకు లొంగదు. భేదింప వీలులేనిది ఈ చీకటి. ఎంత మారుద్దామన్నా మారనిది లక్ష్మీమదం. అది మహాదారుణమైంది. ఎన్ని అంజనాలు రాచినా ఎంతమాత్రం నివారింప శక్యంకానిది 'ఐశ్వర్యమద'మనే అంధత్వం. మనిషిలో ఉన్న 'అభిమానం' అనే తీవ్రజ్వరం ఎన్ని శీతలోపచారాలకీ లొంగదు. రాజ్య సుఖాభిలాష అనే సన్నిపాతజ్వర నిద్ర సూర్యోదయమైనా గానీ మేల్కాంచనీయదు. పుట్టుకతోనే ఐశ్వర్యవంతుడవటం, అభినవయౌవనం, సాటిలేని సౌందర్యం కలిగి యుండటం, లోకోత్తర బలసంపన్నత కల్గి ఉండటం – ఇవన్నీ అనేక అనర్థాల్ని కలిగిస్తె, దీనిలో ఒక్కటి చాలు చాలా ప్రమాదాన్ని కలిగిస్తుంది. మరి అన్నీ ఒకచోట కలిసి ఉంటే వాటివల్ల ఎంత ప్రమాదం కలుగుతుందో వేరే చెప్పాలా? యౌవన ప్రారంభంలో ఎంత మంచిబుద్ధి కూడా వంకర తిరుగుతుంది. యువకుల దృష్టి ఎంత స్వచ్ఛమైందైనా యౌవన ప్రభావంచేత అంతా అనురాగమయంగా కనబడుతుంది. యౌవన సమయంలో అతని ఇష్టానికి వ్యతిరేకంగా ధర్మానికి దూరం చేసి వేస్తుంది. ఇంద్రియాలనే లేళ్ళను భోగలాలసత అనే మృగతృష్ణకు

బలిచేస్తుంది. విషయాసక్తి మనిషికి హెచ్చుగా కలిగించి అతనిని నాశనం చేస్తుంది.

నాయనా! నావంటివారి ఉపదేశాలు నీవంటి వారికే చేయాలి. మనోనిర్మలత్వం కలిగిన వారికి ఉపదేశవాక్యాలు సానవెట్టిన రత్నంపై చంద్రకిరణాలు స్వచ్ఛంగా ప్రతిఫలించినట్లు ఫలితాన్నిస్తే, కలుషిత మనస్కులకు ఈ ఉపదేశాలు చెవిలో పోసిన నీరు పోటు పుట్టించినట్లుగా దుష్ఫలితాలనిస్తై, పెద్దల మాటలు చెవినపెట్టిన వారికి, ఏనుగుకు దృష్టి దోషనివారణకు కట్టిన శంఖమాల అందం కలిగించినట్టుగా మంచివారికి మేలు కలిగిస్తై. గురూపదేశం దోషాలను పారద్రోలుతుంది. చంద్రోదయం చీకట్లను పారద్రోలినట్లుగా గురూపదేశం మనస్సును ఆవరించిన దోషాలనే చీకట్లను పారద్రోలుతుంది. వయస్సు చెల్లిన వృద్ధులకు కూడా గురూపదేశం ఎంతో మేలు చేస్తుంది. యువకుడివైన నీకు మరింత మేలు చేస్తుంది. నీ మనసు ఇంకా భోగలాలసతల రుచి తెలియనిది, స్వచ్ఛమైనది. కనుక నీకు హితం కల్గిస్తుంది. గురూపదేశం అంటే మనిషిలోని సమస్త దోషాలను కడిగివేయగల స్నానం వంటిది. జుట్టు తెల్లపరచకుండానే మనిషికి ముసలితనం పెద్దరికాన్నిస్తుంది గురూపదేశం.

సహజంగా రాజుల కుపదేశం చేసే ధైర్యం ఎవరికీ ఉండదు. ఒకవేళ ధైర్యం ఉన్నా ఆ ఉపదేశాలు వినేందుకు రాజులూ సిద్ధంగా ఉండరు. ప్రజలందరూ రాజు ఏది చెపితే దాన్నే సమర్థిస్తారు కాని తెగించి రాజుకు కర్తవ్యం ఉపదేశింపరు. సహజమైన దర్పంతో విఱ్ఱవీగే రాజులు పెద్దపెద్ద చెవిరంధ్రాలున్న వారైనా గాని, పెద్దలమాటలు ఎంతమాత్రం వినరు. ఒకవేళ విన్నా ఏనుగు కన్నులు మూసుకొనిన విధంగా శ్రద్ధాహీనులై, ఉపదేశం చేసే వారికి మనోబాధ కలిగిస్తారు. రాజస్వభావం అహంకారమనే జ్వరతీవ్రత చేత కలిగే మైకంలాంటిదే కదా! ధనం మనస్సులో లేని ఆప్యాయతను ప్రదర్శిస్తుంది. రాజ్యసంపద అనే విషం మనిషికి వీడని మత్తు కల్గిస్తుంది.



నాయనా! చూడు – మంగళప్రదురాలైన లక్ష్మీదేవినే ఉదాహరణంగా తీసుకో! ఈమె వాడియైన ఖడ్గాలనే నల్లకలువల మధ్య నిరంతరం చంచలస్వభావంతో తిరిగే తుమ్మెద వంటిది. ఈమె పాలసముద్రం నుంచీ జన్మించే సమయంలో తమతోటివారి లక్షణాలన్నీ వెంట తెచ్చుకొని పుట్టింది. ఎలాగంటే పారిజాత పల్లవాలనుంచి రాగాన్ని (ఎరువుదనాన్ని, విషయవాంఛని) తోడు తెచ్చుకొంది. చంద్రరేఖనుండి వంకరతనాన్ని వెంటతెచ్చుకొంది. ఉచ్చైశ్రవంనుండి చంచలత్వాన్ని, కాలకూట విషంనుంచి మూర్ఛ కలిగించే శక్తిని, మదిర నుండి మత్తును, కౌస్తుభ మణినుండి కాఠిన్యతను తోడు తెచ్చుకొంది.

లక్ష్మి సంక్రమించినా అతికష్టం మీదగాని నిలవదు. ఎంత ఆపుదామనుకొన్నా సంపద దానంతట అదే నశించిపోతుంది. బాగా పొగరెక్కిన విచ్చుకత్తులు కలిగిన కాపలాదారుల్ని ఎందర్ని నియమించినా పంజరంలో కదలకుండా బంధించినా గాని అదృశ్యురాలౌతుంది. మదస్రావం కలిగిన గజశ్రేష్ఠాల్ని కొద్ది ఖాళీకూడ లేకుండా దట్టంగా నిలబెట్టి కాపలా కాసినా చిటుక్కున పారిపోతుంది. తెలిసినవారే కదా అని ఎవర్నీ రక్షింపదు. తనవారంటూ అపేక్షతో చూడదు. సౌందర్యాన్ని లెక్క చేయదు. వంశ క్రమాచారాన్ని పాటింపదు. శీలాన్ని లెక్కింపదు. ఆమెకు పాండిత్యంతో పనిలేదు (విద్వాంసుని గౌరవించదు) శాస్త్రవిషయాలను చెవినిపెట్టదు. ఆచారం పాటింపదు. సత్యంతో పనేలేదు. లక్ష్యలక్షణ సమన్వయం పనికిరాదు. గంధర్వ నగర లేఖలాగా చూస్తూ ఉండగానే మాయమౌతుంది.

ఈ లక్ష్మీదేవికి మంచి అంతా చెడులాగానో తోస్తుంది. చక్కగా చదువుకొన్న విద్యావంతుణ్ణి కంటితో చూడదు. గుణవంతుని కూడా అంటరాని వానినివలె ముట్టదు. ఔదార్యం కలవానిని అమంగళకరునిలాగా భావిస్తుంది. సజ్జనుణ్ణి నిష్ప్రయోజకునిలాగా కంటితో చూడదు. సత్కులంలో పుట్టినవాణ్ణి పామును చూచినట్లుగా దూరంగా దాటిపోతుంది. శౌర్యవంతుని ముళ్ళకంపనువలె విడచివేస్తుంది. దానశీలుని చెడ్డకలవలె తలంపనే తలంపదు.

వినయవంతుని పాపాత్మునివలె దూరంగా నెట్టి వేస్తుంది. పండితుని పిచ్చివానివలె భావిస్తుంది. హేళన చేస్తుంది. తన రూపాన్ని ఇంద్రజాలంలాగా ఉన్న దాన్ని లేనట్టు, లేనిదాన్ని ఉన్నట్టుగా చూపుతుంది.

ఈ ధనలక్ష్మి తన ఉనికిచేత ఎంత ఉష్ణతనిస్తుందో అంతటి బుద్ధిమాంద్యాన్ని కూడా కలిగిస్తుంది. ఔన్నత్యాన్నిస్తూనే నీచస్వభావాన్ని కలిగిస్తుంది. నీళ్ళలో నించి పుట్టినాగాని దాహాన్ని (ధనాశ) కలిగిస్తుంది. బలంతోపాటు చులకనతనాన్ని కూడా కలిగిస్తుంది. అమృతంతోపాటు చెల్లెలిగా జన్మించినా కషాయపు చేదురుచి కలిగిస్తుంది. ఈ చపలురాలు ప్రకాశవంతమైన దీప శిఖలాగా వెలిగినా కార్యఫలితాలు నల్లని మసిబారినవౌతాయి. ఈమె విషపుతీగెల పెంపకానికి జలధార లాంటిది. ఇంద్రియములనే లేళ్ళను మోసగించడానికి వ్యాధుడు పాడే కమ్మని పాటలాంటిది. ధనమదాంధులనే పిశాచాలకు ఈ లక్ష్మి పాడుపడిన యింటి చూరువంటిది. ఈమె జ్ఞానప్రదాలైన శాస్త్రాలకు కటిక చీకటివంటిది. సర్వ అవినయాది దుర్గుణాలకు నిలయమైనది. కోపతాపాలనే మొసళ్ళకు నిలయమైనది. కోర్కెలనే మద్యం దొరికే కల్లుపాక వంటిది. దోషాలనే సర్పాలకు నిలయమైన గుహవంటిది ఈ సంపద. సద్గుణాలనే కలహంసలకు నివాసయోగ్యం కాని వర్షాకాలం లాంటిది. కపటనాటకానికి నాందీప్రస్తావన (మొదలు) వంటిదీ లక్ష్మి. ప్రభువులను కూడా నమ్మించి, సప్తాంగ సహితుడైన గాని వంచించి విడచి వెళ్తుంది. ఇట్టి చపలురాలిని, దురాచారవతిని, రాజ్యలక్ష్మిని చేపట్టినప్పటికిని రాజులు విహ్వలులౌతారు.

పట్టాభిషేక సమయమందే పురోహితులు శిరమున కుమ్మరించే మంత్రజలాల చేతనే రాజునకు దాక్షిణ్యము కూడ రూపుమాసిపోతుంది. యజ్ఞహోమ ధూమంచేతనే అతని హృదయము పొగ చూరుతుంది. మలినమై పోతుంది. పురోహితుడు దర్భకూర్చలతో చల్లే నీళ్ళతోనే అతని క్షమాగుణం మాసిపోతుంది. తలపై కిరీటం పెడుతుండగానే తనకు వృద్ధత్వమే



రాదనుకొంటాడు. శ్వేతచ్ఛత్రము క్రిందికి రాగానే పరలోకమున్నదనే సంగతి మరచిపోతారు. దాసీలు విసరే చామరాల గాలికి నిజం పల్కటమనేదే నిర్మూలనమౌతుంది. అంగరక్షకుల చేతిబెత్తాల దెబ్బలతోనే సర్వసుగుణాలూ పరుగులు తీస్తాయి. జయశబ్దాల సందడికే మంచిమాటలు మాయమౌతాయి.

విషయలోలురైన రాజులు పంచేంద్రియాలనే పదివేల ఇంద్రియాలుగా భావిస్తూ నానాతిప్పలు పడుతూ ఆయాసపడతారు. పాలకులు తమ సహజ మనశ్చాంచల్యం చేత ఉన్నది ఒక్క మనస్సైనా వందల వేల మనస్సులున్నట్లుగా కోర్కెలు తీర్చుకొంటూ మత్తులో మునిగిపోతారు. దయ్యాలు పట్టినవారిలాగా, భూతాలచేత పీడింపబడువారిలాగా, దుష్టశక్తులచేత బంధింపబడ్డవారిలా, పిశాచాలచే ఆక్రమింపబడ్డ వారివలె బాధింపబడతారు. మన్మథబాణాలు మర్మస్థానాల్లో నాటినవారిలాగా, బాధతో ముఖాన్ని వికారంగా పెడతారు. పీతల్లాగా అడ్డదిడ్డంగా నడుస్తారు. అధర్మమార్గాన కుంటివారివలె వంకరటింకరగా నడుస్తారు. అబద్ధాలు అదే పనిగా చెప్పినందువల్ల నోరు వంకర తిరిగిపోగా మాట్లాడలేని పరిస్థితిలో ఉంటారు. ఏడాకుల అరటిచెట్టులాగా గాఢమైన వాసనచేత తలనొప్పి కలిగించినట్టుగా ఇతరుల బాధిస్తారు. మరణం సమీపించిన వారివలె ధనమదంచేత తనవారినే గుర్తుపట్టలేకపోతారు. ధనమదాంధులు తేజోవంతులను తేరిపార చూడలేరు. కాలసర్పంచేత కాటువేయబడిన వారివలె మంత్రములకు లొంగని మత్తుకు లోనౌతారు. లక్కతో చేయబడిన ఆభరణాల లాగా కాంతిమంతుని సహింప లేరు. ధనదాహ మనే విషంచేత ఒళ్ళు తెలియక లోకమంతా బంగారమే అనుకొంటారు. మదోన్మత్తులైన రాజులు సుందరాకృతికలవారైనా కాలంకాని కాలంలో పూసిన పుష్పాల్లాగా, శ్మశానంలో అగ్నిలాగా భయంగొలుపుతూ లోకవినాశకరులౌతారు. నేత్ర రోగుల్లాగా దగ్గఱున్న వారినే చూడలేరు.

నాయనా! చంద్రాపీడా! మతికొందఱురాజులు స్వార్థపరులు, ధనపిశాచా గ్రస్తులు. వారికి జూదము వినోదక్రీడ. పరభార్యల నాక్రమించుట చతురత.

వేటాడుటయే శరీర వ్యాయామము. మద్యసేవ భోగముకొఱకు. మద మెక్కియుండుట శౌర్యము. తనభార్యను విడిచి వేయుట కోర్కెలు లేకుండుటు. గురువాక్యము వినకుండుట పరులకు భీతికలిగించుట కొఱకు. స్వేచ్ఛగా ఉండుటయే అధికారము. దేవతల నవమానించటం మహాధైర్యలక్షణం. వారికి చాణకుక్యుని కుటిలనీతియే ప్రమాణము. అష్టగ్రహప్రయోగనిపుణులు, క్రూరస్వభావులు ఐన పురోహితులే గురువులు. సహజప్రేమకల అన్నదమ్ములు సమూలంగా నాశనం చేయదగినవారు.

కుమారా! ఇట్టి కుతంత్రములతో కూడిన రాజనీతిని తగిన విధముగా అనుసరించు. దురుపయోగం చేసి, లోకులదృష్టిలో నవ్వులపాలు కాకు. సజ్జనులచే నిందింపబడకు. పెద్దలచే తిరస్కారము పొందకు, స్నేహితులచేత విమర్శింపబడకు. విద్వజ్జనులు నీపై జాలిపడునట్లుండకు. ఎవరిచేత మోసగింపబడకు. ఎవరి ప్రలోభములకు లోను కావద్దు. రాజ్యలక్ష్మికి దూరం కావద్దు. ధనమదగర్వము పొందకు. రాగద్వేషాలకు వశుడవు కావద్దు. నీవు సహజము గానే ధీరుడవు. నీతండ్రి నుండి చక్కని సంస్కారమును పొందావు మనశ్చాంచల్యం కలిగి అజాగ్రత్తగానుండువానికి ధనములు మదము పుట్టిస్తై. కాని నీవంటి వాడికి ఏప్రమాదము కలుగదు. నీ వింత గుణవంతుడవు కనుకనే లాభము కలిగిస్తుందని నీకింత వివరముగా చెప్పాను అందువల్లనే నీకు మరలమరల చెప్పవలసి వచ్చింది. ఈ సంపద్వ్యా మోహము ఎంతటివానికైనా దుష్టత్వము కలిగించుతుంది. ఎంత విద్వాంసుడైనా, వింత జ్ఞానియైనా, ఎంత సాహసికుడైనా, ధైర్యవంతుడైనా, ఎంతటి కార్యశూరుడైనా ఈ లక్ష్మివలన చెడిపోవలసిందే. రాజకుమారా! నీతండ్రి నిన్ను యౌవరాజ్య పట్టాభిషిక్తుని చేయ ఉవ్విళ్ళురుతున్నాడు. నీ పూర్వుల వలెనే నీవున్నూ నీ తండ్రి నుండి సంక్రమించిన భూభారాన్ని సమర్థతతో నిర్వహించు. నీ శత్రురాజుల శిరములను తెంపివేయి (శత్రువుల జయించు) నీ వారిని అభివృద్ధిలోనికి తే, ఈ అభిషేకం అయిన తర్వాత దిగ్విజయ యాత్ర



ప్రారంభించు. ఈ లోకం ముందే మీతండ్రిగారి చేత జయింపబడినదే, ఐనను ఒక్కసారి భూమండలమంతా తిరిగి నీ అధికారాన్ని స్థాపించు. నీ శౌర్యపరాక్రమాలను పరీక్షించుకొనేందుకు ఈ విజయ యాత్ర నీకు అవకాశ మిస్తోంది. ప్రతాపవంతుడైన రాజు త్రైలోక్యదర్శియైన యోగీంద్రునివలె ఎదురులేని ఆజ్ఞాప్రభావం కలవాడౌతాడు" అని పలికిన మంత్రివాక్యములు విన్న రాకుమారుడు ప్రశాంతమైన, పవిత్రమైన మనస్సు కలవాడై కొద్దిసేపుండి, అనుమతి పొంది ఇంటికి వెళ్ళాడు.

## 24. చంద్రాపీడుని యువరాజ పట్టాభిషేకం

తరువాత కొంతకాలానికి మహారాజు తారాపీడుడు పెద్దల అనుమతితో చంద్రాపీడునికి యౌవరాజ్యపట్టాభిషేకం తలపెట్టాడు. ఒకమంచి ముహూర్తాన శుకనాసునితో కూడి తానే మంగళ జలకలశాన్ని ఎత్తుకొని పురోహితుడు సమస్త పట్టాభిషేక సంభారాలూ కూర్చగా సమస్తరాజులు వెంటరాగా ఆస్థానమంటపానికి వచ్చాడు. ఆ మంటపం శోభాయమానంగా అలంకరింపబడి ఉంది. దేశంలోని అన్ని తీర్థముల నుండి, అన్ని నదుల నుండి, అన్ని సాగరము నుండి తెచ్చిన జలకలశాలున్నై. సర్వవిధ ఫలాలను సేకరించారు. అనేక ప్రాంతాల మృత్తికలను (మట్టిని) సమకూర్చారు. అన్ని రకాల రత్నాలు ప్రోగు చేశారు. ఆ పుణ్య జలాలతో తారాపీడుని ఆనందబాష్ప జలాలుకూడా కలిసినై. ఆ నీరు మంత్రంచే పవిత్రమైనది. చంద్రాపీడుడు వేదమంత్రాల మధ్య అభిషేక జలాలతో తడిసిన దేహంతో నున్నాడు. అప్పుడు రాజ్యలక్ష్మి ఒక చెట్టునుండి వేరొక చెట్టుపైకి పాకే లతలాగా తారాపీడుని నుండి చంద్రాపీడుని వద్దకు మారింది. అటుపై సర్వాంతఃపుర పరిచారికలతో కూడి వచ్చిన తల్లి విలాసవతీదేవి తనకు తానుగా చంద్రాపీడుని దేహానికి తెల్లని చంద్రకాంతివంటి చందనాన్ని పూసింది. చంద్రాపీడుడు కొత్తగా వికసించిన పుష్పముల మాలికను శిరమున ధరించాడు. ఆకుపచ్చని గడ్డి పరకలను చెవిలో అలంకరించుకున్నాడు. పొడవైన, అందమైన అంచులు

గల, చంద్రునికాంతి వంటి తెల్లని పట్టువస్త్రం ధరించాడు. పురోహితుడి చేత కట్టబడిన మంగళతోరణం దక్షిణ హస్తానికి ఉంది. మెడ నుండి క్రిందికి వ్రేలాడుచున్న వైకక్ష్యమాలిక తెల్లని పుష్పముతో చంద్రకిరణ ప్రకాశము కలిగియున్నది. అభిషేక జలధారలతో తెల్లని వస్త్రములతో నున్న చంద్రాపీడుడు అనేక జలప్రవాహాలతో ప్రకాశించే హిమవంతునిలా ఉన్నాడు.

తారాపీడుడు ఆచారముకొఱకు ఒక బెత్తము పట్టుకొని అచ్చటి వారిని ప్రక్కకు తొలగించి దారి ఏర్పాటు చేస్తూ ముందు నడువగా చంద్రాపీడుడు అతని వెనుక నడచి, బంగారు సింహాసనము చేరి దానిని అధివసించాడు. అపుడతడు మేరుపర్వతంపైన చంద్రుడులా ప్రకాశించాడు. చంద్రాపీడుడు సింహాసనాసీనుడవుతుండగానే ప్రళయకాలంలో మ్రోగే ధ్వనితో భేరులు మ్రోగినై. ఆ ధ్వనులు యువరాజు చేయబోవు జైత్రయాత్రకు సంకేతాలు. ఆ భేరీ ధ్వనులకు దిక్కుల అంతరాళాలు నిండిపోయినై. దిక్కుల సంధులు విడిపోయినై. ఆ ధ్వనులు సూర్య రథములకు కట్టిన అశ్వములతో కలిసి భూప్రదక్షిణ చేసినై. ఆ భేరీ ధ్వనులను విన్న జనులు యువరాజునకు జయశబ్దాలు పలుకుతుండగా సింహాసనం నుండిలేచాడు. ఆస్థానమండపం నుండి దిగ్విజయ యాత్రకై బయలుదేరాడు. చంద్రాపీడుడు లేవగానే గౌరవార్థం రాజులంతా ఒక్కసారి లేచారు. అలా లేవటంచేత వారి ఆభరణాలు పరస్పరం ఒరిపిడిచేత శబ్దాలు చేసినై ముత్యాల హారాలు తెగిపోయి తెల్లని లావైన ముత్యాలు ఆ ప్రాంతమంతా వ్యాపించినై.

అప్పుడా చంద్రాపీడుడు తెల్లని పుష్పాల మొగ్గలను వర్షిస్తున్న పారిజాత వృక్షంగా ఉన్నాడు. దిగ్విజయ యాత్రకు బయల్దేరిన ఆతనిపై జనులు మంగళలాజలను (పేలాలు) జనులు విసిరినట్లుగా ఉన్నాడు. దిగ్గజములు తొండములతో జలబిందువులు కురిపిస్తుంటే ఐరావతంలాగా ఉన్నాడు. దిక్కులచేత తారాగణ వర్షం కురిపించబడుతున్నప్పుడు విశాలగగనంలాగా ప్రకాశించాడు. మేఘబృందాలు పెద్దపెద్ద చినుకులు కురిపిస్తున్నప్పుడున్న వర్షకాలంలాగా యువరాజు అందగించాడు.



## 25. చంద్రాపీడుని దిగ్విజయ యాత్ర

రాజాస్థాన మండపంనుంచి, బయటకు వచ్చిన చంద్రాపీడుడు తనకు వెనుక పత్రలేఖను కూర్చుండ బెట్టుకొని పట్టపుటేనుగుని అధిరోహించాడు. వారికి ఎండ తగలకుండటానికి తెల్లని గొడుగు పట్టారు. మంధర పర్వతంతో చిలికేటప్పుడు ఏర్పడిన గుండ్రని సుడులతో కూడిన పాలసంద్రంలాంటి కాంతితో మెరుస్తోంది ఆ గొడుగు. అది రావణుడు తన బాహుబలంచేత బలంగా పైకి లేపబడిన కైలాసపర్వతశిఖరంగా ఉంది. దానికి వంద చువ్వలున్నై, ఆ యువరాజు దిగ్విజయయాత్రకు బయలుదేరిన ఆ రోజు ఎంతో శుభప్రదమైంది. లేతవైన ఎఱ్ఱని ఉదయ సూర్యకాంతులు ఆకాశాని అలుముకున్నై. ప్రహరీకి ఆవల నిలచిన రాజులు తమ కిరీటాలలోని రత్నకాంతులు ఆకాశాన నిండగా తలలు పైకెత్తి చంద్రాపీడుని ఆగమనాన్ని ఎదురుచూస్తున్నారు. రాజ్యలక్ష్మి తన పాదాలకు పెట్టుకొన్న పారాణిగుర్తుల్లాగా ఆ భూమి ఎఱ్ఱని కాంతితో ప్రకాశించింది. యువరాజు అధివసించిన ఏనుగుతో పాటు మిగిలిన గంధగజాలన్నీ కదిలినై. వాటిని అధివసించిన రాజులకు పట్టిన ఛత్రాలు ఆకాశంలో ఒకదానితో ఒకటి ఒరుసుకొంటున్నై. ఆభరణాలలో పొదిగిన రత్నాలు రాలి క్రిందపడుతున్నై. అలంకారాలు వాటిస్థానాల్లో అవి ఉండటం లేదు. చంద్రాపీడుని సేనాపతి ఆ యా రాజుల నామధేయాలు చదువుతూ వారిని క్రమబద్ధీకరిస్తున్నాడు. యువరాజెక్కిన పట్టపుటేనుగుకు ముందుగా స్వర్ణాభరణాలతో అలంకృతమైన ఇంద్రాయుధం నడుస్తోంది. ఈ విధంగా యువరాజు తూర్పు దిగ్విజయయాత్రకు బయల్దేరాడు.

ఆ యాత్రలో పాల్గొన్న రాజులందఱితో పాటు చంద్రాపీడుడు ఏనుగుపై వస్తూ ఉండగా వైశంపాయనుడు కూడా ప్రయాణమంగళకార్యాలు పూర్తి చేసుకొని, తెల్లని వస్త్రములను ధరించి, తెల్లని పూలమాలలు, చందనం ధరించి, అనేకమంది రాజులు వెంటరాగా తెల్లని గొడుగుతో అలంకరింపబడిన త్వరగా నడువగలిగిన ఏనుగును ఎక్కి రెండవ యువరాజులాగా ప్రకాశిస్తూ

వైశంపాయనుడు చంద్రాపీడునితో కలిశాడు. సూర్యునిలాగా యువరాజున్నాడు. వైశంపాయనుడు చంద్రునిలాగా ఉన్నాడు. యువరాజు బయల్దేరాడనే వార్త వ్యాపించగానే పదాతిదళాలు కూడా మహోత్సాహంతో కదులుతుంటే వారి పాదాల తాకిడికి కులశైలాలు కంపించినై, వారితో పాటు చిన్న చిన్న రాజులు తమ సైన్యాలతో యువరాజుకు వందనాలు సమర్పిస్తూ నడవసాగారు. అందలి రాజులు తెల్లని గొడుగులతో నడుస్తున్నప్పటికి ఆ గొడుగులు వారి ఆభరణాలలోని మణులకాంతులుపడి నెమళ్ళు పురివిప్పిన అందాలతో ప్రకాశించాయి.

నేల మొత్తం గుఱ్ఱాలతో నిండినట్టు, దిక్కులన్నీ ఏనుగులతో నిండినట్టు, ఆకాశమంతా ఛత్రమయమైనట్టు, అంబరవీధి పతాకధ్వజాలతో నిండినట్టు, వాయువు మదపుటేనుగుల మదపరిమళభరితమైనట్టు, ప్రజాసృష్టి కేవలం రాజులతోనే చేయబడిందా అన్నట్టు, చూపులన్నీ ఆభరణమణికాంతిపుంజమా అన్నట్టు, పగలు అంతా కిరీటాలతో నిండిందా అన్నట్టు, ముల్లోకాలూ జయ శబ్దంతో నిండినట్టూ కన్పడసాగింది. ఎక్కడ చూసినా కులపర్వతాలవలె కదులుతున్న ఏనుగుల చేత, ప్రళయకాలంలో చంద్రబింబాల్లాగా అసంఖ్యాకంగా ఉన్న గొడుగులచేత, సంవర్తకాలనే మేఘాల గంభీరగర్జనలను పోలిన భేరీధ్వనుల చేత, ఆకాశం నుండి నక్షత్రాల వర్షం కురుస్తోందా అనిపించే ఏనుగుతొండాలనుండి చిమ్మబడిన జలబిందువుల చేత, పిడుగులు పడుతున్నవేమో అనిపించే ఏనుగుల కంఠఘీంకారగర్జనల చేత ఆ ప్రాంతమంతా నిండిపోయింది. అది ప్రళయకాలసమయంలా అనిపించింది. గుఱ్ఱాలు వరుసలు కట్టి నడుస్తుంటే సంక్షోభించే సముద్రంలోని తరంగాల్లాగా కనిపించింది.

ఆ మహాసైన్యం చేసే కోలాహలశబ్దాలు విని భయపడిన దశదిక్కులు దిక్కుతోచక దూరంగా పరిగెత్తి పోయినట్టు తోచింది. ఆ సైన్యంలో ఉన్న మదగజాల మదజలంతో కలిసిన దుమ్ము తనపై పడుతుందేమో అని దూరంగా



పారిపోయినట్లుగా ఉంది ఆకాశం. గుఱ్ఱాల కాలిగిట్టలచేత లేవగొట్టబడిన దుమ్ముతో కూడిన సూర్యకిరణాలు ద్వారపాలకులచేతి బెత్తాల దెబ్బలకు దూరంగా పరుగెత్తినట్టుగా ఆ ప్రాంతాన్ని వదలి పోయినై. ఏనుగులనుండి స్రవించిన మదజలంచేత ఆ నేలంతా చీలమండలం లోతు బురదగా మారినందున క్రిందనడిచే పదాతిబల సైనికులు పదే పదే కాళ్ళు జారుతుండగా నడువలేకపోయారు. ఆ సైన్యంలోని మదగజముల నుండి స్రవించిన మదజలం మిక్కిలి ఘాటుగా ముక్కులకు తాకటంచే వారు ఏ ఇతర గంధాలు పీల్చలేకపోతున్నారు.

ఆ సైన్యంలోని పదాలు పెద్దపెద్ద ధ్వనులు చేస్తున్నారు. బారైన బాకాలను ఊదుతున్నారు. గుఱ్ఱాల గిట్టల శబ్దంతోపాటు వాటి సకిలింపుల ధ్వని కూడా కలిసి శబ్దం రెట్టింపైంది. ఏనుగులుచేసే చెవుల కదలికల చప్పుడు, వాటి ఘీంకారాలు, వాటి మెడలో కట్టిన గంటల యొక్క శబ్దాలూ కలిసి మూడింతల గోల వినిపిస్తోంది. మాటిమాటికి తప్పెట్లు మోగుతున్నై.

ఆ చతురంగబలాల సమ్మర్దంచేత భూతలమంతా కంపిస్తోంది. రణగుణధ్వనులతో చెవులు బ్రద్దలౌతున్నై. పాదఘట్టనల చేత ఆకాశానికి లేచిన దుమ్ముతో మేఘాలు కన్మినట్లనిపిస్తోంది. భూమి నుండి పైకి లేచిన దుమ్ము నెమ్మది నెమ్మదిగా తగ్గి ఎవరెక్కడున్నారో తెలియసాగింది, ఏనుగులు తమ తొండాలు పైకెత్తి తెల్లని నీటి తుంపురులను ఆకాశంపైకి వదలుతున్నాయి. గుఱ్ఱాలు నోటినుండి లాలాజలం నురుగు కారుతుండగా మోరలు పైకెత్తి సకిలించగా ఆ తుంపురులు ఆకాశంలోని దుమ్మును శాంతింపజేస్తున్నై. ఏనుగులు కుంభస్థలాల నుంచి, చెవులనుంచీ స్రవిస్తున్న మదధారలను, చెవులను గట్టిగా కదలింపగా లేచిన మదపుబిందువులచేత దుమ్ము శాంతిస్తోంది. క్రమక్రమంగా దిక్కులు దుమ్ము అణగి ప్రశాంతంగా కనపడసాగినై.

ఇలా ప్రయాణిస్తూ చతురంగబలాలు పోతూ ఉండగా వైశంపాయనుడు చంద్రాపీడుని ఏనుగుకు సమీపంగా తన ఏనుగును నడిపిస్తూ, "యువరాజా! తారాపీడమహారాజు జయింపని దేశం ఎక్కడుం దీ ప్రపంచంలో! నీవు ప్రత్యేకంగా జయించడానికి? మీ తండ్రిగారికి వశంకాని దేశం ఏది? నీవిప్పుడు వశం చేసుకొనేందుకు? ఆయన లోబరచుకోని దుర్గాలు ఏవి? నీవు ఇప్పుడు లోబరచుకోవటానికి? నీ స్వాధీనంలోకి రాదగిన ద్వీపాంతరాలన్నీ అంతకు మునుపే మీనాయన గారు స్వాధీనం చేసుకొన్నారు కదా! నీ వేరత్నాలు సంపాదింపదలచావు? తారాపీడుడు సర్వరత్నాలు సంపాదించిన తరువాత? మీ నాయనగారు జయింపని దేశమీది? ఆయనకు వశులు కాని రాజులేరి? ఆయనకు దాసానుదాసులై పాదవందనం చేయని రాజెక్కడున్నాడు? మీ తండ్రిగారు సర్వరాజోపచారాలు ఇంతకు మునుపే పొందారు. ఏదో ఆచారంకోసం ఈ యాత్ర చేస్తున్నామే కాని, ప్రత్యేకంగా దీనివల్ల మనం సాధించేదేమీ లేదు" అన్నాడు.

ఆ సైన్యం ఒక విశాల ప్రదేశంలో విడిదిచేసింది. రాజకుమారుని శయ్యకు దగ్గరలో వైశంపాయనుడు నిద్రించాడు. కొంత దూరంలో పత్రలేఖ నేలపై పరచిన బొంతపై పడుకొన్నది. చంద్రాపీడ వైశంపాయనులు, పత్రలేఖ రాత్రి పొద్దు పోయేవఱకు తల్లిదండ్రుల గూర్చి శుకనాసమంత్రిని గూర్చి మాట్లాడుకొంటూ దాదాపు రాత్రంతా మేల్కొనే గడిపారు.

తెల్లవారగానే లేచి ప్రయాణానికి సిద్ధమైనారు. నిర్విరామంగా ప్రయాణించారు. వెళ్ళిన చోట్లల్లా ఓడిపోయిన రాజసైన్యాన్ని తమసైన్యాలతో కలుపుకుంటూ పోసాగారు. ఈ సైన్యం తాకిడికి భూమి అల్లాడిపోతోంది. కొండలు కంపిస్తున్నై. నదులు ఎండిపోతున్నై. సరస్సులు ఇంకిపోతున్నై. అరణ్యాలు చూర్ణమైపోతున్నై. హెచ్చుతగ్గుల భూమి సమాంతరమౌతోంది. కోటలు బీటలు వారుతున్నై. గర్వితుల్ని వినీతుల్ని చేస్తూ ఉన్నారు. లొంగిన వారిని ప్రోత్సహిస్తున్నారు. భయకంపితుల్ని ఓదారుస్తున్నారు. శరణన్న వారిని



రక్షిస్తున్నారు. రాజులను సింహాసనం నుంచి తొలగించి ఆ సింహాసనాలపై వారి పుత్రుల్ని నిలుపుతున్నారు. దానశాసనాలు నెలకొల్పారు. కప్పాలు వసూలు చేశారు. తమ విజయచిహ్నాల్ని నెలకొల్పారు. బ్రాహ్మణులను పూజించారు. అరణ్యంలోని ఆశ్రమాలను పోషించారు. ఇలా సర్వదేశాలు సంచరించి విజయయాత్ర చేశారు.

ఇలా పోతూ కైలాసం సమీపంలో హేమకూట నివాసులైన కిరాతుల రాజధానిని 'సువర్ణపురా'న్ని కూడా స్వాధీనపరచుకొన్నారు. ఇంతదూరం తిరిగి ఇన్ని యుద్ధాలలో విజయం పొంది అలసిపోయిన తన సైన్యానికి ఆ ప్రాంతంలోనే విశ్రాంతికి విడిది ఏర్పాటు చేయించాడు. కొద్దిరోజులు అక్కడ విశ్రాంతి తీసుకోసాగారు.

ఒకనాడు యువరాజు ఇంద్రాయుధం ఎక్కి వేటకు బయల్దేరాడు. కొద్ది సైన్యంతో ఒకచోట అతనికి కొండ శిఖరం మీదనుండి దిగుతున్న కిన్నెర దంపతులు కనిపించారు. చంద్రాపీడుడు కుతూహలంతో వారిని పట్టుకోవటానికి వెంటపడి తరిమాడు. ఆ వింతదంపతు ల్నెలాగైనా పట్టుకోవాలనే పట్టుదలతో గుఱ్ఱాన్ని వేగంగా పరుగెత్తించాడు. తన సైన్యానికి దూరమై ఏకాకిగా చాలాదూరం వచ్చేశాడు చంద్రాపీడుడు. ఇదిగో దొరికారు, దొరికారు అనుకుంటానే ఐదుయోజనాలదూరం వెళ్ళిపోయాడు. యువరాజు. ఇంతలో కిన్న కిన్నర మిథునం ఎటో వెళ్ళి మాయమై పోయారు.

చంద్రాపీడుడు ఆయాస పడుతూ చెమట కక్కుతున్నాడు. ఇంద్రాయుధం కూడా శ్రమతో రోజుతూ నురుగులు కక్కుతున్నది. అప్పటికి చంద్రాపీడునికి తనపరిస్థితి అర్థమైంది. "అయ్యో! అనవసరంగా ఇంత శ్రమపడ్డానే? పిల్లవాడిలాగా అనాలోచితంగా ప్రవర్తించానే! ఆ కిన్నరమిథునాన్ని పట్టుకొంటే ఏమిటి, పట్టుకేకపోతే ఏమిటి? సరే వాళ్ళని పట్టుకున్నామే అనుకో! దానివల్ల ఒరిగే దేమున్నదికనుక? నేనెంత తెలివి తక్కువవాణ్ణి! యోజనశూన్యమైన పనులలో ఇంత శ్రద్ధ తగునా? చేయవలసిన పని వదలి, చేయరాని పనిలో

ఆసక్తి చూపించాను. పెద్దలప్పగించిన బాధ్యతను నెరవేర్చలేక పోయాను. జైత్రయాత్ర పరిపూర్ణం కాకుండానే నా వారిని వదలి ఇంత దూరం ఒంటరిగా వచ్చాను. ఎవరో గుఱ్ఱపు ముఖం కలవారికోసం ఇంత దూరం వచ్చాననంటే నా పనికి నాకే నవ్వొస్తున్నది. ఇంద్రాయుధం వేగం అసామాన్యమైంది కనుక నేను నా వారిని వదలి ఎంతదూరం వచ్చానో చెప్పటం కష్టమే. నేనిప్పుడు వచ్చినదారినే తిరిగి వెళ్దామన్నా అది సాధ్యం కాదు. ఈ అసంఖ్యాకంగా ఉన్న చెట్లు, తీగలుగల అరణ్యంలో వచ్చిన దారి ఎలా తెలిసికోగలను? ఒక వేళ నా అదృష్టం బాగుండి ఎవరైనా మనిషి కనపడితే సువర్ణపురం వెళ్ళే మార్గమన్నా అడగవచ్చు. కాని ఏదీ ఈ అడవిలో మనుష్యులెవరూ కనపడటం లేదు కదా!

లోగడ నేను విన్నదాని ప్రకారం ఉత్తరంగా సువర్ణపురం ఉందని, దాని తర్వాత నిర్మానుష్యమైన అరణ్యముందని తెలుస్తోంది. దానిబట్టి నేనిప్పుడు దక్షిణదిశగా ప్రయాణం చేస్తే గమ్యస్థానం చేరుకొంటానేమో! తాను చేసిన తప్పులకు ఫలితం తానే అనుభవించాలికదా!" అని తనలో తానిట్లనుకొని గుఱ్ఱాన్ని మరల్చబోయాడు. ఇంతలో అతనికి మళ్ళీ ఇలా అనిపించింది. "ప్రస్తుతం సూర్యభగవానుడు నడినెత్తిపై ఉన్నాడు. ఈ ఇంద్రాయుధం బాగా అలిసిపోయింది. అందుచేత ఈ గుఱ్ఱానికి నాలుగు గడ్డిపరకలు తినిపించి, ఏ సరస్సులోనో, వాగులోనో, నదిలోనో గుక్కెడు నీళ్ళు వెతుకుతూ బయల్దేరాడు. అలా కాసేపు వెతికేసరికి సమీపంలో ఏదో జలస్థానం ఉన్నదని గుర్తులు కొన్ని కనిపించినై. అప్పుడే తామరకొలనులో మునిగి బయల్దేరిన ఏనుగుల గుంపుకు చెందిన బురదకాలిగుర్తులు కనబడినై. వాటి తొండాలతో పీకబడిన తామరపుష్పాలు వాటి వాడలు చిందరవందరగా పడి ఉన్నై. తడిసిన నాచుమొక్కలు పడి ఉన్నై. ఏనుగుల చేతలాగి వేయబడిన అనేక నీటి పువ్వులు నలిపివేయబడి ఉన్నై. ఆ పువ్వులను వదిలిపెట్టకుండా తుమ్మెదలు వాటిచుట్టూ తిరుగుతున్నై. ఆ మార్గమంతా పూలసువాసనలతోనూ, ఏనుగు మదసుగంధంతోనూ నిండిపోయి ఉంది.



## 26. అచ్ఛోద వర్ణనం

చంద్రాపీడుడికి ఈ ప్రాంతంలో ఒక సరస్సుందని నమ్మకం కలిగింది. అతడు ఆ గుర్తులకు వ్యతిరేకదిశలో సరోవరం వైపు నడవసాగాడు. ఆ ప్రాంతమంతా పాల, మద్ది, చీకటి చెట్లు గుంపులు గుంపులుగా ఉన్నై. ఆ ప్రాంతాల్లో ఎలుకలు నేలలో బొరియలు తవ్వుకొని వాటిలో నివసిస్తున్నై. ఆ ప్రాంతాల్లో కస్తూరీ మృగాలు, నెమళ్లలాగా ఉండే జీవపక్షులు, అడవిమనిషి దంపతులు, గోచరిస్తున్నారు. అలా కొంతదూరం నడచి రాజకుమారుడు పైలానపర్వత సమీపప్రాంతానికి చేరాడు. అతనికి ఒక సరస్సు కన్పించింది.

ఆ సరస్సు కొంతదూరంలో ఉండగానే వివిధ జలపక్షులు చేసే మనోహర శబ్దాలు వినిపిస్తున్నై. కొంత దూరం పోగా అతనికి స్పష్టంగా సరస్సు కనిపించింది. అది త్రైలోక్యలక్ష్మి వాడే మణిదర్పణంలాగా ఉంది. భూదేవిస్ఫటికాలతో నిర్మించుకొన్న భవనంలాగా ఉంది. అది ఆకాశానికి ప్రతిబింబంలాగా ఉంది. ద్రవంగా మారిన కైలాసగిరిలాగా ఉంది. ద్రవరూపంలో ఉన్న వెన్నెలలాగా ఉంది. శివుని అట్టహాసం నీరుగా మారినట్లుగా ఉంది ఆ సరస్సు. మూడులోకాల్లోనూ ఉన్న పుణ్యాన్ని రాశిపోశారా అన్నట్టుంది. శరత్కాల మేఘాలన్నీ గుంపుగా వచ్చి జలంగా మారినట్టుంది ఆ సరస్సు. వరుణదేవుడు వాడే ముఖదర్పణంలా స్వచ్ఛంగా ఉండది. ఆ సరస్సు మునుల యొక్క మనస్సుల చేత, సత్పురుషుల గుణాల చేత, వేడి కన్నులకాంతుల చేత, ముత్యాలకాంతుల చేత నిర్మించినట్లు అతి స్వచ్ఛంగా ఉంది. ఆ సరస్సు జలాలతో నిండుగా ఉన్నప్పటికి, లోపల భాగమంతా ప్రస్ఫుటంగా కనబడటం చేత అసలు దానిలో నీరే లేదేమో అనిపిస్తోంది. ఆ సరస్సులోని కెరటాలు వివిధవర్ణాలు కలిగిన పుప్పొడులతో నిండి ఉండటం చేత అవి ఇంద్రధనుస్సుల్లాగా ప్రకాశిస్తున్నై. కైలాస శిఖరం అక్కడికి దగ్గరలోనే ఉంది. శివపార్వతులు దానిలో స్నానార్థం మునిగారు. అప్పుడు శివుని జటాజూటంలోని అమృత ద్రవంతోనూ, వామభాగాన ఉన్న

పార్వతి యొక్క కపోల సౌందర్యం ఆ జలాలలో కలిశాయా అనట్లు ప్రకాశించినై.

ఆ సరోవరతీరాన చీకటి చెట్లు అధికంగా ఉండటం చేత సరోవర ప్రాంతాలన్నీ చీకటితో ఆవరింపబడ్డాయి. సరస్సులోని చక్రవాక పక్షుల జంటలు నిజంగానే చీకట్లు వ్యాపించినై అని భ్రమపడి వియోగ దుఃఖం అనుభవించటం ప్రారంభించినై.

ఆ సరస్సు నిత్యము నీటితో నిండిన పవిత్ర జలకమండలంలాగా ఉంది. ఆ సరస్సులో నిరంతరం (ముప్పొద్దులా) వాలఖిల్యాది మహర్షులు సంధ్యను ఉపాసిస్తుంటారు. సప్తర్షిమండలం ప్రతిరోజూ స్నానాలు చేయటం చేత పవిత్రం చేయబడింది. ప్రతినిత్యము సిద్ధాంగనలు తమ కల్పలతావల్కలాలను ఉతకటం చేత ఆ సరోవర జలం పుణ్యవంతమైంది. ఆ సరస్సులో జలకాలాడటానికి ఉత్సాహంగా నీళ్ళలో దిగిన గుహ్యకేశ్వరుని (యక్షరాజైన కుబేరుని) అంతః పురకాంత లోతైన నాభిరంధ్రాలలోనికి చాలా నీరు ప్రవేశిస్తూ ఉంటుంది. అప్పుడప్పుడు వరుణుని వాహనమైన హంస ఈ సరస్సులోని తామరల మకరందాన్ని ఆస్వాదిస్తూ ఉంటుంది. ఒక్కొక్కప్పుడు దిగ్గజాలు దానిలో దిగి తామరతూడులను పీకి పారవేసి అల్లరి చేస్తూ ఉంటాయి. ఒక్కొక్కప్పుడు శివుని వాహనమైన నందీశ్వరుడు ఈ సరోవరతీరాన్ని తన కొమ్ములతో ఎగజిమ్మి ఆటలాడుకొంటూ ఉంటాడు. ఆ ఆటలో ఆతనికొమ్ములధాటికి బండ రాళ్ళుకూడా ముక్కలవుతూ ఉంటాయి. కొన్ని సమయాలలో యముని మహిషం ఆ సరస్సులోదిగి తలను నీళ్ళలో ముంచి, తన కొమ్ములతో నీటిపై పేరుకొన్న నురుగు దొప్పలను పైకి ఎగచిమ్ముతూ క్రీడిస్తూ ఉంటుంది. ఎప్పుడైనా దేవేంద్రుని వాహనం ఐరావతం ఈ సరస్సులో దిగి ఈతలాడడమే కాక, తన రోకళ్ళలాగా బలమైన తన నాలుగు దంతాలతో కలువలను తెంచి పారవేస్తూ ఉంటుంది.



ఆ సరోవరం మీన, మకర, కూర్మంలాంటి ప్రశస్త జలజంతువులతో కూడి ఉండి మహాపురుషుని శరీరంలాగా శోభిస్తూ ఉంటుంది. పాండు (తెల్లని) ధార్తరాష్ట్ర (హంసలవంటి పక్షులు) పక్షులు తమలో తాము గొడవలుపడుతూ సరోవరం అల్లకల్లోలం చేస్తూ మహాభారతకథను గుర్తుకు తెస్తాయి. ఆ సరోవర తీరంలో నెమళ్ళు (శితికంఠాలు) సరస్సులోని విషాన్ని (నీటిని) త్రాగుతూ అమృతమథనసమయంలో శితికంఠుడు (శివుడు) విషంతాగిన ఘట్టాన్ని గోచరింపజేస్తాయి.

ఆ సరోవరంలోనికి వంగిన కొమ్మలుగల కడిమి చెట్లపైనున్న హరులు (కోతులు) చెట్టుపైనుండి నీటిలోకి దూకుతూ బాలకృష్ణుడు యమునలోకి దూకినదృశ్యాన్ని జ్ఞప్తికి తెస్తై, మొసళ్ళుండటం చేత ఆ సరస్సు మన్మథుని జండాలాగా ఉంది. ఆ సరస్సులో అనిమిషలోచనాలు (ఒకరకం చేపలు) సంచరిస్తూ ఉండటం చేత అది దేవతా సంబంధమైనదిగా కనపడుతోంది.

పుండరీకాలు (తెల్లతామరలు) ఉండటం చేత ఆ సరస్సు పుండరీకాలు (పులులు)న్న అరణ్యంలాగా తోస్తోంది. అనంతమైన శతపత్రాలనే పుష్పాలతో కూడి ఉన్న ఆ సరస్సు అనంతుడు మొదలగు నాగరాజులతో కూడిన పాతాళలోకంలాగా ప్రకాశిస్తోంది. ఇంతటి మహిమాన్వితమైన సరోవరం పేరు 'అచ్ఛోదసరస్సు'.

చంద్రాపీడుడు ఆ అచ్ఛోదసరోవరం, దాని సౌందర్యం చూసి చాలా ఆనందించాడు. దానిపై నుండి వచ్చే పరిమళభరితమైన వాయువులు చల్లగా శరీరాన్ని తాకినై, అప్పటిదాకా తాను పడిన శ్రమ మొత్తం నివారింపబడింది అతనిలో నూతనోత్తేజం నిండారింది. ఆ అచ్ఛోద సరస్సును చూసి చంద్రాపీడుడు తనలో తాను ఇలా అనుకొన్నాడు.

"ఆహా! ఈ సరస్సును చూడగలిగిన నేను ఎంతో అదృష్టవంతుణ్ణి. నేను తురంగముఖం కలిగిన కిన్నెర దంపతులను వెంటాడి ఇంతదూరం ఎందుకు

వచ్చానా అని బాధపడ్డాను. కాని ఇప్పుడు ఆనందపడుతున్నాను. ఈ సరోవరాన్ని చూస్తేనే చాలు జన్మ ధన్యమౌతుంది. నా కళ్ళతో ఎంత మనోహర దృశ్యం చూడాలో అంత మనోహరదృశ్యాన్ని చూడగలిగాను. రమణీయాలకల్లా అత్యంత రమణీయమైన అచ్ఛోదసరోవరదర్శనం చేయటం చేత జన్మ సఫలమైంది. ఇది అత్యంతాహ్లాదకరమైనది. మనోహర దృశ్యాలకిది చివరిమెట్టు. ఈ సరస్సుకన్న సంప్రీతికరమైన దీ లోకంలో వేరే ఏదీ లేదు, ఉండబోదు. నేను ఎంత సుందరదృశ్యాన్ని చూడాలో అంత సుందర దృశ్యాన్ని చూశాను. ఇంతటి చక్కని సరస్సును సృష్టించిన తర్వాత మరల అమృతరసాన్ని సృష్టించి బ్రహ్మ వృథాగా శ్రమపడ్డాడు. ఈ సరోవరజలం అమృతంతో సమానమై సర్వేంద్రియ ఆహ్లాదం కలిగించటమే కాదు, అతిస్వచ్ఛమైన జలాలు కలదియై కన్నుల కింపు కూరుస్తోంది. శివుడు కైలాసం కంటే ముందే ఈ సరోవరాన్ని చూసి ఉన్నట్లయితే తన నివాసం ఇక్కడే ఏర్పాటు చేసుకొనే వాడు. విష్ణువు ఈ సరోవర జలాన్ని రుచిచూచి ఉన్నవాడైతే ఆయన ఆ ఉప్పునీటి సముద్రంలో ఎంతమాత్రం శయనించేవాడు కాదు. భూదేవి ముందుగా ఈ సరస్సును చూస్తే ఇక్కడే దాగి ఉండేది. చూడలేదు కనుకనే ఆదివరాహం ముట్టెకోరల దెబ్బలకు భయపడి అగస్త్యుడు త్రాగి ఎంగిలి చేసిన ఉప్పునీటి సముద్రంలో దాగి ఉంది. మహావరాహరూపుడైన మహావిష్ణువు కూడా ఈ నరస్సులో దాగిన భూమిని పైకెత్తలేక పోయేవాడేమో! ఒక్క వరాహం ఏమిటి? వేయి వరాహాలకైనా అది సాధ్యం అయ్యేదికాదు. ప్రళయకాల మేఘాలు ప్రళయ కాలంలో ఈ సరస్సులోని కొంచెం నీటిని తీసుకొనే, దశదిశలు చీకట్లు వ్యాపించగా వర్షించి భూగోళాన్ని జలాలతో నింపివేస్తాయి".

చంద్రాపీడుడు తన ఆలోచనలనుండి బయటపడి ఆ సరోవరానికి దక్షిణదిక్కులోని తీరానికి చేరుకొన్నాడు. గుఱ్ఱం దిగి, దానిపైనున్న జీనులు, కళ్ళెం క్రిందికి దించాడు. గుఱ్ఱానికి విశ్రాంతి నిచ్చాడు. ఆ ఇంద్రాయుధం సంతోషంగా శబ్దాలు చేస్తూ గడ్డినేలపై పొర్లిగింతలు పెట్టిలేచింది. చంద్రా



పీడుడు కొంత గడ్డిని పీకి దానికి ఆహారంగా అందించాడు. సరసుల్లోకి గుఱ్ఱాన్ని దింపి, కొంత నీరు త్రాగించి, దాని యిష్టాన్ననుసరించి స్నానం చేయించి, సమీపంలో ఉన్న చెట్టు క్రిందికి తెచ్చాడు. అక్కడ చేతి కళ్ళెంతో దాని పాదాలు రెండు కట్టాడు. కత్తితో నవనవలాడే గడ్డి పరకలను కోసి దానిచే తినిపించాడు. తానుమరల నీటిలో దిగాడు. కాళ్ళు చేతులు కడిగికొని, ఆ నీరే కొంతత్రాగి, చక్రవాకం పక్షిలాగా తామరతూడుల మొదటి భాగాలను కొన్నింటిని నమిలి, చల్లని గాలిపై నుండి వీచే సుగంధ వాయువులు ఆస్వాదించాడు. తన చేతితో సరోజాన్ని పైకి ఎత్తి పట్టి అరణ్యగజంలాగ తీరానికి వచ్చాడు. దగ్గరలోని లతామండపం శిలపైన కొన్ని తామరాకులు, తూడులు పూవులతో ప్రక్కనేర్పఱచుకొన్నాడు. తలపై నీరోదుతున్న ఉత్తరీయాన్ని చుట్టచుట్టి చల్లదనంకోసం పెట్టుకొన్నాడు. విశ్రాంతిగా పడుకొని ఉన్నాడు చంద్రాపీడుడు.

## 27. మహాశ్వేత మధురగానం చంద్రాపీడుని ఆకర్షించుట

ఇట్లా కొంతసేపుపడుకొన్నాడో లేదో ఆ సరస్సుకు ఉత్తరభాగంనుండి ఒక మధురగీతం వినవచ్చింది. అది విన్న ఇంద్రాయుధం గడ్డిమేయటం మాని వేసింది. చెవులు నిక్కబెట్టింది. సంగీతం వినపడే దిశగా ముఖంపైకెత్తి చూసింది. ఆ గీతం వీణావాద్యానికి తగ్గట్టుగా మధురంగా వినబడుతోంది. రాజకుమారుడు ఇంత మధుర సంగీతంతో కూడిన పాట ఎక్కడ నుండి వస్తున్నదా! అని ఆశ్చర్యచకితుడైనాడు ఈ నిర్మానుష్య మహారణ్యంలో ఎక్కడిదీ గీతాలాపన? అని కుతూహలంతో చంద్రాపీడుడు కుసుమశయ్యమీద నుండి లేచాడు. ధ్వనివచ్చే దిశకు తలతిప్పి చూడసాగాడు.

అక్కడకుచాలా దూరంలోనుండి రావటంచేత ఆ సంగీతంగూర్చిన విశేషాలు ఎంతపరిశీలించి చూసినా కానరాలేదు. కాని నిరంతరం ధ్వనిమాత్రం వినబడుతూనే ఉంది. కుతూహలంతోనూ, గీతధ్వనిగూర్చి తెలుసుకోవాలనే కోరికతోను చంద్రాపీడుడు లేచి, ఇంద్రాయుధాన్ని సిద్ధంచేసి తయారయ్యాడు,

ఆ గీతధ్వనికి ఆకర్షితాలైన లేళ్ళు అడగక్కర్లేకుండానే మార్గాన్ని సూచిస్తూ ముందుకు నడవసాగినై. చంద్రాపీడుడు కూడా అదే మార్గాన్ననుసరించి ముందుకు నడచాడు. దారి మధ్యలో యాలకుల తీగలు, లవంగ తీగలు, సుగంధపుష్ప భరితాలైన తీగలున్నై. వాటిమధువు సేకరించటానికి మూగిన తుమ్మెదల యొక్క మధురఝంకారాలు వినవస్తున్నై. దారిలో అనేకవృక్షాలు లతలు విరివిగా కానవచ్చినై సరోవరంపై నుండి చల్లని గాలులు వీస్తూ ఆహ్లాదాన్ని కలిగిస్తున్నై.

అక్కడి మామిడి వృక్షాలు విరియ బూయటం చేత వాటికోసం తుమ్మెదలు వచ్చి గందరగోళం చేస్తున్నై. మొగలిరేకుల పుప్పొడిలాగా లేతపసుపు రంగు గలిగిన తిత్తిరి పక్షులు విరివిగా పండిన పిప్పలఫలాలను తింటున్నై. దానిమ్మ చెట్లనిండా కాయలుండటం చేత దాని కొమ్మలు బాగా వంగినై. ఆ చెట్టుపైనున్న గూళ్ళల్లో అప్పుడే ప్రసవించిన పసి కలవింకపక్షులు గోలగోలగా అరుస్తున్నై. ఎందుచేతనో పావురాలు వాటిలో అవి కలహించుకొంటూ ఱెక్కలు టపటపలాడించటం చేత ఆ చెట్టుపువ్వులన్నీ రాలి నేలపై పడుతున్నై. పుప్పొడి రంగులోనున్న కాళ్ళతో గోరువంకలు వృక్షాగ్రాలపై జేరి కోలాహలం చేస్తున్నై. చెట్లపై చిలుకలు రొద చేస్తూ తమ ఎఱ్ఱని వాడి ముక్కులతోనూ, పదునైన గోళ్ళతోనూ పండ్లను గీరి తింటున్నై. చీకటి చెట్లపై ఉన్న చాతకపక్షులు మేఘాలలో నుంచి స్రవించే జలబిందువులు త్రాగుదామని ఎదురుచూసి, ఫలితం లేకపోగా పెద్దగా శబ్దం చేస్తున్నై. ఏనుగుగున్నలు చిగురుటాకులున్న లవంగ తీగలను ఊడలాగుతున్నై తమ చిన్న తొండాలతో అక్కడి వృక్షాలలోపల దూరిన యౌవన మదం కలిగిన పావురాలు పొగరెక్కి ఱెక్కల లాడిస్తే పుష్పగుచ్ఛాలు రాలి క్రిందపడుతున్నై. చల్లని పిల్లగాలు వీస్తుంటే అక్కడి అరటి ఆకులు మెల్లగా కదులుతూ గాలిని వీస్తున్నై. కొబ్బరి చెట్లు లెక్కలేనన్ని గెలల బరువుకు నేలకు బంగుతున్నై. లేత ఆకులతో కూడిన వక్కచెట్లు అందంగా ఉన్నై. పక్షులు ముక్కులతో పొడవటంచేత మృదువైన ఖర్జూరపండ్లు



నేలరాల్చబడుతున్నై. వృక్షాలమధ్య ప్రదేశంలో మత్తెక్కిన మయూరాలు మనోహరంగా కేకారవాలు చేస్తున్నై. అక్కడక్కడా కైలాసంలో పుట్టి ప్రవహించే నదుల ఇసుక తిన్నెలు కనబడుతున్నై. ఆ ఇసుకతిన్నెలపై జలతరంగాల చారల గుర్తులు కనబడుతున్నై.

చంద్రాపీడుడు ఇలా కొంతదూరం పోగా ఆ సరస్సుకు పశ్చిమతీరంలో తెల్లని కైలాస శిఖరకాంతితో ఆ ప్రదేశం మెరుస్తూ ఉంది. అక్కడ శివుని దేవాలయం ఉంది. అది దాదాపు శూన్యంగా ఉంది. అక్కడ స్ఫటికాలతో నిర్మితమైన నాల్గుస్తంభాల మండపం ఉంది. దాని మధ్యలో తెల్లని శివలింగం ప్రతిష్ఠితమై ఉంది. ఆ లింగం గంగానదీ తీరాన పుట్టిన తెల్లతామరలతో నిండుగా అర్చించబడి ఉంది. ఆ పుష్పాలు ఆదిశేషుని పడగల గుంపుల్లాగాను, పాంచజన్య శంఖానికి తోడబుట్టిన వారిలా ఉన్నై. తెల్లగా నిర్మలంగా ఉన్నై. మూడులోకాల వారిచేత పూజ్యుడైన శివుడు గోచరుడైనాడు. ఆ శివునికి ఎందుకనో నాలుగే ముఖాలున్నై. దక్షిణ ముఖానికి ఎదురుగా కూర్చొని ఒక దివ్యకాంత వీణపై శంకరుని గూర్చిన గేయాన్ని పాడుతూ కనబడింది. ఆమె జగత్తులోని తపస్సునంతా రాశిపోసినట్టుగా ఉంది. తన తెల్లని దేహకాంతిని ఆ ప్రాంతమంతా నింపుతోంది.

ఆమె మిక్కిలి తెల్లని కాంతితో ప్రకాశిస్తూ, స్ఫటికగృహంలో ఉన్నదానివలె, పాలసముద్రంలో మునిగిన దానివలె, తెల్లని వస్త్రాలతో కప్పబడిన దానివలె, అద్దంపై మెరుస్తున్న దానివలె, శరత్కాల మేఘాల మధ్యలో కనబడకున్నదాని వలె, పంచభూతాల ప్రమేయం లేకుండా కేవలం శ్వేతవర్ణంతో నిర్మింపబడిన దాని వెలవలె, శివుని భూతగణాలకు భీతిచెంది శివుణ్ణి ఆరాధిస్తున్న దక్షయజ్ఞక్రియవలెనూ ఉంది. మన్మథుని మరణాన్ని సహింపలేక శివుని అర్చింప బూనుకొన్న రతీదేవిలాగా ఉంది. శివుని జటాజూట చంద్రునితో పరిచయమున్న పాలసముద్రాదిదేవతలాగా ప్రకాశిస్తోంది. రాహువు పట్టుకొంటాడనే భయంతో భూలోకానికి పరుగెత్తి వచ్చిన చంద్రునిలాగా ఉంది.

నల్లని గజచర్మాన్ని ధరించి, ధరించి విసుగెత్తిన శంకరునికి మార్పుకోసం వస్త్రంగా వచ్చిన ఐరావత గజముయొక్క దేహకాంతిలాగా ఉంది. శివుని దక్షిణముఖం నుండి బయటకు వచ్చి రూపం ధరించిన నవ్వులాగా ఉంది. శివునికంఠంలో నల్లని విషంకాంతిని తొలగిద్దామని పూనుకున్న వెన్నెలలాగా ఉంది. ఆకారం ధరించిన గౌరీదేవి యొక్క స్వచ్ఛమైన మనస్సులాగా ఉంది. వేరుగా ఈమె రూపం ధరించి వచ్చిన శివుని నంది దేహకాంతిలాగా తెల్లగా ఉంది. ఇతర ద్వీపాల సౌందర్యం ఎలాగుంటుందో తెలుసుకోవాలనే కుతూహలంతో భూలోకానికి వచ్చిన శ్వేతద్వీపంలాగా ఉంది.

ఆమెతన మెడలో ఉసిరికలంత లావున్న తెల్లని ముత్యాలతో కూర్చిన దండను ధరించి ఉంది. ఆమె ముఖం పున్నమి చంద్రుని బింబంలాగా ఉంది. తన ఒడిలో ఉంచుకొన్న వీణను కుడిచేత మీటుతోంది. గాంధర్వ విద్యయే ఆమెరూపంలో వచ్చినట్టుగా ఉందామె. మండపస్తంభాలపై చెక్కబడిన వీణావాదన చేసే సుందర ప్రతిమలతో కూడినట్లుగా ఉంది. శివలింగానికి పవిత్ర జలాలతో అభిషేకం చేయటం చేత ఈ యువతిరూపం ఆ శివలింగంపై పడి ఆమె శివుని హృదయంలో ప్రవేశించిన దానిలా కనపడుతోంది. ఆమె ఆ చిన్నవీణపై మధురగానం ఆలపిస్తుండగా పరిసరప్రాంతాల్లో తిరుగాడే అరణ్యజంతువులు పరస్పరవైర భావాలు మఱచి, గుమిగూడి మైమఱచి వినసాగినై. ఆకాశమునుండి కిందికి అవతరించిన ఆకాశగంగానదిలాగా ఉందామె.

## 28. చంద్రాపీడుడు మహాశ్వేతతో మాట్లాడుట

చంద్రాపీడుడు ఆ దివ్య లోకసుందరిని చూసి ఆశ్చర్యపోయాడు. ఆమె రూపసంపదకి, కాంతికి, ప్రశాంతతకి విస్మితుడయ్యాడు. తన మనస్సులో. ఆహా! లోకంలోని ప్రాణులకు ఒక్కొక్కప్పుడు అనుకోని సంఘటనలెదురౌతూ ఉంటై. చూడరాదా! నేనేదో వేటాడదామని ఈ అడవికి వచ్చాను. వేటాడిన వాడిని సూటిగా గమ్యస్థానానికి చేరకుండా మధ్యలో అశ్వముఖాలుగల కిన్నెర



దంపతుల్ని చూడటం జరిగింది. మనకెందుకులే అని ఊరుకోవచ్చు గదా! వారిని వెంటతరిమి వాయువేగంతో ప్రయాణించి ఇంతదూరంలో ఉన్న మానవులు చూడలేని ఈ దివ్యజనులు సంచరించే ఈ మహాసుందర ప్రదేశానికి వచ్చాను. సరే, దాహం తీర్చుకొని వెళ్దామనుకొన్న నాకు ఈ సరస్తీరానగంధర్వ గానం వినబడటం, తద్వారా ఈ సుందరీమణి దర్శనభాగ్యం లభించింది. ఈ కాంత మనుష్యుల కంటపడదగని దివ్యకాంత నాకు కనిపించింది. ఇదంతా విధి విలాసం కాక మరేమిటి? ఈమె దివ్యలోకనివాసిని అనే విషయంలో నాకెట్టి సంశయం లేదు. ఆమె రూపం చెబుతోంది ఆమె అమానుష అని. మానవలోకంలో ఇంత సౌందర్యవంతులుగాని, ఇంత సంగీత గానమాధుర్యం కాని సాధ్యమా? నేనీమెను దర్శించే లోపలే నన్ను చూసి మాయమవదు కదా! కైలాస శిఖరంపైకి క్షణంలో వెళ్ళిపోతుందేమో! ఆకాశంలోకి ఎగిరిపోతుందా? అందుచేత ఇలా జరిగేలోగానే వెంటనే ఆమెవద్దకు వెళ్ళి "నీవెవరవు? నీపేరేమిటి? ఇంత లేతవయస్సులో వ్రతం చేపట్టా వెందుకు? లాంటి ప్రశ్నలు వేసి ఆమెను గూర్చి తెలుసుకొంటాను. నాకట్టి చక్కని అవకాశం రావటం నిజంగా వింతలో కెల్లా వింత, అని ఇట్లు మనస్సులో భావించిన చంద్రాపీడుడు నెమ్మదిగా ఆ స్ఫటికశిలామండపాన్ని చేరుకొని ఒక స్తంభాన్ని ఆసరా చేసుకొని కూర్చున్నాడు. ఈ గీతం పాడటం అయిపోయిన తర్వాత ఆమెతో మాట్లాడాలనే కుతూహలంతో ఎదురు చూడసాగాడు.

## 29. మహాశ్వేత చంద్రాపీడునకు ఆత్మ కథ చెప్పట

ఇలా కొంతసేపు ఎదురుచూసిన అతనికి అవకాశం రానే వచ్చింది. ఆమె పాడటం ఆపివేసి, వీణను ప్రక్కనపెట్టి, తుమ్మెదలు తేనె నాస్వాదించి వెళ్ళిపోయిన పద్మంలాగా ఆ కన్యక మౌనంగా లేచింది. శివునకు నమస్కరిస్తూ ప్రదక్షిణలు చేసింది. ఆమె చల్లని చూపులు ఎదుటి వారిని ఓదారుస్తున్నట్లున్నై. పుణ్యతీర్థజలాలతో శుభ్రపరస్తున్నట్లున్నై. తపఃప్రభావంచేత పవిత్రం

చేస్తున్నట్లున్నై. ఆమె దృష్టులు ఎదుటివారిపై వరాలు కురిపిస్తున్నట్లుగా ఉన్నై. అలాంటి చల్లని పవిత్రమైన చూపులతో చంద్రాపీడుని చూస్తూ ఇలా అన్నది.

"అతిథికి స్వాగతం, మహానుభావుడవైన నీవు ఈ ప్రదేశానికి ఎలా వచ్చారు! లేవండి, అతిథి సత్కారాన్ని స్వీకరించండి, ఆమె సంభాషణచేతనే చంద్రాపీడుడు అనుగ్రహింపబడినట్లు భావించాడు. వంగి ఆమెకు పాదాభివందనం చేశాడు. "అమ్మా! మీ ఆజ్ఞప్రకారమే చేస్తాను" అని పలికి గురువు వద్ద శిష్యునిలాగా భక్తితో ఆమె వెనుకనే నడవసాగాడు. వెళుతూ ఇలా అనుకొన్నాడు మనస్సులో, "ఆహా! నన్ను చూసి ఈమె అదృశ్యురాలు కాలేదు. కాబట్టి కొన్ని ప్రశ్నలు వేసి, నా కుతూహలం తీర్చుకొనే వీలు దొరికింది. ఈమె తపస్వినులకు ఉండరాని మహాసౌందర్యం కలిగి యుండికూడా దాక్షిణ్యవంతురాలుగా ఉన్నది. నా కౌతూహలం తీర్చుకోవచ్చు. నేను ఈమె వృత్తాంతం అంతా విశదంగా చెప్పమని అడుగుతాను. ఆమె తనను గూర్చిన వృత్తాంతం వివరిస్తుంది" అని నమ్మకంతో కొంచెం దూరం ఆమెవెంట నడచి ముందున్న ఒక గుహను చూశాడు. ఆ గుహ దట్టమైన చీకటి చెట్లవల్ల పట్టపగలే అంధకారబంధురంగా ఉంది. ఆ ప్రాంతాలలో ఒత్తుగా పెరిగిన లతలకున్న పుష్పాలపై వ్రాలిన తుమ్మెదలు చేసే ఝుంకారంతో ఆ ప్రదేశం మారుమోగుతోంది. ఆ గుహకు ఇరువైపులా బండలపైనుండి జారుతున్న సెలయేళ్ళు వింజామరలు ద్వారాని కిరువైపులా వేలాడదీసినట్టుగా ఉన్నై. గుహలో ఒక మణికమండలం ఉన్నది. ఒక మూలగా యోగాసనం వ్రేలాడుతోంది. ఒకచోట కొబ్బరిపీచుతో చేయబడిన రెండు పాదరక్షలున్నై. ఆ గుహలో వేరొకచోట దేహవిభూతి అంటుకోవటంచేత నల్లబడిన వల్కలాలతో (నారవస్త్రాలతో) ఏర్పాటు చేయబడిన శయ్య ఉంది. ఒకచోట తెల్లని పెద్దశంఖాన్ని ఉలితో చెక్కి చేయబడిన భిక్షాపాత్ర ఉన్నది. ఒక ప్రదేశంలో తెల్లని భస్మంతో నిండిన సొరకాయ బుఱ్ఱ ఉంది.



ఆ గుహ ఎదుట చదునైన ఱాతి బండపై అతనిని కూర్చుండబెట్టింది ఆమె. తన వీణను శయ్యపై ఉంచి, ఒక ఆకు దొన్నె నిండా సెలయేటినీరు తెచ్చింది, అర్ఘ్యపాద్యాదులకోసం. చంద్రాపీడుడు "అమ్మా! నాకోసం మీరు అంత శ్రమపడవలదు. ఈ మర్యాదలన్నీ చేసినట్టే అనుకొంటాను. పూజ్యురాలా! నన్ను దయచూడు ఈ అధికమర్యాద నాపై చూపవలదు. మీవంటివారి దర్శనమే సకల పుణ్యతీర్థ స్నానంలాగా సర్వపాపాలను నివారిస్తుంది. మీ ఆతిథ్యమట్లుండనిమ్ము" అని వినయంతో పలికాడు. అతడు ఆమెను ఎంత నివారించినా ఆమె మాత్రం అతిథి మర్యాదలు చేసింది. అతడు చేసేదేమీ లేక ఆమెకు గౌరవం కోసం దూరంగా ఉండి ఆ మర్యాదలన్నీ అందుకొన్నాడు. ఆ తర్వాత ఆమె యువరాజుకు సమీపంలో ఉన్న రెండవ బండపై కూర్చొని, కొద్దిసేపైన తర్వాత అతనిని గూర్చి అడిగింది.

అప్పుడు యువరాజు దిగ్విజయ యాత్రకు బయల్దేరిన దగ్గఱనుండి కిన్నర మిథునాన్ని తరుముకుంటూ ఇక్కడకు రావటం దాకా మొత్తం కథంతా వివరంగా ఆమెకు వినిపించాడు. ఆతడు చెప్పిందంతా విన్న ఆమె నెమ్మదిగా లేచి, భిక్షాకపాలం తీసికొని, ఆ ఆశ్రమ ప్రాంతంలో ఉన్న ఫలవృక్షాల క్రింద తిరిగింది. కొద్ది సేపట్లోనే చెట్లు తమకు తాముగా వదిలిన పండ్లతో ఆ భిక్ష పాత్ర నిండిపోయింది. ఆ పండ్లు తెచ్చి యువరాజు ముందుపెట్టి భుజించమని కోరింది. అప్పుడు యువరాజు తన మనస్సులో ఇలా అనుకొన్నాడు – "ఓహో! తపస్వి జనులకు అసాధ్యమనేదే లేదు ఈ లోకంలో. ఇంతకంటే ఆశ్చర్యకరమైన విషయం వేరే ఏముంటుంది ? చైతన్యరహితమైన వృక్షాలు సహితం చైతన్యం ఉన్నవాటిలా ఈ పూజ్యురాలికి తమంతట తామే పండ్లను సమర్పించి, తమ అనుగ్రహాన్ని ఈ విధంగా తెలియజేసినై. మునుపెన్నడూ చూచి ఎఱుగని గొప్పవింతను నేడు చూడగలిగాను" అని మహానందాశ్చర్య పరవశుడయ్యాడు రాజకుమారుడు.

తరువాత చంద్రాపీడుడు లేచి వెళ్ళి ఇంద్రాయుధాన్ని తెచ్చి సమీప వృక్షానికి కళ్ళెపుత్రాళ్ళతో కట్టాడు. పైనున్న జీనును తొలగించాడు. తాను

కూడా సమీప జలప్రవాహంలో స్నానం చేశాడు. పాత్రలోని అమృతతుల్యమైన ఫలాలను కొన్నింటిని తిన్నాడు. వాగులోని చల్లని, తియ్యని స్వచ్ఛ జలాలను కడుపార త్రాగాడు. ఆ నీటితోనే ఆచమనం చేశాడు. ఈ లోగా తపస్వినికూడా స్నానసంధ్యాది కార్యాలను పూర్తి చేసుకొని, విశ్రాంతిగా ఊతిబండపై కూర్చొన్నది. చంద్రాపీడుడు నెమ్మదిగా లేచి ఆమె సమీపానికి వచ్చి కూర్చొని, “మహాత్మురాలా! నేను నీదయను పొందినవాణ్ణవటంచేత కలిగిన ప్రోత్సాహం మానవసహజమైన తేలికతనంతో జతకలసి బలవంతంగా నన్ను ప్రశ్నింపమని పురి కొల్పుతోంది. ప్రభువులదయ ఎంతటి అధైర్యవంతుణ్ణైనా ధైర్యవంతుని చేస్తుంది కదా! ఒకచోటనున్న వారిని కొద్దిసేపటి పరిచయం కూడా దగ్గర చేస్తుంది. అమ్మా! మీ కథ మనస్సుకు బాధ కలిగించనిదైతే చెప్పుడి. విని ధన్యుణ్ణవుతాను. మిమ్మల్ని చూసిన దగ్గర్నుంచీ మీవృత్తాంతం వినాలనే కుతూహలం నాకు ఎంతగానో ఉంది. మీరు జన్మించటం చేత ఏ దేవ కులం అదృష్టవంతమైంది? ఏ దేవజాతి మిమ్ము కని ధన్యమైంది? ఈ లేతనవయౌవన దశలో ఎందుకింత క్లిష్టమైన వ్రతధారణ చేశారు? ఇప్పటి మీ యింద్రియ నిగ్రహం ఎక్కడ? రెంటికిని ఏ మాత్రం సౌమ్యం కనపడటం లేదు. ఇది నా కత్యంతాశ్చర్యకరంగా, అద్భుతంగా ఉంది. దేవతలకు సులభసాధ్యాలైన సురలోక సుఖాలన్నీ వదలివేసి, దేవతాసంబంధారణ్యాలలో ఈ వ్రతాచరణం ఎందుకు చేస్తున్నారు? పంచభూతాల సమ్మేళనంతో ఆవిర్భవించిన మీ దేహానికి ఇంతటి తెల్లదనం ఏవిధంగా వచ్చింది? ఇది నేనెన్నడూ, ఎక్కడా వినలేదు చూడలేదు. నా కుతూహలం తీర్చండి. మీగూర్చిన ఈ విషయాలన్నీ వివరంగా చెప్పండి” అని అన్నాడు.

చంద్రాపీడుడు చెప్పినదంతా విన్న ఆమె మనస్సులో ఏదో ఆలోచించుకొంటూ కాసేపు మౌనంగా ఉన్నది. గాఢంగా నిట్టూర్పులు వదలుతూ కనుల నుండి దుఃఖాశ్రువులు రాలుతుండగా నిశ్శబ్దంగా ఏడవటం ప్రారంభించింది.



ఆమె ఏడవటం చూచి చంద్రాపీడుడు ఆశ్చర్యచకితుడయ్యాడు. ఎంతవారికైనా ఏవో కష్టాలు వచ్చి పడటం, ఇలా దుఃఖించటం తప్పదు, ఈమె ఇలా దుఃఖపడటం చూస్తుంటే నాలో కౌతూహలం మరీ మరీ వృద్ధి చెందుతోంది. ఈమె ఇలా ఏడుస్తున్నదంటే ఏదో పెద్ద కారణమే ఉండి ఉండాలి. కొద్దిపాటి దెబ్బలచే కొట్టబడి భూమి ఎంతమాత్రం చలింపదు కదా! అని చంద్రాపీడుడు ఆలోచించి, బాధపడ్డాడు. అతనిలో కుతూహలం కూడా పెరిగింది. ఆమె అలా శోకించటానికి తనే కదా మూలం అని భావించాడు. వెంటనే లేచి వెళ్ళి ప్రక్కనున్న సెలయేటినుంచి దోసిలితో నీరుతెచ్చాడు. ముఖం కడుక్కోవటానికి అతడు నీరుతేగా ఆమె అతని బలవంతం మీద, ఇష్టం లేకున్నా, ఆ చన్నీటితో ముఖం కడుక్కొంది. నారచీరచెంగుతో ముఖం తుడుచుకొంది. సుదీర్ఘంగా వేడినిట్టూర్పులు వదుల్తూ నెమ్మది నెమ్మదిగా ఇలా చెప్పసాగింది.

“రాజపుత్రా! నేను కఠినహృదయురాలను. మందభాగ్యురాలను. నాది పాపపుజన్మ. పుట్టింది మొదలు ఇప్పటిదాకా నా చరిత్రలో వినదగిన అంశాలు ఏమున్నాయి. నా చరిత్ర వినటం వల్ల నీకేం లాభం? అయినా నీవు కుతూహలంతో అడిగావు కాబట్టి చెపుతాను, విను.

రాజకుమారా! దేవలోకంలో అప్సరాంగనలనే దేవజాతి కన్యకలున్నారని కల్యాణగుణసంపన్నులైన పెద్దలకు తెలిసి ఉంటుంది. అప్సరో జాతిలో పద్నాలుగు కులాలున్నై. అందులో ఒక కులం కమలసంభవుడైన బ్రహ్మ మనస్సునుండి, ఇంకొక కులం వేదాలనుండి, వేరొక కులం అగ్ని నుండి, గాలినుండి ఒకటి, అమృతమథన సమయంలో వేరొకటి ఇలా పన్నెండు కులాలు వేర్వేరుగా వారి వారినుండి పుట్టినై. రెండుకులాలు మాత్రం దక్షప్రజాపతి యొక్క అసంఖ్యాక పుత్రికలలో ఇద్దరు కన్యకలు ముని, అరిష్టా అనే వారి నుండి పుట్టినది. ఆ యిద్దరు కుమార్తెలు గంధర్వజాతి వారిని పెండ్లాడి రెండు కులాలుగా ఏర్పడ్డారు. అందులో ముని అనునామెకు

పదిహేనుమంది కుమారులు జన్మించారు. వారిలో అత్యంత ప్రఖ్యాతుడు చిత్రరథుడనే గంధర్వుడు. మిగిలిన పదిహేనుమందిని మించిన సద్గుణసంపన్నుడై, ప్రఖ్యాత పరాక్రముడై త్రిలోకములచే గుర్తింపబడి, దేవేంద్రునితో చెలిమి చేసి ఆతని మన్నన పొంది, సమస్త గంధర్వలోకమునకు అధిపతియై సింహాసనార్హత సొంతంగా పొందాడు. చిత్రరథ గంధర్వరాజు యొక్క నివాసము హేమకూటమనే పర్వతం. అది ఇక్కడికి దగ్గరలో భారత దేశానికి ఉత్తర భాగాన్ని ఆనుకొని ఉన్న కింపురుష దేశంలో సరిహద్దు పర్వతంగా గుర్తింపబడిన ప్రసిద్ధ పర్వతం. ఆ హేమకూట పర్వతంపై అనేకవేల లక్షల గంధర్వులు అతని పాలనలో సుఖంగా నివసిస్తున్నారు. ఆ చిత్రరథుని చేతనే చైత్రరథం అనే ఈ మనోహరమైన అడవి పెంచబడింది. ఇదిగో ఈ అచ్ఛోద సరస్సును కూడా ఆయనే త్రవ్వించాడు. అంతేకాదు ఈ శివమందిరం కూడా ఆయనే ప్రతిష్ఠించాడు.

ఇక రెండవ కన్యక అరిష్ట అను గంధర్వరాలు హంసుడనే పుత్రుణ్ణి కన్నది. ఆ హంసుడు చిత్రరథుని చేతనే బాల్యంలో ఉండగానే రాజుగా అభిషేకింపబడ్డాడు. అపరిమిత గంధర్వబలాలతో కూడిన ఆ హంసునికి కూడా హేమకూటమనే ఆ పర్వతమే నివాసంగా ఉండేది. చంద్రకిరణాలనుంచి పుట్టిన గంధర్వ కులంలో చంద్రుని షోడశకళల సౌందర్యంతో నిర్మింపబడిన దానివలె త్రిలోక సౌందర్య ప్రకాశిని, రెండవ గౌరీ దేవిలాగానే గౌరి అనే కన్యక స్వచ్ఛమైన వెన్నెలలాగా వెలుగొందుతూ జన్మించింది. ఆమెను రెండవ గంధర్వకులాధిపతి హంసుడు పెండ్లాడాడు. వారిరువురి దాంపత్యము మందాకినీ క్షీరసాగరాల్లాగా, రతీమన్మథుల్లాగా, కమలినీ శరత్కాలాలలాగా ఈడు జోడుగా ఉండేది. ఆ గౌరి అతని పట్టపురాణిగా గౌరవింపబడేది. వారిరువురు ఆదర్శదంపతులకు ఇదిగో ఇటువంటి దురదృష్టవంతురాలు, సద్గుణ శూన్యురాలు, కేవలదుఃఖ పాత్రురాలు ఐన నేను వారికి ఏకైక సంతానంగా జన్మించాను. నా తండ్రి హంసుడు సంతానం లేకపోవటంచేత



నన్ను కుమారుడు జన్మించినప్పటికంటె మహోత్సవాలు చేశాడు. నన్ను చూసి మురిసిపోయాడు. పదవరోజున యథాశాస్త్రంగా కార్య కలాపాలు నిర్వహించి నామకరణ మహోత్సవం జరిపి నాకు మహాశ్వేత అనే పేరు పెట్టాడు. ఆ పేరు నాకు సరిగ్గానే సరిపోయింది కూడా.

## 30. మహాశ్వేత పుండరీకుని చూచుట

నేను నా తండ్రియింట బాల్యంలో ముద్దుమాటలు పలుకుతూ, ఒకరి ఒడి నుండి వేరొకరి ఒడిలో మారుతూ, దుఃఖం ఎలాగుంటుందో కష్టాలెలా ఉంటాయో ఎంతమాత్రం తెలియకుండా సునాయాసంగా బాల్యం గడిపివేశాను. కొంతకాలం తర్వాత నాలో యౌవనం పొడచూపింది. వసంతంలో మధుమాసంలాగా, మధుమాసంలో కొత్త చిగురుటాకులాగా, కొత్త చిగురుటాకులలో కుసుమంలాగా, కుసుమంలో తుమ్మెదలాగా నా యౌవనం విజృంభించింది.

ఇలా ఉండగా మధుమాస (వసంత) సమయంలో ఒకరోజున నేను మా అమ్మతోపాటు ఈ అచ్ఛోదసరస్సులో స్నానం చేయటానికి వచ్చాను. ఆ ప్రాంతమంతా కొత్తగా వికసించిన కమలవనాలతోను, కాముకులకు మనోబాధ కలిగిస్తున్న లేతమామిడి చిగురులతోనూ, మృదువైన మలయ వాయువుల, ప్రసారం చేత రెప రెపలాడున్న మన్మథ పతాకలతోనూ, మదించిన యువతుల పుక్కిటిలోని కల్లు చేతతడిసి, పులకించిన పొగడచెట్లతోనూ, తుమ్మెద సమూహములచేత నల్లగా చేయబడిన జపా కుసుమపు పొదరిళ్ళ చేతను శోభిల్లుతోంది. పుష్పించని అశోకవృక్షాలను పుష్పింప చేయటంకోసం రమణులు ఆ అశోక చెట్లను తన్నగా, వారి కాలి అందెలరవళిచేత ఆ ప్రాంతం నిండిపోయింది. అప్పుడే పూతపడుతున్న మామిడిపూల సువాసనకు ఆకర్షింపబడిన తుమ్మెదల యొక్క సుందరమైన ఝుంకారములతో నిండింది ఆ ప్రాంతమంతా. ఆ పరిసర ప్రదేశాలన్నీ నిరంతరంరాలి పడుతున్న పుష్ప పరాగం చేత ఇసుకతిన్నెలవలె కనబడుతున్నై. అక్కడ తుమ్మెదలు పూలతేనె

బాగా త్రాగి మత్తెక్కి లతల మీద వ్రాలి ఉయ్యాలలూగుతున్నై. దూర దేశంలో ఉన్న భర్తల వియోగం భరింపలేక ప్రాణాలు కోల్పోయిన భార్యలను గాంచి సంతోషించిన మన్మథుడు తన వింటిని మ్రోగింపగా ఆ ధ్వని విని బాటసారులైన వారి భర్తల హృదయాలు బ్రద్దలౌతున్నాయి వారి రక్తంచేత దారులు తడిసి పోతున్నాయి. మన్మథుడు ఆ వసంతమాసంలో నిరంతరం బాణాలు ప్రయోగిస్తున్నాడు. ఆ బాణాల ఈకలు 'సూ' అని శబ్దం చేస్తుంటే ఆ శబ్దం అన్ని దిక్కులా వ్యాపిస్తోంది ప్రేమమైకంతో కన్ను గానని అభిసారికలు పగటిపూటే భర్తకోసం తిరుగుతున్నారు. ప్రేమరససాగరాలు చెలియలి కట్టలు దాటి లోకాన్ని ముంచేస్తున్నాయి. ఆ రోజులు కేవలం మనుష్యులకే కాదు, సమస్త ప్రాణి సమూహాలకున్నూ సంతోషాన్ని కలగచేస్తున్నై. ఆ అచ్ఛోదసరస్సు వివిధాలైన జలపుష్పాలు వికసించి ఆహ్లాదాన్ని కలిగిస్తున్నది.

ఆ సరస్సు దేవతా ప్రముఖుల పాదముద్రలతో పవిత్రమైంది. ఆ జలములు వారి దేహస్పర్శచే (స్నానంచే)పావనములైనవి. పార్వతీదేవిచే స్నానార్థం వచ్చి సరస్తీరాన ఉన్నశిలలపై గీయబడిన ప్రమథుల చిత్రాలు కనబడుతున్నై. ఆ చిత్రాలనే పరమశివుని ప్రతిబింబాలుగా భావించి మునిజనులు ప్రదక్షిణ నమస్కారాలు చేస్తారు. నేను ఆ చిత్రాలకు వందన మాచరించాను. గున్నమామిడి చెట్లు విరగబూసినై, ఆ పూమొగ్గల నుండి తేనెధారలు పడుతున్నై. అక్కడ మదించిన నెమళ్ళు క్రేంకారరవాలతో గందరగోళం చేస్తున్నై. వాటి శబ్దం విని భయపడిన సర్పాలు చందనవృక్ష వీధిని వదలి దూరంగా పోతున్నై. వృక్షాలన్నీ సమృద్ధిగా పుష్పించటం చేత వనదేవత ఊయలలూగుతున్నట్లు లతలు వ్రేలాడుతున్నై. ఆ సరస్తీరాన గల వృక్షాల క్రింద రాలిన పుప్పొడిపైన రాజహంసల పాదముద్రలు ఎంతో శోభను కలగజేస్తున్నై. ఈ విధంగానేను నా చెలికత్తెలితో ఆ సుందరవనాలలో, సరస్తీరంలో చాలా సేపు విహరించాను.

ఒకచోటకు రాగానే మున్నెన్నడూ వాసన చూడని, మానవలోకానికి సంబంధించని పుష్పవాసనను పీల్చాను. ఆ సువాసన ఆ ప్రాంత వృక్షముల



పుష్పపరిమళాల్ని అధిగమించి వెదజల్లుతోంది. మిక్కిలి పరిమళ భరితమైన ఆ పుష్పసుగంధం నా నాసికాపుటాలకు మిక్కిలి సంతృప్తిని కలిగించింది. ఆ సుగంధం పీల్చటానికి తుమ్మెదలు వింటిలో అవి పోటీలు పడి పరుగులెత్తుతున్నై. "ఈ పరిమళం ఎక్కడిది?" అని నాకు కుతూహలం కలిగింది. ఆ వాసనకు నాకన్నులు మత్తుతో వాలిపోతున్నై. ఆ కుసుమగంధానికి నేను ఆడుతుమ్మెదలాగా ఆకర్షింపబడ్డాను. నేను పువ్వువాసనకు ఆకర్షింపబడి తొందరగా నడుస్తుంటే, నా పాదమంజీరాల మనోహర శబ్దాలకు కలహంసలు ఆకర్షింపబడి నావెంట రాసాగినై. తీరా వెళ్ళి చూద్దును గదా! నా కనులకు స్నానార్థం అక్కడకు వేరొక మునికుమారునితో కూడిన మిగుల సుందరుడైన మునికుమారుడు కన్పడినాడు.

ఆ మునికుమారుడు అతిలోకసౌందర్యవంతుడు. శివుని మూడవకంటి మంటకు భస్మీభూతుడైన మన్మథుని కోసం పరితపిస్తూ అతని పునర్జీవనంకోసం తపస్సు చేస్తున్న అతని మిత్రుడు వసంతునిలాగా ఉన్నాడు, క్షీణత లేకుండా, నిత్యం సంపూర్ణమండలాకారుడై ఉండటంకోసం, వ్రతం ధరించిన శివజూటం మధ్యగల చంద్రునిలాగా ఉన్నాడు. తనను భస్మం చేశాడనే కోపంతో అతన్నే వశం చేసికోవాలనే కోర్కెతో నియమంతో దీక్ష పూనిన మన్మథునిలాగా ఉన్నాడు. అగ్నిమధ్యలో ప్రవేశించిన వానిలాగా మెరుస్తున్నాడు.

ఆ మునికుమారుని దేహకాంతి బంగారురంగులో ఉంది. ఆ కాంతి చేత ఆ పరిసరప్రాంతాల్లో నల్లగా ఉన్న అడవిని బంగారురంగులోనికి మారుస్తున్నవానివలె ఉన్నాడు. అతని కేశపాశాలు సుకుమారమై పింగళవర్ణం కలవై ఉన్నాయి. అతని సుందరమైన లలాటమున మూడు భస్మరేఖలున్నాయి. ఎవరికైనా శాపం ఇవ్వగలిగిన కనుబొమ్మలనే గృహానికి ద్వారాలవలె ఉన్న అతని భ్రూలతలు ప్రకాశిస్తున్నై. అతని చేతిలో లావైన ముత్యాలవంటి స్ఫటికాలతో కూర్చబడిన అక్షమాల ఉంది. వేళ్ళన్నీ తమ నేత్ర సౌందర్యాన్ని రాశిపోసి ఇచ్చినట్లున్నాయి అతని నేత్రాలు. పెద్దదైన ఎత్తైన నాసిక కలవాడతడు.

అతని హృదయంలోకి ఇంకా మన్మథుడు ప్రవేశించలేదు. అందుచేతనే నవయౌవన రాగంచేత ఎట్టబడిన పెదవికలవాడు. ఆ ముని బాలకునికి యింకా గడ్డాలు మీసాలు మొలవలేదు. అందు చేత తుమ్మెదలు ప్రవేశింపని గుండ్రని లేత తామరపూవులాగా ఆతని ముఖం ప్రకాశిస్తోంది.

ఆ మునికుమారుడు తపస్సనే సరస్సులోని తామర తూడులాగా తెల్లగా ఉన్న జందేన్ని ధరించినాడు. అది మన్మథుని ధనుస్సుయొక్క గుండ్రగా ఉన్న అల్లెత్రాడులాగా ఉంది. ఆతడు ఒక చేతితో కాడతో కూడిన పొగడ కాయలాగా ఉన్న కమండలాన్ని, వేరొక చేతితో తెల్లని స్ఫటికాక్ష మాలను ధరించియున్నాడు. ఆ అక్షమాల మన్మథుడు కాలి బూడిదైనప్పుడు శోకించే ఆతని భార్య రతీ దేవి కనుల నుండి కారిన కన్నీటి బిందువులతో తయారు చేసినట్లుగా ఉంది. అతడు జ్ఞాని అవటం చేత అజ్ఞానమనే చీకటి బయటకు పోయే మార్గంలాగా అతని పొట్టపై సన్నని నూగారు నల్లగా ప్రకాశిస్తోంది. ఆ మునికుమారుడు తన దేహకాంతితో సూర్యభగవానుని ఓడించి, అతని వద్దనుండి తేజోవలయాన్ని పుచ్చుకొన్నట్లుగా నడుముచుట్టూ ముంజగడ్డితో పేనిన మొలత్రాడు వెలుగొందుతోంది. ముదుసలి చకోరపక్షి కనుఱెప్పలవలె లేత ఎఱుపుదనము కలిగిన మందారవృక్షపు నారతో నేయబడిన వస్త్రాన్ని నడుమున ధరించాడు.

అతడు బ్రహ్మచర్యానికి అలంకారంలాగా ఉన్నాడు. పుణ్యమునకు యౌవనం వచ్చినట్లున్నాడు. సరస్వతీ దేవి యొక్క విలాసంలాగా ఉన్నాడు. సర్వ విద్యలు కావాలని ఇతనిని పతిగా వరించాయి. ముఖంపైన తెల్లని విభూతిని బొట్టుగా దిద్దుకొన్నాడు. అతనితో సమవయస్కుడైన ఇంకొకముని కుమారునితో కలిసి ఉన్నాడు.

ఆ ముని కుమారుడు దేవతార్చనకోసం పూలు కోస్తున్నాడు. నేను ఆఘ్రాణించిన సువాసన అతడు తన చెవిలో అలంకారంగా ధరించిన పుష్పం



నుండే వస్తున్నది. ఆ తెల్లని పుష్పం వసంతునిరాకకు సంతోషించిన వనదేవత నవ్వులాగా ఉంది. వసంతమాసం మలయమారుతానికి ఆహ్వానం పలుకుతూ సమర్పించిన పేలాల సమూహంలాగా ఉన్నది. అటువంటి పుష్పాన్ని నేనింతకు మునుపెన్నడూ చూడలేదు. ఆ కుసుమ మంజరినుండి అమృత బిందువులు స్రవిస్తూ ఉన్నై.

అప్పుడు నేను, “ఓహో! సమస్త పుష్పసు వాసనల్ని తిరస్కరిస్తున్న దివ్య పరిమళం కల పుష్పం ఇదే నా!” అని మనస్సులో అనుకొన్నాను. ఆ ముని కుమారుని చూస్తూ నేనన్నాను – ఆహా! గొప్ప రూపాన్ని తయారు చేయటానికి బ్రహ్మవద్ద ఎంత గొప్ప సామగ్రి ఉన్నదో! ఆ బ్రహ్మ త్రిజగన్మోహనాకారుడైన మన్మథుని సృష్టిచేసి, అతనికంటె మించిన సుందరాకారుని తయారు చేయుటకై ఈ మునిని రెండవ మాయామన్మథునిగా నిర్మించినాడు. బ్రహ్మ త్రిలోక మోహనకరుడైన చంద్రబింబాన్ని, లక్ష్మీదేవికి నివాసమైన కమలాలిని సృష్టించాలని తలచి ముందుగా మచ్చుకోసం, అభ్యాసంకోసం ఈతని ముఖాన్ని తయారు చేశాడనిపిస్తోంది. లేకపోతే చంద్రబింబాన్నీ, లక్షీనివాసకమలాన్నీ పోలిన మునిముఖాన్ని ఎందుకు నిర్మిస్తాడు? సూర్యుడు తన సుషుమ్నాకిరణంతో చంద్రునిలోని పదహారు కళలను త్రాగుతాడు అనే మాట అబద్ధమేమో అనిపిస్తోంది. ఎందుకంటే ఆ కళలన్నీ ఈ మునిబాలకునిలో కలుస్తున్నాయనిపిస్తోంది కనుక. లేకపోతే నిరంతరం శరీరాన్ని కృశింపజేసుకొనే క్లిష్టమైన తపస్సులో ఉన్న ఈతని శరీరానికి ఇంతటి సౌందర్యం ఎలా వస్తుంది?” నేనిలా అనుకొంటూ ఉండగానే మన్మథుడు నన్ను పరవశురాల్ని చేశాడు. నా నిట్టూర్పులు అధికమైనై; అసలీ మన్మథుడు మంచి చెడులు ఎంతమాత్రం విచారింపడు; అతనికి సౌందర్యమే ప్రధానం. నవయౌవనంలో ఉన్న వారిని తేలికగా లొంగదీసుకొంటాడు. ఈ విధంగా మన్మథుడు నన్ను వసంతకాల మదం ఆడుతుమ్మెదను వశపరచుకొన్నట్లుగా లొంగ దీసుకొన్నాడు.

## 31. మహాశ్వేత పుండరీకుని ప్రేమలోపడుట

నేనాసమయంలో కన్నులార్పటం మఱచిపోయాను. కనుఱెప్పలు సగం మూసుకొన్నాను. నా కనుగ్రుడ్లు నల్లగా అతిచంచలాలై కదులుతున్నై. అటువంటి పద్ధతిలో నేనాతని వంక మిక్కిలికాంక్షతో చూడసాగాను. ఆతని సౌందర్యాన్ని కనులతో త్రాగసాగాను. ఏదో అడగాలని ఆత్రపడ్డాను. 'నేను నీ అధీనంలోని దాన్ని' అని చెబుతున్నట్లున్నాను. ఎదురుగా నిలచి నా హృదయాన్ని అతని చేతుల్లో పెడుతున్నట్టు, నేను మొత్తం అతనిలో కలిసి పోతున్నట్టు, తన్మయత్వాన్ని పొందుతూ, "నేను మన్మథునిచే పరాభవింపబడ్డాను, నన్ను రక్షించు" అని అతని శరణు కోరుతున్నట్టు, "నీ హృదయంలో నాకింత చోటివ్వవా!" అని ప్రార్థిస్తున్నట్టుగా కనిపించాను.

అయితే నా మనస్సులో "అయ్యో! నేనిలాంటి పని చేస్తున్నానేమిటి? ఇలా చెయ్యటం కన్యకాజనానికి తగినదేనా? ఇది మన సంప్రదాయమేనా? అని అనిపించకపోలేదు. అయినా జరగవలసింది జరిగితీరవలసిందే కదా! అందుకే ఆ సమయంలో నేనేమీ చేయలేక పోయాను. నా శరీరం నా స్వాధీనంలో లేదు. నా ప్రత్యవయవం కంపించిపోతోంది. నేను చెక్కిన శిల్పంలా ఉన్నాను. నేనిలా ప్రేమ విషయంలో ఇంతముందుకెలా వెళ్ళానో నాకే తెలియదు. ఇలా చెయ్యాలని నాకెవ్వరూ చెప్పలేదు. నాకెవ్వరూ నేర్పలేదు. నేను మిక్కిలి సౌందర్యవతి ననే గర్వంతోనో, మన్మథుని ప్రేరణతోనో, నూత్న యౌవన మదంతోనో రెచ్చగొట్టబడినదాన్నై ఇలా చేస్తున్నానా? అనిపించింది. మొత్తంమీద నేనలాచెయ్యటానికి కారణమేదైనా గాని, నేను అలా ఆ మునికుమారుని పెద్దకాలం చూస్తూనే ఉండిపోయాను.

నేను నాయింద్రియాల చేత ఎత్తుకొనిపోబడి అతని సమీపానికి తేబడినట్లుగా అనుకొన్నాను. హృదయంచేత అతని ఎదుటకు లాక్కొని పోబడుతున్నట్లు భావించాను. మన్మథుడు నన్ను వెనుకనుండి ముందుకు



పొమ్మని ప్రోత్సహిస్తున్నట్టు తలంచాను. సరే, ఎలాగో నన్ను నేను సంబాళించుకోగలిగాను చివరికి.

చెమట బిందువులతో నా లోని సిగ్గు కడిగి వేసినట్లు మాయమైంది. మన్మథుని వాడిబాణాలు మీదపడతాయేమో నన్న భయంతోవలె నా శరీరావయవాలు కంపించినై. ఆ మునికుమారుని అతిలోకసౌందర్యాన్ని మేము కూడా చూస్తామన్నట్లు నా వెంద్రుకలు నిక్కబొడుచుకున్నాయి. శాంతాత్ముడై, ఐహికసుఖభోగాలకు దూరంగా ఉండే ఇంత పవిత్రునిపైకి నన్ను ప్రేరేపించి ప్రోత్సహిస్తున్న ఈ దుర్మార్గమన్మథుణ్ణి ఏమనాలి? ఈ స్త్రీల మనస్సులెంత మూఢమైనవి? లేకపోతే – ఇటువంటి మహాత్ముడు ప్రేమించటానికి ప్రేమింపబడటానికి యోగ్యుడా కాదా అని అణుమాత్రం కూడా ఆలోచింపలేకపోవటమేమిటి? ఈ తేజోనిధికీ, తపోనిధికిన్నీ, నీచజనులచే పొగడబడే శృంగారపరమైన భావనలకిన్నీ ఏమైనా పోలిక ఉన్నదా? మన్మథ పరవశనైన నన్ను చూసి పైకి కాకపోయినా లోపల్లోపలైనా పరిహాసిస్తాడేమో గదా! నేనింత జ్ఞానం కలిగిన దాననై ఉండికూడా ఈ మన్మథ వికారాన్ని అడ్డుకోలేకపోతున్నానేమి విచిత్రం ఇది! అయితే లోగడ చాలామంది కన్యకలు సిగ్గువదలి స్వయంగా భర్తలను పొందారట. అలాగే చాలా మందికన్యకలు ఈ మన్మథ పిశాచంచేత ఉన్మత్తస్థితిని పొందినవారూ ఉన్నారు. అట్టివారిలో నేను కూడా ఒకతెను. నేను ఆతని సౌందర్యాన్ని చూసీ చూడగానే మనోవ్యాకులత చెంది పరవశురాలనై మనస్సు పారేసుకొన్నాను. ఆ మనస్సు నా స్వాధీనం తప్పింది. ఏ రకంగా చూసినా కాలం, సద్గుణాలు మన్మథుని ఎదిరించటానికి ఎవ్వరికీ వీలు కాదనే విషయాన్ని ఋజువు చేస్తున్నై. కాబట్టి నేను ఇక జాగ్రత్తపడాలి. ఒంటిమీద స్పృహ కోల్పోకముందే, నా మదనవికారం ఆయన గుర్తింపకముందే నేనీ ప్రదేశాన్ని వదలి వెళ్ళటం ఎంతో మంచిది. ఒకవేళ ఈ మన్మథవికార చేష్టలను ఇష్టపడనివాడైతే నన్నాతడు శపించినా శపిస్తాడు. ఎందుకంటే, మునులకు పిలిచీ పిలవకుండానే కోపం

ప్రత్యక్షమౌతుంది" అని ఇలా అనుకొన్నదాన్నై, అక్కడినుండి తప్పుకొందామని అనుకొన్నాను. అలా అనుకొని నేను నా దారిన పోయినా బాగుండేది. ఇలా జరగాలని విధి రాసిపెట్టి ఉంచితే అలా ఎలా జరుగుతుంది?

నేను ఎదురుగా నిలబడ్డ మునికుమారునికి భక్తితో నమస్కరించాను. మన్మథుని శక్తికి, శాసనానికి తిరుగులేదు కనుకనూ, మధుమాసప్రభావం అధికంగా ఉండటం చేతనూ, ఆ ప్రదేశం అత్యంతరమణీయంగా ఉండటం చేతనూ, యౌవనం వినయం లేని దవటం చేతనూ, ఇంద్రియచాపల్యంచేతనూ, మనశ్చాంచల్యం చేతనూ, అలాగే జరగవలసి ఉండటం చేతనూ, అంతేకాక ముఖ్యంగా నా దౌర్భాగ్యం చేతనూ, ఇటువంటి కష్టం అనుభవించాలని విధిరాసిపెట్టి ఉండటంచేతనూ విచిత్రంగా అంతటి మనోనిశ్చలత కలిగిన మహాతపస్వి ఆ మునికుమారుడు కూడా మన్మథబాణాలకు గురియైనాడు. సహజగాంభీర్యాన్ని కోల్పోయి పిరికివాడైపోయాడు. గాలికి చలించే దీప శిఖలాగా ప్రేమపరవశత్వం చేత కంపించిపోసాగాడు. అతడు కూడా నాలాగే ప్రేమోన్మాదానికి గురైనాడు.

## 32. పారిజాతకుసుమ మంజరీ ప్రదానం

అతనికి దేహంలోకి కొత్తగా ప్రవేశించిన మదనవికారం బయటకు వచ్చినట్టుగా పులకలు కలిగినై. మునికుమారుని బ్రహ్మచర్యవ్రతం ఎక్కడ భంగమౌతుందో అన్నట్టు అతని చేతిలోని స్ఫటికాక్షమాలిక వణుకుతోంది భయంతో అతని చెవికి అలంకారంగా పెట్టుకొన్న పారిజాతకుసుమ మంజరి అతని చెమటబిందువులతో తడిసిపోయింది. అటు వంటి సమయంలో ఎలా మసలుకోవాలో మన్మథుడే ఉపదేశిస్తాడు గురువులాగు. నేను రెండడుగులు ముందుకు నడచి, అతని ప్రక్కనే ఉన్న రెండవ మునిబాలకునికి వినయంతో నమస్కరించి, "ఈ మహాత్ముని పేరేమిటి? ఈ తపోధనయువకుడు ఎవరి కుమారుడు? ఈయన చెవిలో అలంకారంగా ధరించిన ఈ పుష్పమంజరి ఏ వృక్షానికి చెందింది? నాకు దీన్ని గూర్చి తెలుసుకోవాలని మిక్కిలి



కుతూహలంగా ఉంది. ఇటువంటి సువాసన నేను ముందు పెన్నడు పీల్చియుండలేదు. ఇది వింతైనది" అని ప్రశ్నించాను.

నా మాటలు విన్న ఆ రెండవ తపస్వి చిరునవ్వుతో, బాలా! నువ్విలా అడగటం వల్ల నీకు కలిగే లాభం ఏముంది? సరే, నీవంత కుతూహలంతో అడుగుతున్నావు కనక చెబుతాను విను –

ముల్లోకాల్లోనూ కీర్తిని సంపాదించినవాడు మహాముని శ్వేతకేతుడనే మహాత్ముడున్నాడు. అతడు సమస్తదేవజాతుల చేత పూజింపదగినవాడు. దేవలోకంలో నివసిస్తాడు ఆ మహామునీంద్రుడు. ఆ శ్వేతకేతునకు ఇంతింతనరాని సౌందర్యం ఉంది. దేవలోకకాంతలందరు అతనిని కోరుకొనేంత అందం ఆయనది. ముల్లోకాల్లోనూ ఆయనంత అందగాడు లేనేలేడు. అతని అందానికి నలకూబరుడు కూడా సరిపోడు. ఆయన ఒకనాడు దేవతార్చన కొఱకు పూలు కావాలని ఆకాశగంగలోనికి దిగి పూలుకోస్తున్నాడు. ఆ సమయంలో అక్కడి కమలంలో ఆసీనురాలైన లక్ష్మీదేవి ఆతని సౌందర్యానికి ముగ్ధురాలై పరవశత్వంతో మనస్సుతో అతనితో కలిసిన సౌఖ్యాన్ని పొంది, వెంటనే కమలంలో గర్భంధరించి, వెంటనే ఒక పసివానిని కన్నది, అది దైవఘటన. ఆమె ఆ పిల్లవానిని ఎత్తుకొని తీసికొని వచ్చి, "ఓ మహాత్మా! ఇతడు నీ కుమారుడే, గ్రహించు" అని అతని చేతిలో ఉంచిందా బాలుని. అతడు కూడా మారు మాట్లాడకుండా అతనిని స్వీకరించి, వానికి ఏ యే సమయాల్లో ఏయే సంస్కారాలు చెయ్యాలో అన్నీ చేశాడు. అతడు పుండరీకంలో జన్మించాడు కనుక అతనికి 'పుండరీకు'డని నామకరణం చేశాడు. ఆ బాలుడే ఈ మునికుమారుడు సరే, ఇక ఈ పుష్పం సంగతి ఇది సామాన్యపుష్పం కాదు. పూర్వం దేవదానవులు అమృతంకోసం పాలసముద్రాన్ని మథించినప్పుడు పుట్టిన పారిజాతవృక్షానికి పూసిన పువ్వు నీకు అనుమానం రావచ్చు – బ్రహ్మచర్యదీక్షకు విరుద్ధంగా ఈ పుష్పం ఈ మునీశ్వరుని చెవిలోకి ఎలా వచ్చిందని అదీ చెబుతాను విను.

"ఈ రోజు శివప్రీతికరమైన చతుర్దశి తిథి అని శివదర్శనం చేద్దామని కైలాస పర్వతానికి మేమిరువురము బయల్దేరాము. అలా నందనవన సమీపంలో వస్తూండగా సాక్షాత్తు మధుమాస దేవతలాగా వకుళమాలికలతో, కంఠమాలికలతో సంపూర్ణాలంకారాలతో శోభిస్తున్న వనదేవత చెవిలో కొత్త మావిచిగురాకులు తురుముకొని, పుష్పాలనుండి కాచి తీసిన మద్యాన్ని సేవించి, మావద్ద కేతెంచి, నమస్కరించి ఈ కుసుమమంజరిని ఈయనకు కానుకగా సమర్పించింది. "అయ్యా! త్రిలోకమోహనకర సౌందర్యరాశియైన మీవంటి వారికి ఈ అలంకారం చక్కగా సరిపోతుంది. తీసికోండి, అలంకరించుకోండి" అని ఆమె పల్కింది. అప్పుడే ఈ పారిజాతానికి సాఫల్యం అని ప్రోత్సహించింది.

అయినా పుండరీకుడు ఆమె మాటను లెక్క చేయక, సిగ్గుతో తలవాల్చి అక్కడనుండి వెళ్ళసాగాడు. ఆ వనదేవత ఎలాగైనా ఒప్పిద్దామని అతని వెనకే బయల్దేరి నడువసాగింది. ఇక నేను ఉండబట్టలేక మిత్రమా! ఇందులో పెద్ద తప్పేమున్నది. పుష్పమంజరిని ప్రేమతో ఇస్తోంది గదా! తీసుకో అని దానిని అతని కర్ణాభరణంగా స్వీకరింపజేశాను. నువ్వడిగిన విషయాలన్నీ చెప్పాను గదా! ఇతడెవరో, ఎవరివాడో, ఇదేమో, ఇదిఎలా అతని కర్ణాభరణంగా అయిందో – ఇవన్నీ మొత్తం చెప్పాను సరేనా?" అన్నాడు మిత్రుడు. అలా చెప్పగా పుండరీకుడు చిరునవ్వుతో నన్ను చూస్తూ ఇలా అన్నాడు. "ఓ కుతూహలురాలా! ఇన్ని ప్రశ్నలువేసి ఇబ్బంది పడటం దేనికి? నీ కీపుష్ప సుగంధం బాగా నచ్చినట్లైతే పోనీ ఈ పూవు నువ్వే తీసుకో" అని ఆ పుష్పాన్ని తన చెవినుండి తీసి నా చెవిలో అలంకరించాడు. ఆ సమయాన మునికుమారుని కరస్పర్శతో నా శరీరం పులకరించింది. ఆ స్పర్శవలన అతనికి కూడా అమితమైన సుఖపారవశ్యం కలిగింది. అందువల్లనే వణుకుతున్న అతని వ్రేళ్ళనుండి స్ఫటికాక్షమాలిక జారి క్రింద పడసాగింది. ఐతే నేనా అక్షమాల భూమిని చేరేలోపులోనే పట్టుకొన్నాను. కాని ఆ విషయాలేవీ



అతనికి తెలియనేలేదు. ఆ హారాన్ని మునికుమారుని భుజం నామెడ చుట్టూ వేసినట్టు భావిస్తూ అపూర్వమైన దానినిగా భావిస్తూ మెడలో అలంకరించుకొన్నాను.

ఇక్కడ ఇలా జరుగుతూ ఉండగానే నా తల్లిగారి ఛత్రగ్రాహిణి బిరానవచ్చి, "అమ్మాయిగారూ! రాణిగారు స్నానం చేశారు. ఇంటికిబయల్దేరే సమయం దగ్గఅపడుతోంది. మీరుకూడా స్నానం చేద్దురుగాని రండి" అనిపిలిచింది. అప్పుడు నాకామె మాటలచేత కొత్తగా అడవివేటలో పట్టుబడిన ఆడు ఏనుగులాగా మొదటి అంకుశం పోటుకు, యిష్టం లేకపోయినా కదలక తప్పనట్లుగా అనిపించింది. ఎవరో బలవంతంగా నన్ను పట్టి లాక్కొని పోతున్నట్లనిపించింది. పుండరీకముని ముఖసౌందర్యమనే బురదలో కూరుకుపోయినట్టు, బుగ్గలపై కలిగిన పులకాంకురాలనే ముండ్లలో చిక్కుపడిపోయినట్టు, మన్మథుని బాణపు ములుకుల సమూహములో కదల లేనిదాన్నినైనట్టు, కల్యాణగుణాలనే దారాలతో కుట్టబడిన దాన్నైనట్టుగా మిక్కిలి బలవంతంగా లాక్కొని పోబడినట్టుగా తప్పనిసరిగా స్నానం చేయటానికి బయల్దేరాను.

నేను బయల్దేరగానే అంతాగమనిస్తున్న రెండవ మునికుమారుడు పుండరీకుని పరిస్థితిని అర్థం చేసుకొన్నాడు. అతడు మనోధైర్యాన్ని కోల్పోవటం, ఒళ్ళు తెలియని స్థితిలో ఉండటం చూశాడు. అసత్యకోపాన్ని నటిస్తూ "మిత్రుడా! పుండరీకా! ఏమిటి ఇదంతా ? ఇలా చేస్తున్నావేమిటి? ఇది నీకు తగునా? నీవు నడిచేది నీచుల దారి. సత్పురుషులు ఎట్టి పరిస్థితిలోనూ ధైర్యాన్ని కోల్పోరాదు. నీవంత తపస్సంపన్నుడవు కదా! మైమఅచి ఇలా ప్రవర్తిస్తున్నావేమిటి? అసలా విషయం నీకు తెలుస్తోందా? నీ ప్రవర్తన సామాన్యజనుని ప్రవర్తనలాగా ఉంది. లేకపోతే ఇంద్రియ నిగ్రహాన్ని కోల్పోవటమేమిటి? నీ ధైర్య మేమైపోయింది? నీ మనశ్శాంతి ఎక్కడికి

పోయింది? నీ బ్రహ్మచర్యనియమ పాలన ఎటు పోయింది ? నీ గురూపదేశం సంగతేమిటి? నీ చదువేమైంది? నీ తపోభిమానం ఎక్కడ? నీ ప్రజ్ఞ పనికిరాకుండా పోయిందేమి? నీ బుద్ధి, జ్ఞానం, వైరాగ్యం ఇవేమీ నీయందు లేకుండా పోయినై, కారణమేమిటి? నీ చేతినుండే జారి క్రిందపడిన అక్షమాలను కూడా నీవు గుర్తించలేక పోయావు, ఎందుకని?" అని మందలించాడు.

మిత్రుని మాటలకు పుండరీకుడు సిగ్గుపడ్డాడు. "మిత్రమా! నన్ను అపార్థం చేసుకొంటున్నావు. నా అక్షమాలను స్వాధీనపరచుకొన్న అనార్యురాలిని, అవినయపరురాలిని నేను ఎంత మాత్రం క్షమించను" అని పలుకుతూ నాపై అసత్యకోపాన్ని నటిస్తూ, "ఓసీ, చపలచిత్తురాలా! నా అక్షమాలను నాకివ్వకుండా నిన్నిక్కడి నుండి ఒక్క అడుగు కూడా ముందుకు పోనివ్వను" అని బెదిరించాడు. నేను వెంటనే నా మెడనుండి తీసి, "మహానుభావా! ఇదిగో మీ అక్షమాల తీసుకోండి" అని మాముఖం వంక ఆసక్తిగా చూస్తూ శూన్యహృదయుడై చేయిచాచిన అతనికి నాముత్యాల హారాన్ని ఇచ్చాను. అప్పటికే నా శరీరం చెమటతో తడిసిపోయింది. అయినా స్నానం చెయ్యటానికి అచ్ఛోదసరస్సుకు వెళ్ళాను. కాని, వెళ్ళాలని నాకు ఎంతమాత్రం లేదు. అయినా తప్పక స్నానవిధి పూర్తి చేసుకొని, అతని రూపాన్నే మనసులో భావిస్తూ నా యింటికి వెళ్ళాను.

ఇంటికి వెళ్ళానన్న మాటేకాని, నామనస్సు మనస్సులో లేదు. నేనేం చేస్తున్నానో, నేను ఏమి మాట్లాడుతున్నానో నాకు తెలియటంలేదు. నేను మేల్కొన్నానా, నిద్రిస్తునానా? ఏడుస్తున్నానా? ఏడవటం లేదా? దుఃఖిస్తున్నానా, సుఖిస్తున్నానా? కష్టం వచ్చిందా, బాధ కలిగిందా? ఇవేమీ నాకు తెలియటం లేదు. ఇది పగలో రాత్రో తెలియదు. ఏవి సుందరంగా ఉన్నాయో, ఏవి లేవో, ఇవేవీ నాకు తెలియటం లేదు. మన్మథబాధంటే ఏమిటో తెలియని నేను ఎటుపోతున్నానో, ఏం చేస్తున్నానో, ఏం వింటున్నానో, ఏం చూస్తున్నానో ఇవేమీ నాకు తెలియటం లేదు.



## 33. మహాశ్వేత విరహబాధపడుట

నేను అందర్నీ వదలి, ఒక్కతెనే నా భవనం పైభాగానికి చేరి, కిటికీలో నాముఖం పెట్టి పుండరీకుడున్న వైపే చూడసాగాను. అన్నిదిక్కులకంటే ఆయన ఉన్న దిక్కే చాలా గొప్పదనిపించింది. ఆ దిక్కే రత్నరాసులున్న దిక్కులాగా, అమృతసముద్రంలాగా, పూర్ణచంద్రుని ఉదయం చేత శోభిస్తున్నట్లుగా నాకు అనిపించింది. నాకెదురుగా కనిపించిన పరిమళించే గాలిని, కూసేపిట్టను కూడా పుండరీకుని గూర్చి అడగాలనిపిస్తోంది. అతని మీద గల ప్రేమచేత తపస్సు చేసైనా అతన్ని పొందాలని అనిపిస్తోంది. అతనిపై గల ప్రేమ నన్ను కూడా మౌనవ్రతదీక్షకు పురిగొల్పుతోంది. అతడు ధరించిన మునివేషమే ధరించమని ప్రోత్సహిస్తోంది. అతని చెవిని అలంకరించటం చేత పారిజాత పుష్పానికి అంత పరిమళ మబ్బినట్టు తోస్తోంది, అతడు నివసిస్తున్నాడు కనుక స్వర్గలోకం కడు రమ్యమైంది అని అనిపిస్తోంది. ఆ పుండరీకునిలాగా సుందరుడైన కారణంగా మన్మథుడు అజేయుడయ్యాడని తోస్తోంది.

అతడు నాకు దూరంగా ఉన్నప్పటికి అది లెక్కలోకి రాలేదు. సూర్యుడు అనంతదూరంలో ఉన్నా పద్మాన్ని వికసింపజేస్తున్నాడు. చంద్రుడు సుదూరంలో ఉండికూడా సముద్రాన్ని ఉప్పొంగ జేస్తున్నాడు. మేఘం ఆకాశంలో ఉండి భూమిమీది నెమలిని నాట్యమాడిస్తున్నది. ఆతని అక్షమాల నన్ను ప్రాణాలు ఎగిరిపోకుండా కాపాడుతోంది.

ఇంతలో తాంబూల కరండవాహిని తరళిక నాతోపాటు సరస్నానానికి వచ్చింది. నన్ను, నాపరిస్థితిని చూచి, నావద్దకు వచ్చి ఇలా అన్నది, "అమ్మా! ఉదయాన మనకు సరస్తీరాన కనబడిన మునికుమారు లిద్దరిలో ఒకడు మీకు పారిజాతపుష్పమంజరి యిచ్చినాయన కాక రెండవ మునికుమారుడు ఎవ్వరికంటా పడకుండా జాగరూకుడై నేను వచ్చేదారిలో వేచి ఉన్నాడు. అతడు నావద్దకు వచ్చి మీగూర్చి చెప్పమని కోరాడు, "ఏమమ్మా! ఈ అమ్మాయి ఎవరు? ఎవరి కూతురు? ఆమె పేరేమిటి? ఆమె ఎక్కడకు వెళుతుంది?"

అని ప్రశ్నించాడు. అప్పుడు నేనతనితో, "అయ్యా! ఆమె చంద్రుని నుండి జనించిన గంధర్వకులంలో పుట్టిన 'గౌరి' అనే కన్యకకు సకలగంధర్వ చక్రవర్తియైన హంసునికి కుమార్తెగా జన్మించిది, ఆమె పేరు మహాశ్వేత. గంధర్వ నివాసమైన హేమకూటానికి ఆమె వెళ్ళింది" అని మీ వివరాలన్నీ ఎఱుక పరచాను. అలా నేను చెప్పిన మాట విని ఆయన క్షణంసేపు మౌనంగా ఉన్నాడు. నావంక ప్రార్థనా పూర్వకంగా చూస్తూ, "ఓ బాలికా! నిన్ను చూస్తే మాట తప్పేదానిలా లేవు. సహజంగా బాల్యచాపల్యం నీలో కనిపించటంలేదు. నిన్ను నమ్మి నేనొకటి ప్రార్థిస్తున్నాను. మరి, అలా చేస్తావా?" అని అడిగాడు.

నేను అతని బేలతనం చూసి బాధపడి అతనితో ఇలా అన్నాను. "మహాత్మా! మీరెందుకింత జాలిగా మాట్లాడుతున్నారు? మీబోటి వారిముందు నే నెంతదానను? మీరు సకలభువనపూజనీయులు. ఇంకా నేనే చాలా అదృష్టవంతురాలను. ఎందుకంటే ఎంతోపుణ్యం చేసుకొని ఉంటేనే గాని సమస్త పాపాలు పోగొట్ట గలిగిన మీ పుణ్యదృష్టి మాపై ప్రసరించదు. ఇంక ఆజ్ఞాపించుటన్నది ఎక్కడిది? ఇక మీరెంత మాత్రం అనుమానించకుండా నేనేం చెయ్యాలో ఆజ్ఞాపించండి. నన్ననుగ్రహించండి".

నా మాటలు అతనిలో విశ్వాసాన్ని పెంచాయి. నన్ను తన ప్రాణస్నేహితురాలిగా, ప్రాణప్రదురాలుగా ప్రశంసించాడు. సమీపమందున్న తమాలపల్లవాల్ని నలిపి పిండి, ఆ రసంతో తన ఉత్తరీయంలో కొంత అంచు భాగాన్ని చింపినగుడ్డపై గోటికొనతో ఈ క్రింది శ్లోకాన్ని రాశాడు. ఆ పత్రికను నాకిచ్చి, "దీనిని ఎవరికంటా పడకుండా తీసికొనిపోయి ఆ కన్యక కివ్వు. అని ప్రార్థించాడు."

అని తన తమలపాకుల పెట్టెలోనుండి ఆ లేఖను తీసి నాకు చూపింది. అప్పుడు నా ఆనందం అంతా యింతా కాదు. వెంటనే ఆ లేఖను తరళిక చేతులనుండి తీసుకొని యందున్న ఆర్యా శ్లోకాన్ని ఇలా చదివాను.



**శ్లో॥ దూరం ముక్తాలతయా బిససితయా విప్రలోభ్యమానోమే ।**
**హంస ఇవ దర్శితాశః మానస జన్మాత్వ యానీతా ॥**

(భావం : నా మనస్సులోని అభిలాషను తామరతూడు ఆశ చూపించి హంసను దూరంగా తీసుకొనిపోయినట్లు నీ ముత్యాలహారాన్ని చూపించి నన్ను ఆశపెట్టి నీ వద్దకు అంత దూరం తీసుకొని పోయావు)

ఈ శ్లోకం చదివిన నాకు విరహం ఇంకా ఇంకా అధికమయింది. దారితప్పిన వాడికి దిగ్భ్రమ కలిగినట్టు, అంధునకు అమావాస్య చీకటితోడైనట్టు, మూగవానికి నాలుక తెగిపోయినట్టు, పసివానికి మాయాజాలం చూపినట్టు, తిక్కతిక్కగా వాగేవానికి జ్వరతీవ్రతవల్ల పిచ్చి ప్రేలాపన కలిగినట్టు, పిచ్చివానికి కల్లు త్రాగించినట్టుగా నా మనస్సు మరీ క్షోభించింది. మొత్తంమీద అతనికి నాపై ప్రేమభావం ఉదయించినట్టు తెలిసికొని నేను మిక్కిలి ఆనందించాను. నాకెన్నో వరాలు లభించినట్టు, అమృతం తాగినట్టు, త్రిలోకాధిపత్యం లభించినట్టు సంతోషించాను. ఇంత మంచివార్త చెప్పిన తరళిక ఎప్పుడూ దగ్గఱే ఉండేదైనా చూడ వీలులేని దానిలాగా, పరిచయస్థురాలైనా వింతదాని లాగా, ఎప్పుడు నా ప్రక్కనే ఉండేదైనా అందని లోకాల్లో ఉన్నదానిలాగా, చూస్తూ దాని బుగ్గలు నిమురుతూ, ముంగురులు సవరిస్తూ, అది దాసీది, నేను రాజకుమార్తెనని తేడాలు గుర్తించకుండా ఆమెతో ఆ విషయాలే ముచ్చటిస్తూ, ఏకాంతంలోనే ఉండి ఆ పగలు గడిపాను.

సాయంకాలమైంది. సూర్యబింబం నాలోని అనురాగంవలె ఎఱ్ఱబడింది. సూర్యాస్తమయ కారణంగా తామరపుష్పాలు ముడుచుకుపోయినై. చక్రవాకాలు పరస్పర విరహంతో బాధపడుతున్నై. అప్పుడే పలుచని చీకట్లు కమ్ముకోసాగినై. ఇంతలో ఛత్రధారిణి నా వద్దకు వచ్చి, "భర్తృదారికా! ఉదయం సరస్సువద్ద మనం చూసిన మునికుమారు లిద్దరిలో ఒకాయన ద్వారం దగ్గఱ వేచియున్నాడు. స్ఫటికాక్షమాలిక మీవద్దనున్న దానిని తీసుకుపోవటానికి వచ్చానన్నాడు అని తెలియపరచింది, నేను మునికుమారుని పేరు వినగానే

అక్కడనే ఉన్నదాన్నైనా ఆతడున్న ద్వార ప్రదేశం వద్దకు వెళ్ళినట్టనిపించింది. నేను వెంటనే మరొక కంచుకికి, "వెళ్ళి అతనిని ప్రవేశ పెట్టు" అని ఆజ్ఞాపించాను. కంచుకి వెంటనే వెళ్ళి అతనిని వెంటబెట్టుకొని వచ్చాడు.

## 34. కపింజలుడు మహాశ్వేతవద్దకు వచ్చుట

ఆ రెండవ మునికుమారుని పేరు కపింజలుడు. అతడు పుండరీకునకు సమానస్థాయిలో ఉన్నాడు. రూపానికి యౌవనంలాగా, యౌవనానికి మన్మథుడులాగా, మన్మథునకు వసంతుడులాగా, వసంతునకు దక్షిణానిలంలాగా పుండరీకునకు తగినట్లుగా ఉన్నాడు. ఆ కపింజలుడనే మునికుమారుడు ఆ కంచుకి వెంట వస్తుంటే వెన్నెల వెంట లేత సూర్యుని ఎండలాగా కనపడ్డాడు. అతనిని చూస్తుంటే ఏదో ఆందోళనలోనున్నట్టుగా, విషాదంతో కూడినట్టుగా, ఏదో పోగొట్టుకొన్న వాడల్లే కనపడ్డాడు.

నేను వెంటనే లేచి ఆయనకు నమస్కరించాను. ఆదరంతో ఆసనాన్ని చూపాను. ఆయనను కూర్చుండబెట్టి ఆయన వద్దన్నా వినకుండా పాదాలు నీటితో కడిగాను. తడి ఆరేటట్టుగా ఉత్తరీయపుటంచుతో ఆయన పాదాలు వత్తాను. నేను కూడా నేలపైననే ఆయనకు సమీపంగా కూర్చున్నాను. కపింజలుడు కొద్దిసేపు మౌనంగా ఉండి, ఏదో చెప్పాలనుకొన్నవాడై, నా ప్రక్కనే కూర్చున్న తరళిక వంక చూశాడు. ఆయన అభిప్రాయం నాకు అర్థమైంది అతని చూపులలోనే, నేనన్నాను – "ఓ మహాత్ముడా! ఈ తరళిక శరీరంతో వేరైనా మనస్సుతో మాత్రం వేరు కాదు. ఈమె నా బహిఃప్రాణ మనుకోండి. మీరేమీ అనుమానపడకుండా చెప్పండి" అని పలికాను.

## 35. కపింజలుడు పుండరీకుని కాపాడమని కోరంట

నేనలా అనే సరికి కపింజలుడు నిస్సంకోచంగా ఇలా పలికాడు. "రాజపుత్రీ! ఏమని చెప్పమంటావు? సిగ్గుతో నానోటి వెంట మాటరావటం లేదు. కందమూలాలు తినేవాడు, శాంతాత్ముడు, వనసంచారియైన ముని



యెక్కడ? కోపతాపాలకు, విషయ వాంఛలకు నిలయమై కలుషితమైనట్టి, మన్మథ వికారాలకు ఆట పట్టైన ఈ బయటి ప్రపంచమెక్కడ? చూశావా? ఈ రెంటికి ఎలా కుదరలేదో! అసలు ఈ దేవుడు ఏం చెయ్యదలచుకొన్నాడో! ఎంతమంచి వాణ్ణైనా సులభంగా నవ్వుల పాలు చేస్తుంది ఆదైవం.

నారచీరలు ధరించి నియమవంతులైన వారిలా చేయవచ్చా? తపస్సుకు తగినదా? అతని పరిస్థితి నీకు చెప్పక తప్పదు. నాకు వేరొక దారి లేదు. ఏం చెయ్యాలన్నా కుదరనిది. ఒకవేళ చెప్పకుంటే ఆయనకు మిక్కిలి ఆపద సంభవిస్తుంది. అవసరం వస్తే తన ప్రాణం పణంగా పెట్టైనా స్నేహితుని ప్రాణాలను కాపాడాలి కదా! అమ్మా! నీకు తెలుసు కదా! నీ ఎదుటే అతనిని కోపగించి మాట్లాడాను, తర్వాత నాకు ఏంచేయాలో తోచక, కోపం వచ్చి ఆ ప్రదేశం వదిలి పూలు కోయటంకోసం అవతలకు వెళ్ళాను. నేను తిరిగి వచ్చి చూస్తే ఆయనక్కడ కనపడలేదు! ఏమిటి? ఒకవేళ మన్మథ బాధతో ఆ దేవకాంతను వెతుక్కుంటూ వెళ్ళాడా' అని అనుమానపడ్డాను. ఒక వేళ ఆమె వెళ్ళిపోయిన తర్వాత, తెలివి తెచ్చుకొని, ఇలా చేశానేమిటని సిగ్గుపడి నాకు ముఖం చూపించలేక ఎక్కడన్నా చాటుగా ఉన్నాడా? కాకపోతే, గట్టిగా కోపగించానని కోపం వచ్చి నన్ను వదిలి వెళ్ళిపోయాడా? ఒకవేళ నాలాగానే అతడు నన్ను వెతుక్కుంటూ తిరుగుతున్నాడేమో!' అని కొద్దిసేపున్నాను.

అయితే పుట్టిన దగ్గఱనుంచి అతన్ని వదిలి పెట్టి ఒక్క క్షణం కూడాలేను. ఆ బాధతో 'ఒకవేళ ధైర్యం కోల్పోయి ఏదైన అఘాయిత్యం తలపెట్టాడేమో! సిగ్గుతో కుంచించుకు పోయినవాడు ఎటువంటి పని చెయ్యటానికైనా వెనుకాడడు. కాబట్టి అతనిని ఒంటరిగా ఉండనీయరాదు'అని భావించి అతనికై గట్టిగా వెదికాను. వెతికినా కనపడక పోయినకొద్దీ నాలో ఆందోళన అధికమై పోసాగింది. స్నేహితుని మీదున్న ప్రేమకొద్దీ ఏవో ఏవో అశుభకరమైన ఆలోచనలు రాసాగినై. వెదికి, వెదికి చివరికి సరస్తీరంలో ఒక పొదరింట్లో కదలకుండా మెదలకుండా కనులు మూసుకొని కూర్చొని మరణానికి దగ్గరలో

ఉన్నట్లున్నాడు. మన్మథుడు చాటుగా అతనిని బాధిస్తున్నాడు, శపిస్తాడేమో అనే భయంతో.

అతడు ఇంద్రియశూన్యుడై ఉన్నాడు. కన్నులనుండి బాష్పధారలు నిరంతరం జారుతున్నై. పారిజాతకుసుమాన్ని కొద్దికాలంక్రితమే తీసిన కారణంగా మిగిలిన సువాసన కాకర్షింపబడిన తుమ్మెదలు ఝుంకారం చేస్తున్నై. ఆ ఝుంకారం మన్మథసమ్మోహనమంత్రం జపిస్తున్న శబ్దంలాగా ఉంది. తుమ్మెదలు చెవిచుట్టూ మూగిన కారణంగా చెవిలో నల్లకలువ తురుముకొన్నట్టు, తమాలపల్లవాలు అలంకరించుకున్నట్టుంది. అతనికి మదనపరవశత్వంచేత వెంద్రుకలు నిక్కబొడుచుకున్నై. అవి మన్మథుని బాణపు ములుకులవలె ఉన్నై. ప్రభాతచంద్రునిలాగా తేజోహీనుడై ఉన్నాడు. వేసవి కాలపు గంగాప్రవాహంలాగా కృశించి ఉన్నాడు. మదనాగ్నికి అతని శరీరం వాడిపోయింది. అతనిని చూస్తుంటే ఎవరో కొత్తవాడిలాగా కనిపించాడు. పిశాచగ్రస్తునిలాగా ఉన్నాడు. పిచ్చివానిలా కనబడుతున్నాడు. గుడ్డితనం, చెవిటితనం, మూగతనం అన్నీ కలవానిలాగా ఉన్నాడు. అతనిని చూసిన నా హృదయం తల్లడిల్లిపోయింది. "మన్మథుడెంత క్రూరుడు! ఎంతటి పుండరీకు డింతటి అవస్థలోకి వచ్చాడు? ఎంతటి జ్ఞాని కాసేపట్లో ఎంత వ్యర్థుడైనాడు? బాల్యం నుంచి నావంటి వారికెందరికో మార్గదర్శకుడై, ధీరుడై, దోషరహిత ప్రవర్తనతో నడచేవాడు. అజ్ఞానం వదిలిపెట్టి, తప్రఃప్రభావాన్ని గణించకుండా, గాంబీర్యాన్ని విడనాడి ఇలా మందమతి యైనాడు" అని నాలో నేనే అనుకొంటూ నెమ్మదిగా అతనిని సమీపించి అతనితో ఇలా అన్నాను –

"మిత్రమా, పుండరీకా! ఏమిటిదంతా? చెప్పునాకు" అని అతనిని నిలదీసి అడిగాను. అతడు కన్నీరు అవిరళంగా స్రవిస్తూ ఉండగా పెద్దగా నిట్టూరుస్తూ, సిగ్గుతో తడబడుతూ" మిత్రమా! కపింజలా! తెలిసి కూడా అలా అడిగితే నేనేం చెప్పేది?" అని నెమ్మదిగా పలికాడు. నా ప్రాణాలు విలవిలలాడాయి. ఇతనిని ఏంచేసైనా కాపాడుకోవాలి అని తలచి, "చెలికాడా! పుండరీకా!



సరే, నా కన్నీ తెలుసు. నేను నిన్నడిగేది ఒకటే. ఇలా చేయమని గురువు లుపదేశించారా? ధర్మశాస్త్రాలలో చదివి ఇలా చేస్తున్నావా? లేక ఇది వేరొక తపోవిధానమా? కాక, స్వర్గానికి సరాసరి పోయే మార్గమా ఇది? ఇది వ్రతమా? లేక మోక్షోపాయమా? ఇటువంటివి మనస్సులో తలచటానికి కూడా వీలులేదు, అటువంటప్పుడు చెప్పటం, చూడటం ఎలా కుదురుతుంది? దుష్టమన్మథుని చేత తెలివిలేనివానిలాగా నవ్వులపాలవటం గూర్చి నీవాలోచించలేక పోతున్నావేమిటి?

మన్మథ పీడితుడు ఎన్ని అకార్యాలైనా చేస్తాడు. జాలిపడి విషపుతీగెను నీళ్ళు పోసిపెంచుతాడు. నల్లకలువల మాల అని భ్రమించి పదునైనఖడ్గాన్ని కౌగిలించుకొంటాడు. నల్లత్రాచును కృష్ణాగరు ధూపమాలిక అనుకొని దగ్గఱకు తీసుకొంటాడు. రత్నమని భ్రమపడి కణకణలాడే అగ్ని కణాన్ని చేతపట్టుకుంటాడు. ప్రేమోన్మాది ఎంత ప్రమాదకరవస్తువు నైనను ఉపయుక్త వస్తువని భావిస్తాడు. క్షోభించే నీ మనస్సును స్వాధీనపరచుకో, శాంతింపజేసుకో! మన్మథునికి లోబడకు. ఆ దుష్టమన్మథుణ్ణి ధైర్యంతో ఎదిరించి జయించు"అని నేతనికి ప్రబోధించాను, నా మాటలు విని చేతితో నిరంతరం స్రవిస్తున్న కన్నీటిని తుడుచుకొని నన్నొక్క చేతితో పట్టుకొని ఇలా జవాబిచ్చాడు.

"చెలికాడా! నీకేం? నీవు ఎన్నైనా చెబుతావు. నీవే బాధాలేకుండా నిక్షేపంలాగా ఉన్నావు. సర్వవిషతీవ్రతకల మన్మథబాణాలు నీకు గుచ్చుకుంటే తెలిసేది నా బాధ ఎంతటిదో ఇతరులకు సుఖంగా కూర్చుని ధర్మబోధ చేస్తున్నావు. నీ ఉపదేశ వాక్యాలు నావంటి వాడికి కాదు చెప్పవలసింది. ఇంద్రియాలు, మనస్సు, వినికిడి శక్తి కలవారికి, ఇవ్వన్నీ చెప్పు. నాకు కాదు చెప్పవలసింది. ఎందుకంటే ఈ ఇంద్రియశక్తులన్నీ నేను ఎప్పుడో కోల్పోయాను. నా ప్రాణాలు నా అధీనంలో లేవు. అయినా ఉపదేశకాలం ఎప్పుడో చేయదాటిపోయింది. అయితే నా కుపదేశించదగిన వాడవు నీవు తప్ప వేరెవరున్నారు ? నన్ను సరైన మార్గంలో వేరెవరు నడుపుతారు నీవుతప్ప?

నేను మాత్రం ఎవరిమాట వింటాను? నీ మాటేగదా! నీవు తప్ప ఈ లోకంలో ఆత్మ బంధు వెవదున్నాడు? కాని, ఇప్పుడు నేనేమీ చేయలేను. నేను బ్రతికి యున్నంతవఱకు నా మదన సంతాపానికి ప్రతిక్రియ చెయ్యి. కల్పాంతకాలంలో ఉద్భవించే పన్నెండుగురు సూర్యుల కిరణాల ఎండతీవ్రతను మించింది నేనిపుడు పడుతున్న మదనతాపం. ప్రస్తుతం నీ ఉపదేశాలు చాలించు నా శరీరావయాలు మన్మథతాపానికి ఉడికిపోతున్నాయి. నా దేహం భగభగ మండుతోంది. ఇక్కడ సమయానికి తోచిన విధంగా ఏంచేస్తావో చెయ్యి".

## 36. కపింజలుడు పుండరీకునికి శైత్యోపచారాలు చేయుట

రాకుమారీ! అతడు అలా అంటున్నా నేను మాత్రం ఇంకా ఏదో ఉపదేశవాక్యాలు ఋజువులతో సహా వివరించాను. కాని నేనెన్ని చెప్పినా, ఎంత చెప్పినా చెవిని పెట్టలేదు. అప్పుడు నేను, "ఓహో! ఇతడు మనం అందుకోలేనంత ఉన్నతస్థాయికి వెళ్ళిపోయాడు. మనం మరలింపలేం. ఏం చెప్పినా ఇకప్రయోజనం లేదు. కాని, నేను ఇతని ప్రాణాలు కాపాడటానికి ప్రయత్నం చేస్తాను". అని నిశ్చయం చేసుకొని అతనికి శీతలోపచారాలు చేయటం ప్రారంభించాను. సరస్సునుండి మెత్తని తామరకాడలు, తామరాకులు తెచ్చాను. అవి నీళ్ళోడుతూ చల్లగా ఉన్నై. పుష్పపరాగంతో నిండిన తెల్ల తామరలు, కలువలు తీసికొనివచ్చి ఆ లతాగృహంలోని శిలపైననే అతనికి శయనం ఏర్పాటు చేశాను. ఆ శయ్యపై సుఖంగా కూర్చున్నాడు పుండరీకుడు. నేను సమీపంలో చందనవృక్షాల చిగుళ్ళను కోసి, వాటిని బాగా నలిపి, సువాసనాభరితమైన ఆ చందనరసాన్ని అతని ముఖానికి పట్టుగా రాచాను. పాదాల దగ్గఱ నుండి పైదాకా శరీరానికి కూడా చందనరసాన్ని పూశాను చూర్ణంగా చేయబడిన కర్పూరధూళి చేత స్వేదప్రక్రియను చేశాను. చందనంతో తడిసిన నారవస్త్రం ముక్కను గుండెలపై కప్పి దానిపై స్వచ్ఛజలబిందువులతో కూడిన అరటి ఆకుతో విసరాను.



ఈ విధంగా మాటి మాటికి పద్మపత్రాలు, పద్మాలు మార్చి శయనం కల్పించటం, ఆరగా ఆరగా చందనం పూయటం, మాటి మాటికి స్వేదన క్రియచేయటం, నిత్యం అరటాకులతో వీయటం ద్వారా అతనికి పరిచర్యలు చేశాను. నా మనస్సుకు ఇలా అనిపించింది, "ఏమిటి ఈ వింత! ఈ మన్మథునికి అసాధ్యం ఏదీ లేదనుకొంటాను. లేకపోతే లేడి పిల్లలాంటి అమాయకుడైన పుండరీకు డెక్కడ? నవనాగరకతా విలాసాలు మూర్తీభవించిన గంధర్వ రాజపుత్రి మహాశ్వేత ఎక్కడ! మన్మథునికి అసాధ్యమైన పని ఏదీ లేదు. అతడు తలచుకొంటే ఏదైనా సాధ్యమే అవుతుంది. కలువలు కూడా సూర్యుని యందనురక్తి కలవౌతాయి. పద్మాలు కూడ చంద్రుని ప్రేమిస్తాయి. రాత్రికూడా పగటితో కలసిపోతుంది. వెన్నెలకూడా అంధకారాన్ని అనుసరిస్తుంది. నీడ దీపానికి ఎదురుగా పోతుంది. మెఱుపుతీగ మేఘాల్లో స్థిరంగా మెరుస్తూనే ఉంటుంది. వృద్ధత్వం యౌవనంతో విజృంభిస్తుంది. అతనికి దుస్సాధ్య మనేదే లేదు.

లేకపోతే ఏమిటిది? సముద్రగాంభీర్యుడు కూడా చిటికెలో గడ్డి పరకంత తేలికైపోయాడు. ఆ తపస్సేమైపోయిందో. అతనికి ఇటువంటి అవస్థ రాదగిందేనా? ఈ ప్రమాదం ఏంచేసినా తప్పేటట్టు లేదు. నే నిప్పుడేం చెయ్యాలి? ఎక్కడకు వెళ్ళను? ఎవరిని శరణు కోరను? ఏంచేసి, ఎవరిని సహాయ మడిగి, ఏ ప్రకారంగా నా మిత్రుని ప్రాణాలు కాపాడుకోగలను? ఏంచేస్తే ఇతడు ప్రాణాలతో ఉంటాడు? అంటూ చాలా సేపు ఎంతో ఆలోచన చేస్తూ ఉండిపోయాను.

చివఱికి ఎంత నీచకృత్యం చేసైనా ప్రాణమిత్రుని ప్రాణాలు కాపాడాలని తలచాను నేను. ఆమెవద్దకే వెళ్తాను. ఆమెకు ఇతని పరిస్థితి అంతా వివరిస్తాను. అని నిశ్చయించి అతనికీ విషయం చెబితే సిగ్గుతో అంగీకరించదేమోనని అనుమానపడి ఏదో సాకుచెప్పి బయల్దేరి మీ వద్దకు వచ్చాను. నేనిప్పుడు చేసింది మంచా, చెడా? ఉచితమా? అనుచితమో మీరే నిర్ణయించండి".

అని పలికి, నేనేం చెప్పబోతున్నానా అని నావైపే దృష్టి పెట్టి మౌనంగా ఉండి పోయాడు. పుండరీకుడు నాకోసం ఎంత పరితపిస్తున్నాడో తెలిసి నాకు అమృత సరస్సులో మునిగినంత సంతోషం కలిగింది. సంగమ సౌఖ్యమనే సముద్రంలో ప్రవేశించినట్లు అనిపించింది. ఉన్నత సంతోషశిఖరాన్ని ఎక్కినంత ఆనందం కలిగింది. మన్మథుడు నన్ను లాగానే పుండరీకుని కూడా బాధిస్తున్నాడు కదా అని సంతోషించాను.

కపింజలునికి ఏం సమాధానం చెప్పాలా? అని ఆలోచిస్తున్నాను. ఇంతలోగా తొట్రుపాటుతో ప్రతీహారి ప్రవేశించి, "భర్తృదారికా! నీ ఆరోగ్యం సరిగాలేదని పరిచారికల చేత విని మహారాణిగారు మిమ్ము చూచిపోదామని వస్తున్నారిక్కడికి" అని నివేదించింది.

అది విని జనసమ్మర్దానికి ఇష్టపడని మునికుమారుడు వెంటనే పైకి లేచాడు. "రాజకుమారీ! ఇప్పటికే నేను వచ్చి చాలాసేపైంది. ముల్లోకాలకు చూడామణి వంటి సూర్యభగవానుడు అస్తమించబోతున్నాడు. ఇకనేను వెడతాను. అమ్మా! నీకు దణ్ణం పెడతాను. నా ప్రియమిత్రుని ప్రాణాలు ఎలాగైనా కాపాడు. అదే నాకు మహాప్రసాదం" అని పలికి నేను బదు లిచ్చేందుకు సమయం ఇవ్వకుండానే పరిజనుల మధ్యలో నుండి ఎలాగో దారి చేసుకొని బయటకు వెళ్ళిపోయెను.

అమ్మకూడా నా వద్దకు వచ్చి కూర్చొని చాలా సేపు మాట్లాడి వెళ్లిపోయింది. అయితే ఆమె నావద్దకు వచ్చి ఏంచేసిందో, ఏంచెప్పిందో, మాత్రం నాకేమీ తెలియదు. శూన్యహృదయురాలిలా ఉండిపోయాను. ఇంతలో ప్రొద్దు కూకింది. పడమటి దిక్కు ఎఱ్ఱబడింది. పద్మవనాలు కలువల వనాలు నల్లబారినై. తూర్పున చీకట్లు ముసురుకొంటున్నాయి. లోకమంతా అంధకారంలో మునిగి పోయింది. నాకేం చెయ్యాలో ఏమీ తోచలేదు. "ఏమే, తరళికా! నా మనస్సెంతో ఆందోళనతో ఉంది. నీవేం పట్టించుకోవా? ఈ విషయంలో ఏం చెయ్యాలో నాకెంత మాత్రం తెలియటం లేదు. నీ ఎదుటనేగదా



కపింజలముని ఏం చెయ్యాలో చెప్పి వెళ్ళింది. మరిప్పుడేం చేద్దామో నువ్వే చెప్పు. నేను కూడా ఇతరకన్యకల లాగానే సిగ్గు వదిలి, ధైర్యం విడనాడి, వినయం దూరం చేసికొని, జనుల నిందను నిర్లక్ష్యం చేసి, సదాచారం మంటకలిపి, శీలం అతిక్రమించి, కులమర్యాద పాటించక, అపకీర్తికి జడవకుండా, తల్లిదండ్రుల అనుమతి లేకుండా నా అంతట నేనుగా అతని వద్దకు వెళ్ళి అతని పాణిని గ్రహించనా? గురుజన ధిక్కారంవల్ల మహాపాపం కలుగుతుంది. వెళ్ళకుంటే పూజ్యుడైన కపింజలుని మాట పొల్లుపోయినట్లౌతుంది. అంతేకాక, నా విరహంచేత ఆ పుండరీకుని ప్రాణాలకు ముప్పు వాటిల్లవచ్చు. అదీ మహాపాపానికి మూలమవుతుంది. ఇలా ఆలోచన చేస్తుండగానే కొద్ది కొద్దిగా లోకం కండ్లకు కనబడేటట్లు చంద్రభగవానుడు ఉదయించాడు.

ఆ చంద్రోదయం వలన లోకంలో తెల్లని వెన్నెల వ్యాపించింది. ఆ వెన్నెల చంద్రుడనే సింహం చీకటనే ఏనుగు కుంభస్థలాన్ని పగల గొట్టటం చేత తెల్లని ముత్యాలు పరిచినట్టుగా ఉంది. ఉదయగిరి అనే సిద్ధాంగన తన గుండెలకు రాచుకొన్న చందన రాశిలాగా తెల్లగా ఉంది వెన్నెల. పాతాళాన్ని పగలకొట్టుకుంటూ భూమిపైకి వచ్చిన ఆదిశేషుడి పడగల వరుసలాగా ఉన్నాడు చంద్రుడు. ఆ రాత్రి చంద్రప్రభలచేత శోభాయమానంగా వెలుగజొచ్చింది నేను తరళిక ఒడిలో ఒదిగి పడుకొని ఉన్నాను. చల్లని చంద్రుడు నా కంటికి మృత్యుదేవతలాగా అనిపిస్తున్నాడు.

అప్పుడు నేను తరళికతో, "చెలీ! వసంతమాసపు మలయమారుతాల్లాంటివి ఒక ఎత్తైతే ఒక్క పాపిష్ఠి చంద్రుడు మాత్రం ఒక ఎత్తు. అందువల్లనే ఈ చంద్రుని ధాటికి తట్టుకోలేకపోతున్నాం. ఈ చంద్రోదయం వల్ల నా హృదయం తట్టుకోలేకపోతోంది. ఇప్పుడు చంద్రుడు రావటం అసలే జ్వరతాపంతో బాధపడే వానిమీద నిప్పులు కుమ్మరించినట్టుగా, చలికి వణికే వానిపై మంచువర్షించినట్టుగా, విష ప్రభావంచేత మూర్ఛ చెందిన వానిని నల్లత్రాచు

కాటువేసినట్లుగా బాధాకరంగా ఉంది చూశావా" అని అంటూనే స్ప్రహకోల్పోయాను. వెంటనే తరళిక సంభ్రమంతో చేసిన చందన చర్చతో, విసనకఱ్ఱతో వీయటంతో కొద్దిగా తేరుకొన్నాను. నాకు కలిగిన కష్టానికి తట్టులేక నిరంతరం కన్నీరు కారుస్తున్నది తరళిక. ఆమె నాకు స్పృహ వచ్చినందుకు సంతోషించింది. నా కాళ్ళకు నమస్కరించి, "అమ్మా! ఇటువంటి క్లిష్ట సమయాల్లో సిగ్గుపడటం, గురుజనుల అనుమతి కోరటం అనవసరం. నువ్వు నెమ్మదించు. నన్ను పంపితే నీ ప్రియుణ్ణి ఇక్కడికి తెస్తాను. లేకుంటే, మనమే అతని వద్దకు వెడదాం, లే! లేకపోతే ఈ మన్మథుని ఆగడాలకు నీవు తట్టుకోలేవు" అని అన్నది.

## 37. మహాశ్వేత పుండరీకుని వద్దకు వచ్చుట

నేను ఆమె మాటలు విన్నాను. ఆమెతో ఇలా అన్నాను, "ఓసీ, పిచ్చిదానా! మన్మథుడివల్ల ఏమవుతుంది? మృత్యువు దగ్గఱకో, మునికుమారుని దగ్గఱకో తీసుకుపోగల చంద్రుడు రానే వచ్చాడు. ఇకలే, ప్రియుని వద్దకే ఎలాగైనా వెళ్ళి ప్రాణాలు కాపాడుకుందాం" అని అవయవాలు పట్టుతప్పుతున్నా ఎలాగో సరిచేసుకొని, నెమ్మదిగా పైకి లేచాను. అప్పుడే ముందు రాబోయే దుర్నిమిత్త సూచకంగా నాకుడి కన్ను అదరటం మొదలెట్టింది. నాకు అనుమానం కలిగినా లెక్క చేయలేదు.

చంద్రుని బింబం నిర్మలాకాశంలో అమృతాన్ని కురిపిస్తున్నట్టుగా, తెల్లని ఆకాశగంగలు ప్రవహిస్తున్నట్టుగా, వెలుగొందుతున్నాడు. తెల్లని వెన్నెలలో భూమండలం, మహావరాహంచేత పాలసముద్రం నుంచి లేపబడిందా అన్నట్టుగా ఉంది. రాజమార్గాలు ప్రియుని కోసం దూతికలుగా పంపబడే స్త్రీలచేత నిండియున్నై. కొందఱు స్త్రీలు తెల్లని వెన్నెలకు భయపడి నల్లని ముసుగులు ధరించారు. అభిసారికలు హడావుడిగా అటు, ఇటు తిరుగుతున్నారు. కలువల చుట్టూ తుమ్మెదలు పరిభ్రమిస్తున్నై. తరళిక తన తాంబూలపు పెట్టెతో నన్ను వెంట బెట్టుకొని బయల్దేరింది.



తరళిక వెంట నేను నడుస్తున్నాను. నా మెడలో పుండరీకుని అక్షమాల వ్రేలాడుతోంది, చెవిలో పుండరీకు డిచ్చిన పారిజాతకుసుమ మంజరి ఉన్నది. ఎఱ్ఱని పద్మరాగ మణులతోనే తయారు చేసినట్టున్న (ఎఱ్ఱని) మేలిముసుగు ధరించాను. నా చెవిలోని పారిజాత కుసుమ పరిమళానికి ఆకర్షింపబడి ఎక్కడెక్కడి తుమ్మెదలు మావెంటబడ్డాయి. మేమిద్దరం ప్రమదావనం వెనుకద్వారం గుండా బయటకు వచ్చి పుండరీకుని వద్దకు బయలుదేరాము.

ఈ విధంగా తరళిక ఒక్కతెమాత్రమే వెంటరాగా ప్రయాణిస్తుంటే నాకనిపించింది." మనస్సుకు నచ్చినవారికోసం బయల్దేరే వానికి ఇతరజనుల సంగతెందుకు?వారే మనుకుంటేనేం? తనవెంట ఎవరూ రాకుంటే మాత్రం ఏమి? విల్లెక్కు పెట్టిన మన్మథుడే వారికి అనుచరుడు. తన కిరణప్రసారం చేస్తున్న చంద్రుడే చేయూతనిచ్చేవాడు. కాళ్ళు జారకుండా కాపాడేది మదిలోని ప్రేమయే. సిగ్గును వెనుక ఉంచి ముందుగా ఇంద్రియాల నుంచుకొని నడుస్తుంది హృదయం. మదిలోని ఉత్కంఠ, వారిని ముందుకు నడిపిస్తుంది." అని నేనామెతో, "ఏమే తరళికా! ఈ దుష్టచంద్రుడు నన్ను బాధిస్తున్నట్టే ఆయనను కూడా బాధిస్తూనే ఉంటాడంటావా?" అని సందేహంతో అడిగాను.

అపుడు తరళిక, "రాజపుత్రీ! నీవెంత అమాయికవు? ఈ దుష్టచంద్రుడు ఇతరుల నేమిటి? తనకుతనే మదనబాధ ననుభవిస్తాడు. నీ చేత ఆ యా కామకలాపాలు చేయిస్తాడు. నీ నున్ననిబుగ్గలపై ప్రతిబింబిస్తూ ముద్దాడుకుంటాడు, తన కిరణాల పేరుతో నీ గుండెలపైకి చేయిచాస్తాడు, మొలిత్రాటిలోని మణులపై ప్రతిబింబిస్తూ మొలనూలు తాకుతాడు. తెల్లని కాలిగోళ్ళపై బడి పాదాభివందనం చేస్తాడు. తామరతూడుల లాంటి తెల్లని కిరణాలు కలిగి ఉంటాడు. ప్రతిబింబం నెపంతో మణికుట్టిమాల మీద పడుతూ ఉంటాడు" అంటూ మాట్లాడుతూండగా నడవసాగాము.

## 38. పుండరీకుని మృతి - కపింజలుని రోదనధ్వని

కొంతదూరం నడిచిన తర్వాత సరస్సమీపానికి చేరుకుంటున్నాము. కాళ్ళకు అంటిన పుప్పొడి చంద్రకాంతమణి స్రావంతో కడగబడుతోంది. పుండరీకుడున్న సరోవరపశ్చిమదిశ నుండి ఎవరిదో పురుషుని రోదనధ్వని స్పష్టాస్పష్టంగా వినవస్తోంది, దానికి తగ్గట్టు నా కుడికన్ను అదిరింది. దాంతో నాగుండె బ్రద్దలైనంతపనైంది. ఏదో కీడు జరిగిందని నాకు సందేహం కలిగింది. తరళికతో, ఓ తరళికా! ఏమిటిదంతా? ఏం జరుగుతోందక్కడ?" అని కంపించే శరీరంతో పలుకుతూ ఆ వైపునకు త్వరగా నడవ సాగాను.

అది రాత్రికావటం చేత ఆ రోదనధ్వని దూరంనుండే స్పష్టంగా వినపడ సాగింది. "చచ్చానురా భగవంతుడా! దగ్ధమైపోయాను. దైవంచే మోసగింపబడ్డాను. ఎంత కష్టం వచ్చిపడింది? అసలు ఏం జరిగింది? సర్వనాశనమైపోయాను, ఓరీ మన్మథపిశాచమా! పాపాత్ముడా! నీ వెంత దయలేనివాడివి! ఎంత దుర్మార్గపు పని చేశావురా! ఓసీ పాపాత్మురాలా! పాపకారిణీ! వినయహీనురాలా! మహాశ్వేతా! నా మిత్రుడు నీ కేమపకారం చేశాడు? ఓరీ పాపిష్ఠా! దుష్టచంద్రుడా! దుశ్చరిత్రుడా! నీ కళ్ళు ఇప్పుడు చల్లబడ్డాయా? నీవనుకొన్నట్లే జరిగిందిగా! జరగాల్సిందంతా జరిగిపోయింది. ఇక నీయిష్టం. ఓ దైవస్వరూపుడా! శ్వేతకేతూ! నీ కెంతటి పుత్రప్రేమ! నీ కెంత నష్టం కలిగిందీ తెలుసుకోలేక పోతున్నావు కదా!

ఓ ధర్మమా! నీ కాధారమే లేక పోయెకదా! ఓ తపమా! నీవు ఆశ్రయహీనమైనావు కదా! హా సరస్వతీ! విధవవైతివి కదమ్మా! అయ్యో! సత్యమా! అనాథవైనావు. ఓ సురలోకమా! నీవు ఒట్టిపోయితివి గదా! మిత్రమా! నన్ను కాపాడవయ్యా! నీవు లేనిదే నే నీ లోకంలో ఉండలేను. ఆగు నీతో నేను కూడా వస్తాను. నేను ఒంటరిగా జీవించలేను. ఎవరో ముక్కూ మొగం తెలియనివాణ్ణి వదిలేసి పోయినట్టుగా అలా వెళ్ళిపోయావేమిటి నన్ను? నీకింత



కాఠిన్యం ఎక్కడిది? నీవు లేకుండా నేనెక్కడికి వెళ్ళాలో చెప్పు. ఎవరిని అడగాలి? ఎవరిని శరణుకోరను? నా జీవితం అంధకారబంధురమై పోయిందే! నా తపస్సు ఎందుకూ పనికిరాలేదు. నీవు లేక పోతే నేనెవరితో తిరగను? ఎవరితో మాట్లాడను? ఎవరితో ముచ్చట్లాడను? నాకోసం ఒక్క సారిలేవవా? నాకు జవాబివ్వవా? నీకు నామీదున్న ప్రేమంతా ఏమైపోయింది? ఇక నాతో నవ్వుతూ ఎవరు మాట్లాడతారయ్యా! మిత్రమా! ఇలా ఇంకా ఏవో దుఃఖ ప్రలాపాలు వినబడసాగినై. ఆ ఏడ్చేది కపింజలుడే నని నిర్ధారించుకొన్నాను.

ఆ రోదనధ్వని విన్న నేను పైప్రాణాలు పైనే పోయినట్టు బిగ్గఱగా ఆక్రందనం చేశాను. వేగంగా నడుస్తుంటే పరిసరంలోని తీగలకు చిక్కుకుని ఉత్తరీయం చిరిగిపోతోంది. ఆ తొందరలో ఎత్తుపల్లాలు కూడా లెక్క చేయకుండా చిందర వందరగా నడుస్తూ, మాటమాటకూ పడబోతూ, ఏదో శక్తి నన్నెత్తుక వెళ్ళినట్లుగా త్వరగా ఆ ప్రదేశం చేరుకొన్నాను. అక్కడ చంద్రకాంతమణి శిలాతలాన కలువపూలు, ఆకులతో కవ్వబడిన శయ్యపై పుండరీకుని శవం కనబడింది. నిశ్చలుడై నా పదాల సవ్వడి వింటున్నట్లున్నాడు. నేను రాలేదని కోపంతో, తగ్గిన మన్మథతాపంకలవాడి లాగా ఉన్నాడు. నేను వచ్చినందుకు తాపశాంతి కలిగి నిశ్చలంగా నిద్రిస్తున్నవానిలా ఉన్నాడు ఆ మునికుమారుడు. తనుచేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం కోసం ప్రాణాయామం చేస్తున్నట్లున్నాడు. నీ వలననే నాకీ దుస్థితి కలిగిందని పెదవులతో చెబుతున్నట్లున్నాడు. అతడు చంద్రునిపై ద్వేషంతో ఉన్నవానిలాగా ఇటు తిరిగి పడుకొన్నాడు. అతని చేతులు గుండెలపై పెట్టుకొన్నాడు. వీపులో దిగిన చంద్రకిరణాలు గుండెలవద్ద పైకి కన్పడినట్లు అతని చేతిగోళ్ళు తెల్లగా మెరుస్తున్నై.

పుండరీకుని ఫాలభాగాన ఎండిన చందనం పూత ఉంది. కొద్దిగా తెరిచి ఉన్న ఆతని కనులు, ఏడ్చి ఏడ్చి కన్నీరు ఆవిరై పోగా కారే రక్తంతో ఎఱ్ఱబడినట్లున్నై. మన్మథ యోగవిద్యాభ్యాసం చేస్తూ ధ్యానంలో ఉన్నవానిలా

ఉన్నాడు. ఏదో కొత్తరకం ప్రాణాయామాన్ని అభ్యసిస్తునట్లుగా ఉన్నాడు. సన్నని మెత్తని కలువకాడలే యజ్ఞోపవీతంగా ఉన్న నా ముత్యాలహారాన్నే జపమాలగా ధరించాడు. కర్పూరపు పొడి రాచుకొని, భస్మం రాచుకొన్న వానిలాగా ఉన్నాడు. మన్మథవేషధారియై నన్ను కలవటానికేదో మంత్రజపం చేస్తున్నాడు. అలా ఉన్న పుండరీకుణ్ణి చూడవలసి రావటం నేను ఏనాడో చేసిన పాపం. నేను చేసిన దౌర్భాగ్యం.

ఆ పరిస్థితిలో నాకంతా అగమ్యగోచరమై పోయింది. ఎక్కడికో పాతాళలోకంలోకి జారి పోతున్నట్టు అనిపించింది. నేనెక్కడికి వెళ్ళానో, ఏంచేశానో, ఏమి మాట్లాడానో, ఇవేమీ నాకు తెలియలేదు. నా ప్రాణాలు నా దేహాన్ని వదిలి ఎందుకు పోలేదో అర్థం కాలేదు. ఏదో మైకంలాంటిది నన్ను ఆక్రమించింది. నేను స్పృహ కలిగి లేచేసరికి నేలపై పడి ఉన్నట్టు గమనించాను. వెంటనే లేచి, "అయ్యో! ఏం జరుగుతోందిక్కడ? అని అరచాను. తల్లి, తండ్రి, చెలులు గుర్తుకువచ్చి గట్టిగా ఏడ్చాను. "ఓ ప్రాణనాథా! పలకవేమయ్యా! ఒంటరిదాన్ని, దిక్కులేని దాన్ని నన్నొదిలి ఎక్కడికి వెళ్ళావయ్యా? నీకోసం నేనెంత నరకయాతన అనుభవించానో ఈ తరళిక నడుగు చెపుతుంది. ఈ ఒక్కరోజు నాకు వేయి యుగాలుగా అనిపించింది. నా మీద దయయుంచి, ఒక్కసారి నాతో మాట్లాడవా? నా వైపు ఒక్కసారి చూడవా? నా ముచ్చట తీర్చు, నేను ఆర్తురాలను, నీకు భక్తురాలను. నేను అనాథను. బాలను. బేలను, పుట్టెడు దుఃఖంలో ఉన్నాను. నీవు తప్ప నాకెవ్వరు తోడు లేరు. నీవు నాపై ఏల దయ చూపించవు? నేను ఏంతప్పు చేశాను? నీవు చెప్పింది ఏమి చెయ్యలేదు? నన్ను వదిలిపెట్టి నిష్కారణంగా ఇలా వెళ్ళవలసినంత కోపం ఎందుకు కలిగింది? నువ్వు మరణించినా నేనింకా బతికే ఉన్నానే! నేనెంతో దుర్మార్గురాలను. నా వల్లనే నీకిటువంటి దురవస్థ ప్రాప్తించింది. నాలాంటి క్రూర హృదయురాలు ఎక్కడా ఉండదు. అటువంటి పరిస్థితిలో ఉన్న నిన్ను వదిలిపెట్టి నేను యింటికి వెళ్ళాను. ఇక నాకు ఇంటితో



పనేమిటి? నాకు ఇక తల్లిదండ్రులు కూడా అక్కరలేదు పరివారం, బంధుజనులు ఎందుకు? నేనిపుడెవరి శరణుపొందాలి? నాపై దయచూపమని నిన్ను వేడుకొంటున్నాను. ఓ భగవతులారా! దయచూపండి. నా పుండరీకునకు ప్రాణదానం చెయ్యండి, ఓ భూమాతా! నన్ను రక్షింపవా? అని ఇలా ఎన్నో ప్రార్థనలు చేస్తూ దయ్యంపట్టిన దానిలాగా, పిచ్చిదానిలాగా చాలాసేపు దుఃఖించాను.

ఇలా నేను బహువిధాల విలపిస్తూ ఆతని నుదురు, భుజాలు, హృదయం నాచేతులతో తడిమిచూస్తూ, "పుండరీకా! నీవెంత నిర్దయుడవు? నేనింత దుఃఖపడుతుంటే నావైపు కన్నెత్తి చూడవేమి?" అని అతనిపై నేరము మోపుతూ మాటిమాటికి అతనిని అనునయించాను. మరలమరల అతని నిముద్దు పెట్టుకొన్నాను. మళ్ళీ మళ్ళీ కంఠాన్ని కౌగిలించుకొని ఆక్రోశించాను. ఓ ధూర్తురాలా! నేను ఇక్కడికి వచ్చేంత వఱకైన ఇతని ప్రాణాలు కాపాడలేక పోయావేమి? అని స్ఫటికాక్షమాలను నిందించాను. "ఓ మహాత్మా! దయతో ఇతనిని బ్రతికింపుమని కపింజలుని పాదాలపై బడి ప్రార్థించాను. మాటిమాటికి తరళికను కౌగిలించుకొని రోదించాను.

ఆ సమయంలో అలాంటి మాటలు నా నోటి వెంట ఎలా వచ్చాయో ఇప్పటికీ ఎంత ఆలోచించిన తెలియటం లేదు. అవి నాకెవ్వరూ నేర్పలేదు. ఆ సన్నివేశమే వేరైనది. ఇప్పుడు తలచుకొన్నా నాకు మరల కొత్తగానే అనిపిస్తున్నది.

అని మహాశ్వేత చంద్రాపీడునకు తన వృత్తాంతాన్ని చెప్పుతూ ఉండగా ఆమె ఆ దుఃఖాన్ని ఇప్పుడనుభవిస్తున్న అనుభూతితో స్పృహ తప్పి పడిపోయింది. అలా మూర్ఛతో శిలపై పడిపోతున్న మహాశ్వేతను చేతులు చాపి చంద్రాపీడుడు పట్టుకొని ఆపాడు. తానే ఆమెకు సేవకుడై ఆమెను కాపాడి కన్నీటితో తడిసిన ఆమె పైటచెంగుతోనే నెమ్మదిగా వీచి, ఆమెకు

స్పృహ కలిగించాడు. కన్నీటి చారికలతో నిండిన ఆమె బుగ్గలను నీళ్ళతో తుడిచి ఆమెను మేలు కొలిపాడు. అపుడు చంద్రాపీడుడు ఆమెతో, “పూజ్యురాలా! నేను వచ్చి మీరు మఱచిపోయిన దుఃఖాన్ని మరల క్రొత్తగా గుర్తు చేశాను. ఈ మీస్థితికి నేనే కారణం. మీకథ చెప్పినంతవఱకు చాలు, ఇక చెప్పవద్దు, ఇక ఆపివేయండి. మీరు చెప్పినా నాకు వినేంత సమర్థత లేదు. జరిగిపోయిన దుఃఖవృత్తాంతాలు చెప్పినప్పుడల్లా నిత్యనూతనంగా వేదనను కలిగిస్తై. ఇక మీరావిషయాలన్నీ చెప్పి ఎలాగో నిలబెట్టుకొన్న ప్రాణాలను మళ్ళీ శోకాగ్నికి ఆహుతి చేయకండి” అని బాధాతప్తుడై అన్నాడు. దీర్ఘమైన నిట్టూర్పులు వదలుతూ కండ్లలో నీరు తిరుగుతుండగా మహాశ్వేత అతనితో ఇలా అన్నది.

“రాజకుమారా! ఆ రోజు రాత్రి జరిగిన సంఘటనాస్థలంలోనే నా నీచ ప్రాణాలు పోలేదంటే, ఇక ఇప్పుడు పోతాయనుకోవటం అసంభవం. పరమపాపాత్మురాలనైన నన్ను సాక్షాత్ యమధర్మరాజుకూడా చూడటానికి ఒప్పుకోడు. నాగుండె బండఱాయి. ఇక దీనికి దుఃఖమెక్కడిది? సిగ్గు విడచిన వారిలో నేనే ప్రథమురాల నౌతాను. ప్రత్యక్షంగా చూస్తూ వజ్రపుగుండె కలిగిన నాకు, ఇప్పుడు చెప్పినంత మాత్రాన ఏ మౌతుంది? పుండరీకుని మరణ సమయంలో అనుభవించిన ఖేదం కంటె అధికఖేదం ఇంకెక్క డుంటుంది? నేనింత వఱకు ప్రాణాలతో నిలవటానికి కారణమైన వృత్తాంతాన్ని నీకు చెపుతాను. ఏ దురాశ అనే ఎండమావికి నేను పట్టుబడి ఈ నూతన జీవితాన్ని అవలంబించానో నీకు తెలియజెపుతాను విను.

ఆ పరిస్థితుల్లో నేను కూడా మరణించాలని నిశ్చయించుకొని మిక్కిలిగా దుఃఖించి తరళికతో, “ఓసీ కఠినహృదయురాలా! ఇక లేవే! ఇంకా ఎంత సేపేదుస్తావ్? కట్టెల్ని పోగుచెయ్యి చితిని పేర్చు. నేను కూడా నా ప్రాణనాథుణ్ణి అనుసరిస్తాను అనిపలికాను.



## 39. చంద్రుడు పుండరీకుని తన లోకమునకు తీసికొని పోవుట

అంతలో హఠాత్తుగా చంద్రమండలం నుండి బయలుదేరి ఆకాశం నుంచి ఒక మహాప్రమాణం కల దివ్యపురుషుడు భూమి మీదికి దిగాడు. అతని భుజకీర్తులకు లగ్నమైన తెల్లని పాలనురుగులా ఉన్న, ఉత్తరీయాన్ని సరిచేసుకొంటున్నాడు. అది గాలికి రెపరెపలాడుతోంది. రెండు చెవులకు వ్రేలాడుతున్న కుండలాలలోని మణికాంతులకు అతని చెంపలు ఎఱ్ఱగా ప్రకాశిస్తున్నై. లావైన ముత్యాలతో కూర్చిన మాల నక్షత్రమాలలాగా అతని గుండెలపై వ్రేలాడుతోంది. శిరస్సుపై పట్టు ఉత్తరీయముతో కట్టిన తలపాగా ఉన్నది. నల్లని తుమ్మెదల వంటి ముంగురులు చిందరవందరగా వ్రేలుతున్నై, చెవిలో కలువ తురుమబడింది. ఆయన భుజములపై కామినీ స్త్రీల కుచకుంకుమ పత్రరేఖలు కనబడుతున్నై. తెల్లతామరలవంటి దేహకాంతి కలవాడు. బాగా పొడగరి, మహాపురుష లక్షణాలన్నీ కలిగినవాడు. అతడు దివ్యపురుషుడు. అతని బాహువులు ఐరావతతుండం లాగా బలమైనవి, పొడవైనవి. చల్లని స్పర్శ కలవాడు. ఆయన వస్తూనే తన బలమైన చేతులతో పుండరీకుని దేహాన్ని పైకెత్తి పట్టుకొని, భేరీనినాదంతో సమమైన కంఠధ్వనితో,” ఓ అమ్మాయీ! మహాశ్వేతా! నీవు మరణింప వద్దు. నీకు కొంత కాలానికి ఇతనితో కలయిక జరుగుతుంది” అని పలికాడు. ఆ సమయంలో అతడు నాకు తండ్రిలాగా అనిపించాడు. అలా అంటూనే రివ్వున ఆకాశంలోకి ఎగిరిపోయాడు.

నేనా సంఘటనతో భయం, విస్మయాలు పొందాను. ఈ వింత ఘటన నాలో ఉత్సుకత రేపింది కూడా. కపింజలుణ్ణి ‘ఏమిటి ఇది’ అని అడిగాను. అతడు నా ప్రశ్నకు ఏమీ సమాధానం ఇవ్వలేదు. చటుక్కున లేచాడు. “ఓరి దుర్మార్గుడా! నా ప్రాణమిత్రుని తీసుకొని ఎక్కడకు పోతున్నావు? ఆగు” అంటూ కోపంతో తనపై ఉత్తరీయాన్ని నడుముకు బిగించుకొని రివ్వున ఆకాశానికి

లేచాడు. ముందు వెళ్ళిన మహాపురుషుని అనుసరించి వెళ్ళిపోయాడు. చూస్తూ ఉండగానే వారంతా నక్షత్రమండలంలోకి ప్రవేశించారు. దీంతో నాకిష్టమైన పుండరీకునితో పాటు కపింజలుడు కూడా దూరమై పోయినందుకు నాహృదయం ముక్కలైపోయింది. నాకేం చెయ్యాలో తోచక తరళికతో, ఏమే నీకేమైనా తెలిసిందా? ఏం జరిగిందిప్పుడు? చెప్పు" అని అడిగాను. ఈ హఠాత్సంఘటనకు తరళిక బెంబేలెత్తి పోయింది. దుఃఖంతోనూ, భయంతోనూ గడగడ వణికిపోయింది. అసలు ఆమెకు నేను మరణిస్తానేమోనని భయం కలిగింది. అది అమాయకురాలు. బరువైన గుండెతో జాలిపడుతూ, "రాజపుత్రీ! నాకసలేమీ అర్థం కావటమే లేదు. అయితే ఇది మిక్కిలి ఆశ్చర్యకరమైన సంఘటన. వచ్చినవాడు మామూలు మనిషికాడు. అతడు వెడుతూ వెడుతూ ఒక తండ్రి కూతురుకు చెప్పినట్లుగా దయతో ఓదార్చాడు. ధైర్యం చెప్పాడు. సామాన్యంగా ఇటువంటి దివ్యపురుషులు కలలలో కనపడి యథార్థాలు చెపుతూ ఉంటారు. ఇక మనకంటి ముందే జరిగిందంటే చెప్పేదేముంది? అయినా అటువంటివానికి అబద్ధాలు చెప్పవలసిన పనేముంటుంది? కాబట్టి ఇక నీవు ఆత్మార్పణ ప్రయత్నం మానుకోవటం మంచిది. ఇటువంటి క్లిష్టపరిస్థితుల్లో ఉన్న మనం నమ్మక చేసేదేముంది. అయినా కపింజలుడు ఆయన వెంటే వెళ్ళాడు కదా! కనుక అతడెవరో, ఎక్కడ నుంచి వచ్చాడో, ఎందుకు వచ్చాడో చనిపోయిన పుండరీకుని అతనెందుకు తీసుకొనివెళ్ళాడో, ఎక్కడకు తీసుకొని వెళ్ళాడో, ఏకారణం చేత మరల మీరు కలుస్తారని ఆ వింతవ్యక్తి మిమ్మల్ని ఓదార్చాడో అన్నీ తెలుస్తాయి. ఆ తర్వాతే బ్రతకాలో, చావాలో నిర్ణయించుకొందువు గాని' అని నాకు ధైర్యం కలిగేలా మాట్లాడింది. "నిజమే చావటం సులువే. ఎప్పటికైనా చావక తప్పదు. బ్రతికున్న కపింజలుడు మిమ్మ చూడకుండా ఎటో వెళ్ళిపోడు గదా ! తప్పక ఇక్కడకు వస్తాడు. కనుక అతడు వచ్చేంత వఱకు నీవు ప్రాణాలు ధరించి ఉందాలి" అని ప్రార్థించింది. నాపాదాల పడి మరీ మరీ బతిమాలింది.



నేను కూడా లోక సహజమైన జీవితాశవల్ల, స్త్రీసహజ దుర్బలత్వం చేతను, తరళిక అంతగా ప్రార్థించటం చేతను, కపింజలుడు తిరిగి వస్తాడనే ఆశతోనూ, నాకు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో అలా చెయ్యటమే ఉత్తమమని తలచి జీవితం ముగించాలనే ఆలోచన మానివేశాను. 'ఆశ' అనేది మనిషిచేత ఏమైనా చేయిస్తుంది. నేను చేసేదేమీ లేక తరళికతో పాటు ఆ సరస్తీరంలోనే ఆ రాత్రిని ఎలాగో గడిపాను. ఆ రాత్రి నా పాలిట కాళరాత్రి. ఆ ఒక్క రాత్రి నాకు వేలసంవత్సరాల కాలంగా అనిపించింది. ఆ రాత్రంతా దుఃఖిస్తూ నరకయాతనను అనుభవించాను. కంటిపై కునుకు పట్టనే లేదు. కన్నీటి చారికలతో, దుమ్ముతో నా ముఖం నిండిపోయింది. నా జుట్టంతా విడిపోయి చిందరవందరైపోయింది. కఠోరంగా ఎలుగెత్తి ఏడ్చి ఏడ్చి నా గొంతు పూడుకుపోయింది. ఆ రాత్రి అలా గడిచిపోయింది.

## 40. మహాశ్వేత తపోదీక్ష పూనుట

ఇంతలో తెల్లవారింది. అలాగే నెమ్మదిగా లేచాను ఆ సరస్సులో స్నానం చేసి, స్థిర నిశ్చయంతో నేను కూడా నా ప్రియుని మార్గాన్నే అనుసరించదలచాను. అతని కమండలం చేతపట్టాను. ఆయన నారబట్టలు, అదే అక్షమాలను ధరించాను. సంసారమంతా నిస్సారమే అని సత్యం గ్రహించాను. నా దురదృష్టం నేను గ్రహించాను. వచ్చే కష్టాలను తట్టుకోవటం మనచేతకాదని తెలుసుకొన్నాను. పుట్టిన వారికి గిట్టక తప్పదని గుర్తించాను. సుఖాలు ఎల్లకాలం నిలిచేవి కావనే సత్యం తెలుసుకొన్నాను. నేనిక తల్లిదండ్రుల్ని, పరిచారికల్ని బంధుమిత్రాదులను లెక్కింపదలపలేదు. మనస్సును సుఖభోగాల నుండి మళ్ళించాను. ఇంద్రియాల్ని నియంత్రించాను. బ్రహ్మచర్య వ్రతం అవలంబించాను. త్రైలోక్యనాథుడు, అనాథరక్షకుడైన ఈ స్థాణువు (ఈశ్వరుణ్ణి) శరణుపొందాను.

ఈ విషయం ఆనాడు ఉదయానికల్లా మా వారికి తెలిసింది. అమ్మ, నాన్న, బంధువర్గం అంతా కట్ట కట్టుకొని నావద్దకు వచ్చారు. నా చుట్టూచేరి

నానా గోలగా ఏడిచారు, బ్రతిమలాడారు. ఎన్నో యుక్తియుక్తమైన మాటలతో నన్ను బుజ్జగించాలని ప్రయత్నించారు. ఎన్నో ఉపదేశాలు చేశారు. అనేకరకాల ఓదార్చారు. ఎలాగైనా సరే నన్ను ఇంటికి తీసుకొని పోవాలని ప్రయత్నించారు. చివరికి వాళ్ళకి అర్థమైంది నేనెంత ప్రయత్నించినా నా నిశ్చయం మార్చుకోనని. ఇక విఫలప్రయత్నం చేసి చేసేది లేక, నిరాశ చేసుకొన్నారు. అయితే పుత్రికాప్రేమను అంత తేలికగా తెంచుకోలేక, ఇంటికి వెళ్ళలేక, వీలైనప్పుడల్లా మరల మరల బతిమాలుతూ, నా చేత తిరస్కరింపబడుతూ, అలాగే కొన్ని రోజులు అక్కడనే ఉన్నారు. నా స్థితిని చూసి వారి గుండెలు తరుగుకొనిపోయాయి. గుండెలు మండిపోయాయి. చివరికి ఏడ్చుకుంటూ ఇళ్ళకు వెళ్ళిపోయారు. వారంతా వెళ్ళిపోయిన తరువాత నాకెంతో బాధనిపించింది. అయ్యో! నా వాళ్ళు నాకోసం ఎంత పరితపించారో కదా! అని జాలి కలిగింది. వారిపై కృతజ్ఞతాభావం కలిగింది. నాకంటి వెంట అశ్రుధారలు జాలువారినై.

నేనప్పటినుండి పుండరీకుని పైనగల ప్రేమతో, దిగులుతో కృశించిన శరీరంతో కాలం గడపబూనుకున్నాను. ఈ శరీరాన్ని అనేక నియమాలతో కృశింపజేస్తూ, వన్య ఫలాలతో, కందమూలాలతో, సరోవరజలంతో ఆహారం గడుపుకుంటూ, జపం వంకతో ప్రియుని గుణగణాల్ని తలుచుకొంటూ, ముప్పూటలా అచ్ఛోదసరోవర పుణ్యజలాల్లో స్నానమాడి, నిత్యం పరమేశ్వరుణ్ణి ఆరాధిస్తూ, ఈ గుహలోనే తరళికతోడుగా, మహాదుఃఖం అనుభవిస్తూ కాలం గడుపుతున్నాను. చివఱికి నా గుఱించి నేను తెలుసుకున్నాను. నా జీవితంలో గొప్పదనం ఏమీ లేదని గుర్తించాను. నేను పాపిని. సిగ్గులేనిదాన్ని క్రూరురాల్ని. నింద్యురాల్ని. వ్యర్థంగా జన్మించాను. నా జీవితం వ్యర్థం. నిరాధారను. అసలు నా ముఖం చూసినా, నాతో మాట్లాడినా బ్రహ్మహత్యామహాపాతకం చుట్టుకొంటుంది. అట్టి నావల్ల ఏం లాభం?” అంటూ తెల్లని వస్త్రపు అంచుతో ముఖాన్ని కప్పుకొని దుఃఖాన్ని ఆపుకోలేక బిగ్గఱగా దుఃఖించింది మహాశ్వేత.



చంద్రాపీడునికి ప్రప్రథమంగా ఆమెను చూసినప్పటినుంచీ ఆమెపై గౌరవభావం కలిగింది. ఆమె రూపం, యౌవనం, వినయం, దాక్షిణ్యం, మధురసంభాషణం, తపశ్చరణం, ప్రశాంతత్వం, వీటినన్నింటిని ఆమెలో సుగుణాలను గ్రహించాడు, గుర్తించాడు. ఆమెపై అతనికి ప్రత్యేకాభిమానం ఏర్పడింది. అందులో ఇప్పుడు ఆమె వృత్తాంతాన్ని మనస్సు విప్పి చెప్పింది. అందుచేత ఆమె పైన కృతజ్ఞతాభావం కలిగింది. ఆమెపై ప్రీతి ఏర్పడింది. చంద్రాపీడుని హృదయం కరుణార్ద్రమైంది. అతడు నెమ్మది నెమ్మదిగా ఆమెతో ఇలా అన్నాడు. “పూజ్యురాలా! లోకంలో కష్టాల్ని సహింపలేనివారు, భోగలాలసులు, స్నేహానికి తగ్గ కార్యం నిర్వహింప శక్తిలేనివాళ్ళు, ప్రయోజనంలేని కన్నీరు కార్చటంచేత వారిపై ఏదో ప్రేమ ఉన్నట్టు నటిస్తూ ఒట్టి ఏడుపులు ఏడుస్తారు. వారు కపటబుద్ధులు. అమ్మా మీరట్టి వారు కాదు. ఎందుకంటే నీ ప్రియుని మీద మీకున్న ప్రేమను కేవలం మాటలతోనే కాక చేతలలో కూడా నిరూపించి చూపించారు. అందువల్లే నిజంగా దుఃఖిస్తున్నారు. మీది నిష్కల్మషమైన ప్రేమ. పుట్టింది మొదలుకొని ఇప్పటివఱకు మీపై ప్రేమానురాగాలు కురిపించిన బంధువర్గాన్ని కూడా దూరంగా విడిచివేశారు. సుఖభోగాలను గడ్డిపరకల చందాన తృణీకరించారు. ఇంద్రలోక సుఖాలను, ఐశ్వర్యలాలసతను త్యజించారు. ఈ వయస్సుకు ఎంతమాత్రం తగనట్టి తపోనియమాలతో తామరకాడవలె కృశత్వాన్ని పొందారు. బ్రహ్మచర్య కఠోర దీక్షను చేపట్టారు. మనస్సును తపస్సమాధిపై లగ్నం చేశారు. స్త్రీజనానికి ఎంతమాత్రం కుదరని క్లిష్టమైన వనవాసనియమాన్ని స్వీకరించారు.

లోకులు ఏ కొంచెం కష్టం కలిగినా తొందరపడి ప్రాణాలు తీసుకొంటారు. సహమరణం అనేది ఒట్టి ప్రయోజనం లేని పని, ప్రాణాలు బలవంతంగా తీసుకోవటం పామరుల పని, అజ్ఞానుల పద్ధతి, ప్రమాదకరమైనది కూడా. మూర్ఖకృత్యం. తమకిష్టులైన తండ్రి, సోదరుడు, స్నేహితుడు, లేదా భర్త మరణించినంత మాత్రాన తమ ప్రాణాలు త్యజింప బూనటం సరియైనది

కాదు. ఒకడు ఆత్మహత్య చేసికొన్నాడన్నచో దానికి హేతువు విరహదుఃఖాన్ని భరింపలేక పోవటమే. ఆ ప్రాణపరిత్యాగంవలన మరణించిన వానికెట్టి లాభమూ కలుగదు. అందువల్ల మరణించినవాడు పునరుజ్జీవితుడౌతాడా? కాదు. అది పుణ్య సంపాదన కొఱకా? ఆ మరణంవల్ల పుణ్యలోకా లేమన్నా ప్రాప్తిస్తాయా? అదీ లేదు. నరకానికి పోకుండా నివారించటానికా? అలా చేయటం చేత మృతుడు కంటికి కనపడతాడా? వారిద్దరూ కలుసుకొనే అవకాశం ఉంటుందా? ఉండదు. సహమరణం వల్ల పాపం పొందుతాడే కాని లాభమేమీ కలగదు. పోయినవాడితో పాటు తానూ మరణించక జీవించి ఉన్నట్లైతే మృతునకు తిలాంజలులన్నా సమర్పించే అవకాశం ఉంది. దానివల్ల తనకు మేలు కలుగుతుంది. మరణించటం వల్ల రెండువిధాలా నష్టమే కలుగుతుంది.

ఒక విషయం చూడండి! సకల స్త్రీజనహృదయాలు దోచుకోగలిగిన మన్మథుడు హరుని తృతీయనేత్రాగ్నికి కాలి మసైపోతే పతివ్రత రతీదేవి తన భర్త ననుగమించిందా? తిరిగి బ్రతికించుకోగలిగింది. వృష్ణికులప్రసూత కుంతి, శూరసేనుని పుత్రి, సకలరాజులను జయించి వారి శిరములపైనున్న కిరీట మణికాంతులతో, పుష్పమాలికలతో శోభించే పాదములుకల భర్త పాండురాజు మరణిస్తే తానూ మరణించలేదు కదా! విరాటుని పుత్రిక ఉత్తరాకుమారి తన భర్త అభిమన్యుడు యుద్ధంలో మృతుడైతే తనూ పోయిందా? బ్రతికి యుండలేదా? ధృతరాష్ట్రుని పుత్రిక దుశ్శల వందమంది అన్నలచేత ముద్దాడబడింది, శివుని వరప్రసాద గర్వితుడై యుద్ధంలో అర్జునుని చేతిలో మృతిచెందిన భర్త జయద్రథునితోపాటు తానూ మరణించిందా? అంతేకాదు సుర, అసురాదికులాల్లో చాలా మంది ఇలాంటి వారే కనబడతారు. అమ్మా! మీకైతే ముందుగానే దేవతావాణి వినిపింపజేసింది గదా! కంటి ఎదుట కనిపించినపుడు సందేహం ఎందుకు కలుగుతుంది? చనిపోయినవారితో జీవించినవారికి సమాగమం ఎలా కలుగుతుంది? అని అనుమానం



మనస్సులో కలుగరాదు. అలా పుండరీకుని ఎత్తుకొని పైకి ఎగిరి వెళ్ళిపోయినవాడు దేవతాపురుషుడు కనుక అతనిని తిరిగి జీవింప జెయ్యటానికే తీసుకొనిపోయాడని మనం నమ్మాలి. మహాత్ముల ప్రభావం మన ఆలోచనల కందనిది. దైవం మిక్కిలి చిత్రమైనది. తపఃప్రభావం చేత అనేకవింతలు జరుగవచ్చు. మనం బాగా నిశితంగా ఆలోచించినట్లైతే అతని నెత్తుకుని తీసుకువెళ్ళటం బ్రతికించటానికి కాకపోతే మరిదేనికి?

ఓ మహాత్మురాలా! ఇది అసంభవం అని భావించకండి! ఇలా చాలా కాలంబట్టీ జరుగుతూనే ఉంది. ఎలాగంటే, వినండి, “పురాణకాలంలో ప్రమద్వర పాముకాటుతో మరణిస్తే రురువనే మునికుమారుడు తన ఆయుర్దాయంలో సగం ఇచ్చి బ్రతికించాడు. అశ్వమేధయాగ హయరక్షకుడు అర్జునుడు తన కుమారుడైన బభ్రు వాహనునిచే బాణహతుడుకాగా, అతని తల్లి ఉలూచి అనే నాగకన్య భర్తయైన అర్జునుని తిరిగి జీవింపజేసింది. అభిమన్యుని కుమారుడు పరీక్షిత్తు ఉత్తరాగర్భ మందుండగానే అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రాగ్నికి ఉడికిపోయి మరణించి పుట్టగా ఆ శిశువును కృష్ణుడు దయతో తిరిగి బ్రతికింపలేదా? అదే శ్రీకృష్ణుడు తన గురువగు సాందీపనిపుత్రుడు ఏనాడో మరణింపగా, యమలోకంనుండి అతనిని బ్రతికించి తెచ్చి గురుదక్షిణగా యిచ్చాడు గదా! అలాగే మీ విషయంలో కూడా జరుగవచ్చు. అయినా మనచేతిలో ఏమున్నది? అన్నీ విధిచేతిలోనే ఉన్నాయి. మనకై మనం ఊపిరి కూడా పీల్చలేము. దైవలీలలు బహుచిత్ర విచిత్రాలుగా ఉంటై. మనకెటువంటి పరిస్థితి ఏర్పడినా గుండెబలంతో ఎదిరించి నిలవాలి. ధైర్యవంతులే ఆపదలను దాటి సుఖింపగలరు. “అంటూ ఇలా ఎన్నో ఎన్నో ఉదాహరణలు ఎత్తి చూపుతూ ఓదార్చాడు. ఆమె వద్దన్నా వినకుండా నెలయేటినీటిని తెచ్చి, కన్నీటి చారికలు కట్టిన ఆ స్త్రీ ముఖాన్ని మృదువుగా తుడిచాడు చంద్రాపీడుడు. ఇంతలోగా సూర్యుడు పశ్చిమదిక్కున అస్తమించసాగాడు.

అస్తమించే సూర్యుడు మహాశ్వేతావృత్తాంతం విని దుఃఖపరవశుడై అన్ని పనులూ మాని అధోముఖుడైనట్లుగా కనపడుతున్నాడు. క్రమంగా ఎఱ్ఱదనంపోయి చీకట్లవల్ల నల్లదనం వ్యాపిస్తోంది. పక్షులు నిద్రల కుపక్రమించినై.

ఆ సంధ్యాసమయాన మహాశ్వేత నెమ్మదిగాలేచి, కమండలు జలంతో పాదాలు కడుగుకొని, పశ్చిమ సంధ్యకు నమస్కరించి, మరల వల్కల శయనం మీద నిట్టూరుస్తూ కూర్చున్నది. చంద్రాపీడుడు కూడా లేచి కాళ్ళు చేతులు కడుగుకొని సంధ్యోపాసన చేసి రెండవ శిలాతలంపై మెత్తని ఆకులతో ప్రక్క పఱచుకొని కూర్చున్నాడు. అతని మనస్సులో మహాశ్వేతావృత్తాంతమే మెదల సాగింది. మన్మథుడెంతో గొప్పవాడని, దుర్మార్గుడని, అమితవేగవంతుడని, అతని దృష్టి ఎవరిమీద ప్రసరిస్తుందో వాడెంత ధీరుడైనా ధైర్యహీనుడై చివరికి మరణింపవలసిందే. మన్మథునకు నా నమస్కారాలు" అని మనసులో అనుకొన్నాడు.

## 41. కాదంబరిని గూర్చి చంద్రాపీడునకు చెప్పట

చంద్రాపీడుడు మహాశ్వేతను "పూజ్యురాలా! మీ అరణ్యావాస సమయంలో దుఃఖంలో పాలుపంచుకొన్నదని మీరు చెబుతున్న తరళిక అనే పరిచారిక ఇప్పుడు కనబడటం లేదు ఆమె ఎక్కడకు వెళ్ళింది"? అని ప్రశ్నించాడు. అప్పుడామె, "పూజ్యుడా! నేను నాకుల వృత్తాంతం చెప్పేటప్పుడు అమృతం నుంచి జనించిన అప్సరసలకులంలో మహాసుందరి 'మదిర' అను గంధర్వస్త్రీకిని, సకలగంధర్వచక్రవర్తి చిత్రరథునికిని వివాహమైనది చెప్పాను కదా! వారిరువురి సంతానమే కాదంబరి. ఆమెకు నాకు పుట్టిన దగ్గఱనుంచి గాఢస్నేహం ఉన్నది. చిన్నప్పట్నించి మాకు ఒకే కంచం, ఒకే మంచం. మా శరీరాలే వేరుగాని ప్రాణం ఒకటే. మిక్కిలి విశ్వసనీయురాలు. మేమిద్దఱం ఒకచోట గీత, నృత్య, కళలు అభ్యసించాము. ఆటపాటలలో కూడా కలిసిమెలిసి ఉన్నాం. మాకు బాల్యం చాలా హాయిగా గడిచి పోయింది. అటువంటి



కాదంబరి నా దురదృష్టచరిత్ర విని కటకట పడి, "నా మిత్రురాలు మహాశ్వేత దుఃఖితురాలైనంత కాలం నేను ఎట్టి పరిస్థితులలోనూ వివాహమాడను" అని కఠోరశపథం చేసింది. అంతేకాదు చెలికత్తెల సమక్షంలో శపథపూర్వకంగా", ఒకవేళ నా కిష్టంలేకపోయినా బలవంతంగా నాతండ్రి ఎప్పుడైనా ఎవరికైనా ఇచ్చి వివాహం చెయ్యాలని ప్రయత్నిస్తే మాత్రం నేను నిరాహారిగానో, అగ్నిచేతనో, త్రాడుతోనో, విషంతోనో ప్రాణాలు తీసుకొంటాను" అని దృఢంగా పలికింది. ఆ మాటలు లేదా శపథవాక్యాలు ఆనోట ఆనోట విన్న గంధర్వరాజు చిత్రరథుడు మిన్నకున్నాడు. ఇలా ఎంతకాలం? కొంతకాలానికి కాదంబరి నిండు యౌవనంతో ఎదుట తిరుగుతుంటే ఆయన ఓర్పుపట్టలేక పోయాడు. అలాగని ఆమెను ఒత్తిడి చేయలేకపోయాడు. లేక లేక పుట్టిన ఒక్కతే కూతురు. ఆమె అంటే అందరికీ పంచప్రాణాలు. అందుకే ఆమె నేమీ అనలేదు. వేఱొక ఉపాయమూ ఆయనకు తోచలేదు. చిత్రరథుడు ఆలోచనలో పడ్డాడు.

చివఱకు భార్యతో ఆలోచించి 'క్షీరోదుడు' అనే పేరుగల కంచుకి (అంతః పుర రక్షకుడు) ని పిలచి అతని ద్వారా నా వద్దకు సందేశం పంపాడు. "అమ్మా! మహాశ్వేతా! నీ వృత్తాంతం విని అసలే మాగుండెలు మండిపోతుంటే, పులిమీద పుట్టలాగా ఇప్పుడీ కాదంబరికి చెందిన విషయం మఱొక దుఃఖాన్ని కలిగిస్తున్నది. ఇప్పుడీ కాదంబరిని ఒప్పించాలంటే నీవు తప్ప వేరే దిక్కులేదు" అని నాకీ ఉదయాన్నే సందేశం పంపాడు. నేను కూడా పెద్దల యందున్న గౌరవంతోనూ, కాదంబరిమీదున్న స్నేహప్రీతితోనూ, వచ్చిన క్షీరోదునితో పాటు నా చెలిని తరళికను సందేశంతో పంపాను. "సఖీ కాదంబరీ! అసలే దుఃఖితులైన పెద్దవాళ్ళను నీవింకా దుఃఖపెట్టటం దేనికి? ఇదిగో, నేను బ్రతికుండాలని నీవనుకొంటే మీ పెద్దలు చెప్పినట్టు నడుచుకో!" అని ఆ సందేశంతో వారినిలా పంపిన కాసేపటికే పూజ్యులైన మీరిచ్చటికి వచ్చారు" అని పల్కి ఊరుకుంది.

ఇంతలో నక్షత్రేశుడు ఆకాశంలోకి పూర్ణకళావిలాసంతో ప్రకాశింపసాగాడు. తెల్లని వెన్నెల దశదిశలవ్యాపించింది. చంద్రకాంతుల వల్ల నక్షత్రకాంతులు వెలవెల పోయాయి. కైలాస పర్వత చంద్రకాంతమణుల నుండి జలప్రవాహాలు స్రవిస్తున్నై. వెన్నెలలో విద్యాధర అభిసారికా జనులు ప్రియులకోసం ఆకాశంలో తిరుగుతున్నారు. ఆ చల్లని వెన్నెలలో మహాశ్వేత క్రమంగా నిద్రించింది. చంద్రాపీడుడు కూడా నిద్రకు ఉపక్రమించాడు. "ఈ సమయంలో నేను లేకుండా వైశంపాయనుడు ఏంచేస్తూ ఉంటాడు? అమాయిక పత్రలేఖ ఏం చేస్తోందో! నా స్నేహితులు రాజకుమారులెలా ఉన్నారో" అనుకుంటూనే అతడుకూడా నిద్రలోకి జారుకున్నాడు.

## 42. హేమకూటం నుండి తరళిక వచ్చుట

క్రమంగా తెల్లవారింది. మహాశ్వేత ప్రాతః సంధ్యా కృత్యాలు పూర్తిచేసుకొని శిలాతలంపై కూర్చుని పాపోపశమన మంత్రాలు జపిస్తూ ఉంది. చంద్రాపీడుడున్నూ ప్రాతఃకాల విధులు తీర్చుకొని ఉండగా, ఇంతలో తరళిక కేయూరకుడు అనే యువకునితో కలిసి తెల్లవారుతూ ఉండగానే అక్కడకు వచ్చింది. కేయూరకుడు కాదంబరికి వీణావాహకుడుగా ఉన్నాడు అంతః పురంలో అతనికి పదహారుసంవత్సరాల వయసుంటుంది. వాడు మదించిన ఏనుగు గున్నలాగా బరువుగా నడుస్తున్నాడు. బంగారు గొలుసులతో బిగించి కట్టిన వస్త్రం నడుమున ధరించి ఉన్నాడు. పొట్ట పలుచగా ఉండటం చేత దేహం సమంగా విభజించినట్టు కనిపిస్తోంది. విశాలమైన వక్షస్థలం కలవాడు. గుండ్రంగా పొడవుగాఉన్న బాహువు లున్నవాడు. ఎడమ ముంజేతికి మణికంకణం ఉంది. అతని చెవులకు మణి కుండలాలున్నై. మణికాంతులు క్రిందికి ప్రసరిస్తూ అనేకకాంతులు విడుదల చేస్తున్నై. అందుచేత అతడు భుజంపై ఇంద్రధనుస్సులోని రంగులు గల ఉత్తరీయం ధరించాడేమో అనిపిస్తోంది. నిరంతరం తాంబూలం నమలటంచేత అతని క్రింది పెదవి మామిడి చిగురులా మెరుస్తోంది. అతని నేత్రాలు చెవులవఱకు వ్యాపించి ఉన్నై.



అతని నేత్రాల తెల్లదనం అంతటా వ్యాపిస్తూ కలువలు వర్షిస్తున్నాయా అన్పిస్తోంది. అతని నుదురు బంగారు రేకులాగా విశాలంగా ఉంది. నల్లని తుమ్మెదఱెక్కల్లాండి సరళమైన తలవెంట్రుకలున్నై. అతని ఆకారం సంస్కారవంతంగా ఉంది. రాజకులాలతో ఎలా మెలగాలో బాగా తెలిసినవాడు. అతడు కూడ గంధర్వజాతికి చెందిన బాలుడు.

తరళిక వస్తూనే చంద్రాపీడుని చూసి 'ఎవరీయన' అని కుతూహలపడింది. అతని వంక పరీక్షగాచూసి నెమ్మదిగా మహాశ్వేత దగ్గఱకేగి నమస్కరించింది. ఆమెవద్ద వినయంగా కూర్చొంది. కేయూరకుడు కూడా దూరం నుండే తలవంచి మహాశ్వేతకు వందనం చేశాడు. ఆమెకు కనపడేటట్లు కొంత దూరంలో కూర్చున్నాడు. అతడు మునుపెన్నడు చూడని, మన్మథుని మించిన సౌందర్యంతో విలసిల్లుతూ ఉన్న చంద్రాపీడుణ్ణి చూసి మిక్కిలి విస్మయం పొందాడు. మహాశ్వేత అప్పుడే జపం పూర్తి చేసుకొని, తరళికను చూసింది. "సఖీ! కాదంబరి నీకు కనిపించిందా? ఆమె కుశలంగా ఉందా? ఆమె మామాట ప్రకారం నడుచుకొంటోందా?" అని ఆమెనడిగింది. తరళిక ఆమెకు వినయంతో నమస్కరించి ఇలా అంది –

"ఓ భర్తృదారికా! నేను భర్తృదారిక కాదంబరిని చూశాను. ఆమె కుశలమే. మీరు చెప్పమన్న విషయమంతా ఆమెకు వినిపించాను. ఆమె అంతా విన్నది. కంటినుండి లావైన ముత్యాలవంటి కన్నీటి బిందువులను రాలుస్తూ ఈ విధంగా మీకు చెప్పమంది. ఆమె చెప్పిన వార్తను కేయూరకుడు వివరిస్తాడు. ఈ కేయూరకుడు కాదంబరి వద్ద వీణావాహకుడుగా పనిచేస్తున్నాడు" అని పలికింది. తర్వాత కేయూరకుడు మహాశ్వేతతో ఇలా అన్నాడు.

"ఓ రాజకుమారీ! మహాశ్వేతా! కాదంబరీదేవి ప్రేమపూర్వకంగా కౌగిలించుకొని మీకు ఇలా విన్నవించింది – "తరళిక అన్న విషయాలన్నీ విన్నాను. ఆ మాటలు నీ అంతకు నీవన్నావా? మా పెద్దవాళ్ళు నీ చేత అనిపించారా? లేక నా మనోభావాల్ని పరీక్షించాలని అలా అన్నావా? కాక,

నేను ఇంట్లో హాయిగా బ్రతుకుతున్నానని చెప్పిపోడవాలనా ? లేక మనస్నేహాన్ని చెడగొట్టాలనుకొన్నావా? కాకపోతే ఆత్మీయుల్ని దూరం చేసుకోదలచు కొన్నావా? నాపై కోపమా? నీవంటే నాకెంత ప్రేమ ఉందో నీకు తెలియదా? తెలిస్తే, నాకిటువంటి సందేశం పంపించటానికి నీవు ఎందుకు సిగ్గుపడలేదు? నువ్వెల్లప్పుడు మృదుమధురంగా మాట్లాడేదానివి గదా! మరిప్పుడు ఇంత అప్రియం, కఠినమైనట్టుగా మాట్లాడటం ఎవరివద్ద నేర్చుకొన్నావు? ఒక ప్రక్క ప్రియమిత్రమునకు కష్టాలు కలిగితే ఎవరు మాత్రం సుఖపడాలను కొంటారు? సంతోషాలు, సంభోగాలూ ఇష్టమెలా అవుతాయి? మనసారా నవ్వుకోటం ఎలాగ? చీకటి పడగానే చక్రవాక యువతి కూడా సంతోషాన్ని విడచి, దుఃఖిస్తుందంటే, ఇక మానవుల సంగతి వేరే చెప్పాలా? నా ప్రియసఖివైన నీవు పతివియోగంతో నిరంతరం దుఃఖిస్తూ ఉంటే నా మనస్సులోకి ఏ పురుషుడు ప్రవేశింపగలడు? నా బహిఃప్రాణమైన నువ్వు వ్రతదీక్షబూని కృశించే దేహంతో బాధను అనుభవిస్తుండగా నేను సుఖపడదలచుకొని పాణిగ్రహణం ఎలా చేసుకోను. పెండ్లి చేసుకొన్నా సుఖపడగలనా? ఇంతటి ఘోరపరిస్థితుల్లో నేనిక ఏమీ లెక్కించను. అపకీర్తికి భయపడను, వినయవిధేయతలు లేవు, పెద్దలయందు గౌరవం లేదు. లోకాపవాదాన్ని లెక్కించను. స్త్రీలకు సహజాలంకారమైన లజ్జ వదిలేశాను.

"సఖీ! నీకు దణ్ణంపెడతాను, పాదాభివందనం చేస్తాను. నన్ను కరుణించు. నీవు ఒక్కతెవే అరణ్యానికి వెళ్ళలేదు. నా ప్రాణాలతో పాటు వెళ్ళావు. ఇకెప్పుడూ కలలో కూడ నా వివాహవిషయం తలపెట్టవద్దు" అని పలికాడు కేయూరకుడు. అతని ప్రసంగం ముగిసిన తర్వాత మహాశ్వేత అతనితో, "సరే నీవు వెళ్ళు, నేనే స్వయంగా అక్కడకు వచ్చి పరిస్థితిని సానుకూలపరుస్తాను" అని అతనిని పంపివేసింది.

కేయూరకుడు వెళ్ళినతర్వాత మహాశ్వేత చంద్రాపీడునితో, "రాజపుత్రా! నేనిందాక చెప్పిన హేమకూటం అత్యంతరమణీయమైనది. అది



బహువిచిత్రమైనది. చిత్రరథుని రాజధానీ నగరం. కింపురుషదేశం మిక్కిలి కుతూహలకారకమైంది. గంధర్వలోకం మిగుల సుందరమైంది. నా ప్రాణసఖి కాదంబరి సరళ హృదయురాలు, మహోన్నతురాలు. ప్రయాణించటం నీకు బాధాకరం కాకపోయేట్లైతే, అవతల పెద్దగా పనుల కాటంకం కాకపోతే, నీకు కూడా వింతలోకం చూడాలనే కుతూహలం మనస్సులో ఉంటే, నా మాట వినాలని అనిపిస్తే, నాతో స్నేహం కోరుకొంటే, నామాటను తీసివేయరాదని నీకనిపిస్తే, ఈ నా ప్రార్థన మన్నించు. ఇటు నుంచి ఇటే నాతో హేమకూటానికి పోయి, అక్కడ మనోహర ప్రదేశాలు చూసి తరించు, నాతో సమానురాలు కాదంబరి మనస్సులో చెలరేగుతున్న చెడ్డ ఆలోచనలను దూరం చేసి, ఒక్కరోజు విశ్రాంతిగా గడిపి, మరునాడు తిరిగి రావచ్చును.

"మిత్రుడా! నీ విక్కడకు ఎందుకొచ్చావో కాని, నా వృత్తాంతం వినిపించటం చేత అంతకుముందు నా మనస్సులో గూడు కట్టుకుపోయిన దుఃఖం అంతా ఉపశమించింది. వెలుగు వల్ల అంధకారం పటాపంచలైనట్టుగా నీ స్నేహం వలన నా మనస్సులో విశేషంగా ఉన్న దుఃఖ భారంతొలగి పోయి ప్రశాంతత పొందింది. నీబోటి సత్పురుషుల సాహచర్యంతో దుఃఖితులు కూడా ఆనందితులౌతారు, మీలో ఉన్న సద్గుణాలు ఇతరుల దుఃఖాన్నిపారద్రోలాలనే ఆసక్తి కలవి అని పలికింది. అప్పుడు చంద్రాపీడుడు, "అమ్మా! మిమ్మల్ని చూసిన క్షణం నుంచి నా ఉనికిని నేను మఱచి పోయాను. నన్ను మీరు మీ యిష్ట ప్రకారం ఆజ్ఞాపించి పనులు నాచే చేయించుకోండి". అని పలికి ఆమెతో పాటు తానూ నడవసాగాడు.

## 43. చంద్రాపీడుడు కాదంబరిని చూచుట, ప్రేమించుట

వారిద్దరూ కొంతదూరం నడచి క్రమంగా హేమకూటం చేరుకొన్నారు. గంధర్వరాజ భవనం చేరుకొని, కాంచన తోరణాలను అతిక్రమించి, ఏడుద్వారాలు దాటి, కన్యాంతఃపురంలో అడుగు పెట్టారు. వీరిని చూడగానే ద్వారపాలికలు కొందఱు మహాశ్వేతకు వీరివార్త చెప్పాలని వెళ్ళారు. కొందఱు

వీరికి మార్గం చూపుతూ ముందు నడుస్తున్నారు, ఆ అంతఃపురమంతా స్త్రీజనంతో కిక్కిరిసింది. అదొక కొత్తనారీలోకం, ప్రపంచంలో ఇంతమంది స్త్రీలున్నారని చూపించటానికి ఒక చోట చేర్చారేమో అనిపిస్తోంది. పురుషులు లేని మరొక లోకసృష్టిలాగా ఉంది. స్త్రీలతో మాత్రమే నిండిన ద్వీపంలాగా ఉంది. కేవలం స్త్రీలు మాత్రమే సృజింపబడ్డ ఐదవ యుగంలాగా ఉంది. పురుషద్వేషంతో బ్రహ్మ మొత్తం స్త్రీలనే సృష్టించాడేమో ననిపిస్తోంది. అనేక వేల సంవత్సరాలనుండి పోగు చేయబడిన స్త్రీల భాండాగారం లాగా ఉంది. అక్కడున్న స్త్రీలముఖాలు అసంఖ్యాకచంద్రబింబాల్లాగా ఉన్నై. అత్యంత సుందరమైన ఆ అంతఃపుర మందిరాన్ని చంద్రాపీడుడు దర్శించాడు. ముఖాలు చంద్ర బింబాలు, చూపులు కలువ పువ్వులు, కనుబొమలు మన్మథుని ధనుస్సులు, కేశపాశ సమూహాలు బహుళ పక్ష సంధ్యాకాలాల అంధకారాలు. నవ్వులు వికసించినతామరల కాంతులు, వారి నిశ్వాసాలు మలయమారుత సుగంధవీచికలు, బుగ్గలు మణి నిర్మిత దర్పణాలు, అరచేతులు ఎఱ్ఱతామరలు వర్షించిన ప్రదేశాలు, నఖాలకాంతులు కుసుమాయుధుని పదునైన బాణపు ములుకులు, ఆభరణమణికాంతులు ఇంద్ర ధనుస్సులో రంగులు చూసి పైకెగిరే పెంపుడు నెమళ్ళూ.

అంత రమణీయ స్త్రీజన సౌందర్యానికి చంద్రాపీడుడు ఆశ్చర్యపడ్డాడు. వారి కన్నులే కర్ణోత్పలాలు. నవ్వులకాంతులే చందనపుపూతలు. క్రింది పెదవి కాంతియే కుంకుమపూత. వారు మాట్లాడుతుంటే వీణానాదంలాగా ఉంది. వారి బాహులతలే చంపకవైకక్ష్య మాలికలు. వారి చేతులు కమలాల్లాగా ఉన్నై. వారి స్తనాలు మణిదర్పణాల్లా ఉన్నై. వారి దేహకాంతులే మేలిముసుగుల్లాగా ఉన్నై. అరికాళ్ళ ఎఱ్ఱదనమే పారాణిపూతలాగా ఉంది.

వారికి పారాణి పెట్టుకోవటమే కాలికి బరువు అనిపిస్తుంది. పొగడపువ్వుల మొలత్రాడు నడకకు అడ్డుపడుతూ ఉంటుంది. చందనపు పూత అధిక ఆయాసం కలిగిస్తుంది. వస్త్రం ధరించటమే అలసట కలిగిస్తుంది. చేతికి దారపుతోరణం ధరించటంకూడా చేయి వణుకుకు హేతువౌతుంది. అలంకారంకోసం చెవిలో పూవు ధరించటం కూడా శ్రమ కలిగిస్తుంది. వారు లేచునపుడు చెలికత్తెల చేయూతలేకయే నిలువబడుట అతిసాహసకార్యము. పుష్పసంచయం చేస్తూ రెండవ పువ్వుకొయ్యటం యువతులు చేసే పనికాదు. పూల మాలలు గుచ్చటం మొరటువారు చేసేపని. దేవతా నమస్కారాలు చేసేటప్పుడు సన్నని నడుము భంగం అయితే అధి ఆశ్చర్యకరం కాదు.



## 44. హేమకూటం - కాదంబరి అంతఃపుర విశేషాలు

మహాశ్వేతా చంద్రాపీడులు ఈ విధంగా సౌందర్య సౌకుమార్యాలతో విలసిల్లే స్త్రీజనాన్ని చూస్తున్నారు. కాదంబరి వద్దనున్న చెలికత్తెలు వారిలో వారిలా మాట్లడుకుంటున్నారు.

“ఒసే లవలికా! మొగలి పుప్పొడితో లవంగ లతలకు పాదులు ఏర్పఱచు”.

“సాగరికా! గంధోదకపు దిగుడుబావుల్లో రత్నపుపొడి చల్లవే”.

“ఓ మకరికా! గంధపుగిన్నెలలో కర్పూర పల్లవాల రసం పిండు”.

“ఓసీ, రజనికా! తమాల వృక్షాల నీడచే అంధకారంగా ఉన్న అక్కడ రత్నదీపాలు పెట్టు.

“నిపుణికా! మణిశాలభంజికల హృదయాలపై కుంకుమరసంతో పత్రభంగాలు లిఖించు.

“ఓ ఉత్పలికా! బంగారు చీపుళ్ళతో కదళీగృహమరకతమణి వేదికను శుభ్రంగా ఊడ్వవే”

“కేసరికా! పొగడపూ మాలికల మందిరాన్ని కాదంబరీ (కల్లు)రసంతో తడపమ్మా!

“మాతలికా! మన్మథగృహదంతవలభి (చంద్రమణి వేదిక)ని సింధూర ధూళితో ఎఱ్ఱబఱచవే”.

"ఒసే! నలినికా! కమలపుష్పమకందాన్ని పెంపుడు కలహంసలకు త్రాగించు."

"కదళికా! పెంపుడు నెమళ్ళను ధారాగృహానికి తీసుకొని వెళ్ళు"

"కమలినికా! చక్రవాక శిశువులకి తామరతూడు పాలను త్రాగించు".

"చూతలతికా! పంజరం కోకిలలకు మామిడి చిగుళ్ళను తినిపించు".

"పల్లవికా! పెంపుడు పచ్చపిట్టలకు మిరియపుచిగుళ్ళు తినిపించవే".

"మయూరికా! కిన్నర దంపతుల్ని సంగీత శాలకు పంపించు."

హరిణికా! పంజరంలోని చిలకలకు, గోరువంకలకు మాటలు నేర్పవమ్మా"!

వారి మధ్య హాస్య ప్రసంగాలు కూడా ఈ విధంగా కొనసాగినై –

"ఓసీ! చామరికా! అమాయకురాలిలా ముఖంపెట్టి ఎవరిని వల్లోవేసుకో దల్చావు'?

"ఓ యౌవన విలాసమదోన్మత్తురాలా! స్తనభారంతో నీ శరీరం ముందుకు ఒంగిపోతోంది. నీ వేమో మణిస్తంభకాంతుల్ని ఆసరాగాపట్టు కోవాలని తంటాలు పడుతున్నావు. తెలుస్తోందా?

"ఏ మమ్మా! నువ్వెంత హాస్యప్రియవైతే మాత్రం మణులు తాపిన గోడలో నీ ప్రతిబింబింతో నువ్వే మాట్లాడుతున్నావేమిటి?"

"ఓ చెలీ! నీ ఉత్తరీయం గాలికి ఎగిరిపోయింది. నీ మెడలోని హారకాంతుల్ని ఉత్తరీయం అనుకొన్నావా? చేతితో తడుముతున్నావ్?

"ఏమే బాలా! నువ్వు విలాసం కోసం మణికుట్టిమం పైనున్న కమలాల పై కాలు వేస్తే జారి పడతానేమో అనే భయంతో నీముఖ ప్రతిబింబాల్ని (కమలాలను కొని) దాటుతున్నావు సుమా!"



ఈ రకంగా ఎందఱో యువతులు పరిహాసోక్తులు పల్కుతున్నారు. ఇవన్నీ చూస్తూ వింటూ వారిరువురు కాదంబరీ భవనానికి వచ్చారు.

అక్కడ వాయువు తాకిడికి రాలిన పుప్పొడి ఇసుకతిన్నెలాగా కనపడుతోంది. కోయిలలు ముగ్గిన పండ్లను గీరగా కారిన ఫలరసపు బిందువులతో వర్ష దినంలాగా ఉంది ఆకాశం. సంపెంగ పూఱెక్కలచే నిండిన ఆ ప్రాంతం బంగారు భూమిలాగా ఉంది. పువ్వులు మీద వ్రాలిన తుమ్మెదల బృందంవల్ల ఆ చోటు చీకటితో నిండి అశోకవన వాటికలాగా ఉంది. అక్కడి స్త్రీలు పారాణిపాదాల గుర్తులతో తిరుగుతూ ఉంటే ఎఱ్ఱని అనురాగం అనే సముద్రంలాగా ఉంది. చెవులలో ధరించిన అశోక వృక్షపు చిగురుటాకుల కాంతితో ఆ చోటు ఎఱ్ఱబారింది. చందనం రాసుకున్న స్త్రీల సంచారం చేత ఆ శ్రీమండప ప్రాంతం తెల్లబారింది. దిరిసెనపుష్పాలంకృతలైన స్త్రీలవల్ల ఆ ప్రాంతమంతా లేతపసుపురంగు పులిమి నట్లైంది. మొత్తం మీద ఆ శ్రీమండపం శోభాయమానంగా ఉంది.

ఆ శ్రీమండప మధ్యభాగంలో సహస్ర కన్యకాజనం పరివేష్టించగా, కాదంబరి దివ్యశయనం మీద కూర్చొని ఉంది. ఆమెకు మండలాకారంలో స్నేహితురాండ్రు, దాసదాసీజను లున్నారు. వారు అనేక సువర్ణాభరణాలతో అలంకృతలై ఉన్నారు. కాదంబరి నల్లని వస్త్రం పరచబడిన శయ్యపై తెల్లనిదిండుపై చేయిపెట్టుకొని విలాసంగా కూర్చొని ఉన్నది. మహావరాహపు కోరపై పదిలంగా కూర్చొన్న భూదేవిలాగా ఉంది. ఆమె ప్రక్క చామరాలు వీస్తున్న దాసీల చేతు లూపుటలనే ఈతలాడే క్రీడలో ఉన్నట్లున్నారు. మణులు పొదిగిన భూమిపై కాదంబరి ప్రతిబింబం కనబడుతూ ఆమె పాతాళలోకం నుంచి నాగులదే పైకి తేబడిన దానిలాగా ఉంది. చుట్టుపట్ల రత్నాలు తాపిన గోడలపై ప్రతిఫలించుతూ అష్టదిక్పాలకులచే తేబడిన దానిలాగా కనబడుతోంది. మందిరం పైభాగానగల మణులలో కనబడుతూ దేవతల చేత పైకి తీసుకొని పోబడుతున్న ధానిలాగా తోస్తోంది. అచ్చటివారు ధరించిన

(యువతులు) ఆభరణాల శబ్దాలకు నెమళ్ళు పురివిప్పి నాట్యం చేస్తున్నై. ఆ నెమలికన్నులు అంతటా ప్రతిబింబించుతున్నై. ఆ సుందర దృశ్యాన్ని భవనం కూడా అనేక వేలకన్నులతో కుతుకంతో చూస్తున్నట్లుగా ఉంది. రోజూ కాదంబరిని చూస్తున్న దాసీజనం ఇంకా చూడాలనే ఆశతో ఱెప్పలు వేయకుండా 'దేవతా స్త్రీలా' అన్నట్లు చూస్తున్నారు. ఆ స్త్రీలో బాలత్వం పోయి యువతీత్వం ప్రవేశిస్తోంది. ఆమెనడుము మిక్కిలి సన్నంగా ఉంది. ఆమె పెదవులు పగడాల్లా ఎఱ్ఱగా ప్రకాశిస్తున్నై. ఆమె కేశపాశం నల్లగా దీర్ఘంగా ఉంది. ఆమె చిఱునవ్వు వేలచంద్రుల్ని సృష్టిస్తున్నది.

మహాశ్వేత తనకెంతో ప్రియమైన చక్రవాకదంపతులు రాత్రంతా విరహంచేత నిద్రలేక దుఃఖిస్తుంటే, జాలికలిగి క్రీడానదులలో కమలపుష్పాల పొడిచేత చాల చిన్నవైన తిన్నెలు కట్టి వాటికి నిద్రాసౌకర్యం కలిగిస్తోంది. పరిజనులు ధరించిన కాలి అందెల ధ్వనిచేత చెదరి ఎటో పారిపోతున్న హంస దంపతులను 'తామరతూడులతో బంధించి తెండి' అని ఆజ్ఞాపిస్తోంది.

ఆ యువతుల ఆభరణాలలోనున్న ఆకు పచ్చని మరకతమణుల కాంతులను చూచి గడ్డిపరకలని భ్రమించి నాలుకతో నాకుతున్న లేడి పిల్లలకు కాదంబరి తన చెలికత్తెల చెవులలో తురుముకున్న యవధాన్యపు మొలకలను తీసి వాటికి తినిపిస్తోంది.

కాదంబరి ఉద్యానవనంలో తనచేతితో తానుగా నాటి, నీరుపోసి పెంచిన లతకు అప్పుడప్పుడే పూలు పూయ బోతున్నదని సంతోషంతో ఉద్యాన పాలిక తెలియజెప్పింది. కాదంబరి సంతోషించి ఆమెకు మిక్కుటంగా ఆభరణాలు బహుమతిగా ఇస్తోంది.

అడవి పువ్వులు, పండ్లతో నిండిన ఆకు దొన్నెను కాదంబరికి సమర్పించాలని బోయవనిత వచ్చింది, ఆమెకు సరిగా మాట్లాడటం రాదు. ఆ మాటలు నవ్వు కలిగిస్తున్నై. కాదంబరి ఆమెతో చాలాసేపు మాట్లాడుతోంది.



ఒక చామర గ్రాహిణి ఒక పచ్చపిట్టను మాటిమాటికి కూత కూయిస్తూ, ఆ కూత చిత్రంగా ఉండటం చేత ఆమె పగలబడి నవ్వుతోంది. ఆమెను చూచి కాదంబరి తన లీలాకమలంతో దాని తలపై కొట్టుతూ వినోదిస్తోంది.

కాదంబరి సమీపంలోనే కేయూరకుడు కూర్చొని ఉన్నాడు. ఆమె అతనిని, "అతడెవరు? ఎవరికుమారుడు? ఆతని పేరేమిటి? అతని రూపం ఎలా గుంటుంది? వయస్సెంత ? ఆయన ఏమంటున్నాడు? నీతో ఏంమాట్లాడాడు? నీ వతనిని ఎంతసేపు చూశావు? అతనికి మహాశ్వేతతో ఎలా పరిచయం అయింది? ఆయన ఇక్కడకు కూడా వస్తాడా? అని ప్రశ్నలమీద ప్రశ్నలు వేస్తోంది. కేయూరకుడు ఆ ప్రశ్నలకు తగిన సమాధానాలిస్తున్నాడు.

చంద్రాపీడునకు ఆ కాదంబరిని చూడగానే చంద్ర స్పర్శచే సముద్రముప్పొంగినట్లుగా అతని హృదయం పొంగింది. అతడు ఆమెను చూసి తన మనస్సులో ఇలా అనుకొన్నాడు –

"అయ్యో! బ్రహ్మ ఎంతపని చేశాడు? ఇతర అవయవాలు ఏవీ లేకుండా మొత్తం కళ్ళుగా చేస్తే ఎంత బాగుండేది? నిరంతరం ఱెప్ప వేయకుండా చూసే అదృష్టం ఈ కళ్ళకుంది ఇవి ఎంత పుణ్యం చేసుకొన్నాయో! ఎంత చిత్రం! బ్రహ్మ అన్ని సౌందర్యాలూ కలబోసి ఈమెను నిర్మించాడు. ఆయన అంత అందమైన సామగ్రిని ఎక్కడ సంపాదించాడో!

బ్రహ్మ ఈమెను సృష్టి చేస్తున్నప్పుడు అతని చేతి పరామర్శవల్ల కలిగిన కష్టానికి కన్నీటి బిందువులు కారినై. వాటితో తామరలు కలువు, సౌగంధిక పుష్పాలు నిర్మించి ఉంటాడు అని చంద్రాపీడుడు అనుకొంటూ ఉండగానే ఆతనికనులు ఆమెయందు లగ్నమైనాయి.

కాదంబరి కూడా అతని వంక చూసింది. కేయూరకుడు వర్ణించి చెప్పింది తప్పక ఈయన గుఱించే అని తలచింది. ఆమె ఆతని సౌందర్యాన్ని నిశ్చల నేత్రాలతో చాలాసేపు చూసింది. కాదంబరి కన్నుల తెల్లనికాంతితో

చంద్రాపీడుడు ఒడలు మఱచి కదలని పర్వతంలాగా కనిపించాడు. అతనిని చూచిన కాదంబరికి మొదలుగా రోమాంచము, తర్వాత ఆభరణముల సవ్వడి, ఆ తర్వాత ఆమె ఆసనమునుండి పైకిలేచుట జరిగినవి. ఆమెకు మన్మథుడే శరీరమందు చెమట పుట్టించెను. ఒక్క ఉదుటన నిలబడటం చేత శ్రమ కలిగిందామెకు. అతనిని చూసిన ఆమెకు ఆనందంతో కన్నీరు స్రవించింది. కాని చెవిలోని పుష్పరజం కన్నులలో పడినట్లు అనిపిస్తోంది.

కాదంబరి కొన్ని అడుగులు ముందుకు నడచి, చూచి చాలా కాలమైనందున ఉత్కంఠతో మహాశ్వేతను గాఢంగా కౌగిలించుకొంది. మహాశ్వేతకూడా కాదంబరిని గట్టిగా కౌగిలించుకొంది. ఆమెతో, "సఖీ కాదంబరీ! భారత దేశంలో అనేక రాజుల యొక్క అశ్వము గిట్టలతో గుర్తింపబడిన నాల్గుసముద్రతీరాలు కలిగినవాడు, ప్రజల పీడలు తొలగించువాడు తారాపీడుడను రాజున్నాడు. అతనికి కుమారుడుగా తన భుజాలనే స్తంభాలయందు విశ్రాంతి పొందిన సర్వభూమి కలవాడు ఈ చంద్రాపీడుడు జన్మించినాడు. ఈతడు దిగ్విజయ యాత్ర చేస్తూ మనభూమికి వచ్చాడు. నాకు ఇతడు చూచినప్పటినుండి ఆత్మీయబంధువుగా తోచాడు. సర్వ సంబంధ బాధ్యాలు త్యజించిన నన్ను తన సహజములైన సద్గుణాలతో నామనస్సు ఆకట్టుకొన్నాడు. దయాహృదయుడు, నిష్కారణ మిత్రుడు, సరళ హృదయుడు, మహనీయుడైన ఇట్టి వాడు దొరకుట దుర్లభము. ఇట్టి మిత్రుణ్ణి, గుణవంతుణ్ణి నాలాగా నీవు కూడా చూసి ఆనందిస్తావని నేను ఇతనిని వద్దన్నా బలవంతంగా ఇక్కడకు తీసుకొని వచ్చాను. నీగూర్చి అతనికి చాలా సార్లు చెప్పాను కూడా. నీవీ ప్రథమ సమాగమంలో సిగ్గుపడకు. ఈయన శీలమెట్టిదో తెలియదని అనుమానపడకు. నాతో లాగే ఈయనతోకూడా మెలగ వచ్చును. ఇతడు నీకు మిత్రుడు, బంధువు, సేవకుడు కూడా" అని అంది. మహాశ్వేత ఇట్లనగానే చంద్రాపీడుడు కాదంబరికి నమస్కరించాడు. తనకు అలా నమస్కరింపగా కాదంబరి అతనిని వాలుచూపులతో, స్నేహార్ద్రభావంతో



పెద్దకన్నులతో చూసింది. ఆమెకనుల నుండి ఆనందబాష్పధారలు కారినై. కాదంబరి హృదయం చలించింది. అమృతంలాగా తెల్లనైన చిరునవ్వు అతనిపై చిందించింది. అతనికి తిరిగి నమస్కరించమని ప్రబోధించినట్లు ఆమె కనుబొమ్మ ఒకింత పైకి లేచింది.

కాదంబరికూడా తొందరపాటుతో లేచి చంద్రాపీడునకు నమస్కరించింది. మహాశ్వేతతో పాటు శయనంమీద కూర్చుంది. పరిచారికలు త్వరగా వెళ్ళి ఒక బంగారు కాళ్ళు కలిగిన పీఠాన్ని తెచ్చారు. దాని మీద తెల్లని పట్టువస్త్రం కప్పబడి ఉంది చంద్రాపీడుడు దానిపై కూర్చున్నాడు.

మహాశ్వేత అడ్డు చెప్పటం చేత అక్కడి అన్ని శబ్దాలూ ఆగిపోయినై. నోటికి వేలుంచి సంజ్ఞ చేయటం చేత శబ్దం చేయరాదని హెచ్చరించినట్లు తెలుసుకొని, ప్రతీహారులు చుట్టు ప్రక్కల మ్రోగింపబడుతున్న వేణుధ్వనుల్ని, వీణాఘోషని, గీతధ్వనుల్ని, వందిమాగధుల జయశబ్దాలను వెంటనే ఆపు చేయించారు. అంతటా నిశ్శబ్దం అలము కొంది.

పరిజనులు త్వరగా బంగారు కలశాలలో జలాలు తెచ్చారు. కాదంబరి లేచి స్వయంగా మహాశ్వేత పాదాలను కడిగింది. ఉత్తరీయపుటంచుతో తడియార తుడిచింది. తిరిగి శయనం మీద కూర్చుండ బెట్టింది. కాదంబరికి సరిసమానురాలు, ప్రాణ సమానురాలు, సఖి ఐన 'మదలేఖ' అను పేరుగల విశ్వాసురాలు చంద్రాపీడుడు వద్దన్నప్పటికి వినక బలవంతంగా అతని పాదాలు ప్రక్షాళించింది.

తరువాత కాదంబరి చెక్కిళ్ళు నిమురుతూ, కర్ణాభరణాల్ని సరిచేస్తూ, గాలికి చెదిరిన మంగురులను సవరిస్తూ కాదంబరిని క్షేమసమాచారా లడిగింది మహాశ్వేత. కాదంబరి, "తాను సుఖంగా భవనంలో ఉంటున్నానుగదా! అట్టినన్ను ఈమె క్షేమంగా ఉన్నావా" అని అడిగిందే అని సిగ్గుపడుతూ కుశలమేనని జవాబిచ్చింది. కాదంబరికి లోలోపల దుఃఖం కలుగుతున్నాగాని,

నివారించుకొని ప్రధానంగా మహాశ్వేతను చూస్తున్నప్పటికీ అప్పుడప్పుడూ చంద్రాపీడునిపై చూపు నిలవకుండా ఉండలేకపోయింది.

ఇంతలో కాదంబరి అతిథి మర్యాదకోసం కర్పూర తాంబూల నవ్వబోతుండగా, మహాశ్వేత ఆమెతో, "సఖి, కాదంబరీ! ప్రస్తుతం మనందఱికీ మొదట పూజనీయుడు ఈ చంద్రాపీడుడు. కాన, ముందీతాంబూల మతనికివ్వు'' అంది. కాదంబరి సిగ్గుతో తలవంచి అస్పష్టంగా 'ప్రియమిత్రురాలా! ఆ పని చేయాలంటే నాకు సిగ్గుగా ఉంది. నాకు పెద్దగా పరిచయం లేదు కనక నీవే ఈ తాంబూలాన్ని ఆయనకివ్వు "అని అంది మహాశ్వేతతో ఆమె ఎంతో సేపు మరల మరల చెప్పిన తర్వాత కాని ఆ స్త్రీ ఆ తాంబూల మాతని కీయటానికిష్ట పడలేదు. చూపులు మాత్రం మహాశ్వేత మీదే ఉంచి, శరీరం వణుకుతుండగా, కళ్ళు గిరగిర త్రిప్పుతూ, బరువుగా నిట్టూరుస్తూ, మన్మథబాణాలకు మూర్ఛితురాలైనట్టుగా, శరీరమంతా చెమటతో తడిసిపోగా, అందువల్ల జాఱి పడిపోతానేమో అనే భయంతో చేయూత కోరుతున్న దానిలాగా తాంబూలం ఉన్న తనచేతిని చంద్రాపీడునివైపుకు చాచింది. చంద్రాపీడుడు జయ కుంజరంయొక్క కుంభస్థలాన్ని చఱచటం చేత ఎఱ్ఱబాఱిన దానిలాగా ఉన్న చేతిని ముందుకు చాచాడు. ఆ చేయి వింటినారి తగిలి ఏర్పడ్డ గాయపుమచ్చలు కలది. కాదంబరి ఆ చేతిలో తాంబూలం ఉంచింది. అలా ఉంచటం. "మన్మథుని చేత ఈయబడుచున్న ఈ దాసురాలిని గ్రహించండి' అన్నట్లుగా ఉంది. తనను తాను అతనికి సమర్పించుకున్నట్లుగా ఉంది. "నా జీవితాన్ని నీ చేతుల్లో ఉంచుతున్నాను" అన్నట్టుగా తాంబూలం అర్పించింది. ఈ హడావుడిలో తన చేతి నుండి జారిపోయిన మణికంకణాన్ని గుర్తించనే లేదు. రెండవతాంబూలం మహాశ్వేత కిచ్చింది.

ఆ సమయంలో ఎఱ్ఱని ముక్కుతో ఆకు పచ్చని ఱెక్కలతో ఉన్న చిలుక వెంట తరుముతుండగా, తెల్లకలువ పుప్పొడిరంగులో ఉన్న పాదాలతో,



సంపెంగమొగ్గలాగా ఉన్న ముఖంతో, నల్లకలువకాంతితో ఉన్న ఱెక్కలతో ఒకసారి కాదంబరివద్దకు వచ్చింది. అది మిక్కిలి కోపంతో "రాజకుమారీ! కాదంబరీ! తనొకపెద్ద అందగాణ్ణని తనకుతనే చెప్పుకొంటూ, గర్విస్తూ, నావెంటపడి ఏడిపిస్తున్న ఈ చిలుకగాడిని ఎందుకు నివారింపదమ్మా? మీరు ఈ దుష్టునిచే అవమానింపబడుతున్న నన్ను పట్టించుకోకపోతే నేను నా జీవితాన్ని త్యాగం చేస్తాను. నేను ఊరికే అనటం లేదు. మీ పాదాలమీద ఒట్టుపెట్టుకొని యథార్థమే చెబుతున్నాను" అని అన్నది. ఈ తతంగమంతా చూసి, విని కాదంబరి ఒక చిఱునవ్వు నవ్వింది. ఈ విషయం ఏమిటో తెలియని మహాశ్వేత" ఏమిటీ గోల? ఈ సారిక ఏమంటోంది?" అంటూ ప్రశ్నించింది పత్రలేఖని. అప్పుడు పత్రలేఖ, "ఏంలేదమ్మా ఈ సారిక 'కాళిందికీ, ఈ' 'పరిహాసు'డనే శుకానికి అమ్మగారే సరదాగా పెండ్లి చేశారు, ఈ రోజున ఉదయం కాదంబరి తాంబూలకరండవాహిని తమాలిక ఇతనికి శబ్దోచ్చారణం నేర్పుతుండగా ఈ కాళింది చూసింది. దానికి ఎక్కడలేని కోపం వచ్చింది. ఇక అప్పటినుంచి ఈ పరిహాసుని వంకచూడదు, మాట్లాడదు, తాకను కూడా తాకదు. మేమందఱం కూడా సమాధాన పరస్తూ చెప్పాం. ఐనా దారికి రాలేదు, కోపం తగ్గలేదు" అని వివరించింది.

వారి ప్రణయకోపం గూర్చివిన్న చంద్రాపీడుడు చిఱునవ్వునవ్వుతూ ఇలాగ అన్నాడు –

"ఈ వార్త ఈ రాజకులంలో వినబడుతూనే ఉన్నది. ఆ నోటా ఆ నోటా పరిజనులదాకా వినవచ్చింది. బయటివారు కూడా చెప్పుకుంటూ ఉంటారు. ఈ వార్త దేశవిదేశాలలో కూడ ప్రచారంలో ఉంది. అంతెందుకు మేముకూడా ఈ కథ విన్నాము. ఈ చెడ్డదైన చిలుక కాదంబరీ దేవి తాంబూల కరండవాహిని తమాలిక ప్రేమలో పడిపోయి, జరిగిన రోజుల్ని మఱచాడని తెలిసింది. సరేనండీ! ఆ దురాచారుడు భార్యను వదలి పెట్టి, సిగ్గు వదిలేసి దానితో కులుకుతున్నాడనే అనుకొందాం. ఆ సంగతి అటుండనీయండి. మరి కాదంబరీ

దేవి ఈ చపల బుద్ధిగల చిలుకవాడిని ప్రేమించిన దుష్టదాసీని ఎందుకు మందలించటం లేదు? అసలు వీడిటు వంటి దుర్మార్గుడని తెలిసికూడా కాదంబరీ దేవి వీడికి ఆ సారికతో ఎలా వివాహం చేసింది! ఈ సమస్యను పరిష్కరించేది ఎలా? స్త్రీలకు సమాన భర్తృత్వం (సవతితనం) ప్రధానంగా కోపానికి హేతువౌతుంది. స్త్రీలు దైనికైనా అంగీకరిస్తారు కాని సపత్నీత్వాన్ని అంగీకరించరు. వారికి వైరాగ్యకారణం కూడా. ఆ పరిస్థితి వారికి భరింపరాని అవమానం. ఒక రకంగా ఈ కాళింది అనే సారిక ధైర్యవంతురాలనే చెప్పాలి. ఇటువంటి ఘోరపరిస్థితిలో కూడా ఏ ఆఘాయిత్యానికి పాల్పడలేదు. విషం తీసుకోలేదు. అగ్నిలో దూకలేదు. నిరశనవ్రతం చేపట్టలేదు.

ఈమే కనుక భర్త అనునయానికి లొంగి వాని దరిజేరితే మాత్రం ఏమీ బాగుండదు. ఈమెను ఛీకొట్టాలి. ఆమెతో పనిలేదు. దూరంగా వదిలేయాలి ఈమెను. అలాజరిగితే ఈమె ముఖం చూసేదెవరు? ఈమెతో మాట్లాడేదెవరు? ఆమె పేరు తలచేదెవరు?”ని అతడనగానే ఆ మాటలు విని అక్కడున్నవారంతా, కాదంబరితో సహా మనసారా నవ్వారు. అయితే చంద్రాపీడుని మర్మ సంభాషణం పరిహాసుడికి ఎక్కడ లేని కోపాన్ని కలిగించింది. పరిహాసుడు, “ఓ దూర్త రాజపుత్రా! కాళింది ఏమీ తక్కువది కాదు. నీ బోటివారు చెప్పే మాయమాటలు నమ్మేంత అమాయక కాదు నా కాళింది. నీ వంకరమాటలు ఆ స్త్రీకి కూడా బాగా తెలిసినవే సుమా! పరిహాసాలు ఆమెకు తెలియనివి కావు. ఆమెకు మీ రాచకుల వ్యవహారాలు బాగా తెలుసు. అయ్యో! రాజపుత్రా! ఇక ఆపు చేయండి. అయినా స్త్రీ జనులమధ్యలో విటులు వాడే భాష వాడవచ్చునా! నా కాళిందికి కోపమెలాంటిదో ప్రసాదం ఎలాంటిదో తెలియదా!” అని అన్నాడు.

ఇంతలో కంచుకి అక్కడికి వచ్చి, మహాశ్వేతతో, ‘‘అమ్మా! ఆయుష్మంతురాలా! ఈమె నాన్నగారు చిత్రరథుడు, అమ్మ మదిర నిన్ను చూడగోరుతున్నారు తల్లీ!” అని వార్తను చెప్పాడు. తను వెళ్ళాల్సిన పరిస్థితి



వచ్చింది. ‘చెలీ మరి చంద్రాపీడుడు ఎక్కడుంటారు?’ అని కాదంబరితో మహాశ్వేత అడిగింది. ఆమెతో కాదంబరి “చెలీ! నీ యిష్టము వచ్చిన చోటనే అతడుంటాడులే” అని పలికింది. అందుకు మహాశ్వేత ‘అట్లైతే నీ భవన సమీపమునందలి ప్రమదావనంలో క్రీడాపర్వతక మణిభవనంలో ఉంటాడు. “అని పలికి మహాశ్వేత వెళ్ళింది.

చంద్రాపీడుడు కూడా ప్రమదావనంలో వీణావాదనతోనూ, వేణువాద్యంతోనూ చిత్రకర్మతోనూ బాగా పరిచయమున్న స్త్రీలతో కాలక్షేపం చేశాడు. కాదంబరి కూడా తన భవనం పైభాగానికి చేరింది. మంచంపై పడి మిత్రురాంద్రతో ఏదో ముచ్చటలాడింది. ఆమె తన మనస్సులో చంద్రాపీడునితో నేనలా ఎలా ప్రవర్తించానా? అని ఆశ్చర్యపడింది. నా గురుజను లేమనుకొంటారో నేను ఆలోచింపలేదు. లోకాపవాదభయం అసలు లేదు. ఎవరేమనుకొంటారో కూడా చూడలేదు. ఇక్కడి పరిజనులు గాని, అంతఃపుర దాసీలుగాని, సఖులుగాని చాలా తెలివిగలవారు. నన్ను తప్పుగా భావిస్తారేమో! అయ్యో ఈ సిగ్గులేని జీవితం కంటె నాకు మరణమే శరణ్యా మనిపిస్తోంది. ఇక్కడి విషయాలు తల్లిదండ్రులు వింటే ఏమనుకొంటారో! సాటి గంధర్వజాతులెలా భావిస్తాయో గదా! నేనేంచెయ్యను? నా తప్పును ఏ ఉపాయముతో దిద్దుకోగలను? నా యింద్రియలోభిత్వం గూర్చి ఎవరికి చెప్పాలి? నేను మహాశ్వేత విషయంలో ఏమని ప్రతిజ్ఞ చేశాను. మరిప్పుడేం చేస్తున్నాను? నాకీ దుస్థితిని ముఖ్యంగా చంద్రాపీడుడే కలిగించాడు. నన్నిలా నవ్వుల పాలుచేయాలనే అతడు ఇక్కడికి వచ్చాడేమో! అతడిలా చేస్తాడని నే నెప్పుడూ ఊహింపలేదు, అని అతనిని నిందించింది. కాని ఆమె మనస్సులో, “ఒక్క సారి శుభ్రపరచుకొన్న కళ్ళతో పరిశీలించి చూడు – అతడు నీవు నిందింప దగినవాడా? అని అనుకొంది.

ఇక్కడ కాదంబరి లాగానే అక్కడ ప్రమదావనమణిగృహంలో చంద్రాపీడుడు కూడా ఆలోచనల్లో పడ్డాడు. అనేక దిండ్లు అమర్చిన పరుపుపై

పండుకొన్నాడు. కేయూరకుడు అతనిపాదాలను తన ఒడిలో ఉంచుకొని కాళ్ళు పిసుకుతున్నాడు. చుట్టు పట్ల చాలా మంది అంతఃపురకన్యకలున్నారు. ఆహా! కాదంబరి అంతటి భోగభాగ్యాలతో తులతూగేదేదైనా గాని నావంటివానిపై దయాదృష్టి ప్రసరింపజేసింది. మరల నేను ఆమె వంక చూస్తుంటే సిగ్గుతో తనను తాను దాచుకొంటుంది. ఆమె తనను నిజంగా ప్రేమించిందా? లేదా? అని అనుమానం వచ్చింది చంద్రాపీడునికి మన్మథుడే ఆమె ప్రేమను ప్రకటింపజేస్తాడని విశ్వసించాడు.

తరువాత అక్కడి కన్యామణులతో వివిధరకాలనైపుణ్య క్రీడలతో ప్రొద్దు పుచ్చాడు. కొంత సేపటికి ఉద్యానవనం చూద్దామనే కుతూహలంతో క్రీడా పర్వతశిఖరం ఎక్కాడు. కాదంబరి చంద్రాపీడుణ్ణి చూసి, ఇంకా మహాశ్వేత రాలేదేమని అనుకొంటూ కిటికీ తెఱిపించి ఆ దిక్కువంక చూడసాగింది. ఆమెకూడా భవనంపై భాగానికి చేరింది. ఛత్రచామరాలు పట్టిన దాసీలు కాదంబరిని సేవించారు. ఆమె తలలోని పుష్పమాలికా సుగంధానికి తుమ్మెదలు విరివిగా మూగసాగాయి. అప్పుడామె చంద్రాపీడునికోసం విరహంతో నల్లని మేలిముసుగులేసుకొని బయల్దేరిన అభిసారికలాగా ఉంది. ఛత్రచామరాలను మాటి మాటికి సర్దుతోంది. మాటి మాటికి తమాలిక భుజంపై చేతులు వేస్తోంది. ప్రక్కనున్న మదలేఖను కౌగిలించుకొంటోంది. మాటిమాటికి తాంబూలాన్ని సేవిస్తూంది. దాసీలను తన చేతిలోని పద్మంతో కొట్టబోగా వారు పరుగెత్తితే తాను కూడా వారి వెంటపడి కొంతదూరం తఱుముతోంది, వారిని చూచి నవ్వుతోంది. వారున్నూ ఈమెను చూసి నవ్వుతున్నారు. ఇలా చాలా సమయం గడిచిపోయినా ఆమె గుర్తించలేదు.

ఇంతలో ప్రతీహారి వచ్చి మహాశ్వేత రాకను గూర్చి తెలియజేశాడు కాదంబరి వెంటనే భవనం నుండి క్రిందికి దిగింది. తనకు స్నానసంధ్యాదుల యందు ఇష్టం లేకపోయినా మహాశ్వేత పట్టుదలతో ఎలాగో దినకృత్యాలు పూర్తి చేసింది.



చంద్రాపీడుడు కూడా క్రీడాపర్వతంనుండి క్రిందికి దిగాడు. దాసీ జనుల సహకారంతో స్నానం చేశాడు. అక్కడే ఉన్న శిలాప్రతిమలకు దేవతార్చన చేశాడు. ఆ క్రీడాపర్వతం మీదే భోజనక్రియ పూర్తి చేశాడు. ఆ పరిసర ప్రదేశాల సౌందర్యం చూస్తూ అనేక మంది కన్యకలతో కూడి వస్తోంది. ఆమె ఎడమవైపున ప్రతీహారి నడుస్తున్నది. కేయూరకుడు తెల్లని పట్టుపంచె కట్టి, పట్టు ఉత్తరీయం ధరించి ముందునడుస్తూ ఆమెకు మార్గం చూపిస్తున్నాడు. అతడు ధరించిన వస్త్రాలు తెల్లత్రాచు విడచిన కుబుసంలాగా ఉన్నాయి. తమాలిక, మదలేఖలు ఆమెతో వస్తున్నారు. ఆమెకు దగ్గరగా తరళిక వస్తోంది. చంద్రాపీడుడు ముందుగా లేచి వారికి ఎదురు వెళ్ళాడు. ఆమె చంద్రాపీడునకు చందనము రాచి, జంట వస్త్రము లతనికి అర్పించింది. మాలతీకుసుమహారం శిరమున అలంకరించింది. రత్నహారాన్ని చేతపట్టుకొని, “ఓ రాజకుమారా! నీ నిరహంకారం, మృదుత్వం ఎవరిని పరవశింపజెయ్యవు? నీ వంటి వారిని వినయం ప్రకాశింప జేస్తుంది. ఇంత రూపసివి ఎంత సుందరీమణికైనా ప్రాణనాథుడవు కాగలవు. నీకున్న ఆదరణ, సచ్చరిత్ర ఎవరిని బంధుత్వానికి పురికొల్పవు? నీ సహజమధురమైన, సరళమైన ప్రవర్తన ఎవ్వరికైనా స్నేహము మీద అభిలాష కలిగిస్తుంది. నీ సహజసుకుమారమైన గుణాలు ఎవరికైనా మనశ్శాంతిని కలిగిస్తై. ప్రథమ దర్శనంలోనే నీ సుందర రూపం హృదయంలో ముద్రింపబడుతుంది. నీవంటి సకలలోకఖ్యాతి నొందిన వారిని ఎంతగా గౌరవించినా అది తక్కువే అవుతుంది. మీ వంటి వారికి బహుమతిగా ఇచ్చినా అది అవమానించినట్లే అవుతుంది. అయినా మనస్సు దోచేవానికి ఏది ఇవ్వగలం? జీవితమే నీదని అర్పించినవానికి ఏమివ్వగలం? మొదటి సారిగా మాకు దర్శనభాగ్యం కలిగించిన మీకు ప్రతిఫలంగా ఏదివ్వగలం? కాదంబరీ దేవి అట్టి మీకు తనప్రేమను వ్యక్తపరస్తూ ఇది ఇస్తున్నది గాని, తనవైభవం వల్లకాదు. సజ్జనుల సంపదలకు స్వ, పర అనే భేదాలుండవు గదా! ‘ఇదిగో ఈ హారము ‘శేషహారము.’ ఇది అమృతమథన సమయాన పుట్టిన మేలైన

వస్తువు లన్నింటిని మించిన విలువగలది. ఇది సముద్రుడు తన యింటికి వచ్చిన వరుణునకు బహుమతిగా ఇచ్చినాడు. వరుణుడు గంధర్వరాజున కిచ్చినాడు, గంధర్వరాజు కాదంబరి కిచ్చినాడు. చంద్రబింబానికి నివాసయోగ్యమైనది భూమికాక ఆకాశమైనట్లుగా ఇట్టి హారమునకు తగిన వారని తలిచి కాదంబరి మీకు కానుకగా పంపినది. మీవంటి వారు సద్గుణసముదాయపు భారం అలంకారంగా కలవారు. అట్టి మీకు ఇతరులు బహుమతిగా ఇచ్చిన ఆభరణ భారం వహింప నిష్టపడరు. అయినా కాదంబరికి మీ మీద ప్రేమ ఉన్నది. కావున దీనిని పంపినది, కాదంబరి మీపై ప్రేమతో పంపిన ప్రథమ బహుమతిని తిరస్కరింపవద్దు" అని హారాన్ని అతని మెడలో అలంకరించింది.

## 45. కాదంబరి మదన వేదన

చంద్రాపీడుడు విస్మయంతో మదలేఖతో ఇలా అన్నాడు. "ఓ మదలేఖా! ఏమంటున్నావు? నీవు చతురవు. నీకు ఎలా పుచ్చుకొనేట్లు చేయాలో తెలుసు. నీ వాక్చాతుర్యం నేను బదులు పల్కటానికి అవకాశం లేకుండా చేసింది. ఓసి ముగ్ధురాలా! ఇట్టి బహుమతి తీసికొనేందుకు, తీసికొనకుండటానికి ఆమె మాకు ఏమవుతుంది? అసలు మేమెవరం? ఈ విషయం ఇంతటితో సరి. మీ సజ్జనత్వంతో మమ్ములను ఏ పని చేయటానికైనా నియోగించే అవకాశం మీరు పొందారు. కాదంబరి తన సుగుణసంపదతో ఎవరినైనా ఇట్టే వశపరచుకొంటుంది" అంటూ ఇలా కాసేపు ప్రసంగించి మదలేఖను పంపించి వేశాడు.

చంద్రాపీడుని రూపసంపదను చూడటానికి కాదంబరి మరల క్రీడాపర్వతం వైపు చూడటానికి వీలుగా సౌధం పైభాగానికి చేరింది. వెంట ఎవ్వరినీ దాసీలను రానీయలేదు. తమాలికను వెంట పెట్టుకొని ఆమె మేడపైకి చేరుకొంది. కాదంబరి తన విలాస విభ్రమచేష్టలతో చంద్రాపీడుని మనస్సు



దోచుకుంది. తన ఎడమచేతిని నడుముపై నుంచుకొని పై ఉత్తరీయంతో కూడిన కుడిచేతిని బారుగా చాచిన భంగిమలో గీయబడిన చిత్ర ప్రతిమలా ఉండిపోయింది. మాటిమాటికి ఆవులింతల్ని ఆపుకొంటూ, పైట కొంగు విసురుకొంటూ, తలలో అలంకరించుకొన్న పూవుల్ని దోసిలిపట్టి వాటిని వాసన చూసే నెపంతో చంద్రాపీడునికి నమస్కరిస్తున్నట్టుగా ఉంది కాదంబరి. మెడలోని ముత్యాలహారాన్ని రెండు చూపుడు వ్రేళ్ళతో గుండ్రంగా కదిలిస్తూ తన హృదయాన్ని అతనికి అర్పిస్తున్న దానిలా ఉంది. నేలపై జీరాడుతున్న ఉత్తరీయాన్ని పైకిలాక్కొని తన వక్షఃస్థలాన్ని కప్పుకొన్నది. గజిబిజిగా నున్న తన ముంగురులను చిక్కు తీసి సరిచేస్తున్నది ఆమె. ఇంతలో సంధ్యాకాలం సమీపించింది. సూర్యుడు అస్తమిస్తున్నాడు. పద్మసంతతులు ముకుళించుకొన్నాయి. కలువలు వికసించాయి. దిక్కులు ఎఱ్ఱబారినై. రాత్రి ముఖము నల్ల బారింది. మరల సూర్యోదయాన్ని ఎదురు చూస్తూ కాంతులు అస్తమించాయి. కుసుమబాణుని ఆయుధాగ్నికి వేల హృదయాలు దగ్ధమైనాయి. ఆ స్త్రీల నల్లని కాటుకతో కూడిన జలములు సర్వత్రా వ్యాపించినవా అన్నట్టుగా చీకట్లు దట్టంగా వ్యాపించినై. దిగ్గజములు తమ తొండాలను పైకెత్తి జలబిందువులు వర్షించినట్లుగా ఆకాశంలో తారాగణాలు మెరిసినై. ఈ విధంగా రాత్రి చీకట్లు అంతటా వ్యాపిస్తూ ఉండగా అటు సౌధాగ్రం నుంచి కాదంబరి ఇటు క్రీడాపర్వతం నుంచి చంద్రాపీడుడు క్రిందికి దిగారు.

సూర్యుడు అస్తమించిన కొద్దికాలానికే చంద్రుడు ఉదయించాడు. చంద్రుడు కలువల చేత సేవింపబడుతున్నాడు. కోపించిన దిక్కు లనే కాంతలను అనునయిస్తూ ఉన్నాడు. తెల్లవారిందని కలువలు నిద్రనుండి మేల్కాంచాయి. తన భార్య రోహిణీదేవి కోపంతో తన్నినప్పుడు ఆమె కాలిపారాణి అంటినట్టుగా చంద్రుడు ఎఱ్ఱబారాడు. పగలు నల్లని చీకటి అనే ముసుగు వేసుకొని అభిసారికలాగా కనపడింది దిక్కు అనే అంగన. మిక్కిలి ప్రేమతో సౌభాగ్యాన్ని వెదజల్లుతూ, నేత్రోత్సవం కలగజేస్తూ సుధానిధి చంద్రుడు ఉదయించాడు.

కలువలకు ప్రియుడైన చంద్ర భగవానుడు మన్మథుని సామ్రాజ్యానికి ఎత్తిన రాజచ్ఛత్రంలాగా, రాత్రి ప్రియురాలు ధరించిన దంతపు కర్ణాభరణంలాగా ప్రకాశించాడు. ప్రపంచం దంతంతో చెక్కబడిన దిక్కుల్లా తెల్లగా ప్రకాశించింది.

చంద్రాపీడుడు చంద్రశీతలమైన మణిశయ్యపై పవళించాడు. అది క్రీడాసరస్సు ప్రక్కనే ఉంది. ఆ సరస్సులోని చిఱుకెరటాలచేత దానిమెట్లు కడగబడినాయి. చిన్న అలలు అనే విసనకఱ్ఱల చేత వీచినట్లు చల్లని గాలి వస్తున్నది. ఆ మెట్లపై హంసదంపతులు సుఖంగా నిద్రిస్తున్నాయి. రాత్రివేళ చక్రవాకాలు కన్నుకానక తమ ప్రియుడు ప్రక్కనే ఉన్నా గ్రహింపలేక విరహం అనుభవిస్తున్నై. అలాంటి సుందరమైన శయ్య కాదంబరి చెలికత్తెలే ఏర్పఱిచారు, "దేవీ కాదంబరి మిమ్ము చూడాలని ఇక్కడకు వస్తోంది" అని వార్త తెలియజేశాడు.

ఆ మాట వినగానే చంద్రాపీడుడు త్వరగా శయ్యమీద నుండి లేచాడు. కాదంబరి ఆ వైపునకీ వస్తున్నది. ఆమె వెంట కొద్దిమంది మాత్రమే పరివారం ఉన్నారు. ఆమె వంటిపై రాజచిహ్నాలు ఏమీలేవు. మామూలు స్త్రీలాగానే మెడలో ఒక్క ఏకావళి మాత్రం ధరించింది, తెల్లని చందనంపూతలతో శరీరంతెల్లగా ప్రకాశిస్తోంది. ఒక చెవికి మాత్రం దంతపు కర్ణాభరణం ధరించింది. ఆమె చంద్రకళలాగా కోమలమైన కలువరేకును చెవికి అలంకారంగా తురుముకొన్నది. వెన్నెలలాగా తెల్లగా, శుభ్రంగా ఉన్న వస్త్రద్వయాన్ని ధరించింది. ఆ సమయంలో ఆ అలంకారంతో ఆమె సాక్షాత్తు చంద్రోదయ దేవతలాగా ప్రకాశించింది. కాదంబరి మదలేఖ చేతిని ఆసరాగా తీసుకొని అక్కడకు వచ్చింది.

వస్తూనే ఆమె తన ప్రేమ సౌకుమార్యాన్ని ప్రదర్శిస్తూ ఎవరో మామూలు స్త్రీలాగా క్రింద కూర్చొంది దాసీలాగా, అప్పుడు మదలేఖ "కుమారా! మీరు మాత్రం ఆ శిలపైనే కూర్చోండి తప్పులే"దని వారించినా వినకుండా



చంద్రాపీడుడు కూడా కాదంబరిలాగా క్రిందే కూర్చున్నాడు. అంతా అలా కాసేపు కూర్చున్నారు.

అప్పుడు చంద్రాపీడుడు ఇలా మాట్లాడనారంభించాడు, "దేవీ! మీవంటి వారి చూపులకు కూడా నోచుకోని మావంటి వారితో మాట్లాడి ఎంతో అనుగ్రహం చూపిస్తున్నారు. అటువంటి మాపై ఇంతటి అనుగ్రహం చూపిస్తున్నారంటే ఇంకేమి చెప్పాలి? మీరు నాపై ఇంత అనుగ్రహం చూపుతున్నారంటే నాయందున్న గొప్పతనమేమిటో ఎంత ఆలోచించినా నాకు కానరావటం లేదు. గర్వం ఎంత మాత్రం లేని అతిసరళం, అతిమధురం, సౌజన్యం సేవకుని వంటి నాపై చూపుతున్నారు. ఆజ్ఞలతో పనులు చేయించుకోదగిన భృత్యజనులయందింత ఆదరమా!" చంద్రాపీడుడు ఇలా మాట్లాడగా అతని మాటలను ఆపుచేస్తూ మదలేఖ, చిఱునవ్వుతో, "కుమార! అలాగే కానీ! ప్రేమ ఒత్తిడికి తట్టుకొనలేక కాదంబరి దుఃఖిస్తోంది. ఇలా అనకండి. వేఱొకరీతిగా అన్నట్లనిపిస్తుంది" అని పలికింది.

ఇలా కొంతసేపు మాట్లాడిన తరువాత, "రాజకుమారా! మీ తండ్రిగారు తారాపీడులు, తల్లిగారు విలాసవతి, మంత్రి శుకనాసుడు ఎలా ఉన్నారు? కుశలమే కదా! మీ ఉజ్జయినీ నగర మెలాగున్నది? ఆ నగర మిక్కడి కెంత దూరంలో ఉంది? భారతవర్ష మెలాగున్నది? మీ మానవలోకము మిక్కిలి సుందరమైనదట గదా!" అని వివరంగా అడిగింది మదలేఖ ఇట్లా కొంతసేపు మాట్లాడిన తర్వాత కేయూరకుణ్ణి, దాసీలను చంద్రాపీడుని వద్ద ఉండ నియమించి తాను తన శయనసౌధానికి బయలుదేరింది కాదంబరి, చంద్రాపీడుడు, కాదంబరి గుణగణాలను తలచుకొంటూ ఆ రాత్రి గడిపాడు. అతనికి కాదంబరి నిర్గర్వత్వం, సౌందర్యం, గాంభీర్యం తలపులోకి వచ్చినై. మహాశ్వేత ఎంత వాత్సల్యం కలదో గుర్తుకు తెచ్చుకొన్నాడు. మదలేఖ సౌజన్యాన్ని గమనించాడు. పరిజనుల అణకువ, మహానుభావత మఱచిపోలేక పోయాడు. గంధర్వలోకం సమస్తమైన సంపదలు గలది. కింపురుషదేశం

మిగుల రమణీయమైనది అని మదిలో తలచుకొంటూ నిద్రించాడు. ఇంతలో తెల్లవారింది.

అప్పుడు రాత్రంతా కాదంబరిని చూస్తూ నిద్రలేని చంద్రుడు బడలికతో నిద్రకు ఉపక్రమించాడు. విరహబాధ లనుభవించువారి వేడి నిట్టూర్పులకు మలినమైనట్లు వెన్నెల మసకబారింది. గృహాలలోని దీపాలు తెల్లవారిందని మేల్కొన్నాయి. మన్మథుడు కాముకులపై రాత్రంతా పూలబాణాలు వేసివేసి అలసిపోయాడు. సూర్యభగవానుడు అప్పుడే విరహబాధనుండి తేరుకొన్న చక్రవాకాల హృదయాలలో ఉత్పన్నమౌతున్న అనురాగంలాగా ఎఱ్ఱబారుతున్నాడు. చంద్రాపీడుడు వెంటనే లేచి ప్రాతఃకాల కృత్యాలు నిర్వర్తించి, సంధ్యానమస్కారాలు చేసి, తాంబూలం సేవించాడు, కేయూరకుని పిలిచి, రాజకుమారి లేచిందో లేదో వెళ్ళి చూసిరా' అని పంపాడు, ఎక్కడుందో తెలుసుకుని రమ్మన్నాడు. కేయూరకుడు వెళ్ళి వచ్చి, దేవా! మందర ప్రాసాదం క్రింది భాగాన ముంగిలి ప్రదేశంలో మహాశ్వేతతో కలసికూర్చొని యున్నది కాదంబరి' అని పలికాడు.

చంద్రాపీడుడు గంధర్వ రాజకుమార్తె కాదంబరిని చూడాలని ఆ మందిర ప్రాంతానికి చేరుకొన్నాడు. అక్కడ కొందరు పాశుపత దీక్షపూనిన స్త్రీలున్నారు. వారిలో కొందఱు తెల్లని భస్మం పూసుకొని ఉన్నారు. కొందఱు చేతి వ్రేళ్ళతో అక్షమాలలు త్రిప్పుతూ జపం చేస్తున్నారు. కొందఱు ఎఱ్ఱని వస్త్రాలు ధరించారు. వారందరూ వ్రతదీక్షలో ఉన్న సన్యాసినులు. పండిన తాటిపండ్ల పీచుతో నేసిన వస్త్రాలు ధరించారు. తెల్లని వస్త్రాలను వారి స్తనాలకు ఆవరణముగా కట్టుకొన్నారు. తెల్లని విసనకఱ్ఱలు, జింక చర్మాలూ, మోదుగు చెట్ల దండాలు పట్టుకొన్నారు కొందఱు స్త్రీలు. వారంతా బ్రహ్మచారిణులు. వారు రూపు ధరించిన మంత్ర దేవతల్లా ఉన్నారు. వారంతా వివిధదేవతల స్తోత్రాలు పఠిస్తున్నారు. శివుడు, పార్వతి, కుమార స్వామి, కుచేలుడు, కృష్ణుడు, అవలోకితేశ్వరుడు, బ్రహ్మ మొదలగు వారి స్తోత్రాలు పఠిస్తున్నారు. అంతః



పుర ప్రముఖులు అక్కడి వారిచే సాదరముగా ఆహ్వానింపబడి గౌరవింపబడుతున్నారు. వారి వారి అర్హతల కనుగుణంగా ఆసనాలలో కూర్చొని ఉన్నారు. వారందర్నీ యథోచితరీతిగా మర్యాద చేస్తూ మహాశ్వేత కనపడింది.

## 46. హేమకూటం నుండి చంద్రాపీడుని తిరుగు ప్రయాణం

చంద్రాపీడుడు మహాశ్వేతకు కన్పించగానే ఆమె అతనిని యథోచితంగా గౌరవించి వేదిక మీదనే ఒక ఆసనం మీద కూర్చొనబెట్టింది. చంద్రాపీడుడు కొంతసేపుండి మహాశ్వేతవైపు మందహాసంతో చూశాడు. మహాశ్వేత అతడి అభిప్రాయం గ్రహించి", చెలీ! నీ సుగుణసమూహం చేత చంద్రకాంతమణి చంద్రకిరణాలవలన ఆర్ద్రీకృతమైనట్లు చంద్రాపీడుడి హృదయం ప్రేమార్ద్రమైన కారణాన నీతో చెప్పలేకపోతున్నాడు. ఇతడు వెళ్ళగోరుతున్నాడు ఇతని వృత్తాంతం తెలియని రాజసమూహం దుఃఖంతో ఉన్నారు. మీరిరువురు దూరదూరంగా ఉన్నా పద్మినీ దివాకరుల వలె, కలువచంద్రుల వలె దృఢబంధమేర్పడి ఉంటుంది. కావున ఈయన వెళ్ళటానికి అనుమతిని ఇవ్వు" అని పలికింది.

తర్వాత కాదంబరి, "సఖీ! మహాశ్వేతా ! ఆయన ప్రత్యేకించి అనుమతిని అడగవలసిన పనియేమిటి? నేను, నా పరివారం అందరం అతని అధీనంలోని వారమే గదా! ఇంక ఆయనకు అడ్డేమున్నది!' అని పలికి గంధర్వరాజ పుత్రులను పిలిచి' ఈ రాజకుమారుని ఆతని దేశంలో వదలిరండి' అని ఆదేశించింది. అంతట చంద్రాపీడుడు లేచి ముందుగా మహాశ్వేతకు, తర్వాత కాదంబరికి నమస్కరించి, ఆమెను ప్రేమభర దృష్టితో చూస్తూ, "దేవీ! ఏమని చెప్పను? లోకం అధికంగా మాట్లాడే వారిని లెక్కచేయదు. మీ ప్రసంగాల సమయంలో నన్ను కూడా తలచుకోండి అని పలికి కన్యాంతఃపురం నుండి బయల్దేరాడు.

అప్పుడు కాదంబరి తప్ప మిగిలిన కన్యకాజనం చంద్రాపీడుని గుణాలకు ఆకర్షితులు కావున పరవశలై అతని వెంట నగర బహిస్తోరణం దాకా

అనుసరించి వచ్చారు. వారు వెళ్ళిన తర్వాత కేయూరకుడు తెచ్చిన గుఱ్ఱాన్ని ఎక్కి ఇతర రాజకుమారులు వెంట రాగా హేమకూటం నుండి బయల్దేరాడు. అలా వెళ్ళే చంద్రాపీడునికి గంధర్వ రాజపుత్రి కాదంబరి లోపలా బయటేకాక అన్ని ఎడలా ఆమే కన్పించసాగింది. ఎలాగంటే – మిక్కిలి విరహ దుఃఖంతో నిండినదై వెనుక వైపున, మార్గంలో ఆటంకాలను తొలగిస్తూ ముందు వైపున, వియోగంచేత వ్యాకులపాటు చెందిన హృదయబాధతో కూడినదై ఆకాశం వైపున, విరహదుఃఖంతో నిండినదై గుండెలలోన ఇలా అన్ని ఎడల కాదంబరి కనపడసాగింది, ఇలా నడచి నడచి క్రమంగా అచ్ఛోద సరస్తీరాన మహాశ్వేతా శ్రమానికి చేరుకొన్నారు.

అంతకుముందే చంద్రాపీడుని సైన్యమంతా అక్కడకు చేరుకొన్నది. ఇంద్రాయుధం వాడి డెక్కలగుర్తులతో వారు ప్రయాణించి క్రమంగా అక్కడకు చేరుకొన్నారు. అక్కడి నుండి గంధర్వరాజకుమారుల్ని సాదరంగా తిప్పి పంపించాడు చంద్రాపీడుడు. అక్కడి వారంతా రాజకుమారుణ్ణి ఆనందంతో, కుతూహలంతో, ఆశ్చర్యంతో చూడసాగారు. వారంతా రాజకుమారునికి వందనాలు చేశారు. వారందర్నీ ప్రేమగా చూస్తూ, పలకరిస్తూ చంద్రాపీడుడు తన గుడారానికి చేరుకొన్నాడు. రాజకుమారవర్గమంతా ఆయన్ను గౌరవించారు. వైశంపాయనుడు, చిత్రలేఖ ఆయనను కలుసుకొన్నారు. వారితో ఆ యువరాజు మహాశ్వేత గూర్చి, కాదంబరిని గూర్చి, మదలేఖ, తమాలిక, కేయూరకుడు గూర్చి గంధర్వలోక సౌందర్య విశేషాలను గూర్చి ఆ రోజంతా ముచ్చటిస్తూ గడిపి వేశాడు.

కాదంబరీ దర్శనం చేత ఆనందించినట్లుగా చంద్రాపీడుడు తన రాజ్యలక్ష్మిని చూచి ఆనందం పొందలేకపోయాడు. ఆ రాత్రంతా చంద్రాపీడుడు కాదంబరినే తలచుకొంటూ హృదయమంతా గందరగోళమౌతుండగా నిద్రలేకుండానే గడిపివేశాడు.



## 47. కేయూరకుడు చంద్రాపీడుని వద్దకు వచ్చుట

తెల్లవారింది. దినకృత్యాలన్నీ తీర్చుకొని చంద్రాపీడుడు పటకుటీరంలో కొలువు తీఱియుండగా ప్రతీహారితో కలిసి కేయూరకుడు వస్తూ కనిపించాడు. కేయూరకుడు అంత దూరంనుండే తలవంచి నమస్కరిస్తూ వచ్చి పాదాలపై వ్రాలి నమస్కరించాడు. చంద్రాపీడు డతనిని లేవనెత్తి రారమ్మని అతనిని దగ్గఱకు తీసుకొని ఆలింగనం చేసుకొన్నాడు. చంద్రాపీడుడు కేయూరకుని తన దగ్గఱలోనే కూర్చుండ బెట్టుకొన్నాడు. మందహాసామృతంతో తెల్లబడిన, ప్రేమద్రవంతో తడిసినట్లుగా, 'కేయూరక! సఖీపరివారసమేతురాలు కాదంబరి, మహాశ్వేతలు కుశలంగా ఉన్నారా!' అని అడిగాడు.

చంద్రాపీడుడు ప్రీతిపూర్వకంగా అలా అడుగగా కేయూరకుడు అతని ప్రీతిమయనేత్రకాంతితో తడిసినవాడైనాడు. దూర ప్రయాణ శ్రమ మొత్తం తొలగిపోయింది. అతడు చంద్రాపీడునికి నమస్కరించి ఆదరంతో, "రాజా! మీరడిగిన కాదంబరి కుశలమే' అని పలికి, వస్త్రాన్ని తొలగించాడు. తామరతూళ్ళతో బిగింపబడిన కులువ ఆకును విప్పాడు, ఆ పొట్లంలో కాదంబరి పంపిన కానుకను చూపించాడు రాజకుమారునికి, దాంట్లో పొట్టు తీయబడిన మువ్వల్లాగా స్వచ్ఛంగా ఉన్న, పాలు కారుతున్న లేత వక్కకాయలున్నై, ఆడు చిలుకయువతి కపోలాల్లాగా లేత వసుపురంగు కల లేత తమలపాకులున్నై, శివుని శిరస్సు మీదున్న చంద్రలేఖలాగా తెల్లని కర్పూరం కనబడుతోంది. అధికమైన కస్తూరీమిశ్రితమైన చందనద్రవం ఉంది.

కేయూరకుడు దానిని చంద్రాపీడునకు కానుకగా యిస్తూ, "కాదంబరి తన కోమలములైన చేతివ్రేళ్ళు శిరమున తాకుతుండగా అంజలి ఘటించి ప్రభువును అర్చిస్తూ, మహాశ్వేత భుజముల చుట్టూ చేతులుంచి కుశలప్రశ్నలు వేస్తూ, శిరోమణిప్రభలతో స్నానం చేసినట్లున్న ఫాలభాగంతో మదలేఖ, శిరస్సు భూమికానించి పాపిడియందున్న మకరికా కాంతులతో, సకల దాసీగణంతో పాదధూళి తమ తలలకు తాకునట్లుగా నమస్కరిస్తున్న తమాలిక వీరందఱూ

మిమ్ము అడుగమనినారు. ప్రత్యేకంగా మహాశ్వేత మీతో ఇలా చెప్పమని ఆదేశించింది –

"నిన్ను, నీ రూపాన్ని తమ హృదయాల్లో నుంచి దూరం చేసుకోలేని వారు ధన్యులే కదా! ఎదురుగుండా ఉన్నప్పుడు చంద్రకాంతిలాగా చల్లదనం వెదజల్లిన మీ సుగుణాలే ఇప్పుడు మీరు లేనప్పుడు ప్రచండసూర్యకిరణాల్లాగా వేడిమి ఎగజిమ్ముతున్నై. ఇక్కడి జనం మీరున్న నిన్నటిరోజున దైవం ప్రసాదించిన అమృతం కురిసినట్లుగా ఈ రోజుకూడా ఉండాలని మనసారా కోరుకొంటున్నారు. మీరు లేని కారణంగా మహానందం దూరమైనట్లు నిరాసక్తులై ఉన్నారు నగర రాజలోకం, అంతఃపుర స్త్రీలు. నేను సర్వం త్యజించిన సన్న్యాసినని నీకు తెలుసుగా కుమారా! అట్టి నాకు నీపై అకారణంగా ఇష్టం కలుగుతోంది నేనెంత వద్దనుకున్నా! నిన్ను చూడాలని అనిపిస్తోంది. ఇక కాదంబరిపరిస్థితి ఏంచెప్పను? ఆమె దీర్ఘకాలం నుంచి రోగగ్రస్తురాలి లాగా ఉంది. నిత్యం చిఱునవ్వులు చిందించే మన్మథసమానరూపుడి పైన నిన్నే తలుచుకొంటూంది. అందువల్ల నీవు ఇక్కడికి వచ్చి గుణాభిలాష కలిగిన దానినిగా కాదంబరిని చేస్తావని నమ్ముతున్నాను. ఉదారగుణుల యందు ఆదరం చూపటం గౌరవానికి అది హేతువౌతుంది కదా! మంచో, చెడో – నేనిలా నిన్ను కోరుకోవటం, ఇబ్బంది పెట్టడం క్షమిస్తావు కదూ! నేనిలా వెనుకముందు లాలోచించకుండా సందేశం పంపటానికి నీ మంచితనమే కారణం. ఇంకొక విషయం, ఇదిగో ఈ శేషరత్నం మీరు శయనంమీదే ఉంచి మఱచిపోయారు, తీసుకోండి" అని తన ఉత్తరీయం అంచున కట్టిన, తనకాంతుల్ని దారాల సందుల్లోంచి వెలికి ప్రసరింపజేస్తున్న ఆ రత్నాన్ని తీసి, చామరగ్రాహిణి చేతికిచ్చాడు.

అంతట చంద్రాపీడుడు, ''ఇదంతా నా గొప్పదనం కాదు. మహాశ్వేతపాదార్చనా ఫలితంగానే దాసజనునిగా ఉండదగిన నేను వారిదయకు పాత్రుణ్ణై ఏదో మహానుభావునిగా చూడబడుతున్నాను, 'దేవి కాదంబరి కూడా



నన్నలాగే చూస్తున్నది' అని పలుకుతూ ఆ మణిని తలపై అన్చుకొని, తానే ఆ నగను స్వీకరించాడు. ఆ నగను కాదంబరీ ప్రేమరసార్ద్రమైన దానినిగా భావిస్తూ తన మెడలో అలంకరించుకొన్నాడు. కాందబరి పంపిన తాంబూలాన్ని సేవించాడు, కొంచెం సేపుండి లేచాడు. ఎడమచేతితో కేయూరకుని భుజంపై ఆనుకొని, కొంతదూరంలో ఉన్న రాజసమూహాన్ని మర్యాదతో కూడిన చూపులతో గౌరవించి, వారిని వదలి బయటకు నడిచి, నెమ్మది నెమ్మదిగా 'గంధమాదనం' అనే పేరుగల ఏనుగును చూడటానికి వచ్చాడు. కొద్దిసేపు అచట ఉండి, దానికి తన చేత్తో పచ్చని లేత పచ్చికలు తినిపించాడు. అక్కడినుండి ఇష్టమైన అశ్వశాల వద్దకు వెళ్ళాడు.

అక్కడున్న రాజాభిప్రాయం తెలిసిన ప్రతీహారుల చేత సమస్త జనుల్ని అక్కడనుండి పంపివేశాడు. ఒక్క కేయూరకుని మాత్రమే తోడుగా తీసికొని అశ్వశాలలో ప్రవేశించాడు. అక్కడున్న అశ్వపాలకులు యువరాజును చూచి నమస్కరించాడు. దాని వీపుపై పరచబడిన వస్త్రం ఒకవైపుకు జారగా దానిని చంద్రాపీడుడు సరిచేశాడు. ముదురుకుంకుమ రంగుతో ఉన్న దాని మెడపై జూలును వ్రేళ్ళదువ్వి సరిచేశాడు. అశ్వశాలదూలంపై తన శరీరం బరువు వాల్చి నిలుచొని కుతూహలంతో, 'కేయూరకా! నేనక్కడనుంచి వచ్చిన దగ్గఱనుంచి గంధర్వకులంలో జరిగిన విశేషాలేమున్నై? కాదంబరి ఎలా కాలక్షేపం చేసింది? మహాశ్వేత ఏమి చేసింది? మదలేఖ ఏమన్నది? ఎవరెవరే మని అనుకొన్నారు నా గూర్చి? నేను వచ్చిన తర్వాత పరిజనులు కాని, నీవు కాని ఏంచేశారు? నాగూర్చిన ముచ్చటలు అక్కడ ఏమైనా జరిగినాయా! అని అడిగాడు.

కేయూరకుడు సమగ్రంగా సమాధానం చెప్పాడు. "ప్రభూ! వినండి! మీరు వెళ్ళిపోయిన దగ్గర నుంచి కాదంబరి గుండెలలో వెయ్యికి పైగా ప్రయాణ భేరీలు మ్రోగినంత ఆందోళన మొదలైంది. కాలి అందెలు మాఱ్మోగేటట్లుగా అంతఃపురమంతా కలియదొక్కి చిందులు వేసింది, సౌధాగ్రభాగం ఎక్కి అక్కడి

నుండి ప్రభువులు ప్రయాణించినవైపు చూసింది. కేవలం గుఱ్ఱాల కాలిడెక్కల చేత లేవగొట్టబడిన ధూళిమాత్రమే ఆమె చూడగలిగింది. ప్రభువుల వారు కంటికి కనబడకపోగా మదలేఖ భుజంపై తన ముఖం ఆనించి కాదంబరి తన చల్లని తెల్లని దృష్టులు సారిస్తూ ప్రీతితో చూస్తూ అక్కడే చాలా సేపు గడిపింది. తెల్లని గొడుగు అడ్డంగా పెట్టి చంద్రబింబం రవికిరణాలను ఇష్టపడక నివారిస్తున్నట్టుగా నటిస్తూ అక్కడనే ఉంది. కొంత సేపటికి ఇష్టం లేకున్నా మేడనించి దిగింది. ఆమె విరహత్వరతో దేవరవారి గుణగణాలని మనస్సులో ధ్యానిస్తూ, అదే, మీరు ఎక్కి తిరిగిన క్రీడా పర్వతం మీదనే, మీరు కూర్చున్న ప్రదేశమందే తానూ కూర్చున్నది, ఆ క్రీడాపర్వతాన్ని సమీపించి, "మీ హృదయవల్లభుడు మరకతమణుల శిలయందు చెక్కిన మొసలినోటి నుండి స్రవించుజలాలతో తడపబడుచున్న లతామండపంలో తుంపురులు పడుతున్న ఇక్కడ శయనించాడు. ఇక్కడున్న గంధోదకపు వాసనలకు ఆకర్షింపబడి ఆ ప్రాంతంలో మూగిన తుమ్మెదలుగల స్నానశాలలో స్నానం చేశాడు మా ప్రాణవిభుడు. మా హృదయచోరుడు సుమపరాగంచేత దుమ్ముగా ఉన్న పర్వత నది ఇసుకలపై శూలపాణిని అర్చించాడు. చంద్రకాంతిని సిగ్గు పఱచే మణిగృహంలో భుజించాడు. ఆయన చందనపు పూతల గుర్తులుగల ముత్యాల శైలశిలావేదికమీద నిదురించాడు' అంటూ చెలికత్తెలు మరల మరల చెపుతూ ఉండగా ప్రభువులు నిర్వహించిన క్రియలను తలచుకొంటూ కాదంబరి ఆ పగలంతా అలాగే తిరిగింది. ఇంతకంటె మీ పై ఆమెకు గల ప్రేమను కొలతలు వేసి ఎవరు చెప్పగలరు?

రాత్రి మొదటి కాలంలోనే తనకు ఇష్టంలేకున్నా మహాశ్వేత బలవంతంచేత ఆ స్ఫటికశిలాభవనంలోనే తానుకూడా భుజించింది. చంద్రోదయం అయింది. అక్కడే కొంతసేపు గడిపింది. చంద్రోదయమైతే ఆ చంద్రుడు తనబుగ్గలపై ప్రతిబింబిస్తాడేమో అని చేతులతో బుగ్గలను కప్పుకొని, ఏదో ఆలోచిస్తూ కనులు మూసుకొని కొద్దిసేపుండి మరల లేచి, తెల్లని గోళ్ళపై చంద్ర బింబాలు



ప్రతిఫలిస్తే ఆ బరువుకి నెమ్మది నెమ్మదిగా పాదాలు ఎత్తివేస్తూ నడుస్తూ ఎలాగో శయ్యామందిరానికి చేరుకొంది కాదంబరి. ఆమె తన శరీరాన్ని శయనం మీద పడవేసింది. బాగా తలనొప్పి కలిగింది. మదనజ్వరంచేత పీడితురాలయింది. మానసిక బాధతో వియోగంతో చక్రవాకాంగన వలెనే తాను కూడా ఆ రాత్రంతా నిద్రపోకుండానే గడిపివేసింది. తెల్లవారుతుండగానే నన్ను పిలిచి మీ గూర్చి నిందాపూర్వకంగా ఇలా వెళ్ళమని ఆదేశించింది" అని

## 48. చంద్రాపీడుడు కాదంబరీ దర్శనంకోసం మరల వెళ్ళుట

కేయూరకుని మాటలు విన్న యువరాజు వెంటనే హేమకూటానికి బయల్దేరాలని లేచాడు. "నా గుఱ్ఱం ఎక్కడ?" అంటూ గుడారంలోనించి బయటకు వచ్చాడు. జీనులు, కళ్ళాలు బిగించిన ఇంద్రాయుధం ఎక్కాడు. వెనుక పత్రలేఖను ఎక్కించుకొన్నాడు. వైశంపాయనుణ్ణి సైన్య శిబిరాన్ని చూడ నియమించాడు. ఎవ్వరినీ తనతో రావటానికి అనుమతింపరాదు, కేయూరకునితో పాటు బయలు దేరాడు. అలా బయలుదేరి హేమకూటానికి చేరాడు. కాదంబరీ భవనద్వారానికి చేరుకొన్నాడు. గుఱ్ఱాన్ని ద్వారపాలకునికి అప్పగించి, కాదంబరిని ఎప్పుడెప్పుడు చూస్తానా అని ఉవ్విళ్ళూరుతున్న పత్రలేఖతో కూడి భవనంలో ప్రవేశించాడు. కాదంబరీదేవి ఎక్కడున్నారు? అని సమీపంలోకి వచ్చిన కంచుకిని ప్రశ్నించాడు. అతడు వందనం చేసి, "దేవా! మత్తెక్కిన నెమళ్ళు విహరించే క్రీడాపర్వతం క్రిందనున్న కమల వనపు దిగుడు బావిప్రక్కనున్న హిమగృహంలో ఉన్నారు" అని చెప్పాడు. కేయూరకుడు ముందు దారి చూపుతుండగా ప్రమదవనం మధ్యగా కొంత దూరం వెళ్ళి అరటితోటను చూచాడు. అది దట్టంగా ఉండటం చేత చీకటి అలుముకొన్నట్టుగా ఉంది. దాని మధ్యలో సర్వదా కమలదళాలతో కప్పబడిన హిమగృహాన్ని చూశాడు చంద్రాపీడుడు.

అక్కడి దాసీలు కదళీ పత్రాలతో గాలి వీస్తున్నారు కాదంబరికి ఆమె బాహువులకు తెల్లని మెత్తని కలువకాడలు ఆభరణాల లాగా చుట్టారు. తెల్లని మొగలి రేకులతో చేయబడిన ఆభరణాలు చెవులకు పోగులుగా అమర్చారు. అది దంతపత్ర సౌందర్యాన్ని మించిపోయింది. నుదురుపైన తెల్లని చల్లని గంధాన్ని పూసుకొంది, బుగ్గలకు కూడా చందనము పూయటంచేత పట్టపగలే చంద్రునిలాగా కనపడింది కాదంబరి ముఖం. దిరిసెన పుష్పసౌందర్యాన్ని మించిన సౌందర్యంకల నాచుతో కట్టిన మాలికిలను ఆమె చెవులకు చుట్టారు. కర్పూర ధూళితో మిశ్రితమైన వకుళ పుష్పమాలికలు గుండెల నిండా పేర్చి వాటిపై చల్లని తామరపత్రాలు కప్పినారు. ఆమెకు ఎండతగలకుండా కమలాలు, కలువలు, ఉత్పలాలతో, చిగురుటాకులతో అరటి ఆకులతో, పద్మ పత్రాలతో గొడుగు తయారు చేసి ఆమెకు అడ్డుగా పట్టుకొన్నారు.

ఆమెకు శైత్యోపచారాలు జరుగుతున్నై. ఆ హిమగృహం హిమవంతుని హృదయంలాగా, వరుణదేవుని జలక్రీడా గృహంలాగా చల్లగా ఉంది.

చంద్రుని కళలన్నీ అక్కడే పుట్టినంత శీతలంగా ఉంది. సర్వచందన వనదేవతలనివాస గృహంలా ఉంది. చంద్రకాంతమణులన్నీ ఇక్కడే పుట్టాయా అన్నట్టుగా ఉంది. వర్షాకాలాలన్నింటికీ సంకేతస్థానమా అన్నట్టుగా ఉంది. ఆ హిమగృహంలో ఒకచోట సఖీ సమూహం చుట్టూ చేరి ఉన్నారు కాదంబరి దగ్గఱ. ఇతర చిన్న ప్రవాహాలతో కూడిన గంగానదిలా ఉన్నదామె. కర్పూర జలం చల్లిన, కలువపూలు, కాడలు నిండుగా పఱచబడిన, పూలతో నింపబడిన శయ్యమీద పవళించి ఉన్నది కాదంబరి. మన్మథుడు అందగత్తెయైన కాదంబరిపై ఈర్ష్యచేత కలువకాడలతో కట్టివేసినట్లుగా మెడలో హారాలు, చేతులకు అలంకారాలతో విరాజిల్లుతూ ఉంది. కాదంబరి రకరకాల మదనావస్థలు పొందుతూ కూడా దేవతలతో పట్టుకొన బడిన దానిలాగా ప్రకాశిస్తోంది. తలపై నున్న పుష్పమాలికలపై వ్రాలీ తుమ్మెదలు ఆమెపై జాలిపడి వాటి ఱెక్కలతో గాలి వీస్తున్నట్టుగా ఉంది. ఆ తుమ్మెదల మ్రోత అగ్నిలాగా చెవులను



కాలుస్తూ ఉండగా నేత్రాల అంచుల నుండి కారిన కన్నీరు ఆ అగ్నిని ఆర్పుతున్నట్టుగా ఉంది. లోపలి మదన తాపాన్ని తట్టుకోలేక కాదంబరి తన సమీపంలో ఉన్న చల్లని హిమ బిందువులతో కూడిన రత్నపు బొమ్మను మాటిమాటికి కౌగిలించుకొంటూ ఉంది. కాదంబరి మాటి మాటికి కర్పూరముతో చేయబడిన బొమ్మకు తన చెక్కిలి ఆనిస్తోంది.

చంద్రాపీడుడు ఆ ప్రదేశమంతా కలయ చూస్తూ వస్తున్నాడు. కాదంబరి చంద్రాపీడుని ఆగమనం గూర్చి తెలుపుతున్న పరిచారికను పెద్దకళ్ళతో చూస్తూ, "ఏమే చెలీ! చెప్పవే! అతడు నిజంగానే వచ్చాడా? నువ్వు చూశావా? అతడు ఎంత దూరంలో ఉన్నాడు? ఎలా ఉన్నాడు త్వరగా చెప్పు" అని అడుగుతుండగా చంద్రాపీడుడు చూశాడు, విన్నాడు. ఇంతలో కొంత దూరం నుండి తన వైపుకు వస్తున్న చంద్రాపీడుని చూసిందామె. ఆమెకు ఏం చెయ్యాలో తోచలేదు. పుష్ప సుగంధానికి ఆకర్షింపబడి మ్రోగుతున్న తుమ్మెదలతో తనను తాను కప్పుకోవాలని చూస్తోంది. ఆ తొందపాటుతో ఉత్తరీయం జారిపోగా ఆభరణకిరణాలను ఉత్తరీయంగా కప్పుకో చూస్తోంది. జాఱిపోయిన కేశపాశాన్ని మరల బంధించుకొంది. వెంటనే పూల శయ్యపై నుండి లేచింది.

చంద్రాపీడుడు ఆమెను సమీపించి ఎప్పటిలాగా వినయంగా ముందు మహాశ్వేతకు నమస్కరించాడు, మహాశ్వేత కూడా చంద్రాపీడునికి ప్రతినమస్కారం చేసింది. తాను మరల పుష్పశయ్యపై కూర్చొన్నది.

తర్వాత చెలికత్తెలు బంగారు కాళ్ళు కలిగిన వేత్రా సనాన్ని చంద్రాపీడునకు తెచ్చివేశారు. కాని చంద్రాపీడుడు దానిని కాలితోనే సున్నితంగా ప్రక్కకు నెట్టి తాను మాత్రం నేలపైనే కూర్చొన్నాడు.

అంతలో కేయూరకుడు, "దేవీ! ఈమె ప్రభువుల వారి దయాపాత్రురాలు, వారి తాంబూలకరండవాహిని, ఈమె పేరు పత్రలేఖ" అని కాదంబరికి ఆమెను పరిచయం చేశాడు. కాదంబరి ఆమెను చూసి, "ఆహా! ఈ బ్రహ్మకు మనుష్య

స్త్రీలయందెంత పక్షపాత బుద్ధి? అని విస్మితురాలైంది. ఆ పత్రలేఖ కాదంబరికి వినయంగా నమస్కరించింది. కాదంబరి ఆమెను ఆదరపూర్వకంగా 'రారమ్మని' దగ్గఱకు తీసికొని, అచ్చటి వారందఱూ కుతూహలంతో చూడగా ఆమెను తన సమీపంలోనే కూర్చొనబెట్టుకొంది. ఆమెను చూచిన దగ్గఱనుండి కాదంబరికి ఎక్కడలేని మనఃప్రీతి కలిగింది. అక్కడివారు చంద్రాపీడునకు అతిథి మర్యాదలు కావించారు. చంద్రాపీడునకు కాదంబరి స్థితిచూచిన తర్వాత మనస్సులో ఇలా అనిపించింది. "ఈమె పడే ఈ బాధకు నేనేగదా! కారణము. అయినా నేను పట్టించుకోలేక పోతున్నాను. సరే, కానీ – ఆమెనే అడుగుదాం" అనుకొని చతురతో ఇలా అన్నాడు.

"ఓ దేవీ! మీకేదో అయిష్టత చేత బలీయమైన అనారోగ్యము సంభవించిందని తెలిసింది. కాని, నేను చెప్పేది నిజం. ఆ వ్యాధి మీకంటె నన్నే ఎక్కువగా బాధిస్తోంది. మీకు స్వస్థత చేకూఱటానికి అవసరమైతే నా ప్రాణాల నిమ్మన్నా ఇస్తాను. మదనతాపంచేత పీడింపబడి కృశించిన మీ చేతులు అంగదములు లేకపోవటం చేత తామరతూడుల వలె ఉన్నవి. చూపులు ఎఱ్ఱతామర రేకులవలె ఉన్నవి. మీరు దుఃఖిస్తుంటే మీ పరిజనులు కూడా దుఃఖపడుతూ ఉన్నారు. దేహంమీద ముత్యాలహారాలు ధరించండి. మీకు తగిన ఆభరణాలు అలంకరించుకోండి. లత శోభించేది పుష్పాలతోనూ, తుమ్మెదలతోనే కదా!' అని

ఈ మాటలు విన్న కాదంబరి ఎంతలేతవయస్సులో ఉన్నా ఎంతముగ్ధ ఐనా చంద్రాపీడుని మనస్సులోని అభిప్రాయాన్ని గ్రహింపగలిగింది, కాని పైకి ఏమీ మాట్లాడకుండా ఉన్నది. అతని వైపొకసారి చూసి, మధురమందహాసం చేసింది. అప్పుడు మదలేఖ ఇలా అంది – "కుమారా! ఏమని చెప్పేది? ఈ సంతాపం కేవలం మాటలతో వర్ణించితే అర్థమయ్యేది కాదు. రాకుమారునికి సంబంధించిన ప్రతి విషయం సంతాపాన్ని కలిగించేదిగానే ఉన్నది. ఎలాగంటే – చల్లని తామర చిగురాకు కూడా



అగ్నిలాగా దహిస్తోంది. వెన్నెల సహితం మండుటెండలాగా ఉంది. చిగుఱుటాకుల్తో చేసిన వీవనకూడా మనస్సులో మిక్కిలి అధికమైన బాధనే కలిగిస్తోంది. మీరు చూస్తూనే ఉన్నారు కదా! మాచెలి ఇంకా ధైర్యవంతురాలు కనుక ఇప్పటి ప్రాణాలు నిలుపుకో గలిగింది."

ఆ మదలేఖ మాటలను పైకి కాకపోయినా మనస్సులోనే సమర్థించింది కాదంబరి. అదే ఆమె సమాధానం అన్నట్లుగా చూసింది. చంద్రాపీడునికి మాత్రం ఆమె మాటలు అతని సందేహాన్ని నివారింపలేక పోయాయి. ఇంతకూ కాదంబరి తనను ప్రేమిస్తున్నట్లా లేనట్లా తేల్చుకోలేకపోయాడు. యువరాజు కాదంబరితో ప్రీతితో చాలా సేపు ఉపచార వాక్యాలు పలికి, ఇక స్కంధావారం వెళ్ళటానికి కాదంబరి నివాసభవనం నుండి బయలుదేరాడు.

## 49. ఉజ్జయిని నుండి వార్తాహరులు వచ్చుట

చంద్రాపీడుడు గుఱ్ఱం ఎక్కబోయేంతలో వెనుకనుండి కేయూరకుడు, "దేవా! మదలేఖ తమకు ఇట్లు విన్నపము చేయుమన్నది'. కాదంబరీదేవి ప్రథమదర్శనంలోనే పత్రలేఖను మిగుల ఇష్టపడుతోంది. ఆమెను తిప్పి పంపగోరుచున్నది, తరువాత పంపుతాము' అని అన్నది. ఇక ఆపై దేవరవారి ఇష్టము" అన్నాడు. అది విని చంద్రాపీడుడు", కేయూరకా! మా పత్రలేఖ అదృష్టవంతురాలు. గట్టిస్నేహబంధంతో దేవి కాదంబరి అనుగ్రహం పొందింది. సరే అలాగే తీసుకొని వెళ్ళు" అని అనుమతించి మరల సైన్యశిబిరం దిశగా ప్రయాణం ప్రారంభించాడు.

చంద్రాపీడుడు సైన్యశిబిరం చేరుతూ ఉండగానే ఉజ్జయిని నుండి తండ్రిగారు పంపగా వచ్చిన వార్తాహరుని చూశాడు. గుర్తించాడు. గుఱ్ఱం పైనుండియే దూరం నుంచే అతనిని చూసి, "ఓయీ! ఇంటివద్ద తండ్రిగారు కుశలమేనా? పరిజనులు క్షేమమేనా? మా అమ్మగారు, అంతఃపురస్త్రీలు అంతా బాగున్నారా?" అని అడిగాడు.

అంతడు వార్తాహరుడు యువరాజ సమీపానికి వచ్చి, "దేవా! అంతా తామన్నట్లే సుఖమే!" అని పలికి రెండు లేఖలను ఇచ్చాడు. యువరాజు తండ్రి ఆజ్ఞనువలె లేఖలను శిరమున కానించి తనే వాటిని విడదీసి, "స్వస్తి – ఉజ్జయినీ నగరం నుండి – సకలరాజుల మస్తకముల చేత అలంకరింపబడిన పాదపద్మములు కలవాడు, పరమమాహేశ్వరుడు, మహారాజాధిరాజు తారాపీడ ప్రభువు – సర్వ సంపదలకునిలయుడు, ధగధగలాడుతున్న చూడామణి కాంతులతో నిండిన చంద్రాపీడుని శిరమును ముద్దిడుకొని ఆనందిస్తూ వ్రాయు లేఖాంశాలు. ఇక్కడ సర్వ ప్రజలు కుశలురు. నిన్ను చూసి ఎంతకాలమైందో! నిన్ను చూడాలని మా హృదయాలు ఉత్కంఠితమౌతున్నై, నీ తల్లి, అంతఃపుర స్త్రీజనులు అందఱు దిగులుపడి ఉన్నారు. ఈ లేఖ ముగియటం, నీ ప్రయాణం ప్రారంభించటం ఒకేసారి జరిగిపోవాలి" అని పైకి చదివాడు.

రెండవలేఖ మహామంత్రి శుకనాసుల వారిచే పంపబడినది. అది కూడా మొదటి లేఖలోని సారాంశమే ఉన్నది. ఇంతలో వైశంపాయనుడు అక్కడికి వచ్చి, రెండు లేఖల్ని చదివాడు. రెండింటిలో సారాంశం ఒకటే. చంద్రాపీడుడు ఉన్నపళాన బయల్దేరి ఉజ్జయిని రావాలి – అని తరువాత," సరే తండ్రిగారి ఆజ్ఞానుసారమే చేద్దాం' అని పలికి, తన ఇంద్రాయుధాన్నెక్కి ప్రయాణ భేరీని మ్రోగింపజేశాడు. తనకు దగ్గఱలో నుంచొన్న మహాసైన్యాధ్యక్షుడు బలాహకుని పుత్రుడు మేఘనాథుని ఇలా ఆజ్ఞాపించాడు చంద్రాపీడుడు–

"నువ్వు పత్రలేఖను వెంట పెట్టుకొని రా. ఆమె కేయూరకునితో కలసి హేమకూటం నుంచి ఇక్కడికి వస్తుంది. నీవు కేయూరకునితో ఇలా చెప్పు కాదంబరికి తెల్పమని – మా పత్రలేఖ ఒక సామాన్య మానవకాంత. అయినా కాదంబరీ దేవి ఆమెపై మిక్కిలి ప్రేమవాత్సల్యాలు కురిపించింది. మీరు మాపై చూపు కరుణ అంతులేనిది. దానికి తగినట్టు నేను మీ ఎడల నడవలేకున్నందుకు సిగ్గుపడుతున్నాను. మీ బాధలకు మిమ్ము వదలి ఇలా ఇంటికి వెళ్ళవలసి వస్తోంది. తప్పని పరిస్థితి నేనేం చేయను? పెద్దల మాట తీసివేయరానిది



గదా! నా హృదయంలో హేమకూటనివాసాభిలాష ఉంది. కాని నాకామె సేవచేసుకొనే భాగ్యం లేకపోయింది. అయితే, ఎప్పుడైనా ప్రసంగవశాత్తు నాపేరు గుర్తు చేసుకొంటారు కదూ! జీవించి ఉండి కూడా కాదంబరీదేవి చరణసేవానందాన్ని అనుభవించకుండా ఉన్నాడీ చంద్రాపీడుడని నన్ను కృతఘ్నునిగా భావింపవలదని ప్రార్థిస్తున్నాను. మహాశ్వేతాదేవికి ప్రదక్షిణ పూర్వకంగా పాదాభివందనం చే(యాల్సి ఉంది) శానని చెప్పు. మదలేఖకు ప్రణామపూర్వక ఆలింగనం అని చెప్పు. తమాలికను గాఢాలింగనం చేసుకొన్నానని తెలియ జెయ్యి. కాదంబరి పరిచారికలకు నమస్కార పూర్వక కుశలం అడిగినట్లు నా మాటగా చెప్పు. దేవతాస్వరూపుడైన హేమకూట పర్వతుని కుశలమడిగినట్లు తెలియజెయ్యి" అని తన సందేశాన్ని వినిపించాడు. సైన్యం అంతా నిదానంగా వెనక రావాలన్నాడు.

## 50. చంద్రాపీడుడు ఉజ్జయినికి ప్రయాణం చేయుట

అటుపైన వైశంపాయనుణ్ణి పిలిచి స్కంధావారాన్ని జాగ్రత్తగా కాపాడమని కోరాడు. చంద్రాపీడుడు ఇంద్రాయుధం ఎక్కి కొంతమంది ఆశ్విక సైన్యంతో బయల్దేరాడు. ప్రయాణ సంతోషంతో గుఱ్ఱాలు ఆనందంతో సకిలించాయి. గుఱ్ఱపుడెక్కల తొక్కిడికి భూమి నలిగిపోయింది. వాటి పాదాల తొక్కిడికి పొదలు తీగలు నలిగి నాశనమై పోయాయి. లేఖాహారకుణ్ణి మరల మరల మార్గం అడుగుతూ ప్రయాణించాడు. వారు ప్రయాణించే అరణ్యంలోని వృక్షాలు పెద్ద కాండాలు గలవి. మాలినీతీగలతో దట్టంగా అల్లుకొనబడి పందిళ్ళవలె ఉన్న చెట్లతో కూడింది. అడవి ఏనుగులు చెట్లను మార్గానికి అడ్డంగా పడవేయటం చేత మార్గాలు కూడా వంకర తిరిగిపోతున్నాయి. మార్గంలో కొన్నిచోట్ల మహావీరులు మృతిచెందిన ప్రదేశాలలో వారి స్మృతిచిహ్నాలుగా నెలకొల్పబడిన గడ్డి బొమ్మలున్నాయి. మహావృక్షాల మొదళ్ళు అడ్డంగా వ్యాపించటం వల్ల నడవ వీలుకానివిగా ఆ ప్రదేశాలున్నై. బాట సారులు దాహశాంతికోసం అక్కడి ఉసిరిక చెట్లనుండి కొమ్మలు విఱిచి తిన్నన్ని తిని

మిగిలిన కాయలు అక్కడ పడవేసి పోయారు. గానుగు పూలపొడి ఆ ప్రాంతాల వ్యాపించి ఉంది. ఆ ప్రాంతాల్లో దిగుడుబావి ఉన్నదని తోటివారికి తెలియటానికి గుర్తుగా చెట్టు కొమ్మలకు పాత గుడ్డలు కట్టారు. దొంగలు అక్కడక్కడ ఇటుకలు, వాడిపోయిన చిగుఋటాకులు ఆ ప్రాంతంలో బాట సారులు పడుకొని వెళ్ళినట్లు తెలియజేస్తున్నై. ఎండుటాకులు, దుమ్ము దిగుడు బావులలో పడటం చేత ఆనీరు కలుషితమై చెడువాసనతో, బురదతో త్రాగే వీలు లేకుండా ఉంది. కొన్ని చోట్ల ఇసుకలో ఎంతలోతు త్రవ్వినా కొద్దిగానైనా నీరు పడని గుంటలు కనబడినై.

కొంత దూరం ప్రయాణింపగా చంద్రాపీడునికి రక్తధ్వజం కనపడింది. కొంచెం విశాలంగా ఉన్న ప్రాంతంలో రక్తచందన వృక్షాగ్రాన కట్టబడింది ఆ ధ్వజం. రక్తపు ముద్దల్లాగా ఉన్న లత్తుకపుష్ప మంజరుల చేత నెత్తురు పూసినట్టుగా ఉంది. ఆ ధ్వజానికి ఎఱ్ఱని జెండా ఎగురుతోంది. అది సన్నని నాలుక బయటకు చాపినట్టుగా ఉంది. అక్కడ ఒక నల్లని చామరం తలక్రిందులుగా వ్రేలాడుతూ, అక్కడ చంపబడిన జంతువుల అవయవాలను తొలగించటానికి ఉపయోగపడే చీపురుకట్టలాగా ఉన్నది. ఆ ధ్వజానికి లావైన గవ్వలు గుత్తులుగా, అర్ధచంద్రాకారంలో అలంకారంగా కట్టారు. సూర్యభగవానుడు తన కుమారుడైన యముని దున్నపోతును కూడా బలి ఇస్తారేమో అనే భయంతో, దాన్ని కాపాడటానికి తనతోపాటుగా చంద్రుని కూడా తోడుగా తెచ్చాడేమో అనిపిస్తోంది ఆ చంద్రఖండం. ఆ రక్తధ్వజంపై భాగాన వ్రేలాడుతున్న గొలుసులకు కట్టబడిన గంటయొక్క భయంకర ధ్వని వినవస్తోంది. చక్కగా కూర్చబడిన చామరము సింహపు జూలులాగా మనోహరంగా కానవస్తోంది. ధ్వజంపై భాగాన బంగారపు త్రిశూలం ఆకాశం వంక చూస్తోంది. ఆ రక్తధ్వజం అటు ఇటు వ్యాపించిన రహదారులలో నడచువారిని గమనిస్తున్నట్టుగా ఎత్తుగా ఉంది.

ఆ రక్తధ్వజానికి కొంతదూరంలో భయంకరంగా చండికావిగ్రహం కనబడుతోంది. మొగలి రేకులతో కూర్చినట్లున్న ఏనుగు దంతాలతో తయారైన



సింహద్వారం ఉంది. ఇనుపతోరణంతోనూ ఎఱ్ఱని చామరాలతోనూ ఆ ద్వారం ప్రకాశిస్తోంది. ఆ ద్వారం నల్లని శబరయువతి ముఖంలాగానూ, ఎఱ్ఱని కేశపాశాలతోనూ సమానంగా ఉంది. చండికాదేవికి ఎదురుగా నల్లఱాతితో నిర్మించిన వేదికపై లోహంతో చేసిన దున్నపోతు విగ్రహం ఉంది. దానిపై ఎఱ్ఱచందనం హస్తముద్రలున్నై. ఆ హస్తముద్రలు యమధర్మరాజు తన వాహనాన్ని అఱచేత్తో చరిస్తే పడ్డాయనిపిస్తుంది. ఆ దున్నయొక్క నేత్రాలు ఎఱ్ఱగా భయంకరంగా ప్రకాశిస్తున్నై. ఆ కళ్ళను చూసి ఆడు నక్కలు నెత్తుటి చుక్కలని భ్రమపడి నాలుకలతో నాకుతున్నాయి.

ఆ ప్రాంతంలో ఎఱ్ఱతామరలు అక్కడక్కడా పడి ఉన్నాయి. అవి శబరుల చేత చంపబడిన అడవిదున్నల నుండి పెరికి వేయబడిన కన్నుల వలె కన్పిస్తున్నై. అవిసెపూల మొగ్గలు, అప్పుడే ఏనుగు కుంభస్థలాన్ని పగలగొట్టిన సింహపురక్త సిక్తమైన గోళ్ళలాగా ఉన్నై. కొన్నిచోట్ల మోదుగు మొగ్గలు జంతువులను వేటాడి చంపిన పెద్దపులి గోళ్ళలాగా కనిపిస్తున్నై. కొన్ని ప్రాంతాల్లో అడవి కుక్కలకు భయపడి రక్తాశోక వృక్షాలు ఎక్కి కొమ్మల మధ్యలో దాక్కున్న కోళ్ళు, అకాలంలో పూసిన పూలగుత్తుల్లా కనపడుతూ ఉన్నాయి. కొన్నిచోట్ల బాగా పండిన తాడి చెట్లున్నై. అవి రక్తపానం రుచి మరిగిన బేతాలుల వలెను, తాటిపండ్లు వారి తలల్లాగానూ కానవస్తున్నై. పశుసంహారం చూచి భయపడి వణికేవారిలా అరటిచెట్లు ఊగులాడుతున్నై. భయంతో ఒళ్ళు గగుర్పొచినట్లున్న మారేడుచెట్లు ముళ్ళతో కూడి ఉన్నై. ఆ భయం చేతనే తలవెంట్రుకలు నిక్క బొడిచినట్లుగా ఖర్జూరపు చెట్లు కనబడుతున్నై. అక్కడ సింహాలు మదపుటేనుగుల కుంభస్థలాలు పగుల గొట్టగా నెత్తురుతో తడిసిన ముత్యాలు తలలో నుంచి జాఱిపడినై. వాటిని అక్కడున్న కోళ్ళు ముక్కులతో పొడిచి వదిలివేశాయి. ఆ ఎఱ్ఱనిరంగులో ఉన్నముత్యాలను చూసి అల్లరి సింహం పిల్లలు (అంబికకు ముద్దుబిడ్డల వంటి వారు కావున) వాటిని అటు ఇటు కాళ్ళతో తన్నుతూ ఆడుకొంటున్నై.

ఆ కాళికా దేవాలయ ప్రాంగణంలో రక్తం మడుగులు కనిపిస్తున్నై. అంతటి రక్తాన్ని చూసి సూర్యుడు భయపడి ఆకాశం నుండి క్రిందపడ్డాడా అన్నట్టుగా

ఆ మడుగుల్లో సూర్యబింబం ప్రతిఫలిస్తోంది. అక్కడ చాలా దీపాలు జాజ్జ్వల్యమానంగా వెలుగుతున్నై. వాటి పొగలు వస్త్రాలపై కమ్మి ఎఱ్ఱబారినై. ఆ ఆలయంలో జంతుబలికోసం పెద్ద పెద్ద ఖడ్గాలు, గొడ్డళ్ళవంటివి వ్రేలాడుతున్నై. వాటిపై నల్లనిచామరాలు ప్రతిఫలిస్తున్నై. బలి చేసేటప్పుడు జంతువుల మెడలు నఱికినప్పుడు వాటి వెంట్రుకలు అంటుకున్నట్లుగా ఉన్నై. నల్లని చామరాల కాంతివల్ల అంధకారం వ్యాపించటం చేత ఆ కాళికాదేవి పాతాళలోక నివాసినియేమో అనిపిస్తోంది. కాళీదేవి మెడలో మారేడు మండలతో కూర్చిన దండ వ్రేలాడుతోంది. మారేడు కాయలకు చిగుళ్ళకు రక్తచందనం రాచారు. అందుచేత ఆ దండ పసి బాలుర తలలతో కూర్చిన దానిలాగా కనపడుతోంది. ఆమె శరీరం మీద రక్తంతో తడిసిన కదంబ పూల గుత్తులతో అలంకరింపబడి మిక్కిలి భయంకరంగా ఉంది. బంగారు పట్టికతో అలంకరింపబడిన కాళికాదేవి ముఖంపై శబరస్త్రీలు సింధూరపు తిలకం దిద్దారు. ఆమె చెవికి దానిమ్మపూవున్న రెమ్మను అలంకారంగా పెట్టారు. ఆ దానిమ్మపువ్వు కాంతిచేత కాళీమాత చెక్కిళ్లు ఎఱ్ఱబడినై. వంకర తిరిగిన ఒత్తైన కనుబొమలున్నై. ఆమె కనులు ఎఱ్ఱగా రక్తంలా ఉన్నై. ఎఱ్ఱని కుసుంభ పుష్పమాలికలు ధరించటంచేత ఆమె కట్టిన పట్టువస్త్రం ఎఱ్ఱదనంతో శోభిస్తూ ఉంది. ఆ కాళికాదేవి శివుని చేరుటకు అభిసారిక వేషం ధరించినట్టుగా ఉంది. అచట గల అడవి మేకలు బారైన వెంట్రుకలతో కూడిన గడ్డాలతో నిశ్చలంగా నిలచి, తపోనిష్ఠులైన మునులలాగా కనబడుతున్నై. కలుగులలోని ఎలుకలు మాటిమాటికి మూతులు కదలుస్తూ ఏమో మంత్రాలు వల్లిస్తున్న మునుల్లాగా ఉన్నై. నల్లని త్రాచు పాములు తలలపై రత్నములు ధరించినవై కాళీదేవికి మంగళ హారతులిస్తున్నట్టున్నై. కాకులు మందలుగా కూడి కఠోరంగా అరుస్తుంటే మహాకాళీస్తోత్రాలు చదువుతున్నట్టుగా ఉంది.

## 51. ద్రవిడ ధార్మికుని వర్ణనం

అలా విరాజిల్లుతున్న కాళీమందిరాన్నే నివాసంగా చేసుకొని, ఆమె అనుగ్రహంకోసం పూజలు చేస్తున్న ఒక ద్రవిడ ధార్మికుడు అక్కడ కనిపించాడు.



అతని దేహమంతా నరాలు తేలి ఉంది. కొన్నిచోట్ల ఉడుములు, తొండలు ఉన్నట్లు నరాలు లావుగా ఉన్నై. నిధులకోసం త్రవ్విన గోతుల్లాగా అక్కడక్కడా రంధ్రాలు కనబడుతున్నై. అవి స్ఫోటకంవల్ల వచ్చిన గుంటలు. అతని శరీరంలో శుచి శుభ్రత మచ్చుకైనా కానరాదు. కాళీదేవి దయకోసం నమస్కరిస్తూ మాటిమాటికి నుదుఱు కాళీదేవి పాదాలకు కొట్టుకోవటం చేత నుదుటి పైన నల్లటి బొబ్బ లావుగా కన్పడుతోంది. అసత్య సిద్ధుడిచ్చిన అంజనాన్ని బాగా పట్టించటం చేత ఒక కన్ను కాయకాసి పోయి సగం గుడ్డి వాడైనాడు. మూడు పూటలా రెండవ కంటికి కూడా అంజనం పెట్టి పెట్టి పుల్ల కూడా నున్న బడిపోయింది. వాతరోగనివారణకై కాల్చిన ఇటుకతో కాల్చి వైద్యం చేసుకొంటూ అవసరంలేని చోట శరీర భాగాలు కాల్చు కొన్నవాడు ఆ ద్రావిడ ధార్మికుడు. అందుచేత ఒక భుజం వాతంవల్ల సన్నబడగా దానికి ఏదో తైలం రాచి ఎప్పుడూ రుద్దుకొంటూ ఉంటాడు. కన్నుచూపు బాగుపడటం కోసం కళ్ళల్లో ఏదో మందుతో తడిపిన వత్తులు వేసుకోవటం చేత పగలే కండ్లుకాననివాడు. పట్టుపురుగుల గూళ్ళను కాలితో తన్ని నందువల్ల కాలి వ్రేళ్ళకు గాయములైన వాడు. బండరాళ్ళను పగులగొట్టటానికి అడవి పందికోరను దగ్గఱుంచు కొనేవాడు. తెలిసీ తెలియక ఆకురసాన్ని తప్పుగా కాచి, అది త్రాగి జ్వరంకొని తెచ్చుకొన్నవాడు. ముసలివాడైనా ఈ దక్షిణాపథ మహాసామ్రాజ్యాధిపత్యం ప్రసాదించమని కాళికా దేవిని ఎంతగా కోరినా తిరస్కరింపబడినాడు. ఈ తిలకం ధరిస్తే సంపదలు కల్గుతాయని ఎవరో చెబితే నిత్యం నుదట ఆ తిలకం ధరించేవాడు. ఏవేవో ఆకుల చూర్ణంతో కలిపి నమలి నింపిన శంఖాన్ని నిత్యం దగ్గఱుంచుకొనేవాడు. దుర్గా స్తోత్రపట్టికలు అతని వద్ద ఉన్నై. ఏవో అబద్ధాల మంత్రతంత్రాలు వ్రాసిన తాటాకుపుస్తకాలు భద్రపరచాడు. ఎంతో పాతబడిన ఆకులపై మహాపాశుపత మంత్రం వ్రాయబడి ఉంది అతని వద్ద. ఎప్పుడూ ఏదో నిధికోసం వెదికే జబ్బుంది ఆ ధార్మికునికి. ఇతర లోహాలను బంగారంగా మార్చే ధాతువాదం నమ్మినవాడు. ఎలాగైనా పాతాళలోకం

ప్రవేశించాలనే దయ్యంచే పీడింపబడుతున్నాడు. యక్షకన్యలను ఎలా వశపఱచుకోవాలా అని ఎల్లప్పుడు కోరుతూ ఉన్నాడు. ఒక్కసారిగా మాయమయ్యే మంత్రాలన్నీ పదిలపఱచుకొన్నాడు ఆ ధార్మికుడు శ్రీ పర్వతంలోని మహాశ్చర్యకర రహస్యాలెన్నో తెలిసిన జ్ఞాని అతడు. ఆ ద్రవిడ ధార్మికుడు పిశాచ గ్రస్తులపై మంత్రించిన తెల్లావాలు చల్లితే కోపగించిన పిశాచగ్రస్తులు కొట్టిన దెబ్బలకు అదిరి పోయిన కర్ణ రంధ్రాలు కలవాడు.

ఆ ద్రవిడ ధార్మికునికి శైవమంటే చెప్పలేనంత వీరాభిమానం వాడు తనవద్దగల సొరకాయబుఱ్ఱపై వీణాగానంచేస్తుంటే దాన్నివిని తట్టుకోలేని బాట సారులు అతనిపై తిరగబడి చావబాదుతూ ఉంటారు. పట్టపగలే దోమలు సంగీతం పాడినట్టు తల ఊపుతూ ఏదో కూనిరాగాలు తీస్తూ ఉంటాడు. భాషలో కూర్చబడిన గంగానదీ స్తోత్రాన్ని పాడుతూ నృత్యంకూడా చేస్తూ ఉంటాడు. ఆ ముసలిద్రవిడ ధార్మికుడు ఘోటకబ్రహ్మచారి. కోర్కెల యందభిలాష కలవాడు. అందుచేత అతడు చాలా సార్లు ఇతర ప్రాంతాలనుంచి వచ్చి ఆ ప్రాంతంలో విడిదిచేసిన వృద్ధవ్రతధారిణలవైన స్త్రీల పై వశీకరణ చూర్ణము చల్లేవాడు. చీవాట్లు కూడా తినేవాడు. చండికను కూడా భయభక్తులు లేకుండా ముఖం వికారంగా పెట్టి వెక్కిరించేవాడు.

వీడు ఒక్కొక్కప్పుడు ఆ దేవాలయం కూడలిలో నివసించటానికి వచ్చిన బాటసారులను అడ్డగించి వెళ్ళగొట్టాలనుకొనే వాడు. ఆ సందర్భంగా ఇతడికి బాటసారులకు ఘర్షణ జరుగుతూ ఉండేది. బహు సంఖ్యాకులైన ప్రయాణికులు ఏకాకిగా ఉన్న ద్రావిడుని పట్టుకొని చితకబాదేవారు. నడుములు విఱగగొట్టేవారు. ఒక్కొక్క సారి కొంటె బాలకులు ధార్మికుని ఏడిపించి పాఱిపోతూ ఉండగా కోపం ఆపుకోలేక వీడు వారి వెనుక పరుగెత్తి ఏదో కాలికి తగిలి తల్లక్రిందులుగా పడి మెడ దెబ్బతిన్నవాడుగా బాధపొందే వాడు. తలపగిలి దుఃఖించేవాడు, ఎవ్వరైనా కొత్తపరివ్రాజకుడు అక్కడికి వచ్చి జనులచేత గౌరవింపబడుతూ ఉంటే చూచి ఏమాత్రం ఓర్వలేకపోయే ఈర్ష్యాగ్రస్తుడు.



సంస్కారహీనుడు కావటం చేత ఎవ్వరికి ఏనాడూ కొంచెమైనా ఉపకారం చేసి ఎఱుగడు, పగలే కండ్లు కానరాక నెమ్మదినెమ్మది సంచరిస్తూ ఉండేవాడు.

వానికి పుట్టెడు చెముడుంది. ఏదైనా చెప్పాలంటే చేతి సంజ్ఞలే శరణ్యం. రేజీకటి కలవాడు. అందుచే పగలు మాత్రమే తిరుగుతాడు. లావైన పొట్టకలిగి అమితాహారం తింటాడు. చెట్ల పండ్లను రాల్చటానికి వీడు రాళ్ళువిసరుతుంటే కోతులు కోపగించి వీనిపై పడి ముక్కును చీల్చివేశాయి. వళ్ళంతా గీఱేశాయి. వాడు పూజకోసం పూలుకోసేటప్పుడు ఒత్తిడి తగిలిన తేనెటీగలు వేలకొలదిగా మూగి శరీరమంతా తూట్లుపడేటట్టు కుడుతూ ఉంటాయి. ఆకులు దుమ్ములను తుడవకుండా ఎక్కడ పడితే అక్కడ పడుకోవటంచేత ఆ దేవాలయ ప్రాంతాల్లో తిరిగే పాములు ఎన్నో సార్లు అతనిని కఱచినై. మారేడు కాయలు కోయటానికి చిటారుకొమ్మలెక్కితే అక్కడి నుండి క్రిందపడి అనేక సార్లు తలకు చిల్లులు పడినై. ఆ ప్రాంతానికి వచ్చిన ఎలుగుబంట్లను వెళ్ళగొట్టబోగా అవి ఎదుఱు తిరిగి మీదపడి ఆతని ముఖమంతా గంట్లుపడేటట్లు పీకినవి. ప్రతి ఏటా జరిగే దుర్గాపూజలలో వసంతోత్సవ వేడుకలలో ఈ ద్రవిడ ధార్మికునికి ఎందుకూ పనికిరాని వృద్ధదాసిని భార్యగా పెళ్ళి చేసి వారిద్దరినీ విఱిగిపోయిన మంచాన్ని తిరగేసి ఎక్కించి ఊరేగించి అక్కడి వాళ్ళు ఆనందపడేవారు.

ఈ ద్రవిడధార్మికుడు చుట్టుప్రక్కల చైత్యాలలో ఏదైనా లాభం ఉంటుందేమో అని ఆశతో పడుకొని రాత్రంతా నిద్రపోక, ఏ లాభంలేక దిగులుగా తిరిగి వచ్చేవాడు. ఒంటరిగా ఉన్నప్పటికీ అతనిలో అనేక జబ్బులు కుటుంబ సభ్యుల్లాగా అతనితో పాటు ఉంటున్నై. వాడు బహుమూర్ఖుడు. ఐనా తనలోని వ్యసనాలను తన సంతానంగా భావించుతాడు. క్రోధాన్ని గూడా ఇతరులు కొట్టిన కఱ్ఱదెబ్బలకు తగిలిన గాయాలు మానిన కాయలుకాసిన శరీరాన్ని గర్వంగా పరులకు చూపుతూ ఉంటాడు. ఎండిన అడవితీగల చేత అల్లిన పెద్దపూలపేటిక ఉన్నవాడు. వెదురుకఱ్ఱకు కొంకి

కట్టి పూలు కోసే ఏర్పాటు చేసుకొన్నవాడు. ఎల్లప్పుడు అతని భుజాన నల్లని కంబళిముక్క ఉంటుంది.

చంద్రాపీడుడు కాళీ మందిరం, దాని పరిసరాలు, జరద్ద్రవిడ ధార్మికుణ్ణి పరిశీలించి చూశాడు. ఆ రాత్రిక్కిక్కడే విశ్రాంతికి ఆజ్ఞ యిచ్చాడు. అతడు గుఱ్ఱం దిగాడు. భక్తి ప్రపత్తులతో దేవి ఆలయంలోకి ప్రవేశించి నమస్కరించాడు. ఒకసారి దేవాలయానికి ప్రదక్షిణ చేసి, మరల ఒకసారి దేవికి నమస్కరించి, బయటకు వచ్చాడు చంద్రాపీడుడు. ఒకచోట ద్రవిడ ధార్మికుడు అటు ఇటు తిరుగుతూ బిగ్గఱగా అరచి కేకలు వేస్తుండగా చూచాడు. అతడెందుకో కోపంతో ఉన్నాడు. అతనిని చూడగానే కాదంబరీ విరహ బాధతో అలమటించే హృదయంతో ఉన్న చంద్రా పీడుడు కూడా మనసారా నవ్వుకున్నాడు. అప్పటికే అతని దౌర్జన్యాన్ని ఎదిరింప సంసిద్ధులౌతున్న తన సైనికులను నివారించాడు. అతనిని తన వద్దకు రమ్మన్నాడు. తన వద్ద కూర్చుండ బెట్టుకొని అనేకరకాల ఓదార్చాడు. చాలా విధాలుగా అనునయవాక్యాలు ప్రియంగా పలికాడు. నెమ్మదిగా అతనిని మాటలలోనికి దింపి అతని ఊరు, పేరు, జాతి, విద్యా, భార్య పిల్లల గూర్చి తెగవాగాడు. అతని చెప్పేధోరణి చంద్రాపీడునికి బాగా నవ్వు తెప్పించింది. కాదంబరీ విరహవ్యథా భరిత హృదయం తేలికై పోయింది. ఆ కొద్ది సేపట్లోనే యువరాజుకు అతడు దగ్గరైనాడు. తన పరిజనుల చేత మర్యాదకోసం తాంబూలం ఇప్పించాడు. ఇంతలో సూర్యాస్తమయం కాబోతోంది. తనతోటి రాజకుమారులంతా తమ వీలునుబట్టి చెట్ల క్రింద ప్రక్కలు ఏర్పాటు చేసుకొన్నారు. గుఱ్ఱాలను బంగారు కళ్ళాలతో వృక్షశాఖలకు కట్టివేశారు. గుఱ్ఱాలకు విశ్రాంతి లభించి సంతోషంతో మట్టిలో పడి పొర్లి ఒళ్ళు అంతా దులుపుకున్నై. నాలుగు పచ్చిగడ్డి పరకలు కొరికాయి. కాసిని నీళ్ళుతాగాయి. నీళ్ళతో వళ్ళంతా తోమటంచేత అవిశ్రమను మఱచాయి. వాటిని నేలపై గూటాలు పాతి వాటికి కట్టారు. ఆ గుఱ్ఱాలకు దగ్గఱలోనే గడ్డి పఱచుకొని సైనికులు తమ ప్రయాణ బడలికలు తీర్చుకొంటూ నిద్రలకు



పక్రమించారు. వారు వెలిగించిన దివిటీవెలుగులలో ఆ ప్రాంతమంతా పట్టపగలుగా గోచరించింది. చంద్రాపీడుడు కూడా సైనికులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శయనం మీద వ్రాలాడు. అతని ప్రియతమ అశ్వం ఇంద్రాయుధం సమీపంలోనే కట్టివేయబడి ఉంది. అతని హృదయం వేదనాభరితమైంది. చుట్టూ అంతా ఉన్నా అతడు ఎవరితోనూ మాట్లాడలేదు. శరీరంతోనే చంద్రాపీడుడు దేవీ ఆలయంలో ఉన్నాడు. కాని, మనస్సుతో మాత్రం హేమకూటంలో ఉన్నాడు. అకారణ బంధువైన మహాశ్వేతాదేవీ పాదాలనే అతను తలచుకొంటూ పడుకొన్నాడు. కాదంబరీ దర్శనాన్నే తన జీవితపరమార్థంగా తలచాడు. మదలేఖ తమాలికలు గుర్తుకు వచ్చారు. కేయూరకుడు వస్తే ఎంత బాగుంటుందో గదా! అని అనుకొన్నాడు. హిమగృహం అతని కళ్ళల్లో మెదులుతోంది. కాని అశక్తతతో అతడు దీర్ఘమైన నిట్టూర్పులు వదిలాడు కాదంబరి తనకు బహుమానంగా ఇచ్చిన శేషహారాన్ని బంధువులకన్న అధికమైన ప్రీతితో తలచుకొన్నాడు. తనతో రాకుండ వెనుకబడిపోయిన పత్రలేఖను ఒకసారి మనస్సులో స్మరించుకొన్నాడు. ఈ విధంగా ఎన్నో ఆలోచనలతో నిండిన మనస్సుతో నిద్రలేకుండగనే ఆ రాత్రిని గడిపివేశాడు.

తెల్లవారింది. చంద్రాపీడుడు తన మనోహ్లాదకారకుడైన ద్రవిడ ధార్మికునిపై జాలిపడి అతడు కోరినంత ధనం యిచ్చి సంతోష పరచాడు. ఇక అందరు తిరిగి ప్రయాణించారు. ఇలాగే కొద్దిచోట్ల విడిది చేసి కొద్దిరోజులలోనే ఉజ్జయినీ నగరం చేరుకొన్నారు.

తమకిష్టుడైన యువరాజు చంద్రాపీడుని చూసి పురజనులు ఆనందించారు. వారి ప్రేమాదరాలతో తామర మొగ్గలవంటి వందనం చేస్తున్న చేతులతో ఆయనకు స్వాగతం పలికారు. నగరంలో ప్రవేశించి రాజమందిరం చేరాడు. సేవకులు తమలో తాము పోటీలుపడి ఈ శుభవార్తను చక్రవర్తి తారాపీడునకు తెలియజేశారు – "దేవా! యువరాజు వచ్చి మందిరద్వారం

వద్ద ఉన్నా"డని వారిమాట విన్నంతనే వృద్ధరాజు ఒక్క ఉదుటున లేచి జరాభారంతో నెమ్మదిగా మందరపర్వతంలాగా నడుస్తూ తెల్లని పాలసముద్ర ప్రవాహంలాగా ఉత్తరీయం జీఱాడుతూ ఉండగా దానిని భుజంపైకి లాక్కొంటూ ఆనందబాష్పాలు కండ్లనుండి జలజల రాలుతుండగా కల్పవృక్షం నుండి మంచుబిందువులు రాలటాన్ని గుర్తుకు తెస్తూ ముందుకు నడచి వస్తున్నాడు. ఆయన వెంట అసంఖ్యాకులైన రాజబంధువులు, ఉద్యోగులు నడస్తున్నారు. బాహువులకు అంగదాలు ధరించినవారు, తలపాగాలు, కిరీటాలు ధరించినవారు, జుట్టుముడులవారు ఆయనను అనుసరించి నడచారు. కొందరు ఖడ్గాలు, బెత్తాలు, ఛత్ర చామరాలు, పతాకాలు, ధరించి వెంట రాగా కుతూహలంతో పాదచారియైన తనయుణ్ణి సమీపించాడు తారాపీడుడు.

చంద్రాపీడుడు దూరం నుంచే తండ్రిని చూచి ఇంద్రాయుధాన్ని దిగి, తలను భూమికి వంచాడు, నమస్కరించాడు. తండ్రి తన బాహువులను చాచి రా నాయనా! రా! అని కుమారుని బిగియార కౌగలించుకొన్నాడు. చంద్రాపీడుడు పరిసరాల్లో ఉన్న తనరాజకుల పెద్దలకు నమస్కరించాడు. తండ్రికి చేయి ఆసరాగా ఇచ్చి నడుస్తూ తల్లి నివాసభవనం చేరుకొన్నాడు. తల్లికూడా కుమారుని చూసి సర్వాంతః పురపరిచారికలతో కూడినదై ఎదురువచ్చి, అతని రాకను మెచ్చుకొని, మంగళాచారపూర్వకంగా హారతి అద్ది తన దగ్గఱకూర్చుండ బెట్టుకొన్నది. దిగ్విజయ యాత్రల గూర్చి ముచ్చటించుకొంటూ కాలంగడిపాడు. అలా కొంతసేపు తల్లివద్ద ఉండి మహామంత్రి శుకనాసుని చూడటానికి వెళ్ళాడు.

అక్కడ కూడా చంద్రాపీడునకు స్వాగతాభినందనాలు లభించాయి. అక్కడ కొద్ది సేపు ఉండి, వైశంపాయనుడు శిబిర రక్షకుడుగా నున్న వార్తతెలిపి, అతని క్షేమంగూర్చి తెలిపాడు. అనంతరం మంత్రివద్ద సెలవు తీసుకొని, అతని భార్య మనోరమాదేవి వద్దకు వచ్చి ఆమెను పలకరించి, విలాసవతీ భవనంలోనే స్నానపానభోజనాదులు పూర్తి కావించి విశ్రాంతి తీసికొనెను.



సాయంకాలానికి తన భవనానికి వచ్చాడు. మనస్సంతా గందరగోళంగా ఉంది. కాదంబరి లేకపోవటం చేత తనమనస్సే కాదు, అవంతీనగరం, అంతేకాదు అసలీ సమస్త ప్రపంచమే శూన్యమైనట్లుగా భావించాడు. గంధర్వరాజ పుత్రినిగూర్చిన వార్తలు వినాలనే కుతూహలంతో, మహోత్సవం కోసంవలె, తన కోరిన వరం నెఱవేరే సమయంకోసం వలె, అమృతం ఉద్భవించే సమయం కోసంవలె చంద్రాపీడుడు పత్రలేఖ కోసం ఎదురు తెన్నులు చూడసాగాడు.

## 52. పత్రలేఖ హేమకూటం నుండి వచ్చుట

కొన్ని రోజులు గడిచినై భారంగా. ఒకనాడు రాజాజ్ఞ ప్రకారం మేఘనాథుడు పత్రలేఖను వెంటపెట్టుకొని వచ్చాడు. చంద్రాపీడుని చేతిలో ఆమె నుంచాడు. పత్రలేఖ యువరాజుకు నమస్కరించింది. ఆమె అంత దూరంలో ఉండగానే చంద్రాపీడుని ముఖం విప్పారింది. చిఱునవ్వు నవ్వాడు. సహజ సౌందర్యవంతురాలైన ఆమెను తన ప్రాణ సమాన ప్రేయసి కాదంబరి వద్దనుండి వచ్చింది. కావున మరింత యిష్టురాలైంది. ఆమెను మిక్కిలి ప్రేమతో స్వాగతించి బిగియార కౌగిలించుకొన్నాడు. మేఘనాథుడు యువరాజుకు నమస్కరింపగా అతడు ప్రేమతో అతని వీపును నిమిరాడు. సరే, అంతా కూర్చున్నారు. పత్రలేఖా! పూజ్యురాలైన మహాశ్వేతకూ, కాదంబరికి, మదలేఖకూ, అందఱికీ కుశలమే కదా! తమాలిక, కేయూరకాది సమస్త పరివారజనానికి క్షేమమే కదా! "అని చంద్రాపీడుడు పత్రలేఖను అడిగాడు.

ఆమె ఇలా అన్నది – "ప్రభూ! మీరు చెప్పిన ప్రకారం అంతా భద్రమే కాదంబరీదేవి స్నేహితురాండ్రు, చెలికత్తెలతో శిరము వంచి నమస్కరిస్తూ మిమ్ము పూజించింది అని ఈ వృత్తాంతం అతనిని సంతృప్తిని కలిగింపలేదు. వివరాలు తెలుసుకోవటం కోసం రాజు అందర్నీ పంపివేసి పత్రలేఖను గృహాభ్యంతరమందిరంలోనికి తీసుకొని వెళ్ళి, మనస్సు తడబడుతుండగా, పరిజనులందర్నీ బయటకు పంపివేశాడు మందిరాంతర్భాగంలో మధ్యనున్న

పత్రమండపం చేరాడు. చలువరాతి వేదిక మీద అప్పుడే కోసిన తామరతూడులు, ఆకులతో ఒక శయ్య ఏర్పాటు చేయబడి ఉంది. అక్కడ అంతకు ముందే హంసమిథునం సుఖనిద్ర చెంది ఉన్నై. చంద్రాపీడుడు తన కాలితో ఆ హంసమిథునాన్ని వెళ్ళగొట్టాడు. పత్రలేఖతోపాటు తాను కూడా ఆ శయ్యపై కూర్చొన్నాడు.

"పత్రలేఖా! ఇక ఇప్పుడు చెప్పు, నీవెలా ఉన్నావు? చాలా రోజులున్నావు గదా! కాదంబరీ దేవి నిన్ను ఎలా చూసింది? మీ మధ్య ఎలాంటి సంభాషణలు నడిచినై? ఏ సంగతుల గూర్చి ముచ్చటించుకొన్నారు? నా గూర్చి ఏమైనా మాట్లాడు కొన్నారా? ఎవరికి నాపై అధికప్రేమ ఉంది? చెప్పు" అని ఆమెను ఆత్రంతో ప్రశ్నించాడు చంద్రాపీడుడు.

అందుకు పత్రలేఖ అతనితో "ప్రభూ! శ్రద్ధగా వినండి. నేనక్కడ ఎలా ఉన్నానో, ఎన్నిరోజులున్నానో, కాదంబరి నన్నెట్లు చూసిందో, ఏ సంభాషణలు నడిచాయో, ఏ సంగతులు ముచ్చటించుకొన్నామో అన్నీ చెపుతాను వినండి" – అంటూ ఇలా చెప్ప సాగింది పత్రలేఖ'

దేవా! మీ రా రోజున అలా కాదంబరి దగ్గఱ సెలవు తీసికొని వెళ్ళారు గదా! నేను మీరనుమతించిన ప్రకారం కాదంబరి కోరిన ప్రకారం కేయూరకునితో వెనుకకు వచ్చాను. కాదంబరి పడుకొన్న పక్క పక్కనే నేనూ వచ్చి కూర్చొన్నాను. కాదంబరి నాపై నిత్య నూతనంగా కురిపించే ప్రసాద సుఖాలన్నీ అనుభవించాను. కాదంబరి నా కనులలో కళ్ళుపెట్టి, శరీరానికి శరీరమానించి చేతిలో చేయి వేసి పట్టుకొని మాటలలో మాట కలుపుతూ ఆ రోజంతా నాతోనే గడిపింది. మధ్యాహ్నం దాటింతర్వాత హిమగృహం నుండి బయలుదేరి అలా నడుస్తూ మనోజ్ఞమైన బాలోద్యానం ప్రవేశించింది, పరిజనులను దూరంగా పంపించి వేసింది. ఆ ఉద్యానవనంలో తెల్లని మెట్ల వరుస నధిగమించి మరకతమణి సోపానాల నెక్కి సుందరమైన వేదికపై కూర్చొన్నది. అక్కడున్న మణులు పొదిగిన స్తంభాన్ని ఆనుకొని కూర్చొన్నది.



అలా కొంతసేపు కూర్చుని ఎప్పటి నుండో మనస్సులోని మాట చెప్పాలనుకొన్న దానివలె కనులు నా ముఖముపై నిలిపి అలాగే చూస్తూ చాలాసేపు గడిపింది. అలా చూస్తూనే మదనాగ్నిలో ప్రవేశింపగోరిన దానివలె కనపడింది. శరీరస్వేదంచేత స్నానం చేసినదాని వలె గోచరించింది. ఆమె చెమట ప్రవాహంలో కదలిపోతున్న దానివలె ఉంది. పడి పోతుందేమోనని భయపడి విషాదాన్ని ఆధారంగా పట్టుకొంది.

## 53. పత్రలేఖ కాదంబరి విరహవ్యధను యువరాజుకుతెల్పుట

నాకు ఆమె పరిస్థితి అంతా అర్థమైంది. నేను ఆమె ముఖం వంక కన్నార్పకుండా చూస్తూ, 'ఏమిటో సెలవివ్వండి' అని ప్రార్థించాను, ఆమె శరీరావయవాలు స్వాధీనం తప్పి కంపింప సాగినై. రహస్యం వినటానికి సిగ్గుపడుతున్నదై తన సమీపంలో ఉన్న భవనకలహంసల్ని నూపురాలు శబ్దం చేస్తుండగా కాలితో త్రోసివేస్తోంది. చెవిలో ధరించిన కలువపై వ్రాలుతూ శబ్దం చేస్తున్న తుమ్మెదలను పమిట చెంగు విసురులతో పోద్రోలుతోంది. తన నోటిలోని తాంబూల ఖండాన్ని కొంచెం పంటితో కొఱికి, అదొక కానుకగా పెంపుడు నెమలికిస్తోంది. తాను చెప్పబోయే రహస్యవృత్తాంతాన్ని వనదేవతలెవరైనా వింటారేమోనని అనుమానంగా అటూ ఇటూ చూస్తోంది. లోలోపల ఏదో చెప్పాలనే కోరిక ఉన్నప్పటికీ సిగ్గుతో గొంతు బొంగురుపోయి కొంచెంకూడా చెప్పలేకపోతోంది. ఎంత ప్రయత్నించినా ఆమె వల్ల కాలేదు.

లోపల మండే మదనాగ్ని చేత ఆమె దగ్ధురాలైనట్లుగా ఉంది. నిరంతరం స్రవించే కన్నీటి ప్రవాహంలో కొట్టుకుపోతోందేమో అన్నట్టుంది. పడదోసుకొని లోపల ప్రవేశిస్తున్న దుఃఖాల చేత ఆక్రమింపబడిందనిపిస్తోంది. వరుసగా పడుతున్న మదనుని బాణాల వల్ల శరీరం ముక్కలౌతున్నట్టుంది. హృదయంలో ఉన్న అనేక చింతలతో పట్టుకోబడిన దానిలాగా ఉంది. ఆమె ప్రాణాలను ఈ చింతలు తేనెటీగలు మధువును త్రాగినట్లు తాగేస్తున్నై. తనలో ఎన్ని

దుఃఖాలున్నాయో లెక్క చెదుతున్నట్లు చేతిలో ముత్యాలమాల తిరుగుతూ ఉంది. తల వాల్చి దుఃఖిస్తూ ఉండటం చేత కన్నీటిబిందువులు ఆమె బుగ్గలపై పడకుండా సూటిగా నేలపైనే పడుతున్నై. ఆ సమయంలో కాదంబరినుండి సిగ్గు పడటమెలాగో శిక్షణపొందింది. వినయంతో విధేయతతో ఎలా ఉండాలో నేర్చుకుంది. ముగ్ధత ముగ్ధత్వాన్ని, భయం పిఱికితనాన్ని, విలాసం విలాసాన్ని, విషాదం విషాదాన్ని నేర్చుకొన్నాయి.

ఆమె అలా ఐపోవటం చూసి నేను దిగులుపడి, “అమ్మా! ఏమిటి మీ ఈ పరిస్థితి’ అని అడిగాను, అప్పుడామె ఎఱ్ఱగా తామర రేకుల్లా ఉన్న కళ్ళనుండి స్రవిస్తున్న కన్నీటిని తుడుచుకొని, తనలో ఉప్పొంగుతున్న దుఃఖావేశాన్ని నివారించటానికి మృదువైన తన బాహులతతో వేదికనుండి వ్రేలాడే కుసుమమాలను చేతితో పట్టుకొని, ఒక కనుబొమ్మను పైకి లేపి, మృత్యుమార్గం వెదుకుతున్న దానిలాగా చూస్తూ దీర్ఘమైన నిట్టూర్పులు వదిలింది. మీరు దుఃఖ కారణం నాకు చెప్పండి, సంకోచించకండి అని నేను మాటిమాటికి కోరుతున్నప్పటికి, ఏదో చెప్పాలనుకొని కూడా చెప్పలేక పోయింది. ఆమె పెదవులు కదులుతున్నై. తెనెటీగలతో ఏదో రహస్యాలు చెపుతున్న దానిలాగా కన్పించింది. నేల మీదనే దృష్టి పెట్టి అలాగే చాలాసేపు చూసింది, కాదంబరి మన్మథాగ్ని ధూమంచేత మలినమైన వాక్కును బాష్పజలబిందువులతో కడుగుతున్నదానివలె కన్నీరు కారుస్తూ, బాష్పజల బిందువుల వంకతో ముత్యములు రాలుతుండగా తన దంతకాంతులనే దారాలతో ముత్యాలమాల గుచ్చుతున్న దానివలె కనబడుతూ, తొట్రుపాటుతో మరచిపోతున్న అక్షరాలను ప్రోగుచేసి పదాలుగా ఏర్పరుస్తూ, ఎట్లాగో తనను తాను మాట్లాడటానికి సన్నద్ధురాలినిగా చేసుకొంది. నాతో ఇలా అంది –

“ఓ పత్రలేఖా! ప్రాణాధికంగా ప్రేమించటం వలన నీ స్థానంలో ఎవ్వరూ నిలువలేరు. నా తండ్రిగాని, తల్లిగాని, మహాశ్వేత, మదలేఖ, చివరికి జీవితంకూడా నీతో సాటిరారు. నిన్నేనాడు చూశానో ఆ నాటినుండే నీవు నాకత్యంత ప్రీతిపాత్రురాలవయ్యావు. విశ్వసనీయురాల వయ్యావు. నాకెంత



మంది దాసదాసీజనం ఉన్నా వారందర్నీ పక్కకు పెట్టాను. నేనెవరినీ నిందించటంలేదు. నాకు కలిగిన మనోవేదన పరాభవం నేనెవరితో చెప్పుకోను? ఎవరికి నా దుఃఖంలో సమానభాగం పంచను? నా ప్రాణంపై ఒట్టు పెట్టుకొని చెపుతున్నాను, సహించరాని నా దుఃఖభారాన్ని నీకు తెలియపఱచి ఆపై మరణిస్తాను. నాపై నాకే అసహ్యం వేస్తున్నది. అటువంటిది ఇంకొకరికి ఎలా చెప్పను వెన్నెలలాగా స్వచ్ఛమైన కులప్రతిష్ఠకు మాయని మచ్చ తేబోతున్నాను. కులక్రమాగతమైన సిగ్గును వదలివేశాను. ఏ కన్యకా చూపని చపలబుద్ధిని ప్రదర్శిస్తున్నాను. నేను చేయబోయే పని నా తండ్రి అనుమతించింది కాదు. తల్లిచేత ఇవ్వబడిన మాట కాదు. గురువులచేత సమ్మతింపబడిందీ కాదు. అసలు నా ఈ దురవస్థకు మూలకారకుడు యువరాజు చంద్రాపీడుడే. ఏమమ్మా నువ్వే చెప్పు – చంద్రాపీడుని వంటి గొప్పవారు ఇటువంటి పనులు చేయవచ్చునా? అతనితో పరిచయం పెంచుకున్నందుకు ఇదా ఫలితం? తామర తూడులోని దారంలాగా కోమలమైన నా మనస్సు ఇప్పుడు తల్లడిల్లిపోతోంది. అవమానాల పాలైంది. యువకులు అమాయికలైన కన్యకాజనులను ఎంతమాత్రం అవమానింపరాదు. సామాన్యంగా మన్మథాగ్ని ముందుగా కన్యకు అలంకారం లాంటి సిగ్గును కాల్చివేస్తుంది, తర్వాత హృదయాన్ని దహిస్తుంది. మన్మథుని బాణాలు ముందుగా కన్యకలకు సహజమైన వినయవిధేయతలను ముక్కలు చేస్తాయి, తర్వాత మర్మస్థానాలను కోసివేస్తాయి. ఇక నేనేం బతుకుతానో – పునర్జన్మంటూ ఉంటే నీకు స్నేహితురాలుగా పుట్టాలని కోరుతున్నాను. నీకంటె ప్రాణాధిక ప్రియురాలు నాకు వేఱెవరున్నారు? నాకంటిన ఈ కళంకాన్ని ప్రాణ పరిత్యాగంద్వారా కడిగివేసుకొంటాను’’ అంటూ చెప్పి మౌనంగా ఉండిపోయింది.

నేను అసలు విషయపులోతులు తెలియని కారణంగా సిగ్గు, భయంతో ఏమీ మాట్లాడలేక అలాగే ఆమె వంక చూస్తూ ఉండిపోయాను. కాసేపటికి తేరుకొని ఆమెతో ఇలా అన్నాను–

"దేవీ! మా యువరాజు చంద్రాపీడుడు ఏం చేశారో కొంచెంగా సెలవిస్తారా? ఆయన వల్ల ఏం అపరాధం జరిగింది? వినయవిదూరుడై యువరాజు, బాధింప వీలులేని సుకుమారమైన మీనస్సును ఎలా బాధించాడు? ముందు మీరు చెప్పేకారణం విని నా జీవితం త్యాగం చేస్తాను. తర్వాత మీరు ప్రాణత్యాగం చేద్దురు గాని" అని, నేనలా అనే సరికి ఆమెకూడా ఇలా అంది "అయితే చెపుతాను విను. శ్రద్ధపెట్టి విను. చంద్రాపీడుడు ప్రతిరోజూ స్వప్నాలలో కనిపిస్తున్నాడు. చిలుకలు గోరువంకల ద్వారా నాకు ప్రణయసందేశాలు పంపుతున్నాడు ఆ దుష్టనిపుణుడు. నేను ప్రశాంతంగా నిద్రిస్తూ ఉండగా చెవులకున్న దంత పత్రాలపై ఏవో పిచ్చిపిచ్చి కోరికలు మనస్సులో ఉంచుకొని నాకు సంకేతస్థానాలను వ్రాసిపోతున్నాడు. నల్లని అంజన రేఖలతో చెమటకు చెఱిగిన అక్షరాలను సరిచేస్తూ తన మనస్సులోనున్న కోరికలను తెల్పుతూ ప్రేమలేఖలు వ్రాస్తున్నాడు. తన మనస్సులో ఉన్న అనురాగం (లత్తుక, పారాణి)తో నా పాదాలను ఎఱ్ఱ బారుస్తున్నాడు. స్వప్నాలలో ఉద్యానవన విహారంలో ఒంటరిగా ఉన్న నాకు అతడు పట్టుకొంటాడేమోనని భయంకల్గి పరుగుతీస్తుంటే చెట్ల చిగురులకు తగిలి నా గమనం ఆగి పోగా సఖులు అతనికి అప్పగిస్తున్న సమయంలో నాకిష్టం లేకపోయినా కౌగలించుకొంటాడు. నేనాతని దోషాలను ఎత్తిచూపుతూ ఏకరువుపెడితే అది మెప్పుదలగా భావిస్తాడు. నేను గొంతెత్తి పడిస్తే ఏదో నవ్వులాటగా భావిస్తాడు. సిగ్గుతో మాట్లాడలేకపోతే దానిని గర్వంగా భావిస్తాడు. లోకనిందను కర్తిగా భావిస్తాడు' అని ఆ కాదంబరి మాటలు విన్న నాకు మిక్కిలి సంతోషం కలిగింది. "ఈమె చంద్రాపీడుని వ్యవహారంలో మన్మథుని చేత చాలాలోతుకు తీసుకొని పోబడింది. ఒకవేళ కాదంబరిని వంకపెట్టుకొని మన్మథుని చిత్త ప్రవృత్తి ఇలా ఉంటే చంద్రాపీడునకు (నీకు) అనుకూలంగా ఉన్నట్టే. మన్మథుని సహజగుణాలు దేవరకు ఉపకారం కలిగించాయి. దిక్కులన్నీ కీర్తిచేత తెల్లబాఱినై, యౌవనం చేత చంద్ర సంబంధకళలచేత అమృతం కురిసినట్లైనది.



ఈమె ఎంత మన్మథ బాధ చెందితే వీరి ప్రేమ అంత త్వరగా సిద్ధిస్తుంది" అని నామనస్సులో ఊహించాను.

యువరాజా! నేను నవ్వుతూ కాదంబరితో "అమ్మా! మీరు చెప్పిన ప్రకారం చూస్తే దీంట్లో చంద్రాపీడుని దోషం ఏమీ లేదు. అదంతా దుర్మార్గుడైన మన్మథుని చపలచేష్టావిలాసాలు. దోషం మన్మథునిది కాన, మీరు కోపాన్ని విడచిపెట్టండి. ప్రసన్నంగా ఉండండి" అని అన్నాను. నా మాటలు విన్న కాదంబరి కుతూహలంతో "ఆ మన్మథుడెవడో ఏమిటో నాకేమీ తెలియదు. మన్మథుని రూపలీలా విలాసాలేమిటో కొంచెం చెప్పు వింటాను" అని అడిగింది.

అప్పుడామెతో నేనిలా అన్నాను – "దేవీ! ఏమన్నారు? అతని రూప రేఖావిలాసాలు చెప్పమన్నారా? అసలు మన్మథునికి రూపముంటే గదా చెప్పేందుకు! అతను తనువు లేనివాడు, కాని ప్రభావంలో అగ్నితో సమానుడు ఎలాగంటే – కనపడని అగ్ని కీలలు తాపాన్ని కలిగిస్తాయి. పొగలేకుండానే కంటివెంట నీరు కార్పిస్తాడు. కొంచెమైనా బూడిద లేకుండానే శరరానికి తెల్లదనం కలిగిస్తాడు. ఇంతెందుకు? మన్మథుని బాణాలకు గుఱియై విలవిలలాడని ప్రాణి ఈ ముల్లో కాల్లో ఎక్కడా లేదు. ప్రస్తుతం లేదు భవిష్యత్తున ఉండబోదు. ఇక మన బోటి అబలలను ఎందుకు భయభీతలను చేయకుండా ఉంటాడు? అతని వద్దనున్న కుసుమచాపంతో, బాణాలతో ఎంతటి బలవంతుణ్ణైనా హింసిస్తాడు. మన్మథ పిశాచం ఆవహించిన స్త్రీజనులకు ఆకాశంలో ఎక్కడ చూసినా ప్రియుని ముఖాలే కనిపిస్తాయి, అతని బాఱిన పడిన స్త్రీలు తమ ప్రియుల రూపాలను గీయటానికి ఈ భూమండలం చాలదు. ప్రియుని గుణాలను లెక్కించాలంటే సంఖ్యలు చాలవు" అని నామాటలను విన్న కాదంబరి కాసేపు తనలో తనే ఆలోచించుకుంది, నాతో, "పత్రలేఖా! నీవు ఇలా వర్ణించి చెప్పిన మన్మథుడు నాయందులాగా కాక యువరాజునందు పక్షపాతబుద్ధితో ప్రవర్తించాడు. అతనికి అందరియందు సమబుద్ధి లేదు. నా విషయంలో నీవు చెప్పిన గుణాలకంటే అధికగుణాలే కనపడినై. నీవు నా

ప్రాణసమానురాలవు. కనుక నిన్నే అడుగుతున్నాను. ప్రస్తుత పరిస్థితుల్లో నన్నేం చెయ్యమంటావో చెప్పు. ఇటువంటి విషయాలు నాకు బొత్తిగా తెలియవు. నేనిప్పుడు పెద్దల చెప్పు చేతల్లో ఉన్నదాన్ని, వారికి సమాధానం చెప్పుకోవలసిన దాన్ని అస్వతంత్రురాలిని మిక్కిలి సిగ్గరిని ఈ పరిస్థితుల్లో నాకు జీవించటం కంటే మరణించటమే మేలనిపిస్తోంది" అని పలికింది.

కాదంబరి అలా పలుకగా, నేనామెతో, "చాలమ్మా చాలు. అటువంటి మాటలు అనవద్దు, ఇప్పుడు మరణించవలసినంత అవసరం ఏమొచ్చింది? అయినా మరణించి సాధించే దేముంది? మీరు మన్మథుణ్ణి పూజింపకపోయినా అతడు మీకు ప్రసన్నుడై వరమిచ్చినట్లే దీంట్లో పెద్దల ప్రమేయం ఏమీలేదు. తల్లి తండ్రి, గురువు, బంధుమిత్రాదులు అన్నీ నీకు మన్మథుడే! ఎలాగంటే – మన్మథుడు గురువులాగా కార్యసంకల్పం కలిగిస్తాడు. తల్లిలాగా ప్రేమను అంగీకరిస్తాడు. తండ్రిలాగా వరుని చేతిలో కన్యను పెడతాడు. మిత్రురాలిగా తోడునీడగా ఉంటాడు. దాదిలాగా ప్రేమ వ్యవహారాలలలో ఎలా మెలగాలో నేర్పుతాడు. అతని చేత ప్రేరేపింపబడి పెద్దల అనుమతి పొందకుండానే ఎంతమంది కన్యకలు స్వయంగా పతులను వరించారో ఏమని చెప్పను నీకు? స్వయంవర విధానం తప్పైనది కాదు. ధర్మ శాస్త్రంలో చెప్పబడినదే! గాంధర్వ పద్ధతి మనకిపుడు వీలుగా ఉంటుంది. కాబట్టి దేవీ! మీరు మరణ ప్రయత్నం నుంచి విరమించండి అమ్మా! ఇదేమీ పాదాలమీద ఒట్టుపెట్టుకొని చెపుతున్నాను, మీకెందుకు? నన్ను పంపించండి, మీ సందేశం ఇవ్వండి, నేను వెడతాను. వెళ్ళి నీ ప్రాణప్రియుణ్ణి తెచ్చి మీ ముందుంచుతాను" అని నేను చెప్పాను.

కాదంబరి నన్నెంతో మురిపెంగా ఆర్ద్రంగా చూస్తూ, నన్ను త్రాగేంత ప్రేమతో చూస్తూ, మన్మథుని బాణాలకు ముక్కలై పోతున్న సిగ్గుతో తన మనస్సులో చెలరేగుతున్న ప్రేమభావాలతో ఆందోళన చెందుతూ తన మెడలోని తెల్లని ముత్యాలహారాన్ని తీసి ఇచ్చింది. లోలోపల ఎంతో ఆనందం వెల్లి



విరిసినా కన్యకాజనసహజమైన లజ్జ ననుభవిస్తూ నెమ్మది నెమ్మదిగా నాతో ఇలా అన్నది కాదంబరి–

"నాపై నీకెంత ప్రేమున్నదో నాకు తెలుసు సహజంగా దిరిసెన పువ్వులాగా కోమలమైన మనస్సుగలవారికి ఈలాంటి ప్రేమ వ్యవహారాలలో దృఢంగా ఎలా వ్యవహరించగలరు? అందులోనూ నాబోటి అమాయిక బాలికలకు ఎలా మెలగాలో తెలియదు కదా! ఎవరో ధైర్యం కలవారు మాత్రమే సాహసంతో స్వయంగా ప్రేమలేఖలు పంపే వారు, వారి ప్రియల దగ్గఱకు పోయే వారు ఉంటారు. నేను బాలికను. ఆ పని చేయటానికి సిగ్గు పడుతున్నాను. సందేశం ఏమని పంపమంటావు? నీవు నాకు మిక్కిలి ఇష్టమైన వాడని అననా? అది మరల మరల చెప్పినట్లౌతుంది' నేను నీకిష్టురాలను' అందామా! అది సారహీనంగా ఉంటుంది. 'నువ్వంటే నాకెంతో ప్రేమ' – అంటే అది వేశ్యల నోటి వెంట తఱచూ వచ్చేమాట 'నీవు లేకుండా నేను బ్రతకలేను' అందామా! అది విరుద్ధమైన మాట. నన్ను మన్మథుడు బాధిస్తున్నాడు 'అందామా! అది నా తప్పే అవుతుంది' నేను మన్మథుని చేత నీకు సమర్పింపబడుతున్నాను' అందామా అంటే ఆయన దరిచేరటానికి నేను పన్నిన ఉపాయం అని అనుమానం కలుగుతుంది. 'నువ్వు నన్ను అపహరించా'వని అనటం కులటలు మాట్లాడినట్లౌతుంది 'నువ్వు నా వద్దకు తొందఱగా రా' అని అంటే అది సంపద్గర్వమనిపించుతుంది. 'నేను ఒంటరిగా ఉండలేను నేను నీ వద్దకు వచ్చేస్తాను' అంటే అది స్త్రీయొక్క చపలత్వాన్ని బయట పెట్టినట్లవుతుంది. 'ఈ దాసురాలు నిన్ను ఒక్కనినే ప్రేమిస్తున్నది' అనటం తనను తాను తేలికపఱచుకొన్నట్లౌతుంది. నీవేమైనా అనుకొంటావేమోనని నేను ప్రేమ సందేశం పంపించలేదు' అనటం లేనిపోని అనుమానాలు కలిగించినట్లౌతుంది.' నీ విక్కడ నుండి వెళ్ళిపోయినా నేనింకా దుఃఖంతో ఎలా బ్రతికి ఉన్నానో" అనటం మరీ మితిమీరిన ప్రేమస్థాయి అవుతుంది.

నా మరణం చేతనైనా నీవు తెలుసుకుంటావు నా ప్రేమ ఎంత గొప్పదో" అని అనటం అదీ అసమంజసం కాదు" అని కాదంబరి ఊరుకొంది.

(ఇక్కడితో బాణ భట్టమహాకవి మరణంతో రచన ఆగిపోయింది)

***ఇది పూర్వభాగం పూర్తయింది.***

## కాదంబరి - ఉత్తరభాగం

## 54. చంద్రాపీడుని మానసికాందోళన

కాదంబరి తన మనోవ్యథను పత్రలేఖతో ఇంకా ఇలా చెప్పసాగింది– "పత్రలేఖా! ఒకవేళ నీవు చెప్పినట్లుగానే చంద్రాపీడుని నా దగ్గఱకు తెచ్చావే అనుకొందాం. ముంచుకు వస్తున్న సిగ్గుతోనే నతనిని చూడగలనా? అని అనుమానం వస్తున్నది. ఆయన నా వద్దకు వస్తే మన్మథ వికారం చేతకలిగిన విస్మయం నన్ను ఆతని ముందు నిలబడనియ్యదు. నా అంత నేనుగా అతని వద్దకు వెళ్ళుట చులకనతనంగా ఎంచబడుతుంది. అతని ఎదుట నిలువబడే ధైర్యం చాలదు. ఒకవేళ నీవు వెళ్ళి ఏదో చెప్పి అతనిని బలవంతంగా తీసుకువచ్చావా అతనికి ఎదురుపడే సాహసం నాకు లేదు.

ఒకవేళ నీవు తీసుకువద్దామనుకొన్నా అతను రావద్దా? అతడు నావద్దకు రాలేకపోవటానికి ఎన్నో కారణాలుండవచ్చు. పెద్దలేమంటారో నన్నభయమో, సిగ్గో కలగవచ్చు. రాజకార్యాల వత్తిడి వల్ల రావీలుపడకపోవచ్చు. చాలా కాలం బంధుమిత్రాదుల్ని చూడని కారణంచేత కావచ్చు. మిత్రులముఖ కమలాలు చూద్దామన్న అపేక్షతో కావచ్చు. మళ్ళీ అంతదూరం శ్రమపడిపోవటం గూర్చిన ఇబ్బందివలన గాని, తనయింట సుఖంగా ఉండాలనే అభిరుచితో గాని, స్వంతభూమిపై ప్రేమ వలనగాని, ఇష్టంలేక పోవటం వలనగాని ఏకారణం చేతనైనా గాని పత్రలేఖ ఆయన పాదాలపైబడి వేడుకొన్నా గాని వస్తాడో రాడో మరి అయినా అప్పటికి ఇప్పటికి దేనిలో తేడా ఉంది? లేదు గదా! ఆనాడు విరహావస్థలోనున్న ఆ కాదంబరినే నేను



ఆనాడు నా ఈ రెండు కళ్ళనే చూశాడు. అదే మా ప్రథమదర్శనం. ఆనాటి హృదయమే ఈ నాటి ఈ హృదయం. నన్నంతసేపు మైమఱచి చూసిన ఆనాటి దేహమే ఇది. పెద్దల మాటకు తల ఒగ్గి ఆనాడు గ్రహింపనిదే ఈ నా చేయి. ఇతరు లెంత బాధపడుతున్నా గుర్తింపని, నన్ను రెండు పర్యాయములు చూసి వెళ్ళిపోయిన ఆ చంద్రాపీడుడే ఈ చంద్రాపీడుడు. తన బాణాలతో వేధించి, చంద్రాపీడుని ఏమీ చేయక ఊరకున్న ఆ మన్మథుడే నీ విందాక నాకు చెప్పిన గుణాలుకల ఈ మన్మథుడు.

పత్రలేఖా! నేను మహాశ్వేతకు మాటయిచ్చాను, "నీవు దుఃఖిస్తూ ఉండగా నేను వివాహ మాడను" అని అదే మాట యిప్పుడూ అంటున్నాను. ఆ మహాశ్వేత నాతో, 'కుమారీ! అటువంటి ఆలోచనలు నీమనస్సులో పెట్టుకోవద్దు. ఈ మన్మథుడుకడు దుర్మార్గుడు, అతిభయంకరుడు, పాపిష్ఠి వాడు. అట్టివాడు కంటికి కనపడకయే ప్రియుడు దూరం అయినప్పుడు మనస్సులో ఆపరాని ప్రేమావేశాన్ని కలిగించి ప్రాణాలను అపహరిస్తాడు" అని అన్నది. నాకు అట్లు కూడా జరగటంలేదు. మదనుని చేతనో, దైవంచేతనో, అనురాగం చేతనో మరేకారణం చేతనో నా ప్రియుడు నాకంటికి నిత్యమూ కనపడుతూనే ఉన్నాడు. ఇంకా నీవాయనను ప్రత్యేకంగా ఉజ్జయినీ నగరం నుండి తేవటం ఎందుకు? నేను కూర్చున్నా, నిలుచున్నా అటు ఇటు విరహంతో తిరుగుతున్నా, పడుకొన్నా, మేల్కొన్నా, కలలుకంటున్నా, శ్రీ మండపంలో సరోవర ఉద్యానవనాలలో తిరుగుతున్నా, నాకు దర్శనమిస్తున్నాడు. నీకు ఈ విషయం ముందే చెప్పాను కదా! ఇక ఆయనను నావద్దకు తీసుకొని రావటంగూర్చి మాట్లాడకు" అని నాతో అంటూనే అనుకోకుండా ఒక్కసారిగా కనులు మూసుకొని తామరతూడులాంటి చేయి చెక్కిట చేర్చి చెక్కిన శిల్పంలా అలా ఉండిపోయింది.

ఆమె మాటలు విన్న నేను మనసులో, "ఈమె చెప్పింది సత్యమే ఎప్పుడు తలచుకొంటే అప్పుడు కనులముందు కనపడే ప్రియుడు కులాంగనలకు

ముఖ్యంగా కన్యలకు ప్రాణరక్షకు డనేది యథార్థమే అని అనుకొంటూ ఉండగానే సూర్యాస్తమయం కావచ్చింది. అంతఃపుర భవనాలలో కమ్ముకుంటున్న చీకట్లను పోగొట్టటానికి సుందరసుగంధ తైలాలు నింపిన దీపాలను తీసుకొని దాసీలు బయలుదేరారు. అప్పుడు అయోమయావస్థలో ఉన్న కాదంబరితో, "దేవీ! మనస్సు కుదుటపఱచుకో కష్టమంటే తెలియని నీవు ఇంత బాధననుభవించటం ఎందుకు? కోపోద్రేకాలను అదుపులో ఉంచుకో నీవు సమ్మతిస్తే నేను రాజకుమారుణ్ని వెంటపెట్టుకొని ఇప్పటికిప్పుడు వస్తాను. సరేనా "అని అన్నాను. మీ పేరు చెవినబడినంతనే అంతప్రయోగం చేత విషప్రభావం తగ్గిన దాని వలె కనులు విప్పి ఆశతో నా వంక చూస్తూ, "ఎవరక్కడ ఉన్నది?" అని దాసీలను ప్రశ్నించింది.

ఆమె ప్రశ్నవిని తెల్లని వస్త్రాలు ధరించి, ద్వారప్రదేశానికి నిత్యం అంకితమైనవారు, పరశురాముని బాణపుదెబ్బలకు రంధ్రాలనుంచి బయటకు వచ్చిన పావురాల లాంటివారు, కాలి అందెల రవళులే మధుర వాక్కులుగా కలవారు అనేకమంది అంతఃపుర కన్యకలు బిలబిలలాడుతూ పరుగులతో కాదంబరి వద్దకు వచ్చారు. అమ్మ గారు ఏమని ఆజ్ఞాపిస్తారోఅని కన్యలంతా ఎదురు చూస్తున్నారు. కాదంబరి వారివంక చూస్తూ మరకతశిలావేదికమీద ఆసీనురాలై," పత్రలేఖా ! నీవు నాకోసం వెదుతున్నావని నా కిష్టమైన దానవని నేననటంలేదు. నిజంగా నేనిప్పుడు ఇలా జీవించి ఉన్నానంటే అది నిన్ను చూసుకుంటూ ఉండటం వల్లనే. నీకంతగా నా ప్రియుణ్ణి తీసుకురావాలని పట్టుదల ఉంటే, సరే, అలాగే వెళ్ళిరా!" అని నాకు వస్త్రాభరణ తాంబూలాదులను బహూకరించి తన ఆదరభావాన్ని తెలియజేస్తూ వీడ్కొలిపింది" అని పత్రలేఖ కాదంబరి విషయాలన్నీ పూసగుచ్చినట్లు వివరించింది.

పత్రలేఖ చంద్రాపీడునికి గంధర్వలోకంలో కాదంబరి ఎదుర్కొంటున్న మదనబాధను గూర్చి ఇలా తెలియపఱచి, కొంచెం సేపు ఆగి మరల ఇలా అన్నది.



"దేవా! నేను ప్రత్యక్షంగా కాదబంరి అనుగ్రహం, గొప్పదనం, ఇబ్బందులు చూసిన దానను. కావున మీకీ విజ్ఞాపన చేస్తున్నాను. మిమ్మే నమ్ముకొని బ్రతుకుతున్న ప్రియురాల్ని ఈ విధంగా దూరంగా ఉంచి అలా బాధిస్తున్నారంటే ఏమన్నా బాగున్నదా? చెప్పండి' అని.

చంద్రాపీడుడు నిందాగర్భితమైన పత్రలేఖ మాటలను విని ఆమెతో ఇలాంటి పద్ధతిలో అనసాగాడు. ఆ మాటలలో కాదంబరిపై అనురాగ భావం ఉంది. గాంభీర్యం, సంతాపం, పరిహాసం, అభ్యర్థనం, అభిమానం, సరసంగా, దయాయుక్తంగా, అనురాగ పూర్వకంగా, కొంచెంగా కోపం, నిందా పూర్వకంగా పలికాడు. ఆయనమాటలు మధురంగా ఉన్నై. విన శక్యంకానివై ఉన్నై. మృదువుగానూ, గర్వంతో కూడినవిగా కూడా ఉన్నై. అతడు పత్రలేఖముఖాన్ని పరిశీలనగా చూశాడు. సహజంగా ధైర్యవంతుడైనా గాని మిక్కిలిగా ఆందోళన పాలయ్యాడు.

చంద్రాపీడుడు దృఢంగా పత్రలేఖకు ఇలా సమాధానమిచ్చాడు – "ఓ పత్రలేఖా! నేనేం చెయ్యను చెప్పు! నేను కాదంబరిని అంతగా బాధించానంటేనూ, నీ చేత ఇలా నిందాపూర్వకంగా మాటలనిపించుకున్నానంటేను దానికి కారణం నా దుర్గుణాలే. నన్ను నాగురువులు సరిగా విద్యయందు శిక్షణలో తీర్చి దిద్దలేదు. నేను ఎంతో జ్ఞానిని అన్న గర్వం కలవాడిని, చాలా గొప్ప పండితుణ్ణని నాకు నేనే విఱ్ఱవీగేవాడిని, దుర్బుద్ధిని, అబద్ధాల శూరత్వం కలవాణ్ణి నాలో నేనే ఏవో ఏవో గొప్పతనాలు ఊహించుకుంటే వాణ్ణి. దేనియందు శ్రద్ధలేని వాణ్ణి, నేను పరమమూఢుణ్ణి. శృంగారనాట్యాచార్యుడైన మన్మథుని చేత నాగూర్చి కాదంబరి అనేక ఇక్కట్లకు లోనైంది. నేను పై చెప్పిన దుర్లక్షణాలు కల వాణ్ణవటం చేత, నేనంతకుముందు దేవకాంతలను చూసినవాడను కాను కనుక, ఆమె రూపాతిశయాన్ని చూసి ఏదో మనసులో ఆశలు మొలకెత్తిన కారణంగా, ప్రేమ అనేది అంకురించటం స్త్రీపురుషుల మధ్య సహజమే అనుకోవటంచేత, నేను ఈ నాడు కాదంబరిని ఇంత కష్టపెట్టటమూ, నీ చేత

ఇన్ని మాటలు పడటమూ జరిగింది. నా మనస్సింత వ్యామోహానికి గురైంది అంటే అదేదో దైవంపెట్టిన శాపఫలమేనేమో!

నాపై ఎంత ప్రేమలేకపోతే తాను చాలకాలం నుండి కంఠమున ధరించిన శేషహారాన్ని అప్పటికప్పుడు తీసి నా కంఠాన వేస్తుంది? ఆ విషయం ఆమెకు ఎందుకు గుర్తుకురాలేదు? నీకూ తెలుసుగదా హిమగృహంలో జరిగిన తతంగమంతా! నాయందు ప్రేమానురాగాల వల్ల కలిగిన కోపం వలన ప్రేరేపింపబడిన కాదంబరి నాపై వేరే విధంగా నేరారోపణ చేస్తోంది ఏమిటి? ఇదంతా నా అజ్ఞానంవల్ల జరుగుతున్నది. వేరెవరూ కారకులు కారు. నేను కాదంబరికి నాపైగల దురభిప్రాయం తొలగించటానికి, నేనెట్టివాడినో ఆమె తెలుసుకోవటానికి నేను జీవితంతో ఉండి ప్రయత్నిస్తాను అని చంద్రాపీడుడు అంటూ ఉండగానే వేత్రహస్తురాలైన ప్రతీహారి అతనికి నమస్కరించి ఇలా విన్నవించింది – "యువరాజా! నేను మహారాణిగారు చెప్పమన్న విషయం తెల్పుతాను' నేను నాపరిజనులేదో మాట్లాడుకునేటప్పుడు విన్నాను. లోగడ నీతోపాటు రాకున్న పత్రలేఖ ఇప్పుడు వచ్చిందట గదా! నీయందుగాని, పత్రలేఖ యందు గాని స్నేహానికి ఏదైనా అంతరాయం ఏర్పడలేదు గదా! నేను పత్రలేఖను నా సొంత బిడ్డనులాగా పెంచాను. నీవు కూడా ఆమెను చూసి కొన్ని రోజులై పోయిందిగదా! అందుచేత ఆమెను నీ కూడా వెంటబెట్టుకొని నా వద్దకు రా. నీ ముఖంచూస్తే నా మనస్సులోని కోరికలు వందలుపైగా తీరినట్లే' అని.

చంద్రాపీడుడు ప్రతీహారి పలుకులు విని తనమనస్సులో, "ఓహో! నా జీవితం సందేహమనే ఉయ్యాలలో ఊగిసలాడుతోంది. నన్ను ఒక్కనిమిషం చూడకపోయినా మా అమ్మ ఎంతో దుఃఖపడుతుంది. నేనే మీ దేవికరుణ పొందటానికి పత్రలేఖను నిష్కారణప్రేమ చేత అచ్చటే ఉంచి వచ్చేశాను. అక్కడ కాదంబరీదేవిచే కూడా పత్రలేఖ ద్వారా నేను రమ్మని ఆజ్ఞాపింపబడ్డాను హేమకూటానికి పుట్టింది మొదలు కొని తల్లి ప్రేమ మిక్కిలి బలీయయే. ఈ



రెండు కోర్కెల మధ్య నాహృదయం వ్యాకుల మౌతున్నది. తండ్రి పాదసేవ నిత్యం విడువరానిది. తల్లిదండ్రులపై ప్రేమా? ప్రేయసిపై ప్రేమా ఈ రెంటిలో ఏది ఆ చరణీయము? మన్మథుడు మనసు కల పెట్టువాడు. తల్లి దండ్రుల ప్రేమ పూర్వక లాలన మనోహరమైనది ప్రియురాలి ప్రథమ ప్రార్థన కుతూహల కరమైనది. నన్నెల్లప్పుడూ చూడగోరెడి వారు నా రాజబంధువులు. ప్రియురాలి ముఖదర్శనం కంటె జీవితానికి సాఫల్యము లేదు. ప్రజలు నాయందత్యంత ప్రేమానురక్తులు. గంధర్వ రాజకుమారిపై నాకుగల అనురాగము లెక్క కట్ట వీలులేనిది. జన్మభూమి వదలి పెట్టరానిది. దేవి కాదంబరి తప్పక స్వీకరింపదగినది. ఆలస్యాన్ని ఎంతమాత్రం సహింపలేకున్నది నామనస్సు, హేమకూటానికి వింధ్యాటవికి మధ్య ఎంతో దూరం ఉంది. ఇటు తలిదండ్రులు బంధుమిత్రులు – అటు ప్రాణాధికప్రియురాలు కాదంబరి. ఈ రెంటిలో ఏది ప్రస్తుతం అనుసరింపవలసిన దారి?" అని ఈ విధంగా ఎటూ తేల్చుకోలేని ఆందోళనతో చంద్రాపీడుడున్నాడు.

ఐనా, చంద్రాపీడుడు తల్లిని చూచే నిమిత్తం, దిక్కులన్నీ అంధకారంతో నిండినట్లు తలస్తూ, పత్రలేఖ తనకు చేయి అందింపగా ప్రతీహారి మార్గం చూపుతూ ముందు నడుస్తూ ఉండగా మాతృమందిరానికి బయలుదేరాడు. అక్కడ తల్లి ఇతనికి అనేకవిధాలుగా మాతృప్రేమను చవిచూపింది. లాలించింది. చంద్రాపీడుడు తన ప్రియావియోగ దుఃఖాన్ని లోపలనే అనుభవిస్తూ ఆ పగలంతా అక్కడనే గడిపాడు.

## 55. చంద్రాపీడుని విరహబాధ

లోకంలో తన మనస్సులో లాగానే అంధకారం అలముకొన్నది. చక్రవాకదంపతులు చీకటిలో ఒకరినొకరు గుర్తింపలేక పరస్పర వియోగం చేత దీనంగా అరుస్తున్నై. చంద్రుని కిరణాలు వాడి బాణాలలాగా వియోగిజనులకు బాధాకరమౌతున్నై. చక్కగా వికసించిన కలువభామల సుగంధపూరిత శ్వాసమారుతాలు గాలిలో కలిసి వీస్తున్నై. చంద్రాపీడుడు

శయనం మీద ఏదో కనులు మూసి పడుకున్నాడన్న మాటేగాని అతనికి కంటి మీద కునుకే లేదు. అతని పాదాలు హేమకూటం నుంచి వచ్చిన మార్గ గమనం వల్ల కలిగే బాధను అనుభవిస్తూనే ఉన్నాయి. పిక్కలు, తొడలు పీడను కలుగజేస్తున్నాయి. చంద్రాపీడుడు తన అవయవాలను కాదంబరీ అవయవాల సంయోగాన్ని మానసికంగా ఊహించాడు.

చంద్రాపీడుడు ఆరోజునుండి కాదంబరి నెలాగైనా కాపాడాలనుకొన్నాడు. వారిద్దరి మధ్యనున్న దూరాన్ని అతడు లెక్క చేయలేదు. మానసికబలంతో చంద్రాపీడుడు కాదంబరిని రక్షింపబూనుకొన్నాడు. ముందుగా వాడి పూలబాణాలు విసురుతున్న మన్మథుని దూషించాడు. ఆ బాణాలకు తాను గురియయ్యాడు. "ఏమయ్యా! మన్మథా! వినూతనమైన మాలతీ పుష్పాలలాగా కోమలమైన కాదంబరి శరీరం మీద బాణాలు వేసి గుచ్చటానికి నీకు సిగ్గు ఎందుకు వేయటం లేదు?" అని అతనిని దూషిస్తున్నట్లు బాష్పాలు వదిలాడు. ఆ బాణాలు తగిలి మూర్ఛితురాలైన కాదంబరిని మేల్కొల్పటానికా అన్నట్టు (సుదీర్ఘాలైన) నిట్టూర్పులు వదిలాడు. ఆమె మూర్ఛనుండి తేరుకొనగా సంతోషించిన వానిలాగా శరీరమంతా రోమాంచాలు కలవాడైనాడు. ఈ మన్మథ బాధను నీవు తట్టుకోగలుగుతున్నావా? లేదా అని పరామర్శించటానికి తన మనస్సును కాదంబరి వద్దకు పంపినాడన్నట్లుగా చంద్రాపీడుడు శూన్యహృదయుడై ఉన్నాడు. కాదంబరి క్షేమవార్త వినటానికా అన్నట్లు, మనస్సురాకకు ఎదురుచూస్తున్నట్లుగా అతడు మౌనంగా ప్రతీక్షిస్తున్నాడు. చంద్రాపీడునికి మిగిలిన లోకం కనపడటమే లేదు. ఎక్కడ చూచినా కాదంబరియే కానవస్తోంది.

చంద్రాపీడునికి నిండు చంద్రుడు ఆహ్లాదాన్ని కలిగింపలేదు. కాదంబరి వార్తలతో చెవి నిండిపోయినట్లు అతడు వేరే ఏ శబ్దాలు వినటం లేదు. మనోహ్లాద కరాలైన వీణాదిధ్వనులు అతనికి దూరంగా ఉన్నై. సుభాషితాలను తన దరిదాపులకే చేరనీయలేదు. మిత్రుల మధురవచనాలు కూడా



కర్ణకఠోరాలుగా ఉన్నై. బంధుమిత్రుల ప్రేమపూరిత వచనాలు అతనికి ఎంతమాత్రం సుఖం ఇవ్వటం లేదు. తన మనస్సులోని భావాలు తెలుసుకుంటారేమో అని భయంతో ఎవరితోనూ మాట్లాడటమే మానివేశాడు. ఎవరికీ కనబడకుండా ఉన్నాడు. నిరంతరం మన్మథుడనే అగ్నిచేత లోలోపల దహింపబడుతున్న వాడైనప్పటికి పెద్దలకు తెలుస్తుందేమోననే సిగ్గుతో అప్పుడే కోయబడిన తామరపూల శయ్యపై పడుకొనదలప లేదు. నీరోడుతున్న తామరతూడుల్ని శరీరంపై కప్పుకోలేదు. నీటిబిందువులు ముత్యాల్లాగా, నక్షత్రాల్లాగా మెఱిసే తామరాకులను తన సమీపమందు పెట్టుకొనలేదు. చిగుఱుటాకు జొంపాల్ని తయారు చేయింపదలచలేదు. నీటి ధారలు నిరంతరం పడుతుండటం చేత ఎగసిపడే నీటితుంపురులచేత వర్షపురోజులా కనిపించే ధారాగృహాన్ని కంటితో కూడా చూడలేదు. నిత్యము మకరందధారలు స్రవించటం చేత చల్లదనం కలిగిన ఉద్యానవనాలు కలిగిన భవనం ప్రవేశింపనే లేదు. చందన మిశ్రితసుగంధశీతలజలాలు ప్రవహించే మణివేదికలపై పడిపొరలలేదు. చంద్రకాంత మణులతో నిర్మితమైన అద్దాలను దాసీలు ఎదురుగా పట్టుకొన్నా చంద్రాపీడుడు ఆ దర్పణాలలో తన ప్రతిబింబాన్ని పడ నీయలేదు. ఇన్ని ఎందులకు? చివరికి కొద్దిగా ఎండిన చందనాన్ని పాదాల దగ్గఱ నుంచి రాయవలసిన దానిని కూడా ఏమాత్రం పూసుకొననే లేదు.

చంద్రాపీడుని శరీరం రాత్రింబవళ్ళు మన్మథుడనే అగ్ని వేడిమికి దేహంలోపల, బయటకూడా ఉడికిపోతున్నట్లున్నది. అతనికి కించిత్తు కూడా సుఖం కలగటం లేదు. శరీరం కృశించిపోతున్నది. శరీరం ఆ అగ్ని వేడిమికి భస్మమైపోతోంది, అయినా శరీరంలో మృదుత్వం మాత్రం క్రమంగా పెరుగుతూనే ఉంది. ఏది ఏమైనా చంద్రాపీడుడు పరులకు తన పరిస్థితి తెలియకుండా జాగ్రత్తపడ్డాడు. కాని మన్మథుని పూలబాణాలు తగలకుండా జాగ్రత్తపడలేక పోయాడు. శరీరం కృశత్వానికి గురియైనా సహించాడు. సిగ్గును

మాత్రం సహించలేకపోయాడు. శరీరమును పోషించే విషయంలో శ్రద్ధ చూపలేక పోయాడే కాని, కులమర్యాదను కాపాడుకొనే విషయంలో శ్రద్ధ చూపాడు. ప్రజలను తన వద్దకు రాకుండా నివారింపగలిగాడే కాని, మన్మథుని బాణాలను నివారింపలేక పోయాడు. సుఖాన్ని తృణీకరించి వదిలి వేశాడేగాని, ధైర్యాన్ని మాత్రం వదలలేదు.

చంద్రాపీడుడు కాదంబరి గుణగణాల గొప్పదనానికి లొంగిపోయాడు – కాని, తలిదండ్రుల ప్రేమతో ముడిపడిన అనుబంధాన్ని వదులుకో లేక పోయాడు. ఉజ్జయినిలో చంద్రాపీడుడు నిలవలేక పోతున్నాడు. కాని చంద్రాపీడుడు గాంభీర్యంలో సముద్రుడు. చంద్రుని చేత సముద్రుడు ఉప్పొంగినట్లు చంద్రాపీడుడు ప్రేమ వెన్నెలకు ఉప్పొంగిపోతున్నప్పటికి పెద్దల యందున్న గౌరవంతో ఆ పొంగును ఆపుకుంటూ తనను తాను నియం త్రించుకొన్నాడు. అతడక్కడున్న ఆ కొద్దిరోజులే ఆతని పాలిట ఎన్నోవేల రోజుల్లా అయినాయి. అతికష్టం మీద కొద్ది రోజులు గడిచాయి.

## 56. కాదంబరి వద్దనుండి కేయూరకుని రాక

ఒకనాడు యువరాజు చంద్రాపీడుడు నగరంలో ఉండలేక గాలి పీల్చుకొందామని పత్రలేఖతో కూడి నగరబహిఃప్రదేశానికి వచ్చాడు. సిప్రానదీ తీరంలోకి వచ్చాడు. అలల తాకిడికి లేచిన చల్లని జలబిందువుల చల్లదనంతో కూడిన వాయువులు వీస్తున్నై. నదిలో ఈదులాడుతున్న కలహంసలు, చక్రవాకాలు జంటలు జంటలుగా విహరిస్తూ మనోహరంగా కూతలు పెడుతున్నై. అక్కడి మెత్తని ఇసుకతిన్నెలమీద సంచరిస్తున్నై. చంద్రాపీడుడు మనస్సు చల్లబరచుకొంటుండగా అతనికి దూరంగా వస్తున్న అశ్వసైన్యం కళ్ళబడింది. ఆ ఆశ్వికులు కలుసుకుంటున్నారు విడిపోతున్నారు. ఒకరినొకరు ఒరుసుకుంటూ, తోసుకుంటూ స్వారీ చేస్తున్నారు. ఉత్సాహంతో కేరింతలు కొడుతున్నారు. పైకి నిలువబడి తమ దేహదైర్ఘ్యాన్ని చూపుతున్నారు. గుంపులు గుంపులుగా వస్తున్నారు. వరుసలు చీలి ఇష్టం వచ్చినట్లు గుఱ్ఱాలను



నడుపుతున్నారు. కొంతమంది గుఱ్ఱాలపైనుండి కిందకు జాఱుతున్నారు. కొందఱు గుఱ్ఱాలను తొందరిస్తూ కొడుతున్నారు. ఎంతో దూరం నుంచి రావటం చేతవారంతా నీరసపడి ఉన్నారు. ప్రయాణం పూర్తయిందని సంతోషపడుతున్నారు.

చంద్రాపీడుడు వారిని చూసి వారెవరో చూసి రమ్మని ఒక సేవకుణ్ణి పంపాడు. తాను కూడా తొడలలోతున్న సిప్రానదిని దాటి అవతలి ఒడ్డుకు చేరుకొన్నాడు. అక్కడ కుమారస్వామిఆలయంలో కూర్చుని వార్తకు ఎదురు చూస్తూ ఉన్నాడు. చంద్రాపీడుడు ఆ వచ్చేవారిని బాగా పరిశీలనగా చూసి, తన ప్రక్కనే కూర్చున్న పత్రలేఖను చేతితో తట్టి, "పత్రలేఖా! చూశావా? పెద్ద వ్రేలాడే కేశజాలంతో అందరికంటె ముందుగా వచ్చే ఆశ్వికుడు పరిశీలనగా చూస్తే కేయూరకుడే అనిపిస్తోంది. ఇలా చంద్రాపీడుడు అనుకుంటూ ఉండగానే తాను పంపిన సేవకుడు చంద్రాపీడుడున్న ప్రదేశము నిర్దేశింపగా కేయూరకుడు కూడ ఆ ప్రాంతమునకు వచ్చి దూరముగా ఉండగానే గుఱ్ఱము దిగి నమస్కారం చేస్తూ వస్తూ ఉన్నాడు. అతనిని చూడగనే ప్రీతి కనబరుస్తూ 'రావయ్యా రా! అంటూ చేతులుచాపి అతనిని ఆహ్వానించాడు.

కేయూరకుడు చంద్రాపీడుని వద్దకు వచ్చి మరల నమస్కరించాడు. చంద్రాపీడుడు అతనిని ఆదరించి, అతనితో వచ్చిన ఆతని సహచరులను పలుకరించి, కేయూరకునితో – "కేయూరకా! నీరాక కాదంబరి, కాదంబరి పరివారం అంతా కుశలంగా ఉన్నారన్న విషయం తెలియజేస్తోంది. మిగతా విషయాలంటావా! అవన్నీ నెమ్మదిగా విశ్రాంతి తీసుకొని చెప్పుకోవచ్చును" అని పలికి కేయూరకుని పత్రలేఖను కూడా ఏనుగుపై ఎక్కించుకొని బయలు దేరాడు. కేయూరకుడు, "ఈ మనిషికి సుఖమెక్కడిది లెండి అంటూ బయలుదేరాడు. నెమ్మదిగా తన భవనం చేరుకొన్నారు ముగ్గురూ చంద్రాపీడుడు భవనం చేరుతూనే రాజకుమారులందర్నీ అవతలకు పంపాడు. సేవకుల చేత అతిథి మర్యాదలన్నీ కేయూరకునకు చేయించాడు పరివారాన్ని కూడా

దూరంగా పంపివేసి, పత్రలేఖను కూర్చుండ జేసి, కేయూరకునితో, "కేయూరకా! ఇప్పుడు చెప్పు. కాదంబరి ఏం చేస్తోంది, మదలేఖ ఏమంటున్నది? మహాశ్వేత ఏమైనా సందేశం పంపిందా!' అని ప్రశ్నించాడు చంద్రాపీడుడు. కేయూరకుడు కూడా కుదురుగా కూర్చొని వినయంగా ఇలా అన్నాడు–

"ప్రభూ! ఏమని చెప్పను ? కాదంబరిగాని, మదలేఖగాని, మహాశ్వేతగాని నాకు ఒక్క ముక్క సందేశంకూడా చెప్పిపంపలేదు. మీ పత్రలేఖను మేఘనాథునకు అప్పగించి, తిరిగి వచ్చి మీరు ఉజ్జయినీ నగరానికి వెళ్ళిన వృత్తాంతం చెప్పాను కాదంబరీ మహాశ్వేతలకు. మహాశ్వేత పైకి చూసి, దీర్ఘమైన వేడినిట్టూరులు విడుస్తూ బాధతో, 'అలాగా' అని లేచి, మరల తపస్సు చేసుకొనేందుకు తన ఆశ్రమానికి వచ్చేసింది. కాదంబరికి తన హృదయంపై సుత్తితో బాదినట్లు, తలపై హఠాత్తుగా పిడుగుపడినట్టు కన్నులు మూసికొని మూర్ఛనొందిన దానిలాగా నిస్తేజితురాలైంది. ఆమె దోచుకోబడిన దానిలాగా, అవమానితురాలిలాగా, మోసగింపబడినదానిలాగా, మనస్సు పాఱవేసికొన్న దానిలాగా అయిపోయింది. ఆమెకు మహాశ్వేత వెళ్ళిపోయిన సంగతి తెలియదు. చాలాసేపు కనులు మూసుకొని అలాగే ఉండిపోయింది. సిగ్గు పడసాగింది, ఏదో మఱచిపోయిన దానిలాగా ఆశ్చర్యంగా అలాగే చూస్తూ ఉండిపోయింది. ఏమయ్యా! మహాశ్వేతకు నా పరిస్థితిగూర్చి, చంద్రాపీడుడు ఉజ్జయినీ నగరం వెళ్ళిపోయాడని చెప్పు అని నాకు చెప్పింది. మదలేఖతో, "మదలేఖా! ఇప్పుడు చంద్రాపీడుడులాగా ప్రేయసిని కష్టాల్లో వదిలేసి తనదారిన తాను పోయినవాడు ఎవడైనా ఉన్నాడా? ఉండబోతాడా? నవ్వు చెప్పు?" అని దెప్పిపొడుస్తూ, లేచి, లోనికి ఏ పరివారాన్ని రాకుండా నిషేధించి ప్రక్కపై బడి, పై ఉత్తరీయంతో తలపై ముసుగు వేసుకొని, ఎంతో బాధ చెందుతున్న మదలేఖతో కూడా మాట్లాడకుండా రోజంతా (పగలంతా) అలాగే ఉండిపోయింది.

యువరాజా! నేను మరునాడు ఉదయమే వచ్చాను. నన్ను చూచి కాదంబరి" దృఢశరీరం కలిగిన మీవంటి వారి విషయంలో, మరణిస్తారేమో అనే భయంతో నేనిలా అయిపోయినాను. మీవంటి సమర్థులుండి కూడా నేనీ స్థితిలో ఉన్నాను అని నిందిస్తున్నట్టుగా, "మీ బోటివారు, నాగూర్చి ఎంతమాత్రం పట్టించుకోని వారు నాకు పరిచారకులుగా ఉండనక్కఱలేదు" అని బెదిరిస్తున్నట్లుగా, ఇంకా ఎందుకు నా ఎదురుగా ఉన్నావు' అని లోపల నుండి పైకి తన్నుకు వస్తున్న కోపంతో బెదిరిస్తున్న దానిలాగా కళ్ళ వెంట బొట బొట నీరు కారుస్తూ, చాలా సేపు నావంకే చూసింది. ఆమె నావైపు అలా చూస్తూ, అలా దుఃఖిస్తూ ఉంటే అదే నా కామె ఇచ్చిన ఆజ్ఞగా భావించి ఆమెకు చెప్పకుండా నేను మీపాద సన్నిధికి వచ్చాను మిమ్ములనే నమ్మిన ఆమె ప్రాణరక్షణమే లక్ష్యంగా పెట్టుకొన్న ఈ కేయూరకుని యొక్క దీనప్రార్థనను వినటానికి మీరనుగ్రహించాలని వేడుకొంటున్నాను–



"దేవా! నా మొఱ ఆలించండి మీరు మొదటిసారి గంధర్వలోకానికి వచ్చినప్పుడు అంతఃపుర కాంత లందఱు సుందరోద్యానవనం మలయానిలానికి స్వాగతం పలికినట్లు మీకు ఆహ్వానం పలికారు. సకల లోకాభిరాములైన మిమ్ము చూచి వసంతుడు అశోకతరులతను అధిరోహించినట్లు, కాదంబరిని మకరకేతనుడు ఆక్రమించాడు. అందువలననే ఆమె మీ కొఱకు దురంత దుస్సహ మదనవేదనను అనుభవిస్తోంది. సూర్యుడు ఉదయించినది మొదలుకొని సూర్యకాంతమణులనుండి పుట్టిన అగ్నివలెనే మన్మథుడనే అగ్నివలన పుట్టిన అగ్ని ఆమెను బాధింపసాగింది. అగ్ని మండేటప్పుడు శబ్దం చేయదు. గాలి తాకిడికి మండదు. పొగరాదు. భస్మం కనపడదు. అటువంటి అగ్ని దాసీల చేతులలోని చల్లని విసనకఱ్ఱ గాలికి చల్లారేదేనా? ఆ విసనకఱ్ఱల నుండి వెదజల్లబడు నీటితుంపురులకు ఆ అగ్ని శాంతిస్తుందా? రసవంతమైన హరిచందనపు పూతల వలన తగ్గేదా? ముత్యాలపొడి చల్లినంత మాత్రంచేత శాంతత చేకూఱుతుందా? ధారాగృహంలో హంసప్రతిమల నుండి వెదజల్లబడు చల్లని నీటితుంపురులవల్ల ఈ బాధ శాంతిస్తుందా? గిరగిర తిరుగుతున్న జలయంత్రాల నుండి

విసరబడుతున్న అతిశీతలములైన నీటిబిందువులు మీద బడుతుంటే కాదంబరికి చల్లదనం కలగకపోగా మెఱుపు తీగలవేడిమి తగిలినట్లు తీవ్రబాధ చెందుతోంది. మదనాగ్ని ఆమెను నిరంతరం బాధిస్తూనే ఉంది. శిశిరోపచారాలు ఎన్ని చేసినా అవన్నీ మొల్లమొగ్గలు వికసించినట్లు తాపాన్ని ప్రజ్వలింపజేస్తున్నాయి ఆమె ముఖకమలాన్ని ఆవరించిన స్వేదబిందువులు మహారాజా! ఈ చిత్రం చూశారా! అగ్ని పరిశుద్ధమైన వస్త్రపుటంచు తగులబడక పోగా ఇంకా ప్రకాశించినట్లు కాదంబరి మన్మథాగ్ని పీడితురాలైనా కూడా దినదినానికి ఆమె సౌందర్యం పెరిగిపోతోంది. జలబిందువు మొదట మృదుస్వభావం కలదైనా కూడా ముత్యంగా మాఱినపుడు ఎలా కఠినంగా మారుతుందో అట్లాగే కాదంబరి" మున్నగు అబలల మనస్సుకూడా ఈ బాధల వలన ఆరితేరి కఠినంగా మారుతుందేమో! అందుకే ఇంత సంతాపం అనుభవిస్తున్నప్పటికి ఆమె కొద్దిగానైనా వసివాడి పోలేదు. ప్రియుని కలుసుకోవాలనే కోరిక మిక్కిలి బలమైనది కదా! అందువల్లనే సహింపరాని బాధలకులోనై కూడా ఇంకా ప్రాణాలు ధరించియే ఉన్నది కాదంబరి.

యువరాజా! నేనీ పరిస్థితులలో ఏం చెయ్యాలో, ఏమి చెప్పాలో, ఏ విధంగా తెలియజెయ్యాలో, ఏ ప్రకారంగా ఉన్నస్థితిని ఎఱుక పరచాలో, ఏ యుక్తితో ప్రకటించాలో, ఎలా దీన్ని చక్కదిద్దాలో నా కర్థమవటం లేదు. ఆ నిద్రపోయే కాసేపు ఏమి ప్రశాంతత అనుభవిస్తోందో! ఇంతకాలం నుంచి ఆమెను నేను చూస్తున్నాను గాని ఇంత దీనావస్థలోనున్న కాదంబరిని ఇంతవఱకు చూడలేదు. సూర్యుని ప్రచండ కిరణాల ధాటికి వాడిపోని పద్మాలను శయనంగా చేసి కాదంబరిని పడుకొనబెడితే అవి కాసేపటికీ వాడిపోతున్నాయంటే ఆమె తన వంటి వేడితో సూర్యుని వేడిమిని జయించినట్లే కదా! దయావిహీనుడైన, దుష్టస్వభావుడైన మన్మథుని చేత వేధింపబడుతూ ఆమె ఏవో ఏవో పిచ్చి పనులు చేస్తూ ఉంది. ఎలాగంటే –



"నీవేమాత్రం మన్మథబాధను తట్టుకోలేకపోతున్నావు. మరి అంతకఠిన హృదయుడైన చంద్రాపీడుని గుండెలలో ఎలా ఉండగలుగుతున్నావు?" అని పరిహసిస్తూ చెలికత్తెలు ఆమెను మెత్తని పూల శయ్యపై చేరుస్తున్నారు.

పుష్పశయనంపై చేరిన ఆమె పాదాలకున్న పారాణి అంటుకొన్న పూలు మన్మథబాణాలుగా ఉపయోగింపబడి గుండెలలో దిగి రక్తం అంటుకొన్న వానివలె కనబడుతున్నాయి. వాటిని చూస్తేనే మిక్కిలి భయం కలుగుతోంది. మన్మథుని బాణాలు కాదంబరి సర్వావయవాలపై పడుతున్నాయి. ఆ బాణాలనుండి కాపాడబడటానికి కవచం తొడుగుకున్నట్లు మీ నామోచ్చారణ చేత కలిగిన రోమాంచాలు కనబడుతున్నై. దేవా! మీ వియోగదుఃఖం చేత ఆమె దినదినము కృశించిపోతున్నది. అందువలన బంగారు కడియంతో పాటు మనస్సు గూడా జాఱిపోతుందేమోనని మాటిమాటికి తన చేతిని హృదయాన్ని ఆనించి ఉంచుతున్నది. నీళ్ళోడుతున్న లీలాకమలముల మాలికను దాసీలు ఆమె శరీరంమోద వెట్టితమ చేతులు ఆనించి ఉంచటంచేత ఆ మాలిక వాడిపోతున్నది. మొలత్రాడు కాళ్ళకు అడ్డుగా జాఱుతోంది. పిఱుదుల వైశాల్యంచేత నడుము వణుకుతోంది. మనస్సు ప్రియసంగమంకోసం ఉవ్విళ్ళూరుతోంది. హృదయం మీకోసం తహతహలాడుతోంది. ఱొమ్ములపై తామరతూటి సమూహాలు పరచబడినై. ప్రాణాలు కంఠంలో నిలచి ఉన్నై. కమలములవంటి చేతులలో ముఖాన్ని ఉంచుకున్నది. మీ నామోచ్చారణ చేస్తూంటేనే కన్నీటి ధారలు స్రవిస్తున్నై. ముఖవధిమీద చందన చర్చ చేయబడింది. భుజంమీద జడభారాన్ని మోస్తోంది. మిమ్ము చూడాలనే కోర్కెతో ఆ హృదయం బ్రద్దలయ్యేట్లుంది. ఎవరినో పిలవబోయి ఇంకొకరిని పిలచి సిగ్గుతో జీవితేచ్ఛ వదులుకోవాలనుకొంటోంది. ఆమె తఱుచు స్పృహ కోల్పోతోంది. ఆర్తితో ప్రక్కపైనుండి లేచి అటు ఇటు తిరుగుతోంది.

ఆమె మాటమాటకు ఉద్యానవన సరోవరంలో స్నానమాడుతోంది, అక్కడి నుండి లేచి తమాల వీధిలోకి వెళ్తోంది. అక్కడ నున్న తమాల వృక్ష శాఖమీద

తనసన్నని బాహులత ఆనించుతోంది. కాసేపటి తర్వాత సంగీత గృహానికి వెళుతోంది. అక్కడ మధుర మృదంగ వాద్య ధ్వనికి మనస్సు ఆదోళించగా మయూర ప్రతిమలు నీరు స్రవించే ధారాగృహాన్ని చేరుకొంటోంది. అక్కడ స్థిరంగా ఉందా? లేదు – ఎగసి పడేజల ధారలనుండి చిందుతున్న బిందువుల చల్లదనానికి పులకించే దేహంతో కడిమిమొగ్గలాగా వణుకుతూ అంతఃపురకమల సరోవర సమీదానికి వెడుతోంది. అక్కడా ఆమెకు స్థిమితం చిక్కలేదు. అక్కడి పెంపుడు హంసలు చేసే మధుర ధ్వనులు విన లేకపోతోంది. అక్కడి నుండి బయలుదేరి కాలి అందెలు శరీర కృశత్వంచేత తీసివేయబడటంచే సంతోషిస్తోంది కాదంబరి. తమకు తీనెత్రాగుటకు వీలులేకుండా చేసి పద్మాలన్నీ, శైత్యోపచారానికీ వాడటంచేత కాదంబరిపై కోపగించిన తుమ్మెదలతొదకు ఉద్రేకపడుతోంది. అక్కడి కోయిలలు తమ కూతలకు ఎవరో ఎదురుకూత లివ్వటం చేతకోపగించినవై కూతలు పెడుతుంటే ఆ ధ్వనులకు కాదంబరి ఆందోళనపడుతోంది. కాదంబరి విరహవేదనను అనుభవిస్తూ ఉండటంచేత ఆమె కపోలాలు తెల్లలాటినై. ఆమె కపోలాల కాంతితో సమానకాంతికలిగిన మొగలి లేత తేకులముంద్లు తాకి ఉద్రేకితురాలౌతోంది. ఈవిధంగా రకరకాల బాధలనుభవిస్తూ కాదంబరి పగలు గడుపుతున్నది.

యువరాజా! ఇక రాత్రివేళల్లోనూ ఆవిడ బాధపడక తప్పలేదు. చంద్రోదయం కావటంతో లోకంలో చీకటితో పాటు కాదంబరి హృదయంలోని ధైర్యం కూడా పటాపంచలౌతోంది. చంద్రోదయంవల్ల కాదంబరీ హృదయపద్మం సంకోచత్వాన్ని పొంది కుందుతోంది. చంద్రోదయ కారణంగా – కలువల వికాసం మన్మథుని విజృంభణకు మూలమవుతోంది, ఆ చంద్రోదయం వలన హృదయం చంద్రకాంత శిల ద్రవించినట్లు జలం ధారాపాతంగా కనులనుండి స్రవిస్తోంది. చంద్రోదయంవలన సముద్రపుటలలు విజృంభించినట్లు కాదంబరి శ్వాసపరిధి పెరుగుతోంది. చంద్రుని రాకవలన చకోరాలు వియోగాన్ని పొందినట్లు మనోరథాలు విఫలమౌతున్నై.



కాదంబరి వియోగతాపం భరింపలేక సీత్కారం చేస్తుంటే తెల్లని దంతకాంతులు మన్మథుని బాణాలకు గుండెలకు పడిన రంధ్రాలలో ప్రవేశించిన చంద్రకిరణాలను తిరిగి బయటకు పంపుతున్నట్లుగా మెరుస్తున్నై. శరీరము వణుకుతున్నప్పుడు వీయటానికి ఉపయోగిస్తున్న అరటి ఆకు ఆమెకు ఎలా వణకాలో నేర్పుతున్నట్లుంది. కంఠందాకా వచ్చిన ప్రాణాలకు పూర్తిగా బయటకు పోయే మార్గం చూపుతున్నట్టుగా కాదంబరి పెద్దగా ఆవులిస్తోంది. చంద్రకాంతి మణిదర్పణాలలో అన్నింటిలో కాదంబరి ప్రతిబింబాలు ప్రతిఫలించటం చేత ఆమె మదనబాధతో అన్నిముక్కలుగా చేయబడినట్లుగా తోస్తోంది. కుసుమ శయ్యలమీద పవళించినప్పుడు పుష్పసువాసనల చేత ఆకర్షింపబడి గుంపుగా మూగిన నల్లని తుమ్మెదలు ఆమె పొగచేత నిండిందన్నట్లుగా తోస్తోంది. స్వచ్ఛమైన కమలాల శయ్య యందున్నప్పుడు లేత ఎరుపురంగుతో కూడిన పుష్పరాగము అంటుకొన్న కాదంబరి అగ్ని పరివేష్టిత అయినట్లు భాసిస్తోంది. స్వేదప్రక్రియచేసే సమయంలో స్వేదంశరీరం నుండి బయటకు వచ్చి రక్తం శుభ్రపడటంకోసం కర్పూరపు పొడి వంటికి రుద్దగా ఆమె భస్మీభూతమయిందా? అనిపిస్తోంది. యువరాజా! కాదంబరి విరహబాధ ఎంత చెప్పినా తక్కువేఔతుంది.

"ప్రభూ ఏమని చెప్పమంటారు కాదంబరి చేసే ప్రేమోన్మాద చేష్టలు – ఎన్నని చెప్పమంటారు? ఆమె ముగ్ధత్వం చేతనా, లేక ఉన్మాదం చేతనా ఎంత ఆలోచించినా అర్థం కావటం లేదు – ఆమె సంగీత శాలలో మధుర మృదంగ ధ్వనులు వినిపిస్తుంటే అక్కడున్న మరకతమణులతో చెక్కిన నెమళ్ళు కేకీరవాలు చేస్తాయేమో అన్నట్లు వాటి నోళ్ళు చేత్తో గట్టిగా మూస్తోంది ప్రభూ! దీన్ని ఏమంటారు చెప్పండి. ప్రాణులకు ప్రతిమలకు కల తేడా గుర్తింపలేనిదైంది కాదంబరీదేవి! అంతేకాదు ప్రభూ! చీకటి పడబోయే సమయంలో వియోగ బాధ పొందకుండటానికి గోడలపై గీయబడిన చక్రవాకదంపతులను తామర తూటితో సంబంధం కూర్చాలని ప్రయత్నిస్తోంది.

యువరాజా! చెప్పక తప్పటం లేదు. కాదంబరీదేవి ఊహలలో తేలిపోతూ మీతో సంగమిస్తున్నట్లు భావిస్తూ వెలుగును నివారించటానికి రత్నదీపాలను తన చేతిలోని తామరపువ్వులతో మోదుతున్నది. మీ వద్దకు దూతికలను పంపాలని తలచి కలలో మీరు చేసిన అపరాధాలను నిందాపూర్వకంగా తెల్పుతూ సందేశం పంపబూనుకొంటోంది. తామరాకుపై జలబిందువు లాగా కంపిస్తోంది. చంద్రకిరణ స్పర్శచేత పద్మంలాగా వాడిపోతోంది, హంసలాగా రసవంతమైన తామరతూడులు హారంగా (ఆహారంగా) జీవిస్తోంది. కాదంబరి శరత్కాలంలాగా పద్మాలు కలువల యొక్క సుగంధం కలిసిన గాలితో కుసుమబాణంలా చెలరేగుతోంది. చంద్రునిలాగా కలువల సమూహాల్లో తిరుగుతూ రాత్రి గడుపుతోంది.

దేవా! ఇన్ని చెప్పటెందుకు? ఇప్పుడామెకు చెలికత్తె లందరి పేర్లూ మీ పేర్లే. ఏ రహస్యం చెప్పుకొన్నా మీగుఱించే, ఏ ప్రశ్నవేసినా మిమ్ము నిందించేందుకే. ఏ పరిచారికలైనా మీగూర్చే చెప్పుకోవటం, కలలు కనటం మిమ్మల్ని మళ్ళీ మళ్ళీ చూడటం కొఱకే? అంటూ ఇలా చాలాసేపు కేయూరకుడు చెప్పగా యువరాజు ఇక వినలేకపోయాడు. కాని కేయూరకుడు ఇంకా చెప్పవలసియే ఉన్నాడు. కొద్దిసేపు చంద్రాపీడుడు మూర్ఛావస్థలోకి వెళ్ళాడు.

కేయూరకుడు తాలవృంతంతో చల్లని గాలిని వీచి సపర్యలు చేయగా కొద్దిగా స్పృహలో కొచ్చాడు. మంచంపై వెనుకకు ఆనుకొని సగం పడుకొన్నాడు చంద్రాపీడుడు. కాదంబరి ప్రస్తుత పరిస్థితికి తానే కారకుడను గదా అని అతడు భయపడ్డాడు. సిగ్గుపడ్డాడు. విస్మయం చెందాడు, కళ్ళ నీరు తిరుగుతుండగా డగ్గుత్తికతో కేయూరకునితో ఇలా అన్నాడు – "కేయూరకా! ఏమిటయ్యా అలాగంటావు. నేనైతే కాదంబరి ప్రేమ విషయంలో ఇంకా స్థిర నిర్ణయానికి రానే లేదు. నీవు కూడా రెండవసారీ నావద్దకు వచ్చినది కాదంబరి పంపగా కాదు. ఆమె నాకు వినిపించమని ఏ సందేశమూ పంపలేదు. పోనీ



మదలేఖ పంపిందా? అంటే – అదీ లేదు. లేకపోతే మహాశ్వేతే పంపిందా? – పంపలేదు. నాకు సంబంధించిన విషయాలన్నీ పత్రలేఖ నాకు చెప్పింది.

అసలు కాదంబరి పెదవి విప్పి చెప్పి చెప్పకముందే పని చెయ్యటానికి అంతమంది పరిచారికలున్నారు గదా! ఒక్కరితో నైనా తాను నాకు సందేశ మివ్వలేదేమి? కాదంబరి బాధపడుతుంటే సంతోషించటం నా అభిమతం కాదు. అసలు కాదంబరి నన్ను ప్రేమిస్తున్నట్టుగా ఒక్క మాటైనా హేమకూటంలో ఉండగా చెప్పినట్లైతే ఇప్పుడీ పరిస్థితి వచ్చేది కాదు. నేనామె ఆజ్ఞను తిరస్కరించుతానా? ఇక్కడికి వచ్చిన తర్వాత కాదంబరి ప్రేమవిషయం తెలిస్తే ఏం లాభం? రోజు తర్వాత రోజు గడిచిపోతూనే ఉంది కదా! హేమకూటానికి ఇప్పుడు బయల్దేరినా కొద్దిరోజుల్లో జేరగలనా? కాదంబరి దక్షిణదేశ మలయవాయువు వల్ల తీగల నుండి రాలిన పుష్పాల దెబ్బకే ఆమె ఓర్చుకోలేదు. ఈ మన్మథ బాణాలు నావంటి కఠిన హృదయులకు కూడా సహింప వీలులేనివి. అటువంటప్పుడు కుసుమ సుకుమారి రాకుమారి ఎలా సహించగలదు? ఏ క్షణంలో ఏం జరుగుతుందో ఎవరు చెప్పగలరు? సామాన్యంగా ఈ విషయం కాదంబరికి కూడా తెలిసే ఉండవచ్చును. ఇప్పుడు ఘటనాఘటన సమర్థుడైన విధి ఏమి చేయనున్నదో ! ఈ విధికి ఎంతవఱకు దుఃఖాలను కలగజెయ్యటమే తెలుసును కాని మేలు చేయుట ఎఱుగదు. నేను వెళ్ళునంతవఱకైన కాదంబరి క్షేమంగా ఉండాలి గదా!

ఇప్పటివఱకు జరిగిన దంతా విచిత్రంగానే ఉంది. నేను కిన్నరమిథునాన్ని చూడటం ఏమిటి, వారిని తఱుముకుంటూ ఈ దేవతాభూమికి రావటమే మిటి, దాహపీడితుడినై నీరు వెదుకుతూ అచ్ఛోదసరస్సమీపానికి రావటమేమిటి? సరే పోనీ, అంతటితో పోవచ్చు గదా! అక్కడ విశ్రాంతి తీసుకొంటున్న నాకు దివ్యలోకగానం వినబడటమేమిటి? నేను ఊరుకొన్నానా? ఈ గానం ఎక్కడదో చూద్దామనే కుతూహలంతో వెదుకుతూ మహాశ్వేతను చూడటం జరిగింది. సరే పోనీ తర్వాతైనా నా దారిన నేను వెళ్ళానా? లేదే!

అంతలోనే తరలికను వెంటబెట్టుకొని నీవు అక్కడకు వచ్చావు. దాంతో నేను కూడా హేమకూటానికి ప్రయాణం కావలసివచ్చింది. హేమకూటంలో కాదంబరీదేవి దర్శనం కలిగింది. అయినా ఇటువంటి మనుజునిపై ఆ దేవకాంతకు ప్రేమకలగటమేమిటి? అన్ని కోరికలు తీరి వృద్ధుడైన నాతండ్రి వెంటనే ఉజ్జయినికి రమ్మని కోరాడు. నే నాయన కోరికను ఎలా తిరస్కరింపను? అందుచేత కాదంబరిని వదలి అంత దూరం నన్ను తీసుకొని పోయి పడవేశాడు ఈ దుష్టబ్రహ్మ, అయినా ఎలాగో ఒకలాగా దేవి కాదంబరి కోరిక నెఱవేర్చటానికి ప్రయత్నం చేస్తాను! అని

## 57. చంద్రాపీడుడు కాదంబరిని చూడదలచుట

ఇంతలో సూర్యాస్తమయం కావస్తున్నది, సూర్యభగవానుడు "అసలే కాదంబరీ వృత్తాంతం వినినందువల్ల సంతాపం చెందుతున్న చంద్రాపీడుని ఇంకా నాతేజస్సుతో బాధించటం దేనికి" అని దయతో తన వేయి కిరణాలను ఉపసంహరించుకొన్నా దన్నట్లుగా అస్తమించసాగాడు. క్రమక్రమంగా చీకట్లు వ్యాపిస్తున్నై. పద్మ సంతతులు సంకోచతను, కలువలు వికసతను పొందసాగినై. చక్రవాకాలు వియోగదుఃఖంతో కుమిలిపోతున్నై. చక్రవాకాలు కాదంబరి కూడా మా లాగానే వియోగంతో దుఃఖిస్తున్నది. అందువలన ఆమెను ఓదార్చటానికి మీరెవరైనా ఆమెవద్దకు వెళ్ళండి అని ఉపదేశిస్తున్నట్లు బిగ్గఱగా అరుస్తున్నై. చంద్రభగవానుడు సమస్తభువన సామ్రాజ్యానికి మంగళకరమైన గొడుగులాగా ప్రకాశిస్తున్నాడు. అమృతకలశంలాగా ఉన్నాడు. తూర్పుదిక్కు అనే వధువు నుదుట అలంకరించుకొన్న చందనతిలకం లాగా ఉన్నాడు. ఆకాశమనే లక్ష్మీ దేవియొక్క సౌందర్యమనే సరస్సులో ప్రకాశించే కలువలాగా ఉన్నాడు. చంద్రుడు లోకమంతటా తన అమృత కిరణాలను వెదజల్లుతున్నాడు. చంద్రాపీడుడు వల్లభోద్యానవనంలోనే ఒక చంద్రమణి నిర్మిత వేదికపై హస్తపాదాలుంచి కేయూరకుడు కాళ్ళు వత్తుతుండగా అతనితో, "కేయూరకా! ఏమిటి ఆలోచిస్తున్నావు? మనం హేమకూటానికి వెళ్ళేంతవరకైనా కాదంబరి బ్రతికి



ఉంటుందంటావా? మదలేఖ ఆమెను ఏదోవిధంగా వినోదపరచి ఉంచగలదా? కాదంబరిని ఓదార్చటానికి మహాశ్వేత మరల వస్తుందో లేదో! మహాశ్వేతామదలేఖల మాట విని నా వియోగదుఃఖాన్ని తట్టుకోగలుగుతుందా? చిఱునవ్వుతో కూడిన ఆ కాదంబరి కనులు బెదరిన లేడిపిల్ల కనుల లాగా పెట్టి ఉండగా చూడగలనో లేదో!" అని అన్నాడు.

కేయూరకుడు చంద్రాపీడునితో, "దేవా! మీరు ధైర్యం వహించి ప్రయాణానికి సిద్ధం కండి. అవతల కాదంబరి మీ రాకకై ఎదురుచూస్తూ కనులు కూడా మూయటం లేదు. మీరు వస్తారనే ఆశతోనే గుండెను దిటవు పఱచుకొని ఉంది. శరీరమెప్పుడు రోమాంచస్థితిలోనే ఉన్నది. ఎప్పుడూ కన్నీరు విడుస్తూనే ఉంది. రాత్రినిదురలు దూరమైనాయి. ఒంటరిగా ఉండగోరుతూ తన ఉనికికి తనే సహింపలేకపోతోంది. ప్రాణాలు కంఠంలోనే తిరుగాడు తున్నై" అని అన్నాడు. చంద్రాపీడుడు కేయూరకుణ్ణి విశ్రాంతి తీసుకోమని ఆదేశించాడు. తన మనస్సులో ప్రయాణానికి ఆయత్తుడయ్యాడు. "నేను ఒక వేళ తల్లిదండ్రులకు చెప్పకుండా, వారిపాదాలపై పడి నమస్కరింపక, వారి ఆశీస్సులు పొందకుండా, వారు చెప్పినట్లు చేయకుండా స్వతంత్రించి వెళ్ళినా నాకేమి ఫలితం? అలా చేస్తే నాకు సుఖమెక్కడిది? శ్రేయస్సు ఎలా లభిస్తుంది? సత్ఫలితాలు ఎలా పొందగలుగుతాను? నా మనస్సుకు సంతృప్తి ఎక్కడిది? సరే, ఈ ప్రశ్నలు, ఆలోచనలు ముందు జరగబోయేవి. వాటిని అటుండనిద్దాం. ఒకవేళ తండ్రిగారికి తెలుపకుండా వెళ్ళానే అనుకొందాం – దాట వీలుకాని యుద్ధాలనే సముద్రానికి వారధి లాంటిది. ఎవరేది కోరితే దానినిచ్చే కల్పద్రుమ శాఖలాంటిది. శత్రుపరాక్రమమనే కీర్తి ద్వారానికి అమర్చిన అడ్డుగడియ లాంటిది. సమస్తలోకముల పరిపాలనాభారాన్ని వహింపగలిన తారాపీడులవారు తమ భుజంమీద నుండి స్వయంగా తొలగించి నా భుజంపై ఉంచారు. అటువంటప్పుడు పెద్దలకు చెప్పకుండా ఒక్క అడుగు అవతలపెట్టినా, నాతో పాటుగా రథగజ తురగపదాతి చతురంగ సైన్యం కూడా నాతో పాటు ప్రయాణమై వస్తారు. సరే, రాజుల సంగతి అటుండనిస్తే,

సామాన్య ప్రజానీకం ఊరుకుంటుందా? భార్యాబిడ్డల్ని వదిలేసి అంతా నా వెనకే వస్తారు. అయినా, నాన్నగారితో చెప్పకుండా ఎలా వెళ్ళను? ఆయనకు నేనొక్కడినే కదా! వేరే ఎవరున్నారు? నాపైకొండంత ఆశపెట్టుకొన్న నాతండ్రి నేనలా వెడితే, పోనీలే వాడుంటే ఏం పోతే ఏం, నాకేమిటని ఆయన బిగింపుతో ఉండగలడా? అలా ఉన్నాగాని నా తల్లి నన్ను క్షణంకూడా వదలలేనిది ఆయనను అలా ఉండనిస్తుందా? నన్ను వెతికించమని ఒకటే పోరుపెట్టకుండా ఉంటుందా? తండ్రిగారు నన్ను వెతకటానికి బయల్దేరితే సమస్తభూమండలం అతని వెనుకనే బయల్దేరుతుంది. అప్పుడు నేనుండేది ఎక్కడ? ఎక్కడకు వెళ్ళను? ఎక్కడ విశ్రాంతి పొందుతాను? ఎక్కడ తినాలి? నన్ను నేను ఎక్కడ దాచుకోవాలి? నన్ను మరల యిక్కడకు తెచ్చినా నాముఖం ఎలా చూపాలి? వాళ్ళడిగితే నేనేమని సమాధానం చెప్పాలి? ఎలాగో అలాగ దైవనియోగం చేత ఇక్కడినుండి నేను వెళ్ళిపోయినా ఇంతవఱకు ఏ ప్రయాస చెందని తండ్రిని వేధించటమే అవుతుంది. నేను వెళ్ళిపోతే తల్లిని మహాశోకసముద్రంలో పడవేసినట్లువుతుందే తప్ప నేను సాధించే దేముంటుంది? పోనీ, తల్లిదండ్రులకు చెప్పే వెడదామను కొంటే, దేనికోసం వెడుతున్నానని చెప్పాలి? నామీది ప్రేమచేత గంధర్వ రాజపుత్రి కాదంబరీదేవి నా వలన మన్మథునిచేత ప్రయాసపెట్టబడుతూ రోదిస్తోందని చెప్పనా? లేక నాకు ఆమెపై చాలా అధికమైన ప్రేమ ఉన్నదని చెప్పనా? ఆమె లేనిదే నేను నా ప్రాణాలతో క్షణంసేపైనా జీవించలేనని చెప్పనా? నాకు కాదంబరికి అనుసంధాన హేతువైన మహాశ్వేత నన్ను ఆమెని పెండ్లి యాడమని ఆదేశించిందని చెప్పనా? లేక, కాదంబరి దుఃఖాన్ని చూసి తట్టుకోలేక నన్ను ఆమె వద్దకు తీసికొని పోవటానికి కేయూరకుడు అంతదూరం నుంచి వచ్చాడని చెప్పనా? నేను ఆమె వద్దకు వెళ్ళటానికి సరిపోయే కారణాలు కావు ఇవన్నీ,

అయినా మూడు సంవత్సరాలకు పైగా యుద్ధ యాత్రలలో తిరిగి తిరిగి ఈ మధ్యనే ఉజ్జయినికి చేరుకొన్నాను. సైన్యంకూడా ఇంకా ప్రయాణ ఖేదం



నుండి తీరుకోనే లేదు. మరలా ఏకారణం చెప్పకుండా ఏమని బయలుదేరను? తల్లి దండ్రులు నన్నెలా పంపుతారు? మిత్రుల సహాయంతో సాధింపవలసిన వ్యవహారమిది. వైశంపాయనుడు కూడా సమయానికి నావద్దలేకున్నాడు. నేనెవరి నడగను? నా కష్టాన్ని ఎవరితో చెప్పుకోగలను? నాకీ కష్టదశలో ఎవరు సలహాయిస్తారు! వైశంపాయనుడు తప్ప నాకీసమయంలో కర్తవ్యో పదేశం ఎవరు చేయగలరు? అతనికున్న ప్రజ్ఞ వేరెవరికుంది? నాకు చెప్పినా మిత్రుడే చెప్పాలి? విన్నా అతని మాటే వినాలి. అతనంత దృఢస్నేహితుడు నాకెవ్వరూ లేరు. కష్టసుఖాలలో అతనే నాతోడు. ఏం రహస్యం చెప్పినా అతనికే చెప్పేవాడిని. నేను నా బాధ్యతలన్నీ వేరే ఎవరి మీదా ఉంచి నిశ్చింతగా ఉండగలుగుతాను? వైశంపాయనునికి తప్ప వేరెవరికి నాగూర్చి ఆందోళన పడగలరు? నా తల్లిదండ్రులు కోపగిస్తే వారిని సముదాయించి నన్ను తేగల శక్తి అతనికి తప్ప ఎవరికుంది?" ఇలా ఆలోచిస్తూనే ఆ దీర్ఘమైన రాత్రిని కంటికి కునుకు లేకుండానే గడిపివేశాడు.

## 58. పత్రలేఖ కేయూరకునితో కాదంబరి వద్దకేగుట

తెల్లవారుతూ ఉండగానే స్కంధావారం దశపురం దాకా వచ్చిందట' అనే వార్తవ్యాపించింది. అది వినిన చంద్రాపీడుని మనస్సుకు ఊరట కలిగింది. తన మనస్సులో అమ్మయ్య ధన్యుణ్ణైనాను. నేను పూజ్యుడైన విధి చేత అనుగ్రహింపబడ్డాను. అతని గూర్చి అనుకొంటూ ఉన్నంతలోనే నా బహిః ప్రాణం వైశంపాయనుడు రానే వచ్చేశాడు' అని అమితానందాన్ని పొందాడు. అప్పటికే కేయూరకుడు ఆతనికి కొంత దూరం నుండే నమస్కరిస్తూ వస్తున్నాడు. అతనితో, "కేయూరకా! అనుకొన్న కార్య ఫలితం మన అరచేతిలోకి వచ్చేసింది. విను – మన వైశంపాయనుడు వచ్చేశాడు అని చెప్పాడు చంద్రాపీడుడు. అది విన్న కేయూరకుడు హేమకూట ప్రయాణానికి ఆలస్యమౌతుందనే చింతను వదలివేసి, "బలేమంచి పని జరిగింది ప్రభూ! తమకు మిక్కిలి హృదయాహ్లాదం కలిగింది అంటూ యువరాజును సమీపించి ప్రక్కనే కూర్చున్నాడు

కేయూరకుడు. చంద్రాపీడుడు పరిసరాల్లోని పరిజనులనందరిని చేసంజ్ఞచే దూరంగా పంపించి వేశాడు. కేయూరకుడు యువరాజుతో, “దేవా! మేఘానికి మెఱుపుతీగ పుట్టినట్లుగా, నీరు చేరుటచేత నల్లబడిన మేఘపంక్తివలె, చంద్రోదయం పూర్వదిక్కుకు తెల్లదనం తెచ్చినట్టు, మధుమాసం అవతరించి పరిమళించిన మలయవాయువువలె, మీరు కాదంబరీ దేవితో కలిస్తే శోభిస్తారు. ఈ వాతావరణమే మీరిరువురు తప్పక కలుస్తారని తెలుపుతోంది. మీ రిరువురు కలిస్తేనే గదా సార్థకత. వెన్నెలలేని చందమామ ఉంటాడా? పద్మాలు లేని సరోవరం ఎక్కడుంటుంది? తీగలు పూవులు లేని ఉద్యానవనం దేనికి? సర్వజనులను సంతోషపరచే వసంత మాసానికి విరగచూసిన తీయమామిడి వృక్షమే కదా! కనువిందు చేసేది! గంధగజరాజును దానధారల చేత శోభింపనివానిగా మనం తలచుకోగలమా? వైశంపాయనుడు వస్తేనే దేవరవారు నిరాటంకంగా కాదంబరి దరికి చేరగలరు. కాదంబరిలో ఓర్చుకొనే స్థితి దాటిపోయిందని ప్రభువులకు నేను ముందుగానే విన్నవించాను గదా! ప్రతి విషయమూ ఆశాభావంతోనే జరుగుతుంది. మీరు వచ్చేదీ లేనిదీ ఈ రోజుకు తెలియని కాదంబరి ఏ ఆశతో ప్రాణాలు నిలుపుకొంటుంది? నేను గనుక ఇక్కడివార్త, మీ ఆగమనం గుఱించి ముందుగాతెలిపితే, దుఃఖాన్ని దిగమ్రింగి ఎలాగో ప్రాణాలతో ఉండగలుగుతుంది. మీరు మానసికంగా ఆమె వద్దకు ఎప్పుడో వెళ్ళారు. శారీరకంగా ఇప్పుడు బయల్దేరుతూనే ఉన్నారు. నేనిక్కడుండి చేసేదేమున్నది? ప్రభువులవారి రాకనుగూర్చిన వార్తను ముందుగా నేను వెళ్ళి తెలిపేందుకు మీరు అనుమతించండి, చాలు’ అని విన్నవించాడు.

అదివిని చంద్రాపీడుడు మిక్కిలిగా సంతోషించాడు. తామర పుష్పపరంపర లాంటి తన విశాలనేత్రాలతో కేయూరకుని వంక చూస్తూ, “ఎంతబాగా చెప్పావయ్యా! కేయూరకా! నా దుఃఖాన్ని తొలగించాలనే తపనే నీలో ఉందిగాని, ఈ పరిస్థితిలో అంతదూరం ప్రయాణించే శక్తి నాకున్నదా లేదా! అని అణు మాత్రంకూడా ఆలోచించటం లేదు నీవు. ఈ పరిస్థితుల్లో నీవు తప్ప వేరొకరు



ఇంత శ్రమ తీసుకొనేందుకు ముందుకురాగలరా? నీకు తప్ప వేరెవరికి కార్యాన్ని ఎప్పుడు ఎలా చెయ్యాలో తెలుస్తుంది? నాపై ఇంత నిర్మలభక్తి నీకు తప్ప వేరొకరికి ఉంటుంది? నువ్వు యుక్తియుక్తంగా ఆలోచించావు, మంచిది. నువ్వన్నట్టే ముందుగా నీవే వెళ్ళు. నీవు ముందు వెళితే కాదంబరి ప్రాణరక్ష చేసిన వాడవౌతావు. నేను తప్పక వస్తానన్‌నే విశ్వాసం ఆమెకు కలుగుతుంది. అయితే, నీతో పాటుగా కాదంబరికి అత్యంత ప్రేమాస్పదురాలు పత్రలేఖను కూడా తీసుకొని వెళ్ళు, పత్రలేఖను చూస్తే నా రాకను ఆమెగట్టిగా నమ్ముతుంది. ఈ పత్రలేఖకు కూడా కాదంబరి మీద ఎనలేని భక్తి ప్రేమ విశ్వాసాలున్నాయి.’ అని చంద్రాపీడుడు కేయూరకునితో పత్రలేఖను పంపటానికి ఏర్పాటు చేశాడు.

అనుకొన్నట్లుగానే చిత్రలేఖను వెనుక కూర్చొండబెట్టుకొని కేయూరకుడు బయల్దేరటానికి సిద్ధమైనాడు. పత్రలేఖ తలవంచుకొని’ దేవా! నేను వెళ్ళటానికి మీరు అనుమతి ప్రసాదించండి’ అని కోరింది. చంద్రాపీడుడు ప్రతీహారి ద్వారా మేఘనాదుణ్ణి పిలిపించి, “మేఘనాధ! నీవు లోగడ పత్రలేఖను తోడుగా తెమ్మని నేను ఎక్కడికి పంపానో అక్కడికి నీవు ఈమెను ఆ ప్రదేశానికి తీసికొని వెళ్ళి దింపిరా! నీతోపాటు కేయూరకుడూ వస్తాడు. నేను కూడా వైశంపాయనుణ్ణి కలిసి మీ వెనుకనే వస్తాను’ అని ఆదేశించాడు చంద్రాపీడుడు. మేఘనాదుడు సమ్మతించి, నమస్కరించి వెళ్ళాడు. అతడు వెళ్ళగానే కేయూరకుడు, “ప్రభూ! ఇంక ఆలస్యం దేనికి? అని ప్రశ్నించాడు. చంద్రాపీడుడు కేయూరకుణ్ణి తన వద్దకు స్నేహపూర్వకంగా పిలచి, కన్నుల నీరు కమ్ముచుండగా, కౌగిలించుకొన్నాడు తన బరువైన బాహువులతో, తర్వాత తన చెవినుండి రత్నప్రభాభాసితమైన కర్ణాభరణాన్ని తీసి అతని చెవికి అలంకరించి, గొంతు దుఃఖభారంతో బొంగురుపోగా, ‘కేయూరకా! నీవు నావద్దకు వచ్చేటప్పుడు కాదంబరి నుండి ఏ సందేశమూ తీసికొని రాలేదు. కాని నేను మాత్రం నీద్వారా ఈ అపూర్వమైన సందేశాన్ని పంపుతున్నాను, దేవికి నామాటగా ఇలా చెప్పు–

"నేను నీకు అనవసరమైన ప్రయాస కలిగించాను. పత్రలేఖ నీవద్దకు వస్తున్నది. అన్ని విషయాలూ ఆమే తెలియజేస్తుంది"అని చంద్రాపీడుడు ఇలా అంటూ ఉండగా పత్రలేఖ దుఃఖావేశం ఆపుకోలేక ఆతని పాదాలపై పడింది. అతడు ఆమెను ప్రేమతో పైకి లేపి, "పత్రలేఖా! నీవు కాదంబరికి నమస్కరించి నా మాటగా ఆమెకు చెప్పు. ప్రథమదర్శనమందే నాపై ప్రేమతో దయను కురిపించిన దేవిని నేను సరిగా గౌరవించకుండానే వదిలి వెళ్ళిపోయాను. నావద్ద సుగుణాల వలె కనిపించేవి దుర్గుణాలే. నావద్ద ప్రజ్ఞకు బదులు జడత్వం, జ్ఞానం స్థానంలో మూఢత్వం, స్నేహభావం తీక్ష్ణత చేత, గౌరవం చులకనతనం చేత, ప్రియవాదిత్వం పరుషత్వం చేత, దయాగుణం క్రూరత్వంచేత కృతజ్ఞత కృతఘ్నతతో కప్పబడి దోషభూయిష్ఠాలైనై. అతని వద్ద ఏ మంచిగుణముందని తనను స్వీకరించుమని మిమ్ము కోరగలడు? కాదంబరి మాత్రం ఎలా అంగీకరిస్తుంది? నా సర్వదుర్గుణాలు దేవియొక్క సుగుణ సంపర్కం చేత బాగు చేయబడాలి. నా వద్దనున్న దుర్గుణాలను తన సద్గుణాలతో సంస్కరిస్తోంది కాదంబరి. ఆమె స్నేహగుణం నన్ను మరల మరల ఆహ్వానిస్తూనే ఉంది. ఆమె హృదయ సరళలత మన్మథాగ్నికి దహింపబడే నన్ను రక్షిస్తోంది. ఆ స్త్రీ వాత్సల్యత నన్ను ఆహ్వానిస్తూనే ఉన్నది. ఆమె మృదుహృదయత్వం పాదాల మీదపడిన నన్ను బెదిరించటంలేదు. ఆదరిస్తున్నది. ఆమె మహానుభావత నన్ను గౌరవిస్తూనే ఉంది. ఆమె యొక్క ప్రియవాదిత్వం నాతో హృదయం విప్పి మాట్లాడుతోంది. కాదంబరి ఔదార్యం తన హృదయంలో నాకు స్థానం యిస్తూనే ఉంది. అటువంటి నేను మరల ఆమె ఎదుటకు పోయినా ముఖం చూపించే సాహసం చేయలేకపోతున్నాను. దానికి కాదంబరీదేవి మంచి స్వభావమే కారణం. ఆ సత్యస్వభావం కలిగియున్నది కనుకనే ఆ కాదంబరీదేవి క్షణపరిచయం కలిగిన వారికోసంకూడా ప్రాణాల్ని అర్పించ సిద్ధంగా ఉంది" – ఈ విధంగా కాదంబరీదేవి గూర్చి గౌరవపూర్వకంగా పలికాడు.

చంద్రాపీడుడు కాదంబరికి ఈ విధంగా విన్నపం చేశాడు – "నేను సుదూర ప్రయాణం చేసి నీ వద్దకు రావటం సఫలం కావాలని కోరుతున్నాను.



నాకు ప్రపంచమంతా శూన్యం కాకుండా ఉండేటట్లు, దేవి తనను తాను ప్రాణాలతో ఉండే హృదయ దారుఢ్యాన్ని కలిగి ఉండాలని ప్రార్థిస్తున్నాను".

"పత్రలేఖా! నీవు ప్రయాణంలో ఉండి నాపై బెంగపెట్టుకోకు. శరీర పోషణ విషయంలో అశ్రద్ధ చూపకు. భోజనవేళను అతిక్రమింపనీయకు. ముక్కు మొగం తెలియని వారితో చనువుగా ఉండకు, మాట్లాడకు. నిన్ను నీవు ఎల్లప్పుడూ కాపాడుకుంటూ జాగ్రత్తగా ఉండు. నేనేం చేయను. ఈ పరిస్థితుల్లో నీ ప్రాణాలకంటే కాదంబరి ప్రాణాలే నాకు ముఖ్యం. అందుచేతనే నిన్ను ఏకాకిని చేసి పంపుతున్నాను. నీవలన కాదంబరి ప్రాణాలు కాపాడబడాలి. ఆమె ప్రాణాలనే కాదు, నా ప్రాణాలను కూడా నీవే కాపాడాలి. అందుచేత నీవు ప్రయత్నపూర్వకంగా క్షేమంగా ఉండేట్లు చూసుకో" అని ఆమెకు జాగ్రత్తలు చెప్పాడు చంద్రాపీడుడు. ఆమెను స్నేహపూర్వకంగా కౌగిలించుకొన్నాడు. కేయూరకునితో మరల మరల జాగరూకుడవై ఉండమని హెచ్చరిస్తూ", నేను మహాశ్వేతాశ్రమానికి వచ్చేసరికి నీవు పత్రలేఖతో సహ అక్కడ ఉండి నన్ను హేమకూటానికి తీసుకొని వెళ్ళాలి' అని పలికి వారిని పంపివేశాడు.

తీరా వారిని పంపిన తర్వాత చంద్రాపీడుని మనస్సులో అనేక సందేహాలు కలుగసాగినై. 'వీళ్ళు కాదంబరి దగ్గఱకు తొందరగా వెళ్ళగలరా? లేక దారిమధ్యలో ఏమన్నా ఆటంకం కలిగి ఆలస్యమౌతుందా? వెళ్ళటానికి ఎన్నిరోజులు పడుతుందో ఏమో!' అంటూ దిగులుపడుతూ శూన్యహృదయుడై కొద్దిసేపుండి సైన్య బృందం సంగతులు తెలుసుకొనేందుకు ఒక వార్తాహరుణ్ణి పంపి, ఇంతకాలం తర్వాత చూడబోతున్న వైశంపాయనునకు ఎదురువెళ్లి తేవాలనే కోరికతో తండ్రి అనుమతికోసం తారాపీడుని వద్దకు వెళ్ళాడు. అతడు వెళ్ళేసరికి తండ్రి మణి వేదికమీద కుడిచేతిని మోకాలిమీద పెట్టుకొని ఏదో ఆలోచనలో ఉన్నాడు. చంద్రాపీడుడు తండ్రిని సమీపించి ఆతని పాదాలకు ప్రణమిల్లాడు.

తారాపీడుడు దూరంనుండే నమస్కరిస్తున్న కుమారుణ్ణి చూసిసంతోషిస్తూ నీటితో నిండిన మేఘగర్జనలాంటి కంఠధ్వనితో రాకుమారా రా! అని పిలుస్తూ త్వరితంగా వస్తూ శుకనాసునికి నమస్కారం చేసి క్రింద కూర్చొనబోతున్న చంద్రాపీడుని దగ్గఱకు తీసుకొని పాదపీఠంపై కూర్చుండ బెట్టాడు. ప్రేమతో నిండిన కనులతో అతనిని చాలాసేపు చూసి, యౌవనంతో విలసిల్లుతున్న కుమారుని దేహాన్ని నిమురుతూ శుకనాసునితో", మంత్రివర్యా! చూశారా? మన యువరాజు నిండుయౌవనంతో ఎలా వెలిగిపోతున్నాడో! కుమారుని మీసములెంత సోయగము వెదజల్లుచున్నవో, మేరుపర్వతం మీద నీలమణి కాంతిరేఖలాగా, మదపుటేనుగు యొక్క గండస్థలంలో భాసిస్తున్న మదరేఖలాగా, చంద్రబింబంలోని కాలకాంతుల్లాగా, కమలాకరమునందు వ్యాపించిన భ్రమరరేఖలాగా, చిత్రపటం గీయటానికి ఉపయోగించే నల్లని కుంచెలాగా, మన్మథప్రదీపానికి పట్టిన మసిరేఖలాగా, ప్రతాపాగ్ని వల్లవ్యాపించిన ధూమలేఖలాగా, చంద్రాపీడుని రోమములవరుస అందగిస్తోంది. ఇక మనదే ఆలస్యం. యువరాజు వివాహయోగ్యుడయ్యాడు. ఇక దేవి విలాసవతితో కూడి ఒక ప్రసిద్ధవంశంలో జన్మించిన రూపవతిని మీరే అన్వేషించాలి అమాత్యా! కుమారుని అమితమైన సౌందర్య విలసితమైన ముఖం చూశాం కదా! ఇప్పుడు కోడలి ముఖకమల దర్శనం చేసికొని ఆనందించాలి మనమందఱం" అని అన్నాడు.

ఆతని మాటలాలించి శుకనాసుడు, "ప్రభువులు చక్కగా సెలవిచ్చారు. ఈ సరళహృదయుడు సర్వవిద్యలు నేర్చినవాడు. సర్వకళలు ఇతనిని వరించాయి. ప్రజాసమూహాల రక్షణ బాధ్యత చేపట్టినాడు. సకల దిక్కులనూ జయించాడు. రాజ్యలక్ష్మిని సుస్థిరంగా నెలకొల్పాడు, సకల భూమండల భారం మోస్తూనే ఉన్నాడు, ఇంకా ఏమి మిగిలింది? ఇకపెండ్లి చేసుకొనటానికి అడ్డంకి ఏమి ఉంది?" అని సెలవివ్వగా చంద్రాపీడుడు శిరమువంచుకొని సిగ్గుపడ్డాడు. తన మనస్సులో, "వీరి ప్రసంగం బాగుంది. నేను కాదంబరిని



చూడడానికి వెళ్ళాలనుకొంటున్నప్పుడే వీళ్ళు కూడా ఆవిషయమే మాట్లాడుతున్నారు. అంధకారంలో అలమటించేవానికి కాంతిగోచరించినట్టు, అడవిలో చిక్కుకున్న వానికి మార్గదర్శి దొరికినట్లుగా, సముద్రంలో పడినవానికి పడవ దొఱికినట్టుగా, మృతి చెందే వానిమీద అమృత వర్షం కురిసినట్లుగా, నాకున్నూ ఈ సంభాషణ ఆశను కల్పిస్తున్నది. నేను కాదంబరిని చూడటానికి వైశంపాయనుని చూడనేగటం ఉపకరిస్తుంది' అని అనుకొన్నాడు చంద్రాపీడుడు. ఇంతలో తారాపీడుడు పైకి లేచాడు. వినయంతో వంగిన చంద్రాపీడుని భుజంపై చేయి ఆనించి, సమస్త భూభారాన్ని వహించిన బాహుదండంతో నెమ్మది నెమ్మదిగా నడుస్తూ, శుకనాసమంత్రి తోడు వస్తుండగా, విలాసవతీ భవనానికి చేరుకొన్నాడు.

మహారాణి భవనంలోనికి వస్తూనే "చూశావా దేవీ! నీవు కోడలి ముఖం చూడటం వలన కలిగే సుఖాన్ని పొందటానికి పెద్దగా బాధపడటం లేదని నేరారోపణ చేయటానికా అన్నట్టు యౌవనారంభ సూత్రరేఖ (త్రాడుకు రంగు అద్ది దానితో చెక్కేందుకు వీలుగా గీతనేర్పాటు చేయుట వడ్రంగులు, శిల్పులు) చూడు. 'ఇక పెద్ద వారైపోయిన మీరు యౌవన చేష్టలు చాలించండి' అని ఆజ్ఞాపించినట్లుగా ఉన్న విజృంభిస్తున్న మీసములు, త్వరగా వివాహ శుభకార్యం జరిపించండి' అని ఆదేశిస్తున్నట్లు లేదూ? వివాహ విషయం తప్పనీ వింకేమి మాట్లాడగలవు? మొగము అలా ప్రక్కకు తిప్పుకొంటావు దేనికి? చెప్పినా ఆజ్ఞాపించవెందుకని? నీవు భలే తల్లివమ్మా! (నీవెక్కడతల్లివి?) నీకు చంద్రాపీడుని మీద ఇష్టం లేనట్లుందే? లేకుంటే అలా మౌనంగా ఉంటావా? నీకింత లెక్క లేనితనమేమిటట' అని హేళనాపూర్వకంగా, హాసస్ఫోరకంగా తారాపీడుడు మహారాణిని ఎకసెక్కే లాడాడు. ఇలా సంతోషంగా చాలా సేపు మాటలతో కాలక్షేపం చేసి, స్నానపానాదులకోసం తన భవనానికి వెళ్ళిపోయాడు. శుకనాసమంత్రి కుమారునిరాకకు నిరీక్షించాలని గృహానికి వెళ్ళాడు. చంద్రాపీడుడు తల్లియింటనే భోజనాదులొనర్చి, వైశంపాయనుడు వస్తే కలిగే ఆనందాన్ని ఊహించుకొంటూ అక్కడనే పగలంతా గడిపాడు.

## 59. చంద్రాపీడుని కాదంబరి వద్దకు ప్రయాణము

రాత్రయింది. మిత్రుణ్ణి దర్శించాలని ఉవ్విళ్ళూరుతున్న ఆతనికి నిద్ర కరువైంది. రాత్రి 6 గంటల తర్వాత తెల్లని వెన్నెలలో నిద్రరాలేదు. ఆ రాత్రి పట్టపగల్లాగా వెన్నెలలు కురిపిస్తూ ఉంది. అసలే తెల్లగా ఉన్న ఉజ్జయినీ నగరసౌధాలు మరింత తెల్లగా మెరుస్తున్నై. దిక్కులన్నింటియందు కర్పూర రేణువులు మిక్కుటంగా వెద జల్లినట్టున్నది. రాత్రిని చందనద్రవంతో పూత పూసినట్లుగా ఉంది. గ్రహనక్షత్ర తారకాదులన్నింటిని ఒకచోట ప్రోగుచేసి పెట్టినట్టుగా ఉంది వెన్నెల. చంద్రకాంతమణులు జలప్రవాహాలను కల్గిస్తున్నై. అన్నిచోట్ల వెన్నెల వర్షంలాగా కురుస్తున్నది. చంద్రాపీడుణ్ణి కాదంబరితో తొందఱగా కలపాలనే ఉద్దేశ్యంతో మన్మథుడు తన బాణాలన్నింటిని ఒక్కసారిగా ప్రయోగిస్తున్నాడన్నట్టుంది ఆ ప్రాంతం. చంద్రకిరణ ప్రసారంచేత చంద్రాపీడుడు ప్రయాణ సన్నద్ధుడై సర్వ పరిచారకులకు ప్రయాణశంఖం వినిపింపజేశాడు.

ఆ శంఖధ్వని ఆకాశమంతటా వ్యాపించింది. అష్టదిక్కుల యందు అలుము కొంది. ఆకాశనగర ప్రాకారం చుట్టూ తిరుగుతున్నట్లుంది. నగర సౌధప్రాంతాలను ఆక్రమించింది. నగర కేంద్ర పాంతాల్లో, రాజవీధుల్లో విహరించింది. ఉద్యానవనాలలో పర్వతాల గుహలలోనూ ప్రతిధ్వనించింది. రాజసౌధాలలో ప్రకంపించింది. ఈ ధ్వనికి సరస్సులలో నిద్రించుతున్న బెగ్గురు పక్షులు హంసలు ఉలిక్కిపడి ప్రాణభయంతో రణగొణధ్వని చేయసాగినై.

శంఖధ్వని వినిపించినంతనే సైన్యనివాసాలలో ప్రయాణ సన్నాహధ్వనులు వినిపింపసాగినై. కొందఱు నిద్రలేచారు. కొందఱు గుఱ్ఱపు కళ్ళాలు జీనులు గుఱ్ఱాల దగ్గఱకు చేరవేస్తున్నారు. కొందఱు అప్పటికే గుఱ్ఱాల్ని సిద్ధం చేశారు. కొందఱు వస్తున్నారు. కొందఱు పోతున్నారు. కొందఱు గౌరవిస్తున్నారు. కొందఱు తయారై వరుసక్రమంలో నిలబడుతున్నారు. కొందఱు విడిగా ఉన్నారు. మఱికొందఱు ప్రయాణసామగ్రిని మోస్తున్నారు. కొందఱు ప్రయాణ



సమయం కోసం వేచి ఉన్నారు. వారందఱితో నగరవీధులు, కూడళ్ళు, ప్రాంగణాలు అన్ని సైన్యంతోనూ, గుఱ్ఱాలతోనూ నిండిపోయినై. వారు ధరించిన ఆయుధాలు ఎల్లెడలా కనబడుతున్నై. భూమి అంతా గుఱ్ఱపుడెక్కల ధ్వనితో నిండిపోయింది. గుఱ్ఱపు సకిలింపులతో శ్రవణరంధ్రాలు నిండిపోతున్నై. యువరాజ భవనప్రాంగణమంతా గుఱ్ఱాలనోటినుండి స్రవించే నురుగు ముద్దలతో నిండి ఉంది. కళ్ళాల మ్రోతలు అన్ని దిక్కుల వ్యాపిస్తున్నై. చంద్రకాంతులు గుఱ్ఱాలకు అలంకరించిన ఆభరణాలలోని రత్నకాంతులతో విరాజిల్లుతున్నై.

యువరాజు చంద్రాపీడుని ఇంద్రాయుధం సర్వాలంకారశోభితంగా సిద్ధం చేయబడింది. చంద్రాపీడుడు చక్కని ముహూర్తంలో వచ్చి గుఱ్ఱం ఎక్కికూర్చున్నాడు. యువరాజు ముందు తెల్లని చంద్రబింబంలాంటి గొడుగు పట్టబడింది, గొడుగు ద్వారా యువరాజు కదలిక దూరస్థులకు తెలుస్తోంది. యువరాజుకు అటు ఇటు కొందఱు ఆశ్వికులు వెంట వస్తున్నారు. వారి నమస్కారాలందుకొంటూ యువరాజు బయలుదేరాడు. అది నిశీధి సమయం కాబట్టి రాజవీధులు రద్దీగా లేక పోయినా అధికజనం వలన వీధులు ఇరుకుగా ఉన్నాయనిపిస్తోంది. ఇలా చంద్రాపీడుడు నగరం నుండి బయల్దేరాడు.

చంద్రాపీడుడు ససైన్యంగా బయల్దేరి దగ్గరలో ఉన్న సిప్రానదిని దాటి, పిండి ఆరబోసినట్లున్న వెన్నెలలో ఏ అడ్డూలేక ప్రయాణోత్సాహం ఇనుమడిస్తుండగా దశపుర నగరమార్గాన వెళ్ళసాగాడు.

చంద్రాపీడునకు ఆ వెన్నెల రాత్రి మనోహ్లాదాన్ని కలిగించింది. అందులో వైశంపాయనుని చూడాలనే ఉత్సుకత తోడు కాగా అమితవేగంతో ప్రయాణించే ఇంద్రాయుధంతో పాటు మిగిలిన అశ్వాలు కూడా వేగంగా ప్రయాణించటం చేత ఆ అర్ధరాత్రికే మూడు యోజనాల దూరం అతిక్రమించింది ఆ అశ్వసైన్యం. చల్లని వెన్నెలలకు తోడు ఆహ్లాదకరమైన వాయువులు వీయసాగినై. వెన్నెలతో కలిసిన ఆ గాలులు చల్లని మంచుతుంపురులతో కలిసి నిర్మలమైన అడవి

వృక్షాల చిగుళ్ళపైనుండి వచ్చే శీతలత్వంతో కలిశాయి. వికసించిన కలువలపై నుండి వచ్చే గాలి కూడా మనస్సున కానందం కలిగిస్తోంది. అవి ప్రాభాతికవాయువులు కావటం చేత ఆ సైన్యానికి ఉత్తేజిం కలిగిస్తున్నై.

కొంతసేపటికి తెల్లవారి వెలుగురేఖలు ఆకాశాన వ్యాపించినై. సూర్యబింబం రాబోతున్న దన్న దిగులుతో ముఖాలు ముడుచుకొన్న కలువలు కనబడసాగినై. తన కాంతిని కలువభామలు తాగి వేయగా తెల్లబడినట్లుగా చంద్రబింబం మసకబారింది. వెన్నెల ప్రవాహాలు వచ్చిపడిన వేగానికి ఏర్పడిన నుఱుగుల పంక్తుల చేత నక్షత్రాలు కనబడకుండా పోతున్నవి. అడవులలోని వృక్షలతాదులు నీటిలో మునిగిలేచిన వాటిలాగా నల్లదనంతో గోచరం కాసాగినై.

ఆ ప్రాంతంలో అడవిపందులు సరస్తీరాలలో మొలకెత్తిన తుంగముస్తెలను (దుంపలను) ముట్టెలతో త్రవ్వితీసి తింటున్నై. తెల్లవారిన తర్వాత అడవిసమీప గ్రామాలనుంచి అడవికి మేతకు వచ్చిన తెల్లని ఆవుల మందలు మందలుగా తిరుగుతున్నై. పరిసర గ్రామాలవారు వారి పనుల మీద అటు నిటు సంచరిస్తున్నారు. తెల్లవారటంచేత వెలుగులలో అరణ్యాలు విస్తరించినట్టు, గ్రామసీమలు విశాలాలైనట్లుగా కనబడుతోంది. సరస్సులు ఎగసిపడుతున్నట్టున్నై. భూమండలాన్ని ఎవరో పైకెత్తినట్లుగా స్పష్టంగా కనబడుతోంది. కలువలు ఎటో మాయమై పోయినట్లనిపిస్తోంది. వస్తువులను మాయం చెయ్యటానికి ఇంద్రజాలికుడు కప్పిన నల్లని వస్త్రాన్ని పోలిన చీకటిని తొలగిస్తూ అప్పుడే ఉదయస్తున్న సూర్యుడు విరహబాధితురాలైన కమలిని పరామర్శించే వానిలా కనపడసాగాడు లోకానికి.

## 60. వైశంపాయనుడు కనబడకుండుట

ఇంతలో కొంతదూరంలో మహావిస్తీర్ణమై సముద్రాన్ని తలపిస్తున్న స్కంధావారం కనిపించింది. తన మనస్సులో", నాకు మేలు జరగబోతోంది.



అనుకోకుండా వచ్చి సైన్యంలో ప్రవేశించి వైశంపాయనుణ్ణి చూస్తాను" అని తలచాడు చంద్రాపీడుడు. వెంటనే తన రాజ చిహ్నాలైన ఛత్రచామరాలను పరివారాన్ని దూరంగా ఉంచివేసి, తనతో సమానవేగంగా రాగలిగిన అశ్వికుల్ని వెంట తీసుకొని, శిరస్సును ఉత్తరీయంతో కప్పుకొని మిగుల వేగవంతమైన ఇంద్రాయుధాన్ని ఎక్కి ఎవరి పనులలో వారు హడావుడి పడుతుండగా సైన్య శిబిరంలోనికి ప్రవేశించాడు. ప్రవేశిస్తూనే 'వైశంపాయనుడెక్కడున్నాడు?' అని అడిగాడు. ఆ అడిగేదెవరో తెలియని కొందఱు స్త్రీలు, ''బాబూ! ఏమడుగుతున్నారు? వైశంపాయనుడెక్కడున్నాడు?" అని పలికారు. వెంటనే చంద్రాపీడుడు కోపగించి, ఓసి పాపాత్ములారా! ఏమిటి మీరిట్లా అసంబద్ధంగా వాగుతున్నారు?" అని గుండెధైర్యం కోలుపోయి వారిని బెదరిస్తూ వేరెవరినీ అడగకుండా, గుంపులోనుండి తప్పిపోయిన లేడిపిల్లలాగా, గజసమూహం నుండి విడిపడిన ఏనుగుపిల్లలాగా, తల్లి కనబడకపోయినందువల్ల దూడలాగా హడలిపోయాడు. అతడు ఎవ్వరితోనూ మాట్లాడలేదు. ఎవరేమి చెప్పినా వినకుండా, ఎక్కడా నిలవకుండా, ఎవరినీ పిలవకుండా, తాను ఎక్కడికి పోతున్నాడో, ఎందుకు వచ్చాడో, ఎక్కడకు నడుస్తున్నాడో, ఏమి చూస్తున్నాడో, ఏమి చేస్తున్నాడో అని ఇవేమీ ఆలోచింపకుండా, అంధునిలాగా, చెవిటి వానివలె, మూగవానిలాగా, చలవరహితునిలాగా పిశాచగ్రస్తునిలాగా, సైన్యశిబిరం మధ్య ప్రదేశానికి చేరుకొన్నాడు.

ఈలోగా విశాలమైన సైన్యశిబిరంలోనికి చంద్రాపీడుడు వచ్చాడనే వార్త తొందఱగా వ్యాపించింది. "చంద్రాపీడుడు, చంద్రాపీడుడు అంటూ అందఱూ జాగరూకులయ్యారు. చిందరవందరగా పరుగులు తీస్తున్నారు. ఆ హడావుడిలో వారి భుజాలపైనున్న ఉత్తరీయాలు జాఱిక్రిందపడిపోయినా గుర్తించడం లేదు. దూరం నుండే యువరాజుకు వందనాలాచరించారు. వారిని చూసి చంద్రాపీడుడు "వైశంపాయను డెక్కడ?" అని ప్రశ్నించాడు. అపుడు వారంతా కలిసి కట్టుగా", ప్రభూ! ముందు మీరు ఈ చెట్టు నీడలో కాసేపు విశ్రాంతి తీసుకోండి, ఇక్కడేం జరిగిందో వివరంగా చెబుతాం" అన్నారు.

ఎప్పుడైతే వారు ఏదో దాపరికంతో మాట్లాడారో అప్పుడే చంద్రాపీడునికి గుండె కలుక్కుమంది. హృదయం ముక్కలైంది. ఏదో తెలియని బాధతో కొద్దిసేపు బాహ్యస్మృతి కోల్పోయాడు. వెంటనే తారాపీడునితో సమవయస్సు కలవారు రాజులు పెద్దవారు అతనిని గుఱ్ఱంమీదనుంచి నెమ్మదిగా క్రిందికి దింపి ఒక పరుపుపై పరుండబెట్టారు. ఆ సంగతి చంద్రాపీడునకు తెలియనే తెలియదు. కొద్దిసేపటి తర్వాత మెలకువలోకి వచ్చాడు. అప్పుడూ వైశంపాయనుడు కంటపడలేదు.

"ఏమిటిదంతా! ఏం జరుగుతోంది! నేనిప్పుడెక్కడున్నాను? నాకేమైంది?" అంటూ అసహనంతో ప్రశ్నించాడు. అతనికి ఏమీ అర్థం కావటం లేదు. బ్రతికున్నదీ లేనిదీ తెలియటం లేదు. అతనికి లోలోన దహించుకుపోతున్నట్టుగా ఉంది.

"ఇంత రమణీయమైన లోకం నాకు చాలా అసహ్యంగా కనబడుతోంది. భూమి శూన్యంగా కనిపిస్తోంది. కళ్ళున్నా దిక్కులన్నీ అంధకారబంధురమైనై. సమృద్ధంగా ఉన్నా జీవితం లేదనిపిస్తోంది, ఇంక నేనెవరిని చూడగలను? ఎవరితో మాట్లాడతాను? ఎవరితో నా అంతర్గత విషయాలు చెప్పుకోను? ఇంక నేనెవరితో సంతోషంగా ఉంటాను? నా వైశంపాయనుడు లేకపోతే నా జీవితం ఎందుకు? కాదంబరి ఎందుకు? నా మిత్రుడు వైశంపాయనుణ్ణి గుఱించి ఎక్కడ అడగాలి? ఎవరిని అడగాలి? ఎవరిని వేడుకోను? అటువంటి మిత్రరత్నాన్ని తిరిగి నాకెవ్వరిస్తారు? వైశంపాయనుడు లేకుండా నా తండ్రికి, శుకనాసునకు నాముఖం ఎలా చూపను? నేను ఏం చెప్పి కుమారుని కోల్పోయిన మనోరమాదేవిని, మాతల్లిని ఊరడించేది? అతనిని మరల తేవటానికి అసలు ఏదైనా ఆధారం ఉందా? రాజెవరైనా అతనికేదైనా పనికి పంపాడా? అందుకు ఆలస్యమైనదా ?" ఎవరూ ఏ సమాధానం ఇవ్వకపోయే సరికి చంద్రాపీడునికి గుండెలు బ్రద్దలైనట్టు అనిపించింది. ఎన్నో అనుమానాలు అతని మనస్సులో ముసర సాగాయి.



చంద్రాపీడుడు, 'నేను వచ్చేలోపల ఇక్కడ ఏమైనా యుద్ధం సంభవించిందా? లేక ఏదైనా జనమారణ వ్యాధి వ్యాపించిందా? కాక అనుకోకుండా ఒక్క సారిగా ఏ పిడుగన్నా పడిందా? అని వారిని ప్రశ్నించాడు. ఆ మాటలకు వారందఱూ ఒక్కసారిగా చెవులు మూసుకొని, "ప్రభూ! పాపం శమించుగాక, అంతమాట అనకండి. తమరి వలెనే వైశంపాయనుడు కూడా చిరకాలం జీవిస్తాడు" అన్నారు, వారి మాటలకు చంద్రాపీడుడు సంతోషంతో ఆనందబాష్పాలు కార్చాడు. వారిని చేతులతో తనవద్దకు తీసికొని కౌగిలించుకొన్నాడు. తర్వాత యువరాజు" సరే, వైశంపాయనుడు జీవించియే ఉన్నట్లయితే నన్ను చూడకుండా ఒక్క క్షణం కూడా ఉండదు. అందువల్లనే నేనలా కఠినంగా అన్నాను. మీరు అతడు జీవించియే ఉన్నాడన్న మాటను నేను చెవులారా విన్నాను. అయితే ఇప్పుడతని కేమయింది? ఎందువలన అతడు ఇక్కడికి రాలేదు? అతడెక్కడున్నాడు? ఏ పనిమీద అతడు ఆగాడు? అసలు అతనిని ఒంటరిగా వదిలి పెట్టి మీరిచటికివచ్చారు? అతనిని బలవంతంగానైనా మీరు ఇక్కడికి ఎందుకు తీసుకరాలేకపోయారు? అని తెలుసుకొందామని నా మనస్సు తొందరపడుతున్నది" అని అన్నాడు.

వారాతని మాటలువిని ఇలా అన్నారు – "యువరాజా! జరిగిందంతా విన్నవిస్తాం, వినండి. మీరు ముందుగా ఉజ్జయిని వెళ్ళేటప్పుడు మాతో మీరందఱూ వైశంపాయనునితో కలిసి స్కంధావారాన్ని తీసుకొని నెమ్మదిగా రండి అని ఆజ్ఞాపించి వెళ్ళిన తర్వాత మేము అచ్ఛో దసరస్తీరాన గుఱ్ఱాలకు పచ్చగడ్డి పండ్లు, వంట చెఱకు సమృద్ధిగా దొరుకుతున్నందున ఆ రోజు ప్రయాణం చేయలేదు. అక్కడే విశ్రాంతి తీసుకొన్నాము. మఱునాడు ప్రయాణభేరీ మ్రోగించాము. సమస్త సామగ్రి సర్దుకొని మేమంతా సిద్ధమై ఉండగా వైశంపాయనుడు ఈ అచ్ఛోదసరస్సు మిక్కిలి పుణ్యమైనదని పురాణ కథనం ఉన్నదని విన్నాము. అందుచేత ఈ సరస్సులో స్నానమాడి ఆ సమీపంలో ఉన్న సిద్ధ ఆయతనంలో శివుణ్ణి పూజించుకొని వెడదాము ఆగండి.

దివ్యజనులు తిరుగాడే ఇంతటి పవిత్రదేవ భూమిని మనం కలలోనైనా మరల చూస్తామో లేదో' అంటూ పాదచారియై సరస్తీరానికి ప్రయాణమయ్యాడు.

## 61. వైశంపాయనుడు మహాశ్వేతను గాంచి ప్రణయ పరవశు డగుట

ఆ ప్రాంతం మిక్కిలి రమణీయంగా ఉంది. వైశంపాయనుడు విప్పారిన కనులతో అంతటా కలయజూశాడు. అంతా కలియదిరిగాడు. పుష్పగుచ్ఛాలపై మకరందం త్రాగటానికి వ్రాలేతు మ్మెదలు మధురమైన రొద చేస్తున్నై. ఆరొదలు చూపరులను స్వాగతిస్తున్నట్లున్నై. ఆ ప్రాంతంలో చీకటి చెట్లు దట్టంగా వ్యాపించి ఉన్నై. అందుచేతనే పగటి సూర్యకిరణాలు ప్రసరింపకపోవటం చేత పగలే అంధకారం వ్యాపించి ఉంది. సుపరిచితి ఉండి కూడా ఆ ప్రాంతంలో మేఘాలు కమ్మినాయని భ్రమపడిన మత్తమయూరాలు తమ బారైన మెడలను పైకెత్తి మధుర క్రేంకార రవాలను చేస్తున్నై. అచట వాతావరణం ఎంతటి దుఃఖాన్నైనా నివారిస్తుంది. నిశ్చలత్వానికి జన్మభూమిలాగుంది. వసంతకాలానికి స్వాగత ద్వారంలాగా ఉంది. మన్మథునికి నివాస ప్రదేశంలాగా ఉంది. రతీదేవికి ఉల్లాసంగా గడిపే విహారభూమి వంటిది. సర్వ సౌందర్యాలకు ఆలవాలం అనిపిస్తోంది. అక్కడ వీచేగాలులు మందత్వం సురభిత్వంకలవి. అచ్ఛోదస రస్సులోని తరంగాలచే ప్రసరిస్తున్న చల్లని సుంగధవంతమైన గాలులుగలది. అటువంటి రమ్యప్రదేశంలో ఒక చోటలతామండపం వైశంపాయనునికి కన్పించాది.

ఆ లతామండపాన్ని చూశాడు వైశంపాయనుడు. ఆ మండపం అతనికి చాలా కాలం తర్వాత కలిసిన తమ్ములాగా, కుమారుడులాగా, స్నేహితునిలాగా తోచింది. వైశంపాయనుడు తదేక దృష్టితో కనులార్పకుండా చూడసాగాడు. అతడు స్తంభీభూతుడైనట్టు, మూర్ఛతో ప్రాణాలు పోతున్నవానిలాగా, శరీరావయవాలు శిథిలితమౌతున్న వానిలాగా, నేలపై కూర్చున్నాడు. తనలో తానే ఏదో గొణుక్కుంటూ, ముఖంలో ఏ భావమూ లేనివాడై, కన్నీరు



నిరంతరంగా విడుస్తూ, తల వంచుకొని మౌనంగా కూర్చున్నాడు. ప్రభూ! అటువంటి పరిస్థితిలో ఉన్న అతనిని చూసి మా అందఱి మనస్సుల్లో దిగులు పట్టుకుంది. ఏమిటిది? ఈ పరిసరాల సౌందర్యానికి అనుభవజ్ఞులైన పెద్దలే మనస్సు పారేసుకొంటారంటే, మరి చిన్నవయస్సులో ఉన్న కుతూహలుల సంగతి ఏమి చెప్పాలి? అందుచేత వైశంపాయనుడు అత్యంతరమణీయమైన ఈ భూమిని చూసి తన మనస్సులో కలిగిన భావతరంగాల వల్ల ఇలా అయ్యాడేమో అనుకొన్నాం. కొద్దిసేపున్నాక మేమతనితో ఇలా అన్నాం.

"కుమారా! చూడవలసిన అత్యంతరమణీయప్రాంతం చూశావు కదా! ఇకలే! వెడదాం. ఇపుడు స్నానాలు చేద్దాం పద. సమయం మించిపోతోంది. అన్నీ సర్దుకోవటం అయిపోయింది కూడా. సకల సైన్యమూ ప్రయాణానికి సిద్ధమైంది. అందరు నీకోసం ఎదురు చూస్తున్నారు. ఇంకా ఎందుకు ఆలస్యం చేయటం? అని కాని వైశంపాయనుడు మాత్రం మామాటలు విననివానిలాగా, నిశ్చేతనునిలాగా, మూగవానివలె, ఏమీ జ్ఞానం లేనివానిలాగా, అలా ఉండిపోయాడు. పెదవి విప్పి మాతో ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అతడు మాత్రం కన్నార్పకుండా, కనుగ్రుడ్లు కదలకుండా, నిరంతరం కన్నీరు విడుస్తూ ఆ లతామండపం వంకే చూడ సాగాడు.

మేమతనిని మాటిమాటికి బయల్దేరమని ప్రార్థిస్తున్నప్పటికిని, బలవంత పెట్టినప్పటికి అతడు మాత్రం లతామండపంవైపే చూస్తూ మాతో నిష్ఠురంగా ఇలా అన్నాడు.

నేనీ ప్రదేశం నుంచి ఒక్క అంగుళం కూడా కదలను. మీరందరూ స్కంధావారాన్ని తీసుకొని వెళ్ళిపొండి. చంద్రాపీడుడు ఇక్కడి నుండి వెళ్ళిపోయిన తర్వాత ఆతని సైన్యం ఈ ప్రదేశంలో ఒక్కక్షణమైనా ఉండటం న్యాయం కాదు" అని, అతడలా అంటుంటే మాకు ఇదేదో దైవఘటన వల్ల ఇలా జరిగి ఉంటుందని మా కనిపించింది. ఈ వైరాగ్యబుద్ధికి అదే కారణం కావచ్చని భావించాం మేము. మరల మరల వైశంపాయనుణ్ణి బతిమలాడాము.

ఎన్నోసార్లు ప్రయాణానికి సిద్ధం కమ్మని వేడుకొన్నాం, చివరికి బలవంత పెట్టాం. నిష్ఠూరంగా మాట్లాడాం. "ఈ విధంగా మేమిక్కడ ఉండటం యుక్తం కాదు. మీకైతే తగినదేమోమరి, మన ప్రభువులైన తారాపీడుల తర్వాత మరల అంతటివాడైన శుకనాస మంత్రిగారి వలన జన్మించి మనోరమాదేవి ఒడిలో పెఱిగి, మనప్రభువు చంద్రాపీడులవారితో సరిసమానంగా ఒకే చోట పెరిగి పెద్దై, అలాగే విద్యాగృహంలో సమాన విద్యావంతుడవైన నీవంటి వానికి ఈ మాట తగినదే. ఎందుకంటే నీవు పెద్దతమ్ముడవు, స్నేహితుడవు, వాత్సల్యం కలవాడవు. అధికారం కలవాడవు, గుణవంతుడవు అట్టి నీయందు నమ్మకముంచి, స్కంధావారాన్ని నీచేతి కిచ్చి నమ్మకంతో చంద్రాపీడుడు ఉజ్జయినికి వెళ్ళాడు. నీకు తప్ప వేరొకనికి ఈ యుక్తాయుక్త పరిజ్ఞానం ఉన్నదా? నీపై అతనికి స్నేహం ఉన్నదన్నమాట అలా ఉండనీ నిన్ను ఈ శూన్యారణ్యంలో ఒంటరిగా వదిలేసి మేము వెళ్ళిపోతే చంద్రునిలాగా చల్లని మనస్సుగల చంద్రాపీడునికి నీ గూర్చి మేము ఏమని చెప్పగలం? మాకు చంద్రాపీడుడు వేరూ, నీవు వేరు కాదు కదా! ఈ భ్రమలు వదలిపెట్టు. ప్రయాణం మీద మనస్సు లగ్నం చెయ్యి!' అని మేము అంటే, మామాటలు విని ఒక వెఱ్ఱినవ్వు నవ్వి, "నాకు అంతమాత్రం తెలియదా? మీరందఱూ ప్రయాణాన్ని గూర్చి నన్ను ఒత్తిడిపెడతారేమిటి? అసలు నేను చంద్రాపీడుడు లేకుండా ఒక్కక్షణమైనా ఉండలేను. నేను మీకు ముందే నా అభిప్రాయాన్ని తెగవేసి చెప్పానుకదా! నేనిప్పుడేం చెయ్యాలి? నాకీక్షణంలో నే నాశక్తి మొత్తం క్షీణించి పోయింది. నా మనస్సు దేనిమీదా లగ్నం కావటం లేదు. నా చూపులు దేనిపైనా నిలపలేకపోతున్నాను. నా మనస్సునకేమీ పాలుపోవటం లేదు. నా పాదాలు గొలుసులతో కట్టివేయబడినట్లు అడుగు ముందుకు సాగటం లేదు. నా శరీరాన్ని మేకుతో దిగుగొట్టినట్టుగా ఇక్కడే నిలిచిపోయింది. నా అంతట నేను అడుగువేయలేకపోతున్నాను. మీరేమీ నన్ను బలవంతంగానైనా తీసుకుపోవాలనుకొంటున్నారు. నన్ను మీరు ఒకవేళ ఇక్కడినుండి



బలవంతంగా తీసుకొని వెళ్ళినా నేను బ్రతుకుతానో లేదో చెప్పలేను. నేను ఇక్కడే ఉంటే కనుక నామనస్సులో ఏదో ఇది అని చెప్పలేని మార్పు ఏదైనా సంభవించవచ్చునేమో! నేనిక్కడ ఉంటే జీవిస్తానేమో అనిపిస్తోంది నాకు, మీరిక నన్ను బలవంతం చెయ్యవద్దు. మీరంతా వెళ్ళిపొండి. బ్రతికున్నంతలోగా చంద్రాపీడుని చూస్తానేమో అన్న ఆశ ఉంది" అన్నాడు వైశంపాయనుడు.

మా కాశ్చర్యం కలిగింది. "ఏమిటి నీవు మాట్లాడుతోంది? ఎందుకిలా అంటున్నావు? చంద్రాపీడుడున్న చోటికి రావచ్చుగదా మరి అని మేము మరీ మరీ బలవంతపెట్టగా", నాకు సిగ్గుగా ఉంది ఇలా అనాలంటే. అయినప్పటికి చంద్రాపీడుని జీవితంమీద ఒట్టు పెట్టుకొని ఈ మాట అంటున్నాను. ఎందుకనో ఏమిటో నేను చెప్పలేను కాని, ఇక్కడనుండి ఎక్కడికీ కదలాలని నాకెంతమాత్రం అనిపించడం లేదు. ఈ సంగతంతా మీకూ తెలుసు కదా! అందువల్ల మీదారిన మీరు వెళ్ళండి అని పలికి ఊరుకొన్నాడు. కొంతసేపటికి లేచాడు. సుందరమైన వృక్షసమూహాలమధ్య, లతానికుంజాలలో సరస్తీరంలో, దేవాలయంలో ఏదో వస్తువు పొగొట్టుకొన్న వానివలె తదేకదృష్టితో వెతుకుతూ చాలాసేపు తిరిగాడు. తిరిగి తిరిగి దుఃఖిస్తూ, ఆవేదనతో ఆకాశం వంక చూస్తూ మరల ఆ లతానికుంజంలో ప్రవేశించి శిలపై కూర్చున్నాడు. మేముకూడా కొంతసేపైన తర్వాతన్నా మా మాట వింటాడేమో అనే ఆశతో ఆ పొద సమీపంలోనే నిలబడ్డాం. కాని రెండు జాములు గడిచినా లేవలేదు. మేము అతనిని స్నానభోజనాలకు రమ్మనిపిలిచాము. అప్పుడతడు", మిత్రుడు చంద్రాపీడుని ప్రాణాలు నా ప్రాణాల కన్నా ఎంతో ప్రియమైనవి. కావున నన్ను మీతో రమ్మని బలవంతపెట్టకుండా వెళ్ళిపోతే నేను నా ప్రాణాలు కాపాడుకొనే ప్రయత్నం చేయ వీలౌతుంది. మీరు వెళ్ళకపోతే సాప్రాణ రక్షణ కుదరదు. నేను చంద్రాపీడుని చూడాలని కోరుతున్నాను మృత్యువుని కాదు. అందువల్ల మీరెంత ప్రార్థించినా అది ఫలింపదు" అని పలికి లేచి స్నానమాచరించి, కందమూల ఫలాలతో భోజనం చేశాడు. అతడు భుజించిన

తర్వాత మేమూ భుజించాం. ఈ విధంగా రాత్రనక పగలనక' ఏమిటీ పరిస్థితి' అని దిగులుపడుతూ అతడేమౌతాడో అని విచారిస్తూ మూడు రోజులున్నాం. కాని ఆతడు రావటానికి, తీసుకొని వెళ్ళటానికి వీలులేక పోవటం చేత కావలసిన ఏర్పాట్లు చేసి, మాదారిన మేము వచ్చాం. ఈలోగా మీకు మేము వార్తాహరుని పంపితే మీరిటకువచ్చే శ్రమ తప్పేది.

చంద్రాపీడుడు ఇలా జరుగుతుందని కలలో కూడా ఊహింపలేదు. అతడు నిర్విణ్ణుడైనాడు. ఉద్వేగం, విస్మయం కలిగింది. అతడు తన మనస్సులో ఇలా ఆలోచించసాగాడు–

"అసలు వైశంపాయనుని కేమైంది? ఇలా అందర్నీ వదలిపెట్టి, కందమూలాలు తింటూ అరణ్యంలో ఉండాలనే వైరాగ్యం ఎందుకు కలిగింది? ఇందులో నాకెంత ఆలోచించినా తప్పేమీ కనపడలేదు. తండ్రి అనుగ్రహంతో రాజులంతా నాకు పాదాభివందనం చేసినట్లే వైశంపాయనునికి తలలు వంచి నమస్కరించేవారు. నాకు జరిగినట్లే సర్వ రాజోపచారభోగాలు అతనికి జరిగేవి. కొంచెంకూడా లోటుండేది కాదు. నా ఆజ్ఞను పాటించినట్లే అందరూ అతని ఆజ్ఞను కూడా పాటించేవాళ్ళు. నేను ఆశ్రితులపై దయ చూపినట్లే అతడును చూపేవాడు. నాకు లాగానే అతనికి సర్వసంపదలు అందుబాటులో ఉన్నవి. పరిజనులు నాయెడ భయభక్తులు చూపినట్లే వైశంపాయనుని ఎడలను చూపేవారు. ప్రజలకు అతనిని చూసినా నన్ను చూసినట్టే ఆదరం చూపేవారు. అతడంటే నా తండ్రి తల్లికీ, శుకనాస మనోరమలతో పాటు కుమారుడనే ప్రీతి ఉండేది. వినయ ప్రధానకాంక్షులైన నా తండ్రి, శుకనాసులవారు కూడా అతని విషయంలో బాధాకరంగా ప్రవర్తించేవారు కాదు. ఒక్క దెబ్బకొట్టి ఎఱుగరు. అయినా వైశంపాయను డేమన్నా నాస్నేహం విషయంలో దుష్టభావం ఎప్పుడన్నా చూపాడా? గురుజనులంటే భక్తి లేనివాడా? గుణగ్రహణ విముఖుడా! అతడేమన్నా చంచలస్వభావం కలవాడా? వైశంపాయనుడంటే పనిలేనివాడై ఎవరో అయోగ్యునివలె దుస్స్వభావంకలవాడా? బాల్యంనుంచి



క్రమశిక్షణ లేకుండా పెరిగాడా? ఒక్కడే కొడుకు కదా అని తండ్రి గారాబంగా పెంచి పాడుచేశాడా? లేదే! చిన్నప్పటినుండి పద్ధతి ప్రకారం పెరిగినవాడు, తన పెద్దవారికి ఇటువంటి దుఃఖం కలిగిస్తాడా? అయినా వైశంపాయనునికి ఏమంత వయస్సుందని ఇటువంటి వైరాగ్యభావం కలుగుతుంది? ఇప్పటికి అతడు ఇంకా గృహస్థాశ్రమం స్వీకరించలేదు. దేవపితృమనుష్య ఋణాలలో ఏ ఒక్క ఋణమూ తీర్చుకోలేదు. ఈ మూడు ఋణాలు తీర్చుకోకుండానే ఎక్కడికి వెడతాడు? ఇంతవఱకు వివాహం లేదు, పుత్రపౌత్రాదులు అసలే లేరు. భూరిదక్షిణలతో మహాయజ్ఞాలేమైనా చేశాడా? పోనీ, సత్రాలు బావులు, భవనాలూ, తటాకాలు, ఉద్యానవనాలు లాంటి పుణ్యకార్యాలు చేసి లోకంలో కీర్తిని శాశ్వతంగా విస్తరింపజేసుకొన్నాడా? తల్లిదండ్రులు అన్ని బాధ్యతలూ తీర్చుకొని విశ్రాంతిగా ఉన్నారా? లేరు కదా! వైశంపాయనుడు దగ్గఱి బంధువుల కుపకారాలు ఏమీ చేయలేదు. స్నేహితుల్ని గొప్ప ఐశ్వర్యవంతులుగా చేయనూ లేదు. సత్పురుషుల సముద్ధరణమూ చేయలేదు. ఇంతవఱకు స్త్రీల వంక కన్నెత్తి చూసిందీ లేదు. వారిని గూర్చి విన్నదీ లేదు. పుట్టిన తర్వాత సాంసారిక సుఖమన్నదే అనుభవించినవాడూ కాదు. ధర్మార్థకామాలనే పురుషార్థాలలో ఏ ఒక్క దాన్నీ సంపాదించలేదు. మఱి ఇప్పుడు ఇతడు చేసిన దేమిపని? అని ఎంత ఆలోచించినా కర్తవ్యం బోధపడలేదు.

ఎంత ఆలోచించినా ఏమిచెయ్యాలో తెలియక రాజసమూహాన్ని ఎవరి నేవిధంగా చూడాలో ఆవిధంగా చూసి, మాట్లాడి వారిని పంపివేశాడు. లేచి తన నివాసభవనానికి వెళ్ళాడు. అతనిని రాజభవనం వైభోగ్యంగా విలసిల్లుతోంది. ఆ ప్రాంగణం అంతా సురభిళశీతలోదకం చల్లారు. సుగంధపుష్పాలను నేలపై పఱచారు. కొందఱు స్త్రీలు మణిచామరాలు, కొందఱు ఛత్రాలు, రత్నములు స్థాపించిన పాదరక్షలు, చేత ధరించి, సేవార్థం ఎదురుచూస్తున్నారు. చాందినీకి సమీపంలో సర్వాలంకారశోభితంగా ఉన్న పట్టపుటేనుగు గంధమాదనం రాజసేవకొఱకు సిద్ధంగా ఉంది. ఒకవైపున

సునందరాలంకారాలతో ఇంద్రాయుధం సిద్ధం చేయబడి ఉంది. ఆ భవన ప్రాంగణం అనేకప్రాణులతో కూడి సముద్రంలాగా ఉంది. ఎలాగంటే.

చుట్టూ నిలువబెట్టబడిన ఏనుగుల సమూహం సముద్రపు చెలియలి కట్టలాగా ఉంది. గంధమాధనం అనే ఏనుగు మంధర పర్వతంలాగా ఉంది. అనేక రాజకార్యాలకోసం అటూ ఇటూ తిరుగూతున్న సేవకజనులు సముద్రతరంగాల్లాగా ఉన్నారు. గుండ్రంగా వలయాకారంలో నిలువబడ్డ సైనికులు సుడిగుండాల్లాగా ఉన్నారు. సుందరీమణులు లక్ష్మీదేవి అవతారాల్లాగా ఉన్నారు. మహాపురుషులు కౌస్తుభాదిరత్నాల్లాగా ఉన్నారు. తెల్లని పతాకాలు అందులో విహరించే హంసల్లాగా కన్పడినై. పూలగుత్తులు సముద్రపు నుఱుగులవలె ఉన్నాయి.

అటువంటి రాజభవనంలో దాసదాసీలు రాజకార్యాల మీద అటు ఇటు తిరుగుతున్నారు. అచటి వారందఱు యువరాజుకు తలలు వంచి ప్రణమిల్లుతున్నారు. గంధమాదనం మీద ద్వారందాకా వచ్చి అచ్చటదిగి మందిరంలోకి ప్రవేశించాడు. చెట్ల ఆకులతో కట్టిన విసనికఱ్ఱలతో దాసీలు విసరుతున్నారు. పరిచారకులు కాళ్ళు పట్టుతున్నారు. క్రమక్రమంగా వారి సేవల వలన మార్గాయాసం తగ్గింది. రాత్రంతా నిద్రలేనప్పటికిని అతనికంటికి కునుకు రాలేదు. దుఃఖిస్తూనే ఆ దుఃఖానికి కారణం ఆలోచిస్తున్నాడు. “నేను ఇటునుండి ఇటే వైశంపాయనుణ్ణి వెదకటానికి తల్లి దండ్రుల దుఃఖాన్ని పోగొట్టకుండా, పుత్రునికోసం శోకిస్తున్న శుకనాసుని, తల్లిమనోరమను ఓదార్చకుండా వెళ్ళిపోతే, నేనుకూడా వైశంపాయనుడు చేసినట్లే అవుతుంది. ఒక వేళ నేను ఇంటికి వెళితే, మరల నన్ను బయటకు పంపటానికి పెద్దలు అంగీకరిస్తారో లేదో నని నా మనస్సులో అనుమానం పీడిస్తున్నది. అందువల్ల నేనిప్పుడేం చెయ్యాలి? నన్ను వైశంపాయనుని వెదకటానికి పంపుతారా? లేదా? అనే ప్రశ్న సరైనది కాదని అనుకుందాం. నా ప్రియమిత్రుని వెదకటంకోసం నేను వారి అనుమతిని పొంది బయటపడినట్లైతే అదీ



ఒకందుకు మంచి ఉపకారమే అవుతుంది. ఎలాగంటే – మిత్రుని అన్వేషించే నెపంతో కాదంబరి వద్దకు కూడా పోవచ్చు కనుక. అందుచేత నేనిపుడు బయటకు వెళ్ళి మిత్రుని అన్వేషిస్తానంటే తలిదండ్రులు గాని, శుకనాసమనోరమలు కాని ఎంతమాత్రం అడ్డుచెప్పరు. వెళ్ళి వైశంపాయనుని వెదికి, అతనితో పాటుగా కాదంబరికోసం ముందుకు పోతాను” అని నిశ్చయించుకొన్నాడు చంద్రాపీడుడు. ఒకరకంగా వైశంపాయనునివల్ల ఏర్పడిన దుఃఖంకూడా రోగికి మంచిమందు దొరికినట్టుగా చంద్రాపీడునికి లాభం చేకూర్చింది. కొద్దిసేపు విశ్రమించాడు. అప్పటికి శరీరబాధ కొంత ఉపశమించింది. అప్పటికి మూడవ యామం శంఖం మ్రోగింది. ఆహారాది స్వీకరణకోసం యువరాజు మంచంమీద నుండి లేచాడు. అతనికి వైశంపాయనుడు కాదంబరి దాదాపు సమీప ప్రదేశాలలోనే ఉండవచ్చుననే నమ్మకం ఉంది. ఆ నమ్మకంతో గుండెను బలపరచుకొన్నాడు. మనోనిశ్చలత్వంతో బయలుదేరాడు. భోజనశాలలో మరల రాజసమూహంతో కలసి భోజనం చేశాడు. చంద్రాపీడుని మనస్సులో వైశంపాయనుని మనస్సులో వైశంపాయనుని విరహం వల్ల కలిగిన ఉష్ణతను తగ్గించటానికి సూర్యభగవానుడు బైట తనకిరణాలతో తాపం కలగచేయసాగాడు. బయటి ఉష్ణం లోపలి ఉష్ణాన్ని శాంతింపజేస్తోంది. సూర్యుడు ఆకాశంమధ్యలో ప్రకాశిస్తూ ఎనిమిది దిక్కులకూ తనకాంతిని ప్రసాదిస్తున్నాడు. తన వేడికిరణాలను కరిగించిన వెండిద్రవంలాగా భూమిపై ప్రసరింప జేస్తున్నాడు.

## 62. చంద్రాపీడుడు తిరిగి ఉజ్జయినికి ప్రయాణమగుట

సూర్యకిరణాలు శరీరాన్ని ఛేదించుకొని లోపలికి పోతున్నట్లున్నై. సూర్య కిరణాల వేడిమికి తాళలేని ప్రాణి సమూహాలు చెట్ల నీడలకు చేరుకొంటున్నాయి. కనులు తెఱచి బయటకు చూడ వీలు లేనట్లుంది. దిక్కులన్నీ జ్వలించుతున్నట్లున్నది. భూమి తాకవీలులేనంత వేడిగా ఉంది. దారులన్నీ నిర్మానుష్యమైనై, బాటసారులు చలువ పందిళ్ళలోకి దూరి నీళ్ళతో దాహం

తీర్చుకొంటున్నారు. పక్షులు గూళ్ళలో ఉండి వేడికి తట్టుకొనలేక శ్వాస ప్రక్రియకు కష్టపడుతున్నై. అడవిదున్నలు నీటి గుంటలమధ్య బురదనీటిలో చల్లదనం అనుభవిస్తున్నై. ఏనుగులు మంచి నీటి సరస్సులో పద్మకాండాల్ని తొండంతో ఛేదిస్తూ సరస్సులోని బురదలోనికి జొరబడుతున్నై. తత్సమీప మందున్న చల్లని ప్రదేశాలలో కాసేపు తిరిగి స్నేహితుని వియోగ దుఃఖాన్ని దిగమ్రింగి, ఎండ పలుచబడిన తర్వాత సభానివాసానికి వచ్చాడు చంద్రాపీడుడు. రాజవర్గాన్ని పిలిపించి వారితో కూర్చొని వైశంపాయనుని గుఱించి ముచ్చటించి, 'రెండవ యామంలోనే మనం బయలుదేరాలి, అన్నీ సిద్ధం చేయండి ప్రయాణానికి' అని ఆజ్ఞ యిచ్చాడు సైనికాధికారికి. అటునుండి నివాసానికి వెళ్ళాడు. 'ఉజ్జయినీ ప్రయాణం' అనగానే సైనికులు తమ యిండ్లకు వెళ్ళవచ్చనీ ఉత్సాహంతో తొందఱలోనే అన్నీ సర్దుకొని ప్రయాణానికి సిద్ధమైనారు. చంద్రాపీడుడు కూడా నిద్ర లేకున్నా వినోద కార్యక్రమాలవల్ల విశ్రాంతి లేకున్నా మూడవయామంలోనే చతురంగబలాలతో, రాజ సమూహంతో కూడి విశాలసైన్యంతో భూమిని చదును చేస్తూ బయలుదేరాడు ఉజ్జయినికి.

దారిలోనే తెల్లవారింది. అందరి కన్నుల లోకాన్ని చూడగలుగుతున్నై. వేరే ఏదో కొత్తలోకం సృష్టింపబడిందా అన్నట్లుగా ఉంది. ఎత్తుపల్లాలు స్పష్టంగా కనబడసాగినై. పోను పోను అడవి పలుచపడసాగింది. చెట్లు పొదలుకూడా తగ్గిపోయినై. ఆకాశమంతా ఎఱ్ఱగా లక్కపూసినట్లుగా ఉంది. పద్మాలకు వికసనం కలుగ జేస్తూ సూర్యుడు ఉదయించాడు. సైన్యంతో చంద్రాపీడుడు ఉజ్జయినీ నగరంలోకి ప్రవేశించాడు.

## 63. వైశంపాయనుని అదృశ్యంవల్ల ఉజ్జయిని కలతచెందుట

ఉజ్జయినీనగరప్రజలు గుంపులు గుంపులుగా ఉన్నారు. కొందఱు కూర్చున్నారు. కొందఱు ఎటో వెడుతున్నారు. కొంతమంది వస్తున్నారు.



కొంతమంది కన్నీరు కారుస్తున్నారు. తెల్లబోయిన దీనముఖాలతో కొందఱున్నారు. కొంతమంది 'అయ్యో! ఎంత కష్టం వచ్చింది?' అంటున్నారు. కొంతమంది అతిదుఃఖంచేత మౌనంగా ఉన్నారు. మునుల్లాగా, మోక్షసాధకుల్లాగా, మమకారం లేని సన్న్యాసుల్లాగా, కోరికల్ని త్యజించిన వారిలాగా, ఉదాసీనులుగా, దుర్జనుల్లాగా, స్నేహపరవశుల్లాగా, తల్లిదండ్రుల్లాగా, మిత్రుల్లాగా, గాఢబంధువుల్లాగా ఉన్నారు. కొంతమంది ఆర్తితో 'ఏం జరిగింది?' అని అడుగుతున్నారు. కొందఱు ఏంజరిగిందో చెబుతున్నారు. కొంతమంది' ఏం జరిగి ఉంటుంది' అని ఆలోచిస్తున్నారు. కొంతమంది ఊహిస్తున్నారు. ఎవరేమి మాట్లాడినా అది వైశంపాయనుని గుఱించే. ఆ మాటలు వింటున్న చంద్రాపీడుడు, "వైశంపాయనుడు లేకుండా నేను ఒక్కడినే పితృసమానుడైన శుకనాసుని, మాతృసమానురాలు మనోరమాదేవినిగాని ఎట్లుచూడగలుగుతాను?' అని లోలోపల భావన చేస్తూ, కన్నీటిని బలవంతంగా ఆపుకొంటూ ఉజ్జయినీ రాజమందిరానికి చేరుకొన్నాడు. బహిర్ద్వారం గుండా రాజద్వారందాకా పోయి అక్కడ గుఱ్ఱం దిగాడు.

రాజమందిరంలోకి వెళ్తూ ఉండగానే అక్కడివారు రాజు, రాణులు శుకనాసులవారి భవనానికి వెళ్ళారని చెప్పారు. వెంటనే రాజకుమారుడు తిరిగి బయలుదేరి శుకనాసభవనానికి వెళ్ళాడు. వెడుతూ ఉండగానే, "ఓ నా తండ్రీ! వైశంపాయనా! నీవింకా నా ఒడిలో పెరగవలసిన బాలునిగానే ఉన్నావు. నీవు నన్ను వదిలి పెట్టి భయంకరవిషసర్పాలకు నివాసమైన ఆ భయంకర వనప్రదేశంలో ఎందుకున్నావురా? అక్కడ ఉండే క్రూరమృగాల నుండి నిన్ను నీవు ఎలా రక్షించుకొంటున్నావు? అక్కడ నీకు తిండి ఎలా దొఱుకుతుంది? నీవు సుఖంగా నిద్రించటానికి శయనం ఎక్కడిది? నన్ను వదలి ఆ అడవిలో ఆకలి, దాహం, నిద్ర వీటికోసం బాధపడుతుంటే నీకు తోడెవరు? నీతో సుఖదుఃఖాలు సమానంగా పంచుకునేందుకు నీకు భార్యకూడా

లేదు కదా! నీవు దండయాత్ర నుండి తిరిగి రాగానే మీతండ్రిగారిని ఒప్పించి, నీకు పెండ్లిచేసి, కోడలు ముఖం చూసుకొంటూ ఆనందిద్దామనుకొన్న నా ఆశ అడియాసయే అయ్యిందికద నాయనా! నేనంత అదృష్టానికి నోచుకోని దురదృష్టవంతురాలిని. కోడలి సంగతెట్లున్నా అసలు నీవే కనపడకపోయితివి గదా! నాయనా! ఒకవేళ నీకెక్కడ ఉండటం యిష్టమనుకొంటావో నాన్నను నన్ను కూడా అక్కడికే తీసుకొని వెళ్ళవచ్చు కదరా! నిన్ను చూడకుండా నేను జీవింపలేనురా! నాయనా! నిన్ను బాల్యంలో ఏనాడూ అవమానింపలేదు. మఱి నీవెందుకు మాపై ఒక్క సారిగా ఇంత నిష్ఠురత ఏర్పడింది? పుట్టిన దగ్గఱనుంచి ఇప్పటివఱకు నీకు కోపంవస్తే ఎలాగుంటుందో తెలియదు నాకు. అటువంటప్పుడు నీకు ఒక్కసారిగా ఇంతటి కోపం ఎందుకు కలిగింది? ఎందుకు మమ్మల్ని వదలి దూరంగా ఉండిపోయినావు? సరే వెళితేవెళ్ళావు, మరల మావద్దకు రావచ్చు గదా! తలవంచి నిన్ను దయచూడమని వేడుకొంటున్నానురా! నీవు తప్ప నాకు వేరెవ్వరున్నారు దిక్కు? దూరదేశాలకు వెళ్ళిపోయి మాయందు స్నేహాన్ని వదులుకున్నావా? మఱి, క్షణం కూడా చూడకుండా ఉండలేని చంద్రాపీడుని వదలి ఇంతకాలం ఎలా ఉన్నావు? అతనిపై నీకు విరోధభావం ఎందుకు కలిగింది? నీకింతవఱకు ఏ శుభకార్యం జరగలేదు. అన్నివిధాలా నీచే సుఖపెట్టబడవలసిన మేము దుఃఖాలపాలైనాము. ఇంత దుఃఖదాయకమైన పనిచేసి నీవు ఏమి పలితం పొందదలచుకొన్నావో నాకు అర్థం కావటం లేదు" అంటూ కుమారుని తలుచుకొంటూ మనోరమాదేవి రోదించటం వినపడింది. దగ్గఱనే ఉన్న తల్లి విలాసవతి ఆమెను ఎంతో ఓదారుస్తున్నా పొగిలి పొగిలి ఏడుస్తున్నది మనోరమాదేవి.

చంద్రాపీడుడు దీనాతి దీనమైన మనోరమ దుఃఖాలాపాలనువిన్నాడు. అతని మనస్సు మనస్సులో లేదు. ఎట్లాగో సహజధైర్యంతో గుండెను నిశ్చలపరచుకొని మందిరంలోనికి వచ్చాడు. తన తండ్రిగారి పాదాలకు సిగ్గుపడుతూనే నమస్కారం చేశాడు. వారికి తనముఖం ఎలా చూపించాలో



తెలియటం లేదతనికి. తలవంచుకొన్నాడు. అవయవాలు వణకుతున్నై, మథనం అయిన తర్వాత స్థిమితపడిన సముద్రమువలె ప్రశాంతుడై ఉన్న శుకనాసునకు కూడా నమస్కరించి, దూరంగా కూర్చున్నాడు.

తారాపీడమహారాజు అలా కూర్చుని ఉన్నకుమారుని వంక చూశాడు. అతనికి కన్నీరు బయటకు దూకబోతోంది. దుఃఖభారం చేత గొంతు గద్గదమైంది. కాసేపట్లో వర్షం కురవబోతున్న మేఘంలాగా ఇలా అన్నాడు– "నాయనా! చంద్రాపీడా! నీ తమ్ముని మీద నీకెంత ప్రేముందో నాకు తెలుసురా! నీ జీవితం కంటె నీ వైశంపాయనుని యందే నీకు ప్రేమ అధికం అని నేనెరుగుదును. సుఖం లాగానే దుఃఖంకూడా మనకిష్టమైన వారివలననే అనుకోకుండానే పుడుతుంది. మరి అటువంటప్పుడు పుట్టిన దగ్గఱనుంచి నీకు కలిగిన స్నేహం వయస్సు, శీలం, చదువుసంధ్యలు, గురువుల యందు శ్రద్ధాభక్తులు, వినయవిధేయతలు సమానంగా కలిగిన నీ స్నేహితుడు, తమ్ముడైన వైశంపాయనునికి ఇలా జరిగినా నీ విలా ఉన్నావంటే నీపై నాకు అనుమానం కలుగుతోంది. నీ ప్రేమనిజమైనదా? కాదా?" అని.

వాడి బాణాల వంటి తారాపీడుని నిందావాక్యాలు విన్న శుకనాసుడు అసలే దుఃఖావేశంతో ముఖం కళతప్పి చీకటికప్పినట్లు కాగా, పెదవులు వణకుతూ ఉండగా ఇలా అన్నాడు – "మహారాజా! ఎంత మాటన్నారు? మీరు చంద్రాపీడుని అనుమానిస్తున్నారా? ఒక వేళ చంద్రుడు వేడినిప్పులు కక్కితే, అగ్ని చల్లగా మంచులాగా మారితే, సూర్యుని బింబం అంధకారంలో మునిగితే రాత్రివేళ పగటి కాంతులు వ్యాపించితే, సముద్రాలు ఎండిపోతే, భూభారాన్ని శేషుడు వదలివేస్తే, సత్పురుషుడు పరులకు కీడు చేయ తలపెట్టితే, తనకు దగ్గఱివాడు అనరాని మాటలని నిందించి అవమానించితే (ఇవన్నీ జరిగేది నిజమైతే) చంద్రాపీడుడు కూడా తప్పు చేసిన వాడౌతాడు. దేవా! దోషి వైశంపాయనుడు. వాడు ఆత్మజ్ఞాని కాదు. మూఢాత్ముడు, చెడ్డ జన్మకలవాడు. రాజద్రోహి, మాతాపితృఘాతకుడు, మిత్రద్రోహి, కృతఘ్నుడు,

కర్మణా చండాలుడు, మహాపాపాత్ముడు. అటువంటి వానిని వదలిపెట్టి కృతయుగలక్షణాలుకల, సహజగుణవంతుడైన, ఉదారచరితుడైన, చంద్రాపీడుని ఈ విధంగా తప్పుగా భావించడం తగదు ప్రభూ! చంద్రాపీడునితో పాటే వాడుకూడా సమాన గౌరవాదరాలతో పెంచబడ్డాడుగదా! ఇందులో చంద్రాపీడుని తప్పేముంది? కొందఱికి ఇటువంటి వ్యాధికారక క్రిములు వారికి ప్రకృతి స్వభావంగానే పుడుతుంటాయి. విషసహితసర్పాల్లాగా, అపకారులవుతాయి. దుర్మార్గులకు సద్గుణాలే దుర్గుణాలుగా, దుర్గుణాలే సద్గుణాలుగా కనపడతై. వారికి చెడుపనులే కర్తవ్యాలు. అన్యాయమే న్యాయమౌతుంది. అనాచారమే ఆచారంగా భావింపబడుతుంది. అయుక్తమే యుక్తం. దుష్ప్రవర్తనమే సత్ప్రవర్తనం. అసత్యమే సత్యం.

దుర్మార్గాలకున్న సల్లక్షణాలు దుష్ఫలితాలే యిస్తాయి. ఎలాగంటే పరాక్రమం తోటి ప్రాణుల్ని హింసించటానికి ఉపకారానికి కాదు. ఉత్సాహం ధనసంపాదనకే కాని కీర్తికోసం కాదు. ధనం ఖర్చుచేయుట కోర్కెలు తీర్చుకోవటానికే కాని పుణ్యంకోసం కాదు. ఈ విధంగా దుర్మార్గుల కన్నీ దోషాలకే కాని మంచికొఱకు కాదు. వైశంపాయనుడూ అటువంటి వాడే! నేను ఇంత గుణవంతుడైన మిత్రుడు చంద్రాపీడునకు ఇలా ద్రోహం చేస్తున్నానే అని కొంచెంకూడా మనస్సులో తలపలేదు, వైశంపాయనుడు. నేను ఇలా చెడునడత కలవాడనైతే తప్పును సహింపని శాసకుడు తారాపీడుడు తండ్రినేమైనా అంటాడేమో, నన్ను కోపగిస్తాడేమో, అని కొంచెంకూడా ఆలోచింపలేదు వైశంపాయనుడు. నేను నా తల్లికి ఒక్కడనే గదా కుమారుడను, నేను లేకపోతే ఆమె ఏమైపోతుందో అని కూడా ఆ దుర్మార్గునికి అనిపించనే లేదు. నా తండ్రికి పిండప్రదానం చేయవలసినవాడను నేనే గదా! అసలు నేను జన్మించింది పితౄణం తీర్చటానికే కదా! అటువంటి నేను వారికి చెప్పకుండా అందర్నీ వదలి వెళ్ళిపోవటం ఎంతమాత్రం యుక్తం కాదని వానికి అనిపించలేదు. వాడు అతికష్టం మీద పశువులకు విద్యనేర్పినట్లు



నేర్పాడు. చిలుకను పలుమార్లు పలికించినట్లు పలికించారు. పశుపక్ష్యాదులే కష్టపడి నేర్పిస్తే నేర్చుకొంటాయి. అవి తమను పోషించే వారిపై ప్రేమాభిమానాలు పెంపొందించుకొంటై. ఆ పశుపక్ష్యాదులు కృతజ్ఞతను కలిగి ఉంటై. అవికూడా పరిచయాన్ని ప్రకటిస్తూ మనతో మచ్చికతో ఉంటాయి అవికూడా తమ తల్లిదండ్రుల యందు ప్రేమానురాగాలు కలిగి ఉంటాయి. అయితే మా వైశంపాయనుడు అందుకు భిన్నంగా ప్రవర్తించాడు. వాడు ఇహపరలోకాలను పాడు చేసుకొన్నాడు పాపి. వాని పుట్టుక వృథా. వాడు మంచినంతా ఖననం చేసేశాడు. వీడు తాను జన్మించటం చేత ఎవరిని సుఖపెట్టాడు. అందర్నీ ఏడిపిస్తున్నాడు. అటువంటి దుర్మార్గుడు ఈ పాటికి ఏ జంతువుగానో పక్షిగానో జన్మించే ఉంటాడు. వాడు బాధపడటమేకాక మనని కూడా దుఃఖసముద్రంలోకి విసిరేశాడు. పుట్టిన ప్రతివాడు స్థిరమైన మనస్సుకలవాడై తన మేలుకోసమే కాక తనవారి మేలుకోసం కూడా ప్రయత్నిస్తాడు. మనని ఈ విధంగా దుఃఖపెడుతూ తన హితంగాని, పరహితంగాని ఎలా చూసుకొంటాడు? అసలు వాడు ఇంతటి ఆత్మద్రోహానికి ఎందుకు తలపడ్డాడో ఎంత ఆలోచించినా నాకు అర్థమవటంలేదు. వాడు ఏ దుష్టగ్రహ ప్రభావంచేతనో జన్మించటం కేవలం మనలను దుఃఖపెట్టడానికే" అని శుకనాసుడు ఇలా పలికినవాడై కన్నీరు కారుస్తూ, పెదవులు అదురుతుండగా, గుండెలనుండి ఎగతన్నుకుని బయటకు రాలేని కోపంతో ఊొప్పుతూ ఉండిపోయాడు. తారాపీడుడు శుకనాసుని స్థితిని గమనిస్తూ ఇలా అన్నాడు.

"మహామాత్యా! మీ ప్రబోధాలు మాపై ఈ సమయాన ఎట్టి ప్రభావం చూపలేకపోతున్నై. మీ ప్రవచనాలు మాకు లాభాన్ని కలిగింపలేక పోతున్నై. ఇంటి దీపకాంతిలో అగ్నిని ప్రజ్వలింప జేయటం, పగటికాంతితో సూర్యునికి వెలుగు కలిగించటం, హిమబిందువుల చేత చంద్రునికి ఆహ్లాదం కలిగించటం, మేఘపునీటి చుక్కలతో సముద్రాన్ని నింపాలను కోవటం, విసనకఱ్ఱతో వీచి

వాయుదేవుని వృద్ధి పొందించటం లాంటివి మీరు మాకు ఉపదేశించటం. ఎంతచదివిన పండితునికైనా, జ్ఞానికైనా, వివేకవంతునికైనా, ధీరునికైనా దుఃఖం సంప్రాప్తించినపుడు జ్ఞానబోధ చేయటంచేత నిర్మలమైన సరోవరజలాన్ని వర్షపు నీరు కలిసి మలినం చేసినట్లు మనస్సుల్ని కలుషితం చేస్తుంది అమాత్యా! ఇక మనస్సు కలుషితమైతే మంచేదో చెడేదో గుర్తించే శక్తి నశిస్తుంది. చిత్తము ఆలోచింపలేదు. బుద్ధికి బుద్ధే ఉండదు. అవివేకము కలగదు, ఏదో నోటికి వచ్చింది మాట్లాడతాడు.

అమాత్యా! లోకరీతుల్ని మాకంటే మీరే అధికంగా తెలుసుకొంటారు. యౌవనంలో ఏ ఒడిదుడుకులు, వికారాలు లేకుండా సవ్యంగా నడుచుకొన్న వాడు ఒక్కడైనా ఉన్నాడా! ఈ లోకంలో ఈ బాధలు ఎవరికీ తప్పవు. మీకు తెలియని దేమున్నది – యౌవనం ఎంత చెడ్డదో! యౌవనారంభంతోనే బాల్యంతోపాటుగా గురుజనుల యందుండే ప్రీతి జారిపోతుంది. వయసుతోపాటే ఎవరిపైననో నూతన ప్రీతి పెరుగుతుంది. వక్షఃస్థలంతోపాటే మనోవాంఛలు విస్తరిస్తై. దేహబలంతో పాటే మదం కూడా పెరుగుతుంది. రెండు బాహువులతో పాటే బుద్ధి లావుతనాన్ని పొందుతుంది. చదువు, సంధ్య నడుముతోపాటు కృశత్వాన్ని పొందుతుంది. అవినయం తొడలతో పాటు బలిసిపోతుంది. సర్వమాలిన్యాలకు హేతువైన మోహము గడ్డాలు మీసాలతో పాటు విజృంభిస్తుంది. ఆకారంతో పాటు హృదయములో నుండి వికృతభావాలు ఆవిర్భవిస్తాయి. దృష్టి స్వచ్ఛమైన వస్తువును రాగముతో (ప్రేమ, ఎఱ్ఱదనము) కూడినదానినిగా చూస్తుంది. ఏ అవాంతరమూ లేకపోయినా గురూపదేశము చెవిలో ప్రవేశింపదు.

యౌవనవంతులకు పగలు కూడా దోషాగమము (రాత్రివచ్చుట, తప్పు చేయుట) కొఱకు, దోషాగమము (రాత్రి, తప్పు) దృష్టి నశించుట కొఱకు, దృష్టి నశించుట చెడును గ్రహించుటకు, చెడును స్వీకరించుట అవివేకమునకు, అవివేకము దుష్టమార్గ సంచారము కొఱకు, చెడుమార్గంలో సంచరించే వానిని



మోహముచే గ్రుడ్డిదైన మనస్సు భ్రమిస్తూ ఎక్కడో కూలి పోగొడుతుంది. ఆ పడిపోవటం వల్ల సిగ్గు నశిస్తుంది. సిగ్గు నాశనమవ్వటం చేత (సిగ్గులేని) మనస్సునందు మన్మథుడు ప్రవేశించి స్వేచ్ఛాసంచారము చేస్తుంటే ఇక వానిని ఆపగలిగే దెవ్వరు? ఆ స్వేచ్ఛ సంచారియైన మన్మథుని బాణాలకు ఎంతటి సత్త్వసంపన్నుడైనా గాయపడి నీచస్థితిలో పడిపోతాడు. ఆ సత్త్వ (మనోబలం)మే కనుక నశించితే ఇక శీలమునకు ఎవరి అండా లభింపదు. వినయ విధేయతలూ అడుగంటి పోతై. ధైర్యం నశిస్తుంది. బుద్ధి నాశనమౌతుంది. మనోనిగ్రహం సడలిపోతుంది. ఆపదలు పొందిన ఇంద్రియములను ఎవరు నియంత్రింపగలరు? ఇట్టి పతనశీలుర నెవ్వరును కాపాడజాలరు.

మహామంత్రీ! ఒక్కొక్కప్పుడు పెద్దలు చిన్నవారిపై కోపంతో పలికిన నిందావాక్యాలు యథార్థం కూడ ఔతాయి. పిల్లలకు తలిదండ్రులే దేవతలు కదా! అందువలన గురుజనులిచ్చే ఆశీర్వాదాలు వారికి వరాలుగా అవుతాయో, అలాగే నిందావాక్యాలు (తిట్లు)కూడా వారియెడ శాపాలవుతాయి. మీరు వైశంపాయనుని ఆ విధంగా కోపావేశాలతో నిందిస్తుంటే నామనస్సుకు ఎంతో భేదం కలుగుతోంది. మనం మనచేత్తో నాటి పెంచిన చెట్లమీద కూడా ఎంతో మమకారం చూపిస్తాం. మరి కనిపెంచిన పిల్లల మీద ఎంత మమకారం ఉంటుందో వేరే చెప్పాలా? కావున మంత్రి సత్తమా! ఇకనైనా వైశంపాయనుణ్ణి కోపాన్ని పెంచుకొని దూషించకండి. అతడు మాత్రం ఏమంత నేరం చేశాడు గనుక!

అమాత్యవర్యా! వైశంపాయనుడు అందర్నీ ఎందుకు వదిలేసి వెళ్ళాడో, ఎక్కడకు వెళ్ళాడో మనకు తెలియదు. మరి తెలియకుండా ఊరికే ఆతనిని దూషించడం ఎంతవరకు సమంజసం. ఒక్కొక్కప్పుడు బలమైన కారణం వల్ల చేసిన తప్పు పనికూడా మంచిఫలితమే యివ్వవచ్చు గదా! అసలు వైశంపాయనుణ్ణి రానీయండి చూద్దాం! అసలు అతడు ఇంతటి పని ఏ కారణంగా చేశాడో! ఏమిటో కనుక్కొందాం. అప్పుడు ఏం చేయాలో అది చేద్దాం" అని అతని మాటలు విని శుకనాసుడిలా అన్నాడు.

"ప్రభువులు ఏదో ఆ పిల్లవానిపై నున్న ప్రేమ, వాత్సల్యాలతో అలా అంటున్నారు. ఇంతకంటే ఒక్కక్షణం కూడా ఉండలేనివాడు ఇలా చేశాడంటే దానికి కారణం ఏముంటుంది ప్రభూ!"

మహామంత్రి ఇలా అంటూ ఉండగా, చంద్రాపీడుడు తనే ఈ పరిస్థితికి కారణం కదా! అని భావిస్తూ, వారి మాటలు తనకు కొరడాదెబ్బల వలె గుండెలకు తగులుతుంటే, నెమ్మదిగా జరిగి తండ్రివంటి శుకనాసుని వద్ద చేరి, శుకనాసునితో, "ఆర్యా! మీ మాటలవలన ఈ పరిణామానికి నేను చేసిన దోషమే కారణమని మీరు చెప్పలేదని నాకు తెలుసు. కాని నా తండ్రి అభిప్రాయం ఇక్కడ గమనింపదగినవి. లోకుల మాటలకంటె తలిదండ్రుల అభిప్రాయాలే గౌరవింపదగినది. మనం కావించిన మంచిచెడు పనులను బట్టియే కీర్తి అపకీర్తులు కలుగుతాయి. దీనియందు నాదోషమున్నదని భావించియే పూజ్యులైన మీరు నా ప్రాయశ్చిత్తార్థం ఏం చేయమంటారో సెలవియ్యండి. వైశంపాయనుణ్ణి తిరిగి మీవద్దకు చేర్చే అవకాశం నాకివ్వండి. నా తండ్రి నుండి వైశంపాయనుని అన్వేషించటానికి అనుమతిని మీరిప్పించండి. అదే నా దోషనివారణకు సరైన మార్గం.

వైశంపాయనుడు దొరకక పోయినచో అంతమాత్రాన నేను నా తండ్రికి దూరం కాను. నేను వెడితే మాత్రం వైశంపాయనునితోనే తిరిగి రావటం, ఒకవేళ నేను వైశంపాయనుణ్ణి తేలేకపోతే తండ్రిగారి ఆజ్ఞానుసారం మన మిత్రరాజులు అతనిని తేగలరు. కావున నాకు అతని అన్వేషణకై నాన్నగారి చేత అనుజ్ఞను ఇప్పించండి. నేను వెళ్ళేది గుఱ్ఱం మీదే కనుక నాకు మార్గాయాసం కూడా కలగదు. నేను వైశంపాయనుని వెంట పెట్టుకొని తప్పక వస్తానని మీరు నమ్మండి. అంతేకాదు బయటి దుఃఖంకంటే మిత్రుని వదలి ఉండటం అనే మానసిక దుఃఖమే నాకధికంగా ఉంది. వెంటనే ఇప్పటికిప్పుడు సైన్య సమూహంతో బయల్దేరి తొందరలోనే మిత్రుని వెంట పెట్టుకొని వస్తాను. పుట్టినదగ్గఱ నుంచి వైశంపాయనుడు లేకుండా ఎక్కడకైనా వెళ్ళానా? ఉన్నానా? ఆడుకొన్నానా? నవ్వానా? తిన్నానా? త్రాగానా? నిద్రించానా? చివరికి గాలి కూడా పీల్చలేదే! నేను వైశంపాయనుని వృత్తాంతం విన్న దగ్గరనుండి అటునుండి అటే వెళ్ళలేదు. కారణం – నేనలా చేస్తే వైశంపాయనుని లాగానే చేసినవాడనౌతాను. అతని కోసం వెతకటానికి వెళ్ళనందుకు పెద్దలు నన్ను మన్నింతురు గాక! అని మరల వైశంపాయనాన్వేషణ నిమిత్తం ఆజ్ఞ నిప్పించవలసిందిగా మంత్రిని కోరాడు యువరాజు. "ప్రభూ! దీనికి మీరేమంటారు?" అని ప్రశ్నించాడు మంత్రి తారాపీడుణ్ణి.



## 64. వైశంపాయనుని కోసం చంద్రాపీడుడు బయలుదేరుట

మంత్రి అడిగిన దానికి రాజుకొంచెం సేపు ఆలోచించి తారాపీడుడిలా అన్నాడు. "మంత్రివర్యా! నేననుకొన్నది ఈ రోజులలోనే కుమారుని చేయిపట్టుకొన్న పున్నమనాటి చందమామలాంటి కోడల్ని చూద్దామని అనుకొన్నాను. ఇంతలో విధివశాత్తు ఆ చంద్రబింబానికి మేఘాలు అడ్డుపడినట్టుగా ఈ వైశంపాయనుని వ్యవహారం ఆటంకం కలిగించింది. వైశంపాయనుని తేవాలంటే చంద్రాపీడుని వలననే అవుతుంది. అందులోనూ అతనిని చూడకుండా యువరాజు ఉండలేడు. ఈ ఆపద అనే సముద్రాన్ని దాటటానికి యువరాజే నా లాగా తగినవాడు. వైశంపాయనుణ్ణి తిరిగి తేవటానికి విలాసవతి కూడా చంద్రాపీడుని పంపటానికే సమ్మతిస్తుందనుకొంటున్నాను. అతనిని వెళ్ళనీయండి. అయితే చంద్రాపీడుడు చాలా దూరం వెళ్ళవలసి ఉంటుంది. తాము ప్రయాణముహూర్తం గణకులతో సంప్రదించి నిర్ణయించండి. దానికి తగిన ఏర్పాట్లు చెయ్యండి! అని శుకనాసునితో పలికి, చంద్రాపీడుని వంక కొద్దిసేపు నిశ్చలంగా చూసి, దగ్గఱకు పిలిపించుకొన్నాడు. యువరాజు తండ్రికి వినయంతో వంగి నమస్కరించాడు. రాజు ప్రేమతో కుమారుని భుజాన్ని, శిరస్సును చేతులను నిమిరి, "నాయనా! కుమారా! లోపలికి వెళ్ళి అమ్మకు, మనోరమాదేవికి నీ ప్రయాణ వృత్తాంతం

తెలియజెయ్యి!" అని ఆదేశించి శుకనాసునితో కలసి తన భవనానికి వెళ్ళిపోయాడు.

చంద్రాపీడునకు తండ్రియిచ్చిన అనుమతి కాదంబరీ దేవి ప్రసాదించిన స్వయంవర మాలికలాగా భావించి సంతోషించాడు, లోలోపల అంతఃపురం ప్రవేశించి వారికి నమస్కరించాడు. తల్లి ప్రక్కనే కూర్చొని ఉన్న మనోరమ చంద్రాపీడుని చూడగానే వైశంపాయనుని విరహశోకం రెట్టింపైంది. దుఃఖిస్తూన్న ఆమెను ఓ దారుస్తూ, "అమ్మా! శాంతించు తల్లీ శాంతించు. వైశంపాయనుణ్ణి తీసుకురావటానికి తండ్రిగారు నాకు అనుమతి నిచ్చారు. కొద్దిరోజుల తర్వాత మీ కుమారుని కనులారా చూసి సంతోషింతురు గాని. నన్ను అన్వేషణ కోసం పంపించండి' అని అడిగాడు.

అప్పుడు మనోరమ చంద్రాపీడునితో, "నాయనా! నాకు నీవూ వైశంపాయనుడు సమానమే. కఠినహృదయనగు నేను ఇప్పుడు ఒక్క వైశంపాయనుని మాత్రమే చూడకున్నాను. నీవు కూడా వెళ్ళిపోతే ప్రాణాధారభూతుడవైన నీవు కూడా కనబడకుండా పోతావు. కుమారా! మీ యిరువురిలో ఒక్కరున్నా మేమిద్దఱము పుత్రసంతానవంతురాండ్రుగా భావిస్తాం. అందువల్లనే నీవు వెళ్ళవద్దు. ఆ నిర్దయుడు వస్తే రానీ, లేకుంటే లేదు" అన్నది మనోరమాదేవి. విలాసవతి ఆమెతో ధైర్యంగా ఇలా అంది.

"నెచ్చెలీ! నీవు చెప్పినట్టుగానే నేను కూడా అలాగే అనుకొంటాను" కాని వీడు వైశంపాయనుడు లేకుండా ఎలా ఉండగలడు? అది అలా ఉండనీ. ఇతనిని అన్వేషణకు వెళ్ళవద్దంటున్నావేమిటి? మనం వద్దన్నా చంద్రాపీడుడే ఇక్కడుండడు. అది తెలిసే తండ్రిగారు వీనికి అనుమతి నిచ్చారు. కనుక వెళ్ళనీ మనం ప్రతిదినం వైశంపాయనుని గూర్చి ఎల్లకాలం దుఃఖించే కంటే ఈ నాలుగు రోజులు చంద్రాపీడుని వియోగాన్ని భరించటమే మేలు. అందువల్ల లే! బయలుదేరు మనం చంద్రాపీడుని ప్రయాణానికి తగిన ఏర్పాట్లు చేద్దాం రా!" అని ఆమెను చేతితో లేపి, తాను లేచి చంద్రాపీడుడు తమను



అనుసరింపగా తన భవనానికి బయలుదేరింది విలాసవతి తల్లి భవనంలో చంద్రాపీడుడు ప్రయాణం గూర్చి కానేపు ముచ్చటించి తన యింటికి వెళ్ళాడు.

చంద్రాపీడుడు ఎప్పుడెప్పుడు బయటపడదామా అని తొందరపడుతూ జ్యోతిశ్శాస్త్ర పండితుల్ని పిలిపించి, వారితో ఏకాంతంలో, "నా ప్రయాణానికి ఆలస్యం జరగకుండే విధంగా ముహూర్తం నిర్ణయించండి. తండ్రిగారు వైశంపాయనుని విషయంలో అడిగినప్పుడు దగ్గఱలో ఉండేరోజును సూచించండి" అని కోరాడు. అందుకువారు, "చిత్తందేవా! ఏ గ్రహాలు ఎలా ఉన్నప్పటికిని యువరాజుగారు కోరిన ముహూర్తమే నిర్ణయింపబడుతుంది. ప్రభువుల కోరిక మేరకే ముహూర్తాలు ఏర్పడతాయి. రాజే కాలనిర్ణాయకుడు. మీ మనస్సునందు ఏ వేళ మంచిదౌతుందో అదే వేళ సర్వకార్యాలకు తగిన వేళ' అని విన్నవించారు. చంద్రాపీడుడు మరల వారితో ఇలా అన్నాడు– "మా తండ్రిగారే ముహూర్తనిర్ణయానికి ఆదేశించారు. కనుక ఇలా నేను అంటున్నాను. ఆలస్యమైన కొద్ది కార్యపరులకు ఇబ్బంది కలుగుతుంది. కనుక నా ప్రయాణం రేపే అయ్యేటట్టు నిర్ణయించండి' అని కోరాడు, వారును అంగీకరించి వెళ్ళిపోయారు. చంద్రాపీడుడు స్నానపానాదుల కొఱకు లేచాడు.

చంద్రాపీడుడు స్నానభోజనాదులు పూర్తయిన తర్వాత జ్యోతిశ్శాస్త్రజ్ఞులు మరల అతనిని కలిశారు. "దేవా! మీ ఆదేశాను సారమే చేశాం. రేపు రాత్రికి ముహూర్తం నిశ్చితం అయింది. అప్పుడు మీరు బయలుదేరవచ్చు" అని వారన్నారు. యువరాజు వారిని మెచ్చుకొన్నాడు. ఇక కాదంబరిని తన కంటి ఎదుటనున్న దానినిగా భావించాడు. వైశంపాయనుడు చిటికెలో దొరుకుతాడని భావించాడు యువరాజు.

చంద్రాపీడుడు శారీరకంగా ఉజ్జయినిలో ఉన్నా మానసికంగా హేమ కూటంలోనే ఉన్నాడు. ప్రపంచమంతా గాలించి తెచ్చినవి, ఇంద్రాయుధంతో సమానంగా పరుగులెత్తగల గుఱ్ఱాలను, రౌతులను సమకూర్చుకొని బయల్దేర సిద్ధమైనాడు. ఆ రౌతులు ఎంతదూరమైనా ఆయాసం లేకుండా దౌడు

తీయగలరు. ఆ విధంగా యువరాజు తయారై ఆరోజు, మరునాడు పగలు ఎలాగో గడిపాడు.

రాత్రికి ప్రయాణానికి రౌతుసమూహం సిద్ధమైంది. సూర్యుడు అస్తమించాడు. సంధ్యారాగం ఎల్లెడలా అలుముకొంటోంది. సంధ్యాగ్ని కణాలలాగా ఆకాశంలో నక్షత్రసమూహంతో చింది క్రమకమంగా చీకట్లు దట్టంగా వ్యాపించినై. కన్నుగానని చీకటి నర్తిస్తోంది. కాసేపటికి చంద్రోదయం కాగానే వెన్నెల నెమ్మదిగా లోకంలో వ్యాపించుతోంది.

ప్రయాణానికి సంసిద్ధుడైన చంద్రాపీడుడు విలాసవతికి నమస్కరిద్దామని ఆమె వద్దకు వెళ్ళాడు. కండ్లలో నీరు ఉబుకుతున్నా అశుభం అవుతుందని నివారించుకోవటానికి ప్రయత్నిస్తూ, గద్గద కంఠంతో ఇలా అన్నది.

"తండ్రీ! నా ఒడిలో పెఱిగిన నీవు మొదటిసారిగా వదిలివెళ్ళిపోతూ మనోబాధ కలిగిస్తున్నావు. నీవు వెళ్ళుతుంటే నా గుండెలు బ్రద్దలౌతున్నట్టుంది. సంధిస్థానాలు బలవంతాన లాగివేసినట్లున్నాయి. శరీరము ఉడికిపోతోంది. మనస్సు ఎటో ఎగిరిపోతున్నది. ప్రాణాలు పోతున్నాయి. బుద్ధి కుదుటపడటం లేదు. అంతా శూన్యంగా కన్పడుతోంది. నన్ను నేను నిలువరించుకోలేక పోతున్నాను. ఎంత ఆపుకొందామనుకొన్నా కన్నీరు ఆగటంలేదు. మనస్సునెంత స్థిరపరచుకొందామన్నా వీలు కావటం లేదు. ఏమి చూస్తున్నానో తెలియటం లేదు. నాకింత హృదయపీడ ఎందుకు కలుగుతోందో ఎంత ఆలోచించినా తెలియటం లేదు నా పుత్రుడు చాలాకాలానికి వచ్చి మరల అప్పుడే వెళ్ళిపోతున్నాడు. వైశంపాయనుడు లేకుండా నీవు ఒక్కడవే ఎలా వెడతావోనని నా ఆందోళన, వైశంపాయనుని వియోగంచేత నీవు దుఃఖిస్తున్నావు. అంత బాధపడుతూ అతనిని వెదకుతూ వెళ్ళే నిన్ను నేను ఆపలేక పోతున్నాను. నా హృదయం నీవు వెళ్ళటానికి అంగీకరించటం లేదు. నీవు లోగడ వెళ్ళి చాలాకాలం తర్వాత వచ్చినట్టుగా ఇప్పుడు కూడా దీర్ఘకాలం ఉండవద్దు, నీకు శిరసువంచి ప్రార్థిస్తున్నాను" అని



చంద్రాపీడుడు తల్లి మాటలు విని వినయంతో వంగి నమస్కరిస్తూ, "అమ్మా! అప్పుడు విజయయాత్రకోసం కదా వెళ్ళింది. అక్కడికి వెళ్ళటమే ఆలస్యం, తొందరలో రానూ! నీవు నా గూర్చి బెంగపెట్టుకోవద్దమ్మా! "అని ఓదార్చాడు. తల్లి అతని ప్రయాణానికి కావలసిన ఆచార మంగళ కార్య క్రమాలు చేసి, కన్నీరును బలవంతంగా ఆపుకొంటూ అతనిని కౌగిలించుకొని, శిరస్సు మూర్కొని చివఱకు అతనిని వెళ్ళుట కనుమతించింది.

తరువాత చంద్రాపీడుడు తండ్రి వద్ద వీడ్కోలు పొందుటకు ఆయన భవనానికి వెళ్ళాడు. ద్వారపాలకుడు యువరాజు రాకను గూర్చి తెల్పగా అనుమతిని పొందిన యువరాజు తండ్రి పాదాలకు శిరము తాకించి వందనం చేశాడు. తండ్రి శయనంమీద పైకి లేచి కూర్చొని కుమారుని దగ్గఱకు పిలిపించుకొని గాఢంగా కౌగిలించుకొని, కంటినిండుగా నీరు క్రమ్ముచుండగా, లోపలినుండి తన్నుకొని వస్తున్న ఉద్వేగాన్ని అణచిపెట్టుకొని, "నాయనా! ఇంతకుముందు నేను నిన్ను కఠినవాక్యా లాడానని నాపై కోపమా! అలా కోపపడవద్దు. బాల్యావస్థనుండి నీవు నా పరీక్షల నెన్నింటినో ఎదుర్కొన్నావు. నీవు గుణగణాలతో పరిపూర్ణుడవు కనుకనే నీవు పట్టాభిషిక్తుడవైనావు. కేవలం నా కుమారుడ వైనంత మాత్రంచేత యువరాజువు కాలేదు. రాజ్యం అంటే మాటలా! భూభారం వహించినంత కష్టం. కుటిలనీతులతో కూడి అడుగు ఉంచే వీలుకాని పరిపాలన. దీనిలో కుటిలనీతి ప్రచారాలుంటై. అంతులేని కార్యభారం నిరంతరం మోస్తూ ఉండాలి. ఉన్నతవంశ ప్రతిష్ఠను కాపాడుకోవాలి. వేలకొలది లక్షలకొలదిగానున్న శత్రువులను రూపు మాపాలి. అందరియందు సమభావంతో ప్రవర్తించాలి. పక్షపాతబుద్ధి పనికిరాదు. అనేక ఉపాయాలను ప్రయోగించటంలో మెలకువ ఉండాలి. సంఘంలోని దుష్టశక్తుల్ని ముండ్లలాగ ఏరివేయాలి. ప్రజలకు ఏ కష్టం కలగకుండా కాపాడాలి.

రాజ్యము సుభిక్షంగా ఉండాలంటే ఇచ్చట చెప్పబడే వారికి రాజ్యలో స్థానం కల్పింపరాదు. వారిని రాజ్యంలో ఉండనీయరాదు. సత్పురుషులు

మాత్రమే నివాసార్హులు. సత్పురుషులనగా. దురాక్రమణ చేయనివారు, అసత్యము పలుకనివారు, జ్ఞానహీనులు కానివారు, అవివేకులు కానివారు, కృతఘ్నులు కానివారు, అనౌదార్యము లేనివారు, అన్యాయము చేయని వారు, అధర్మమందు అభిరుచి లేనివారు, శాస్త్రవిరుద్ధంగా నడువనివారు, శరణు పొందదగినవారు, అబ్రహ్మణ్యులు కాని వారు, అమిత్రవాత్సల్యం లేనివారు, నిర్దయలేనివారు, అనిర్జితేంద్రియులు కానివారు, సేవాభావము కలవారు, వీరు మాత్రమే.

నీ కర్తవ్యమునందు ఇతరులయందు భారముంచి దోషము చేయకుము. సకలప్రజారంజనమునకు నీవే స్వయముగా పూనుకొనాలి. మా కాలం తీరిపోయింది గదా! మేము రాజ్యంలో స్థిరంగా కాలు మోపి నిలవగలిగాం, దురాశతో మేము ప్రజలను పీడింపలేదు. ధర్మాధర్మోపదేశికులైన గురువులు అవమానింపబడలేదు. సత్పురుషులు రాజగర్వంతో దండింబడలేదు. క్రోధంతో సామాన్యప్రజానీకం భయకంపితులు కాలేదు. మేము సంతోషంతో ఉబ్బిపోయినవారం కాదు. కామంతో పరలోకానికి దూరం కాలేదు. రాజధర్మం దర్పంచేత సన్మార్గం తప్పలేదు. వృద్ధులను కావాలని సేవించాం. వ్యసనాలను కాదు. సత్పురుషుల్ని అనుసరించాం. కాని ఇంద్రియాలను కాదు. శత్రుసైన్యం మీదకు ధనుస్సును వంచాము కాని మనస్సును కాదు. సత్ప్రవర్తనను కాపాడుకొన్నాం, శరీరాన్ని లోభంతో రక్షింపలేదు. లోకనిందకు భయపడ్డాం, మరణానికి కాదు. స్వర్గలోకంలో లభింపని సర్వసుఖాలూ అనుభవించాం. యౌవనంలోని సుఖాలను చాలినంతవఱకే అనుభవించి ఇహలోకమేకాక పరలోకాన్ని కూడా సంపాదించాము. నీవు జన్మించటంచేత కృతార్థుడను కూడా అయ్యాను. నా కోర్కె నెరవేరింది. నీకు వివాహంతో వధువును సమకూర్చి సకల రాజ్యభారము నీ భుజాలపై ఉంచి, నిశ్చింతతో కూడిన హృదయంతో పూర్వ రాజర్షులు అనుసరించిన మార్గాన్ని అనుసరించి అరణ్యవాసం చేద్దామని నా అభిలాష. నా కోర్కెకు భిన్నంగా ఈ వైశంపాయనుని



వ్యవహారం ప్రతిరోధకంగా నిలిచింది. అలా జరగాలని లేదని నేను అనుకొంటున్నాను. ఈ విధంగా వెశంపాయనుడు అదృశ్యుడై ఇలా చేశాడు. నా కోర్కె నా అంతర్హృదయంలోనే అలా నిలిచిపోయిందందుకనే. అని తారాపీడుడు తన హృదయవేదనంతా వెడలకక్కాడు. మనోబాధను లోలోన అణచిపెట్టుకొని కుమారునకు తాంబూలమిచ్చి పంపివేశాడు.

చంద్రాపీడుడు తండ్రి ఉపదేశవాక్యాలకు శారీరకంగా ధైర్యాన్ని, మానసికంగా వినయాన్ని తెచ్చుకొని మరల తండ్రికి వందనం చేసి, శుకనాసుని భవనానికి బయల్దేరాడు. శుకనాసుడు కుమారుని గూర్చిన చింతతో ఆకులిత హృదయంతో, నిరంతరం కన్నీటిని విడుస్తూ శూన్యశరీరుడిగా ఉన్నాడు. తల్లి కుమారుని గూర్చి దుఃఖపడుతూ కన్నీరు కారుస్తూ ఉంది మనోరమ. యువరాజు ఇరువురికి నమస్కరించాడు. వారు అదేస్థితిలో ఉండి చంద్రాపీడుని ఆశీర్వదించారు. వేగంగా తన యింద్రాయుధం దగ్గఱకు వచ్చాడు.

ఇంద్రాయుధం మునుపటివలె ఉత్సాహంగా లేదు. అల్లంతదూరం నుండి వస్తున్నా చంద్రాపీడుని చూసి హర్షంతో హేషారవం చెయ్యలేదు, రెండు చెవులు పైకి రిక్కించలేదు. సంతోష శబ్దం చేయలేదు. అన్యమనస్కంగా ఉంది. మునుపటిలాగా గమనోత్సాహంలేదు. ఇంద్రాయుధం దీనంగా కనబడుతోంది. మరల ఆగవలసి వస్తుందనే అనుమానంతో, వైశంపాయనుని త్వరగా చూడాలనే కోరికతో, కాదంబరిని కలవాలనే ఉత్సుకతతో, ఎంతమాత్రం ఆలసింపక త్వరగా అశ్వాన్నెక్కి అమిత వేగంగా నగరం నుండి బయలుదేరాడు.

అలా బయల్దేరిన చంద్రాపీడుడు సిప్రానదిని దాటి, దాని ఒడ్డున మంగళాచారపూర్వకంగా వీడుకోలు పల్కటానికి ఏర్పాటు చేసిన గుడారంలోకి వెళ్ళకుండా బయటనుండి బయటే గుఱ్ఱాన్ని దౌడుతీయించాడు. 'అయ్యో! యువరాజు ఇటు రాకుండా వెళ్ళిపోతున్నాడేమిటి? అని పరిజనులు అవాక్కయ్యారు. అక్కడున్న రాజకుమారులు అంతా కోలాహలం చేశారు. వారు తీవ్ర ఆందోళనతో ఏమి చేయాలో తోచక అటు నిటు పరుగులు

తీయసాగారు. రాజకుమారులు చంద్రాపీడుని అనుసరించి బయలుదేరారు. అలా ఆ గుఱ్ఱపుదండు ఆరుక్రోసులు (1½ యోజనాలు) వెళ్ళారు అక్కడ గడ్డి, నీరు సులభంగా దొరికే చోట గుడారాలు నిర్మించారు. ఆ రాత్రి అక్కడ విశ్రమించారు. అయితే పూర్తిగా తెల్లవాఱకముందే లేచి మరల ప్రయాణమయ్యారు.

ఆ విధంగా వైశంపాయనుని ఎప్పుడు చూస్తానా! అనే ఔత్సుక్యంతో బయలుదేరాడు చంద్రాపీడుడు. చంద్రాపీడుడు ప్రయాణం చేసినంతకాలం ఏవో "ఊహలలో గడిపాడు. తిండి, నిద్ర, దాహం ఇవేమీ పట్టించుకోలేదు. రాత్రింబవళ్ళు వైశంపాయనుని ఆలోచనలతో గడిపాడు.

నేను వెళ్ళీ వెళ్ళగానే వైశంపాయనుని వెనుకగా పోయి హఠాత్తుగా మెడను కౌగిలించుకొని, మిత్రమా! ఇప్పుడెక్కడకు పారిపోతావు? అని అతని సిగ్గును వదలగొట్టి, నేను అతనిని తీసికొని మహాశ్వేతను కలుసుకొంటాను. ఆమె నేను అనుకోకుండా హఠాత్తుగా కనపడే సరికి మిక్కిలి సంతోషపడుతుంది. మహాశ్వేతాశ్రమ ప్రాంతంలోనే అశ్వదళాన్ని నిలిపి ఉంచినేను ఆమెతో పాటు హేమకూటం వెడతాను. అక్కడ నన్ను గుర్తుపట్టిన కాదంబరీ పరిజనం నాకు నమస్కారాలు చేస్తారు. నేను వచ్చాననే శుభవార్తను తెలియజెప్పిన సఖీజనులు కాదంబరి పైపడి ఆమె నగలను బలవంతంగా దోచుకొంటారు. ఆమె, "ఆయన ఎక్కడున్నారు? ఎవరు చెప్పారు? ఆయన ఇంకా ఎంతదూరంలో ఉన్నారు? "అని ప్రశ్నిస్తూ ఉంటుంది. అప్పటికప్పుడు ముంచుకొచ్చిన సిగ్గుచేత తాపోపశాంతికోసం గుండెలపై ఉంచిన పద్మినీ పత్రాన్ని తీసి పారవేసి, తనపై ఉత్తరీయపు చెంగుతో హృదయాన్ని కప్పుకొంటుంది. అంతకుముందు చేతులకు, నడుముకు, మెడకు, కాళ్ళకు ఆభరణాలుగా చుట్టుకొన్న తామర తూడులన తీసివేసి ఏ ఆభరణాలు లేకపోయినా ఉన్నట్లుగా మెఱసే శరీరకాంతితో కాదంబరి ఉంటుంది. తాపనివారణకు ముత్యాలమాల మాత్రమే ఆభరణంగా ధరిస్తుంది. అంతకుముందు శరీరానికి చంనదపు పూత పూసుకోవటం చేత శరీరశోభ బయటపడకపోగా, శరీరాన్ని తడుముకొనే మిషతో చందనాన్ని రాల్చివేసి సౌందర్యాన్ని బహిర్గతం చేస్తుంది. మణిదర్పణంలో చూసుకొని చెంపలపైకి జాఱిన కేశపాశాన్ని తిరిగి చేతితో భుజాలపై పెట్టుకొంటుంది. నన్ను చూసిన ఆనందంతో కనుదోయి నిండిపొర్లుతున్న బాష్పజలాన్ని మన్మథునకు జలాంజలి సమర్పిస్తుంది. చంద్రాపీడుడు నావద్దకు వచ్చాడు కనుక నాలో ఉన్న మన్మథాగ్ని చల్లారింది అని తెల్పుతున్నట్లుగా వంటికి రాయగా ఎండిపోయిన తెల్లని చందనం పొడిని భస్మంలాగా చూపుతుంది. నాకు స్వాగతం చెప్పటానికి అప్పటివఱకు తాను శయనించిన శయ్యను విడిచిపెట్టి ఎదురువస్తున్న కాదంబరిని కంటినిండా చూసి కన్నులకు కృతార్థతను కల్పిస్తాను. అలాగే మదలేఖకు నమస్కరించి కౌగిలిస్తాను. పాదాలపై పడిన పత్రలేఖను పైకి లేపి గౌరవిస్తాను. కేయూరకుని మాటిమాటికి కౌగిలించుకొంటాను. మహాశ్వేత నన్ను త్వరగా మంగళస్నానం చేయమంటుంది, చెలులు నాకు త్వరత్వరగా వైవాహిక మంగళస్నానం చేయిస్తారు. ప్రథమ మేఘవర్షంతో తడిసిన భూదేవిలాగా ఉన్న కాదంబరీ దేవిని నేను పరిణయమాడతాను.



విస్తారమైన కుంకుమపువ్వు ధూపము యొక్క పొగలు దట్టంగా కమ్మి మధుర సుగంధభరితమైన మన్మథ నివాస భవనంలో శయనంమీద ఉన్న నా సమీపాన కూర్చుండి మధలేఖ ఏదో నిగూఢవాక్యాలు పలికి వెళ్ళిపోగా, అపుడు నేను మిక్కిలి సిగ్గుపడుతూ, ఇష్టంలేనట్లున్న కాదంబరిని బలంగా చేతులతో పైకి లేపి శయనంపై ముందుగా జేరుస్తాను. తరువాత ఒడిలోకి, అటుతరువాత హృదయంలోకి చేరుస్తాను. ముందుగా నీవీబంధాన్ని నేను సడలింపబోతే ఆమె బలంగా తన చేతులతో అడ్డుకొంటుంది. సిగ్గుతో ఆమె కనులు మూసుకొంటాయి. నే నామెను స్వచ్ఛమైన ప్రేమతో ముద్దిడుతూ చాలాసేపు అలా ఉండిపోతాను.

అటుపై దేవతలకు కూడా దుర్లభమైన అధరసేవన ద్వారా తృప్తి తీరేంతవఱకు త్రాగుతాను. నా జన్మను సార్థకం చేసుకొంటాను. ఆమెతో నేను సంగమించి మధుర జీవనం గడుపుతాను. చుఱుకుతనములేని దానిని నా చాతుర్యంతో చుఱుకుతనం కలదానినిగా చేస్తాను. దూరంగా ఉండే కాదంబరిని తనంతతాను అర్పణ చేసుకొనే దానినిగా చేస్తాను. సిగ్గుతో ముడుచుకొన్న దానిని తనంతతాను నా సమీపానికి వచ్చి స్వేచ్ఛాచారిణిగా ఉండేట్టు చేస్తాను. నేనామెతో కలసి అమితసుఖభోగా లనుభవిస్తాను. అంతేకాదు నా ప్రియమిత్రుడు వైశంపాయనునకు మదలేఖను తోడు చేస్తాను" అని ఇంకా ఏవేవో ఆలోచనలు చేస్తూ నిర్విరామంగా ప్రయాణాన్ని కొనసాగించాడు.

## 65. వర్షాకాలవర్ణనం

ఎంతదూరం ప్రయాణించినా సగం కూడా పూర్తికాలేదు. ఇంతలో వర్షాకాలం మొదలైంది. ఈ వర్షం దారిలో కాలసర్పం అడ్డం వచ్చినట్లుగా ప్రయాణాన్ని నిరోధిస్తుంది. ఎండాకాలానికి బురదలాగా, సూర్యునికి రాత్రి సమయంలాగా, చంద్రునికి రాహువులాగా, మన్మథుడనే ఏనుగుకు మదప్రాదుర్భావంలాగా, విరహులకు కన్ను పొడుచుకున్నా కానరాని చీకటిలాగా, విరహిణులనే జింకలకు కాలపాశపు వల వలె, దిగ్గజాలకు అతిబలం కలిగిన లోహపు సంకెలలాగా, గుఱ్ఱాలకు ఛేదింపరాని కాలిసంకెలలాగా, బాటసారులకు విడదీయరాని సంకెలలాగా, భర్తలు దూరమైన స్త్రీలకు దాటరాని దట్టమైన అటవీ ప్రాంతంలాగా, ప్రాణులకు ఇనుప పంజరంలాగా వర్షాకాలం వచ్చింది.

మేఘాలు కమ్మటంచేత అంధకారం ఆవరించినట్లే మోహాంధకారం వృద్ధి చెందింది. చీకట్లు పోద్రోలే మెఱుపులు, సూర్యకాంతి చేతనే సంతాపం అధికమైంది. చాతకాలకు త్రాగునీరు లభ్యమైంది మేఘవర్ష బిందువులచేత. నెమళ్ళు మేఘగర్జనలను విని పింఛములు విప్పినాట్యం చేస్తూ, అరచే



అరుపులతో ఎగుడు దిగుళ్ళుగా ఉన్న రాళ్ళపై నుండి దూకుతున్న సెలఏళ్ళ చప్పుడులు జతకూడినై.

చంద్రాపీడునకు మాత్రం రాత్రనక పగలనక, గ్రామ మనక అరణ్యమనక, లోపలనక బయటనక, వనమనక ఉపవనమనక, దారి అనక నివాసమనక సర్వవేళలా వైశంపాయనకాదంబరుల నెప్పుడు కలుద్దామా అనే ధ్యాస తప్ప వేరే ఆలోచనలేక ప్రయాణాన్ని కొనసాగిస్తూనే ఉన్నాడు. అతనికి సుఖమనేది లేకుండాపోయింది. మదనాగ్నికి తన శరీరాన్ని బలంచేసి, సహజంగా ధైర్యవంతుడైన చంద్రాపీడుడుకూడా అధైర్యపడ్డాడు. తన శరీరము ధారాపాతంగా ఉన్న జలాలతో తడిసికూడా ఎండిపోయాడు. మెఱుపులు పది దిక్కులను మెఱిపిస్తూ ఉన్నా తాను మాత్రం మోహాంధకారంలో పడిపోయాడు. అందరికి సంతోషం కలిగించే వర్షజలధారలు అతనికి అగ్నిధారలైనై. నిండుగా నీళ్ళతో ఉన్న మేఘములను చూచి కూడా కృశత్వాన్ని పొందాడు. వర్షపు జలం ప్రాణికోటికి జీవనాధారమైనా కూడా చంద్రాపీడుడు ప్రాణాలపై సందేహం పెంచుకొన్నాడు.

చంద్రాపీడుడు వర్షం తనను ఎంత ఆపుదామని ప్రయత్నించినా కాదంబరీ దర్శనోత్కంఠతో ఎట్లో ప్రయాణాన్ని కొనసాగిస్తూనే ఉన్నాడు. గుఱ్ఱం ఎగుడుదిగుడులు లెక్కచేయకుండా జాఱుతున్నా ప్రయాణిస్తూనే ఉన్నాడు. మాటికి కళ్ళాలు, జీను జారిపోతున్నా దాన్ని సరిచేసుకుంటూ గుఱ్ఱాన్ని నడుపుతూనే ఉన్నాడు. ఏదో బ్రతికి ఉండటంకోసం బలవంతం మీద కొంచెం ఆహారం తింటూ ఉన్నాడు. రాజోద్యోగులు ఎంత బతిమాలినా తన అలంకారాలపైన శరీర సంస్కారంపై నా శ్రద్ధ చూపకుండా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాడు. ఒక్కొక్క రోజు అలాగడుపుతూ ఉన్నాడు.

## 66. మేఘనాదుడు చంద్రాపీడుని కలియుట

ఈ విధంగా ప్రయాణం జరుగుతూ ఉండగా మూడవ వంతు ప్రయాణం మిగిలి ఉందనగా ఎదురుగా వస్తున్న మేఘనాదుణ్ణి చూశాడు. అతడు దూరం

నుంచే యువరాజుకు నమస్కరించాడు. చంద్రాపీడుడు అతనితో, "పత్రలేఖ రావటం, రాకపోవటం గూర్చిన వార్త అలా ఉండనివ్వు. నేను ఇప్పుడు వైశంపాయనుని వృత్తాంతమే అడుగుతున్నాను. ఏమయ్యా! వైశంపాయనుడు అచ్ఛోదసరస్తీరాన నీకు కనిపించాడా? అతడు అక్కడ ఎందుకు ఉండిపోయాడో అడిగావా? నవ్వు అడిగితే ఏమన్నా సమాధానం చెప్పాడా లేదా, మమ్మల్ని విడిచి ఉన్నందుకు ఏమన్నా పశ్చాత్తాప పడుతున్నాడా? అసలు మమ్మల్ని తలుస్తున్నాడా? నా గూర్చి నీతో ఏమన్నా అడిగాడా? అసలు నీ వతనిని ప్రయాణం కమ్మని అడిగావా? అతనికి నేను ఇలా వస్తున్నట్లుగా చెప్పావా? ఆ ప్రదేశం నుండి వేఱొక చోటికి వెళ్ళలేదు కదా! అసలు ఆ వైశంపాయనుడు కంటికి కనిపిస్తున్నాడా? నేను బతిమాలితే ఏమన్నా వింటాడంటావా? అతను నాతో రావటానికి యిష్టపడతాడా? రోజంతా ఏం చేస్తూ గడుపుతున్నాడు? అక్కడ ఒంటరిగా ఉన్న అతనికి కాలక్షేపంగా ఎవరైనా ఉన్నారా?" అని ప్రశ్నమీద ప్రశ్న అడగ సాగాడు.

**ఆ ప్రశ్నలకు మేఘనాదుడిలా సమాధానమిచ్చాడు**

ప్రభూ! మీరు స్కంధావారంతో వస్తున్న వైశంపాయనుని చూసి మీవెనుకనే నేను వస్తానని పలికి కేయూరక పత్రలేఖలతో నన్ను పంపారు కదా! వైశంపాయనుడు సరస్సుకు అవతలి తీరానికి వెళ్ళాడనే వార్తకూడా ఎక్కడా వినపడలేదు. ఇంతలో వర్షాకాలం వచ్చేసింది. ఈ వర్షపురోజులలో మిమ్ములను తారాపీడులు, శుకనాసులవారు ప్రయాణానికి అనుమతించరేమో అని అనుమానం కలిగింది. వైశంపాయనుడే ఇక్కడలేనప్పుడు మీరు ఒక్కరు ఇక్కడ ఉండటం మంచిదికాదు. కావున మీరు ఇక్కడినుండి వెనుకకు మరలిపోండి' అని కేయూరకపత్రలేఖలు నన్ను బలవంతంగా వెనక్కు పంపివేశారు" అని పలికి మిన్నకున్నాడు.

చంద్రాపీడుడు మేఘనాదునితో", అయితే పత్రలేఖ ఈ రోజుకన్నా హేమకూటానికి చేరుతుందంటావా' అని ప్రశ్నించాడు.



అందుకు మేఘనాదుడు, "ప్రభూ! ఏ అడ్డంకీ లేకుంటే నిస్సందేహంగా ఆమె గమ్యం చేరుకునే ఉంటుందని నామ్మకం" అన్నాడు.

యువరాజుకు కాదంబరి జ్ఞప్తికి వచ్చింది. వర్షాకాలపు చిహ్నాలన్నీ అతని మదనబాధను అధికం చేయసాగినై. మేఘాలు కాలకింకరుల్లాగా, మెఱుపులు మన్మథాగ్ని కీలల్లాగా, మేఘగర్జనలు యమపురంలో మ్రోగించే తప్పెట్లలాగా, వర్షధారాసమూహాలు మన్మథ బాణాల్లాగా, గంభీర మేఘధ్వని మన్మథుని వింటినారి ధ్వనిలాగా, నెమళ్ళధ్వనులు యమభటుల సంభాషణల్లాగా, మొగలితేకుల సువాసనలు విషపువాసనల్లాగా, మిణుగురు పురుగులు ప్రళయాగ్ని విస్ఫులింగాల్లాగా, తుమ్మెదలవరుసలు కాలపాశంలాగా, బెగ్గురు పక్షుల సమూహాలు యమపురపతాకల్లాగా, నదులు ప్రళయకాల జలప్రవాహాల్లాగా, గిరిమల్లికాపుష్పాలు యముని నవ్వుల్లాగా కన్పడసాగినై. పిఱికితనంచేత శరీరబలం నశిస్తోంది. నీరసంచేత బలం నశిస్తోంది. మోహంచేత మతి మందగిస్తోంది. విషాదంచేత ధైర్యం చెడుతోంది. శోకంచేత హాసం మాయమౌతోంది. అశ్రుజలం చేత దృష్టి మందగిస్తోంది. మౌనం చేత మాటలు కఱవౌతున్నై. శక్తిహీనత చేత శరీరావయవాలు పట్టు తప్పుతున్నై. అయిష్టత చేత సమస్త అభిరుచులు చెడి పోతున్నై. వారు కొద్ది ప్రయాణం చేసి అచ్ఛోదసరస్తీరానికి చేరుకొన్నారు.

అచ్ఛోదసరస్తీరానికి చేరగానే అశ్వదళానికి, "ఒకవేళ వైశంపాయనుడు మనని చూసి సిగ్గుపడి మొగం చూపలేక ఎటైనా పాఱిపోవచ్చును. అందువల్ల నాలుగు ప్రక్కలా జాగరూకతతో కాపలాకాయండి. మూల ప్రదేశాలు కూడా కావలి కాయండి" అని హెచ్చరిక జారీ చేశాడు. లోలోపలనుండి దుఃఖం వస్తున్నా పైకి గంభీరంగా కన్పడుతూ, గుఱ్ఱం మీదనే ఉండి పొదరిండ్లు, వృక్షమూలాలు అన్నీ వెదికాడు. శిలాతలాలపై చూశాడు. మండపాలను శోధించాడు. ఆ ప్రాంతమంతటా అంగుళం వదలకుండా వైశంపాయనుని గూర్చి వెదికాడు చంద్రాపీడుడు.

యువరాజు వైశంపాయనుని గురించి ఎంతవెదికినా అతడున్న గుర్తులు ఏవీ లభింపకపోయే సరికి తన మనస్సులో, "ఈ వైశంపాయనుడు పత్రలేఖద్వారా నేను వస్తున్న విషయం తెలుసుకొని ఎటో మాయమై పోయి ఉంటాడు. అందుకనే అతని నివాసచిహ్నాలు ఏవీ కానరావటం లేదు. అడ్డగింపబడని వాడై స్వేచ్ఛగా ఏదో ప్రాంతానికి పోయి అక్కడ దాగి ఉంటాడేమో! అందువల్లనే ఎంతవెదికినా కానరాకున్నాడు. ప్రమాదం ముంచుకొచ్చిందిప్పుడు. వైశంపాయనుని చూడకుండా ఈ ప్రాంతంనుంచి ఒక్క అంగుళమైనా అవతలకు పోవటానికి నా కాళ్ళు రావటంలేదు. మన్మథబాణాల వల్ల గాయపడిన నేను ఇంకా ఎందుకు మరణించలేదంటే, నా ప్రాణసమానురాలైన కాదంబరిని చూడకపోవటం చేతనే! కనుక ఇక ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకూడదు. కాదంబరిని నేను నా ప్రాణాలు శరీరాన్ని వదలి వెళ్ళకముందే చూడాలి. నేను ఇప్పుడు అన్నివిధాలా నష్టపడ్డాను. అటు కాదంబరినీ చూడలేకపోయాను. ఇటు వైశంపాయనుణ్ణీ చూడలేకపోయాను" అంటూ తనలో తనే దుఃఖింపసాగాడు.

ఈ విధంగా చంద్రాపీడుడు నిశ్చయం చేసుకొని ధైర్యం సడలిపోనివ్వకుండా లోపల ఏదో ఆశ కలుగుతుండగా, ఈ వైశంపాయనుని గురించి మహాశ్వేతాదేవికి కొంచెమైనా తెలియకుండా ఉంటుందా? అని తోచింది. ఇప్పుడిక ఆమెను చూస్తాను అని మనస్సులో నిశ్చయించాడు. ఆమెతో మాట్లాడిన తర్వాత ఏంచెయ్యాలో ఆలోచిద్దాం అని తలచి, సైన్యాన్ని ఆమె గుహకు కొంత దూరంలో ఆ సైనిక దుస్తులు తీసివేసి పాముకు బుసాల్లాగా ఉన్న దుస్తులు ధరించి ఇంద్రాయుధం ఎక్కి మహాశ్వేతాశ్రమానికి బయలుదేరాడు.

## 67. మహాశ్వేత వైశంపాయనుని శపించుట

చంద్రాపీడుడు మహాశ్వేతాశ్రమానికి కొంతదూరంలో ఇంద్రాయుధం నుండి క్రిందికి దిగాడు. ఇంద్రాయుధ సేవకులు దానిని పట్టుకొని



నడిపిస్తున్నారు. అతడు మహాశ్వేతను ఎప్పుడు చూద్దామా అనే కుతూహలంతో ఉన్నాడు. గుహముందు భాగంలో ఉన్న తెల్లని శిలావేదికమీద తలను వంచుకొని కూర్చొని ఉన్న మహాశ్వేతను చూశాడు యువరాజు. మిక్కిలి కోపంతో ఆమెశరీరం కంపించిపోతోంది. ఆమెకంటి నుండి నీరు నిరంతరం స్రవిస్తోంది. పెనుగాలికి వృక్షం నుండి వేరుచేయబడి వదలిపోయిన లతలాగా దీనంగా ఉంది. ఆమెకు దగ్గఱగా నిలబడి పట్టుకొన్న తరలికను చూశాడు.

ఆమెను ఆ పరిస్థితిలో చూచిన చంద్రాపీడునికి మనస్సులో," ఇదేమిటి? కాదంబరీదేవికి ఏమైనా అరిష్టం జరగలేదు కదా? నేను వచ్చిన ఈ శుభసందర్భంలోనూ మహాశ్వేత ఇలా దుఃఖిస్తోందేమిటి?" అని అనుమానం అతని హృదయాన్ని బ్రద్దలు చేస్తోంది. ప్రతి అడుగు తడబడుతున్నది. మాటి మాటికి పడిపోబోతున్నాడు. అతని పై ప్రాణాలు పైనే పోయేటట్లనిపిస్తోంది. ఆతడు కూడా ఆ శిలాతలంమీదనే ఒక ప్రక్క కూర్చున్నాడు. అతని కంటి వెంట అశ్రువులు ధారలుగా పడుతున్నై. 'ఏమిటిది?' అని తరళికను అడిగాడు. ఆమె ఏమీ చెప్పలేదు. దుఃఖపరవశురాలైన మహాశ్వేత వంకే చూసింది.

మహాశ్వేత దుఃఖవేగం తగ్గకపోయినా గాద్గద్యంతో కంఠం బొంగురుపోయినా ఆమే అతనితో, "మహానుభావా! ఈ దురదృష్టవంతురాలు ఏమని చెప్పగలదు? దుఃఖాలను అనుభవించికఱకు తేలి, బండగా మారిన గుండెగల ఈ పాపి దుఃఖమంటే ఏమిటో తెలియని నీకు నా దుఃఖంలో భాగం పంచుతూ నా కథనంతా వినిపించాను. ఆ నేనే మరల యిప్పుడు పుట్టుకతోనే దుఃఖా లనుభవిస్తూ, సిగ్గులేక, దయలేని గుండెతో నున్న నేను నీకు మఱియొక దుఃఖవార్తను వినిపిస్తున్నాను. విను నాయనా!

కేయూరకుని ద్వారా నీవు వస్తున్నావనే వార్త విని, మనస్సు ముక్కలౌతూ ఉన్న నేను చిత్రరథుని కుమార్తెగా జన్మించి కూడా ఆయనకు సంతోషం కూర్చలేకపోయాను. నా తల్లి మదిరాదేవి మాటను మన్నించలేదు నేను. నా కోర్కెను నేను తీర్చుకోలేకపోయాను. నా గృహానికి అతిథిగా వచ్చిన

చంద్రాపీడునకు మేలు చేయలేదు. తన ప్రియుని చూసి సంతోషించిన నా ప్రియసఖి కాదంబరిని చూశాను గదా అనే సంతోషం పొందలేక పోయాను. మరల అనేక రెట్ల వైరాగ్యంతో కాదంబరితో నాకున్న గాఢస్నేహబంధాల్ని కూడా నిర్దయగా త్రెంచివేసి తిరిగి కష్టతరమైన తపశ్చరణకోసం అడవికి వచ్చాను.

మరల నాతపస్సులో లీనమై ఉండగా చంద్రాపీడునకు సమాన ఆకారం కలవాడు, దిక్కులేనట్లున్న వాడు, మనఃస్థిమితం లేనివాడు, ఏదో తనలో తనే గొణుక్కొంటూ, చంచలమైన దృష్టితో, ఏదో వస్తువు పాఱవేసుకొని వెతుకుతున్నట్లున్నవాడు ఒక బ్రాహ్మణ యువకుని చూశాను.

అతడు నన్ను చూసి నా వద్దకు వచ్చాడు. నన్నే చూస్తున్నాడు. మున్నెన్నడూ చూడక పోయినా నన్ను గుర్తించిన వానిలాగా, పరిచయం లేకపోయినా చాలా పరిచయం ఉన్నవానిలాగా, గుర్తులేకున్నా అంతకు ముందుగాఢమైన ప్రేమసంబంధం ఉన్న వానిలాగా, మైమఱచిన వానిలాగా, ప్రేమలేకున్నా ఏదో స్మరిస్తున్న వానిలాగా, దుఃఖరూపుడై ఉండి కూడా సుఖం అనుభవిస్తున్న వానిలాగా, మౌనంగా ఉన్నప్పటికి ఏదో ప్రార్థిస్తున్న వానిలాగా, ఏమీ అడుగకున్నా ఏదో చెపుతున్నవానిలాగా, నన్ను మెచ్చుకొంటున్నట్లు, దుఃఖపడుతున్నట్లు, జాలిపడుతున్నట్టు, భయపడుతున్నట్టు, దోపిడి ఐన వానివలె, ఏదో కోరుతున్న వానిలాగా, మఱచినదానిని గుర్తు చేసుకొంటున్న వానిలాగా, కనబడ్డాడు. నావంక కన్నార్పకుండా చూడసాగాడు. కళ్ళలో నీరూరుతున్నది. కన్నులు సువిశాలంగా చెవుల వరకు వ్యాపించి ఉన్నై. కనులు అరమోడ్చి ఉన్నై. త్రాగిన మైకంలో ఉన్నట్టుగా, పిశాచం పట్టినవానిలా, ఏదో త్రాగేద్దామన్నట్లు నా వంక తదేకంగా చూస్తూ ఇలా అన్నాడు –

"ఓ సుందరీ! ఈ లోకంలో అందఱు జన్మకు, వయస్సుకు, ఆకారానికి తగినట్లుగా ఉంటూ విమర్శకు వీలు కలిగింపరు. మరి, నీవు ఎవరూ చేయని విధంగా నీకు ఎంతమాత్రం సరిపోని కార్యక్రమాన్ని చేపట్టావేమిటి? మాలతీ



పుష్పమాలికలాగా సుకుమారంగా ఉన్న నీ శరీరానికి ఏ కష్టం రాకుండా చూసుకోవలసింది పోయి అనుచితము, కష్టతరమూనైన తపస్సు చేస్తూ కృశత్వాన్ని కలగజేస్తున్నావేమిటి? నీ రూపానికి, నీ వయస్సునకు తగిన విధంగా లతకు రసవంతమైన ఫలము సమకూర్చినట్లు నీ దేహానికి సుఖాన్ని ఎందుకు కలిగించటం లేదు? ఎంతటి సౌందర్యం లేనివాడినైనా, గుణహీనునికైనా జన్మించినందుకు ప్రాణులకు తప్పక అనుభవింపవలసిన శరీరసుఖాలు అనుభవిస్తేనే జీవితం సఫలమౌతుంది. అంతేకాని పై లోకాలకు సంబంధించిన తపస్సులు చేస్తూ శరీరాన్ని కష్టపెట్టుకోవటం సరియైన పద్ధతికాదు. మఱి అటువంటప్పుడు సౌందర్య శోభితులైన వారిని గుఱించి ఎలా ఉండాలో వేరే చెప్పనక్కరలేదు కదా! ఈ నీ సహజసుందరమైన కమలంలాగా సుకుమారంగా ఉన్న శరీరానికి, మంచుకు దెబ్బతిన్న కమలంలాగా తపస్సువలన కష్టం కలిగించటం ఏమి బాగాలేదు.

ఓ సుందరీమణీ! నీ వంటి అతిలోక సౌందర్యవతి కూడా తపస్సుచేస్తూ శరీరాన్ని కష్టపెట్టుకుంటూ జీవితాన్ని వృథా చేసుకొంటోంది అంటే – ఇక మన్మథుని చేతిలో ఆ ధను స్సెందుకున్నట్లు? అతని పూలబాణాల వల్ల ఇంక ప్రయోజనం ఏముంది? చంద్రుడు వెన్నెలలు కురిపిస్తూ అనవసరంగా ఉదయిస్తున్నాడు. వసంతుడు ఆ విర్భవించటం శుద్ధదండుగ. లోకాన్ని మైమఱపించే ఈ కుముదాలు (కలువలు) తెల్లతామరలు, సౌగంధిక పుష్పాల సరోవరాలుండి ఏం ప్రయోజనం? ఉఱుములు మెఱుపులు కలిగి సందడి చేసే మేఘపంక్తు లుండి ఏంలాభం? సుందరోద్యానవనాలు నిష్ప్రయోజనకరమైనవి. ఇక ఈ వెన్నెల లెందుకు? ఈ లీలావిలాసాల నదీపులినాలు దేనికి? సుగంధాలతో మత్తెక్కించే మలయపవనాలు ఉండి ఏం ప్రయోజనం? నీ వీ పనిచేస్తే ఇవన్నీ ఉపయోగశూన్యాలుగానే ఉంటై."

నేను నిరంతరం పుండరీకుని వృత్తాంతంతో మిగిలిన విషయాలపై ఆసక్తి లేనిదానను కనుక అతనితో, "అసలు నీవెవరవు? ఇక్కడి కెందుకు

వచ్చావు? నీవు నాతో ఇలా అసందర్భంగా ఎందుకు మాట్లాడుతున్నావు?" అని నేను వేఱొక పనిమీద అవతలకు పోయాను. వెళ్ళి దేవతార్చనకు కావలసిన పుష్పాలు కోసుకొంటూ, తరళికను పిలిచి, "తరళికా! ఈ యువకుడు ఎవడో బ్రాహ్మణ జాతికి చెందినవాడనుకొంటాను. ఇతనిని చూస్తున్నా ఆ మాటలు వింటున్నా నాకు వేఱే ఏదో దురుద్దేశంతో ఉన్నట్లుగా కనబడుతున్నాడు. వీడు మళ్ళీ ఈ ప్రాంతానికి ఇంకొకసారి రాకుండా ఉండేటట్లుగా ఏర్పాట్లు చెయ్యాలి. ఒక వేళ మనం వెళ్ళగొట్టినా మరల వచ్చాడంటే మాత్రం అతనికి ఎంతమాత్రం మేలు కలగదు. తప్పక కీడే కలుగుతుంది' అని హెచ్చరికగా అన్నాను.

అయితే అతడు నివారింపబడినప్పటికీ, దుష్టమన్మథుని ప్రేరణ చేతనో, ఆ అనర్థం జరగవలసి ఉండటం వలననో రాకుండా మాత్రం ఆగలేదు. ఇలా కొన్ని రోజులైన తర్వాత ఒక అర్ధరాత్రి వేళ చల్లని వెన్నెలల వేడిమికి ఆ యువకుని ప్రేమాగ్ని రగిలింది. తరళిక నిద్రిస్తోంది. నేను నిద్రపట్టక సంతాపిస్తూ ఈ శిలాతలంపై శయనించి ఉన్నాను. అచ్ఛోదసరస్సు నుండి కలువల సుగంధపూరిత వాయువులు వీస్తున్నై. చంద్రుడు తెల్లని వెన్నెల అనే రంగును కిరణాలనే కుంచెలతో లోకానికి పూస్తున్నాడు. నేనా చంద్రునివంక చూస్తూ "ఈ చల్లని తెల్లని వెన్నెలవల్ల లోకం ఆహ్లాదకరంగా ఉండి హృదయంలో అనురాగభావాలు పుట్టిస్తున్నాది గదా! మఱి నా హృదయ వల్లభుడైన పుండరీకునకు కూడా ప్రేమభావాలు కలిగిస్తున్నాడా?" అని అతనిని గూర్చి ఆలోచిస్తూ, "నా దురదృష్టం కాకపోతే, ఆ మహానుభావుడు దివ్యాకారుడు ఆకాశం నుండి దిగివచ్చి, నన్ను ఓదార్చి వెళ్ళాడు. కాని ఆమాటలు నెఱవేరలేదు కదా! నాపై దయతో ఆయన అలా చెప్పాడో, నేను కొంతకాలం జీవించి ఉండాలనే ఉద్దేశంతో అలా అన్నాడో తెలియటంలేదు. ఇంతవఱకు ఆ మహా పురుషుడూ మరల ఎన్నడూ దర్శనమీయలేదు. నా ప్రాణనాథుని సంగతీ తెలియలేదు. మృతి చెందిన అతనిని ఎత్తుకొని ఎటో తీసుకుని పోయాడు



దివ్యపురుషుడు. కపింజలుడు అతనిని అనుగమించి వెళ్ళాడు. ఇంతకాలమైనా ఏ వార్తా నాకు తెలియదు" అని ఇలా నేను లోలోపల అనుకొంటూ ఉన్నాను. నిద్ర మాత్రం నాకు దూరమైంది.

ఆ నిశ్శబ్ద నిశీథిలో దూరం నించీ పగటియందులాగా తెల్లని వెన్నెలలో మరల ఆ యువకుడే నావైపు వస్తూ ఉండటం చూశాను. అతడు – "శబ్దం కాకుండా నెమ్మదిగా నడుస్తున్నాడు. చరణాల నుండి తలదాకా వెంద్రుకలు నిక్కబొడుచుకొన్నాయి. అంతకు ముందే మదనాగ్నిచే భస్మం అయిన వానిలాగా మొగలిపూల పొడితో తెల్లని శరీరంకలవాడు. నా పాణిగ్రహణంకోసం తల స్నానం చేసిన వానిలాగా చెమటచే తడిసిపోయాడు. పరహృదయం తెలియకుండా ఇలా వెళ్ళటం నీకు తగినది కాదని మాట మాటకు అడ్డుపడుతున్నట్లుగా ఉన్న బలమైన తొడలతో, దూరం నుండే నన్ను కౌగిలించుకోవాలనే దురాశతో బాహువులను బారుగా చాపి ముందుకు వస్తున్నాడు. అతడు దీనుడుగా ఉన్నాడు. అధైర్యంతో, చంచలత్వంతో, సిగ్గును వదలినవాడై ఉన్నాడు. నిర్లక్ష్యంతో ముందుకు వస్తున్నాడు. ఇహపరలోకాల చింతన వదిలేశాడు. పాపభీతి లేనివాడైనాడు. యుక్తాయుక్త విచారశూన్యుడుగా ఉన్నాడు. అతడు కేవలం మన్మథునికి మాత్రమే అధీనుడై ఉన్నాడు. పిశాచం ఆవహించినవానిలాగా, మద మెక్కినవానిలాగా, పిచ్చిపట్టిన వానివలె నావైపు వస్తున్నాడు. తెల్లని వెన్నెలలో వచ్చే ఆ వ్యక్తి బ్రాహ్మణ యువకుడేనని గుర్తించాను.

ఆ విధంగా పిశాచం లాగా నావైపు వస్తున్న అతనిని చూచి నేను ప్రాణాలపై ఆశలేకపోయినా మిక్కిలి భయపడ్డాను. "అయ్యో! ఎంతకష్టం వచ్చిపడింది? ఒక వేళ వాడు పిచ్చివాడు కనుక నన్ను తన చేతితో ముట్టుకొంటే – ఇక ఈ పాప శరీరాన్ని వదిలివేయాల్సి వస్తుంది, ఏదో ఆ దైవవాక్యాన్ని నమ్మి ఏనాటికైనా నా మనోవల్లభుడు పుండరీకుడు రాకుండా ఉంటాడా అని ఇంతవఱకు ఈ ప్రాణాలను కాపాడుకుంటూ వచ్చాను. పుండరీకుని

చూడటం కోసమే బ్రతికి ఉన్నాను. నేనిలా మనస్సులో తలంచుకొంటూ ఉండగానే ఆ యువకుడు నావద్దకువచ్చాడు, ఇలా నాతో అన్నాడు – "ఓ చంద్రముఖీ! ఈ దుష్టమన్మథుడు చంద్రునితో కలసి నా ప్రాణాలు నిలువునా తోడబోతున్నాడు. అందుచేత నేను నీ శరణుజొచ్చాను. నన్ను రక్షించు. నేను దిక్కులేని వాణ్ణి, రక్షణ లేనివాణ్ణి, దుఃఖితుణ్ణి, పరిస్థితి నెదిరింపలేని అశక్తుణ్ణి. నీవే నా ప్రాణాధారురాలివి. నన్ను కాపాడు. శరణన్నవారిని కాపాడటమే కదా తపస్వులకున్నూ పరమధర్మం! నీవే కనుక నన్ను ఆత్మ ప్రదానంచేత కాపాడకపోతే నేనీ మన్మథ బాణాలకు బలైపోతాను. మరణిస్తాను, చంద్రకిరణాల చల్లనికాంతులకు. తర్వాత నీ యిష్టం" అని. నేనాతని మాటలు విని సీత్కారం చేశాను. కోపంతో నా కళ్ళనుంచి కోపాగ్ని జ్వాలలు ప్రసరించి అతనిని భస్మం చేసేటట్లున్నాయి. నేనతనిని బెదిరిస్తూ శరీరమంతా గడగడ వణుకుతుండగా, వళ్ళు మఱచిపోయిన దాననై కళ్ళనుండి కోపాగ్నికణాలు రాలుస్తూ, "ఓరీ పాపీ! నాతో ఇలా మాట్లాడే నీ తలపై పిడుగు పడ లేదేమి? నీ నాలుక వెయ్యి చీలికలు కాలేదేమి? నీ నోరేల పడిపోలేదు? మాటలు కఱువవ్వలేదేమి? ఈ నీశరీరంలో లోకంలోని మంచి చెడు కార్యములకు సాక్షీభూతములైన పంచభూతాలు లేవనుకొంటాను. పంచభూతాలే నీ శరీరమందు ఉంటే – ఇలాంటి మాటలన్నందుకు నీవు అగ్నిచే భస్మీభూతుడవయ్యేవాడవే. వాయువు చేత ఎగురగొట్టబడేవాడివి. జలములలో పడి మునిగిపోయేవాడివి. భూమి బ్రద్దలు కాగా నీవు పాతాళానికి కొని పోబడేవాడివి. లేకుంటే నీవు శరీరంతోపాటు ఆకాశంలో మిగలకుండా నాశనమై పోయేవాడివి. చక్కని క్రమశిక్షణతో నడచే ఈ లోకంలో క్రమ శిక్షణాశూన్యుడవైన నీవు, ఇలాంటి నీచుడవు ఎలా పుట్టావు? మనిషివై పుట్టికూడా పశుపక్ష్యాదుల్లాగా కామాతురుడవై పోయావు. నీకు మంచి చెడు తెలియకుండా పోతోంది. దుష్ట విధాతచేత ముఖరాగంతో (ఎఱ్ఱని ముక్కుతో) నీ వారిని మాత్రమే కాపాడు కొనే అల్పబుద్ధి కలవాడవై, ఎక్కడ ఎలా ఉండాలో తెలియనివాడవై, ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ మాటలు నేర్చిన చిలుక



లాగున్నావు. అందువలననే ఆ చిలుక జాతిలోనే జన్మించక పోయితివేల? అలా చిలుకవైతే ఏమి మాట్లాడినా నవ్వు వస్తుందే కాని కోపం రాకుండెడిది గదా! నీ మాటల వల్ల ఎంతో మనః క్లేశాన్ని పొందిన నేను ఒక నిర్ణయం చేస్తున్నాను. ఇక నీవు నా వంటివారిని కామించి బాధించే పని లేకుండా నీవు కోరుకున్నట్లు తిర్యక్ జాతిలో పుడుదువుగానిలే'' అని పలికి చంద్రభగవానుని వంకచూస్తూ నమస్కరించి, మరల ఇలా అన్నాను". ఓ భగవానుడా! మహాత్ముడా! సకల లోకములకు శిరోరత్నమా! ఓ లోకపాలకుడా! నేనేగనుక దైవస్వరూపుడైన పుండరీకుని దర్శించిన దగ్గఱనుండి మనస్సులోనైనా పరపురుషుని గూర్చి ఆలోచించనిదాననైతే, ఆ సత్యవచనఫలితంగా ఈ దుర్మార్గకాముకుడు నేను చెప్పిన పక్షి జాతిలోనే జన్మించు గాక!"

## 68. చంద్రాపీడుడు మృతి చెందుట

ఇక ఆ తరువాత అలా ఎందుకు జరిగిందో మాత్రం నేను చెప్పలేను నేనా మాటలు అన్నంతలోనే అతడు మొదలు నఱుకబడిన వృక్షంలాగా నేలపై విఱుచుకొని పడిపోయాడు. దానికి కారణం మదనజ్వరతీవ్రతకు తట్టుకోలేకనా! తాను చేసిన పాపకృత్యానికి వెంటనే కలిగిన ఫలంవల్లనా? కాక నా వాక్కులో అంతర్గతంగా ఉన్న శక్తివల్లనో నాకు తెలియదు. మొత్తంమీద అతడు మరణించాడని నిర్ధారించుకొన్నాను. అది చూచి నేను దుఃఖోద్వేగంతో బిగ్గఱగా ఆర్తనాదం చేశాను. అక్కడి సైనికుల మాటలవల్ల తరువాత తెలిసింది – 'ఆ మృతుడెవరో కాదు, మీయొక్క ప్రాణస్నేహితుడు' అని.

ఈ వృత్తాంతం అంతా చంద్రాపీడునికి వివరించి చెప్పి సిగ్గుతో ముఖం దించుకొని కంటికి మంటికి ఏకధారగా కన్నీరు విడుస్తూ ఆ నేలంతా తడిపి వేసింది. ఆమె మాటలు విన్న చంద్రాపీడుడు కన్నులు మూతపడుతుండగా అస్పష్టవాక్కులతో, "ఓ భగవత్స్వరూపురాలా! మీరెంత ప్రయత్నించినా నేను నా ప్రాణసఖిని ఈజన్మలో పొందలేని దురదృష్టవంతుణ్ణి. కాదంబరి చరణ సేవకుకూడా నేను నోచుకోలేదు. అయితే, జన్మాంతరంలోనైనా నాకా అదృష్టాన్ని

కలుగజేస్తారని ఆశిస్తాను" అంటూ అతడు, కాదంబరి తనకు దక్కలేదన్న దుఃఖంతో వలె, వికసించటానికి సిద్ధంగా ఉన్న మొగ్గలాగా ఉన్న అతని హృదయం మిక్కిలి సహజ కోమలమైనది బాణాఘాతానికి వలె ముక్కలు ముక్కలయింది.

తరళిక ఈ హఠాత్సంఘటనకు కదిలి పోయింది. వెంటనే మహాశ్వేతను వదలి చంద్రాపీడుని శరీరం వద్దకు వచ్చింది. "రాకుమారీ! ఇంకెందుకు సిగ్గు? చంద్రాపీడుణ్ణి చూడు. అతడు వేరే విధంగా ఉన్నాడు. అతని మెడ విఱిగినట్లున్నది. అందువల్లనే మెడ తలను ఆపలేక పోతున్నది. అతనిని కదిలించినా కదలటంలేదు, కనుగ్రుడ్లు లోపలకు పోయినై. తెఱిపిడి పడటం లేదు. ఎట్లా ఉన్న అవయవాలు అట్లాగే ఉన్నాయి కాని వాటికని సరి చేసుకోవటం లేదు. గుండెలతోగాలి పీల్చటం లేదు. ఓ చంద్రాపీడా! చంద్రసమానుడా! కాదంబరీ ప్రియుడా! నీవు ఇప్పుడు ఎక్కడకు వెళ్ళిపోతున్నావు?'' అంటూ ఆర్తనాదాలు చేస్తూ ఉంది. మహాశ్వేత అతనిముఖంపై చూపునిలిపి నిశ్చేష్టురాలై, "ఓసీ పాపీ! దుష్ట తపస్వినీ! ఎంతపని చేశావే? తారాపీడుని వంశాన్ని ఛేదించావు గదే! మనందఱితోపాటు నిఖిల ప్రజలు అనాథలై పోయినారు. సద్గుణాలకు రాజబాటను నాశనం చేశావు గదా! యాచకలోకానికి దిగ్బంధం అయింది. లక్ష్మి ఇక ఎవరి ముఖం చూస్తుంది? ఇక భూమికి ఆధారమెవరు? సేవకులిక ఎవరిని సేవించాలి? నీవే లేకుంటే ఇకసేవించేది ఎవరిని? లోకంలో నీతో సమానుడైన శీలవంతుడు ఏడీ? భృత్యులపై ఆదరం కరువైపోయింది. ఇక ప్రియసంభాషణలు నీతోపాటే దూరమైనాయి. దానధర్మాలు అడుగంటిపోయినై. నీవిలా ఎందుకు చరిత్రలో మిగిలిపోయావు? ప్రజలిక ఎవరిని ఆధారంగా చేసుకోవాలి? నీవు లేక సజ్జనులకు మనస్సంతోషం ఎక్కడిది? నీవు లేకపోతే యిప్పటివరకు తారాపీడ చక్రవర్తి భరించిన భూభారాన్ని ఎవరు మోస్తారిప్పుడు? నీవంత ధైర్యవంతుడవు గదా! ఈ మాత్రపు శోకానికే నీ గుండెలేల బ్రద్దలైనాయి? నీవెంతో



దయాస్వభావం కలవాడవు కదా! అట్టి నీకు మాయందిప్పుడింత నిర్దయ ఎందుకు?

దేవా! మాపై దయ చూపి మమ్మేదైనా పనికి ఆజ్ఞాపించు. మా అభ్యర్థన మన్నించు. తిరిగి నీ ప్రాణాలు నువ్వు పొందు. పుత్రవత్సలుడైన తారాపీడ ప్రభువు నీవు లేకుండా ఒక్క క్షణం కూడా జీవింపలేడు. విలాసవతీ బ్రతుకలేదు. శుకనాస మహామంత్రి, మనోరమలు కూడా మిగులరు. నీవు మరణిస్తే రాజులు, ప్రజలు వారికి అపాయమే. అసలు మమ్ముల నందర్నీ ఇక్కడ వదిలేసి నీవు ఎక్కడకు వెళ్ళావు? నీకు ఒక్కసారిగా ఇంత నిష్ఠురత్వం ఎలా కలిగింది? పెద్దలంటే నీకుండే ఆ భక్తిభావం ఇప్పుడెక్కడికి పోయాయి?' అని మహాశ్వేత దుఃఖపడ సాగింది. పరిజనులు నేలపై పడి రోదింప సాగారు. అయ్యయ్యో! ఎంతపని జరిగింది అని రాజలోకం బాధపడసాగింది.

## 69. కాదంబరి ప్రియుని మృతికి దుఃఖించుట

సమీపంలోని ఇంద్రాయుధం కనుఱెప్ప లార్పుతూ, చంద్రాపీడుని ముఖంపైనే దృష్టిపెట్టి చూస్తూ, దీనంగా సకిలిస్తున్నది. రోదిస్తోంది. మాటిమాటికి గిట్టలను భూమిపై కొడుతూ కదను తొక్కుతూ అసహనం ప్రకటిస్తోంది. బంధనాల్నించి విడిపించుకునేందుకు పెనుగులాడుతోంది. అసలీ గుఱ్ఱపు జన్మనే వదిలేద్దామన్నట్టు ఆరాటపడ సాగింది.

ఇంతలో హేమకూటం నుంచి పత్రలేఖ చంద్రాపీడుని ఆగమన వార్తవిని వచ్చింది. ఆమెతోపాటు మహాశ్వేతను చూడాలనే నెపంతో తల్లిదండ్రుల అనుమతితో చక్కగా అలంకరించుకొని, కాలి అందెలు, మొలత్రాడు చిరుగజ్జెలు మ్రోగుతుండగా బయలుదేరింది కాదంబరి, సురభిళపుష్పమాలికలు, చందనాది అనులేపనాలు, తాంబూల వస్త్రాదులు కలిగిన కొద్దిమంది పరివారం ఆమె వెనుక ఉన్నారు. ముందుగా కేయూరకుడు నడుస్తూ మార్గం చూపిస్తున్నాడు. పత్రలేఖ హస్తాన్ని ఆలంబనంగా నడుస్తూ, మదలేఖతో మాట్లాడుతూ వస్తోంది

కాదంబరి. చంద్రాపీడుని చూస్తామనే ఆశతో నడుస్తున్న కాదంబరికి మార్గాయాసం కూడా పెద్దగా కలగలేదు. వారందఱు ఆ సమీపానికి వచ్చేశారు.

కాదంబరి అక్కడికి వచ్చి మృతుడై పడి ఉన్న చంద్రాపీడుని చూసే సరికి అగమ్యగోచర అయింది. అమృతం తీసిన పాలసముద్రంలాగా, చంద్రుడు లేని రాత్రివేళలాగా, తారకలు లేని ఆకాశంలాగా, పూలన్నీ కోసివేయబడిన ఉద్యానవనంలాగా, మధ్య పీఠాన్ని పీకివేసిన తామర పుష్పంలాగా, మధ్య మణిలేని హారంలాగా, ప్రాణం లేని చంద్రాపీడుడు కనిపించాడు.

అతనిని చూడగానే, 'అయ్యో! ఏమిటిది?' అని స్పృహ కోల్పోయి క్రిందికి జారిపడిపోతుండగా పెద్దగా ఆక్రందిస్తూ మదలేఖ ఆమెను పడకుండా పట్టుకొంది. పత్రలేఖ కాదంబరి చేతిని వదిలివేసి స్పృహ కోల్పోయి నేలపై పడిపోయింది. కొంతసేపటికి కాదంబరి స్పృహలోకి వచ్చింది. కాని మూఢురాలిలాగా, కన్నార్పని దృష్టితో కూడినదై, స్తంభించిన దేహంతో, నిశ్చేష్టురాలై, ఊపిరి తీసుకోవటం కూడా మరచిపోయి, లోపలి నుంచి ఉద్వేగం తన్నుకొస్తుండగా, చంద్రాపీడుని ముఖం వంకే చూస్తూ దుఃఖంతో నల్లగా, క్రోధంతో ఎఱ్ఱగా ఉన్న కళ్ళతో, రాహువు ఆక్రమించిన చంద్రబింబం కలిగిన పూర్ణిమ రాత్రిలాగా, గండ్రగొడ్డలి దెబ్బకు వణికిన లతలాగా తల్లడిల్లింది. క్రింది పెదవి వణుకుతోంది. స్త్రీసహజ సరళత్వం దూరమైపోయింది.

అలా స్తంభితురాలై దుఃఖాక్రాంతయైన కాదంబరిని చూచి తట్టుకోలేక మదలేఖ రోదిస్తూ కాదంబరి పాదాలపై పడి, "ప్రియసఖీ! ఆందోళన పడకు, శాంతించు. నీ ఉద్వేగాన్ని శాంతింపజేసుకో, నీ వింత దుఃఖితురాలవైతే, నీ తలిదండ్రులు తట్టుకోలేరు. జలాధిక్యతచేత తటాకం గట్లుతెగి ప్రవహించినట్టు మీ తల్లిదండ్రులు మదిరా చిత్రరథులు గుండెలు పగిలిపోయి మరణానికి దగ్గరౌతారు. నీవు లేకపోతే రెండు గంధర్వకులాలు పాడైపోతాయి" అని ప్రార్థించింది. మదలేఖ పలుకులు విన్న కాదంబరి విరక్తిగా నవ్వి", ఓసి



పిచ్చిదానా! వజ్రంతో సమానమైన గుండెలు నావి. అంత తొందఱగా బ్రద్దలౌతాయా? ఈ నా ప్రాణనాథుని పరిస్థితిని చూసి కూడా బ్రద్దలు కాలేదు కదా! నాకే ప్రాణాపాయం లేకపోతే – ఇక నా తల్లిదండ్రులకు, బంధువులకు ఎందుకుంటుంది? ప్రాణసమానుడైన ప్రియుడు నాకు దూరమైన తర్వాత ఈ శరీరం ఉన్నా లేకపోయినా ఒకటే గదా! పోయిన వారిని గూర్చి కన్నీరు విడిచి ఊరుకుంటాం. అయినా స్వర్గలోకానికి ప్రయాణం చేస్తున్న పతిదేవునకు నా కన్నీటితో అమంగళం కలుగచెయ్యను. కాన నేను దుఃఖింపను. నాకిప్పుడన్ని సుఖాలు దూరమైపోయాయి. ఇంకా నేను దుఃఖించట మెందుకు? నేను ప్రేమ విషయంలో కులమర్యాద పాటించలేదు. పెద్దలను పట్టించుకోలేదు. ధర్మపద్ధతిని పాటించలేదు. జనాపవాదానికి భయపడలేదు. సిగ్గును వదిలివేశాను. నాకు మదనోపచారాలు చేసి చేసి సఖులు శ్రమపడ్డారు. నా గూర్చి నా ప్రియసఖి కాదంబరి దుఃఖపడింది. అయ్యో! మహాశ్వేత కోసం నేను ప్రతిజ్ఞ చేశాను కదా! అది భంగమై పోయిందే అనే చింతకూడా నాకు లేకుండా పోయింది. నా ప్రాణేశ్వరుడు నాకోసం ప్రాణత్యాగం చేస్తే నేను మాత్రం ప్రాణాలు జాగ్రత్తగా కాపాడుకొంటూ ఉన్నాను. ఇట్టి క్లిష్ట పరిస్థితుల్లో మరణమే జీవితం, జీవితమే మరణం.

## 70. కాదంబరి మదలేఖకు అప్పగింతలు పెట్టుట

మదలేఖా! నీకు ఏమాత్రం నామీద స్నేహం, హితం ఉన్నా నా ప్రియసఖివైన నీవు, నా మరణంచేత ప్రాణత్యాగం చేయకుండా నా తల్లిదండ్రుల్ని ఆపాలి. నా మనోవాంఛల్ని నీవే పూర్తి చెయ్యాలి. నేను మరణిస్తే నీ కుమారుని చేతనే నాకు జలాంజలి ఇప్పించాలి. నన్ను నమ్ముకొన్న నా స్నేహితురాండ్రు నన్ను తలచుకొని బాధపడకుండా చెయ్యాలి. నేను లేని నా భవనాన్ని చూసి నిరాశపడి ఎటు వారు అటు వెళ్ళిపోకుండా చూసుకోవాలి. భవనప్రాంగణంలో పెరిగే నా పుత్రుడు(లాంటి) తియ్యమామిడిచెట్టుకు మాధవీలతకు నా పేరుమీద వివాహమంగళోత్సవం దగ్గఱుండి చేయించాలి.

నా చరణ స్పర్శచే పులకించిన వృద్ధి పొందిన అశోకవృక్షపు చిగుఋటాకును కూడా చెవికి అలంకారంగా కోయరాదు. నేను శ్రద్ధగా పెంచి పెద్దచేసిన మాలతీ లత పుష్పాలను కేవలము దేవతార్చనకు మాత్రమే కొయ్యాలి. నా నివాసభవనంలో నా శయనానికి శిరోభాగంలో ఉంచిన కామదేవుని పటాన్ని ముక్కలు ముక్కలుగా బ్రద్దలుకొట్టాలి. నేను నా చేతులతో నాటి పెంచిన మామిడి చెట్లు పెరిగి పెద్దవై పండ్ల నిచ్చేవిగా తయారుచేయాలి. మనం చాలా కాలంనుంచి పంజరంలో పెట్టి బంధించి బాధపెట్టిన పిచ్చిదైన 'కాళిందీ' అనే గోరువంకను, 'పరిహాసుడ'నే చిలుకను ఇరువురి వదిలి పెట్టి వెయ్యి. ఎప్పుడూ నా వొళ్ళో పడుకొనే నకులిక (ముంగిస పిల్ల)ను యిక నీ ఒళ్ళో పడుకో బెట్టుకోవాలి. నా చిన్నికుమారుడు తరళకుడనే లేడి పిల్లవాడిని ఎక్కడైనా తపోవనంలో వదిలెయ్యాలి.

నా చేతులతో పెంచిన చకోరపక్షుల జంట క్రీడాపర్వతాన ఏ యిబ్బంది పడకుండా ఉండేట్లు చూడాలి. నా కాళ్ళవెంబడి తిరిగే హంసకునకు ఎవరివల్ల ప్రాణహాని జరుగకుండా చూసుకోవాలి. గృహనివాసం అలవాటు లేనిది, మనం లోగడ బలవంతంగా పట్టి తెచ్చిన అడవి స్త్రీని మఱల అడవిలోనే వదిలేయాలి. నా క్రీడాపర్వతాన్ని ఎవరైనా శాంతాత్ముడైన మునికి ఇచ్చివేయాలి. నా వంటిమీది వస్తువులను ఇక నుండి నీవే ఉపయోగించు. వీణే కాదు, నా వస్తువుల్లో నీకేది నచ్చితే అది తీసుకో. అన్నీ అందరికీ యివ్వగా ఇక నేనే మిగిలాను.

ఇక చంద్రకిరణస్పర్శచేత, తడియారని చందనపు పూతల చేత, నిరంతరం ధారలుగా పడుతున్న జలం చేత, అనేక వరుసలుగా కూర్పబడిన నక్షత్రమాలల ధారణ చేత, మణి దర్పణ కిరణకాంతుల చేత, చందన ద్రవంతో తడపబడిన తామరాకులు కప్పుట చేత, మెత్తని, జలస్పర్శ కలిగిన తామరకాడల పరుపుల చేత, ఏపుగా పెంచబడిన ఈ తుచ్ఛశరీరాన్ని ప్రజ్జ్వలిస్తున్న అగ్ని కీలలతో ప్రకాశిస్తున్న అగ్నిహోత్రంలో ప్రాణనాథుని కౌగిలించుకొని భస్మం



చేసుకొంటాను. నన్ను నేను ప్రియునితో పాటు ఆత్మార్పణ చేసుకొంటాను. అని శపథపూర్వకంగా పలికింది కాదంబరి.

తరువాత తనను వారింపబోతున్న మదలేఖను దూరంగా నెట్టివేసి, ఆమె మహాశ్వేత వద్దకు పోయి, ఆమెను కౌగిలించుకొని, దుఃఖం పైకి కన్పించనీయకుండానే ఆమెతో, "ప్రియసఖీ! నీవు అంతటి కష్టం కలిగినా కూడా, క్షణక్షణం మరణం కంటె అధికమైన దుఃఖాలను అనుభవిస్తూ, సిగ్గు చెందకుండా, జాలి పడదగిన దానవై ఇంకా ప్రాణాలతో ఉన్నావంటే నీ ప్రియుడు ఏ నాటికైనా పునర్జీవితుడౌతాడు, తిరిగి వస్తాడు అనే నమ్మకం ఉంది గనుక. నాకైతే అలాంటి ఆశ ఏదీలేదు కదా! కనుక నిన్ను నేను వచ్చే జన్మలో కలుసుకొంటానని చెపుతున్నాను. నాకు సెలవివ్వు" అంటూ పలికింది కాదంబరి.

## 71. కపింజలుని శాప వృత్తాంతము

తర్వాత ఆమె శరీరము గగుర్పొడువగా, మిక్కిలి భయం అనే వేడిమిచేత కనులనుండి ఆనందబాష్పాలు రాల్చింది. ఆమె కనులనుండి కమల పత్రముల నుండి తేనె ధారలు కురిసినట్టుగా బాష్పధారలు స్రవిస్తున్నై. చంద్రాపీడుడనే చంద్రుడు అస్తమించాడు అనే బాధతో కూడిన కలువకన్నెలాగా, అతని ముంగురులు సరిదిద్ది, పూలతో అర్చన చేసింది. చంద్రాపీడుని పాదాలను తన ఒడిలో ఉంచుకొని సేవ చేసింది.

ఆ సమయంలో ఒక విచిత్ర ఘటన జరిగింది. చంద్రశీతలమైన కాదంబరి కరస్పర్శచేత చంద్రాపీడునికి ప్రాణాలు వచ్చినట్లనిపించింది. చంద్రాపీడుని దేహం నుండి హఠాత్తుగా ఆ ప్రాంతాన్నంతా చల్లబరుస్తూ ఒక అస్పష్టమైన ఆకారమేదో జ్యోతిస్వరూపంలో బయటికి వెడలివచ్చింది. వెంటనే ఆకాశంనుండి అమృతం కురుస్తున్నట్లున్న అక్షరాలతో అశరీరవాక్కు ఇలా వినిపించింది. "అమ్మాయి! మహాశ్వేతా! నేను నిన్ను మరల నా కాంతి

కిరణ ప్రభావంచేత నాశం చెందకుండా సురక్షితంగా ఉంది. నీతో అతడు తొందఅలోనే కలవటానికి సిద్ధంగా ఉన్నాడు.

ఈ చంద్రాపీడుని శరీరం నా తేజస్సుతో నిండినదే, సహజంగా ఆ శరీరానికి వినాశనం లేదు. అంతేకాదు – ఈ కాదంబరీ దేవి కరస్పర్శచేత శీతలీకృతమై చంద్రాపీడుని శరీరం శాపదోష ప్రభావం చేత ప్రాణాలు లేకున్నా శరీరాన్ని విడవకుండా యోగప్రక్రియ వల్ల యోగులకు వలె చెడకుండా నిలిచి ఉంటుంది. మీ యిద్దఱకు నమ్మకం, ఉపశాంతి కలగటంకోసం దీన్ని మీ ఎదుటే ఉంచుతున్నాను. శాపం పూర్తయ్యేవఱకు ఆ దేహానికి ఆ పరిస్థితి ఉంటుంది. ఈ దేహాన్ని అగ్నిదగ్ధం చెయ్యవద్దు. నీటిలో పడవెయ్యవద్దు, లేక వేఱే ప్రదేశాల్లోనూ పడవేయకూడదు. వీరిరువురు కలిసేంతవఱకు జాగ్రత్తగా శుభ్రంగా ఉంచాలి" అని ఆ దివ్యవాణి మాటలు విన్న అక్కడి వారందరూ విస్మితులయ్యారు. అందరూ ఆశ్చర్యంతో కనులార్పకుండా ఔత్సుక్యంతో ఆకాశం వంక చూడసాగారు. ఎటొచ్చీ పత్రలేఖ మాత్రం పెద్దగా ఆశ్చర్య సంభ్రమాలకు లోను కాలేదు – సరికదా ఆ దివ్యజ్యోతి చల్లని స్పర్శకు స్పృహలోనికి వచ్చి, ఏదో గ్రహం పట్టిన దానిలాగా వేగంగా పరుగెత్తుతూ పోయి అశ్వసంరక్షకుని చేతిలో నుండి బలవంతంగా ఇంద్రాయుధాన్ని ఊడలాక్కొని, "నా బోటిదాని కేమైనా ఫర్వాలేదు. కాని నీవు నీ యజమాని ఏ వాహనం లేకుండా ఎవరికీ అందనంత దూరం వెళ్ళిపోతే, ఇక నీవు ఇక్కడుండి ఏం చేస్తావు? ఉంటేమాత్రం ఏం బాగుంటుంది?" అని పలుకుతూ, ఆ యింద్రాయుధంతో పాటుగా ఒక్క దూకుదూకి అచ్ఛోదసరోవరం అగాధజలాల్లో కలిసిపోయింది. ఆ సంఘటనకు అంతా అచ్చెరువొందారు.

ఆ యిద్దరూ నీటిలో మునిగి పోయిన తర్వాత, ఆ సరోవర జలాలనుండి ఒక తాపస యువకుడు పైకి తేలి ఒడ్డుకువచ్చాడు. అతని తలనిండా నాచు వ్రేలాడుతోంది. నీరు ధారాపాతంగా కారుతోంది. వెంట్రుకలు సంస్కార విహీనంగా మలినంగా ఎంతోకాలం గ్రిందట ముడివేయబడినట్టు చిందర



వందరగా ఉన్నై. ఒంటికి తామరతూడులు వేలాడుతున్నై. తెల్లని జందెము మెరుస్తోంది. నడుమునందు మందార వల్కలం కట్టుకొన్నాడు. చేత్తో ముఖం మీదికి కారుతున్న నీళ్ళను తుడుచుకొంటున్నాడు. కండ్లకడ్డుపడుతున్న వెంట్రుకలను పైకి తోసుకొంటున్నాడు.

అట్లా సరస్సులో నించి పైకి వచ్చిన తాపసకుమారకుడు కన్నీటితో దృష్టి ఆనని మహాశ్వేత వద్దకు వచ్చి దుఃఖంతో గొంతు గాద్గదికం కాగా ఇలా అన్నాడు – 'గంధర్వ రాజపుత్రీ! వేఱొక జన్మనుండి తిరిగి వచ్చిన నన్ను గుర్తుపట్టారా? లేదా?" అని ప్రశ్నించాడు. మహాశ్వేత ఒక ప్రక్క దుఃఖం, ఇంకొక ప్రక్క ఆనందం పెనగొంటుండగా తొందఅపాటుతో లేచి ఆయన పాదాలకు వందనం చేసి ఇలా అన్నది –

ఓ మహాత్మా! కపింజలా! ఇంత పుణ్యం చేసుకొని ఉన్న నేను మిమ్మల్ని కూడా గుర్తు పట్టలేనా? మీరిలా నాపై ఇటువంటి ఉద్దేశం ఉండటం తప్పు కాదు. ఎందు చేతనంటే – అజ్ఞానవతినైన నేను నా దైవం పుండరీకుడు స్వర్గస్థుడైనా నేను మాత్రం ఒంటరిదానినై జీవితం మీద ఆశతో బ్రతికి ఉన్నాను కనుక. సరే, ఇప్పుడు చెప్పండి. పుండరీకుని ఎత్తుకొని పోయిందెవరు? అలా ఎందుకు తీసికొని వెళ్ళాడు? ఆతని సంగతేమిటి? ఎక్కడుంటాడు? వెనుకనే వెళ్ళని మీకేమైంది. ఆ సంఘటన జరిగి ఇంతకాలమైనా ఏ వార్తా లేదేమిటి? నీవు నా దైవంతో కాకుండా ఒంటరిగా వచ్చారేమిటి మఱి?"

కపింజలుడు మహాశ్వేత అడిగిన ప్రశ్నలను విన్నాడు. మహాశ్వేత, విస్మయం చెందింది. కాదంబరి ఆశ్చర్యపడింది. ఆమె పరివారం, రాజులు సైన్యం అందరూ వింతగా తనను చూస్తూ ఉండగా ఇలా అన్నాడు –

"గంధర్వరాజపుత్రీ! విను, చెపుతాను నేను ఆ నాడు నీవు దిక్కుతోచక ఒంటరి దానవై ఏడుస్తున్నప్పటికి నిన్ను వదిలివేసి, మిత్రుని మీదున్న ప్రేమతో నడుంకట్టు బిగించుకొని, "ఓరీ నీవెవడవు? నా ప్రియమిత్రుని ఎత్తుకొని

ఎక్కడకు తీసుకుపోతున్నావ్?" అని ఆ వ్యక్తిని అనుసరిస్తూ నేను కూడా వేగంగా ఆకాశంలోనికి ఎగిరాను. అతను నా ప్రశ్నకు సమాధానం యివ్వకుండానే ఆకాశమార్గాన ఆశ్చర్యంతో (కనులార్పక) వైమానికులు చూస్తుండగా, దేవకాంతలు ఆయనకు మార్గం యిస్తూ ప్రక్కకు తప్పుకొంటుండగా వేగంగా పయనిస్తూ, ఆతణ్ణి చూసి స్వర్గ స్త్రీలు నమస్కారాలు చేస్తూ ఉండగా, నక్షత్రమండలం దాటి తన చల్లని తెల్లని కిరణాలతో లోకాలను మురిపించే చంద్రలోకంపై దిగాడు.

అక్కడ ఆ మహాపురుషుడు 'మహోదయం' అనే పేరుగల సభాభవనంలో చంద్రకాంతశిలావేదికపైన ఆ పుండరీకుని శరీరాన్ని ఉంచి, నాతో ఇట్లన్నాడు– "కపింజలా! నేను చంద్రుడను. నేను రోజు మాదిరిగానే ఉదయించి జగదనుగ్రహం కోసం నా కర్తవ్యం నేను నెఱవేరుస్తూ లోకాలకు ఆహ్లాదకరమైన వెన్నెలలు ప్రసరింపజేస్తూ ఉండగా, ఇదిగో ఈ నీ ప్రియమిత్రుడు పుండరీకుడు తన కామదోషం వల్ల ప్రాణాలు విడుస్తూ నిరపరాధినైన నన్ను ఇలా శపించాడు– "ఓరీ దుర్మార్గుడా! చంద్రుడా! నేను అను రాగాతిశయంతో నా ప్రాణప్రియురాలి సమాగమ సుఖాన్ని పొందకుండానే ప్రాణాలు పోగొట్టుకొంటున్నానో అలాగే నీవు కూడా కర్మ భూమియైన ఈ భారత భూమిపై పుట్టి జన్మజన్మలకు ప్రేమించిన ప్రియురాలితో సంగమసుఖాన్ని పొందకుండానే హృదయవేదనను తీవ్రంగా అనుభవించి మరణింతువు గాక" అని. నేను కూడా ఇదేమిటి నన్నిలా శపించాడు అని మండిపడ్డాను. ఇతడు తన దోషంవల్ల, తెలివితక్కువతనంతో తాను దెబ్బతిని నన్ను అనవసరంగా శపించావేమిటి అని కోపగించాను. "నువ్వుకూడా నాతోపాటే సుఖదుఃఖాలలో పాలుపంచుకొని జన్మలు పొందుదువు గాక' అని ప్రతిశాపం యిచ్చాను.

తీరా ప్రతిశాపం యిచ్చిన తర్వాత నా కోపం చల్లారి, తెలివి తెచ్చుకొని నాలో నేనే విమర్శించుకొని, పుండరీక మహాశ్వేతల ప్రణయంగూర్చి తెలిసికొన్నాను. మహాశ్వేత నా కిరణాలనుండి పుట్టిన గంధర్వకులంలో పుట్టిన



'గౌరి'కి జన్మించినది. ఆమె ఇతనిని తన భర్తగా స్వయంగా కోరుకొన్నది. పుండరీకుడు కూడా నాతో పాటుగా తనకు తాను చేసికొన్న దోషంవలన మానవలోకంలో జన్మిస్తాడు. లేకపోతే 'జన్మ జన్మలకు' అని రెండు పర్యాయాలు అన్న మాటకు విలువ లేకుండా పోతుంది. శాపం తీరేవఱకు అనితవఱకు విరహితుడైన ఈతని శరీరం దెబ్బతినకుండా ఉండటంకోసం ఇతనిని ఈ లోకానికి తీసికొని వచ్చాను. మహాశ్వేతనుకూడా ఊరడించాను. ఈ పుండరీకుని శరీరం శాపం తీరేంతవఱకు ఇక్కడే ఉంటుంది. ఇప్పుడు నీవు వెళ్ళి ఈ వృత్తాంతమంతా పుండరీకుని తండ్రి శ్వేతకేతుమహర్షికి తెలియజెయ్యి. ఆయన మహాతపఃప్రభావంకలవాడు కనుక కుమారునికి మంచి జరిగే ప్రక్రియ ఏమన్నా చేయగలడు' అని చెప్పి నన్ను పంపించాడు చంద్రభగవానుడు."

నేను నా మిత్రుడు పుండరీకుడు లేకుండా వెళ్ళవలసి వచ్చిందని శోకంతో వళ్ళు తెలియక ఆకాశమార్గాన పరుగెత్తుతున్నాను. నా కర్మ కాలి ఒక కోపిష్ఠి మునిపై నుండి దుమికి వెళ్ళాను. అందుకా ముని నాపై మండిపడ్డాడు. అగ్ని కణాలు కనులనుండి కురిపిస్తూ, "ఓరీ దుర్మార్గుడా! ఒట్టి అబద్ధాల తపోబలంతో మిడిసిపడే వాడా! ఇంత విశాలమైన ఆకాశ మార్గం ఉండగా స్వేచ్ఛాసంచారివై పరుగులు పెడుతూ గుఱ్ఱంలాగా నాపై నుండి దుముకుతావా? నీవు భూలోకంలో గుఱ్ఱంగానే జన్మింతువుగాక" అని శపించాడు.

నేను దిగ్భ్రాంతి చెందాను. పులిమీద పుట్రలాగా ఈ శాపం వచ్చిందేమో అని దుఃఖించాను. కన్నీటితో ఆ ముని పాదాలు కడిగి, నమస్కరిస్తూ, "ఓ మహాత్ముడా! మిత్ర వియోగ దుఃఖంతో ఒళ్ళు తెలియక ఇలా అపచారం చేశానే గాని, మిమ్మల్ని అవమానపఱచాలని కాదు. నాయందు దయయుంచండి. ఈ నా శాపాన్ని నివారించండి' అని వేడుకొన్నాను. ఆ ముని నాతో, "నాయనా! నేనన్నది తప్పక జరుగుతుంది. కాకపోతే నేను నీకు ఒక ఉపకారం చేస్తాను. నీవు ఎవరికి వాహనంగా ఉంటావో అతని మరణానంతరం స్నానం చేసినట్లైతేనే శాపం తీరుతుంది" అని శాపావసానం తెలిపాడు.

## 72. కపింజలునికి అశ్వరూపం వచ్చుట

అది విని నేను ఆ మునితో ఇలా అన్నాను – "మహాత్మా! అట్లైతే మీకు ఒక విన్నపం చేస్తున్నాను. నా మిత్రుడు పుండరీకుడు శాపంపెట్టటం వలన చంద్రభగవానుడు భూలోకంలో జన్మింపవలసి ఉంది, కావున నన్ను నా యజమానితో పాటే, పుండరీకుని సన్నిధిలోనే ఉండేందుకు వీలుగా గుఱ్ఱంగా పుట్టే ఏర్పాటు చేసి నన్ను అనుగ్రహించండి, నేను నా మిత్రుడు పుండరీకుని వదలి ఉండలేను. నా మిత్రుడు, నా యజమాని కలిసి ఉన్నచోటే నేనూ వాహనంగా ఉంటాను. అందుకు వీలు కల్పించండి, వారెచ్చట జన్మిస్తారో మీ దివ్యనేత్రాలతో తెలిసికోండి" అని నా మాటలు విని మునిపుంగవుడు కొద్దిసేపు కనులు మూసికొని ధ్యానంలోకి వెళ్ళాడు. మరల నాతో, "నాయనా! నీకున్న మిత్రస్నేహం నా హృదయాన్ని కదిలించి వేసింది. నేనూ పరిస్థితిని గమనించాను.

ఉజ్జయినీ నగరంలో పుత్రులకోసం తపస్సులు చేస్తున్న తారాపీడుడనే మహారాజునకు నిదర్శన పూర్వకంగా చంద్రుడు కుమారుడుగా జన్మిస్తాడు. నీ ప్రియమిత్రుడు కూడా అక్కడే శుకనాసుడనే మహామంత్రికి కుమారుడుగా జన్మిస్తాడు. అప్పుడు నీవు కూడా చంద్రాంశతో జన్మించిన రాజకుమారునకు వాహనంగా ఉంటావు" అని చెప్పి నాకు ఓదార్పు కల్గించాడు. అతడలా అంటూ ఉండగానే నేను శాప వశాన క్రిందనున్న మహాసముద్రంలో పడ్డాను. ఆ సముద్రంలో నుండి గుఱ్ఱంరూపంలో బయటకువచ్చాను. నేను గుఱ్ఱంరూపంలో ఉన్నా నాకు పూర్వస్మృతి పోలేదు. అందుచేతనే యువరాజు చంద్రాపీడుని కిన్నరమిథునం వంకతో ఈ దివ్యభూమికి నేనే తెచ్చాను. నీ కోపాగ్నికి ఆ మతిపోయినవాడు కిందటి జన్మలో నీ యందనురాగం కలిగి నిన్ను పొందలేక ప్రాణాలు విడచిన పుండరీకుడే, ఈ జన్మలో మంత్రి కుమారుడైన వైశంపాయనుడు. అయితే, ఆ విషయం నీకు తెలియదు కనుక ఇంత ఘోర ప్రమాదం సంభవించింది".



మహాశ్వేత కపింజలుని మాటలు విని సంభ్రమాశ్చర్యాలతో, "నా ప్రాణేశ్వరా! పుండరీకా! మరొక జన్మలో కూడా నాపై ప్రేమను మఱచిపోలేదా? నీవు ఎల్లప్పుడూ నా ముఖం చూడాలని కోరుకొన్నావు.

నీవు ప్రపంచంలో అంతటా నన్నే చూశావు. క్రిందటి జన్మలో లాగానే ఈ జన్మలో కూడా నేనే నీకు మృత్యువుగా మారాను. దుష్ట బ్రహ్మదేవుడు జన్మజన్మకు నిన్ను చంపటంకోసమే నాకింత దీర్ఘాయుష్షు ఇచ్చాడేమో! నేనే స్వయంగా ఇంతపాపం చేస్తూ ఎవరెవరినో నేను నిందించటం దేనికి? నేనే దుష్టురాలను, రాక్షసిని. నేనిప్పుడేం మాట్లాడాలి? ఏమని ఏడవాలి? ఎవరిని శరణువేడాలి? ఇటువంటి నాపై ఎవరు దయచూపుతారు? ఇప్పుడు నేను మిమ్ములనే శరణు వేడుతున్నాను. ఓ దైవస్వరూపుడా! నాపై దయచూపించు. నాకు జవాబివ్వు!' ఇలా అడగటానికి కూడా నేను సిగ్గుపడుతున్నాను. నావల్లనే నీవు కూడా కష్టాలు పడ్డావు కనుకనే నాకు సమాధానం నీవు ఇవ్వటంలేదు." అంటూ ఘోరంగా దుఃఖిస్తూ గుండెలు బాదుకొంటూ నేలపై పడిపోయింది.

కపింజలుడు ఆర్తి చెందుతూ మాట్లడుతూ పడిపోయిన మహాశ్వేతను చూసి మిక్కిలి జాలిపడి ఇలా అన్నాడు.

"గంధర్వరాజపుత్రీ! ఎందుకమ్మా ఏ తప్పూ చేయకుండానే ఇప్పటి స్థితికి నీవే కారణమైనట్లు నిన్ను నీవు నిందించుకుంటావు? కష్టాలు తీరబోతుండగా నీవిలా దుఃఖించటం దేనికి? ముందుముందు నీవు సుఖపడే కాలం రాబోతోంది. దుఃఖంతో నిన్ను నీవే చంపుకుంటావు దేనికి? నీవు ఇప్పటికి భరింపరాని దుఃఖాన్ని భరించావు. నీ పతి తిరిగి వస్తాడనే ఆశతో నిన్ను నీవు నిలుపుకున్నావు. మీ ఇరువురకు ఇట్టి దుఃఖం వచ్చినదంటే అది శాపదోషం వల్లనేనని మీకు ముందే చెప్పాను. ఇందులో మీ తప్పు కొంచెమైనా లేదు. చంద్రభగవానుడు పలికిన మాటలు కూడా మీరిరువురు విన్నారు కదా! ఇక నుండి మీరు మీ ప్రియుని గురించిన దుఃఖాన్ని వదిలివేయండి. అది అమంగళకరం. మీరిద్దరికి మేలుకలిగించేదే ఇప్పుడు చేసే తపస్సు. ఆ

తపస్సును కొనసాగించండి. తపోదీక్ష ఏకాగ్రతతో చేస్తే ఏపనియైనా తప్పక తీరుతుంది. తపస్సుద్వారా సాధింపలేని ఫలం లేదు. పార్వతీదేవి తపస్సు ద్వారానే కదా! అసాధ్యమైన శివశరీర అర్ధభాగస్వామిని అయింది! అలాగే నీవుకూడా తొందరలో నా ప్రియమిత్రుని శరీరంలో చోటు సంపాదిస్తావు – నీతపం ఫలితంగానే" అని.

కపింజలుని మాటలు విన్న మహాశ్వేతకు క్రోధోద్వేగాలు శాంతించాయి. కాదంబరి కపింజలునితో, "మహాత్మా! కపింజలా! ఈ సరోవరజలాల్లో పత్రలేఖ మీరు ఇద్దరూ కలిసేకదా దూకింది – మరి, పత్రలేఖ జాడే కానరాలేదు. ఆమెకేమైందో దయచేసి చెబుతారా!" అని అడిగింది అతడు కాదంబరితో ఇలా అన్నాడు – "రాజపుత్రీ! నీళ్ళలోకి దూకిన తర్వాత ఏం జరిగిందో నాకెంతమాత్రం తెలియదు. ఇపుడు చంద్రాంశతో పుట్టిన చంద్రాపీడుడు, పుండరీకుడైన వైశంపాయనుడు వీరిద్దఋూ ఎక్కడపుట్టారో, పత్రలేఖకు ఏమైందో ఈ విషయాలన్నీ తెలుసుకునేందుకే నేను భగవత్స్వరూపుడైన శ్వేతకేతువు వద్దకు వెళుతున్నాను" అని అంటూనే ఆకాశంలోనికి ఎగిరి పోయాడు.

ఈ విధంగా కపింజలుడు శ్వేతకేతువు వద్దకు వెళ్ళిపోయాడు. కాదంబరి తన దుఃఖావేగాన్ని ఆపుకొని కాదంబరితో, "ప్రియసఖి! బ్రహ్మదేవుని చేత మన మిరువురము సమాన స్థాయి దుఃఖితులమైనాము. ఈ ఘటనలయందు మన తప్పు లేదని కపింజలుడు చెప్పినందున నేను నాతలను ధైర్యముగా పెకెత్తి ఉన్నాను. ఇప్పుడు నేను నీకు ముఖం చూపటానికీ, ప్రియసఖీ అని నోరారా పిలవటానికి ఎంతమాత్రము సిగ్గుపడటం లేదు. నీకు నేను కూడా ప్రియసఖినే ఐనాను. ఇప్పుడు మరణంగాని, జీవించటంగాని నాకు దుఃఖాన్ని కలిగింపదు. అందుకే నేను ఎవ్వరినీ ఏమీ అడగను. ఎవరిచేత ఉపదేశింపబడను. ఇలాంటి పరిస్థితిలో నేనేం చెయ్యాలో నీవే నాకు చెప్పాలి. నాకు ఇపుడేం చేస్తే మేలుకలుగుతుందో నా అంతట నేను



తెలిసుకోలేకపోతున్నాను అని అన్నది. అప్పుడు కాదంబరితో మహాశ్వేత ఇలా అన్నది.

## 73. కాదంబరి చంద్రాపీడుని శరీరాన్ని రక్షించి సేవించుట

"ప్రియసఖీ ! మనలో మనకి ఈ అడగటాలూ, ఉపదేశించుకోవటాలూ దేనికి? మనం ఏం చేస్తే మన ప్రాణ నాథులు మనను కలుసుకొంటారో అదే మనమిప్పుడు చెయ్యాలి. పుండరీకుని వృత్తాంతం గూర్చి కపింజలుడు మనకు వివరంగా చెప్పాడు. ఆ రోజున నేను కేవలం దివ్యపురుషుడు చెప్పిన మాట ప్రకారమే నేను మనస్సు సమాధాన పఱచుకొనిఉన్న నాకు వేఱొక్కమాట మాట్లాడే అవకాశం లేకుండా పోయింది. కాని నీకిప్పుడు నమ్మకం కలిగిస్తూ నీ ప్రియుడు నీ ఒడిలోనే ఉన్నాడు. ఇంకా నీవు చెయ్యవలసిందేమున్నది? చెప్పిన ప్రకారంగా కాక వేరేవిధంగా ఉంటే అప్పుడేంచెయ్యాలో ఆలోచిద్దాం! దేవతావాణి చెప్పినట్లుగా చంద్రాపీడుని శరీరానికి ఎంతకాలం వఱకు ముప్పు కలగదో అంతవఱకు సహగమనం మాటప్రక్కన పెట్టి కాపాడుకోవటం తప్ప మనం చేయగలిగిం దేముంది? కళ్ళకు కనపడని దేముణ్ణి మనం ఏదో రూపంలో ప్రతిమగా చేసుకొని పూజించినంత మాత్రం చేతనే కోర్కెలు తీరతాయంటే, ఇక కనుల ఎదుటనున్న ఈ దేవతాస్వరూపుడు, చంద్రునికి మారురూపం అయిన ఇతనిని అర్చించకుండానే ఫలితం కలుగుతుందని వేరే చెప్పాలా?" అని పలికింది.

మహాశ్వేత మాటలు విన్న కాదంబరి ప్రశాంతమైన మనస్సుతో లేచింది. పత్రలేఖను మదలేఖను తోడు తీసుకొని చంద్రాపీడుని శరీరాన్ని ఏ బాధా కలగకుండా ఎండ, చలి, గాలి తగలకుండా ఉండే ప్రదేశానికి మార్పించింది. ఆ శిలాతలం సర్వసురక్షితంగా ఉంది. కాదంబరి దుఃఖాన్ని దరి జేరనీయక తన దేహంమీదున్న నగలను తొలగించి వేసి, మంగళంకొఱకు చేతికి ఒకే ఒక మణికంకణం ధరించింది. అచ్ఛోదసరస్సులో పవిత్రంగా స్నానం చేసింది.

శుభ్రంచేసిన పట్టువస్త్రాలు ధరించి, పెదవులకున్న తాంబూలం ఎఱుపు దనాన్ని కడిగి శుభ్రం చేసుకొని, కళ్ళనుండి కారే నీటిబిందువుల్ని నియంత్రిస్తూ ఉన్నది. ఆమెకు పతిసేవ ఇలా చెయ్యాలని ఎవరూ చెప్పలేదు. శిక్షణ యివ్వలేదు. ఆమె ఎప్పుడూ అభ్యసింపనూ లేదు. మున్నెన్నడూ చేసిందీ కాదు. ఆమె దుష్ట బ్రహ్మచే ప్రేరేపింపబడినదై చక్కని పువ్వులతో అలంకరించింది. చందనాదులు పూసింది. శృంగారోచితమైన తాను తెచ్చిన వస్తువులను దేవతల కివ్వదగిన విలువైన ద్రవ్యాలను సేకరించి వానిని చంద్రాపీడుని శరీరమునందు ఉపయోగించింది. ఆమె ఆ సమయంలో మూర్తీభవించిన శోకదేవతలాగా ఉంది. కాదంబరి తాను తానుగా లేదు. వేరొక వ్యక్తిలాగా ఉంది. శూన్యముఖిగా ఉంది. చంద్రాపీడుని ముఖాన్ని మాటిమాటికి చూస్తోంది. మనస్సులో ఎంతో దూరంనుండి వచ్చిన వారు బాగా ఆకలిమీద ఉన్నారు. స్నానసంధ్యాదులు చేయకుండా ఉన్నారు. కాదంబరితోపాటు అక్కడివారందఱు నిరాహారులై ఆ పగలంతా అలాగే గడిపారు.

పగలు గడచిపోయింది. రాత్రి అయ్యింది. ఆ రాత్రి మిక్కిలి అంధకారబంధురంగా ఉంది. ఆకాశంలో మేఘాలు విస్తరించి ఉండటంచేత నల్లగా భయంకరంగా ఉంది ఆ రాత్రి కాదంబరికి. ఆ మేఘగర్జనలకు పులకరించిన నెమళ్ళు పురులు విప్పి నాట్యమాడుతూ కేకాధ్వనులు చేస్తుంటే ఆమె హృదయం వ్యాకుల పాటు చెందుతోంది. కప్పలు నీటిపట్టులలో చేరి కఠోరంగా 'బెక బెక' శబ్దం చేస్తుంటే ఆమె చెవులు మారుమోగి పోతున్నై మెఱుపులు దిక్కులంతా ప్రకాశిస్తూ జనులకు భీతి కలిగిస్తున్నై. పిడుగులు తమపై ఎక్కడ పడతాయోనని జనులు వణుకుతున్నారు. సహజమైన అబలా భావాన్ని ఆవలకు త్రోసి, చంద్రాపీడుని చరణాలను వదలకుండా, తనకు కలిగే శరీరబాధను లెక్కచేయక రాత్రంతా మేల్కొన్నదై కాదంబరీదేవి ఆ రాత్రిని తక్కువ సమయం లాగా గడిపి వేసింది.

ఇంతలో తెల్లవారింది. అంతటా వెలుగులు వ్యాపించినై. చంద్రాపీడుని శరీరం కొత్తరంగులతో గీయబడిన చిత్రంలా కనిపించింది కాదంబరికి ఆమె



ఆశ్చర్యంతో ఆతని శరీరాన్ని తన చేతితో నెమ్మదిగా తడుముతూ ప్రక్కనే కూర్చున్న మదలేఖతో, "ప్రియసఖీ! మదలేఖా! నాకిష్టం కనుక అలా కనబడుతున్నదో, లేక వికార మేమీ లేకుండుట చేతనో నాకు చంద్రాపీడుని శరీరం నిన్న ఎలా ఉన్నదో ఈ రోజు కూడా అలాగే ఉన్నట్టు అనిపిస్తోంది. నీవు కూడా ఆ శరీరాన్ని బాగా పరీక్షగా చూడు! అని అనగా కాదంబరితో మదలేఖ ఇలా సమాధాన మిచ్చింది. "ప్రియసఖీ! ఇందులో నిరూపించటానికే ముంది? (చూడవలసిన పని ఏమున్నది?) లోపల ఉన్న జీవుడు లేనికారణంగా శరీరం క్రియాశూన్యంగా, కదలిక లేకుండా ఉన్నది. ఇప్పటికి చంద్రాపీడుని ముఖం వికసించిన పద్మంలాగా కళకళలాడుతూనే ఉంది. ముఖాన ముసిరే ముంగురులు కూడా జీవంతో కదులాడుతున్నై. ముఖం చంద్రబింబం కళలాగా కాంతివంతంగా ఉంది. ఆయన కనులు ముకుళించిన పద్మం లాగా వీనులవఱకు వ్యాపించి విశాలంగా విలసిల్లుతున్నై. పెదవులు నవ్వకపోయినా వికసించినట్టుగా దౌడల చివఱకు వ్యాపించినై. ఆతని క్రిందిపెదవి ఎప్పటివలె క్రొత్త చిగుఱుటాకులాగా కాంతిమంతమై ఉంది. అతని కాలు చేతులు లోగడవలెనే పగడపు కాంతులవలె ఎఱ్ఱదనంతో ప్రకాశిస్తున్నై. అతని శరీరావయవాలన్నీ సహజలావణ్యంతో సౌకుమార్యంతో దృఢంగా ఉన్నై. అందువలన కపింజలుడు చెప్పిన శాప వృత్తాంతం సత్యమేనని నేను దృఢంగా నమ్ముతున్నాను" అని.

## 74. చంద్రాపీడుని శరీరం చెడకుండుట

మదలేఖ ఇలా పలుకగా కాదంబరి మిక్కిలి ఆనందపడుతూ మహాశ్వేతకు కూడా ఆతని శరీర స్థితిని చూపించింది. అంతే కాదు – చంద్రాపీడుని పాద పద్మాలయందు తమ జీవితాలా ధారంగా ఉంచుకొన్న రాజ సమూహానికి కూడా చంద్రాపీడుని శరీరము చెక్కుచెదఱకుండటాన్ని చూపింది.

ఆ రాజులు కూడా మిక్కిలి విస్మయపడుతూ కండ్లార్పక, తమ శిరస్సులను నేల కుతాకించి నమస్కరించి, మోకాళ్ళపై నేలపై నిలువబడినవారై కాదంబరీ దేవితో ఇలా అన్నారు.

"దేవీ! దురదృష్టవంతులమైన మమ్ము వదలి దూరం వెళ్ళిపోయిన చంద్రాపీడ యువరాజు ముఖం ఎప్పటిలాగా ప్రసన్న చంద్రమండల కాంతిని తిరస్కరించినట్లుగా కనపడుతున్నదంటే – అందుకు కారణం నీ ప్రభావమే నమ్మా! అలాగే మేము నిత్యం నమస్కరించుకునే పాదాలు కూడా మునుపటి వలెనే వికసించిన తామర పుష్పాలవలె ఉన్నాయి. అట్లే మనుష్యలోకంలో ఎవడైనా, ఎప్పుడైనా ఇంత విచిత్ర సంఘటన గూర్చి విన్నామా? కన్నామా?"

రాజకుమారులు ఇలా పలుకగా కాదంబరి చెలులతో కలసి, దాసీలను వెంటపెట్టుకొని బయలుదేరి దేవతార్చన కుసుమాలను స్వయముగా కోసింది. స్నానం చేసింది. చంద్రాపీడుని శరీరాన్ని శుభ్రపరచింది. పుష్పచందనాదులతో పూజించింది. స్నానపానాదులు పూర్తి చేసుకొని రమ్మని రాజసమూహానికి, పరివారానికి సెలవిచ్చింది. వారంతా పనులు పూర్తి చేసికొని వచ్చారు. కాదంబరి కూడా మహాశ్వేతాదేవి తెచ్చిన పండ్లను తిన్నది. తినిన తర్వాత మరల పూర్వంలాగానే చంద్రాపీడుని పాదాలను ఒడిలో నుంచుకుని కూర్చున్నది. అలా ఆరోజుకూడా గడచిపోయింది.

మఱునాడు కాదంబరికి చంద్రాపీడుని శరీరం ఎంతమాత్రం చెడకపోవటం చూసి గట్టి నమ్మకం కుదిరింది. కాదంబరి మదలేఖతో, "సఖీ! ప్రభువులవారి ఈ శరీరాన్ని శాపం తీరేంతకాలం జాగరూకులమై కాపాడటానికి మనం యిక్కడనే ఉండాలి. ఈ అత్యద్భుత వృత్తాంతాన్ని తల్లిదండ్రులకు చెప్పు, హేమకూటానికి పోయి. ఉన్న విషయం వారికి చెబితే వారు నన్ను అపార్థం చేసుకోకుండా ఉంటారు. నా గూర్చిన దుఃఖంతో కుమిలిపోకుండా ఉంటారు. నాగూర్చి వారికి ఎలా చెబుతావు? దుఃఖభాగినినై నన్ను చూడటానికి వెంటనే బయలుదేరకుండేటట్లుగా చెప్పాలి. నేను ఇలా ఎందుకన్నానంటే వారిని చూస్తే నేను నాదుఃఖాన్ని ఆపుకోలేను. నేను నా ప్రాణాధికుడైన నా నాథుడు మరణించినా దుఃఖపడలేదు. నాదైవం పునర్జీవితుడౌతాడని



తెలిసికూడా నేను ఎందుకు దుఃఖపడతాను? అందులో నేను పతివ్రతా నియమంలో ఉన్నాను" అంటూ మదలేఖను హేమకూటానికి పంపింది.

మదలేఖ వేగంగా హేమకూటానికి వెళ్ళింది, మరల కాదంబరి వద్దకు వచ్చింది. "అమ్మా! మీరనుకొన్న కోరికనెరవేరింది, మీ తండ్రిగారు చిత్ర రథుడు, తల్లి మదిరాదేవిగారు, మిమ్ముగాఢా లింగనంతో, శిరము మూర్కొని ఇలా మీతో చెప్పమన్నారు – "అమ్మాయీ ! మేము ఇంతకాలం నీవు అల్లునితో కలిసి వస్తే చూద్దామనే ఆశ ఏ కోశానా మాకు కలగలేదు. నీ అంతట నీవే అల్లుడుగారిని వరించావని తెలిసి మాకు పరమానందం కలిగింది. ఆ అల్లుడుగారు కూడా సాక్షాత్తు చంద్రభగవానుని యొక్క అంశం.

అందువలన శాపం తీరిపోగానే అల్లునితో కలసి వచ్చిన ఆనందబాష్పాలు కురిపిస్తున్న నీ ముఖపద్మాన్ని మేమిద్దఱం చూస్తాము" అని మదలేఖ కాదంబరి తల్లిదండ్రుల సందేశాన్ని వినిపించింది. కాదంబరి సంతృప్తితో కూడిన మనస్సుతో చంద్రాపీడుని శరీరానికి దైవానికి చేసినట్లుగా సేవలు చేస్తూ ఉండిపోయింది.

## 75. చంద్రాపీడుని మృతిని తారాపీడాదుల కెఱింగించుట

ఇంతలో వర్ష కాలం గడచిపోయింది. మేఘాలవల్ల (వర్షంవల్ల) ఆటంకాలు తొలగి పోయి ప్రజలు, జీవరాసులు బయటకు వచ్చి స్వేచ్ఛగా తిరుగ జొచ్చారు. గ్రామ సీమలన్నీ పండిన పంటబరువు చేత ఒరిగిన పొలాలతో అందగిస్తున్నాయి. అరణ్యప్రాంతాలు ఱెల్లు పుష్పాలతో తెల్లబాఱి యున్నై. సౌధాగ్రభాగాలు ప్రజలచే సేవించబడుతున్నై (చలివల్ల). చిన్న సరస్సులు సౌగంధికపుష్పాలతో కళకళలాడుతున్నై. కలువల సువాసనతో కూడిన వాయువులతో రాత్రులు ఆహ్లాదకరంగా ఉన్నై. తెల్ల వారు జామువేళ వీచే గాలులు నల్లవావిలి పుష్పసుగంధంతో కూడి ఉన్నై. రాత్రివేళలు మబ్బులు లేకపోవుట చేత వెన్నెల వెలుగులతో శోభిస్తున్నై. నిండుగా వికసించిన పద్మాల

సుగంధంతో కూడిన పగటివేళలు అందగిస్తున్నై. నీటియొక్క ప్రవాహ వేగాలు తగ్గిన నదుల సరస్సుల ఇసుక తిన్నెలపై చిన్న కెరటాల వల్ల కలిగిన చారలు కనిపిస్తున్నై. నదులు, వరదలు తగ్గి తేలికగా దాటటానికి వీలుగా ఉన్నై. బురదలు తగ్గినేల గట్టిపడి, బాటసారుల వలన కాలిదారులు ఏర్పడినై. ఆ దారులు అక్కడి రాజుల సంచారాల చేత మెత్తబడినాయి. బురద ఎండిన కారణంగా భూములు గుఱ్ఱపుగిట్టలకు అనువుగా ఉన్నాయి. ప్రకృతి అనుకూలంగా, రమణీయంగా, ప్రయాణాను కూలంగా ఉంది. అట్టి వాతావరణంలో ఒక రోజున –

కాదంబరి చంద్రాపీడుని పాదాల వద్ద కూర్చుని ఉండగా మేఘనాదుడు ఆమెవద్దకు వచ్చి ఇలా విన్న వించాడు–

"యువరాజులవారు ఎన్ని రోజులకు రాక ఆలసించటంచేత ప్రభువులు తారాపీడులు హృదయాందోళన చెంది మహారాణి విలాసవతితో మహామంత్రి శుకనాసుల వారితో, వార్తాహరులు పంపబడ్డారు. మేము మీకు సంభవించిన దుఃఖకర సంఘటన వల్ల మీ మనస్సునకు మరల బాధ కలుగ గూడదని వారితో" ఇక్కడి విషయాలన్నీ మేమే వివరించి చెప్పాము. ప్రస్తుతం యువరాజు చేతగాని మీ వలనగాని ప్రత్యేకంగా సందేశం పంపనక్కఱలేదని చెప్పాము. అందు వలన మీరు ఆలస్యం చేయకుండా త్వరగా ఉజ్జయిని చేరుకొని ఇక్కడి వృత్తాంతమంతా దేవాధిదేవుడైన తారాపీడులవారికి నివేదించండి" అని చెప్పాము.

మా మాటలకు వార్తాహరులు మిగుల కోపించి, "మీరు చెప్పింది అంతా బాగానే ఉంది. సరే మా రాజభక్తి, ప్రేమానురాగాలు సంగతి అటుండనీయండి. కార్యప్రాముఖ్యతే మమ్ములను యువరాజును చూడాలనే కుతూహలాన్ని మాలో వృద్ధి పరుస్తోంది. కేవలం మేము వార్తా హరులమే అని మీరు కూడా భావించితే మీరన్నట్లుగా వార్తా హరత్వంతో ప్రయోజనం నెరవేరేటట్లయితే మేము కూడా యువరాజును చూడకుండా ఇటునుండి ఇటే ఉజ్జయినికి పోయి ఉండేవారమే.



కాని ఇది వార్తలను కేవలం ఇచ్చి పుచ్చుకొనే పని కాదు. యువరాజును చూడకుండా పాపాత్ములమైన మేము ఉక్కడనుండి వెళ్ళదలపలేదు. మేము యువరాజుగారికి కొత్త వారంకాము. వారి పాదసేవ చిరకాలంగా చేసి మమ్ము మేము ధన్యుల్ని గావించుకొన్నాం. యువరాజుగారు మేము కోరినప్పుడెల్ల మాకు దర్శనభాగ్యం కలిగిస్తూ వచ్చారు. మేమీనాడు ఏం పాపం చేసుకొన్నామని? ప్రభువుల వారి ముఖం చూడకుండా, వారి పాదాలకు నమస్కారం చేసుకోకుండా దూరంగా వెళ్ళ గొట్టబడటానికి? మేము వారి పాదాల కంటుకున్నరేణువులం. ఎంతో దూరంనుండి వచ్చిన మమ్ము ఇంకా బాధించ కుండా మీరు దయతో కాదంబరీదేవిగారితో చెప్పి మాకు యువరాజ పాదప్రణామావకాశాన్ని ఇప్పించండి. అయినా అంత దూరంనుండి ఇంత దూరం వచ్చి యువరాజుగారి శరీరాన్ని చూడకుండా ఇటునుండి ఇటే రాజ ధానికి వెడితే – అక్కడ రాజాధిరాజైన తారాపీడుల వారికి మేమే మి సమాధానం చెప్పగలుగుతాం? ప్రభువుల వారికి దేన్ని గుఱించి చెప్పాలి!" అని అన్నారు. దేవీ! మీరిపుడేం చేయమంటారు" అని.

మేఘనాదుడు ఇలా పలకగా కాదంబరి చాలా సేపు ఆలోచించింది. ప్రస్తుతం అత్తమామలకు కలిగిన కష్టం ఓదార్చరానిదిగా భావించిన కాదంబరి నిరంతర దుఃఖబాష్పాలతో ముఖం తడిసిపోగా, కంఠం గద్గదిక చెందగా, ఎట్లాగో అతికష్టం మీద గొంతు పెకల్చుకొని ఇలా అన్నది – "వారు 'వెళ్ళం' అని ప్రతిఘటించటం యుక్తమే, తప్పేమీ లేదు. నేనూ అంగీకరిస్తున్నాను. యువరాజును చూడకుండా అటునుండి అటే వెళ్ళి పోతే వారు అక్కడికి పోయి ఏమి చెపుతారు? అయినా ఇటువంటి ఆశ్చర్య కర సంఘటన స్వయంగా కళ్ళతో చూసిందైనా లోకం నమ్మదు. ఇక చూడని వింతను ఎలా నమ్ముతుంది ఈ లోకం? అందుచేత వారిని వెంటనే ప్రవేశపెట్టండి. వారి ప్రభువును చూసుకోనీయండి. మార్గాయాసంతోపాటు వారి కళ్ళను సఫలం చేసుకొంటారు" అని దేవీ ఆజ్ఞానుసారం మేఘనాదుడు వారిని అక్కడకు తీసికొని వచ్చాడు.

వారు చంద్రాపీడుని దూరం నుండే చూస్తూ కన్నీరు కారుస్తూ మోకాళ్ళపై నేల మీద వంగి నమస్కరించారు చంద్రాపీడుని పాదపద్మాలకు. కాదంబరీ దేవి వారిని ఏకదీక్షగా చూసి చాలా సేపటికి ఇలా అంది. "ఓ భద్రముఖులారా! యువరాజు గారితో చిరకాలంగా ఉన్న స్నేహసద్భావనల కారణంగా మీలో ప్రకోపిస్తున్న దుఃఖవేగాన్ని తగ్గించుకోండి. ఇట్టి సంగతులు చాలా వింతగా ఉంటాయి. మనకంటి ఎదుట కనబడుతున్నది. మీరూ చూస్తునే ఉన్నారు కదా! ప్రభువులవారి ముఖంగా ఉన్నట్లే ఉన్నది కదా! సరే మీరు త్వరగా ఉజ్జయినికి బయలుదేరండి. తారాపీడుల వారు ఇక్కడి వృత్తాంతం తెలుసుకోవాలని ఆత్రతతో ఉంటారు. అయితే మీరు ప్రభువుల వద్ద యువరాజు పరిస్థితిని ఎంత మాత్రం చెప్పకండి, యువరాజు మాకు అచ్ఛోదసరస్తీరంలో కనబడ్డారని మాత్రమే చెప్పండి. మరణించారు – కానీ దేహం చెడలేదు అని చెపితే వారు నమ్మే అవకాశాలు తక్కువ. పెద్దలు అనవసరంగా ధర్మ సందేహంలో పడతారు. ప్రాణేశ్వరుడు తిరిగి బ్రతికినప్పుడు ఆయనే పెద్దలకు ఈ అద్భుత వృత్తాంతాన్ని తెలుపుతాడు!"

కాదంబరి చెప్పిన మాటలు వినిన వార్తాహరులు ఆమెతో, "దేవీ! ఉజ్జయినిలో మమ్మల్ని ఏం చెప్పమంటారు? జరిగిన విషయం రెండు కారణాల వల్ల పెద్దలకు తెలియాలి. ఒకటి మేము ఉజ్జయినికి వెళ్ళటం, రెండు వారికి వృత్తాంతంని వేదించటం. వెళ్ళకపోవటం, చెప్పకపోవటం అనేవి రెండూ మా చేతులలో లేని వితప్పక ఉజ్జయిని వెళ్ళవలసిందే యువరాజుగారి విషయం చెప్పవలసిందే. యువరాజ వైశంపాయనుల వార్తలు తెలియక ఆందోళనపడి తారాపీడ విలాసవతీశుకనాసులు మమ్ములను నమ్మి ఇక్కడకు పంపారు. మేము బ్రతికి ఉండి కూడా విషయం తెలిసి వెళ్ళకుండా ఉండగలమా? అది అసంభవం. ఒక వేళ వెళ్ళి ప్రియసుతుల క్షేమవార్త వినాలనే ఆత్రతతో నిండిన పైపెద్దలు ముగ్గురి ఎదుట నిలువబడి వారు కంటికి కదివెదు నీరు కారుస్తుండగా వారి ముఖాల వంక చూస్తూ ఏ వికారంలేని ముఖాలతో వారివద్ద పచ్చి



అబద్ధాలు పలకగలమా? అలా పలకటం మావల్ల కాదు! అని నిష్కర్షగా చెప్పారు.

కాదంబరి వారి మాటలను కాదనలేక కొద్దిసేపు ఆలోచించి మేఘనాదునితో, "మేఘనాదా! చిరపరిచితులు విశ్వాస పాత్రులు ఐన వార్తాహరులు అసత్యాలు పలుకరని నాకూ తెలుసు. కాని, వయోవృద్ధులు పరితపిస్తారు గదా అని, అలా బాధించటం తగ దనిపించి నేను అలా చెప్పమని అన్నాను. ఈ వార్త పెద్దలకు పిడుగు పాటుగా తోస్తుంది. ఈ వార్తాహరులతో పాటు ఎవరినైనీ నమ్మకసునీ, సర్వ విషయాలు ప్రత్యక్షంగా చూసిన వానిని ఉజ్జయినికి పంపాలి. అలాగయితే వారికి నమ్మకం కలుగుతుంది" అని పలికింది.

దానికి మేఘనాదుడు, "దేవి! మన రాజసమూహం గూర్చి ఏం చెప్పమంటారు? చివరికి సేవక వర్గాల వారుకూడా మేము కందమూల ఫలాలు తింటూనైనా ఇక్కడే ఉంటాము కాని, ప్రభువుల పాదాలు విడచి ఇక్కడినుండి అంగుళం కూడా అవతలకు పోము అని అందరూ ఒకే మాట మీద పట్టు పట్టి కూర్చున్నారు. ఆ సేవకులు కూడా సుఖం కల రోజులలో కంటె ఆపదకలిగిన ఈ రోజులలోనే అధికశ్రద్ధతో పని చేస్తున్నారు. ఉన్నతస్థితి పొందటం కంటె వినయవంతులుగా ఉండటానికి ఇష్టపడుతున్నారు. మాట్లాడే ఆసక్తి కలవారు కూడా మౌనంతో ఉన్నారు. పొగడదగినవారై కూడా గర్వితులు కావటం లేదు. దేన్ని గూర్చియైనా అడిగితే హితంగా, ప్రియంగా మాట్లాడుతున్నారు. ఎవరూ చెప్పకుండానే అన్ని పనులు చేసుకు పోతున్నారు. పని చేసి కూడా దాన్ని గూర్చి గొప్పలు చెప్పుకోరు. పరాక్రమం చూపినా గర్వించరు. గర్వించే పని చేసినా సిగ్గు పడతారు. యుద్ధాలలో ప్రథమశ్రేణి అందటికంటె వెనకుంటారు. వారికి ధనంకంటే స్నేహమే ముఖ్యం. తనకోసం జీవించాలనుకోరు – ప్రభువుకోసం మరణించాలను కొంటారు. ఇంట్లో ఉండటం కంటె ప్రభువు పాదాల చెంత ఉంటే నేను సుఖంగా భావిస్తారు.

వారికి ఆశ ఉందంటే అది ప్రభువుల పాదసేవయందే. అసంతృప్తి ఉందంటే అది యజమాని హృదయారాధనయందే. రాజముఖాన్ని చూడటం వారికి వ్యసనం. వాగుడు తనం పరులగుణం చెప్పటంలోనే. మన భృత్యు లందఱిది ఇదేవరుస. స్వామి స్థానంలో ఇప్పుడు మీరున్నారు. మీరు చెప్పటమే ఆలస్యం వెంటనే చేసేస్తారు". అని వివరించి 'త్వరితకుడు అనే బాలసేవకుని పిలిపించి అతనిని వార్తా హరులతో పాటు ఉజ్జయినికి పంపాడు.'

## 76. చంద్రాపీడుని మృతి వార్త విని తల్లిదండ్రులు శోకించుట

ఉజ్జయినిలో తన కుమారుల కుశల వార్తలు తెలిసి చాలాకాలమైనందున ఆందోళన చెందిన విలాసవతీదేవి కుమారుల క్షేమం కోరుతూ ఉజ్జయినీ నగర దేవతలైన అవంతీ మాతృదేవతల ఆలయానికి వెళ్ళింది అక్కడున్న ఆమెకు దాసీలు పరుగు పరుగున వచ్చి, "అమ్మా! మీరు సౌభాగ్యంతో విలసిల్లాలి. మీ పూజకు అవంతీమాతృదేవతలు ప్రసన్నులయ్యారు. యువరాజు కోసం పంపబడిన వార్తాహరులు వచ్చే శారమ్మా!" అని వార్త వినిపించారు. విలాసవతి ఆ మాట విని మిక్కిలి ఆనందపడి కనులనుండి ఆనంద బాష్పాలు విడిచింది. నీటి బిందువులతో తడిసిన నల్లకలువల వంటి చూపులతో, ఇంటి దారి కనుగొన్న లేడిపిల్ల చూపులతో, సంతోషంతో కేరింతలు కొట్టి సామాన్య స్త్రీలాగా ప్రవర్తించింది.

"ఎవరు నాకీ అమృతవాక్కుల్ని శ్రవణపేయంగా వినిపించింది? నాపై ఎవరికింత జాలి కలిగింది? వార్తా హరుల రాక ఎవరు చూశారు? వారింకెంత దూరంలో ఉన్నారు? నా కుమారుని క్షేమం గుఱించి వారేమంటున్నారు?" అంటూ విలాసవతి దూరంనుండి వస్తున్న లేఖాహారక బృందాన్ని చూసింది. పౌరులు వారిని అనేక రాకాలుగా ప్రశ్నిస్తూ వారి వెంటనడుస్తూ వస్తున్నారు. వారు వార్తాహరులను ఇలా ప్రశ్నిస్తున్నారు –



"యువరాజుగారు ఎంతదూరంలో ఉన్నారు?

ఇన్ని రోజులనుంచి ఆయన ఎక్కడున్నాడు? మీరు ఆయనను ఎలా చూశారు?

ఆయన వద్ద ఒక్క గుఱ్ఱం మాత్రమే ఉంది. మరి ఈ వర్షాకాలం ఎలాగడిపాడు?

ఆయన వర్షాకాలం ఎలా గడిపాడో, ఎంత కష్టపడ్డాడో ఈ త్వరితకునికి తెలుస్తుంది.

యువరాజు ఇంతక్లేశం ఎందుకు అనుభవించినట్లు? ఇంతకీ వైశంపాయనుని ఆయన చూశారా లేదా? ఆయనను వెనుకకు తెచ్చారా?

పత్రలేఖతో కూడిన మేఘనాదుడు యువరాజును కలిశాడా?

మా దేవవర్ధనుడు ఏదన్నా సందేశం పంపించాడా?

యువరాజు గారికి కానుకగా ఇవ్వబడిన ఆ గుఱ్ఱం బాగున్నదా?

మీరు మాపై కోపగించకండి

ఆశ్వికులలో ప్రధానుడు, మాకు వరుసకు మేనమామ పృథువర్మ గారి కుశలవార్త మీకు తెలిస్తే చెప్పండి.

మహాశ్వదళాధిపతి అశ్వసేనుడు క్షేమంగా ఉన్నాడా? ఎందుకంటే ఆ అశ్వసేనుడు వరసకు మేనమామౌతాడు.

మా తండ్రి గారు ఇలా చెయ్యటం మాకు ఆశ్చర్యకరంగా ఉంది. ఆయన మీతో తనయొక్క గుర్తుగా ఒక్క వస్తువూ పంపలేదు. యుద్ధసమయాల్లో బరువు బాధ్యతలు మోసే మా అన్న భరతసేనుడు యువరాజుగా ఆ భవనంలో ఎక్కడన్నా కనిపించాడా?

సేనాపతి భరతసేనుడు సపరివారంతో క్షేమంగా ఉన్నాడా? కర్తవ్యమే ప్రాణంగా కల నా కుమారుడు కుమారవర్మ క్షేమమేనా? వేగవంతమైన దండనాయకుడు అవంతిసేనుని సంగతేమన్నా మీకు

ఆ అవంతిసేనుడు సేనకు ముందు నడుస్తానని తెలుసా? అన్నందుకు యువరాజుగారు కోపగించారుట గదా! ఈ రాజ వంశాలలో ఎవరు రాజాను గ్రహంతో ధనవంతుడౌతాడో తెలియదు. ఎవడు దెబ్బతింటాడో తెలియదు.

"రాజసంబంధీకులు చాలామంది కొత్త సేవకులుగా కొలువులో చేరారట గదా! ఎలా జరిగేది అలా జరగనీ!

సర్వసేనుని కుమారుడు వీరసేనుని క్షేమం గూర్చి మీలో ఎవరికి తెలిస్తే వారు చెప్పండి.

ఎందుకంటే తండ్రి యుద్ధంలో మరణించిన తర్వాత ఇదే మొదటిసారి యుద్ధయాత్రలో పాల్గొనటం. అసలు ఇతని తల్లి భర్త మరణించిన దగ్గఱనుండి దుఃఖంలో మునిగిపోయి అన్నం తినటం మానివేసింది. ఆమె ఎలా బ్రతుకుతుందో ఏమో ఏమీ తెలియటం లేదు."

ఈ విధంగా వారి సంబంధీకుల్ని గుఱించి ఎంతో ఆదుర్దాగా వారిని అడుగడుగునా ప్రశ్నిస్తున్నా గాని వార్తాహరులు ఏమీ సమాధానం చెప్పకుండా లోలోపల ఉన్న దైన్యాన్ని బయటకు తెలియకుండా నడుస్తున్నారు. ఏదో శక్తి ఆవహించినట్టు ఊగిపోతున్నారు. మార్గశ్రమ చేత అవయవ స్వాధీనం తప్పుతోంది వారికి. కాలు ఆడించాలన్నా చాలా శ్రమపడవలసి వస్తోంది. ప్రయాణంవల్ల దుస్తులు మట్టి కొట్టుకు పోయినై. వాళ్ళ శరీరాలు మట్టితో నిండి సంస్కారవిహీనంగా ఉన్నై. జుట్టు నిండా ధూళి పేరుకు పోయింది. మార్గాయాసం, శ్రమ, వికలమనస్కత, దూరదేశ వాస క్లేశం, దుఃఖం వీటికి వీళ్ళు ఉదాహరణగా ఉన్నారు. వారికి మునుముందుగా త్వరితపడున్నాడు.



విలాసవతి వార్తాహరులను చూసింది. ఆ దేవాలయ ప్రాంగణంలోనే కూర్చొని వారిని పిలవమని ఆదేశించింది. వారు దేవి విలాసవతి వద్దకు వచ్చి ఆమెను హఠాత్తుగా చూడటంచేత వారి దుఃఖావేగం రెట్టింపయింది. వారు దోపిడీకి గుఱియై సర్వస్వం కోల్పోయిన వారిలా ఉన్నారు. ఇంద్రియాలను ఎక్కడో వదిలిపెట్టిన వారిలా ఉన్నారు. కొయ్యతో చెక్కబడిన బొమ్మల్లాగా ఉన్నారు. శూన్యశరీరుల్లాగా ఉన్నారు. జీవశక్తిని కోల్పోయిన వారిలా ఉన్నారు. వారినడకలో తేజస్సులేదు. ముందుకు ఎప్పుడు పడిపోతారో అనేటట్లున్నారు. వారి కంట్లో కమ్మిన నీటివల్ల అంధుల్లా ఉన్నారు. భయంచేత వారిపాదాలు నేలపై సరిగా పడటంలేదు. అలాగే కొన్ని అడుగులు ముందుకు నడచి, బొంగురు గొంతులతో, చివఱికి మాతృసమానురాలైన రాజమాతకు నమస్కారం చేయాలనే విషయం కూడా మఱచినవారై ఆమెను గౌరవించకుండానే నిలువబడ్డారు.

విలాసవతి వారి వంక చూస్తూ, "నాయనలారా! చెప్పండయ్యా నా కుమారుని వృత్తాంతం గుఱించి. మీరు అతనిని గూర్చి వేరే విధంగా చెప్పినట్లైతే నామనస్సు అవిశ్వాసాన్ని పొందుతుంది. నా చిట్టి తండ్రి చంద్రాపీడుడు కనపడ్డాడా! లేదా!" అని ఆత్రంగా ప్రశ్నించింది. వారందఱూ వినయంతో నమస్కరిస్తున్నవారిలా నటిస్తూ తలలు క్రిందకు వంచి వేగంగా ప్రవిస్తున్న కన్నీటి ధారను ప్రకటింపక జాగ్రత్త పడ్డారు. ఎలాగో గొంతు పెగల్చుకొని ముఖాలు పైకెత్తి ఇలా విన్నవించారు – "తల్లీ! యువరాజులవారు మాకు అచ్ఛోద సరస్తీరంలో కనపడ్డారమ్మా! ఇంకా మిగిలిన వివరాలు ఈ త్వరితకుడనే బాలుడు మీకు వివరిస్తాడు" అని వారు అంటూ ఉండగానే కన్నీరు ఉబుకుతుండగా వారితో, ''ఈ అమాయిక బాలుడేం చెపుతాడట? దూరంనుంచే నేను మిమ్మల్ని గమనిస్తూనే ఉన్నాను. మీ ముఖాల్లో సంతోషం ఏ మాత్రం లేదు. నా వద్దకు రావటంలో సంకోచం, శిరస్సులపై పూలమాలలు ధరింపలేదు. మీ కళ్ళలో దీనత్వం కొట్టొచ్చినట్టు కనబడుతున్నది. ప్రయత్న

పూర్వకంగా కన్నీటిని ఆపుకొంటున్న ఆందోళించే నేత్రాలు. నాపై దృష్టిని నిల్పలేకపోవటం – ఇవన్నీ మీరు నోరు విప్పి చెప్పకపోయినా చెపుతూనే ఉన్నై. నోటితో కాకుండా ఆకారాలతోనే మీరు చెప్ప వలసినది చెప్పారు. ఇంకా త్వరితకుడు చెప్పే దేముంటుంది!

"ఓ తండ్రీ! జగదేకచంద్రా! చంద్రాపీడా! చంద్రముఖుడా! చంద్రుని వంటి చల్లని స్వభావంకలవాడా! చంద్రునిలాంటి సుగుణాలు కలవాడా! కన్నుల కింపైన రూపంకలవాడా! నాయనా! ఏమైందిరా నీకు? ఇంతవఱకు ఎందుకు రాలేదు? నీపై కోపంతో నేను మాట్లాడటం లేదురా, మనోబాధతో అంటున్నాను. "అమ్మా! నిన్నొదిలిపెట్టి ఎప్పుడూ ఆలస్యం చెయ్యనమ్మా అని నా ఎదుట అన్నవాడివి గదా! మరిప్పుడిలా ఎక్కడో కనుమఱుగై రాకపోవటం ఏమన్నా బాగుందా నాయనా? నీవు నా వద్ద సెలవు తీసుకొని వెళ్ళేటప్పుదే నా మనస్సున కనిపించింది 'మరల వీని ముఖాన్ని చూడగలనో లేదో, అని. అందనంత దూరాలకు వెళ్ళావు. ఏం చెయ్యనునేను. ఇందులో కుమారుని దోషం ఏముంది? నేను చేసుకొన్న పాపాలే ఈ విధంగా వాటి ప్రభావం చూపిస్తున్నై. ఎంతటి పాపాత్మురాండ్రైనా లోకంలో ఉండవచ్చు నేమోగాని నా అంతటి పాపిష్ఠిది ఎక్కడా ఉండదు. నీవు నాకు ఒక్కగా నొక్క కొడుకువు కదా! కారణం లేకుండా ఇలా ఎక్కడకు వెళ్ళిపోయావు? దుష్టదైవం చేత ఘోరంగా వంచింపబడ్డాను. నాయనా! నీ వెంత దూరంలో ఉన్నావో తెలియదు కాని, నీ కాళ్ళమీద పడతానురా. ఒక్కసారి తిరిగిరారా నాయనా! 'అమ్మా' అని నీవు నోరారా కమ్మగా పిలిచే నీ ముద్దుల ముఖాన్ని ఒక్కసారి చూడాలని ఉందిరా. నాయనా! నా చేతి కందనివాడా!

నీవు పుట్టిన దగ్గఱనుండి శిశుత్వం దాటేంతవఱకు నిన్ను, నీ బాల్యచేష్టలను తలచుకొని దుఃఖించాలా, లేక యౌవనంలోకి అడుగు పెట్టిన నీ రూపశోభను చూసి దుఃఖపడాలో నా కర్థం కావటంలేదు. లేకపోతే రాబోయే కాలంలో అష్టైశ్వర్యసంపన్నుడవు కాబోయే నిన్ను తలుచుకొని దుఃఖపడాలా?



నేనంటే అంత ప్రేమ కలిగిన మా అమ్మ నాకు ఆపద కలిగినప్పుడు నేను లేనని తెలిసి కూడా ఏడుస్తోంది. ఇంకా జీవించే ఉండని మనస్సులో అనుకోకు నాయానా! నేను నీవు లేకున్నప్పటికి జీవించియే ఉండి నీ తండ్రి ముఖం ఎలా చూడగలిగానో ఏమో నాకు తెలియటం లేదు. నాకు నీమీదుండే ప్రేమచేతనో, నీ మీదున్న విశ్వాసంతోనో, స్త్రీ జనసహజమైన మూఢస్వభావం చేతనో నా హృదయం నిన్ను గూర్చి కీడు శంకించటం లేదు. ఎందుచేతనో హృదయం ఎందుకు వేయి ముక్కలుగా బ్రద్దలవటం లేదో! ఇప్పుడే త్వరితకుడు చెప్పిన వార్తను స్పష్ట పరచటానికి, కూడా నేను ఇష్టపడటంలేదు. వినకూడని మాట వినటం దేనికని నేను విరమించుకొన్నాను అడగటానికి. మతి కుమారునిపై నున్న ప్రేమకు వ్యతిరేకంగా లోకానికి సిగ్గు కలిగే విధంగా ఏడవటం దేని కని అడిగితే నేను సమాధానం ఏమీ చెప్పలేను. అందువల్లనే నీ గూర్చి అడగటానికి ఇష్టం లేక మౌనంగా ఉన్నాను. నేను దుఃఖించను" అని విలాసవతి కుమారుని గూర్చి వివిధ కోణాల్లో ఆలోచించి పలికింది. ఆ ఉద్రేకంతో చెలికత్తెల చేతిలోనే సొమ్మసిల్లి పడిపోయింది.

సఖులు మిక్కిలి సంభ్రమంతో అసంఖ్యాకంగా బయలుదేరి ఆ వృత్తాంతాన్ని తారాపీడునకు తెలియ జెప్పారు. అప్పుడు తారాపీడుడు మందర పర్వతం వలన కల్లోలమైన పాలసముద్రంలాగా ఆందోళన చెంది, తొట్రుపాటు తోలేచి, ఆర్యశుకనాసులను వెంటపెట్టుకొని చతుఃస్తంభ మంటపానికి దగ్గఱలోనే ఉన్న మిక్కిలి వేగంగా పరుగెత్తగల ఆడు ఏనుగునెక్కి రాజమార్గాన్ని మింగివేస్తున్నట్టుగా బయల్దేరాడు. ఈ హఠాత్సంఘటనకు ప్రజలు త్వరగా లేచి దారి వదులుతూ ప్రక్కలకు తప్పుకొంటూ 'ఏమైంది? ఏమైంది' అని అరుస్తూ గందరగోళం చేశారు. తలకొకవైపుకు పఱుగులు పెట్టారు.

ఈ విధంగా మహారాజు తారాపీడుడు మంత్రితో పాటు నగరంనుండి బయలుదేరాడు. కాస్సేపట్లో అవంతీ మాతృదేవతల ఆలయానికి వచ్చారు. అక్కడి చెలికత్తెలు విలాసవతికిన పర్యలు చేస్తున్నారు. కొందరు చందన ద్రవాన్ని

చిలకరిస్తున్నారు. అరటి యాకులతో విసరుతున్నారు. తడిచేతులతో శరీరాన్ని గట్టిగా రాస్తున్నారు. పరిజనులు ఎలాగైనా మహారాణికి స్పృహ తేవటానికి కృషిచేస్తున్నారు. సగం తెఱచిన కనులతో వాడి పోయిన పద్మంలాగా ఉన్న ముఖంతో ఉన్న విలాస వతిని చూశాడు. వెంటనే కనుల నీరు బొటబొటా కారుతూ ఉండగా ఆమెను పూర్తి స్పృహలోకి తీసుకురావటానికి ముఖాన నీళ్ళు జల్లుతున్నాడు. ఆయన విలాసవతి ప్రక్కనే కూర్చొని ఆమె శరీరాన్ని తడుముతూ, కన్నీటితో గద్గద కంఠంతో, “దేవీ! మన కుమారునికి వేరే విధంగా ఏదైనా ప్రమాదం సంభవిస్తే మనం బతకలేము. అటువంటప్పుడు కుమారుని గూర్చి సామాన్యజనుని లాగా దుఃఖవికారంతో అనవసరంగా నిన్ను నీవు ఆయాస పెట్టుకోవటం దేనికి? మనమెన్నో పుణ్యాలు చేశాం. ఇంకా అంతకంటే మనం ఏమి చేయాలి? మనం గొప్పగా సంతోషపడేంత అదృష్టవంతులం కాదు. ఎంతగుండెలు బాదుకున్నా సంపాదించని దానికి ఫలితం రావాలంటే ఎలా వస్తుంది. మనపైన విధి అనేవాడు ఒకడున్నాడు. ఆ విధి తనకు ఎలా చేయాలనిపిస్తే అలానే చేస్తాడుకాని మనం కోరింది చెయ్యడు. ఆ విధి ఎవరికి లోబడి ఉండడు. స్వతంత్రుడు. అతడు పరాధీనుడే కనక అయితే మనబోటి వారికి లభింపని  దెక్కడుంటుంది. మన పిల్ల వాడు పుట్టినప్పుడు మహోత్సవాలు జరిపాము. ఒళ్ళో కూర్చుండ బెట్టుకొని వాడి ముద్దు మొగాన్ని కనులారా చూశాం. వెల్లకిల పడుకొన్న పసివాణ్ణి ముద్దులు పెట్టుకొని చిన్ని పాదాలను నెత్తిన పెట్టుకొన్నాం. మోకాళ్ళపై పాకే పిల్లవాని మట్టి కొట్టుకున్న శరీరాన్ని ఒళ్ళో పెట్టుకొని స్పర్శ సుఖం అనుభవించాం. వాడు ఎదిగి వచ్చీరానితొక్కు పలుకులను చెవులార విన్నాం. ఆడుతూ పాడుతూ పలికే ముద్దుమాటలు విన్నాం. చదువులునేర్చి గుణవంతుడయ్యాడని సంతోషించాం. యౌవనవంతుడైన వాని యొక్క అమానుషరూపశోభను, శక్తిని మన కండ్లతో చూశాం. యౌవరాజ్య పట్టాభిషిక్తుడైన పుత్రుని శిరస్సును వాసన చూశాం. దిగ్విజయ యాత్రచేసి వచ్చి పాదాభివందనం చేస్తే వానిని



గాఢాలింగనం చేసుకొన్నాం. మనకు అంతవఱకే కోరికలు తీరినై. వధూసమేతుడైన కుమారునికి నా సింహాసన మిచ్చి తపోవనగమనం చేసే అదృష్టం మాత్రం లేదు. మహా పుణ్యరాశిని సంపాదించిన వారికే సమస్త వాంఛలు ఈడేరేది. అసలు మన పుత్రునకు ఏం జరిగిందనే వార్త మన కింతవఱకు ఎవరునూ చెప్పలేదు. ఏదో సేవకులు మాట్లాడుకుంటున్నప్పుడు అస్పష్టంగా కొంత విన్నాను. వాడెవడో త్వరితకుడనే బాలసేవకుడు మన వార్తాహరులతో పాటు నాకేదో చెప్పాలని వచ్చాడని విన్నాను. అతనికే జరిగిన విషయాలన్నీ తెలుసు. నీవు కూడా అతనిని ఏమీ అడగలేదు. సరే మనమే అతనిని ఏం జరిగిందో చెప్పమని అడుగుదాం. పుత్రుడు జీవించి ఉన్నాడని చెప్పినా, మరణించాడని చెప్పినా అంగీకరిద్దాం” అని తారాపీడుడు పలుకగా ప్రతీహారి పరిజనుల మధ్యలో ఉన్న త్వరితకుణ్ణి తీసుకొని వచ్చి రాజుకు చూపించాడు. త్వరితకుడు చక్రవర్తికి తలవంచి నేల కానించి పాదాభివందనం చేశాడు. “ప్రభూ! ఇతడే త్వరితకుడు. ఇతడు మీకు వార్తను తెలియజేస్తాడు” అన్నాడు ద్వారరక్షకుడు.

చక్రవర్తి అప్పుడు త్వరితకుని చూశాడు. పుత్రప్రేమతో “రా నాయనా రా!” అని తన చేతితో అతని శిరస్సు నిమిరి, ఇలా అన్నాడు – “నాయనా! అక్కడ నా కుమారుని కేమయింది? ‘త్వరగా యింటికి రారా’ అని నేను, అతని తల్లి, ప్రధానామాత్యుడు కబురుపంపినా ఎందుకు రాలేదు? రాకపోతే పోనీ, ఎందుకు రాలేకపోతున్నాడో కూడా తెలియపరచ లేదెందుకని?” అని త్వరితకుడు రాజా దేశానుసారం చంద్రాపీడుడు అక్కడికి వచ్చిన దగ్గఱనుండి జరిగినదంతా చెప్పటం ప్రారంభించాడు. తారాపీడుడు చంద్రాపీడునిగుండె బ్రద్దలైన వృత్తాంతం వినగానే రాజు మిక్కిలి మనోవ్యధను పొంది దుఃఖ సముద్రంలో మునుగుతూ చెయ్యి పైకెత్తి”, ఒరే నాయనా! ఇక చాలు. చెప్పటం ఆపరా! నీవు చెప్పాల్సిందేదో చెప్పేశావు. నేను కూడా వినాల్సిందేదోవిన్నాను. ఇక నువ్వు చెప్పనూ వద్దు, నేను విననూ వద్దు. నా ప్రశ్నాభిలాష

పరిసమాప్తమైంది. వినాలనే కుతూహలం తీరింది. నా చెవి కృతార్థత్వాన్ని పొందింది. హృదయం ఆనంద పరిపూర్ణమైంది. ప్రీతి కలిగింది. నేను సుఖంగా ఉన్నాను. ఓ పుత్రా! ఒంటరివాడవై గుండెలు పగిలేటప్పు డెంత బాధపడ్డావో కదా! నువ్వు వైశంపాయనుని మీదఎంతో స్నేహాన్ని చూపావు. మేము దుఃఖభాగులం. క్రూరాతిక్రూరులం, కర్మచండాలురం. మేము నీవు గుండెలు పగిలి మృతి చెందినా నిశ్చింతగా ఉన్నాం కదా! మహారాణీ! మన యిరువురి గుండెలు మామూలు గుండెలు కావు. వజ్రంతో చేసిన గుండెలు. లేకపోతే ఈ పాటికి పగిలిపోయేవే కదా! మన ప్రాణాలకు మరణభీతి అధికంగా ఉంది. మన కుమారుని ప్రాణాలతోపాటు మన ప్రాణాలు అనుసరించి పోవటంలేదు. సరే, ఇకలే – మన పిల్లవాడు చాలా దూరం పోకముందే మనం కూడా వానితో పోవటానికి ప్రయత్నిద్దాం ఒంటరివాడు ఒక్కడే పోలేదు.

## 77. శుకనాసుడు తారాపీడాదుల నోదార్చుట

ఏమయ్యా! శుకనాసుడా! ఇంక ఎందుకలా ఏడుస్తూ కూర్చున్నావు. స్నేహ ధర్మం ఎలాంటిదో తెల్పాలంటే ఇదే మంచి సమయం. మహాకాలుని దేవాలయం సమీపంలో చితులు ఏర్పాటు చేయించు. దారు రక్షకులారా! ఎండుకట్టెల్ని పేర్చండి. కంచుకులారా! ఎందుకు సంకోచిస్తున్నారు మీరు? త్వరగా వెళ్ళి అగ్ని ప్రవేశానికి కావలసిన సామగ్రిని సిద్ధం చెయ్యండి. ఇక ఈ సమయంలో ఏడవటం దేనికి? అనవసరం – మహారాణీ! ఆలస్యం చెయ్యకుండా మన రాజధనాన్ని బ్రాహ్మణులకు దానం చెయ్యండి. ఆ ధనం ఇంకా ఎవరికోసం దాచి ఉంచాలి? నా పుణ్యాలు నశించిపోయాయి. సామంతరాజులారా! ఇక మీరు మీ రాజ్యాలకి వెళ్ళి పొండి. మిమ్ము వదిలేస్తున్నాను. మీరంతా చంద్రా పీడుని ప్రజలకు ఎలాంటి కష్టాలు రాకుండా కాపాడండి. నా కుమారుడు ఈ విధంగా వార్తలలో మిగిలి పోయేవాడైనాడు, అతని స్థానంలో వేఱొక రాజును ఎవనిని పాలకునిగా నియమించను?" అని ఆర్తప్రలాపాలు చేస్తున్నాడు. తారాపీడుడు దుఃఖ పరవశుడైనాడు.



విలాసవతిని ఆధారంగా పట్టుకొన్నాడు. త్వరితకుడు మిక్కిలి ఆర్తిచెందినవాడై ఇలా అన్నాడు –

"మహా ప్రభూ! యువరాజు హృదయం బ్రద్దలైనా శరీరంతోనే ఉన్నాడు. శాపదోషంతో వైశంపాయనుడు వేఱొక జన్మమెత్తినట్లే ఇదేను." ఆ మాట విని తారాపీడుడు ఆశ్చర్యపరవశుడయ్యాడు. శోకవేగం తగ్గింది. కన్నులార్పటం మఱిచిపోయాడు. ఏదో శక్తి ఆవహించిన వానిలాగా కదలకుండా కళ్ళకు కట్టినట్టు బాలవార్తాహరుడు విలపిస్తూ ఉంటే మొత్తం విన్నాడు. విస్మయం చెందాడు. చంద్రాపీడుడు బ్రతికి యుండినట్లు నిరూపించే అనేక చిహ్నాలు శ్రద్ధగా విన్నాడు. దుఃఖ కారకమైనది ఆ విషయం. విస్మయాన్ని కలిగిస్తోంది. వినరానిది విస్మయం కలిగిస్తుంది. యువరాజ వైశంపాయనుల వృత్తాంతం శ్రద్ధగా విన్నాడు. తనలాగే విస్మయాశ్చర్యాలతో ఉన్న శుకనాసుని వంక చూశాడు. మిత్రుడన్నవాడు. తన దుఃఖాన్ని దిగమ్రింగుకొని మిత్రుని దుఃఖాన్ని నివారించాలనుకొంటాడు. అలాగే శుకనాసుడు తన దుఃఖాన్ని ప్రక్కకు పెట్టి మహారాజు దుఃఖాన్ని నివారించాలని ఇలా రాజుతో అన్నాడు–

"ప్రభూ! ఈ ప్రపంచం పోకడ మిక్కిలి విచిత్రమైంది. సుఖదుఃఖాల మయమైన దేవతలు, పశుపక్ష్యాదులయందు మానవులయందు సత్త్వరజస్తమో మయాత్మకమైనట్టి లోకమునందు, పరమాణువునుండి బ్రహ్మాండము వఱకు, సృష్టిస్థితిలయాత్మకమైనట్టి లోకమునందు ఈశ్వరేచ్ఛతో ధర్మాధర్మ సాధనములకు, ఇష్టానిష్ట ఫలాన్ని పొందే కర్మలకు, శుభాశుభ ఫలితాలకు కారకుడైన పరమాత్మ ఒక్కడే అనేకరూపాలతో సృష్టి, స్థితి లయాదులు చేస్తూ స్థావరజంగమాలకు ఎప్పుడేది అనుభవింప చేయాలో అది అనుభవింప చేస్తాడు. దానికి మనం కారణ మాత్రులం కాదు. కావున ఈ విషయంలో ప్రభువులు ఎందుకు ఆలోచిస్తున్నారు? అంతా దైవేచ్ఛతో నడుస్తున్నది.

అదీకాక సర్వవిజ్ఞానానికి వేదాలు ప్రమాణం. వాటి ఆంతర్యాన్ని వెల్లడించే రామాయణ భారతాదులయందు అనేక శాపవృత్తాంతాలు మనకు కనిపిస్తున్నై.

ఎట్లంటే మహేంద్ర పదవిలో ఉన్న నహుష చక్రవర్తికి అగస్త్యశాపం వలన కొండచిలువ రూపంలోకి మారాల్సివచ్చింది. సౌదాసునకు వశిష్ఠసుతుని శాపం వలన రాక్షసరూపం వచ్చింది. శుక్రాచార్యుల శాపం వలన యయాతి మహారాజునకు యౌవనంలోనే వార్ధక్యం కలిగింది. త్రిశంకునకు తండ్రి శాపము వలన చండాలత్వం కలిగింది. బ్రహ్మలోకంలో స్థానం సంపాదించిన మహాభిషుడనే రాజు బ్రహ్మ శాపంవలన భూలోకంలో శంతన మహారాజుగా జన్మించాడు. ఆయనకు భార్యగా వచ్చిన గంగ ద్వారా ముని శాపం వలన అష్టవసువులు భూలోకంలో మానవులుగా జన్మించారు. ఎవరో ఎందుకు? శ్రీమన్నారాయణుడు రావణాదిరాక్షససంహారార్థం దశరథుని యందు నలుగురు పుత్రులుగా జన్మింపలేదా? అలాగే మథురానగరంలో శ్రీకృష్ణుడు మానవుడుగా జన్మించాడు. మనుష్యులకు దేవతాంశలు కలవారు జన్మించటం అసాధ్యమేమీకాదు. ఒక్కొక్కప్పుడు పూర్వమనుజుల కన్న దేవుడే తక్కువ స్థాయిలో ఉంటాడు. ఒక రీతిలో కమలనాభుని కన్న చంద్రుడు గొప్పవాడైనాడు.

అలాగే విలాసతీదేవి గర్భం కలిగేటప్పుడు ఆమె నోటియందు పూర్ణ చంద్రుడు ప్రవేశించినట్లు కనిపించాడు. నాకు కూడా తెలతామర (పుండరీకం) కనబడింది. వారి ఉత్పత్తి విషయంలో మనమెంతమాత్రం సందేహ పడరాదు. శరీరంలో నుండి ప్రాణాలు వెళ్ళి పోయినప్పటికిని మరల పునర్జీవితుడైనాడు అనేమాట అన్నిచోట్ల వినిపిస్తోందంటే దానికి కారణం అమృతం ఒక్కటే. చంద్రునిలో అమృతత్వం ఉన్నది అనేమాట లోకంలో ప్రాచుర్యం పొందే ఉన్నది. మన విషయంలో కూడా అంతా అలాగే జరిగిందని ప్రభువులు గ్రహించాలి. ఇంకొకటి ఏమంటే! – చంద్రాంశ లేకపోతే మన యువరాజుగారికి తప్ప అంత చక్కని ఆకారం, కాంతి, సకల లోకాహ్లాదకత్వం వేరెవరికి కలగనే కలగవు కదా! సకల కల్యాణగుణాలతో కూడినవాడై శాపాన్ని తీర్చుకున్న వాడై గంధర్వ రాజకుమార్తెను పెండ్లియాడి, ఆనందబాష్పాలతో వధువుతో కూడి మీ పాదాలపై పడి నమస్కరిస్తున్న మీ పుత్రుడుగా జన్మించిన



ఆ లోకపాలకుడైన చంద్రుని యొక్క అంశతో జన్మించిన చంద్రాపీడుని చూసుకొని పుట్టిన దగ్గఱనుండి కలిగిన సంతాపాలన్నీ వదిలి పెట్టేస్తారు మహాప్రభువులు. వారిరువురికి తగిలిన శాపాలు మనపాలిట వరాలే. అందు వల్ల ఇక మీద ఈ విషయంలో మీరు గాని మీ ధర్మపత్ని గాని దుఃఖపడకూడదు. ముందు ముందు మనకు కలిగేవన్నీ శుభాలే. ఇష్ట దేవతారాధన వలన, దాన ధర్మాలు చేయటం వలన క్రిందటి జన్మలలో సంపాదించిన పుణ్యఫలం వృద్ధి చెందుతుంది. అశుభాలన్నీ యమనియమాల వలన, కష్టసాధ్యాలైన వ్రతా చరణ వలన తపస్సాధన వలన నాశనమైపోతాయి. ఈ శుభవార్త మన మీ రోజున విన్నాం కనుక ఆ పుణ్యకార్యాలన్నీ ఈ రోజునుండే ప్రారంభిద్దాం, చేయిద్దాం, చేద్దాం. వైదిక క్రియలకు గాని లౌకిక క్రియలకు గాని లోకంలో అసాధ్యం అనేది ఏదీ లేదు" అని శుకనాసుని సుదీర్ఘోపదేశాన్ని విన్న దుఃఖంలోనే తారాపీడుడు ఇలా అన్నాడు –

"ఆర్యా! మీరు వేదాంతతత్త్వాన్ని మథించి చెప్పినవన్నీ సత్యాలే, కాని సామాన్యుల కెవరికి అర్థమౌతాయి? మీరు తప్ప మాకిటువంటి వాక్యాలు వేరెవరు చెప్పగలరు? అయితే వైశంపాయనుని అకాలమరణం గూర్చిన హృదయావేదన తలచుకొన్నప్పుడల్లా కనుల ఎదుట కనపడినట్లే ఉంది. అదే చూస్తున్నాను. అదే వింటున్నాను. దాన్నే ఊహిస్తున్నాను అతని ముఖం గుర్తుకు వచ్చినపుడల్లా నన్ను నేను మనస్సు నిగ్రహించుకోలేక పోతున్నాను. నా విషయమే ఇలా ఉంటే ఇక నేను విలాసవతిని ఏమని ఓదార్చగలను? అక్కడికి వెళ్ళటం తప్ప జీవితం నిలుపుకొనేందుకు వేరే ఉపాయమేదీ నాకు కనపడటంలేదు. మీరున్నూ పరిస్థితి గ్రహించండి" అని

ఆ మాటలు విన్న విలాసవతి, పెద్దవాడు మహామాత్యుడెదుట ఉన్నాడన్న సంకోచం కొంచం కొంచెం కూడా లేకుండా, ఎప్పటినుంచో పుత్రశోకంతో కుమిలి పోతున్నదై పెద్దగా పలికింది – "ఆర్యపుత్రా! అలాగయితే ఇంకా మీరు ఆలస్యం చెయ్యటం దేనికి? మేమూ బయల్దేరతాం. ప్రయాణాను

మతినీయండి. పిల్లవాణ్ణి చూడాలని నా మనస్సు వేగిర పడుతోంది" అని ఆమె ఇలా అంటూ ఉండగానే శుకనాసుని తో సమానుడు, వయోవృద్ధుడు, అధ్యయన అధ్యాపనాదిషట్కర్మాచార పరాయణుడైన బ్రాహ్మణోత్తముడు విలాసవతి వద్దకు వచ్చి, స్వస్తి వాక్యాలు పలికి, "దేవీ! అంతటా నిశ్చయత లేని వార్తల వల్ల కలిగిన ఆందోళనతో హృదయం తల్లడిల్లుతున్న మనోరమాదేవి తనంత తాను పరుగులు తీసి వచ్చియుంది. ప్రభువులున్నారని సిగ్గుపడి ఇక్కడికి రాలేకపోతోంది. అందువల్లనే మాతృదేవతా గృహం వెనుక నిలబడి ఉంది. మిమ్మలను గూర్చి అడిగింది. ఏమంటున్నారు వార్తాహరులు? మా అబ్బాయి వైశంపాయనుడు బ్రతికి ఉన్నాడా? శరీరారోగ్యం బాగున్నదా? మావాడు యువరాజును కలిశాడా? అసలు ఎక్కడున్నాడు? ఎన్ని రోజులకు చంద్రాపీడ వైశంపాయనులు ఇక్కడకు వస్తారో!" అని మనోరమ అడిగిందని ఎఱుకపఱచాడు.

అది విన్న తారాపీడుడు బాధ చెంది విలాసవతితో, "దేవీ! మన పిల్లలకు కలిగిన ఆపద గుఱించి మీ ప్రియసఖికి తెలియదు. ఇతరుల వలన వింటే ప్రాణాలతో కూడ ఉండలేక పోవచ్చు. కనుక ఇకలే! నీవే వెళ్ళి ధైర్యంతో జరిగిన వృత్తాంతమంతా చెప్పి మీస్నేహితురాలిని మనతో పాటు అక్కడికి వచ్చేటట్టుగా సిద్ధం చెయ్యి" అని ఆమెను లేపి, సపరివారంగా విలాసవతిని మనోరమ వద్దకు పంపించాడు. తనతోపాటుగా శుకనాసుని తీసికొని వెళ్ళుటకు ఏర్పాటు చేయించాడు.

## 78. తారాపీడకశుకనాసాదులు చంద్రాపీడుని వద్దకు వచ్చుట

తారాపీడ మహారాజు సరస్తీరానికి బయలుదేరగా, రాజుపై ఉండే ప్రేమతోనూ, చంద్రాపీడునిపై ఉన్న స్నేహంతోనూ ఈ ఆశ్చర్యకర సంఘటనను చూడాలనే కుతూహలంతో మొదట జైత్రయాత్రకు వెళ్ళిన తంద్రులు, కుమారులు, సోదరులు మిత్రులను చూడటానికి ఇంటి కాపలావారిని తప్పించి



మిగిలిన ఉజ్జయినీ వాసులందఱూ రాజుతో బయలుదేరారు. అయితే రాజు ఇంతమందితో ప్రయాణం వల్ల ఆలస్యమౌతుందని చెప్పి వారిని ఇళ్ళకు మఱలించి కొద్దిమంది వేగవంతులతో కొద్ది పరికరాలతో వేగంతో దారిని త్రాగివేస్తున్నట్లుగా ప్రయాణం ప్రారంభించాడు. ఒక్కరోజు ప్రయాణంలోనే గమ్యం చేరాలనే తొందఱతో తారాపీడుడు తెలిసినవారిని మాటమాటకు ఎంత దూరం వచ్చాం? ఇప్పటికి, ఇంకెంత దూరం వెళ్ళాలి? అని అడగ సాగాడు. మనమింకా ఎన్ని రోజులకు చేరుకొంటాం అని తఱచుగా గుఱ్ఱంపై వస్తున్న త్వరితకుని ప్రశ్నిస్తున్నాడు. ఎక్కడా ఆగకుండా ప్రయాణం కొనసాగించటంచేత కొద్దిరోజులలోనే వారు అచ్ఛోద సరస్సుకు చేరుకొన్నారు. తాము వస్తున్న వార్తను ముందుగా త్వరితకునితో పాటు కొందఱిని రౌతులను పంపాడు. తారాపీడుని మనస్సులో వందల అనుమానాలు ఊగిసలాటలు సంభవిస్తున్నై.

కొంతసేపటికి ముందు పంపిన రౌతులతో పాటు ఒక రాజబృందాన్ని నడిపించుకొంటూ మేఘనాదుడు వస్తూ కనిపించాడు వారికి మేఘనాదుడు శరీరసంస్కారం వదిలేశాడు. మలినంగా, కృశించినదిగా శరీరం కనిపిస్తోంది. శిరమును నేలకు వంచి నమస్కరిస్తున్నాడు. కన్నీరు కారుస్తున్న అతని ముఖం అతిదీనంగా ఉంది. తానింకా బ్రతికి ఉన్నందుకు సిగ్గు పడుతూ పాతాళ లోకానికి వెళ్ళాలన్నట్లుగా ఉన్నాడు. తారాపీడుని ఎదుట పడుటకు యిష్టపడక వారి వెనుక వీరివెనుక వస్తున్నాడు. సంపూర్ణదేహుడై ఉండి కూడా గాయపడిన వాని లాగా ఉన్నాడు. పరివారంబట్టూ ఉన్నా దోచు కోబడిన వానిలాగా ఉన్నాడు. బ్రతికి ఉన్నా మరణించినట్లున్నాడు. వేగంగా ముందుకు వస్తున్నప్పటికి ఎవరో పట్టిలాగితే వెనుకకు పోతున్నట్లున్నాడు. శరీరావయవాలతోపాటు ఉత్సాహం నీరు కారిపోయింది. ధనుస్సును వదలినట్లు తనను తాను వదిలివేశాడు. నీరసించిపోయిన రూపంతో మేఘనాదుడు, అతని వెనుక చంద్రాపీడుని పాదసేవనమే జీవితావధిగా కలిగిన రాజ పుత్రసమూహం వస్తున్నది.

తారాపీడుడు తమకు స్వాగతం పలకటానికి వస్తున్న మేఘనాదాదుల్ని (రాజలోకాన్ని) చూశాడు. అతడు సంతోషంతో విప్పారిన నేత్రాలతో శోకంచేత పీడింపబడుతూనే కొంత ఉపశాంతి పొందినవాడై, చంద్రాపీడుని దేహం చెడిపోలేదని విశ్వాసం బలపడగా, వెనుకకు మఱలి ఏనుగు అంబారీలో తెరల మధ్య ఉన్నరాణిని తెర తొలగించి చూస్తూ, "దేవీ! భాగ్యవశాన అభివృద్ధి పొందు. మన కుమారుడు ప్రాణాలతోనే ఉన్నాడు. సత్యమే ఎందుకంటే నిత్యము చంద్రాపీడుని పాదములనర్చించుకునే ఈ రాజలందఱూ అతని వద్దనుండే వస్తున్నారు" అని పలికాడు.

ఆ మాటలు విని ఆమె సంతోషించి, తన చేతితో అంబారీ వస్త్రాన్ని కొంచెం తొలగించి, తన కుమారునితో సమానులైన రాజకుమారుల్ని చూసి నేత్రనుండి దుఃఖబాష్పాలు రాలుస్తూ ఉన్నదై దైన్యంతో, "నాయనా! చంద్రాపీడా! దుమ్ముతో కూడిన ఈ రాజకుమారులలో నీ వొక్కడవే కానరాకున్నావేమి?' అని రోదిస్తూ ఉన్న మహారాణిని ఓదార్చి, దూరంగా తలలు నేల కానించిన సేనతోపాటు నమస్కరిస్తున్న మేఘనాదునితో 'ఇటురా' అని పిలచాడు. మేఘనాదుడు ప్రభువువద్దకు వచ్చాడు. రాజు అతనితో, "మేఘనాదా! నా కుమారుని కేమైందో వివరంగా చెప్పు" అని అడిగాడు. అతడు, "ప్రభూ! చేతనత్వం లేకపోవటం చేత శరీరంలో కదలిక లేదన్నమాటేగాని, రోజులు గడచినకొలదీ శరీరకాంతి రోజు రోజుకూ అధికమవుతోంది." అని బదులిచ్చాడు మేఘనాదుడు.

ఆతని వాక్యాలను విన్న తారాపీడునకు కుమారునకు ప్రాణాలు వస్తాయి– అనే నమ్మకం కలిగింది. రాణితో, "ఏమమ్మా! విన్నావా? మనకు మనం కృతార్థులమౌదాం. కుమారుని సుందరవదనం చూద్దాం" అని అంటూనే ఆడు ఏనుగును వేగ గతితో నడిపించి మహాశ్వేతాశ్రమం చేరాడు.

తన కుమారుని చూడడానికి తారాపీడుడు భార్యా మంత్రికుటుంబంతో సహా బయల్దేరి వచ్చాడని తెలిసింది మహాశ్వేతకు. కన్నీటిబిందువులు వెదజల్లిన



నక్షత్రాల సమూహంలాగా, ముత్యాలలాగా మెరుస్తు రాలుతుండగా, "అయ్యో! ఇప్పుడెలా? నేను పాపాత్మురాలిని, దుఃఖయోగ్యను నేను మాత్రం మరణింపకుండి చెడు మాత్రమే ఆపాదించే దుష్ట విధిచేత మోసగింపబడినాను. వారికి నామొగం ఎలా చూపను?" అని అంటూ పరుగెత్తి సిగ్గుతో గుహలోకో పోయి దాగుకొంది.

చిత్రరథుని కుమార్తె కాదంబరి కూడా అక్కడకు గుంపుగా వచ్చిన చెలికత్తెల చేతులలో బిగిసిన శరీరంతో మూర్ఛలో మునిగింది. వారిద్దరి పరిస్థితి అలా ఉండగా, శుకనాసుని అండగా చేసికొని తారాపీడుడు ఆశ్రమంలోకి ప్రవేశించాడు. తరువాత మనోరమను ఆధారంగా చేసుకొని విలాసవతి కన్నీరుతో నిండిన దృష్టిని ముందుకు ప్రసరింపజేస్తూ, "ఏడీ మా కుమారు డెక్కడున్నాడు?" అని ఆత్రంగా అడుగుతూ అక్కడకు వచ్చింది. ఆ సమీపంలో ఉన్న తన కుమారుని శరీరం చూసింది. అతని శరీరంలో కాంతి ఏమాత్రం తగ్గలేదు. అలా పడుకుని ఉన్న వానిలా ఉన్నాడు. అలా ఉన్న తన కుమారుని వద్దకు రాబోయింది. తారాపీడుడు దగ్గఱకు రాకుండానే ముందుకు కదిలింది విలాసవతి. మనోరమను కూడా చేత్తో దూరంగా నివారించింది. బారుగా చేతులు బాచి ఉద్వేగంతో స్రవిస్తున్న కన్నీటి ధారలతో భూమిని తడుపుతూ, "రారా నా తండ్రీ రా! నాయనా! నాకింత అందని వాడవైనా వేమిటి? ఇంత కాలానికి కనబడ్డావు, నాకు జవాబు చెప్పవేమిరా? ఒక్కసారి నావంక చూడు నాయనా! నీ పరిస్థితిని చూసుకో! లేచిరా, నా ఒడిలో కూర్చొని కుమారుని ప్రేమను నాకు రుచిచూపించు. నీవు చిన్నప్పుడు నా మాట ఎప్పుడూ వినకుండేవాడివి కాదు – మఱి యిప్పుడు నేను ఏడుస్తున్నా నా మాట విననేమి? కుమారుడా! నీకు నాపై ఇంతకోపమెందుకు? కోపమైతే నేను నీ పాదాలపై పడి నిన్ను ఆనంద పెడతాను. ఓ పుత్రుడా! చంద్రాపీడుడా! ఈ వయస్సులో ఉండి కూడా నీపైగల అపార ప్రేమతో నీ కోసం యింత దూరం వచ్చిన నీ తండ్రికి ఎదురు వెళ్ళి పాదాభివందనం చెయ్యరా! అంతటి గురుభక్తి

ఏమైపోయింది? నీ మంచి గుణాలేమైనాయి? ఆస్నేహం ఏది? ఆ ధర్మజ్ఞత ఎక్కడ? తండ్రిపై అమితప్రేమ ఎక్కడ? బంధుప్రీతి ఏది? పరిజన వాత్సల్య మెక్కడుంది? నా దురదృష్టవశాన నీవు అన్నిబంధాల్ని ఒక్క సారిగా వదిలించుకొని నిర్లక్ష్యవైఖరిని అవలంబించి ఎందుకున్నావు? పోనీలే నీ కెలాయిష్టమైతే అలాగే ఉండు. మేము నీ గూర్చి పట్టించుకొనము" అని ఆర్తనాదాలు చేస్తూ మరల మరల అతనిని చేరుకొని శరీరాన్ని గట్టిగా కౌగలించుకొని, శిరమును వాసన చూసి, బుగ్గలు ముద్దు పెట్టుకొని, చంద్రా పీడుని పాదాలను నెత్తిన పెట్టుకొని ఒక్క పెట్టున ఏడ్చింది.

అలా దీనంగా దుఃఖిస్తున్న భార్యను చూసి, తన బాధను దిగమ్రింగుకొని, తారాపీడుడు కుమారుని కౌగలించుకొనక సర్వప్రజల దుఃఖాలను దూరంచేయ సమర్థవంతాలైన బాహువులతో కౌగలించుకొని, "దేవీ! మనం చేసుకొన్న పుణ్యం వలన మన కుమారుడుగా పుట్టాడే కాని, ఇతడు మనం విచారింప కూడని దేవతాస్వరూపుడు. అందువల్ల సామాన్య మానవులకోసం దుఃఖించినట్లు ఇతని గూర్చి దుఃఖపడకూడదు. ఈతని విషయంలో మనం ఎంత దుఃఖ పడ్డా ఏమీ లాభ ముండదు. ఏడ్చి ఏడ్చి గొంతు పగులుతుందే కాని, హృదయం మాత్రం పగలదు. ఏడిస్తే పనికి రాని రోదన ధ్వని వెలువడుతుందే కాని, జీవితం కాదు. ఏడుపు వల్ల వ్యర్థమైన కన్నీరే పడుతుంది కాని శరీరము పడదు.

చంద్రాపీడుని ముఖం చూడకుంటే మనకు బాధాకరమౌతుంది. అతని ముఖదర్శనంచేత ఆ బాధ నివారింపబడుతుంది. వైశంపాయును లోకాంతరగతుడైనాడు కనుక మనం శుకనాసమనోరమలను బాధనుండి వారిని నివారించాలి. మన కోడలు ప్రభావంచేత మనం మన కుమారుడు పునరుజ్జీవితుడైన తర్వాత అతని ముఖం చూసి ఆనందపడతాము. అయితే ఆ కోడలు మనం రావటంచేత దుఃఖోద్వేగం వల్ల స్పృహ కోల్పోయి ఉన్నాది. ఆమెను పేరుతో పిలుస్తూ ఆమె చెలికత్తెలు ఆర్తనాదాలు చేస్తూ స్పృహలోకి



రప్పించాలని ప్రయత్నం చేస్తున్నారు. అయినా ఆమె ఇంకా తేరుకోలేదు. నీ వామెను నీ ఒడిలో కూర్చుండ చెట్టుకొని స్పృహ రప్పించు. ఆ తర్వాత నీ యిష్టం వచ్చినంత సేపు దుఃఖింతువు గాని" అని విలాసవతితో అన్నాడు.

రాజు అన్నమాటలు విన్నరాణి, "ఏదీ నా ప్రాణ రక్షకురాలైన కోడలు ఎక్కడున్నది?" అని అంటూ ఉండగానే చెలులు మూర్ఛలోనున్న కాదంబరిని తెచ్చి ఆమె ఒడిలో చేర్చారు. కాదంబరిని తన ఒడిలోకి చేర్చుకొని మూర్ఛ వలన మూసికొని ఉన్న ఆమె కనులు మఱింత శోభించగా, నిరంతర ధారగా ప్రవిస్తున్న కన్నీటి వలన తడిసిన ముఖాన్ని తనివితీరా చూసింది. చంద్ర లేఖలాగా చల్లగా ఉన్న ఆమె కపోలాన్ని తన కపోలానికి చేర్చుకొంది విలాసవతి. నుదురుకు నుదురు, కళ్ళకు కళ్ళు చేర్చి ఆనించుకొంది. ఎల్లప్పుడూ చంద్రాపీడుని తాకటంచేత చల్లనైన చేతితో ఆమె హృదయాన్ని తాకి, "అమ్మా! ఓదార్పు వహించియుండు తల్లీ! మృతుడైన దగ్గఱనుండి ఇప్పటిదాకా నీవే కదా నా కుమారుని శరీరాన్ని కాపాడిన దానవు! నీవు అమృతమూర్తివిగా జన్మించావు కనుకనే నేను నా కుమారుని ముఖాన్ని చూడగలిగాను" అని పలికింది.

అప్పటికి కాదంబరి చంద్రాపీడుని పేరు వినటంవల్ల, విలాసవతి అత్యంత ప్రేమపూరితమైన చేతిస్పర్శ వలన మూర్ఛనుండి తేఱుకొంది. స్పృ హలోకి వచ్చిన ఆమె సిగ్గు పడుతుండగా ఆమె ఒడిలోనుండి మదలేఖ కాదంబరిని ఈ వలకు తెచ్చింది. కాదంబరి మైకంలో ఉండికూడా పెద్దలకు వరుస క్రమంలో పాదాభివందనాలు చేసింది. వారు ఆయుష్మతీ! దీర్ఘసుమంగళీ భవ' అని ఆశీర్వదించారు. మదలేఖ ఆమెను విలాసవతికి సమీపంలో కూర్చుండబెట్టింది.

## 79. తారాపీడుడు వైరాగ్యం పొందుట

కాదంబరి స్పృహలోకి రావటంతో తారాపీడుడు కుమారుడే బ్రతికి వచ్చినంత ఆనందపడ్డాడు. కుమారుని ముఖాన్ని చాలాసేపు చూశాడు.

ముద్దులాడాడు. కనులారా చూశాడు, చేతులార స్పృశించాడు. అలా కొంతసేపుండి మదలేఖను పిలిచి, “మాకు కుమారుని చూసి సంతోషించే వఱకే అవకాశం ఉంది. చూశాం, సంతోషించాం. నా కోడలు ఇప్పటిదాకా నా కుమారునకు ఎలాంటి సేవలు చేసిందో అలాగే ఇకముందు కూడా చేయాలి. మేమున్నామని సిగ్గుపడి ఎంత మాత్రం మానవద్దు. మేము ఇక్కడున్నా కేవలం చూసే వాళ్ళమే తప్ప మావల్ల ఏమి ప్రయోజనం? అసలు మీ మిక్కడున్నా లేకున్నా ఒకటే! వధువు కరస్పర్శ చేత నా కుమారుని శరీరం చెక్కు చెదరకుండా ఉంది కాన ఆమెనే నా కుమారుని ప్రక్కన కూర్చోనిద్దాం”. అని ఆదేశించి అక్కడనుండి బయలుదేరాడు.

తనకోసం ప్రత్యేకించి విడిది ఉన్నప్పటికి అక్కడకు వెళ్ళకుండా ఆశ్రమ సమీపంలో తపస్విజనులుకు తగిన విధంగా చక్కని చదునైన శిలల దగ్గఱున్న చెట్లు తీగలతో కూడిన ఒక మండపంలోనికి ప్రవేశించాడు. చంద్రాపీడుడు నిరపాయస్థితిలో ఉన్నాడని ఆనందంతో ఉన్న రాజసమూహాన్ని పిలిపించాడు. వారిని మర్యాదలతో కూర్చుండబెట్టి వారితో, “నేనిప్పుడు పుత్రశోకంతో విరక్తి చెంది ఈ అరణ్యవాసం అంగీకరించానని మీరు అనుకొనవద్దు. ఈ అరణ్యవాసం నేను ముందునుండి అనుకొంటున్నదే. రాజ్యభారాన్ని కుమారున కప్పగించి వివాహాదులు నెరవేర్చి, చివరి రోజులను భార్యాసహితుడనై ఆశ్రమంలో గడపాలని అనుకొన్నాను. కాని, యముని వలననో నా చేసుకొన్న పురాకృత కర్మలవలన గాని ఈ విధంగా నాతలపు తిరగబడింది. ఇక వేరే చేసేదేముంది? బ్రహ్మరాత ఎవరికిని దాట వీలులేనిది. మా వాడికి అలా సుఖపడే గీత లేకుండా పోయింది. ఇప్పడికి పరిపాలనా బాధ్యత మించు జాల మీదనే ఉంచబడుతోంది. ఆయుష్షు తీరిపోయే దాకా ఉండి, యముని చేత కంఠముపై కాలుంచి ప్రాణాలు తీయించుకోవటంకంటే, ముసలితనం వచ్చిన వెంటనే తన భారాన్ని యోగ్యుడైన వానిచేతిలో పెట్టేసి, శేషజీవితాన్ని సఫలం చేసికోవటం మేలుకదా! ఉపయోగహీనమైన ఈ దేహం పనికి రాని



మాంసఖండం అని విరక్తి చెంది పరలోకసుఖం కోసం ప్రయత్నించటం లాభదాయకం. అందుకోసమే నేను మిమ్మీ విధంగా కోరుతున్నాను అన్నాడు. రాజోచిత సౌఖ్యాలు వస్తువులు విడచివేశాడు. అనుచితమైన వన్య సామగ్రినే కోరుకొన్నాడు. ఎట్లాగంటే –

అడవి వృక్షాలనే మేడలుగా, లతలనే అంతఃపురస్త్రీలుగా, లేళ్ళయందేస్నేహ బుద్ధిని, నారచీరలనే పట్టు వస్త్రాలుగా, జడలు పెంచుటచేత కేశసౌందర్యముగా, కందమూల ఫలాలనే రాజభోజనంగా, జపమాలాధారణే శస్త్రధారణగాను, సమిధలు, దర్భలు, కుసుమాలను పోషించుటనే ప్రజాపాలనగాను, ధర్మ చర్చలనే ముక్తి ప్రసంగాలుగా, పరలోక సాధనయే జయాభిలాషగాను, తపస్సునే ధరార్జనంగాను; మౌనమునే రాజాజ్ఞగాను, వైరాగ్యాన్నే సర్వసుఖభోగ అనురాగంగాను, చెట్లయందే పుత్రప్రేమను చూపించే, తపస్విజనులకు యోగ్యమైన కార్యాలు ఆచరిస్తూ జీవింపసాగాడు. ఎల్లప్పుడు గంధర్వలోక సాంప్రదాయాలను ఉపచారాలను కాదంబరి కల్పిస్తున్నప్పుడు వద్దన్నా వినకపోవటం చేత బలవంతంగా స్వీకరిస్తూ, అలాగే మహాశ్వేత ఇస్తున్న ఆతిథ్యాన్ని స్వీకరిస్తూ ఉదయం, సాయంత్రం చంద్రాపీడ ముఖదర్శన సుఖం అనుభవిస్తూ, దుఃఖాలను నెమ్మదిగా మఱచిపోయి తారాపీడుడు రాణతోనూ శుకనాసదంపతులతోనూ అలా కాలక్షేపం చేయసాగాడు” అని జాబాలి మహర్షి కథను ముగించి చిఱునవ్వు నవ్వి హారీతాదిమునులతో ఇలా అన్నాడు” అని చిలుక శూద్రక మహారాజుతో తన వృత్తాంతాన్ని వివరిస్తోంది –

జాబాలి మహర్షులతో ఇలా అన్నాడు – “నాయనలారా! చూశారా శ్రోతల హృదయాన్ని దోచుకొనే కథలో, నన్ను ఆకర్షించే సామర్థ్యం ఎంత గొప్పదో. నేను చెప్పటం ప్రారంభించి, ఆ కథ రసాస్వాదనలో పడి నాకు తెలియకుండానే చాలా దూరం వెళ్ళిపోయాను కదా! ఆ కథలో కామాతురుడై వళ్ళుమఱచి పోయి స్వయంకృతాపరాధంతో దివ్యలోకంనుండి మానవలోకం లోకంలోకి జాఱిపడిన పుండరీకుడే అప్పటి వైశంపాయనుడు–

శుకనాసమంత్రి కుమారుడు. చంద్రాపీడుని ప్రాణస్నేహితుడు, అతనికి సహపాఠి. ఆ వైశంపాయనుడే మహాశ్వేత శాపానికి గుఱై ఈ చిలుకలాగా జన్మించాడు" అని జాబాలి మహర్షి పలికాడు

## 80. వైశంపాయనుని ఆత్మవిమర్శ - పశ్చాత్తాపం

ఓ శూద్రక మహారాజా! ఇంత వఱకు జాబాలిమహర్షి నా కథను చెప్పి ముగించాడు. ఆ మహర్షి నా గూర్చిన కథ చెప్పటం పూర్తి కాగానే, బాలుడనైనా నాకు నిద్రనుండి లేచిన వానికి వలె పూర్వ జన్మవృత్తాంతం గుర్తుకు వచ్చింది. నేను క్రిందటి జన్మలో చదివిన విద్యలన్నీ నా నాలుక పైన ఉన్నై. సర్వకళల యందు కౌశలం వచ్చేసింది. మానవులకు వలెనే నాలుకతో సుస్పష్టంగా మాట్లాడటం వచ్చింది. లోగడ నేనేర్చిన విజ్ఞానమంతా నా స్మరణకు వచ్చింది. ఇన్ని చెప్పటం దేనికి? ఒక మనుష్యరూపం తప్ప అన్నిలక్షణాలు నాకు సంక్రమించినాయి. నాయందు వైశంపాయనునికి చంద్రాపీడుని యందున్న స్నేహ ప్రేమే నెలకొన్నది. అదే కామపరవశత్వం, అదే మహాశ్వేత యందున్న అనురాగం, అదే మహాశ్వేతను పొందాలనే విషయంలో ఔత్సుక్యం నాలో ఉత్పన్నమైనై. నాకు ఆ రోజులలో ఎగఱటానికి తగిన రెక్కల బలం లేనందున పూర్వజన్మలో పొందిన శరీర కార్యక్రమాలేవీ చేయలేకపోయాను.

ఆ విధంగా నాకు పూర్వ జన్మ వృత్తాంత జ్ఞానం సమకూరిన దగ్గఱనుంచి నా మనస్సులో ఒకే ఆందోళన. నా తలిదండ్రులు మనోరమా శుకనాసులెలా ఉన్నారో! పితృసమానుడు తారాపీడు డేమయ్యాడో! మాతృసమానురాలు విలాసవతీ దేవి కెలాగుందో! నా ప్రియమిత్రుడు చంద్రాపీడునకేమైనదో! నా గత జన్మమిత్రుడు కపింజలుడిప్పు డెక్కడున్నాడో! ఇంతకీ నా ప్రియసఖి మహాశ్వేత ఎలా ఉందో! అని ఎవరెవరిగురించో ఏదో ఏదో ఆలోచించ సాగాను. తల నేలపై ఆనించి చాలా సేపు అలాగే ఉండిపోయాను. జాబాలి మహర్షిని చూడాలంటేనే చాలా సిగ్గుకల్గింది. పాతాళంలోకి పడి పోతున్నట్టుగా భావన కలుగుతుండగా నెమ్మదిగా ఆయనతో, "ఓ భగవానుడా! మీదయ



వలన నాకు పూర్వజన్మజ్ఞానం కలిగింది. నాకు క్రిందటి జన్మ బంధువులంతా గుర్తుకు వచ్చారు. అజ్ఞానంలో ఉన్నప్పుడు వీరెవ్వరూగుర్తుకురాలేదు. అట్లే విరహబాధ కూడా కలగలేదు. ఇప్పుడు వాళ్ళంతా గుర్తుకు వస్తుంటే నా గుండెలు బద్దలౌతున్నాయి. నా మరణానికి చంద్రాపీడుని హృదయం క్షోభించి బ్రద్దలైంది కాని, ఆతని మరణం విన్న నాకు మాత్రం ఏమీ ప్రమాదం కలగలేదు. అందు వల్ల చంద్రా పీడుని వత్తాంతం గూర్చినాకు తెలియజేయండి. అలా తెలిస్తే నాకు అతనితో కలసి ఉన్న సంతోషంతో పక్షిజాతిలో పుట్టినందు వల్ల కలిగిన దుఃఖం నాకు కలగకుండా పోతుంది" అని ప్రార్థించాను.

నా మాటలు జాబాలి మహర్షి విని నాపైన కోపం స్నేహం రెండూ కలగలిసిన విధంగా, "ఓరీ దుర్మార్గుడా! నీకీస్థితి రావటానికి మూలకారణమైన చంచలగుణాన్ని అలాగే వదలకుండా కూర్చున్నావా? ఇంకా నీకు సరిగా ఱెక్కలు రానేలేదు. ముందు నీకు ఎగిరే శక్తి రానివ్వు తర్వాత చూద్దాం! అప్పుడు నన్నడుగు చెబుతాను" అని కోపగించి మాట్లాడాడు. అప్పుడు జాబాలి మహర్షి కుమారుడు హారీతుడు మిక్కిలి కుతూహలంతో, "నాన్నగారూ! ఇది నాకు ఎంతో విస్మయాన్ని కలిగిస్తోంది. ముందిది చెప్పండి – మునివృత్తిలో ఉన్న ఇతనికి అంతటి కామ పరవశత ఎలా కలిగింది? ఆ కామం చేతనే జీవితాన్ని కూడా వదులుకొన్నాడు గదా! ఇతడు (పుండరీకుడు) దివ్యలోకసంభవుడు కదా! మఱి ఇతనికి ఇంత స్వల్పాయుర్దాయం ఎందుకున్నది?" అని తండ్రిని ప్రశ్నించాడు. అప్పుడు జాబాలి తన దంత కాంతులనే పుణ్యజలాలచేత పాపమనే మలినాన్ని కడిగివేస్తున్నట్లుగా ఇలా అన్నాడు –

''కారణం ప్రత్యక్షంగా కనబడుతూనే ఉంది గదా! ఇతడు కామరాగమోహాలతో కలిసిన అల్పబలం కలిగిన స్త్రీ వీర్యం వలన జన్మించాడు. శ్రుతిలో కూడా చెప్పబడింది ఇదే – ప్రాణి దేనివలన జన్మించిందో అదే లక్షణాలు కలదౌతుంది. లోకంలో కూడా, కారణలక్షణాన్ని బట్టి కార్యాలు

జరుగుతై అని ప్రతీతి ఉంది. ఆయుర్వేద శాస్త్రంలో కూడా, అల్పసారం కలిగిన స్త్రీ వీర్యంచేత మాత్రమే జన్మించిన ప్రాణి, లేదా పురుష శక్తి అల్పంగా ఉండినా గాని ఆ పిండం నశిస్తుంది, లేదా చనిపోయిన ప్రాణి పుడుతుంది. లేక పోతే పుట్టిన కొద్ది కాలానికే మరణిస్తుంది అని చెప్పబడింది. పుండరీకుడు పురుష ప్రమేయం లేకుండా స్త్రీబీజంతోనే పుట్టాడు కనుక అలాంటి కామపరత్వం కలుగుతుంది. అందువల్లనే కామ వేగజ్వరం వస్తే తట్టుకోలేక మృతుడైనాడు. ఇప్పుడు కూడా ఈ చిలుక బాలుడు కూడా అల్పాయుర్దాయుడే. శాపం తీరిన తర్వాత ఇతడు అనంత ఆయుర్దాయం కలవాడౌతాడు. అని

అది విని నేను మరల శిరమును నేలకానించి వందనం చేసి, భగవత్స్వరూపుడైన జాబాలితో, "దైవసమానుడా! నేను పుణ్యహీనుణ్ణి. కనుకనే పక్షిజాతిలో పుట్టి దేనికి శక్తి చాలనివాడ నయ్యాను. మీ యొక్క అనుగ్రహం వలన నాకు మాట్లాడే శక్తి కూడా వచ్చింది. మనస్సులో పూర్వజన్మ విజ్ఞానం కూడా లభించింది. తర్వాత జన్మలో ఆయుర్దాయాన్ని పెంపు చేసే అవకాశం ఏంచేస్తే లభిస్తుందో కూడా మీరు తెలియజేయ గోరుతున్నాను" అని ప్రార్థించాను. అందుకు జాబాలి మహర్షి, "అది కూడా దానంతట అదే నీకు తెలుస్తుంది. అంతవరకు కాలం ఇలా గడవనివ్వు. కథారసాస్వాదనలో మునిగిన మనకు సమయంకూడా తెలియలేదు. అప్పుడే తెల్ల వారబోతోంది. ప్రభను వీడిన విరహంతో చంద్రబింబం వెండి కలశంలాగా తెల్లబాఱిపోయింది. పడమటి దిక్కున. సూర్యుడు ఎప్పటిలాగానే ఎఱ్ఱని కాంతికిరణాలు వెదజల్లుతూ వృద్ధ కమల పత్రాలలాగా ఎఱ్ఱగా మెఱుస్తూ, పూర్వదిగంగనకు చీకటి కేశ పాశాలుదువ్వి పాపట తీసినట్లుగా కనపడుతున్నాయి. తారకలు క్రమక్రమంగా కనుమఱుగౌతున్నై. ఇదిగో పంపా సరస్సులో నిద్రిస్తున్న పక్షులను చెట్ల మీది పక్షులు లేపటానికి కోలాహలం చేస్తున్నై. రాత్రి పరిమళ శీతల వాయువులు చెట్లపువ్వుల సువాసనలతో కలసి తెల్లవారిందని తెలుపుతూ ప్రభాత వాయువులు వీస్తున్నై. అగ్ని సమారాధన సమయంకూడా దగ్గఱపడింది" అంటూ సభా ప్రసంగాన్ని ముగించి లేచాడు.



## 81. జాబాలి ఆశ్రమానికి కపింజలుడు వచ్చి చిలుక నోదార్చుట

ఆయన అలా పైకి లేవగా అప్పటిదాకా కథారసాస్వాదనలో మునిగిన ఆ మునిసంఘం గురూచితమర్యాదను కూడా మరచి పోయింది. ఆ మునులు రాగద్వేషాలకు అతీతులైనా, మోక్షార్థులైనా గాని ఒళ్ళు మఱచి పోయి చెవులప్పగించి విన్నారు. వారి కళ్ళు విప్పారినై. దుఃఖంతోనూ సంతోషంతోనూ పుట్టిన బాష్పాలు కనులనుండి స్రవిస్తున్నై. 'ఎంతకష్టం ఎంతకష్టం' అని తమలో తాము అనుకొంటున్నారు. కదలిక లేని వారైనారు. కాసేపు అలా ఉన్న వారు తేరుకొని తమతమ కార్యాలకు లేచి వెళ్ళి పోయారు.

హారీతుడు ప్రక్కన మునికుమారకులున్నా తానే స్వయంగా చేతులతో పట్టుకొని తన పర్ణశాలకు తీసికొని పోయి, తన శయనంలో ఒక ప్రక్కగా ఉంచి, ఉదయకాలకృత్యాలకు వెళ్ళిపోయాడు. వెళ్ళిన తర్వాత ఏ పనీ చేయలేని అసమర్థుడినై పక్షిజాతిలో జన్మించిన ఈ దేహంతో ఉన్న నేను మనస్సులో దుఃఖం చెలరేగగా విచారంలో పడిపోయాను.

"ఎన్నో జన్మల పుణ్యసంచయాల ఫలంగా మనుష్య జన్మ లభిస్తుంది. అందులోనూ అన్ని జాతులలోను శ్రేష్ఠమైనది బ్రాహ్మణత్వం పొందటం. అందులోనూ అమృత పదవీ సమానంగా విశిష్టమైంది మునిత్వం. అందులో కూడా దివ్యలోక నివాసావకాశం కలగటం ఇంకా మిక్కిలి విశిష్టమైంది. అటువంటి దివ్యలోక నివాస యోగ్యత కలిగిన నేను, ఆ ఉన్నత స్థానంనుండి స్వయంకృత దోషం వల్ల క్రిందకు పడవేయబడ్డాను. అందుకే యిప్పుడు ఏ పనీ చేయటానికి వీలుపడని ఈ తిర్యగ్జాతి జన్మను పొందాను. స్నానసంధ్యాజపతపాది సత్క్రియలేవీ చేయలేక అసమర్థుడినై బ్రతుకుతున్నాను. గత జన్మలోనూ ప్రియాసమాగమసుఖాన్ని పొందలేక పోయాను. ప్రియురాలి ప్రేమను పొందని ఈ నా జన్మవలన, ప్రాణరక్షణ వలన నాకేమి లాభం? ఈ యాతనాశరీరం ఎక్కడో అక్కడ కూలిపోనీయ్, నేను లెక్కచేయను. దుఃఖం

మాత్రమే పొంద వలసిన ఈ దురదృష్టవంతునకు సుఖం అనుభవించే గీతలేదు. ఈ దేహాన్ని నేను పరిత్యజిస్తాను. నన్నీ రకంగా కష్టపరంపరలకు గుఱి చేసి ఏడిపించాలని యిష్టపడే విధి కోరిక నెరవేరనీ!" అంటూ రకరకాలుగా ఆలోచిస్తూ శరీరాన్ని త్యాగం చేద్దామను కొంటూ కనులు మూసుకొని ఉన్న నన్ను ఓదారుస్తున్నట్లుగా, సంతోషంతో వికసించిన ముఖంతో హారీతుడు త్వరగా నా వద్దకు వచ్చి నాతో యిలా అన్నాడు –

"తమ్ముడా! వైశంపాయనా! అదృష్టంతో వర్ధిల్లు. భగవత్స్వరూపుడైన మీతండ్రి శ్వేతకేతువు వద్దనుండి నీ ప్రియమిత్రుడు కపింజలుడు ఇక్కడకు వచ్చాడు. అతడు నీ గూర్చి అన్వేషిస్తూ మన ఆశ్రమానికి వచ్చాడు" అని.

హారీతుని మాటలు విన్న వెంటనే నాకు హఠాత్తుగా ఱెక్కలు వచ్చి మరుక్షణంలో కపింజలుని వద్దకు పోవాలనే కోరిక నాలో ప్రబలంకాగా, మెడను పైకెత్తి 'ఎక్కడతడు?' అని హారీతుణ్ణి అడిగాను. అతడు నాతో 'అతడు నాన్నగారి పాదసన్నిధిలో ఉన్నాడు' అని అన్నాడు. అతడలా అనగా నేను మరల, "ఓ నా దైవమా! అలాగయితే నన్ను ఈ క్షణమే అతని వద్దకు తీసుకొని వెళ్ళు. అతణ్ణి చూడాలని నాహృదయం తొందఱపడుతోంది అని నేను అంటూ ఉండగానే నా వద్దకు వేగంగా వస్తున్న కపింజలుడు నాకు కనిపించాడు.

కపింజలుడు లోగడివలె లేడు. ఆకాశంలో అమిత వేగంతో ప్రయాణించి రావటం చేత ఆతని జడల సమూహం చిందఱ వందఱగా రేగిపోయింది. వాయు మార్గ ప్రయాణం చేత ఒకవైపుకు జాఱిపోయింది అతని ఉత్తరీయం. చెట్ల నారతో అల్లిన వస్త్రం నడుముకు కట్టుకున్నాడు. సగం జందెం తెగిపోయి ఎండిపోయిన అతని గుండెల మీద వ్రేలాడుతోంది. నిండు ఆకాశం నుండి వేగంగా భూమికి దిగటంచేత శ్రమ కలిగిన వాడై ఱొప్పుతున్నాడు. చల్లని వాయువులు తగులుతున్నా ఆకాశ ప్రయాణపు బడలికతో ఉన్నాడు. ఆకాశ గంగాజలకణాలతో నిండినది అతని ముఖం. నన్ను చూచినందువల్ల ఉద్భవించిన కన్నీటిని చేతులతో తుడుచుకొంటున్నాడు. ముక్తి మీద కోరిక



ఉన్నా నా స్నేహంనుంచీ విముక్తుడు కాలేదు. రాగాతీతుడైనా నా మీద అనురాగం కలిగినవాడు, సర్వసంగ పరిత్యాగి ఐనా నా సంగాన్ని కోరుకొనే వాడు. కపింజలుడు దేని మీద ఆసక్తిలేని వాడైనా నాకు ప్రయోజనం కలిగించటంపై ఆసక్తి చూపేవాడు. మమకారం లేనివాడే, కాని నా యందు మమకారం కలవాడు. 'నేను' అనే గర్వంలేని వాడే, కాని అతడే 'నేను' అనే భావన కలవాడు. అన్నిక్లేశాలను విడచిన వాడైనా నా కోసం క్లేశపడేవాడు. మట్టిగడ్డను, బంగారాన్ని సమంగా భావించి ఆనందపడేవాడైనప్పటికిని నా కోసం దుఃఖపడేవాడు.

అటువంటి కపింజలుణ్ణి కండ్లనుండి స్రవిస్తున్న బాష్పధారతో చూపు కన పడకపోయినా ఎదురువస్తున్న అతనితో, "నా ప్రియ మిత్రమా! కపింజలుడా! ఈ విధంగా రెండు జన్మల తర్వాత కలిసిన నిన్ను చేతులు చాచి గాఢాలింగనం చేసుకొని నేను ఆనందం అనుభవిస్తాను. నీ చేతులు పట్టుకొని ఆసనం వద్దకు తెచ్చి అందు కూర్చుండ బెట్టనా? ఆసనంలో కూర్చోబెట్టి కరచరణాలను పిసికి నీకు పరిచర్య చేయమంటావా? అని తనను గూర్చి దుఃఖపడుతున్న నన్ను కపింజలుడు చేతిలోకి తీసికొనినాడు. నా విరహంచేత బక్కచిక్కి క్షీణించిన తన గుండెలకు అదుముకుంటూ, చాలాసేపు నను గుండెలలో దాచుకొంటున్నట్లుగా ఆలింగన సౌఖ్యం అనుభవించి, అది చాలక దుఃఖోద్వేగంతో నా పాదాలను తన శిరస్సుపై ఉంచుకొని ఎవరో సామాన్య మానవునిలాగా విలపించాడు.

అలా ఏడుస్తున్న కపింజలుని కేవలం మాటలే ప్రతిక్రియగా కలవాడనై ఓదార్చి ఇలా అన్నాను – ఓ నా ప్రియమిత్రుడా! కపింజలుడా! ఇన్ని బాధల చేత అవమానితుడనైన పాపాత్ముడనైన నన్ను గూర్చి ఇలా దుఃఖించటం నీకు తగినదేనా? అయినా నీ వింకా బాలుడవు. మోక్షమార్గానికి విఘాతం కలిగించే శత్రుతుల్యమైన దోషాలు నిన్నింకా తాకలేదు. నువ్వు పవిత్రుడివి. మరి ఎందుకు నీ విపుడు మూఢులు నడచే మార్గాన నడుస్తున్నావు? నువ్వు

ముందుగా జరిగిన వృత్తాంతం గుఱించి ప్రజలేమనుకొంటున్నారు? చెప్పు నా తండ్రి శ్వేతకేతువు కుశలమేనా? ఆయన నన్ను తలుచుకొంటాడా ఎప్పుడైనా? నా దుఃఖాన్ని చూసి ఆయన కూడా దుఃఖపడుతున్నాడా? నా గుఱించిన వృత్తాంతం విని ఆయన ఏమన్నారు? నాపై కోపగించలేదు కదా!" అని.

నా మాటలు విన్న కపింజలుడు హారీతుని శిష్యుడు తెచ్చియిచ్చిన చిగుఱుటాకుల చాపపై కూర్చొని, నన్ను ఒడిలో కూర్చుండ బెట్టుకొన్నాడు. ఇంతలో హారీతుడు పాత్రతో నీటిని తెచ్చియిచ్చాడు. కపింజలుడు ఆ నీటితో ముఖాన్ని శుభ్రంగా తుడుచుకొని, నాతో, "ప్రియమిత్రుడా! నాన్నగారికి కుశలమే! ఆయన మన సంఘటనలన్నీ దివ్యనేత్రంతో ఎప్పుడో తెలుసుకొన్నాడు. కష్టనివారణకు చేయవలసిన కార్యక్రమం మొదలుపెట్టాడు కూడా! ఆయన మన దుఃఖాలు తొలగటానికి యజ్ఞ కార్యక్రమం ప్రారంభించిన వెంటనే నా అశ్వరూపం తొలిగిపోయి మానవరూపం వచ్చేసింది. వెంటనే నేను నాన్నగారి పాదసన్నిధికి వెళ్ళాను. ఆయన అలా వెళ్ళిన నన్ను చూశాడు. నేను ఆయన ఏమంటాడో అనే భయంతో, నీకింత ప్రమాదం సంభవించిందే అని దుఃఖంతో ఆయన సమీపానికి వెళ్ళలేక దూరంగానే ఉండిపోయాను. ఆయన నన్ను దగ్గఱకు రమ్మని ఇలా ఆదేశించాడు – "నాయనా! కపింజలా! నువ్వేదో తప్పు చేశాననే అనుమానం ముందుగా మానుకో. ఇందులో నీ తప్పేముంది? ఒకరకంగా చెప్పాలంటే నేనే తప్పు చేశాను. ఎందుచేతనంటే తెలిసి ఉండి కూడా పుత్రుడు జన్మించినపుడే ఈ ఆయుష్కర కర్మ చేసి ఉండలేదు నేను. ఇప్పుడు ఆ క్రియ నెరవేరుతున్నది. ఇక దుఃఖ పడవలసిన పనిలేదు. నువ్వు కొంతకాలం నా వద్దనే ఉండు" అని.

శ్వేతకేతువు అలా అనగానే నాకు భయం తగ్గి ఇలా అన్నాను – "తండ్రీ! మీరు మాపై దయ చూపుతున్నట్లైతే నన్ను వైశంపాయనుడు చిలుకగా పుట్టిన ప్రదేశానికి పంపండి. నే నతనిని చూస్తాను" అని నా మాటలు విని శ్వేతకేతువు, "నాయనా! అతడు చిలుక జాతియందు జన్మ మొందాడు. నీ విపుడు వెళ్ళి



నా అతనిని నీవు గుర్తుపట్టలేవు. అతడు నిన్ను గుర్తింపలేడు. కావున ఓపికపట్టి కొంత కాలముందు" అన్నాడు ఈ రోజు ఉదయాన్నే ఆయన నన్ను పిలిచి, "వత్సా! కపింజలా! మహాముని జాబాలి యొక్క ఆశ్రమం లోనికి నీ మిత్రుడు చేరుకున్నాడు. జన్మాంతర స్మరణం కూడా కలిగింది. ఇప్పుడతనిని చూడటానికి వెళ్ళు. అతనికి నా ఆశీస్సులతో ఇలా చెప్పు – "వత్సా! ఇక్కడ నేను ప్రారంభించిన యజ్ఞ కర్మ పూర్తయ్యేంత వఱకు నీవు ఈ జాబాలి ఆశ్రమంలోనే ఉండాలి. అంతేకాక, నీ దుఃఖమే తన దుఃఖముగా భావించే నీ తల్లి లక్ష్మీదేవి కూడా ప్రస్తుతం ఆ పనిలోనే పరిచారికగా పని చేస్తున్నది. ఆమె కూడా నీ శిరమును వాసన చూచి అదే మాట చెప్పమన్నది" అని పలికి కపింజలుడు మృదువైన దిరిసెన పూవులాంటి వచ్చీరాని అవయవములను చేతితో ప్రేమగా నిమిరి లోలోపలే దుఃఖపడ సాగాడు.

అతడు నా గూర్చి ఆవేదన పడుతుండగా నేనతనితో, "మిత్రమా! కపింజలా! మందభాగ్యుడనైన నా గూర్చి నీ వెందుకు దుఃఖిస్తున్నావు? నీవు నా గూర్చి శాపం పొంది గుఱ్ఱంరూపంలో పరాధీనుడవై అనేక బాధలు పడలేదా? పవిత్ర సోమరస పానయోగ్యమైన ఈ నోటితో కఱకు కళ్ళాల రాపిడి వలన గాయాలను అనుభవింపలేదా? ఎప్పుడూ చిగుఱుటాకుల శయ్యమీద సుఖ నిద్రచెందే సుకుమారమైన నీవు వీపు ఎలా జీనువత్తిడిని తట్టుకొన్నడో! దేవతార్చనకు పువ్వులు కోయటం చేతనే ఎఱ్ఱగా కందిపోయే నీ సుకుమార శరీరం కొఱడా దెబ్బలను ఎలా తట్టుకొన్నదో" అంటూ అనేక పూర్వ సంఘటనల గూర్చి తాత్కాలికంగా పక్షిజాతిలో జన్మించినందున కలిగిన దుఃఖాన్ని మఱచిపోయాను

సూర్యుడు ఆకాశమధ్యానికి చేరుకొన్నాడు. అప్పుడు హారీతుడు కపింజలునకు, నాకు తగిన ఆహారపదార్థాలను సమకూర్చాడు. కపింజలుడు భుజించిన తర్వాత కొద్దిసేపుండి నాతో ఇలా అన్నాడు. "మిత్రమా! నేను ఇక్కడికి వచ్చింది. నిన్ను ఓదార్చటానికి, దోషనివారణ కర్మ పరిసమాప్తి పొందే

వఱకు జాబాలి మహర్షి పాదసమీపాన్ని వీడి ఎక్కడికి పోవద్దు అని చెప్పటానికి నేను కూడా ఆ కర్మయందు అవశ్యం పాల్గొనవలసిన వాణ్ణి. నే నిపుడు వెడుతున్నాను" అని అన్నాడు. నేనతని మాటలు విని విచారిస్తూ, "మిత్రమా! కపింజలా! ఈ పరిస్థితిలోనున్న నేను ఏమనగలను? అమ్మతో నాన్నతో ఏమని సందేశింప గలను? అంతా నీకు తెలుసు గదా!" అని అన్నాను.

నేనలా అనగా కపింజలుడు నన్ను ఆశ్రమమందే ఉండమని మాటి మాటికి హెచ్చరించి, హారీతునికి మమ్ము కౌగలించుకొన్న సుఖాన్ని అందించి మునికుమారులందఱూ విస్మయంతో చూస్తుండగా కపింజలుడు ఆకాశం లోనికి ఎగిఱి ఎటో కనపడకుండా వెళ్లిపోయాడు. అతడు వెళ్ళిన తర్వాత హారీతుడు నన్ను ఓదార్చి స్నానసంధ్యాదుల నిమిత్తం లేచాడు. నా వద్ద ఒక ముని బాలుని కాపలాగా ఉంచి తాను వెళ్ళిపోయాడు. స్నానాదులు పూర్తి చేసుకొని వచ్చిన హారీతుడు తక్కిన మునికుమారులతోపాటు నాకున్నూ ఆహారం పెట్టాడు, తానున్నూ భుజించాడు.

## 82. వైశంపాయనుడు ఆశ్రమం వదలి పారిపోవుట

ఈ విధంగా హారీతుని చేత శ్రద్ధగా పెంచబడిన నాకు కొద్ది రోజులకు ఱెక్కలు వచ్చినై. ఆ కాశంలో ఎగుఱ గలిన సామర్థ్యం వచ్చింది. అప్పుడు నేను, "ఆకాశంలో ఎగుఱగలవాడనైనాను. చంద్రాపీడుని జన్మ గుఱించి తెలిసింది. ఆ మహాశ్వేత కూడా అక్కడే ఉంది. నాకు పూర్వ జన్మ జ్ఞానం కూడా కలిగింది. ఇక వారిని చూడకుండా ఒక్కక్షణం కూడా నిలువలేను. సరే కానిమ్ము, అక్కడకే వెళ్ళి ఉంటాను" అని నిశ్చయం చేసుకొన్నాను. ఒక నాడు ఉదయాన్నే ఆకాశ విహారంకోసం వెళ్ళి అటునుండి అటే ఉత్తరదిక్కుగా వెళ్ళసాగాను.

చాలా రోజులనుండి ఎగిఱే అలవాటు లేనందు వలన కొద్ది దూరం పోయినంతలోనే నా శరీరావయాలు అలసి పోయినాయి. దాహంతో నోరు



ఎండిపోయింది. నాడీవేగం చేత గొంతుక కొట్టుకొంది. ఈ విధంగా ఱెక్కలు అలసిపోయి, ఇదిగో పడుతున్నా అదిగో పడుతున్నా అనుకొంటూ చివఱికి రాత్రికటిక చీకటిలాగా నల్లగా దట్టంగా ఉంది సూర్య కిరణాల ప్రసారం కూడా జరగని చెట్లుగుబురులపై పోయి పడ్డాను. చాలా సేపటికి మార్గాయాసం తగ్గిన తర్వాత నెమ్మదిగా క్రిందికి వచ్చాను. చల్లని వృక్షచ్ఛాయలో కాసేపు ఉండి, ఆకులు దట్టంగా ఉండటం చేత చల్లగా ఉన్న, పద్మముల పుప్పొడి కలవటం చేత కొంత వగరుగా ఉన్న సువాసన కలిగిన సరోవరజలాన్ని తృప్తి తీరేంతవఱకు త్రాగి, పద్మము మధ్యనున్న పసుపు పచ్చని కర్ణికారంలో ఉండే తామర గింజలు దొఱికినంత వఱకు తిని నల్ల జీడి మొక్కల చిగుళ్ళను కొఱికితిని, మార్గాయాసం తగ్గటం కోసం సమీపంలో ఉన్న దట్టంగా నీడనిచ్చే ఒక చెట్టు మొదట్లోకి చేరి విశ్రాంతి తీసుకొంటూ మార్గశ్రమవల్ల నిద్రకు ఉపక్రమించాను.

అలా ఎంతసేపు నిద్రపోయానో గాని, నిద్రనుండి లేచేసరికి నేను తీగలతో కట్టి వేయబడి బంధితుణ్ణైనట్లు గ్రహించాను. నా ఎదుఱుగా ఒక మనిషిని చూశాను. వాడు పాశంచేత ధరింపని యమధర్మరాజు లాగా ఉన్నాడు. అతని దేహం కఠినమై నల్లని రంగులో ఉండి కేవలం ఇనుప లోహంతో తయారు చేయబడినట్లున్నాడు. అపరయమునిలాగా ఉన్నాడు. పాపాన్ని రాశిగా పోసినట్లున్నాడు. పాపాలకు నిలయంలాగా ఉన్నాడు. కోప కారణం ఏమీ లేకపోయినా భయంకరమైన కనుబొమలను ముడివేస్తూ, భయంకరమైన ముఖంతో ఎఱ్ఱని కనుగ్రుడ్లతో, సకల జనభయంకరుడై యమధర్మరాజుకు కూడాభయం కలిగించేవాడై ఉన్నాడు. అతని ఆశయాలు, కేశాలు రెండూ కూడా కఱుకుదనం కలవై ఉన్నాయి. ముఖంతో పాటు నల్లని అజ్ఞానం తాండవిస్తోంది. అతని రంగుతో పాటు నడ వడిక కూడా నల్లనిది. అతని వస్త్రాలతోపాటు చేసే పనులుకూడా మలినంగా ఉన్నై. అతని మాటతో పాటు శరీరం కూడా కఠినంగా ఉంది. ఇంతవఱకు ఇటువంటి మనిషి ఉంటాడని

నేను వినలేదు, చూడలేదు. మనుష్యాకారంతో ఉన్నాడన్న నమ్మకంతో మాత్రమే వానిని మనిషిగా అనుకోవాల్సి ఉంది.

నేనా మనిషిని పరిశీలనగా చూశాను. నాపై నేను ఆశ వదులు కొన్నాను. ఐనా ఏదో ఆశతో అతనితో ఇలా అన్నాను–

"నాయనా! నీ వెవరవు? నేను నీ చేత ఎందుకు బంధింపబడ్డాను? ఒక వేళ నీవు నా మాంసం మీద ఆశతో పట్టుకొంటే, నేను నిద్రిస్తూండగానే చంపక పోయినావా? ఏ దోషం చేయని నన్ను పట్టి బంధించి బాధ పెట్టటం దేనికి? కాకపోతే ఏదో కుతూహలంతో నన్ను పట్టుకొన్నావా? నీ కుతూహలం తీరింది కదా! మఱి ఇక నన్ను వదిలి పెట్టవచ్చు కదా నాయనా! నేను నా ఆప్తులను చూడటం కోసం చాలా దూరం వెళ్ళవలసి ఉంది. అనవసరంగా సమయాన్ని గడిపేందుకు నాకు వీలు లేదు. నీవు కూడా నాలాగే ఒక ప్రాణివి గదా!" అని.

అతడు నా మాటలు విని, "ఓమహాను భావుడా! నేను క్రూరకర్ముడను. జాతికి చాండాలుడను నిన్ను నేను మాంసలోభంచేతగాని, కుతూహలంతో కాని పట్టుకోలేదు. ఇక్కడకు దగ్గఱలోని బోయపల్లె నివాసంగా ఉంటున్న శబరకులాధిపతి నా యజమాని. ఆయన కుమార్తె వింతలకు ఆనందపడే బాలికావస్థలో ఉంది. ఆమెకు ఎవరో జాబాలి ఆశ్రమంలో సర్వవిద్యా జ్ఞానంకల ఒక చిలుక ఉన్నదని నీ గుఱించి చెప్పారట. ఇక ఆ బాలికకు నీ మీద కుతూహలంతో నిన్ను పట్టి తీసుకురమ్మని నా బోటివారిని చాలామందిని పంపింది. నా అదృష్టం బాగుండి నీవు నాకు దొఱికావు. కనుక నిన్ను నేను ఆ కిరాతరాజకుమార్తె వద్దకు తీసికొని వెడుతున్నాను. బంధించి ఉంచాలా? లేక వదిలి పెట్టాలా అనే విషయం మీద ఆమే నిర్ణయం తీసుకుంటుంది" అని పలికాడు.

నేనాతని మాటలు విన్నాను. నా ఆశలన్నీ అడుగంటి పోయాయి. నాకు పిడుగు దెబ్బ తగిలినట్టనిపించింది. నేను నా మనస్సులో, "ఆహా!



మందభాగ్యుణ్ణైన నా పాపకర్మల ఫలం ఇలా ఉంది. నేను దేవదానవుల శిరస్సులతో చేయబడే వందనాలు గ్రహించే లక్ష్మీదేవికి కుమారుణ్ణై, మూడు లోకాల వారిచేత నమస్కరింపదగిన మహాముని శ్వేతకేతువుచేత బాల్యంనుండి పెంచి పెద్దచేయబడిన నేను దివ్యలోకనివాసినైయుండి కూడా ఈ నాడు మ్లేచ్ఛజాతి వారిచేకూడా దూరంగా ఉంచబడే కిరాతులని వాసంలోకి ప్రవేశింప వలసి వచ్చింది. చాండాలులతో పాటు కలిసి మెలిసి ఉండాలి. ముదు సలిచాండాల స్త్రీల చేతులతో తేబడిన ఆహారంతో నేను బ్రతకాలి. చాండాల బాలకులకు నేనొక ఆట వస్తువు వంటివాడ నౌతాను. ఒరే దుర్మార్గుడా! పుండరీకుడా! ఏమి జన్మమెత్తావురా? ఎన్ని దుష్కర్మల ఫలితమో, ఇటువంటి ఘోర పరిస్థితి పొందావు. నీవు పుట్టినప్పుడే ఖండ ఖండాలుగా చీలిపోతే బాగుండేది. ఓ తల్లీ! లక్ష్మీదేవీ! దిక్కులేని జనులకు శరణునిచ్చే పాదపద్మములు కలదానా! మహా నరక సమానమైన అతిభయంకరమైన ఈ స్థితినుండి నన్నురక్షించు. ఓ నా తండ్రీ! త్రిలోకరక్షణ సమర్థుడా! నీ వంశాంకురమైన నన్ను రక్షించు. నీ చేతనే నేను పోషింపబడ్డాను. ఓ మిత్రమా! కపింజలా! నీవు కనుక ఇప్పుడు వచ్చి నన్నీ పాపకూపంనుండి కాపాడకపోతే ఇక నువ్వు జన్మాంతరంలో కూడా నన్ను కలుసుకోవాలనే ఆశపెట్టుకోకు" అని ఎంతో దుఃఖించాను.

ఇలా చాలా సేపు ఎన్నో విషయాలుగుర్తు చేసుకొని విలపించాను. చివఱికి ఎంతో జాలికలిగే విధంగా దీనంగా అతనితో ఇలా అన్నాను:– ఓ సుందరవదనుడా! నేను పునర్జన్మ జ్ఞానం కలిగిన ఒకమునిని. నన్ను వదిలి పెట్టిన నీకు పుణ్యం లభిస్తుంది నాయనా! నన్నీ నరకంనుంచి తప్పించు." అంటూ అతని పాదాలపై పడ్డాను. అతడు నవ్వినాతో అన్నాడు – 'ఓరీ! మోహాంధుడా! మనంచేసే పాపపుణ్య కర్మలకు సాక్షీభూతులుగా యమాదిపంచలోక పాలకులు మనలోనే ఉన్నారు. అది తెలిసిన వాడు ఇతరులకు కేడు చేయడు. తెలియని వాడు పాపాలు చేస్తాడు. నేను స్వయంగా

బంధించి తీసుకొని వెళ్ళటంలేదు. నా యజమాని ఆజ్ఞతో ఈ పని చేస్తున్నాను" అంటూ నన్ను బోయపల్లెకు తీసుకొని పోసాగాడు. అతడన్న మాటలు నాతలపై పడిన దెబ్బల్లాగా ఉన్నై. నేను చేసిన ఏ పాపకర్మల ఫలితంగా నా కిటువంటి దుర్గతి పట్టిందా అని మనస్సులో మధనపడుతూ ప్రాణత్యాగం చేయటానికి నిశ్చయించుకొన్నాను.

## 83. వైశంపాయనుడు చాండాల కన్యకవద్దకు చేరుట

కొంతసేపటికి బోయపల్లె కనపడింది. కొందఱు పిశాచం పట్టిన వారిలాగా ఉన్నారు. వికృతచేష్టలు చేస్తున్నారు కొందఱు. కొంతమంది అప్పుడే అడవినుండి తిరిగి వచ్చారు. కొంతమంది చేపల వలలను గిఱ్ఱున తిప్పుతూ విసరుతున్నారు. కొంతమంది మృగాలు తెగగొట్టినందున పాడైన వలలను బాగుచేస్తున్నారు. కొందఱు ధనుర్బాణాలను చేత ధరించి ఉన్నారు. బల్లాలు ధరించి ఉన్నారు మఱికొందఱు. కొంతమంది వివిధాలైన పక్షికూతలు కూస్తున్నారు. కొందఱు కుక్కలను జంతువుల మీదికి ఉసిగొల్పుతూ అటు ఇటు పఱుగులు తీస్తున్నారు. ఇంక కొంతమంది జట్లు జట్లుగా ఏర్పడి జంతువుల వేట ఆటలాడుతున్నారు.

దట్టంగా ఉన్న వెదురు పొదల మాటునుండి మాంసం కాలిన వాసనతో పాటు నల్లని పొగలు రావటం చేతనే అక్కడ యిళ్ళున్నట్టు గుర్తింపబడున్నది. ఎక్కడ చూచినా ఎముకల గుట్టలు కనపడుతున్నై. జంతువుల శరీరాల నుండి తీసిన మాంసం కొవ్వు నెత్తురులతో ఇంటి ముంగిలి ప్రదేశాలు నిండి ఉన్నై. అక్కడి ప్రదేశాలు బురదగా కనబడుతున్నై. వేటాడటమే వారి జీవనవృత్తి. మాంసమే వారి ఆహారం. మాంసంలో ఉండే కొవ్వు పదార్థ వారికి నూనె. పట్టు పురుగులనుండి తీసిన దారాలతో నేయబడిన వస్త్రాలే (పట్టుబట్టలే) వారికి బట్టలు. జంతు చర్మాలే వారికి దుప్పట్లు. వేటకుక్కలే వారికి పరివారం. ఆవులే వారికి వాహనాలు. స్త్రీవ్యామోహం, మద్యపానాలే వారికి పురుషార్థాలు. నెత్తురే వారికి బలిపూజ. జంతువులను బలిగాయివ్వటమే వారికి పుణ్యకార్యం.



వారి పల్లె నరకా లన్నిటి కలయిక సర్వ అశుభాలకు కారణం. అన్ని శ్మశానాల యొక్క సమ్మేళనం. సర్వపాపాల కూడలి. సర్వబాధలకు నివాసస్థానం తలచుకొంటేనే భయం కలిగించేది. వింటేనే ఉద్వేగాన్ని కలిగిస్తుంది. చూస్తేనే పాపం కలుగుతుంది. జన్మచేత, చేసే పనులచేత మిక్కిలి పాపాత్ములకు నివాసం. క్రూరాతిక్రూరులైన నీచజనుల హృదయం ఆ పల్లె. ఆచార విహీనులైన బాలయువక వృద్ధులకు అది వాసం. ఇష్టం వచ్చినట్లుగా వావివరుసలు గమనించకుండా ప్రేమసౌఖ్యాలు పొందేవారుండే ప్రదేశం. పాపాలన్నీ సరసమైన ధరలకు అమ్మే దుకాణం లాంటిది ఆ బోయపల్లె. అటువంటి భయంకర నీచనికృష్టమైన పల్లెను చూశాను.

చూస్తే నరకంలోని వారికి కూడా భయోత్పాతాలు కలిగించే ఆ పల్లెను చూసి నా అంతరంగంలో ఇలా అనుకొన్నాను – "నన్ను బంధింప జేసిన ఆచాండాల కన్య దూరంనుంచే నన్ను చూసి జాలికలిగి వదిలి వేస్తుందా; లేక తన జాతికి తగినట్లుగా చేస్తుందా? నా పుణ్యాలు ఇలా ఉన్నాయి, చివరికి ఏం జరుగుబోతోందో, నేనిటు వంటి నీచస్థలంలో ఒక్కక్షణంకూడా ఉండలేను' అని నేను భావిస్తూ ఉండగానే ఆ చండాలుడు నన్ను తీసికొనిపోయి ఆ చాండాలకన్యకు చూపించాడు. అల్లంత దూరాన ఉండగానే వాడామెకు నమస్కరించి, "ఇదిగో ఇతడు నాకు దొఱికాడు" అంటూనన్ను చాండాల కన్యకకు ఎదురుగా పెట్టాడు. ఆమె ముఖంలో సంతోషం వెలిగిపోతోంది. 'మంచి పనే చేశావు' అని అతనితో అని నన్ను తన చేతులలోకి తీసికొని, నాతో, "ఆహా! నా కుమారా దొఱికావు. ఇప్పుడునువ్వు వేఱొక చోటికి ఎక్కడకు వెడతావు? నీకున్న దుష్టకామపరభావాలన్నీ వదిలిస్తాను, ఆగు" అంటూనే ఆమె పఱుగులు పెదుతున్న బాలుని పిలచి, ఒక కొయ్య పంజరం తెప్పించింది. ఆ పంజరం సగం ఎండిన, వెంట్రుకలతో కూడిన, దుర్గంధం కలిగిన ఆవు చర్మం ముక్కతో కట్టబడినది. ఆ పంజరంలోనే గట్టిగా బిగించబడి పానభోజన పాత్ర ఒకటి ఉంది. దాని ద్వారం కొంచెంగా తెఱిచి ఉంది. ఆ కొయ్య

పంజరంలో నన్ను, మహాశ్వేతను చూడాలనే నా కోరికలతో పాటుగా పెట్టి దానికి గడియపెట్టి, "ఇక ఇక్కడ హాయిగా ఉండు" అంటూ హెచ్చరించింది. మాట్లాడకుండా ఉన్నది.

నేను ఆమెచే అలా బంధింప బడినా మనస్సులో, "పెద్ద ప్రమాదంలో పడ్డానురా దేవుడా! ఒక వేళ నేను నా బాధను ఆమెతో చెప్పుకొని, ఆమె పాదాలకు నమస్కరించి నన్ను విడుదల చెయ్యమని అడిగితే, అప్పుడు నా గొప్పగుణమే తప్పై కూర్చుంటుంది. తగ్గదు సరికదా ఆ తప్పే పెద్దదై పోతుంది. అసలు ఈమె నన్ను బంధించింది. ఇది చక్కగా మాట్లాడుతుందనే ఆసక్తితోనే కదా! నన్ను బంధించి పీడించటంవల్ల ఆమెకేం బాధ ఉంటుంది? నేనేమన్నా ఆమెకు కుమారుణ్ణా! సోదరుడినా? బంధువునీ కాదు. ఇక నేను మౌనంగా ఉంటాను. అలా మౌనంగా ఉంటే, నా మొండితనం వల్ల ఆమెకోపం అధికమైనన్ను ఇంకా తీవ్రంగా బాధిస్తుందేమో! ఎందుకంటే ఈ జాతి కఠినాతికఠిన స్వభావంకల జాతి. నాకు బాధలు ఎక్కువైతే కానీ. నేను మాత్రం ఈ చాండాలజాతివారితో మాటలు కలపనుగాక కలపను. అంతేకాక నేను మౌనంగా ఉంటే, ఆమెకు చికాకో, అవమానమో కలిగి నన్ను విడిచి పెట్టినా విడిచి పెట్టవచ్చు. నేనే కనుక తీయగా మాట్లాడుతూ ఉంటే నన్నిక ఒదిలి పెట్టనే వదిలి పెట్టరు.

అసలు నాకీ పరిస్థితి నా దోషం వల్లే వచ్చింది. ఎటువంటి వాణ్ణి ఎలా తయారయ్యాను. నేను దివ్యలోకం నుండి భూలోకంలో పడ్డాను. అందులోనూ మానవ లోకంలో జన్మించాను. ఇంకా అందులోనూ పక్షిజాతిలో జన్మించటం, కిరాతుని చేతికి దొరకటం, అందులోనూ ఇటువంటి పంజరంలో బంధింపబడటం – ఏమిటిదంతా? కేవలం నాకు ఇంద్రియనిగ్రహం లేకపోవటం చేతనే గదా! ఒక్క మాటే ఏమిటి? అన్ని ఇంద్రియాలనూ బంధించేస్తాను. నేనెవ్వరితో మాట్లాడను, ఎవ్వరినీ చూడను, ఎవరిమాటా



వినను, మౌనమే నా తపస్సు" అని చాలాసేపు తర్కవితర్కాలు చేసి, మౌనంగా ఉండాలనే నిశ్చయాన్ని దృఢపరచుకొన్నాను.

ఇక అప్పటినుండి ఎవరన్నా పలకరించినా, నేను పలకకపోతే బెదరించినప్పటికీ, కోపంతో ఎవరైనా చిట్టిపొట్టి దెబ్బలు వేసినా, చివఱకు నన్ను నరకాలని అనుకొన్నప్పటికీ బలవంతంగా మౌనాన్నే పాటించాను. అంతగా అవసరమైతే బిగ్గరగా 'ఛీ' త్కారం మాత్రం చేశాను. నాకోసం తెచ్చిన అన్నాన్ని గాని, జలాన్ని కాని ముట్టుకోకుండా ఆ రోజంతా అలాగే నిరాహారంగా గడిపాను. మఱునాడు నేను ఆహారవేళ దాటిపోయి ఆకలికి బాధపడుతుండగా, ఆమె స్వయంగా వచ్చితన చేత్తో అనేక రకాల పండిన, పండని పండ్లు కాయలు ఒలిచి, ముక్కలు కోసి తినిపించాలని చక్కని సుగంధవంతమైన శీతల పానీయం త్రాగించాలని ప్రయత్నించింది కాని నేను భీష్మించుకొని కూర్చున్నాను. అప్పుడామె నాపైచూపులు నిలిపి ప్రేమతో కూడిన లాలనతో నాతో ఇలా అన్నది.

ఆకలి దప్పులతోనున్న వారికి ఏ చీకు చింతలులేని పశుపక్ష్యాదులకు దొరికిన ఆహారాన్ని తినక పోవటం అనేది జరగదు. ఇలా ప్రవర్తిస్తున్న నువ్వు ఎవరివో పూర్వజన్మజ్ఞానం కలవాడవై ఉంటావు. అందుకే ఆహారం తినవచ్చా తినకూడదా అని ఆలోచిస్తున్నావు. అందుకే మా చండాలజాతికి చెందిన ఆహారం తినకుండా ఉన్నావు. అయినప్పటికి భక్ష్యాభక్ష్య వివేకము లేనట్టి పక్షిజాతిలో పుట్టావు, ఇంకా నీకు తినకూడని వస్తువేముంటుంది. నీవు చాలా గొప్పదైన వంశంలో పుట్టావు కనుక ఈ ఆహారం తినటంలేదు – సరే, మఱి అంతగొప్ప వంశంలో జన్మించిన వాడవు పక్షిజాతిలో జన్మింప వలసిన పని ఎందుకు చేసినట్లు? ఇప్పు డెందుకు విచారిస్తున్నట్టు? అసలు నీ ఆత్మ మొదటనే సరియైన వివేకమార్గంలోన నడవలేదు. ఇప్పుడు నీవు చేసిన దోషానికి తగ్గట్టు పక్షిజాతిలో పుట్టి ఆ జాతికి తగ్గట్టు నడిస్తే నీకు ఏ దోషమూ అంటదు. ఒకవేళ ఏ జాతివారికైనా ఇదీ తినవచ్చు అది తినకూడదు అని నియమం

ఉన్నప్పటికిన్నీ ఆపద సంభవించిన కాలంలో ప్రాణరక్షణ కోసం ఆ నియమాన్నితోసి వేసి ఎవరి అన్నమైనగా నితిని ప్రాణం కాపాడుకోవచ్చు. ఇక నీ చోటి వానికి ఏ నియమమూ అక్కరలేదు. కావున ఇటువంటి కొంచెం ఆహారం తినటానికి నేను చండాలకన్యకను తెచ్చాను గాదా అని నీవు తినటానికి మనస్సులో అనుమానం పెట్టుకో నక్కఅలేదు. నేను తెచ్చినవి పండ్లే కావున నీవు నిశ్శంకంగా తినవచ్చును. అట్లే ఆకాశంనుండి నేలపై బడిన జలం కూడా చాండాలభాండంలోనిదైనా పవిత్రమైన దేనని పెద్దలంటున్నారు. మఱి నువ్వు ఆహారం నీరు మాని ఆకలి దప్పులతో నిన్ను నీవు బాధించు కొంటావు? నేను తెచ్చిన ఈ ఫలాలు ముని జనులు తిన దగినవి అడవిలో పండినవి. ఎందుకు తినవు? ఎందుకు నీరు త్రాగవు?" అని.

నేనుమాత్రం ఆ చాండాలకన్య యొక్క సంస్కారవంతమైన శాస్త్రబద్ధమైన వాక్కులు విని చాలా విస్మయపడ్డాను. ఆమె వివేకానికి ఆశ్చర్యపడ్డాను. అప్పుడు అంగీకరించి జుగుప్సను విడనాడి జీవించాలనే ఆశతో ఆకలిదాహం తీర్చుకొనేందుకు తినటానికి అంగీకరించాను. అయితే మౌనంమాత్రం వదిలి పెట్టలేదు.

## 84. చాండాల కన్యక అదృశ్యమగుట

ఈ విధంగా కొంత కాలం గడిచింది. నేను యౌవనవంతుడ నయ్యాను. ఒక నాడు ప్రభాతవేళ కళ్ళుతెఱచి చూసే సరికి నేను ఈ కనక పంజరంలో ఉన్నట్లు తెలుసుకొన్నాను. నేను చెప్పిన చాండాలదారిక మీ ఎదుటనున్న ఈమెయే. చుట్టు పట్ల చూస్తే ఏముంది! లోగడ బోయపల్లె ఉన్న చోటు కనపడలేదు. అమరావతీ నగరంకనపడింది. తొలిగి పోయిన చాండాల వసతి వలన కల్గిన సంభ్రమంతో, ఆశ్చర్య పోతూ 'ఇ దేమిటి? ఈ వింత' అని కుతూహలంతో ఆమెను అడగాలను కొన్నాను. ఇంతలో మౌనం వదలి మాట్లాడదామను కొనేలోపు ఈమె మీపాద సమీపానికి నన్ను తెచ్చింది. ఈమె అసలు ఎవరు? నేను చాండాలకన్యనని ఆమె ఎందుకు చెబుతోంది?



నేనెందుకు బంధింపబడ్డాను? బంధింపపడిన నేను ఇక్కడి కెందుకు తేబడ్డాను? అనే విషయాలు ప్రభువులకు లాగానే నాకున్నూ తెలుసు కోవాలనే కుతూహలం ఉంది" అని శూద్రకునితో పలికాడు.

ఇలా సుదీర్ఘమైన చరిత్రను చెప్పి వైశంపాయనుడు ముగించాడు. శూద్రకమహా రాజు అదివిని మిక్కిలి కుతూహలం కలిగి చాండాలికను పిలచుటకై ఒక ప్రతీహారిని పంపాడు. ఆమె త్వరగా వెళ్ళి ఆ మాతంగకన్యను మార్గదర్శియై రాజు ఎదుటకు తెచ్చి నిలిపింది. చాండాల కన్య సభలో ప్రవేశించి రాజు ఎదుట నిలచి, తన దేహకాంతితో రాజుని తిరస్కరిస్తున్నదై వాక్ ప్రాగల్భ్యంతో ఇలా అన్నది –

"ఓయీ! భువన భూషణా! రోహిణీ నాధుడా! తారారమణా! కాదంబరీ లోచనానందచంద్రా! ఈ దురాత్ముని యొక్క పూర్వజన్మ వృత్తాంతాన్ని మొత్తం విన్నారు కదా! ఈ జన్మలో కూడా తండ్రి ఎటూ కదల వద్దని నిషేధించినప్పటికీ ఆయన మాటను తిరస్కరించి, కామరాగాంధుడై ప్రియురాలిని కలవాలని ఎలా బయులుదేరాడో తానే చెప్పాడు కదా! నేను యిటువంటి కుమారుని కన్నతల్లిని లక్ష్మీదేవిని. వీడీ రకంగా సాహసించి బయలుదేఱిన సంగతి ఈయన తండ్రి శ్వేతకేతువు దివ్యదృష్టితో చూసి నన్ను ఇలా ఆదేశించాడు – "వీడు ఏ విధంగానూ అవినయానికి పాల్పడ్డవాడు పశ్చాత్తాపం కలగనిదే మరలడు. మంచి దారికి రాడు. ఈ నీ కుమారుడు ఇలా తప్పు చేస్తే ఈ చిలుక జన్మకంటే ఇంకా నీచ జన్మ పొందుతాడు. అందుచేత ఇక్కడ నా పుణ్యకార్యం నెరవేఱేంత వఱకు ఇతనిని భూలోకంలోనే ఆపి ఉంచు. కదలనీయకు, వీడికి ఇలా ఎందుకు చేశానా అని మనస్సులో పశ్చాత్తాపం కలిగే విధంగా నీవు చెయ్యాలి" అని.

ఆ కారణంగా నేను ఇతనిని కట్టు బాటుకు లొంగి ఉండేవిధంగా ఈ ప్రయత్నం చేయవలసి వచ్చింది. శ్వేతకేతువు చేసే పుణ్యాకార్యం పరిస మాప్తమయింది. శాపాలు తీరే సమయంకూడా దగ్గఱకు వచ్చింది. శాపం

తీరేసరికి మీరిరువురు కష్టాలన్నీ తీరి సుఖపడతారు. అందు వల్లనే ఇతనిని నీ వద్దకు తీసుకొని వచ్చాను. ఇక్కడ చండాలజాతివారితో గడపటం ఎందుకనగా వీడిపాపం పరిహరింపబడటానికే. ఇప్పుడు మీరిద్దఱూ జన్మ, వార్ధక్యం, వ్యాధిమరణాలకు ఆలవాలమైన ఈ దేహాలు వదిలేసి మీ ప్రియురాండ్రతో కలిసి యథేష్టసుఖాలు అనుభవించండి" అని అంటూనే ఆమె ధరించిన ఆభరణాల మంజుల శబ్దాలు ఆకాశం నిండుతూ ఉండగా అందరూ విస్మయపడి చూస్తూండగానే ఆకాశంలోకి ఎగిరి క్షణంలో మాయమైపోయింది.

## 85. శూద్రకుడు దేహమును విడచుట

ఆ లక్ష్మీదేవి మాటలు వినగానే శూద్రకమహారాజునకు వైశంపాయన పుండరీక జన్మలు గుర్తుకు వచ్చినై. "మిత్రుడా వైశంపాయనుడని పిలవబడిన పుండరీకుడా! మనయిరువురికి ఒకే సమయంలో శాపాలు తీరిపోతున్నై". అని అంటూ ఉండగానే కాముడు చెవివఱకు లాగివదిలిన కాదంబరీ అనే అస్త్రాన్ని అతని జీవితాన్ని అపహరించటం కోసం వదిలాడు. ఆ బాణపు దెబ్బతో భీతి చెంది పఱుగులు తీసినట్లుగా శ్వాస వాయువులు ఆతని దేహంనుండి బయటకు వచ్చినై. మన్మథుని బాణపు దెబ్బ తగిలినట్టుగా శూద్రకుని చంచల శరీరం కండించింది. మన్మథుని బాణాలకున్న ములుకులు ఎల్లెడల గుచ్చుకొన్నట్లు శరీరానికి రోమాంచం కలిగింది. ముఖసౌందర్యం తెల్లబాఱి పోయింది. మన్మథుని పుష్పబాణాల పరాగం కంట్లో పడినట్లుగా నేత్రాలనుండి ధారాపాతంగా బాష్పాలు దొరలినై. దేహాంతర్భాగంలో మండుతున్న మన్మథుని యొక్క ప్రభావమనే అగ్నిధూమాలు తాకటంచేతనో అన్నట్లుగా చిగురుటాకు వంటి క్రింది పెదవి వాడిపోయింది. ఆ అగ్ని తాపంచేత వాడిన హృదయం లాగా నోటనున్నరసహీనమైన ఎఱ్ఱని తాంబూలము క్రింద పడిపోయింది. బాగా ఎండిన కట్టెలు మండునప్పుడు దానినుండి బయల్వెడలే నీటిబిందువుల్లాగా శరీరమునుండి స్వేదము కలిగింది.



మన్మథ బాణాల తాకిడివల్ల శరీరాంగాలు పరవశాలైనాయా అన్నట్లు శూద్రకుని అవయవాలు పట్టు తప్పిపోయినై. కాదంబరిని ముందు పెట్టుకొని మన్మథుని చేత బాధింపబడుతున్న శూద్రకుని శరీరాంగాలు తాపాన్ని దూరం చేయ సమర్థత కలవైనా గాని ఆ అవయములు ఏమీ చేయలేక పోయినై. ఎలాగంటే కమలపులేత పత్రములు కాలుచేతులతోను, కలువరేకులు చూపులతో, మణిదర్పణములు చెక్కిళ్ళతో, తామరకాడలు బాహులతలతో, చంద్రకాంతులు గోళ్ళకాంతులతో, కర్పూరరేణువు కాంతి దరహాసకాంతితో, ముత్యాల హారాలు దంతకాంతులతో, చంద్రబింబం ముఖంతో, వెన్నెల లావణ్యంతో, మణి వేదికాస్థలములు నితంబముతోనూ పోటీ పడలేక ఓడి పోయినై.

ఈ విధంగా అన్ని బాహ్యకార్యాలు వదిలి వేసి, హృదయం పరవశం కానీయకుండా కాదంబరీమయంగా చేసుకొన్నాడు శూద్రకమహారాజు. ఎట్లంటే – శూద్రకుడు కాదంబరినే మనస్సులో ధ్యానించుతూ, ఆమెనే ఊహిస్తూ, ఆమెనే కోరుకొంటూ, ఆమెనే చూస్తూ, ఆమెను గూర్చియే మాట్లాడుతూ, ఆమెనే ఆలింగనం చేసుకొంటూ, ఆమెతోనే ఉంటూ, ఆమెనే కోపగిస్తూ, ఆమెనే బ్రతిమాలుతూ, ఆమెయొక్క పాదాలమీదనే పడుతూ, ఆమెతోనే ఆడుతూ, ఆమెతోనే క్రీడిస్తూ, మిగిలిన కార్యక్రమాలన్నీ వదిలివేసి, రాత్రింబవళ్ళు కనుమూసి నిద్రింపక, స్నేహితులతో కూడా మాటలాడక, పనిమాద తనవద్దకు వచ్చిన వారిని గుర్తింపక, గురు జనులకు కూడ నమస్కరింపక, పుణ్యకార్యాలేమీ చేయనివాడై, సుఖాలు కోరనివాడై, దుఃఖాలకు ఉద్రేకింపని వాడై, మరణానికి కూడా భయపడనివాడై, పెద్దల యెడసిగ్గులేని వాడై, తన పైనే తనకు ప్రేమలేనివాడై నిర్వికారుడై ఉన్నాడు. ఇంత ఎందుకు? చివరకు కాదంబరిని కలవటానికి కూడా ఎట్టి ప్రయత్నం చేయక, నిశ్చలుడై ఉన్నాడు. శూద్రకుణ్ణేకాక పుండరీకాత్మకుడైన వైశంపాయనునకు కూడా ఇదే పరిస్థితి కలిగింది. ఇరువురి శరీరాలు కొయ్యలవలె బిగుసుకుపోయాయి. మన్మథుడు అనే అగ్ని వారిరువురిని ఆక్రమించుకొని దహించి వేయసాగింది. వారి దేహాలు క్రమంగా నిశ్చలనంగా మారినై.

ఇంతలో వసంతమాసం ప్రవేశించింది. దక్షిణ సమీరాలు సరళమైన చిగురుటాకులను, లతలకు నాట్యభంగిమలను నేర్పుతున్నై. ఆ మలయ మారుత వీచికలు చపలాలైన అశోకశాఖలయందు గుత్తులు గుత్తులుగా వ్రేలాడుతున్న చిగురుటాకులను కదిలిస్తూ ఉన్నై. నిండైన మామిడి మొగ్గల యొక్క బరువుతో తియ్యమామిడి చెట్ల యొక్క కొమ్మలను క్రిందికి వంచుతున్నై. ఆ మలయ పవనాలు గోరంట చెట్లతో పాటు పొగడ, తిలక, సంపెంగ, కడిమి చెట్లకు కూడా మొగ్గలను కలిగిస్తూన్న పసుపు పచ్చ గోరంట చెట్ల పూల కాంతులతో దిక్కులకు పచ్చదనాన్ని కలిగిస్తున్నై. మాధవీలతల పుష్పపరాగాన్ని పరిసర ప్రాంతాల్లో చల్లుతున్నై. మలయపవనాలు కాముకుల మనస్సులకు విశృంఖలత్వాన్నిస్తున్నై. మానాభిమానాల్ని మంటకలువుతున్నై (కామప్రకోపంతో) సిగ్గును తుడిచి పెట్టేస్తున్నై. కాముకులవల్ల కలిగే కోపాన్ని నివారిస్తున్నై. పాదపతన క్షమార్పణాదులు పని చేయనివ్వటంలేదు. హఠాత్తుగా ముద్దు లిడుకొనటం, ఆలింగనం, కామకేళిలాంటి వాటిని ప్రోత్సహిస్తున్నై. మోదుగు పూల చేతనిండిన చెట్లు మన్మథుని రక్తధ్వజాలలాగా ఉన్నై. అడవిలో ఉన్న అన్ని చెట్లూ చిగుళ్ళు తొడిగి, పూతపూసి సుందరంగా కనిపిస్తున్నై. మధువు త్రాగిన కోకిలలు మత్తెక్కి కూనిరాగాలు తీస్తుంటే అవి విని తట్టుకోలేక విరహితులైనబాట సారులు దుఃఖిస్తున్నారు. పుష్పమకరందాలు నిరంతరం కురుస్తుంటే వర్షపురోజులాగా భావించి జీవలోకం ఒళ్ళు మరిచిపోతోంది. మధుమాసవైభవం లోకమంతా ప్రతిఫలిస్తోంది.

## 86. చంద్రాపీడుని పునర్జీవనం

సరస్సమీపాన కాదంబరీ దేవి కూడా మన్మథబాణముల చేత ఆందోళన చెందిన మనస్సుతో, వసంత మాసం ప్రవేశించిన కొద్దికాలం దాకా ఎలాగో కాలక్షేపం చేసింది. ఒక నాటి సాయంకాలమున స్నానం చేసి మన్మథ పూజ పూర్తి చేసి, అతని ఎదురుగా ఉన్న చంద్రాపీడుని చల్లని నీళ్ళతో స్నానం



చేయించి, పాదాలనుండి పైదాకా కస్తూరి కలిపిన చందనం పూసి, పరిమళ భరితపుష్పాలతో కేశపాశాలను ముడివేసి అలంకరించి, ఒక చెవిలో చక్కని చిగురాకులతో కూడిన అశోకపత్రగుచ్ఛమును తుఱిమి, కర్పూరం, పుష్పాలు శరీరాన చల్లి అలంకారాలతో ముస్తాబు చేసింది. కాదంబరి ఆతని వంక కనులార్పక చూస్తూ, ప్రేమభావంతో అతనిని త్రాగివేస్తున్నట్లు విలోకిస్తూ ఉండిపోయింది. ఆమె శరీరానికి పులకలు కలిగినై. వేడి నిట్టూర్పులతో పెదవి, ముఖం వాడిపోతున్నై. మహా శ్వేతవంక చూడటానికే భయం చెందుతూ మాట మాటకు దిక్కులు చూస్తూ ఉండిపోయింది. ఆమె శరీరము స్వాధీనం తప్పి పరవశమౌతోంది. ఆమెనుండి సిగ్గు దూరంగా పారిపోయింది. స్త్రీ జన సహజమైన లజ్జను (సిగును) భీతిని పొందింది. మన్మథుని చేత తనను తాను నిలవరించుకోజాలక, ఏకాంత సమయంలో సహనం కోల్పోయినదై వెంటనే చంద్రాపీడుని వద్దకేగి కనులు మూసుకొని బ్రతికియున్న వానిని వలె గట్టిగా కౌగిలించుకొంది.

## 87. పుండరీక చంద్రాపీడుల శాపాలు తీరటం - కథ సుఖాంతం

చంద్రాపీడునకు ఆమె యిచ్చిన అమృతంతో తడిసినట్లున్న చల్లని కాదంబరి కౌగిలి చేత అనంతదూరాలకు వెళ్ళి పోయిన ఆతని ప్రాణం మరల అతని కంఠస్థానానికి వచ్చి నిలబడింది. పగటి ఎండ తాకిడికి వాడిపోయిన కలువ శరత్కాలపు వెన్నెల కిరణాల స్పర్శచేత పునర్జీవితమైనట్లుగానే అతనిగుండె తిరిగి ప్రాణం పోసుకొని కొట్టుకోవటం ప్రారంభమైంది. తెల్లవారి కిరణస్పర్శకు రేకులు విప్పిన పద్మమువలె అతని నేత్రద్వయము వికసించింది. ఆ కనులు చెవివఱకు ఉన్నవి సుందరమైనవి. పద్మవికాస సౌందర్యంతో అతని ముఖం సుందరమైంది. ఈ విధంగా నిద్రనుండి లేచిన వానివలె, తిరిగి పొందిన సర్వావయవ చైతన్యము కలవాడై, తనను గాఢముగా కౌగిలించుకొనిన

కాదంబరిని చాలాకాలము విరహంచేత దుర్బలములైన బాహువులతో మిక్కిలిగా దృఢంగా కౌగిలించుకొన్నాడు. కాదంబరి ఈ హఠాత్పరిణామానికి చకితురాలైంది. గాలి తాకిడికి అరటిపిలకవలె భయోత్కంపితురాలైంది. గాఢంగా కనులు మూసుకొంది. ఆమె చంద్రాపీడుని గుండెలలోపలికి ప్రవేశించాలనే కోరిక కలదిగా అనిపించింది. ఆమెకు అతనిని విడవాలో పట్టుకోవాలో తెలియని ఆయోమయావస్థలో పడిపోయింది. కాదంబరి తన చెవులను హృదయాన్ని ఆకర్షించే, అంతకుముందు ఆమెకు పరిచయమున్న కంఠస్వరంతో ఇలా అన్నాడు –

"ఓ భీరురాలా! భయపడకు. నీ విచ్చిన గాఢాలింగనం వలననే నేనిపుడు పునర్జీవితుడనయ్యాను. నీవు అమృతంనుండి పుట్టిన అప్సరోజాతిలో జన్మించిన దానవుకదా! నే నిపుడు చెప్పే మాటను గుర్తుంచుకో. ఈ తేజోవంతమైన శరీరము సహజముగనే నాశనము కానిది. అందునా ఈ కాదంబరీ కర స్పర్శచేత చల్లగా ఉండినది. మరి ఇన్ని రోజులనుండి ఆదరంతో కరస్పర్శ జరుగుతున్నప్పటికిని తిరిగి జీవించలేదు. కారణమేమనగా అదిశాప కారణంగానే. ఈ రోజున రెండవసారి నేను నీ కోసం అనుభవించిన దుస్సహమన్మథజ్వరతాపదుఃఖం వలన నా శాపం తొలగిపోయింది. నేను నీ విరహంతో దుఃఖాన్ని కల్గించిన మానవ శరీరాన్ని శూద్రకరూపాన్ని వదిలి వేశాను. ఈ శరీరంనీకిష్టమైనదని నీ సంతోషంకోసం కాపాడుకున్నాను. ఇపుడు ఈ భూలోకం చంద్రలోకం ఈ రెండున్నూ నీకు కాలు పెట్ట దగినవి. (ఈ రెండులోకాలు నీవే) నీ ప్రియ సఖి మహాశ్వేత ప్రియునకు కూడా (పుండరీకునకు కూడా) నాకు లాగానే శాపంతీరి పోయింది' అని చంద్రాపీడుని శరీరాన్ని ఆశ్రయించిన చంద్ర భగవానుడు ఇలా అంటూ ఉండగానే కపింజలుని చేతిని పట్టుకొని ఆకాశం మీదనుండి భూమిమీదకు వస్తున్న పుండరీకుడు కనబడ్డాడు.



కాదంబరి పుండరీకుని చూడగానే చంద్రాపీడుని వక్షఃస్థలాన్ని వదిలి పెట్టి పరుగు పెట్టి మహాశ్వేత వద్దకు వెళ్ళి పుండరీకుని ఆగమన వృత్తాంతాన్ని చెప్పి ఆమెను ఆనందపరచే లోపుగానే అతడు చంద్రాపీడుని కలిశాడు. చంద్రాపీడుడు పుండరీకుని గాఢంగా కౌగిలించుకొని ఇలా అన్నాడు, "మిత్రుడా! పుండరీకా! క్రిందటి జన్మలో నీవు అల్లుని వరస అయినప్పటికి ఇప్పటి జన్మలో నాకు స్నేహసుహృద్భావాలతో మిత్రునివి కావాలి" అని చంద్రాపీడుడు ఇలా అంటూ ఉండగానే ఇంతలో చిత్రరథహంసులకు ఈ శుభవార్త చెప్పి వారికి శుభాన్ని వృద్ధిపఱచటంకోసం కేయూరకుడు వేగంగా హేమకూటానికి వెళ్ళాడు.

అదేసమయంలో మదలేఖ కూడా కుమారునికి శుభం కలగటానికి మృత్యుంజయ జపంచేస్తున్న తారాపీడ విలాసవతుల వద్దకు పఱుగెత్తుకొని వెళ్ళివారి పాదాలపైపడి, "దేవా! దేవితోపాటుగా మీకు శుభం అభివృద్ధి కలుగుతుంది. యువరాజు చంద్రాపీడుడు వైశంపాయనునితో పాటు పునర్జీవితుడైనాడు" అని మిక్కిలి ఆనందంతో హెచ్చుస్థాయిలో చెప్పింది. తారాపీడుడు అది విని శరీర సంస్కారము లేకపోవుట చేత అధికదీర్ఘమైన తెల్లని వెంద్రుకలతో కూడిన తనభుజములతో ఆ మదలేఖను కౌగిలించుకొని సంతోష పరవశుడై విలాసవతి మెడచుట్టూ చేయివేసి ముసలితనము చేత ముడుతలు పడిన చేతితో జారిపోతున్న ఉత్తరీయాన్ని లాగికొంటూ పాదాలు తొట్రుపాటు చెందుతుండగా, విస్మయపరవశులైన రాజులు వెంటరాగా నడచి మదలేఖతో, "ఎక్కడ వాడు? ఎక్కడున్నాడు" అని ఆత్రంగా అడుగుతూ మాటమాటకు హర్ష పరవశుడౌతూ, శుకనాసుణ్ణి కంఠమునందు కౌగిలించుకొంటూ అక్కడకు చేరుకున్నాడు.

అక్కడకు వచ్చిన తారా పీడుడు పుండరీకుని కౌగిలించుకొన్న చంద్రా పీడుని చూచి ఆనందంతో నిండినవాడై మంత్రితో, "నేను ఒంటరి వాడను కాను నా కుమారుడు పునరుజ్జీవితుడైనాడు. ఆ సంతోషాన్ని నేను

అనుభవిస్తున్నాను" అన్నాడు. చంద్రాపీడుడు సంతోష పరవశుడైన తండ్రిని చూసి, తొందఱపాటుతో పుండరీకుని వదలివేసి తలను నేలకానించి నమస్కారంచేస్తూ ఆతని పాదాలపై పడ్డాడు. అలా త్వరితంగా వచ్చి నమస్కరించిన తనయుడిని పైకి లేపి తారాపీడుడు, "కుమారా! నీ శాపదోషంచేతగాని, నా అదృష్ట విశేషం చేతగాని నేను నీకు తండ్రి నైనాను గాని లేకున్న నీవు జగద్వందనీయుడైన లోకపాలకుడవు గదా! నా అంశతోచి పాటులోక పాలకాంశ కూడా నీలో ఉండటం చేత నీవు నాకు వందనీయుడవు. ఈ రెండు కారణాలచేత నీవు వంద్యుడవు" అని అంటూ అందరు రాజులతో పాటు తాను కూడా ఆతని పాదాలపై పడి నమస్కరించాడు.

విలాసవతి కూడా తండ్రి చేత నమస్కరింపబడిన కుమారుని సంతోషాతి శయంతో అతని శిరస్సును, లలాటాన్ని, బుగ్గల్ని ముద్దులు పెట్టుకొని చాలాసేపు గాఢంగా కౌగిలించుకొంది. తల్లిని వదలి శుకనాసుని వద్దకు వెళ్ళి మరల మరల నమస్కరించాడు. ఆతని శుభాశీర్వాదాలు స్వీకరించి వరుసగా తండ్రికి, శుకనాసునకు, మనోరమకు చూపిస్తూ" ఇదిగో! మీ వైశంపాయనుడితడే" అని పుండరీకుణ్ణి వారికి సమర్పించాడు. పుండరీకుడు వారికి వినయవందనం చేశాడు.

అదే సమయంలో కపింజలుడు శుకనాసుని వద్దకు వచ్చి," ఆర్యా! శ్వేతకేతు మహర్షి మిమ్మిలా ఆదేశిస్తున్నారు – "ఇతడు నాచేత పెంచబడిన పుండరీకుడు. ఇప్పుడు మీకు కుమారుడు. ఇతనికి కూడా మీ యందే స్నేహానురాగాలు కలిగినై. ఎందుకంటే ఈ పుండరీకుడీ వైశంపాయనుడుగా జన్మించాడు కనుక ఇతనిని మీకు మారునిగనే భావించి, ఇతని దోషాలను క్షమించవలసింది. ఇతనిని వేరువానిగా తలపకండి. నిర్లక్ష్యం చేయకండి.శాప దోషం తొలగిపోయినప్పటికి ఇతనిని నా వద్దకు రప్పించుకొనకుండా మీ వద్దకు పంపాను. కావున ఇతడు మీ వాడే అని.



అంతేకాక పుండరీకుడు కూడా చంద్రాపీడుడు జీవించినంత కాలం భూలోకంలోని వసించి కృతార్థుడౌతాడు. "అని పలికాడని కపింజలుడు శ్వేతకేతుసందేశం వినిపించాడు. శుకనాసుడు కూడా పుండరీకుని వైశంపాయనునిగానే భావిస్తూ సంతోషించాడు. మహామంత్రి కపింజలునితో, "సకల జనుల మనోభిప్రాయాన్ని గ్రహింపగల భగవానుడు చంద్రుడు ఇట్లు అనుట ఏమి? పుండరీకునిపై ప్రేమ ఎంత మాత్రము తగ్గదు." అని అన్నాడు.

## 88. అరణ్యమే వివాహవేదిక

ఈ విధంగా పూర్వజన్మ వృత్తాంతవిశేషాలతో, ఒకరినొకరు చూసుకొనటం, సంతోషసంభ్రమాలతో రాత్రిగడచి పోయింది. ఇంతలోగా తెల్లవారింది. అంతలోనే మదిరాచిత్రరథులు, గౌరీహంసులు అనే కగం ధర్వ పరివారాన్ని వెంట పెట్టుకొని అక్కడకు వచ్చారు. వారిని చూసి కాదంబరీ మహాశ్వేతలు సిగ్గుతో తలలు వంచుకున్నారు. వారిని చూసి తల్లి దండ్రులులు మిక్కిలి సంతోషించారు. అల్లుళ్ళను చూసి ఆనందించారు. అంతా తారాపీడ శుకనాసులతో కలసిన కొత్త సంబంధాలు గూర్చి ముచ్చటించుకుంటూ కాలంగడిపారు. వారందరిలో సంతోషం వెయ్యిరెట్లైంది.

ఇలా జరుగుతుండగా చిత్రరథుడు తారాపీడునితో, "మన భవనాలు మనకున్నవి కదా! అటువంటప్పుడు ఈ సంబరాలు అరణ్యంలో చేసుకోవట మెందుకు? మనకు ఇచ్చటనే మంగళ కార్యాలు చేద్దామని యిష్టమున్నప్పటికి, లోకరీతిని మనం అనుసరించాలికదా! సంప్రదాయాన్ని వదలరాదుకదా! కాబట్టి మనం మనయిండ్లకు పోదాం. తర్వాత చంద్రలోకం వెళ్ళవచ్చు." అని అన్నాడు.

తారాపీడుడు చిత్రరథునితో, "గంధర్వ రాజా! మనకెక్కడ సుఖసంతోషాలు అధికంగా లభిస్తాయో అదే అరణ్యమైనా భవనమౌతుంది. ఇంతటి సంపత్సుఖాలు మనకు వేఱొక చోట ఎక్కడ లభిస్తాయి? అయినా నా భవనాలు

అన్నీ మీ అల్లునికి ఎప్పుడో ఇచ్చేశాను. కనుక, ఓ మిత్రుడా! మీ కుమార్తెతోనూ అల్లునితోనూ సుఖానుభవంకోసం నగరానికి వెళ్ళండి" అని పలికాడు. చిత్రరథుడు, "ఓ రాజర్షీ! మీ కెలాయిష్టమైతే అలాగే చేద్దాం" అని అంగీకరించి చంద్రాపీడునితో పాటు హేమ కూటం వెళ్ళాడు. అక్కడకు వెళ్ళి తన రాజ్యాన్ని మొత్తం పుండరీకునికి సమర్పించాడు. అలాగే పుండరీకునకు హంసుడు తన రాజ్యాన్ని సమర్పించాడు. వారు తమకు లభించిన ప్రేయసులతో కృతార్థులైనట్లు భావిస్తూ ఇంకా వేరేదీ కోరలేదు.

ఒకనాడు, తాను కోరుకొన్న భర్త లభించినందున మిక్కిలి సంతోషిస్తూ సఖీజనుల మధ్య ఉండినదై తృప్తి కలిగినదైనను, ఎందువల్లనో కన్నీరు విడుస్తూ కూర్చున్నది. చంద్రరూపుడైన చంద్రాపీడుడు అక్కడకు వచ్చాడు. అతనితో కాదంబరి, "ఆర్యపుత్ర! మనమందరం మృతి చెంది పునర్జీవితులమై పరస్పరం కలుసుకొన్నాము. కాని ఆ అమాయిక పత్రలేఖ మాత్రం మనమధ్యలోలేదు. కేవలం ఆమెకు ఒక్కదానికే ఏమైంది? అది తెలియటం లేదు. అని విచారంగా అంది. చంద్రాపీడుడు ఆమె మాటల కానందించి ఆమెతో, "ప్రియా! పత్రరేఖ ఇక్కడెందుకుంటుంది? అసలామె ఎవరనుకొంటున్నావే? ఆమె నా దుఃఖాన్ని తన దుఃఖంగా భావించే నా ప్రాణప్రియ రోహిణీదేవి. నేను పుండరీక బ్రాహ్మణోత్తమునిచే శపింపబడ్డానని తెలిసికొని "నీవు ఒక్కడవే భూలోక నివాస దుఃఖం ఎలా అనుభవిస్తావు!" అని ఒంటరినైన నాకు సహాయభూతురాలై నేనెంతవద్దన్నా వినకుండా ముందుగానే భూలోకంలో నా పరిచర్య చేసేందుకు జన్మించింది. ఈ లోకంనించి మరొక జన్మనిస్తే నేను మరణింపగానే తాను కూడా శరీరం వదలి వేసింది. నేను మరల భూలోకంలో జన్మింపబోయేటప్పుడు కూడా తానున్నూ నన్ను అనుసరించి ఈ లోకం పుట్టటానికి ప్రయత్నించింది. కాని నేను ఈసారి ఆమెను గట్టిగా నివారించాను. తిరిగి చంద్రలోకం పంపించి వేశాను. మనం ఆమెను త్వరలోనే చంద్రలోకంలో చూద్దాం! అని అన్నాడు.



కాదంబరి అది విని రోహిణీదేవి యొక్క ఔదార్యానికి, స్నేహానికి, మహానుభావతకి, పాతివ్రత్యానికి, మృదుత్వానికి మిక్కిలి విస్మితురాలైంది. ఆమెను తాను ఒక దాసిగా భావించినందుకు నిగ్గుపడింది. ఆపై తానే మీ మాట్లాడలేక మౌనం వహించింది.

## 89. కొత్త దంపతులు - సుఖజీవనము

ఇంతలో రెండు జన్మలుగా కాదంబరీ సమాగమసుఖాన్ని కోరుకొన్న చంద్రాపీడునికి ఆ అవకాశంకలిగిస్తున్నట్లుగా పగలు గడచిపోయింది. ప్రేమమయపతాకంలాగా పశ్చిమాకాశం అనే సంధ్యాసుందరి సిగ్గును దాచటానికి అన్నట్లుగా రాత్రి క్రమక్రమంగా విస్తరించింది. సమస్తలోకం చంద్రోదయంచేత సుందరంగా ఉంది. ఈ విధంగా రాత్రి ప్రకాశిస్తుండగా ఎప్పటినుండియో కోరుకొంటున్నట్టి, మూసికొని యున్న కలువరేకుల వంటి కనులు కలిగిన, ఊడిపోతున్న నీవీ బంధాన్ని జారనీకుండ చేయి అడ్డం పెట్టి నివారిస్తున్న, కౌగిలింతల సుఖాన్ని అనుభవిస్తున్న, సురతాన్ని ఆపమని కోరుతున్నందున సుందరంగా ఉన్న ముఖంకలిగిన కాదంబరీ దేవితో ప్రథమ సమాగమ సుఖాన్ని అనుభవించి పది రోజులు ఒక రాత్రిగా గడిపిన చంద్రా పీడుడు సంతృప్తి చెందిన అత్తమామల చేత ప్రయాణానుమతిని పొందిన వాడై తండ్రి వద్దకు వచ్చాడు. వచ్చి, తనతో సమానంగా కష్టాలనుభవించిన రాజుల సమూహాన్ని తనతో సమానంగా గౌరవంగా చూసుకొని, సమస్త రాజ్యభారాన్ని పుండరీకునికి అప్పగించి, రాజకార్యాలకు సుదూరంగా ఉండిన తల్లిదండ్రుల పాదసేవ చేసుకొంటూ కొంతకాలం ఉజ్జయినిలోనూ, కొంతకాలం అత్తమామల మీది ప్రేమ గౌరవాలతో హేమకూటంలోనూ, కొంతకాలం అమృత పరిమళం వెదజల్లే చల్లని ప్రదేశాలు కలిగిన చంద్రలోకంలోనూ రోహిణీదేవి గౌరవాద రాలందుకుంటూ, కొంతకాలం నిత్యమూ వికసించిన సహస్ర పత్రకమలాలు కలిగిన సరస్సులో పుండరీకుని

ప్రేమతోని వసిస్తూ, కొంతకాలం కాదంబరికి యిష్టమైన ఇతర రమ్యప్రదేశాలలో విహరిస్తూ ఆమెతో కూడి రెండుజన్మలకు చాలినంత అంతులేని ఆయా సుఖాలు అనుభవించాడు. చంద్రరూపుడైన చంద్రాపీడుదు కేవలం కాదంబరితోనే కాదు, కాదంబరి మహాశ్వేతతో, మహాశ్వేత పుండరీకునితోనూ, పుండరీకుడు చంద్రునితోనూ కూడి అందరూ సమైక్యంగా అంతకాలమూ సుఖాలు అనుభవిస్తూ ఆనందానికి పరమోన్నత స్థానాన్ని చేరుకొని హాయిగా జీవితాలు గడిపారు.

*శ్రీ బాణభట్ట, భూషణభట్ట మహాకవి విరచితం*
*కాదంబరి సర్వం సమాప్తం*

* * *